

చైతన్య భాగవతము
సా సుందర చైతన

చైతన్య భాగవతము

(ప్రథమ భాగము)



జ్ఞానబ్రహ్మ

స్వామి సుందర చైతన్యానంద

శ్రీమద్భాగవతము మహాజ్ఞానియైన వ్యాస మహర్షి కలము నుండి కదలి, మహా వైరాగ్యమూర్తియైన శుకబ్రహ్మ గళము నుండి స్రవించి, మహా భక్తుడైన పరీక్షిత్తుని హృదయమున నిలిచినది. కనుక ఈ మహోత్కృష్ట గ్రంథము భక్తి, జ్ఞాన, వైరాగ్య స్వరూపముగ తెలియుచున్నది.

వ్యాసమహర్షి విరచితమును, నిరోధలీలా ప్రతిపాదకమునగు ఈ భాగవత గ్రంథము పరమ పావన గ్రంథము. భాగవతము అనెడి పదములోని ఐదు అక్షరములు స్వరూపాను భూతికి పంచ సోపానముల వలె తెలియుచున్నవి.

"భా" యనెడి మొదటి అక్షరము భక్తిని తెలుపుచుండ, రెండవ అక్షరమైన **"గ"** శబ్దము ప్రజ్ఞాన ఘనమైన జ్ఞానమును నిర్దేశించుచుండ, మూడవ అక్షరమైన **"వ"** శబ్దము వివేకయుతమైన వైరాగ్యమును సూచించుచుండ, నాల్గవ అక్షరమైన **"త"** శబ్దము తమోభాస్కరమగు తపస్సును నిర్వచించుచుండ, ఐదవ అక్షరమైన **"ము"** శబ్దము మోక్షరూపమగు ముక్తిని ముంజేతి కంకణము వలె చూపుతున్నది. భక్తి జ్ఞాన వైరాగ్యములను వెంట నిడుకొని తపోధనుడవై ముక్తి సింహాసనమును అధిష్ఠింపుమని భాగవతము బోధిస్తుంది.

వ్యాస భాగవతము సంస్కృత సౌరభముతో గుభాళించు చున్నందున భాషా వైదుష్యము లేనివారు అందులోని సుగంధమును ఆఘ్రాణించ లేక పోతున్నారు. పోతనామాత్యుని భాగవతము ద్రాక్షాపాకమైనను పద్యభరితమై నందున సామాన్య జనులు గ్రహించుటకు సులభం గాకున్నది. అందుచేత మూల గ్రంథములను చదువలేని వారు సులభముగా గ్రహించుటకు, ముఖ్యముగా కథలోని ఆధ్యాత్మిక భావ సౌందర్యమును దర్శింప జేయుటకు

జ్ఞానబ్రహ్మ
స్వామి సుందర చైతన్యానందుల వారు

ఈ చైతన్య భాగవతము ద్వారా ఆ బృహత్కార్యమును నిర్వహించి, ఆంధ్రదేశానికి ఎనలేని కృషి చేసినారు.

ఇది అందరూ చదువ వలసిన గ్రంథము. చదువుతూ ఉండవలసిన గ్రంథము. ఎప్పటికీ చదువదగిన గ్రంథము.

శ్రీకృష్ణార్పణమస్తు.



నవమ ముద్రణకు

నీరాజనం

భాగవతము శ్రీకృష్ణుని స్వరూపము. వాగ్రూపమున శోభించు వాసుదేవ వైభవము.

శైశవమున నా హృదయమున ప్రవేశించిన కృష్ణభక్తి భగవత్కృపచేత ప్రతిక్షణ ప్రవర్ధమాన మగుచున్నదే గాని క్షీణించలేదు. ఈ పుణ్యము తోడైనదేమో తెలియదు గాని, భాగవతమును రచించి భక్తులకు అందించే భాగ్యం నాకు దక్కింది.

శ్రమించి గ్రంథాన్ని వ్రాయుడం దైవకృపతో సాగే మానవ యత్నము. గ్రంథము విశేషాదరణ పొందడం కేవలం దైవానుగ్రహం. "చైతన్య భాగవతము" శ్రీకృష్ణదేవుని పూర్ణానుగ్రహానికి నోచుకున్నది.

భక్తులు ఆదరించారు. భాగవతులు తృప్తి చెందారు. భాగవతోత్తములు ఆనందించారు. పరమ భాగవతోత్తములు ఆశీర్వదించారు.

అతి తక్కువ కాలంలో అధిక సంఖ్యలో ప్రతులు అమ్ముడుబోయిన ఆధ్యాత్మిక గ్రంథము బహుశ ఆంధ్రదేశ చరిత్రలో ఇదే ప్రథమం కావచ్చు. ద్వితీయస్థానం "చైతన్యరామాయణము" నకు దక్కడం విశేషం.

చైతన్య భాగవతము (ప్రథమ భాగము)

స్వామి సుందర చైతన్యానంద

తొమ్మిదవ ముద్రణము

అక్టోబరు 1996

5000 ప్రతులు

ॐ

ప్రతులకు:

సుందర చైతన్య ఆశ్రమం

ధవళేశ్వరం - 533 125


☎ 77378

రూ 250/- (రెండు సంపుటములు)

ముద్రణ :

శ్రీ లక్ష్మీ గణపతి బైండింగ్ వర్క్స్

కొవ్వూరు - 534 350 ☎ 31575



ఇది 9వ పునర్ముద్రణము. ప్లేట్లు కూడా ముద్రణకు ఉపకరించలేదు. ఎలాగూ ప్లేట్లు క్రొత్తవి చేయిస్తున్నాం కనుక అక్షర రమ్యతను ఆశించి నూతనంగా డి.టి.పి. చేయించాం. ఈ కారణంగా గతంలోని ముద్రణ లోపాలను సవరించే అవకాశం కలిగింది.

ఖరీదైన ఎన్.ఎస్.మాప్‌లితో కాగితమును ముద్రణకు వాడడం, విశేషంగా వర్ణచిత్రములను జోడించడం, అందమైన క్రొత్త ముఖచిత్రములను రూపొందించడం, ముఖ్యంగా ప్రస్తుత ముద్రణలో మేము చేపట్టిన విశేషాంశములు.

నవత్వము ఒకవైపు సంతసమును అందిస్తున్నా, నవమాసముల ఆలస్యము అనేది చిన్నది కాదు. బాధను కలిగించే విషయమే. ఏం చేద్దాం! బహుముఖంగా సాగిపోతున్న సుందరచైతన్యాశ్రమ ప్రచారోద్యమంలో గొప్ప అవరోధంగా కాలమే నిలుస్తున్నది.

భక్తులు ఎంతో సహనంతో ఉత్తరాలు వ్రాస్తూ నిరీక్షించారు. ఈ నాటికైనా ఈ పవిత్ర గ్రంథరాజమును మీ కరకమలములలో ఉంచుతున్నందుకు సంతసిస్తున్నాం.

ప్రణవప్రేమలతో
మీ
స్వామి సుందర చైతన్యానంద

నివేదన

ఉష్ణము అగ్నియొక్క ధర్మము. శీతము జలము యొక్క ధర్మము. క్రౌర్యము వ్యాఘ్రు ధర్మము. చపలత్వము లేడి ధర్మము. వర్షించుట మేఘు ధర్మము. ప్రేమించుట ప్రేమ ధర్మము. ప్రేమకు అన్యధర్మములు తెలియవు.

ప్రపంచము ప్రేమనుండి జనించినది. ప్రేమలో జీవిస్తున్నది. ప్రేమలో లయిస్తుంది. ప్రేమకు పుట్టుకలేదు. ప్రేమయే సృష్టికి మూలకారణము. వ్యష్టికి మూలాధారము. సమిష్టి మనుగడకు మూల విషయము. ప్రేమ అద్భుతమైన శక్తి. ప్రకృతి స్పందనలో, సౌందర్యములో తొంగిచూసే అసమాన ఆకర్షణాశక్తి. మానవ హృదయంలో, ఆరాధనా రూపంలో కదిలే భక్తి. సకల ప్రాణుల హృదయాలలో ఊరట పేరున కలిగే తృప్తి. జీవికి నిజమైన భుక్తి. ఒక్కమాటలో చెప్పాలంటే అదియే తన స్వరూపమైన ముక్తి. ప్రేమ సర్వాంతర్యామి. అది కదులును, కదలదు. దగ్గర లేదు, దూరము ఉండదు.

తదేజతి తన్నైజతి తద్దూరే తద్వంతికే
తదంతరస్య సర్వస్య తదు సర్వస్యాస్య బాహ్యతః

"అది కదులును. అది కదలదు. అది దూరమున గలదు. దగ్గరనూ గలదు. అది దీని అంతటిలో కలదు. దీని యంతటికి బాహ్యమున కూడా కలదు." అని ఉపనిషత్తు పలికింది.

ప్రేమకు రూపము లేదు. అరూపమైన ఉజ్వల ప్రేమ రూపమును దిద్దుకుని వ్యక్తమయితే ఎలా వుంటుంది? సముజ్వల విగ్రహమై భాసిస్తుంది. అట్టి సుందర సముజ్వల విగ్రహమే ప్రేమమూర్తియైన శ్రీకృష్ణ పరమాత్మ. శ్రీకృష్ణుడు ప్రేమావతారమూర్తి. ప్రేమ నిండిన హృదిలో వెలితి తెలియదు. వెలుగు చెదరదు. ప్రేమ భాషణమునకు అలవాటుపడిన వ్యక్తికి అసంపూర్ణత అర్థం కాదు.

అది సరస్వతీ నదీతీరము. వేదములను సంస్కరించిన మహనీయుడు, అష్టాదశ పురాణములకు కర్తయైనవాడు, బ్రహ్మసూత్రములను రచించినవాడు నగు వేదవ్యాసుడు అశ్రుపూర్ణవదనుడై విచారముతో కూర్చొనియుండెను. దారిన వెడుచుండిన నారదమహర్షి వ్యాసభగవానుని జూచెను. ఆయన ముఖారవిందమున గోచరమయ్యే అవ్యక్తబాధను గ్రహించెను. మహర్షిని సమీపించి, "ఆర్యపూజితా! పరాశరాత్మజా! మీ వదనమున విషాదఛాయలు అలుముకొనుటకు కారణమేమి? సర్వశాస్త్ర పారంగతులైన మిమ్ములను అశాంతి అలుముకున్నదా? కారణమేమిటి?" అని అడిగెను.

"నారద మునీంద్రా! అదియే నాకును అవగతముగుటలేదు. నీవు త్రిలోక సంచారివి. జ్ఞానివి. నీకు తెలియని విషయము లేదు. నా ఈ విషాదమునకు కారణమును తెలియజేయుము" అని తెలిపెను.

నీ కెఱుగరాని ధర్మము లోకములను లేదు బహు విలోకివి నీవి
నా కొఱత యెట్టిదంతయు నాకున్ వివరింపుమయ్యనారద! కరుణన్

అని వ్యాసుడు ప్రార్థించెను.

నారదుడు ఒక క్షణమాలోచించాడు. కారణాన్ని అన్వేషించి అవగత మొనర్చుకున్నాడు. అర్థమైన విషయాన్ని అభ్యర్థించిన వ్యాసునికి తెలియజేశాడు.

అచింతమైన ధర్మచయమంతయుఁ జెప్పితి వందులోన నిం
చుకగాని విష్ణుకథ లేర్పడఁ జెప్పవు; ధర్మముల్ ప్రవచిం
చిన మెచ్చునే గుణ విశేషము లెన్నినఁగాక, నీకు నీ
కొంచెము వచ్చుటెల్ల హరిఁగోరి నుతింపుమి నార్యపూజితా!

"మహాత్మా! వ్యాసా! జటిలమైన వేదాంతశాస్త్రమును ప్రవచించిన నీవు భగవద్భక్తిని గూర్చి ప్రత్యేకముగా ప్రవచించనైతివి. ఎంతటి జ్ఞానము కలిగినను భక్తి లేనిదే ముక్తి రాదు. భగవానుని అనంత కళ్యాణ గుణములను కీర్తించకపోవుటయే నీ ఆవేదనకు ముఖ్యకారణము.

"హరిభక్తిని విరివిగా పంచెడి భాగవత కావ్యమును రచించి, మీ హృదిలోని ఆవేదనను పోగొట్టుకొనుడు" అని తెలియజేసెను.

నిగమంబులు వేయిఁ జదివిన । సుగమంబులు గావు ముక్తి సుభగత్వంబుల్
సుగమంబు భాగవతమను । నిగమంబుఁ బఠింప ముక్తి నివసనము బుధా!

నారదమహర్షి చేత ప్రభావితుడైన వ్యాసమునీంద్రుడు శమ్యాప్రాసమనే ఒక ఆశ్రమంలో ఉండి భక్తిరస ప్రధానమైన భాగవత కావ్యమును రచించెను. తత్ఫలితముగ హృదయావేదనను పోగొట్టుకొని నిర్వికల్పానందములో రమించెను.

శ్రీమద్భాగవత కథామృతము మహాజ్ఞానియైన వ్యాసమహర్షి కలమునుండి కదలి, మహా వైరాగ్యమూర్తియైన శుకబ్రహ్మ గళమునుండి స్రవించి, మహాభక్తుడైన పరీక్షిత్తుని హృదయమున నిలిచినది. కనుక ఈ మహాకావ్యము భక్తి, జ్ఞాన, వైరాగ్య రూపమని తెలియుచున్నది.

వ్యాసమహర్షి విరచితమును, నిరోధలీలా ప్రతిపాదకమునగు ద్వాదశస్కంధ సముల్లసితమగు ఈ భాగవత గ్రంథము పరమపావన గ్రంథము. "భాగవతము" అనెడి పదములోని ఐదు అక్షరములు స్వరూపానుభూతికి పంచ సోపానములవలె తెలియుచున్నవి. మొదటి అక్షరమైన 'భా' శబ్దము ప్రకాశవంతమైన భక్తిని తెలియచేయుచుండ, రెండవ అక్షరమైన 'గ' శబ్దము ప్రజ్ఞానఘనమైన జ్ఞానమును నిర్దేశించుచుండ, మూడవ అక్షరమైన 'వ' శబ్దము వివేకయుతమైన వైరాగ్యమును సూచించుచుండ, నాల్గవ అక్షరమైన 'త'

శబ్దము తమోభాస్కరమగు తపస్సును తెలుపుచుండ, ఐదవ అక్షరమైన 'ము' శబ్దము మోక్షరూపమగు ముక్తిని ముంజేతి కంకణమువలె దర్శింపచేయుచున్నది. భక్తి, జ్ఞాన, వైరాగ్యములను వెంటనిడుకొని, తపోధనుడవై ముక్తి సింహాసనమును అధిష్ఠించమని భాగవతము బోధిస్తుంది.

ముముక్షువులారా! భావయుతమైన భాగవతరసములో చరించుట ఎంత కష్టమో, దానిని రచించుట కూడా అంతియే కష్టము.

భాగవతము తెలిసి పలుకుట కష్టంబు । శూలికైనఁ దమ్మిచూలికైన
విబుధ జనుల వలన విన్నంత కన్నంత । తెలియవచ్చినంత తేటపఱతు

అని భాగవతముయొక్క ప్రాశస్త్యాన్ని పోతన ఎలుగెత్తి చాటాడు. నేటి కలియుగ మానవుని ఆంతర్య కాలుష్యము కరుగవలెనన్నచో భాగవత రసపానమే తరుణోపాయము. భాగవతమును రచించిన వ్యాసుడు ఆవేదననుండి బయటపడినాడు. భాగవతము నాలకించిన పరీక్షితుడు ముక్తిధామ మలంకరించాడు. ఈ భాగవత రసామృతమును పానముచేసిన వారెల్లరు అమరులై తరింతురు.

నిగమ కల్ప తరోర్గళితం ఫలం । శుకముఖాదమృత ద్రవ సంయుతమ్
పిబత భాగవతం రసమాలయం । ముహురహో రసికా భువి భావుకాః

అని వ్యాసభగవానుడు పరవశించి రచించగా

వేద కల్పవృక్ష విగళితమై । శుక ముఖసుధా ద్రవమున మొనసియున్న
భాగవత పురాణ ఫల రసాస్వాదన । పదవిఁ గనుడు రసిక భావవిదులు.

అని పోతనామాత్యుడు తన్మయుడై ప్రవచించాడు.

భాగవతము కథల సంపుటము గాదు. అగాధమైన ఆధ్యాత్మిక లోతులతో విరాజిల్లే ఆనంద రసామృత సాగరము. సర్వకాలములకు, సమస్త దేశములకు, సర్వమానవులకు ఆదర్శ జీవన మార్గమును ప్రసాదించే అమృతమయ సందేశము. భవరోగమునకు భవ్యమైన ఔషధము.. భావ దారిద్ర్యమును నిర్మూలించుటలో దివ్యమైన ఐశ్వర్యము.

భక్తులారా! భాగవత ప్రియులారా! బాగేమిటో తెలియని అభాగ్యులవలె చరించుచున్న నేటి మానవాళికి జ్ఞానమార్గంలో చరించే రీతిని భాగవతము బోధిస్తుంది. అనంత యాత్రలో శ్రమించి ప్రయాణమును సాగించే ముముక్షువులకు భాగవతము దారిదీపమే కాగలదు.

"భాగవతమును చదివితే ఏం జరుగుతుంది? భాగవతమును వింటే ఏం జరుగుతుంది?" అని ఒక వ్యక్తి ఒక సంత్ పురుషుని ప్రశ్నించెను. అందులకు సమాధానము నొసగుచు

"నాయనా! ఏదీ! ఆ భాగవత మనెడి పదమును నాలుగుసార్లు పలకండి" యని చెప్పెను.

ధ్రువుడు వాలుగుపిట్ట భాగవతము - భాగవతము - భాగవతము - భాగవతము అని పలికెను. ఇలా పలుకుచుండగా భాగవతమనెడి పదము క్రమక్రమముగా మారి "బాగవుతాము" అని వినిపించును. వెంటనే ఆ సంత్ పురుషుడు "నాయనా! చూసితివా! భాగవతమును పఠించినచో మనమంతా బాగవుతాము" అనెను.

బాగును తెలియక సాగే జీవులకు ధన్యమైన, దివ్యమైన బాటను తెల్పే బాపుటాడే భాగవతము.

బుధజనులారా! ఇది భాగవతము. ఎవరినో బాగుచేయాలని నేను వ్రాయలేదు. నన్ను బాగుచేసుకొనేందుకు వ్రాసుకున్నాను. నా జీవన ప్రయాణంలో దారిదివ్వెయైన ఈ భాగవతమును తోటి సహాయకులైన మీకు పంచడం నా బాధ్యతగా భావించాను.

అది ఉందో లేదో అదిగా వచ్చిందనే అభిరుచి మాత్రం నాలో పండుగా ఉండింది. ప్రేమతో అందిస్తున్నాను. గ్రహించండి.

ప్రమాద భరితమైన ఈ పవిత్ర గ్రంథమును ప్రశాంతముగా కూర్చుని రచించే అదృష్టం కలుగలేదు. విరివిగాను కార్యక్రమాల మధ్య ప్రయాణాలతో రచించాను.

ఒకరి చేత రామభద్రుడు వ్రాయించాడు. నాచేత వ్రాయించమని శ్యామభద్రుని కన్నీళ్ళతో ప్రార్థించాను. నేను చేసినది అంతే.

చివరగా ఒక్కమాట. ఇదంతా మహాప్రసాదము. పూజారి ఎవరని చూడకండి. తీర్థపుగిన్నె ఎలా ఉన్నదని పరీక్షించకండి. అనంత కరుణామయుడైన శ్యామసుందరుని విశ్వతుక కృపా విశేషము, అమూల్య ప్రేమాన్వితులైన మీ అందరి ప్రేమలు నాకు కొండంత అండగా నిలచి నా బ్రతుకు పంటను దండిగా పండించాయి. అందరికీ వడ్డించే అవకాశాన్నిచ్చాయి.

అందుకోవడంతోనే సరిపోయింది. తిరిగి ఏమి అందించగలను? ఏమీ లేదు. ఏమీలేని వాడను. మీకు ఇవ్వగలిగింది కూడా ఏమీ లేదు వందనము తప్ప. ఆ వందనమునే పంట చేసి అందిస్తున్నాను. అందుకోండి.

ఇట్లు,

భాగవత సాగర తీరాన


ఒక రేణువు

మీ

స్వామి సుందర చైతన్యానంద

ధవళేశ్వరం,

15-12-'91.



జ్ఞానబ్రహ్మ
స్వామి సుందర చైతన్యానంద

విషయసూచిక

ధ్యానశ్లోకము

శ్లో॥ యం బ్రహ్మా వరుణేన్ద్ర రుద్ర మరుతః స్తున్వన్తి దివ్యైః స్తవై
ర్వేదై స్సాంగపదక్ర మోపనిషదై ర్గాయన్తి యం పామగాః
ధ్యానావస్థిత తద్గతేవ మనసా పశ్యన్తి యం యోగినో
యస్యాన్తం న విదు స్సురాసురగణాః దేవాయ తస్మై నమః

యం=ఎవనిని, బ్రహ్మా=బ్రహ్మాదేవుడు, వరుణ=వరుణుడు, ఇంద్ర=ఇంద్రుడు, రుద్ర=రుద్రుడు, మరుతః=మరుద్గణములు, దివ్యైః=దివ్యములైన, స్తవైః=స్తవముల చేత, స్తున్వన్తి= స్తుతించుచున్నారో, పామగాః=సామవేదమును గానము చేయువారు, సాంగ పదక్రమోప నిషదైః=వేదాంగముల నెరిగి శ్రుతి, పద, ఉపనిషత్తులతో కూడిన, వేదైః=వేదములచే, యం=ఎవనిని, గాయన్తి=గానము చేయుచున్నారో, యం=ఎవనిని, యోగినః=యోగులు, ధ్యానావస్థిత=ధ్యానమగ్నులై, తద్గతేన=దానియందే యుంచిన, మనసా=మనస్సుచేత, పశ్యన్తి=గాంచుచున్నారో, యస్య=ఎవనియొక్క, అంతం=పూర్ణత్వమును, సురాసురగణాః= దేవాసుర గణములు, న విదుః=తెలియరో, తస్మై=అట్టి, దేవాయ=ఆది దేవునకు, నమః=నమస్కారములు.

భావము:- ఎవనిని బ్రహ్మ, వరుణుడు, ఇంద్రుడు, రుద్రుడు, మరుద్గణములు దివ్య స్తోత్రముల చేత, వేదాంగములు, ఉపనిషత్తులు, పదక్రమముతో గూడిన వేదములచేత స్తుతించుచుందురో, ఎవని మహాత్మ్యమును సామవేదమును గానము చేయువారు కీర్తించుచుండిరో, ఎవని స్వరూపమును యోగులు ధ్యానమగ్నులై, తద్గతులై గాంచుచుందురో, సురాసుర గణము లెవని వైభవమును ప్రయత్నించి తెలియలేరో అట్టి పూర్ణ రూపుడగు దేవదేవుని నమస్కరించుచున్నాను.

Meaning: Hail to the glorious Lord whom Brahma, Varuna, Indra, Rudra and the Maruts extol through heavenly hymns; Whom the chanters of the Sama Veda glorify by means of the Vedas including the Angas or Branches of knowledge auxiliary to the steady of the Vedas, their analysis into words marking their sequence and the Upanishads; Whom the Yogis perceive with their mind fixed on him through meditation; Yet whose whole truth neither the hosts of gods nor of the Demons are able to know.

శ్రీమద్భాగవత మహాత్మ్యము

శ్రీమద్భాగవతము యొక్క మహాత్మ్యమును గూర్చి అనేక పురాణములు వర్ణించినవి. పద్మపురాణాంతర్గతమైన మహాత్మ్యమునే ముఖ్యముగా గ్రహించుచుందురు. దానినే ఇచ్చట మనము గాంచుచున్నాము.

విద్వాంసులకు పరీక్షాగ్రంథ మనదగిన ఈ భాగవతము యొక్క వైభవమును వీక్షించుట యనగా అందులోని అమృత సందేశము నాస్వాదించుటయే నని భావము. భాగవతము సర్వదోషహరము. సమస్త శుభకరము.

ప్రలయం హి గమిష్యన్తి శ్రీమద్భాగవత ధ్వనేః
కలే ర్దోషా ఇమే సర్వే సింహ శబ్దా ద్వృకా ఇవ ॥

"మృగరాజు ధ్వని విని తోడేళ్ళు పలాయన మగునట్లు, శ్రీమద్భాగవతము యొక్క శబ్దము వినిపించగనే కలియుగ దోషములన్నియు నశించును" యని పద్మపురాణాంతర్గత భాగవత మహాత్మ్యము తెలిపినది.

తపోనిధియైన వ్యాసభగవానుడు, ఒంటరిగా వనములకు భగవత్సందర్శనాభిలాషియై వెడలిన మహా వైరాగ్యమూర్తి శుకయోగీంద్రుని ఎడబాటును సహింపలేనివాడై 'పుత్రా' అని పిలువగ వృక్షరాజములన్నియు తన్మయత్వముతో ప్రత్యుత్తర మిచ్చినవట. యోగబల ప్రభావముచే చరాచర జగతిని స్పందింపజేసిన శుకయోగీంద్రులకు నమస్కరించుచూ మునిశ్రేష్ఠుడగు శౌనకుడు సూతునకు నమస్కరించి, భక్తి, జ్ఞాన, వైరాగ్యముల వలన వివేకము వృద్ధినొందు విధమును, కలియుగమున వివిధ క్లేశములతో అసుర సంపదను పుణికి పుచ్చుకొనిన జీవుని పరిశుద్ధాంత రంగుని చేయగల ఉపాయమును, శ్రీకృష్ణుని పొందించు శాశ్వతమైన సాధనను వివరించమని ప్రార్థించెను.

చిన్తామణి ర్లోక సుఖం సురద్రుః స్వర్గ సమ్పదమ్ ।
ప్రయచ్ఛతి గురుః ప్రీతో వైకుణ్ఠం యోగి దుర్లభమ్

చింతామణి లౌకిక సుఖము నిచ్చును. కల్పవృక్షము స్వర్గసంపద నందించును. కానీ సద్గురువు యోగులకు దుర్లభమగు వైకుంఠమును ప్రసాదించును అని గురుమహిమను శౌనకుడు ప్రస్తుతించెను.

శౌనకుని హృదయమున నిక్షిప్తమైయున్న భగవత్ప్రేమను గాంచి సంతుష్టుడైన సూతుడు భక్తి ప్రవాహమును వృద్ధిపరచునదియు, జననమరణ భయనాశినియునైన సాధనమును చెప్పుటకు ఉద్యుక్తుడయ్యెను. కలియుగమున కాలసర్పము వాతబడు మనుజుల భయమును పారద్రోలుటకై శుకమహర్షి శ్రీమద్భాగవతమును ప్రవచించెను. జన్మాన్తరే భవేత్పుణ్యం తదా భాగవతం లభేత్ జన్మాంతర పుణ్యమువలననే భాగవతము లభిస్తుంది. శుకమహర్షి పరీక్షిత్తునకు కృష్ణ కథామృతమును వితరణ చేయుచుండగా

దేవతలు అమృతభాండమును తీసికొనివచ్చి దానికి బదులుగా కథామృతమును యొసంగుమని అడిగిరి.

క్వ సుధా క్వ కథా లోకే క్వ కాచః క్వ మణిర్మహాన్

"గాజు ఎక్కడ? అమూల్యమైన మణి ఎక్కడ?" అలాగే అమృతమునకు కథామృతమునకు సామ్య మెక్కడయని శుకుడు దేవతలను అపహాస్యము చేసెను. దేవతలు భక్తి లేనివారని యెరిగి కథామృతమును యొసంగలేదు. అందువలన శ్రీమద్భాగవత కథామృతము దేవతలకు గూడా దుర్లభ మయ్యెను. బ్రహ్మలోకమున విధాత పరీక్షిన్మహారాజు ముక్తి పొందుటను జూచి ఆశ్చర్యపడి సమస్త విషయములను తూనిక యందుంచగా ఇతర సాధనలన్నియు భాగవతమున కంటె తేలికయ్యెను. అదిచూచి విస్మయమొందిన ఋషులు భాగవత శ్రవణము భగవద్రూపమైనందున మోక్షము కరతలామలకమని నిశ్చయించిరి. దేవర్షియగు నారదునకు సప్తాహ శ్రవణవిధిని దయాపరాయణులగు సనకాదులు వినిపించిరి.

'లోక విగ్రహ ముక్తుడైన' నారదునకు విధి విధానము శ్రవణము చేయవలెనన్న ప్రీతి కలుగుటకు కారణమును, సనకాదులతో జరిగిన సమాగమమును శౌనకుడు ప్రశ్నించగా, గుహ్యముగా శుకమహర్షి వినిపించిన భక్తియుతమైన కథను సూతుడు వివరించుచున్నాడు.

నారదుని నైరాశ్యము

ఒకనాడు బదరికాశ్రమ సమీపమున సత్సంగమున నిమగ్నులై యుండిన సనకాది మునులు ఉదాసీనముగ, చింతాయుతుడైన నారదుని జూచిరి. నారదుని ఆ దీనావస్థను గాంచి మునులచ్చెరు వొందిరి. "నారదా! ధననష్టము జరిగిన మనుజుని వలె నీవు దుఃఖముతో గన్పట్టుచున్నావు. ముక్తసంగుడనైన నీకు ఈ దైన్యమెలా కలిగినది?" యని ప్రశ్నించిరి.

సర్వోత్తమలోక మని భావించి నేను భూలోకమునకు వచ్చి ప్రయాగ, కాశి, సేతుబంధము మొదలుగాగల పెక్కు తీర్థములలో గ్రుంకినా ఎచ్చటను మనశ్శాంతి లభింపలేదు. సత్యము, తపస్సు, శౌచము, దయ, దానము మచ్చునకైనను లేవు సరిగదా అసత్యపరులు, సోమరులు, మందబుద్ధులు, అదృష్ట హీనులు, ఉపద్రవగ్రస్తుల సంఖ్య మిక్కుటముగా యున్నది. సర్వదా అధర్మము విలయతాండవము చేయుచున్న కలియుగ దోషములను చూచుచు యమునా నదీతటమునకు చేరితిని. అచట నేను ఒక ఆశ్చర్యమును గాంచితిని. అచేతనముగ పడియున్న ఇరువురు వృద్ధ పురుషులకు సేవజేయుచు, ఒక యువతి ఖిన్న మనస్కురాలై కూర్చుండి యున్నది. ఆమెకు నలునైపులా వందలాది స్త్రీలు వింజామరలతో పరిచర్యలు జరుపుచుండిరి. దూరమునుండి గమనించి, కుతూహలము గలవాడనై ఆమెను సమీపించి ప్రశ్నించగా ఆ యువతి తన

పేరు భక్తి అనియు, ఆ ఇరువురు తన పుత్రులైన జ్ఞాన వైరాగ్యములనియు, కాల ప్రభావముచే వారు జర్జరులైరనియు తెలిపినది. ఘోరమైన కలియుగ ప్రభావముచే పాషండులు ఛిన్నాభిన్నము చేయగా; తాను, తన పుత్రులు దుర్బలులు, తేజోవిహీనులైతిమని వాపోయినది. బృందావన ధూళి సోకగానే తాను యథాస్థితిని పొందినప్పటికీ, తన పుత్రులు శ్రమాధిక్యత వలన దుఃఖితులగుట వలన, ఆ ప్రదేశమును వదలలేక పోతున్నామనియు, తమ విపరీత పరిస్థితికి మార్గమును జూపించుమని మనవి చేసినది.

కలియుగమున భక్తియొక్క దైన్యస్థితి ఈ విధముగ నున్నది. భక్తికి తొమ్మిది అంగములు గలవు. అవి 1) శ్రవణము 2) కీర్తనము 3) స్మరణము 4) పాదసేవనము 5) వందనము 6) అర్చనము 7) దాస్యము 8) సఖ్యము 9) ఆత్మనివేదనము. కానీ భక్తియొక్క ఈ తొమ్మిది అంగములు నీరసపడి నిర్వీర్యమైనవి.

కలియుగమున మొదటిదియైన శ్రవణభక్తి జరుగుచున్నదేగాని ఫలితము సిద్ధించుటలేదు. విత్తనము వేసినంత మాత్రాన ఫలమొచ్చునా? దాని కాహారము గూడా అందించాలి. కలియుగమున శ్రవణము అధికముగ జరుగును. కానీ మననము శూన్యముగా నుండును. మననములేని శ్రవణము వాస్తవానికి మరణమునే అందించును.

కీర్తనము ద్వితీయ సోపానము. ఈ ద్వితీయ సాధన నిజానికి అద్వితీయమైనదియే. కలియుగమున హరికీర్తనయే పరమోత్కృష్టము.

యత్ఫలం నాస్తి తపసా న యోగేన సమాధినా
తత్ఫలం లభతే సమ్యక్ కలౌ కేశవ కీర్తనాత్

"తపస్సు చేతను, యోగము చేతను, సమాధి చేతను లభించని ఫలము కలియుగమున కేవలము కీర్తనముచేతనే లభించును."

కానీ ఈ కీర్తనా భక్తి కూడా బలహీనమైనది. కీర్తన యనగా భగవానుని అనంత కళ్యాణ గుణ వైభవమును కీర్తించుటయని భావము. ఇట్టి కీర్తనాభక్తి క్రమముగ స్వరూపానుభూతికి దారితీయును. కానీ ఈనాడు కీర్తనాపరులు కీర్తిపరులయ్యారు. భగవానుని కీర్తించుట గౌణమైనది. తమ కీర్తిని ప్రకటించుకొనుట ముఖ్యమైనది. వీరు భక్తిమాతను మరీ నీరసపరచే నిష్ప్రయోజకులైన పుత్రులైనారు.

సత్సంగాలలో గూడ వీరు దర్శనమిస్తూనే యుంటారు. మైకుముందు గూర్చుని మైకముతో తూలి పోతుంటారు. వారు పాడాలి. వారే పాడాలి. ఎంత కర్ణ కఠోరమైనా సర్వులు అద్దానిని కర్ణపేయంగా స్వీకరించాలి. జనం వద్దని చప్పట్లు చరుస్తున్నా గంగా ప్రవాహంలా అర్థరహితమైన ప్రసంగంతో జనులకు విసుగెత్తించాలి. ఏంచేద్దాం? కష్టజీవియైన తండ్రి సంపాదించిన సంపదను, విలాసవంతులైన పుత్రులు దుర్వినియోగ మొనర్చునట్లు, మహాత్ములు సాగించెడి భక్తి ఉద్యమమును ఈ కీర్తికాముకులు పాడు చేస్తుంటారు. ఈవిధంగా పరమోత్కృష్టమైన కీర్తనాభక్తి కలియుగమున బలహీనమైనది.

స్మరణ భక్తి మూడవది. భగవద్భక్తి గలవారు భగవానుని స్మరిస్తూ జీవిస్తుంటారు. కానీ కలియుగ భక్తులు భగవానుని భక్తి చేస్తుంటారు; విషయ సుఖాలను స్మరిస్తూ

ఉంటారు. నిర్విషయానంద సాగరుని విస్మరిస్తుంటారు. విషయ చింతనముచే విషతుల్యమైన మనస్సు విశేషముగ కీర్తించలేదు. ఈవిధముగా స్మరణభక్తి బలహీనమైనది.

ఈ విశ్వము భగవంతునియొక్క పాదము. విశ్వప్రేమ నలవరచుకొనినచో మనము కూడా విశ్వామిత్రులమై విశ్వనాథుని సేవింపగలము. కానీ విశ్వప్రేమ స్థానంలో విచిత్రమైన ప్రేమలు చోటుచేసుకున్నాయి. అందుచేత పాదసేవనా భక్తి పతనమైంది. నాల్గవ పాదము కూడా బలహీనమైనది.

ఐదవది వందనము. వందనభక్తి వందనీయము. కానీ అహంకారము వృద్ధియగుట వలన అదికూడా నిందనీయమే అయినది. వందనము భగవంతునికి బంధనము. నమస్కారములో మమకారము, అహంకారము నశించును. కానీ అదికూడా ఈనాడు దుర్లభమైనది. ఇతరులలో పరమాత్మను గాంచి నమస్కరించుటకు పాడు అహంకారము అడ్డువచ్చుచున్నది. అదియునుగాక అందరూ తమకే నమస్కరించాలని చెడిన చిత్తము చింతిస్తున్నది. ఈ విధముగా వందనభక్తి అందమును గోల్పోయినది.

ఆరవది అర్చన. అనగా భగవంతుని రూపమును పూజించుట యని భావము. నేడు పరమాత్మ రూపమును ధ్యానించుట కన్నను తమ స్వరూపములను అర్చించుకొనే భక్తుల సంఖ్యయే ఎక్కువైనది. దేహధ్యానము, పుత్రధ్యానము, కళత్రధ్యానము, ధనధ్యానము - ఇవియే ప్రముఖముగా యున్నవి. స్వవిషయములను పూజించే ధ్యాస తగ్గిననాడు పరమాత్మను అర్చించే అదృష్టము ప్రాప్తించును.

దాస్యము ఏడవది. దాసభావము జీవుని ధన్యునిగ మార్చును. భగవానుడు స్వామి యనియు, తాను భృత్యుడ ననియు భక్తుడు భావించును. ఈవిధముగ తన బాధ్యతలను, బరువులను భగవానుని పవిత్ర పాదపద్మముల చెంతనుంచి భక్తుడు తేలికపడును. ఆనందమయుడగును. కానీ కలియుగ భక్తులు దైవదాసులు గారు; పైసాకు దాసులు; పదవులకు దాసులు; పేరు ప్రఖ్యాతులకు దాసులు; కామానికి దాసులు; కాంచనమునకు దాసులు; అందుచేత దాస్యభక్తి కూడా దైన్యస్థితినే బొందినది.

ఎంతనేర్చిన, ఎంతజూచిన, ఎంతవారలైన కాంతదాసులే

యని త్యాగరాజస్వామి ఒక కీర్తనలో గానం చేశారు.

సఖ్యభక్తి ఎనిమిదవ అంగము. సఖ్యమనగా స్నేహము. మనస్సు అనేక విషయము లతో స్నేహము చేయును. కానీ భగవంతునితో స్నేహము చేయకుండును.

యేస్తు స్తుల్యా ముకుందస్య తే సఖాయ స్సతాం మతాః

"ఎవరు ముకుందునికి సమానులో వారే ఆయనకు సఖులు."

కనుక భగవానుని అనంత కళ్యాణ గుణములను భక్తుడు గూడ వృద్ధిపరచు కొనవలెను. భావవైరుధ్యము భక్తికి అంతరాయమును కలిగించును. భగవంతుని భక్తులమని చెప్పుకొనుచు, విషయములతో సఖ్యమును కలిగియుండు వారివలన అష్టమ అంగమైన సఖ్యభక్తికూడ కష్టముల పాలైనది.

ఇక తొమ్మిదవ భక్తి ఆత్మనివేదనము. ఇదియే శరణాగతి. భక్తి జీవితమునకు పూర్ణాహుతి. ఇదియే భక్తులు పొందదగిన సద్గతి. సమగతి. విషయ సుఖ స్థితుల నుండి విడివడినవారే విషమపరిస్థితి నుండి బయటపడి సమస్థితిని పొంది తరింతురు. ఆలయమే లేనపుడు కలశప్రతిష్ఠ జరుగుట యనునది కలయే కాగలదు. కల్లయే కాగలదు. ఎనిమిది భక్తి అంగములు బలహీనమైనపుడు పరాభక్తి స్వరూపమైన ఈ తొమ్మిదవ అంగము లభించే సమస్యే లేదు. ఈవిధముగా భక్తిమాత కలియుగమున నీరసపడినది.

నారదుడు పలుకుచున్నాడు: "కౌరవుల అత్యాచారములనుండి ద్రౌపదిని రక్షించిన వాడు, గోపభామలను సనాథలను చేసినవాడు అయిన శ్రీకృష్ణుని చరణపంకజములను స్మరింపుము."

త్వం తు భక్తిః ప్రియా తస్య సతతం ప్రాణతోధికా
త్వయా హు తాస్తు భగవాన్ యాతి నీచ గృహేష్వపి

శ్రీకృష్ణునికి ప్రాణములకంటె ప్రియమైనదానవు. నీవు పిలిచినచో దురాగతుల గృహములలోనికి గూడా వెడలును. కృత త్రేతా ద్వాపర యుగములలో జ్ఞాన వైరాగ్య ములు ముక్తి సాధనములు కాగా కలియుగమున భక్తియే బ్రహ్మసాయుజ్యమును ప్రసాదించునదియై యున్నది. ఒకనాడు నీవే భగవానుని నీ కర్తవ్యము నిర్దేశించుమని ప్రార్థించగా

మద్భక్తాన్ పోషయేతిచ

"నా భక్తులను పోషింపుము" అని నిన్ను ఆజ్ఞాపించెను. భగవదాజ్ఞను శిరసా వహించినందున శ్రీహరి సంతసించిన వాడై ముక్తిని నీకు దాసీగా, జ్ఞాన వైరాగ్యములను పుత్రులుగా ప్రసాదించెను. ముక్తి జ్ఞాన వైరాగ్యములను వెంట నిడుకొని ద్వాపరము వరకు ఆనందముతో వుంటివి. కలియుగమున నీ దాసియగు ముక్తి పాషండ రోగపీడితయై క్షీణింపసాగెను. వైకుంఠమునకు మరలిన ముక్తి నిన్ను స్మరించుట చేతనే వచ్చుచు, మరలుచున్నను జ్ఞానవైరాగ్యములు నీ వద్దనే నిలుపుకొంటివి. నీవు చింతింపకుము. మీ నవజీవితమునకై మార్గము నన్వేషించెదను. ప్రతి ఇంట, ప్రతి మానవుని హృదయములో నిన్ను పునఃప్రతిష్ఠించెదను" అని నారదుడు అభయదాన మిచ్చెను.

నృణాం జన్మ సహస్రేణ భక్తౌ ప్రీతిర్హి జాయతే
కలౌ భక్తిః కలౌ భక్తి ర్భ క్త్యా కృష్ణః పురః స్థితః

మనుష్యులకు వేలకొలది జన్మముల పుణ్యముచే భక్తియందు అనురాగము కలుగును. కలియుగమున కేవలము భక్తియే సారము. భక్తిచే సాక్షాత్తుగ కృష్ణుని దర్శింపవచ్చును.

ఇట్లు నారదునిచే పరిపుష్టిని పొందిన భక్తి తనయందు నిశ్చలమైన ప్రేమను నింపియున్న నారదుని హృదయమునందు ప్రతిష్ఠితమై వుందునని, ఎప్పటికీ వదలి వెడలనని, తన దుఃఖమును ఉపశమింపచేసిన దయామూర్తిని, తన కుమారులను చైతన్యవంతులను చేయుమని ప్రార్థించినది.

మహర్షులు, వేదవేదాంగములు, షడ్దర్శనములు, అష్టాదశ పురాణములు మూర్తిమంతములై అచట చేరినవి. గంగాది నదులు, హిమాలయాది పర్వతములు, దేవ, దానవ, గంధర్వులు సమకూడిరి. సనకాదులు ఉత్తమాసనములపై విరాజిల్లిరి. శ్రోతలందరి ప్రణామములు స్వీకరించిన పిదప సనకాది ఋషులు నారద మహర్షికి శ్రీమద్భాగవత మహాత్మ్యమును చెప్పసాగిరని సూతుడు పలికెను.

సనకాదులు భాగవత మహాత్మ్యమును ప్రారంభించిరి. పదునెనిమిది వేల శ్లోకములు, పండ్రెండు స్కంధములు గల భాగవతము శ్రీశుకమహర్షి పరీక్షిన్మహారాజుల సంవాదముగా గలదు. శుకవాగామృతము చెవుల బడనంత కాలము పెరిగిన భ్రమలు విరుగవు. ముక్తిని ముంజేతి కంకణము చేయగల శక్తివంతమైన భాగవత ప్రవచనము చేయబడుచున్న గృహము తీర్థరూపమగును.

న గఙ్గా న గయా కాశీ పుష్కరం న ప్రయాగ కమ్
శుక శాస్త్ర కథాయాశ్చ ఫలేన సమయాం న యేత్॥
దుర్లభైవ కథా లోకే శ్రీ మద్భాగవతోద్భవా
కోటి జన్మ సముత్థేన పుణ్యనైవ తు లభ్యతే॥

కోట్లకొలది జన్మల పుణ్యము చేతనే భాగవత కథ లభించును. నారదా! నీవు యోగనిధివి. సత్య భాషణము చేత, బ్రహ్మచర్యము చేత ఎల్లప్పుడును శ్రవణము చేయుట ఉత్తమమైనదిగా నిర్ణయించినప్పటికి శుకమహర్షి అందించిన విశేష విధి తెలిసికొనదగినదని సనకాదులు తమ ప్రసంగమును కొనసాగించుచున్నారు.

కలియుగమున బహు దినముల వరకు చిత్తవృత్తులను నిరోధించుట దుస్తరమైనందున సప్తాహ శ్రవణ విధి ఏర్పాటు చేయబడినది. తపస్సు, యోగము, సమాధి చేత లభించని ఫలము దీనివలన సులభముగ లభించును.

సంపూర్ణ భాగవతమును ఏడు రోజులలో శ్రవణము చేయుటనే ముఖ్యవిషయముగ భావించి భాగవత సప్తాహమును నిర్వహించుచుందురు. సప్తాహమనిన ఏడురోజులు మాత్రమే చేయదగిన కార్యమని భావింపరాదు. వారమునకు ఏడు రోజులు. కనుక వారం రోజులు, అంటే ప్రతిరోజు యని భావము. హృదయములో శ్రీకృష్ణుడు సుప్రతిష్ఠమగు నంతవరకు భాగవతమును వదలరాదు. కార్యమునకు పూర్ణాహుతియే గాని, భక్తికి కాదు.

శౌనకుడు పలుకుచున్నాడు: "సూతుడా! మోక్షమును కలిగించు జ్ఞానాది సాధనములను తిరస్కరించిన ఈ యుగమున భక్తి ఎట్లు గొప్పదైన" దని తన సందేహమును వారి ముందు ఉంచెను.

"శౌనకా! శ్రీకృష్ణ భగవానుడు అవతారమును చాలించి నిత్యధామమునకు వెడలు నపుడు ఆయన ముఖారవిందమునుండి ఏకాదశ స్కంధమును శ్రవణము చేసిన ఉద్ధవుడు "గోవిందా! కలియుగమున దుర్జనులు అధికంగా జన్మించి భూభారమును పెంచుదురు. భక్తవత్సలా! నిరాకారుడవైన నీవు భక్తులకొరకు సగుణ రూపమును ధరించిన చిన్మాత్రుడవు. సాధువులపై దయజూపి వెడలవద్దనియు" ప్రార్థించెను. ప్రభాస

దేవతలకు గూడా దాట శక్యముగాని మాయను దాటుటకు సప్తాహ శ్రవణ విధానము చెప్పబడినది.

"శౌనకా! సనకాదులు ఈవిధముగా సప్తాహ శ్రవణ మహిమను చెప్పుచుండగా ఒక ఆశ్చర్యకరమైన విషయము సంఘటిల్లినది. దానిని చెప్పెదను; వినుము.

యువకులైన తన ఇరువురు పుత్రులతో భక్తి "శ్రీకృష్ణ! గోవింద! మాధవ! వాసుదేవ!" అను నామోచ్ఛారణతో భాగవతార్థ భూషణములను ధరించి అచ్చట ప్రకటితమైనది. నష్టప్రాయమైన తనకు పుష్టిని కలుగచేసిన మహాత్ములను తానెక్కడ ఉండవలెనో చెప్పుమనగా సనకాదులు

భక్తేషు గోవిన్ద స్వరూప కర్త్రీ ప్రేమైకధర్త్రీ భవరోగ హన్త్రీ
సా త్వం చ తిష్ఠ స్వ సుధైర్య సంశ్రయా, నిరన్తరం వైష్ణవ మానసాని

విష్ణుభక్తుల హృదయాలలో నివసింపుమనియు, కలిదోషములు ఎంత ప్రభావితాలైనప్పటికీ భక్తిపై చూపజాలవని తెలుపగ, వారి ఆజ్ఞానుసారం భక్తి వెడలి భగవద్భక్తుల హృదయము లందు నిలిచెను.

కథాశ్రవణము చక్కగ జరిగినచో పరమాత్మ హృదయములో ప్రవేశించును. కథను శ్రవణము చేయగనే మొదట వ్యక్తి హృదయము పశ్చాత్తాపముతో స్పందించవలెను. "అయ్యో! నా జీవితమంతయు వృథాయైనది గదా?" యనెడి భావము కలుగవలెను. అప్పుడే శ్రవణఫలము లభించును. భక్తిదేవి యొక్క కథను వివరించడము జరిగెను. తద్వారా భాగవతము యొక్క మహాత్మ్యము మనకు వెల్లడి అయ్యెను. కానీ దృష్టాంతము నందించినపుడే విషయము సులభముగ అవగతమగును. భాగవత శ్రవణప్రభావమును తెలుపుచు దృష్టాంతముగ గోకర్ణుని గాథను చెప్పుచున్నారు.

గోకర్ణోపాఖ్యానము

సప్తాహయజ్ఞమున ఎవరెవరు పవిత్రులగుదురో తెలియచేయవలసినదని నారదుడు సనకాది మునులను ప్రార్థించెను. "సత్యహీనులు, తల్లిదండ్రులను దూషించువారు, ఆశ్రమధర్మములను త్యజించినవారు, బ్రహ్మహత్యచేసినవారు, చోరులు; ఒకరననేల? సర్వులు పవిత్రులగుదురు" యని మహర్షులు నుడివిరి.

అత్ర తే కీర్త యిష్యామ ఇతిహాసం పురాతనమ్
యస్య శ్రవణ మాత్రేణ పాపహాని: ప్రజాయతే

"నారదా! సర్వ పాపములను వినినంతనే హరింపచేయు ఒక ఇతిహాసమును వినిపింతుము, అవధరింపుము.

పూర్వకాలమున తుంగభద్రా తీరమున సత్కర్మానుష్ఠానపరులతో అలరారుచున్న ఉత్తమమైన పట్టణమొకటి వుండెడిది. ఆ నగరమున సర్వవేద విశారదుడగు ఆత్మదేవుడు 'ద్వితీయ భాస్కరుడు' గా ప్రభవించుచుండెను. అతని భార్య ధుంధులి. అర్థ, భోగములు

పుష్కలముగా గల ఆ దంపతులకు సంతాన ప్రాప్తి లేకుండెను. ధర్మమార్గమున తత్ర్పాప్తికై దానధర్మముల నెన్నియో చేసిరి. ఫలితము నొనగూడని బ్రాహ్మణుడు మిగుల వ్యథ చెందుచుండెను.

ఒకనాడు ఆ బ్రాహ్మణుడు మిగుల దుఃఖితుడై ఇంటినుండి బయలుదేరి వనమునకు వెళ్ళి పరిభ్రమించి, రెండు ఝాముల సమయమున దప్పికగొన్నవాడై ఒక మడుగును సమీపించెను. దప్పిక తీర్చుకొని, అలసిన వాడై అచ్చటనే విశ్రమించెను. రెండు ఘడియలు గడచిన పిమ్మట అచ్చటికి ఒక సన్యాసి వచ్చెను. ఆత్మదేవుడు ఆయన పాదములకు నమస్కరించెను. విచలిత మనస్కుడైన ఆత్మదేవుని చింతకు గల కారణమును సన్యాసి ప్రశ్నించెను. వ్యాకులుడైన ఆత్మదేవుడు తన హృదయావేదనను విన్నవించగా, యతివరుని హృదయమున కరుణ ఉత్పన్నమయ్యెను. యోగనిష్ఠుడగు యతి ఆత్మదేవుని తలవ్రాతను చదివి, మోహమును త్యజింపుమనియు, వివేకమును ఆశ్రయించి సంసారవాసనను ప్రక్షాళిత మొనరించుకొనుమనియు తెలిపెను. ప్రారబ్ధము ననుసరించి ఏడు జన్మల వరకు అతనికి సంతాన ప్రాప్తి లేదనియు, సగరచక్రవర్తి అంగడు సంతానము వలన దుఃఖము ననుభవించిరనియు అనునయ పూర్వకముగా చెప్పెను. వివేకము తనకు అవసరము లేదనియు, పుత్రుని యొసంగనిచో ప్రాణములను పరిత్యజింతు ననియు ఆత్మదేవుడు పలికెను. బ్రాహ్మణుని పట్టుదలను జూచి, తపోధనుడు, విధివ్రాతను తుడిచిపెట్టిన చిత్రకేతుడు పెక్కు కష్టముల పాలైన విధముగనే, అతనికి గూడ పుత్రసుఖము కలుగదని వివరించెను. పట్టుదలను వీడని ఆత్మదేవునికి ఒక ఫలమునిచ్చి భార్య కొసంగుమనియు ఆమె దానిని భక్షించి సత్పుత్రు నొకనిని ప్రసవించగలదనియు చెప్పెను. అతని భార్య సంవత్సర కాలము సత్య శౌచ దయా దానములను కలిగి ఏకభుక్త యైనచో పరిశుద్ధ స్వభావముగల బాలుడు జన్మించునని పలికి యోగి వెడలిపోయెను.

బ్రాహ్మణుడు ఇంటికి వెళ్ళి, ఫలమును భార్యకిచ్చి, ఎక్కడికో వెడలిపోయెను. కుటిల స్వభావము కలది, దుష్టభావములు గలది యగు ధుంధులి పండును తినలేదు. భర్త ఎదుట తినినట్లు నటించినది. ధుంధులి ఎందుకు పండు నారగించలేదు? బిడ్డ అవసరము లేకనా? కాదు బిడ్డ కావాలి. కాని ప్రసవవేదన యుండగూడదు. కష్టము లేకుండా సుఖము రావాలి.

వేదాంతమును అందరూ వింటారు. ఆచరించాలంటే కష్టపడతారు. సూక్ష్మమైన మార్గము చెప్పమని అడుగుతారు. ఆచరించేందుకు అంతఃకరణ అంగీకరించదు. చెట్టు లేకనే ఫలము నాశించువారు దుఃఖము పాలగుదురు. అట్టి అయోమయ జీవియే ధుంధులి.

ఒకనాడు ఆమె సోదరి రాగా, సర్వ వృత్తాంతమును వినిపించినది. గర్భవతియైన ఆ సహోదరి ప్రసవానంతరము తన బాలుని ఇచ్చుటకు నిర్ణయించినది. దానికి ప్రతిగా తన భర్తకు ధనమొసంగవలెనని తీర్మానించింది. ఇరువురు ఫలమును పరీక్షించవలెనని గోవునకు తినిపించిరి. కొంతకాలమునకు ఆ స్త్రీ బాలుని ప్రసవించినది. వాని తండ్రి రహస్యముగ తెచ్చి ధుంధులికి ఒసంగెను. తాను సుఖముగ ప్రసవించితినని చెప్పగ

ఆత్మదేవునకు పుత్రోదయమైనందుకు సర్వులు సంతసించిరి. ఆత్మదేవుడు వానికి జాతకర్మ సంస్కారము చేసి బ్రాహ్మణులకు దానము లిచ్చెను. కొన్నిరోజులు గడచిన పిమ్మట, ధుంధులి తన స్తనములలో పాలు లేవనియు, తన సోదరి ప్రసవించిన బిడ్డ మరణించినందువలన ఆమెను తమ యింటిలో ఉంచుకొనినచో, బాలుని పోషించ గలదనియు చెప్పెను. పుత్రుని రక్షణకై ఆత్మదేవుడు ఆ విధముగనే చేసెను. ధుంధులి ఆ బాలునికి ధుంధుకారుడని పేరిడెను.

మూడునెలల పిమ్మట గోవు సర్వాంగ సుందరుడైన, మనుష్యాకారుడైన ఒక బాలుని కనినది. దానిని చూచి, సంతసించిన ఆత్మదేవుడు స్వయముగా దానికి అన్ని సంస్కారములు చేసి ఆవు చెవుల వంటి చెవులు కలిగియుండుటను చూచి 'గోకర్ణు' డను పేరు పెట్టెను.

కొంతకాలము గడచిన పిమ్మట బాలురిరువురు యువకులైరి. గోకర్ణుడు పండితుడు కాగా ధుంధుకారుడు దుష్టుడయ్యెను. ఎట్టి భోజన నియమములు లేనివాడై, శవహస్త భోజనము కూడా తినుచుండెడివాడు. దుష్టుడై, వేశ్యాలోలుడై, పిత్రార్జితమైన సంపద నంతటినీ హరింపజేసెను.

క్వ తిష్ఠామి క్వ గచ్ఛామి కోమే దుఃఖం వ్యపోహయత్
ప్రాణాం స్త్యజామి దుఃఖేన హా కష్టం మమ సంస్థితమ్

"ఇప్పుడు నేనెక్కడ యుందును? ఎక్కడికి వెళ్ళుదును? నా ఈ కష్టమును ఎవరు పోగొట్టగలరు? భరింపలేని ఈ దుఃఖమువలన ప్రాణములను త్యజింతును" యని తండ్రి దుఃఖించుచుండగ, పరమ జ్ఞానియగు గోకర్ణుడు వచ్చి వైరాగ్యమును తండ్రికి బోధించి శాంతపరచెను. సారహీనము, దుఃఖభాజనము అయిన సంసారములో పుత్రవ్యామోహం, ధనవ్యామోహం అర్థరహితములనీ, సుఖమనునది కేవలము విరక్తునకు, ఏకాంత జీవియైన మనన శీలునకు మాత్రమే లభించుననీ, 'నాది' యను అజ్ఞానమునూ, మోహమునూ త్యజింపుమనెను. గోకర్ణుని మాటలు నిత్యసత్యము లగుటచే ఆత్మదేవుడు వనమునకు వెడలుటకు సన్నద్ధుడై కుమారుని తన్నుద్ధరింపు మార్గమును సవిస్తరముగా తెలుపమని అడిగెను.

శరీరము ఎముకలు, మాంసము, రక్తములతో నిండిన ఓటికుండ వంటిదనియు "నేను" "నాది" అనే అహంకార, మమకారములను త్యజింపుమనియు గోకర్ణుడు తండ్రికి చెప్పెను.

ధర్మం భజస్వ సతతం త్యజ లోకధర్మాన్
సేవస్వ సాధు పురుషాఞ్జహి కామతృష్ణామ్
అన్యస్య దోషగుణ చిన్తన మాశు ముక్త్వా
సేవా కథ రస మహో నితరాం పిబత్వమ్

"సదా భగవంతుని భజించుటయే గొప్ప ధర్మము. లౌకిక వ్యవహారములను త్యజింపుము. సత్పురుషులను సేవింపుము. కామేచ్ఛను నశింపజేయుము. అన్యుల

దోషగుణములను విస్మరించి అనన్య చింతనముతో భగవంతునియందే మనస్సును లగ్న మొనర్పుము. భగవత్కథా సుధను సదా పానము చేయుము" అని పలికెను. సుపుత్రుడైన గోకర్ణుని మాటల నాలకించి ఆత్మదేవుడు వనములకేగెను.

తుంగభద్రా తీరమున ఆత్మదేవుడు వసించుచుండును. జీవుడే ఆత్మదేవుడు. దేవ శబ్దమునకు అర్థమును చూచెదము. 'దివు క్రీడాయామ్' క్రీడించువారు గనుక దేవతలు. ఆత్మదేవుడు యనగా క్రీడించు ఇంద్రియాలతో మిళితమై యుండువాడు యని భావము.

ఆత్మదేవుడు తుంగభద్రా తీరమున వసించుచుండును. 'తుంగ' యనగా ఉన్నతమైన దని అర్థము. 'భద్ర' మనగా శుభము. తుంగభద్రా యనగా శ్రేష్ఠాతి శ్రేష్ఠమని భావము. అట్టిది ఆత్మయేగాని మరొకటి గాదు. ఆత్మదేవుడు తుంగభద్ర సమీపముననే యుండెను. జీవుడు కూడా ఆత్మ చైతన్యమునకు చేరువనే యున్నాడు.

ఆత్మదేవుని భార్య ధుంధులి. దారితప్పిన బుద్ధియే ధుంధులి. ధుంధులి ఆత్మదేవుని మోసగించెను. భరించే భర్తనే వంచించెను. మనస్సుగూడ జీవుని మోసగించును. తన మనుగడకు ఆధారమైన వానినే వంచించును.

ధుంధులి తన సోదరియొక్క సహకారముతో ఆత్మదేవుని వంచించెను. బుద్ధి మనస్సుయొక్క సహకారముతో జీవుని వంచించును.

ఋషియొసగిన గొప్పదియైన ఫలమును దెచ్చి ఆత్మదేవుడు ధుంధులి కిచ్చెను. ధుంధులి ఆ పండును ఆవుకు తినిపించెను. ఉపనిషదృషు లొసగిన జ్ఞానఫలమును జీవుడు మనస్సున కొసగును. మనస్సు అద్దానిని ఇంద్రియములకు ఒసగును. 'గో' శబ్దము ఇంద్రియములను నిర్ణయించును.

సదా చెడు కార్యములయందు రమించువాడే ధుంధుకారి. ధుంధుకారి వేశ్యాలోలుడు అయ్యెను. అతడు ఐదుగురు వేశ్యా స్త్రీలతో చిక్కుబడియుండెను. శబ్దాది విషయసుఖములే ఐదుమంది వేశ్యలు.

అతడు శవముయొక్క హస్తమునుండి ఆహారమును స్వీకరించు చుండెనని చెప్పబడినది. ఏ చేతులు భగవత్పూజను ఆచరింపవో అవియే శవహస్తములు. ఎవరయితే పరులకు సేవచేయకుండా తమ స్వార్థమునే చింతించుచు ఆర్జించుచుందురో అట్టివారి చేతులే శవహస్తాలు.

ధుంధుకారి చెడు మార్గములయందు చరించుచుండెను. తండ్రియగు ఆత్మదేవుడు దుఃఖించుచుండెను. గోకర్ణుడు తండ్రికి హితబోధ చేసెను. సత్త్వగుణము జీవుని సన్మార్గమున నడిపించును. పుణ్య తీర్థములను దర్శింపచేయును. గోకర్ణుని సలహాపై ఆత్మదేవుడు తీర్థాటన కెళ్ళెను.

ధుంధుకారి పాపవిముక్తి

సూతుడు శౌనకునితో పలుకుచున్నాడు: శౌనకా! తండ్రియైన ఆత్మదేవుడు అడవికి వెడలిన పిమ్మట ధుంధుకారి ధనమునకై తల్లిని వత్తిడిచేసి తీవ్రముగా హింసించగా ఆమె దుఃఖితయై బలవన్మరణము పొందినది. యోగనిష్ఠుడగు గోకర్ణుడు కూడా తీర్థయాత్రలకై

సూతుడు ఈవిధముగా పున: కొనసాగించుచున్నాడు.

భక్తి పలికిన వాక్కులను విని, దయాతప్త హృదయుడైన నారదుడు భక్తియొక్క కుమారులను చేతితో తట్టుచూ, "ఓ జ్ఞానమా! త్వరగా మేలుకొనుము; వైరాగ్యమా! త్వరగా మేలుకొనుము" అని పెద్దగా పలికెను. వేదాంతఘోష చేత, గీతాగానము చేత అతికష్టముతో మేలుకొలిపెను. సోమరితనము వలన, ఆకలిదప్పులచేత దుర్బలులైనందువలన, లేచియు మరల నిద్ర కుపక్రమించిరి. శౌనకా! వారి వార్ధక్యము ఏ విధముగా తొలగింపవలెనని ఆలోచించుచు భగవానుని స్మరించెను.

వేదఘోషలు, గీతాపారాయణములు, వేదాంత ప్రవచనములు నేడు గూడ జరుగుచున్నవి. ఆనాడు నారదునికి వాటి ఫలితము లభించని విధముగ నేడుగూడ ఫలితము గోచరించుటలేదు. వేదాంతము నాలకించినపుడు హృదయమంతా వైరాగ్యముతో నిండిపోతుంది. ఏదో జీవితము ఆనాడే తరించిపోతున్నట్లు భావిస్తుంటారు. కొద్ది సమయములోనే సూర్యుని మేఘము కప్పినట్లు బుద్ధిని అజ్ఞానము ఆవరించును. మళ్ళీ చేసిన పనులే; చూసిన రుచులే!

నారదుని ప్రవచనముల ద్వారా భక్తియొక్క కుమారులగు జ్ఞాన వైరాగ్యములు తిరిగి యౌవనవంతులైనట్లే గోచరించినది. చూస్తుండగనే వారు నీరసపడిపోవుచుండిరి. ఏమి చేయవలెనో నారదునికి అంతుపట్టకుండెను.

అంతట ఆకాశవాణి నారదుని ఒక సత్కర్మ నాచరింపుమని, దానిని సత్పురుషులైన మహానుభావులు చెప్పగలరనీ, దాని ప్రభావమున క్షణకాలముననే వారి నిదుర, వృద్ధాప్యము తొలగగలవనీ ఆదేశించినది.

ఆకాశవాణి సుస్పష్టముగనే వినిపించినప్పటికి ఏ సాధన చేసిన స్థిరమగునో, ఆ మహాత్ములెవరో, వారా సాధన నెట్లు చెప్పగలరో విశదపరచ నందున, నారదుడు జ్ఞాన వైరాగ్యములను రెండింటినీ అచ్చటనే వదలి తీర్థాటన ప్రారంభించి, మార్గమధ్యమున సనకసనందనాది మునీశ్వరులను బదరికాశ్రమమున దర్శించి, ప్రశ్నించుట జరిగెను.

తా వద్ద ధర్శ పురత: సనకాదీ న్మునీశ్వరాన్
కోటి సూర్య సమాభాసా నువాచ మునిసత్తమ

తన ఎదుట కోటి సూర్యప్రకాశముతో వెలుగు సనకాది మునీశ్వరులను చూచి తన అదృష్టబలమున వారి సాంగత్యము లభించినదని ముద మందినవాడై సాధనను వివరింపుమని అర్థించెను. సనకాదులు భక్తియొక్క ఔన్నత్యమును బహుధా కీర్తించి శ్రీమద్భాగవత పారాయణము, జ్ఞానయజ్ఞములే సత్కర్మములని తెలిపిరి.

భక్తి జ్ఞాన విరాగాణాం తద్ఘోషేణ బలం మహత్
వ్రజష్యతి ద్వయో: కష్టం సుఖం భక్తే ర్భవిష్యతి

దాని శబ్దము వినుటచేతనే భక్తి, జ్ఞాన, వైరాగ్యములకు గొప్ప బలము లభించునవియు, కష్టము తొలగగలదనియు, ఆనందము దొరకగలదనియు నుడివిరి.

"దివ్యాత్ములారా! వేదాంత గీతా ప్రబోధముల ద్వారా వారిని నేను మేల్కొలిపితిని. కాని నిష్ఫలమాయెను. అట్టి స్థితిలో శ్రీమద్భాగవతమును వినిపించుట ద్వారా ఎలా మేల్కొనగలరు? భాగవతములోని ప్రతి శ్లోకము నందును, ప్రతి పదము నందును యున్నది వేదాంతమే గదా?" యని నారదుడు ప్రశ్నించెను.

ఋషులు చెప్పుచున్నారు: "నారదా! నిజమే. భాగవతము వేదోపనిషత్తుల సారమే అయివున్నది. కానీ ఇది ఫలరూపము.

ఒక చెట్టునందు రసము మూలమునుండి చివరి కొమ్మవరకు యుండును. కానీ ఆ స్థితిలో మనము ఆరగించలేము. రసమే ఫలరూపమున వచ్చినపుడు మనోహరమగును గదా! భాగవతము అలాంటిదే.

"నారదా! నేయి పాలలోనే యుండును. కానీ రుచి వేరుగా యుండును. నేయిని పాలనుండి వేరుచేసిన పిమ్మట అది దేవతలకు గూడ రుచిని అందించును. భాగవతము నేయి లాంటిది.

"నారదా! చెరకు గడలో ఎచ్చట చూచినను చక్కెర నిండియుండును. కానీ చెరకునుండి వేరుచేసిన చక్కెర ఎలా ఉండును? భక్తి రూపమైన ఈ భాగవతము జ్ఞానమనెడి నేయితోను, భక్తియనెడి చక్కెరతోను సమరసమై యున్నది. ఈ భాగవత ఫలరసమును త్రాగిన వారికి అమృతత్వము లభించును." అందుచేతనే

పిబత భాగవతం రసమాలయం

ఈ భాగవత రసానందమును పానము జేయుమని ప్రారంభముననే వ్యాసభగవానుడు తెలుపును.

భక్తికి దుఃఖనివృత్తి

నారదుడు తాను భక్తి జ్ఞాన వైరాగ్యములను నిలబెట్టు ప్రయత్నముతో జ్ఞానయజ్ఞము చేయుదుననియు దానికై స్థల నిర్దేశనము, దానిని శ్రవణము చేయు విధానమును తెలియ చేయవలసినదని సనత్కుమారులను ప్రార్థించెను.

సనకాదులు వినయ వివేకములకు ప్రతిరూపమైన నారదుని ఎడల ప్రసన్నులై హరిద్వార సమీపమున ఆనందమను తటమున్నదనియు, అది సౌందర్యయుతమై, నైరుధ్యము లంతరించిన సముచిత ప్రదేశమనియు, అచ్చోట కథయందు అమృతరసము ప్లావితమగుట వలన భక్తి కూడా జ్ఞాన వైరాగ్యములను వెంటనిడుకొని అచటకు రాగలదనియు చెప్పిరి. ఆ కథాశబ్దము వీనులకు సోకినంత మాత్రముననే వారు పునః యౌవనవంతు లగుదురు.

ఈవిధముగ నారదునితో చెప్పి సనకాదులు కూడా కథామృతమును పానము చేయుటకు, గంగాతీరమును చేరుటకు బయలుదేరిరి. మార్గమధ్యమున త్రిలోకములందు కథామృతమును గురించిన కోలాహలమును గాంచిరి. భగవత్కథా రసికులగు విష్ణుభక్తులు,

బయలుదేరెను. సుఖదు:ఖముల యందు, మానావమానముల యందు సముడైన గోకర్ణుని సాంసారిక బాధలూ, బంధాలు, భయాలూ స్పృశింపలేక పోయాయి.

ధుంధుకారి వేశ్యాలోలుడయ్యెను. వారి పోషణలో రిక్తహస్తుడయ్యెను. నానావిధములైన క్రూరకర్మములను చేయుట మొదలిడెను. వేశ్యలను తృప్తి పరచుటకు ప్రతిదినము చౌర్యముచేసి ఆభరణములను సంపాదించుట వాని వృత్తిగా, ప్రవృత్తిగా మారినది. దుష్టబుద్ధులైన వేశ్యలు ఏదో ఒకనాటికి వాని చౌర్యము బయల్పడుననియు, ఆనాడు రాజ దండనను అనుభవించవలసి వచ్చుననియు శంకించి, వానిని చంపి ఆ ధనమునంతటిని తస్కరించి పలాయనమగుటకు నిశ్చయించుకొనిరి.

ఆ విధముగా తలచి ఒకనాటి రాత్రి వారు నిద్రించు ధుంధుకారిని త్రాళ్ళతోకట్టి కంఠమునకు ఉరిని వేయసంకల్పించిరి. కాని వారి ప్రయత్నము సఫలీకృతము కాలేదు. పాపిని ముట్టుకొనేందుకు మృత్యువు కూడా వెనుకాడును. అందుచేత పాపులు ఎక్కువ కాలము జీవించి ఎక్కువ పాపమును మూటకట్టు కొనుచుందురు. తదనంతరము ముఖముపై అగ్నికణములను పోయగా, ఆ జ్వాలలో గిలగిల కొట్టుకొని మరణించెను. తాను నమ్మిన ఇంద్రియాలే తన మృత్యువునకు కారణమయ్యాయి. తాను మధురమని భావించిన విషయాలే తనకు విషము నందించాయి. వానిని గుంటలో పూడ్చి, తదనంతరము ఆ కులటలు ధుంధుకారి సమస్త సంపదలో అచటనుండి పలాయనమైరి. చెడుకర్మల నాచరించిన ధుంధుకారి ప్రేతమాయెను.

గోకర్ణుడు ధుంధుకారి మరణించిన వార్తను వినినవాడై, అనాథుడై ప్రేతరూపమైన వానికి గయలో శ్రాద్ధము పెట్టెను. తాను దర్శించిన తీర్థరాజము లన్నిటిలోను శ్రాద్ధకర్మల నాచరించెను.

గోకర్ణుడు రాత్రులందు తిరిగి నగరమునకు వచ్చి తన వాకిలి ముందు పరుండెడివాడు. అక్కడ తన సోదరుడు పరుండి యుండుటను గాంచిన ధుంధుకారి భయంకరమైన తన పైశాచిక రూపములను ధరించెను. ఆ విపరీత అవస్థలను గాంచిన గోకర్ణుడు దుర్గతి చెందిన జీవుడై యుండనోపు అని భావించి, 'ఎవ్వడవు నీవు? రాత్రివేళ ఈ భయానక రూపమున ఏల సంచరించుచుంటివి?' అని ప్రశ్నించెను.

సూతుడు చెప్పుచున్నాడు: గోకర్ణుడు యిట్లు అడుగగా మాట్లాడుటకు శక్తిలేని యాతడు సంజ్ఞలను చేసెను. గోకర్ణుడంత జలమును అభిమంత్రించి వానిపై జల్లగా, పాపములు శాంతింపగా వాడిట్లు చెప్పెను. "నేను నీ సోదరుడనైన ధుంధుకారిని. బ్రాహ్మణత్వమునకు మచ్చ కలిగించిన దుచ్చరిత్రుడను. దుష్కర్మలు దుర్దశను అందించగా ప్రేతత్వమును పొందితిని. దయాసముద్రుడవైన సహోదరా! నన్ను త్వరితగతిని విడిపింపుము" అని దు:ఖించుచు ప్రార్థించెను. మానవులు నవ్వుతూ పాపము లాచరిస్తుంటారు. పాపఫలము ననుభవించవలసి వచ్చినపుడు విపరీతముగ దు:ఖిస్తారు. అనేక దుష్టకర్మల నాచరించిన ధుంధుకారి ఇప్పుడు భరించలేని దు:ఖములో పరితపించు చున్నాడు.

అంత గోకర్ణుడు "నేను యథావిధిగా గయలో పిండప్రదానము చేసితిని. అయినను నీవు ఎందులకు ముక్తుడవు కాలేదు? గయాశ్రాద్ధము వలన గూడా ముక్తి కలుగనిచో మార్గాంతరమును నీవే నిర్దేశించుము" అని ప్రేతాత్మకు చెప్పెను.

అంత పైశాచిక రూపుడైన ధుంధుకారి పండలకొలది గయా శ్రాద్ధములను ఒనరించినను తనకు ముక్తి అసంభవమే యగునని పరితపించగా గోకర్ణుడు అతనిని యథాస్థానమునకు వెడలుమని ఆదేశించి ఉపాయమును అన్వేషించుట కారంభించెను.

గోకర్ణుని రాకను యెరిగిన విద్వాంసులు, యోగులు, జ్ఞానులు విషయము నెరిగి సర్వశాస్త్రములను కూలంకషముగ చర్చించిరి. అయినను వాని ముక్తికి ఎట్టి ఉపాయము దొరకదాయెను. అప్పుడు అందరూ ఆదిత్యుని వాక్కును ఆచరించవలెనని నిర్ణయించగా, గోకర్ణుడు తన తపోబలముతో సూర్యగమనమును నిరోధించెను. జగత్సాక్షియైన సూర్యునికి ప్రణామము లాచరించి ధుంధుకారి ముక్తికి ఉపాయమును చెప్పవలసినదని గోకర్ణుడు అభ్యర్థించగా, సూర్యుడు

శ్రీమద్భాగవతాన్ముక్తిః సప్తాహం వాచనం కురు
ఇతి సూర్య వచః సర్వై ర్ధర్మరూపం తు విశ్రుతమ్

“శ్రీమద్భాగవతము వలన ముక్తి కలుగును. అందువలన నీవు దానిని సప్తాహ పారాయణము చేయుము” అని ఆదేశించెను.

గోకర్ణుడు తదనుసారముగా నిశ్చయించి భాగవతమును వినిపించుటకు సిద్ధమయ్యెను. గోకర్ణుడు ఆసనము నధిరోహించి, కథను ప్రారంభించగా, ప్రేత మచ్చటికి వచ్చి ఏడు కణుపులున్న ఒక వెదురు కఱ్ఱలోని ఒక రంధ్రము గుండా క్రిందికి ప్రవేశించి కథను వినుటకు కూర్చుండెను.

సాయంకాలము కథను నిలిపివేయగా అప్పుడొక విచిత్రము జరిగినది. సభాసదులు చూచుచుండగనే వెదురుకఱ్ఱలోని ఒక కణుపు ధ్వనితో పగిలెను. ఈవిధముగనే రెండవనాటి సాయంకాలమున రెండవ కణుపు, అదేవిధంగా ఏడు దినములలో ఏడు కణుపులను ఛేదించుచు ధుంధుకారి ద్వాదశస్కంధమునకు పవిత్రుడై, ముక్తుడై దివ్యరూపమును ధరించి అందరి ఎదుట ప్రకటిత మాయెను. వెంటనే తన సోదరుడగు గోకర్ణునకు నమస్కరించి ప్రేతయోనినుంచి విముక్తిని చేసినందులకు కృతజ్ఞత సమర్పించెను.

కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములనెడి అరిషడ్వర్గములును, వీటికి ఆధారమైన అజ్ఞానమే వెదురు కఱ్ఱలోని ఏడు కణుపులు. వీనినుండి విడిపడగనే జీవుడు ముక్తుడగును. భాగవత సప్తాహ శ్రవణము జరుగుచుండగా ఎక్కడ తమ నాశనము జరుగునోయని సర్వపాపములు వణకుచుండును.

ధుంధుకారి భాగవత శ్రవణ మహాత్మ్యమును ఈవిధముగా పలికి, అన్నివైపులా, మండలాకారముగా ప్రకాశము వ్యాపించు దివ్యవిమానము రాగానే దాని నధిరోహించెను. ఆ విమానము నధిరోహించి వచ్చిన వైష్ణవులతో గోకర్ణుడు అచ్చట నిర్మలులైన శ్రోతలెందరో ఉండగా, వారి కొరకు విమానము లెందులకు రాలేదని, భేదభావ మెందుకని ప్రశ్నించినాడు.

అంతట హరిదాసులు ఫలభేదమునకు కారణము శ్రవణ భేదమేననియు, శ్రవణములో హెచ్చుతగ్గులు లేకపోయినను, మననములో అంతరములు వున్నవనియు, ధుంధుకారి ఏడుదినముల వరకు ఉపవాసముండి శ్రవణము చేసెననియు, వినిన విషయమును మనన

నిధి ధ్యానలలో నిలిపెననియు చెప్పిరి. నియమములను పాటించినచో శ్రవణఫలము కలుగు ననియు, ఆ శ్రోతలు మరల శ్రీమద్భాగవతమును వినినచో వారికీ వైకుంఠ ప్రాప్తి కలుగుననియు, గోకర్ణుని భగవానుడే స్వయముగా వచ్చి గోలోకమునకు తీసికొని పోవుననియు చెప్పి వెడలిరి.

శ్రావణ మాసమున తిరిగి గోకర్ణుడు భాగవత కథను వినిపించెను. కథ పరిసమాప్తమగు సమయమునకు భగవానుడు ప్రత్యక్షమై గోకర్ణుని ఆలింగన మొనరించుకొనెను. గోకర్ణునితోబాటు శ్రవణ భాగ్యమబ్బిన వారందరు, యోగులు వెడలు విష్ణులోకమునకు పంపబడిరి. అయోధ్యావాసులు శ్రీరామునితో బాటు సాకేత ధామమునకు వెడలినట్లు శ్రీకృష్ణునితో వారందరు దుర్లభమగు గోలోకమునకు గొనిపోబడిరి.

పరమ పవిత్రమగు ఈ కథను ఒక్కమారు ఆలకించినను జీవులు సమస్త పాపరాశిని దగ్ధ మొనర్చుకొని తరింతురు.

సప్తాహ యజ్ఞ విధానము

సనకాదులు యజ్ఞ విధానమును నారదునకు ఈవిధముగా వివరించుచుండిరి.

మొదట జ్యోతిష్కుని పిలిచి ముహూర్తమును నిర్దేశించవలయును. మోక్షప్రాప్తికి కారణములైన భాద్రపదము, ఆశ్వీయుజము, కార్తీకము, మార్గశీర్షము, ఆషాఢము, శ్రావణము కథారంభమునకు యుక్తమైనవి. భాగవత శ్రవణము జరుగుచున్నదను వార్త దేశ దేశాంతరములకు పంపవలయును. ప్రతిదేశము నందున్న హరిభక్తులకు, హరికీర్తన ప్రేమికులకు ఆహ్వానములను పంపవలెను. కథాశ్రవణము ఏ తీర్థము నందైనను, వనము నందైనను లేదా తనయింటి యందైనను చేయుట యుక్తము.

విరక్తో వైష్ణవో విప్రో వేదశాస్త్ర విశుద్ధి కృత్
దృష్టాన్త కుశలో ధీరో వక్తా కార్యోతి నిఃస్పృహః

వేదశాస్త్రములను స్పష్టముగా వ్యాఖ్యానింపగలవాడు, వివిధములగు దృష్టాంతములను ఈయగలవాడు, వివేకి, నిస్సంగుడు, విరక్తుడు, విష్ణుభక్తుడు వక్తగా అగ్రతాంబూలార్హుడు.

ఒక మండప మేర్పరచి శ్రీహరిని స్థాపించి శ్రీకృష్ణు నుద్దేశించి షోడశోపచార విధితో పూజచేయవలెను.

శ్రీమద్భాగవతాఖ్యోయం ప్రత్యక్షః కృష్ణ ఏవహి
స్వీకృతోసి మయానాథ ముక్త్యర్థం భవసాగరే!

శ్రీమద్భాగవత రూపమున నీవు సాక్షాత్తు శ్రీకృష్ణుడవు. భవసాగరమును దాటుటకు నిన్ను శరణంటిని అని స్తుతింపవలెను.

సూర్యోదయము నుంచి ఆరంభించి మూడున్నర జాముల వరకు ప్రవచింపవలెను. శక్తియున్నచో నిరాహారులై సప్తాహము వుండవలెను. దీక్షతో సప్తాహ శ్రవణము చేయవలెను. విష్ణుభక్తి దీక్షలేని వారు కథాశ్రవణమునకు అధికారులు కారు.



దుంధుకారిని ఉద్ధరించిన గోకర్ణుడు

శౌనకా! మహామునులగు సనకాదులు ఒకవారము వరకు మోక్షప్రదాయినియైన భాగవతకథను ప్రవచనము చేసిరి. కథాంతమున జ్ఞాన వైరాగ్యములకు, భక్తికి పుష్టి చేకూరినది.

తన కోరిక నెరవేరుట వలన సంతోషించిన నారదుడు గద్గద స్వరముతో సనకాదులు దయతో తనను అనుగ్రహించినందులకు కృతజ్ఞతాంజలి సమర్పించెను. వైకుంఠధాముడగు శ్రీకృష్ణుని అందించు శ్రీమద్భాగవత కథాశ్రవణము సర్వధర్మముల కంటె శ్రేష్ఠమైనదిగా తలపోసెను.

సూతుడు పలుకుచున్నాడు: శౌనకా! నారదుడిట్లు పలుకుచుండగనే కృష్ణపాదారవింద భ్రమరమైన శుకయోగీంద్రుడు అచ్చటికి విచ్చేసెను. పరమతేజస్వియగు శుకుని జూచి సభాసదులందరు లేచి ప్రణామముల నందించి ఒక ఉన్నతాసనమున అధివసింపజేసిరి. అంతట శుకయోగీంద్రులు అద్భుత సందేశాన్ని అందిస్తున్నారు.

శుకుడు ప్రవచనమును కొనసాగించు చుండగనే సభలోనికి ప్రహ్లాదుడు, ఉద్ధవుడు, అర్జునుడు ఆదిగాగల భక్తులతో శ్రీహరి ప్రత్యక్షమయ్యెను. పరమాత్మను సంకీర్తనలతో అర్చించ హరి ప్రసన్నుడై

మత్తోవరం భావవృత్తా ద్వృణుధ్వం ప్రీతః కథాకీర్తన తోస్మి సాంప్రతమ్
శ్రుత్వేతి తద్వాక్యమతి ప్రసన్నాః ప్రేమార్ద్ర చిత్తా హరి మూచిరేతే ॥

"మీ భక్తిభావము నన్ను మీ వశము చేసినది. వరములను కోరు" మని పలికిన భగవానుని వాక్కులకు పరవశులై భగవానుని భవిష్యత్తులోగూడ ఎక్కడ సప్తాహశ్రవణము జరుగునో తప్పక అచ్చోటకు రావలసినది అని అభ్యర్థించిరి. 'అట్లే అగుగాక!' అని పలికి హరి అంతర్ధాన మయ్యెను.

తరువాత నారదుడు నారాయణునికి, శుకాది తాపసులకు ప్రణమిల్లెను. శుకుడు భక్తిని ఆమె పుత్రులతోబాటు తన శాస్త్రమున నిలిపెను.

శౌనకుడు సూతుని ప్రశ్నించుచున్నాడు. శుకుడు పరీక్షిన్మహారాజునకు, గోకర్ణుడు ధుంధుకారికి, సనకాదులు నారదునకు ఏయే సమయములందు ఈ గ్రంథమును వినిపించినదీ తెలియజేయుమని అడిగెను.

సూతుడు చెప్పుచున్నాడు: శ్రీకృష్ణుడు తన లోకమునకు వెడలిన పిమ్మట కలియుగమున ముప్పది సంవత్సరములు పైగా గడచిన పిమ్మట భాద్రపద శుక్ల నవమినాడు శుకుడు, పరీక్షిత్తు కథ వినిన తరువాత కలియుగమున రెండు వందల సంవత్సరములు గడిచిన పిమ్మట ఆషాఢ శుద్ధనవమినాడు గోకర్ణుడు, అటుపిమ్మట ఇంకను ముప్పది సంవత్సరములు గడచిన పిమ్మట కార్తీక శుక్లనవమినాడు సనకాదులు కథనారంభించిరి.

పాపరహితుడవగు శౌనకా! ఈ కలియుగమున భాగవతకథ భవరోగమును రూపుమాపు నట్టిది. కృష్ణునికి ప్రియమైన ఈ కథామృతము భక్తిని వృద్ధిచేయును. ముక్తిని ప్రసాదించును.

చతుశ్శ్లోకీ భాగవతము

(Bhagavata in a Nutshell)

అహమమే వాసమే వాగ్రే నాన్యద్య త్సద సత్పరమ్
పశ్చాదహం యదేతచ్చ యోఽవ శిష్యేత సోఽస్మ్యహం

"సృష్టికి పూర్వము నేనొక్కడనే యుంటిని. నాకన్యముగ సత్తులేదు. అసత్తును లేదు. సృష్టికి తరువాత గూడా నే నొక్కడనే యున్నాను. ప్రళయము నందు కూడా నేనే యున్నాను.

Before the creation I alone existed. There was nothing, sat or Asat. I am that which remains after dissolution.

ఋతేర్థం యత్ప్రతీ తీ యేత నప్రతీయేత చాత్మని
తద్విద్యా దాత్మనో మాయాం యథాభాసో యథాతమః

"నిజానికి లేనిదే యైనను ఆత్మయందు ఏది ప్రతీయమాన మగుచున్నదో, నిజానికి ఏది ఆత్మను అంటలేదో దానిని నా మాయగా తెలియుము.

Understand that to be Maya or illusion which is devoid of any purpose, which is not to be found in the self and which is unreal like light and darkness.

యథా మహాన్తి భూతాని భూతేషూచ్చా వచేష్వను
ప్రవిష్టా న్యప్రవిష్టాని తథా తేషు న తేష్వహమ్


"మహా భూతములు భౌతికములైన ఘట పటాదులయందు ప్రవేశించినను ప్రవేశింపనట్లే యుండును. అలాగే నేను గూడ సర్వభూతముల యందు ప్రవేశించి యుండినను ఆత్మ రూపముతో సర్వగతుడనై యున్నాను.

As the primary elements are amalgamated with one another and also seperate from one another at the same time, so I pervade the whole universe and am also seperate from it.

ఏతావదేవ జిజ్ఞాస్యం తత్త్వ జిజ్ఞాసు నాత్మనః
అన్వయ వ్యతిరేకాభ్యాం యత్స్యా త్సర్వత్ర సర్వదా!

"సర్వత్రా, సర్వదా ఏది బోధితమై యుండునో అట్టిదానిని అన్వయ వ్యతిరేక పద్ధతుల ద్వారా ఆత్మయని గ్రహింపుము."

The aspirants should, by the methods of Anvaya-vyatireka, know that thing which exists always and everywhere.


1



ఉపోద్ఘాతము

ఇది ప్రథమ స్కంధము.

శ్రీమద్భాగవతము ద్వాదశ స్కంధ సముల్లసితమైన సద్గ్రంథము. భాగవతము సాక్షాత్తు భగవానుని రూపమై యున్నది. శ్రీకృష్ణుని పాదముల మొదలు జానువుల వరకు ప్రథమ స్కంధమై యున్నది.

ఈ స్కంధమున అధికారి లక్షణము తెలుపబడినది. భాగవతము నాలకించుటకు అధికారి ఎవరో ఈ స్కంధమున స్పష్ట మొనర్పబడినది. గ్రహించు పాత్రను బట్టి జలము లభించునట్లు, శిష్యుని అంతఃకరణమును బట్టి గురుదేవుని అనుగ్రహము లభించుచుండును.

అధమ శిష్యులకు అపగతి మిగులుతుంది. మధ్యమ శిష్యులకు ఉపగతి లభిస్తుంది. ఉత్తమ శిష్యులకు సమగతి ప్రాప్తిస్తుంది.

ఊర్ధ్వ భూమికల నధిరోహించు ఉత్తమ శిష్యులు ధన్యాత్ములు. మార్గమున చరించు మధ్యమ శిష్యులు మాననీయులు. దారి తప్పిన అధమ శిష్యులు దౌర్భాగ్యులు.

భాగవతమున పరీక్షిన్మహారాజు ఉత్తమ శ్రోత. ప్రతిజీవియును ఒకనాడు పరీక్షిత్తుని వలె కాలసర్పము నోటపడువారే. మృత్యువాత బడువారే. ఈ విపత్తు నుండి విముక్తులు కావలె ననిన అమృత పానము చేయుటయే ఏకైక మార్గము. అమృత మనగా దేవతలు పానము చేయునది గాదు. దేవతలకు సైతము లభించనిది. అదియే భాగవతామృతము.

అవసరము, ఆసక్తి, అర్హత ఈ మూడు లక్షణములు అధికారిలో యుండినచో శ్రవణ ఫలము తప్పక లభించును. పరీక్షిత్తుని వలె అధికారులగు వారికి భాగవత శ్రవణ ఫలము లభించును. పరీక్షిత్తుని హృదయమున శ్రీహరి విరాజిల్లుటయే భాగవత శ్రవణ ఫలము. ఎవరు పరీక్షిత్తుని వలె అర్హులగుదురో వారి హృదయమున పరమాత్మ విరాజిల్లును.

సదాసేవ్యా సదాసేవ్యా శ్రీమద్భాగవతీ కథా
యస్యాః శ్రవణమాత్రేణ హరిశ్చిత్తం సమాశ్రయేత్

“శ్రీమద్భాగవత కథను సదా సేవించవలెను. సదా స్మరింపవలెను. దీనిని శ్రవణము చేయగా శ్రీహరి శ్రోత హృదయమున విరాజిల్లును.”

అజ్ఞానచీకట్లు ముసిరిన మానవ హృదయాలలో జ్ఞానజ్యోతిని వెలిగించుకొని, ఆనందయాత్ర చేయుటకు భాగవతమే ఏకైక మార్గమై యున్నది. అధికారి లక్షణములను బొంది, అధ్యయనమును సాగించు వారలు ఆప్తకాములై తరింపగలరు.

ఇది ఆరంభము. ఇక ప్రారంభించండి.

చైతన్య భాగవతము

ప్రథమ స్కంధము

మంగళాచరణము

ప్రత్యూషమున ప్రభాకరుని నుండి కదలిన ప్రద్యోతముచే స్పృశింపబడి పద్మము ప్రఫుల్లమైనది. ప్రమోద భరితమై పద్మము వికసించింది. అతులిత హృదయ అంబారీలో ఆసీనుడైయున్న అప్రమేయ అధిపతిచే స్పృశింపబడి ముముక్షుజన చిత్తము పూచేదెపుడు? అభిమంత్రించిన అహర్పతిని ఆలింగన మొనర్చుకొనే శుభఘడియ ఎప్పుడు? నిశ్శ్రేయసుని నిలయానికి చేరే ప్రయత్నములో నాంది ఎలా జరగాలి? ఉద్గతియే తెలియని వానికి ఉషస్సు ఎలా గోచరిస్తుంది? కాలము తెలియని చోటికి నడిపించే కాకవెలుగు ఎవరు? ఇవన్నీ చర్చించాలంటే నీవు అర్చకుడవై యుండాలి. సమర్చనలో నిత్యసత్యాలు ద్యోతకమవుతాయి. అప్పుడే సాధన యనెడి నిస్తుల నిశ్రేణిపై పయనించి నిరంజన ధామమును చేరగలము. ఈ మహాప్రయత్నములో ప్రథమ సాధనము వందనము. వంద్యుని గాంచి వందన మొనర్చినపుడే హృదయ నందనోద్యాన వనములో కాలిడగలము. కంటకములు లేని, ఆటంకములుండని బాటలో పయనించగలము. ఈ బాట మంగళప్రదము. ఆచరణీయమగు ఈ బాటలో గమనము సర్వులకు ఆదర్శము. ఇది శుభకరమైన ఆచరణము. మంగళాచరణము.

చంద్రుని గాంచి సాగరము ఉప్పొంగునట్లు, సూర్యోదయమున మయూరము స్పందించినట్లు, వాయుస్పర్శచే వృక్షములు చలించినట్లు, భగవంతుని వందనములో భక్తుడు పరవశిస్తాడు. వందనముతో ఆరంభముగాని గ్రంథము వ్యర్థము.

గ్రంథారంభమున మంగళాచరణము జరుగును. ఇక్కడే ప్రథమునికి ప్రథమ వందనము సమర్పించబడును. వందనము చందనము వలె చల్లనిది. వందనము బ్రతుకులో అందమును నింపును. అజ్ఞానము నంతమొందించును. అహంకారమును ధ్వంసమొనర్చును. అభిమానమును నిర్వీర్య మొనర్చును. వందనము భగవానుని బంధించును. నమస్కార మనెడి సుగుణము సంస్కారులనే వరించును.

"నమ ఇతి ద్వే అక్షరే" నమ యనునవి రెండు అక్షరములు. "న" యనగా 'లేదు' అని అర్థము. 'మ' యనగా అహంకారము. "నమ" యనగా 'అహంకారము లేదు' అని భావము. అహంకార రహితులై చరించువారిని పరమాత్మ ఆశీర్వదించును. వందన భక్తులు సదా అభివందనీయులే యగుదురు.

నమ ఇత్యేవయో బ్రూయా న్మద్భక్త శ్రద్ధయాన్వితః
తస్యాక్షయో భవే ల్లోకః శ్వపాకస్యాపి నారద

"నారదా! శ్రద్ధాయుతుడై, నాకు భక్తుడై ఎవడు నాకు నమస్కరించునో వాడు చండాలుడైనను అక్షయలోకమును బొందుచున్నాడు" అని పరమాత్మ నారదునికి చెప్పి యున్నాడు.

నందనందనుని రసమయగాథ శ్రీమద్భాగవతమును ప్రారంభించు శుభసమయాన శిష్టాచార సంప్రదాయమును పాటించుచు వ్యాసదేవుడు మంగళాచరణము చేయుచున్నాడు. విషయ, సంబంధ, ప్రయోజన, అధికారులను తెలుపుచున్నాడు.

జన్మాద్యస్య యతోఽన్వయాది తరత శ్చార్థేష్వభిజ్ఞః స్వరాట్
తేనే బ్రహ్మ హృదా య ఆదికవయే ముహ్యన్తి యత్సూరయః
తేజోవారిమృదాం యథా వినిమయో యత్ర త్రిసర్గోఽమృషా
ధామ్నా స్వేన సదా నిరస్త కుహకం సత్యం పరం ధీమహి ।

ఈ ప్రపంచము యొక్క సృష్టిస్థితిలయాదులు ఎవని వలన ఏర్పడుచున్నవో, ఎవడు జగత్కార్యముల యందభిజ్ఞుడై యుండెనో, ఎవడు స్వప్రకాశ చైతన్యరూపుడో, ఎవడు బ్రహ్మదేవునకు వేదము లందించెనో, ఎవడు దేవతలను, బుధజనులను మోహింప జేయునో, ఎండమావులలో నీరులేని విధముగా ఎవనిలో అన్యముగా తెలియు అసత్యములు నిజానికి లేనివో, ఎవడు కాపట్యము నెరుగడో అట్టి సత్య స్వరూప లక్షణుడగు పరమేశ్వరుని ధ్యానింతుము.

సీ॥ విశ్వజన్మస్థితి విలయంబు లెవ్వని వలన నేర్పడు ననువర్తనమున
వ్యావర్తనమున గార్యములం దభిజ్ఞుడై తాన రాజగుచు జిత్తమున జేసి
వేదంబు లజునకు విదితముల్ గావించె నెవ్వడు బుధులు మోహింతు రెవ్వ
నికి నెండమావుల నీట గాచాదుల నన్యోన్య బుద్ధి దా నడరునట్లు
ఆ॥ త్రిగుణ సృష్టి యెందు దీపించి సత్యము భంగి దోచు స్వప్రభానిరస్త
కుహకు డెవ్వ డతని గోరి చింతించెద ననఘు విశ్వమయుని ననుదినంబు

ప్రథమ శ్లోకమున పరమాత్మను ధ్యానించి ద్వితీయ శ్లోకమున వస్తునిర్దేశమును గావించుచున్నారు. భాగవత గ్రంథము యొక్క ప్రాశస్త్య ప్రభావాదులను, ప్రతిపాద్య విషయమును ఈ వస్తునిర్దేశము నందు తెలుపుచున్నారు.

ధర్మః ప్రోంఝితకైతవోఽత్ర పరమో నిర్మత్సరాణాం సతాం
వేద్యం వాస్తవ మత్ర వస్తు శివదం తాపత్రయోన్మూలనమ్
శ్రీమద్భాగవతే మహామునికృతే కిం వా పరైరీశ్వరః
సద్యో హృద్యవరుధ్యతేఽత్ర కృతిభిః శుశ్రూషుభిస్తత్క్షణాత్ 2

మహాముని యగు వ్యాసునిచే రచింపబడిన శ్రీమంతమగు ఈ భాగవత గ్రంథమునందు మాత్సర్య రహితులగు సత్పురుషుల ఉత్కృష్టమైన భక్తిస్వరూపము వర్ణింపబడినది. ఇది ఆధ్యాత్మికాది తాపత్రయములను నశింపజేయును. జీవగమ్యమై యుండును. సత్యమై యుండును. శుభప్రదమై యుండును. వ్యాసునిచే రచింపబడిన భాగవతముండగా అన్య గ్రంథములయొక్క అవసర మేముండును? శివరూపమైన ఈ భాగవతమును భక్తియుతులై ఎవరు శ్రవణము చేయుదురో అట్టివారి పవిత్ర హృదయములలో పరమాత్మ వసించును.

సీ॥ శ్రీమంతమై మునిశ్రేష్ఠ కృతంబైన భాగవతంబు సద్భక్తితోడ
వినగోరు వారల విమల చిత్తంబుల జెచ్చెర నీశుండు చిక్కుగాక
యితర శాస్త్రంబుల నీశుండు చిక్కునె మంచివారలకు నిర్మత్సరులకు
గపట నిర్ముక్తులై కాంక్ష సేయక యిందు దగిలి యుండుట మహాతత్త్వబుద్ధి
తే॥ పరగ నాధ్యాత్మికాది తాపత్రయంబు నడచి పరమార్థ భూతమై యధిక సుఖద
మై సమస్తంబు గాకయు నయ్యునుండు వస్తు వెఱుగంగ దగు భాగవతము నందు

భాగవతము నందు మోక్షమే కేంద్రవిషయమై యున్నది. పరమపురుషార్థమైన ముక్తిని భాగవతము ప్రతిపాదించుటచేత పరమాత్మ కన్నను అన్యమైన విషయముల యందు భాగవతధర్మము ఆసక్తిని జూపదు. అన్యము లేనపుడు అహంకార ముదయించే అవకాశమే లేదు. అహంకార మణగిన వ్యక్తిలో మాత్సర్యముండదు. అందుచేత భాగవత భక్తులు నిర్మత్సరులు, నిరాడంబరులై శోభిస్తూ ఉంటారు.

ఏకమైన చిత్స్వరూపమును, భాగవతము ప్రతిపాదించుచున్నందున ద్వైతము నంగీకరించనిదియై తాపత్రయములను ధ్వంసమొనర్చుచున్నది. తాపత్రయములు లేని స్థితి తాపసులకు లభించును. తాపసులు దేనినైతే బొందెదరో భాగవత ధర్మము నాచరించు భక్తులు అట్టి ఉత్తమగతినే బొందెదరు. ఇదియే పొందదగినదియై యున్నది అని వ్యాసులవారు వస్తునిర్దేశమును చేయుచున్నారు.

యస్మి న్విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతి

"బ్రహ్మమును పొందినచో సమస్తమును బొందినట్లే యగుచున్నది" అని శాండిల్యోపనిషత్తు ప్రవచించినది.

భాగవతము ఇట్టి బ్రహ్మజ్ఞానమును ప్రసాదించుచున్నది. బ్రహ్మము క్రొత్తగా పొందబడునది గాదు; స్వరూపముగా నున్నదియే. బ్రహ్మము అగోచరమై, అనుభవమునకు అందకపోవుటకు మనసులోని మాలిన్యమే కారణమై యున్నది. మనోమాలిన్యము శుద్ధిగానిచో బ్రహ్మజ్ఞానము అందదు. అందుచేత అనేక విధములైన భక్తి సాధనలను భాగవతము ప్రవేశపెట్టింది. కానీ భాగవతము యొక్క ముఖ్యఫలము మోక్షమే. అలా గానిచో భాగవతము ఉండగా అన్యశాస్త్రముల అవసర మేమున్నది? అని బ్రహ్మ సూత్రములను రచించిన వ్యాసుడెందులకు చెప్పెను?

శ్రీమద్భాగవతే మహాముని కృతే కిం వా పరైరీశ్వరః

"వ్యాసమహర్షి రచించిన భాగవతము ఉండగా అన్యశాస్త్రముల యొక్క అవసర మేమున్నది?"

కనుక ఎవరయితే భాగవతమును శ్రవణము చేయుదురో, ఆచరింతురో వారు పరమాత్మ కృపకు పాత్రులై తరింతురు. పరమాత్మను హృదయమున సాక్షాత్కరించు కొందురు.

ఈ విధముగా ప్రథమ శ్లోకమున ధ్యానమును, ద్వితీయ శ్లోకమున వస్తువిర్దేశమును తెలిపి, తృతీయ శ్లోకమున ఆశీర్వాదము నందించుచున్నారు.

నిగమకల్పతరోర్గళితం ఫలం శుకముఖాదమృత ద్రవ సంయుతమ్

పిబత భాగవతం రసమాలయం ముహురహో రసికా భువి భావుకాః

"భగవద్భావ రసజ్ఞులారా! శ్రీమద్భాగవతము వేద కల్పవృక్ష విగళితమైన మహాఫలము. శుకముఖము నుండి ద్రవించిన దగుటచే అమృత రసస్వరూపమై యున్నది. మఱల మఱల ఈ దివ్యమగు భాగవత రసమును పానము చేయుము."

ఆ॥ వేదకల్పవృక్ష విగళితమై శుకముఖ సుధాద్రవమున మొనసియున్న
భాగవత పురాణ ఫల రసాస్వాదన పదవి గనుడు రసిక భావవిదులు

ఉపనిషత్తులనెడి కల్పవృక్షము నుండి పండిన అమృతఫలమే శ్రీమద్భాగవతము. ఈ ఫలములో తొక్క, పిక్కలవంటి త్యాజ్యవస్తువులు మచ్చుకైనను లేవు. ఇది చిలుకకొట్టిన ఫలము. శుకముఖ గతమగు మధురామృత ద్రవముతో మిళితమై అమృతరస స్వరూపమై యున్నది. ఇది దేవతలు పానముచేయు అమృతము గాదు. శుకమహర్షి పరీక్షిత్తునకు భాగవతమును బోధించుచుండగ దేవతలు అమృతపాత్రను గొనివచ్చి, వారి అమృతమును స్వీకరించి భాగవతామృతమును ప్రసాదింపుమని ప్రార్థించిరి. భాగవతఫల రసాస్వాదనము భువియందే లభ్యమగును గాని దివిలో లభించదు.

ఈ భాగవతామృతమును పానముచేసి పరీక్షిత్తుడు మృత్యువును దాటి అమృతత్వమును బొందెను. కనుకనే మాటిమాటికి ఈ భాగవత మధురామృతమును పానము చేయుమని వ్యాసులవారు తెలుపుచున్నారు. అమృతరూపమైన భాగవతమును పానము చేయువారు అమృతస్వరూపు లగుదురు.

శ్రీమద్భాగవతము వాగ్రూపమగు భగవదవతారమని బుధజనుల అభిప్రాయము. భాగవతమును అమరగాథ యనిగూడ అందురు. కాశ్మీరదేశము నందలి అమరనాథ గుహాలో బోధించబడినందున దీనికి ఆ పేరువచ్చెనని చెప్పుచుందురు. ఒకనాటి రాత్రి పరమేశ్వరుడు అమరనాథ గుహాలో పార్వతీదేవికి శ్రీమద్భాగవతమును బోధించినట్లు కాశిక సంహితలో తెలుపబడియున్నది.

కథారంభమునకు ముందుగా భగవానుని ప్రార్థించుచు మంగళాచరణము జేయుట జరిగినది. పరమాత్మ కృపను బొందుటకై జరిపిన మంగళాచరణము నందు భగవంతునికి వందన మొనర్చుటయే ప్రధాన విషయము. ప్రారంభశ్లోకము వందనముతో మొదలైనది. భాగవతమును సమాప్తిచేయుచు చివరి శ్లోకములో గూడ వ్యాసదేవుడు వందనమునే సమర్పించినాడు.

ప్రణమో దుఃఖ శమన స్తం నమామి హరిం పరమ్

"సమస్త దుఃఖములను పోగొట్టెడి పరమపురుషుడగు శ్రీహరికి నమస్కారము" అని పలుకుతూ భాగవతమును సమాప్తము జేసెను.

ఇచ్చట దుఃఖములను ప్రసాదింపవద్దని చెప్పలేదు. దుఃఖములను పోగొట్టుమని ప్రార్థించెను. దుఃఖము ప్రారబ్ధాధీనము. దాని నెవ్వరూ తప్పించుకొనలేరు. దుఃఖము తెలియని ప్రసాదస్థితి మనస్సున కబ్బినచో దుఃఖము ద్రవీభూతమగును.

బుద్ధుడు, శంకరుడు, రామకృష్ణ పరమహంస, వివేకానందస్వామి మొదలైన మహాత్ములెవరూ బాధలకు దూరం కాలేదు. కానీ వారెవ్వరూ బాధల ననుభవించలేదు.

"మీరు శస్త్ర చికిత్సను బొందినచో ఆరోగ్యవంతు లగుదురు" అని వైద్యులు రామకృష్ణ పరమహంసతో అనిరి. "నా మనస్సును జగన్మాత కొసగినాను. ఆ విషయమును నేనెలా ఆలోచింపగలను? దేహమును గూర్చి నేనెలా ఆలోచించేది? దేవి కొసగిన చిత్తమును తిరిగి రక్తమాంసయుతమగు దేహమునకు ఎలా సమర్పించేది? నేను ఆనందముగనే యున్నాను" అని సమాధాన మొసగెను.

దుఃఖము మనిషిని బాధించదు. దుఃఖమునకు సంబంధించిన భావనయే బ్రతుకును శోకమయం జేస్తుంది. దుఃఖమనునది జీవితములో లభించే మహదవకాశము. అగ్ని ఇనుమును మెత్త బరచునట్లు దుఃఖము జీవిని నిర్మలుని జేస్తుంది.

దుఃఖము భగవంతుని జ్ఞాపకము జేస్తుంది. సుఖము పరమాత్మను మరపిస్తుంది. భగవంతుని స్మరణకు దెచ్చు దుఃఖము కూడా మంగళప్రదమే. దుఃఖితులగు వారు సదా పరమాత్మనే స్మరించుదురు గాన దీనదయాళుడగు భగవానుడు వారి వద్దనే యుండును. కృష్ణగతచిత్తులైన పాండవులు దుఃఖితులై యున్నప్పుడు, బాధల ననుభవించినపుడు శ్రీకృష్ణుడు వారితో కలసియే యుండెను. పాండవులకు రాజ్యము లభింపగనే శ్రీకృష్ణుడు వారికి దూరమయ్యెను. తనకు ప్రేమపాత్రులైన గోపికలను తరింపజేసేందుకే శ్రీకృష్ణుడు వ్రజపురమును విడచివెళ్ళెను. శ్రీకృష్ణుని విరహములో వినష్టచిత్తులైన గోపికలు విశిష్టమైన

మోక్షమును బొందిరి. అందుచేత భక్తులు దుఃఖమును ఆహ్వానింతురేగాని దుఃఖమునకు భయపడరు.

ఒకనాడు కుంతీదేవి తీవ్రముగా వ్యథ జెందెను. పరమ పవిత్రులు, ధర్మాత్ములునగు తన బిడ్డలు అరణ్యముల పాలగుటయు, దురాత్ములగు దుర్యోధనాదులు రాజ్యమును పాలించుటయు గాంచి కుంతీదేవి తీవ్రముగ కలత చెందెను. భగవానుడైన శ్రీకృష్ణుని ప్రార్థించెను. కన్నీటితో స్వామిని తదేకముగ చింతించెను. కుంతీ ప్రార్థన నాలకించి స్పందించిన శ్రీకృష్ణుడు ఆమె ముందు ప్రత్యక్షమయ్యెను. అనుగ్రహించెను.

"అత్తమ్మా! నేను నీ ప్రార్థన నాలకించి నీ వద్దకు వచ్చితిని. ఏమి వరము కావలెనో కోరుకొనుము" అని చెప్పెను.

"కృష్ణా! నీ అనుగ్రహముచే నా జన్మ ధన్యమైనది. సదా నన్ను బాధలు ఆవరించి యుండునట్లు అనుగ్రహింపుము" అని ప్రార్థించెను.

"అమ్మా! నీ ప్రార్థన విచిత్రముగా యున్నది. అందరు సుఖాభిలాషులై నన్ను ప్రార్థింతురు. కానీ నీవు దుఃఖమును ప్రసాదింపుమని నన్ను అర్థించుచున్నావు. విచిత్రమైన నీ విన్నపము నా కవగత మగుటలేదు" యనెను.

"యదుభూషణా! చిత్స్వరూపుడవైన నీకు అర్థముగాని విషయమేముండును? తండ్రీ! హస్తినాపురంలో హంసతూలికా తల్పముపై శయనించినపుడు నీవు జ్ఞాపకము రాకుంటివి. భోగముల మధ్య నిన్ను స్మరించే భాగ్యమునకు నా మనస్సు నోచుకోలేదు. ఈ నాడు భాగ్యహీన నైనందున నిన్ను స్మరించే భాగ్యమునకు నోచుకున్నాను. నిన్ను మరపించే సంపదల కన్నను నిన్ను స్మృతికి తెచ్చే బాధలే శ్రేయస్కరములని నా అభిప్రాయము. కనుక బాధలనే నా కనుగ్రహింపుము. బాధలు నా చిత్తమునకు ప్రసన్నతను గల్పించినవి" అనెను. కనుకనే మహాత్ములందరు బాధలను బోధలుగ గ్రహించినారు.

దివ్యారంభము

పరమపవిత్రమైన నైమిశారణ్యమున శ్రీహరిని బొందుటకై సహస్రవర్ష పరిమితమగు సత్రయాగమును చేయుటకు శౌనకాది మహర్షులు ఉపవిష్టులై యుండిరి. అచ్చటికి వ్యాసభగవానుని శిష్యుడు, పరమభాగవతోత్తముడు నగు సూతమహర్షి అరుదెంచెను.

అది ప్రాతఃకాల సంధ్యాసమయము. ప్రత్యక్ష నారాయణుడగు ప్రభాకరుడు ప్రవేశించుటకు సిద్ధపడుచున్నాడు. ఆయన రాకను ముందుగా తెలుపుతూ మలయమారుతము వీచుచున్నది. చల్లటి వాతావరణములో గళము విప్పి కోయిలలు మెల్లగ కూయుచున్నవి. పరిసర ప్రాంతముల నుండి దివ్యమైన సుమ పరిమళము వెదజల్లబడుచున్నది. మధుర సుమములలోని మకరంద మాధుర్యము నాస్వాదించి, పరవశించిన భృంగకన్యకలు శృంగారముగ నర్తించుచూ, మంజుల గానము లొనరించుచున్నవి. మయూరములు మైమరచి నృత్యము చేయుచున్నవి.

పవిత్రమైన ఆ ఉషోదయమున శౌనకాది మహర్షులు నిత్యనైమిత్తిక హోమాదుల నాచరించి, సుఖాసీనుడైయున్న సూతమహర్షిని చేరి, నమస్కరించి ఇట్లనిరి:

"మహాత్మా! పురాణేతిహాసములను, ధర్మశాస్త్రములను గురువుకడ నీవు చక్కగ అభ్యసించితివి. ఆ గ్రంథరాజములను గూర్చి ప్రబోధించుచుందువు. వేదవ్యాసాది మునులు దర్శించిన అమోఘమైన విషయములను నీవు దర్శించితివి. అనఘా! వాటిని మాకు బోధింపుము" యనిరి.

అధికారియగు శిష్యునికి గురువుల వద్ద అభ్యసించిన విషయములే బుద్ధిలో స్థిరముగ నిలుచును. గురువు అనుగ్రహమునకు నోచుకోని వారలు ఎన్ని గ్రంథముల నభ్యసించినను జ్ఞానమును పొందలేరు. సూతమహర్షి గురువులను సేవించి తత్త్వమును గ్రహించెను. అంతియే గాదు. దానిని గూర్చి ఉపన్యసించుచుండెను.

తాను తరించడమే గాక ఇతరులను గూడ తరింపజేయువారు పుణ్యాత్ములు. వారే ధర్మాత్ములు. మహాత్ములు. వారు పాపరహితులు. వారి బోధల నాలకించువారు గూడ పాపరహితులే యగుదురు. శౌనకాది మునులు సూతుని "అనఘా" యని పిలిచిరి. అనఘుడనగా పాపరహితుడని భావము.

పాపమును పోగొట్టుకొనినవాడు గురువు. పాపమును పోగొట్టుకొనుటకు యత్నించువాడు శిష్యుడు. పాపవినిర్ముక్తుడై నందున గురువు పాపాచరణమును జేయడు. శిష్యుడు పాపప్రక్షాళనము కొరకు యత్నించువాడై యున్నందున పాపమును జూచి భయపడును.

పాపి భగవంతునకు దూరుడగును. పాపము చేయువాడు నిర్మల బుద్ధిని కలిగియుండలేడు. పాపి తన మనస్సును గాంచి తానే దుఃఖితుడగుచుండును. భగవంతుని చేరవలెననెడి ప్రయత్నమును సాగించనివాడే నిజమైన పాపి యగును. చీకటిలో వస్తువులు గోచరింపని విధముగ పాపి మనసులో పరమాత్మ గోచరింపడు. భగవత్కథాశ్రవణము భగవంతుని యందు ఆసక్తిని వృద్ధిచేయాలి. కొందరు ఉపన్యాసములను శ్రద్ధతో ఆలకించుచుందురు. కాని ప్రవర్తనము నందు మార్పునొందలేక యుందురు. ఈ దురవస్థకు వారిలోని పాపమే కారణము.

సూర్యుని సన్నిధిలో అంధకారము అదృశ్యమగు లాగున పరమ పవిత్రులగు గురుశిష్యులుండుచోట పాపములు నిలువనేరవు. పాపరహితుడైనందున గురువు పాపమునకు దూరుడు. పాపమును జూచి భయపడుచున్నందున శిష్యుడు పాపాచరణము నెరుగడు. కనుక వీరిరువురు వసించు స్థలము పాపరహితమై, పుణ్యప్రదమై యుండును. కనుకనే ఆశ్రమ ప్రదేశములను పుణ్యక్షేత్రములుగ, తీర్థరాజములుగ వర్ణించుచుందురు.

కానీ కొందరి నేత్రములు ఆశ్రమాలను, ఆలయాలను దర్శించేందుకు గూడ నోచుకోవు. డబ్బుంటే సినిమా చూడగలరు. కానీ పుణ్యముంటేనే ఆశ్రమాలను, ఆలయాలను దర్శింపగలరు.

అల్పాయుష్కులతో, అల్పబుద్ధులతో, అధములతో కలియుగము నిండియున్నది. ఇట్టి వారిని తరింపజేయు బోధ తక్షణ కర్తవ్యమై యున్నది. అట్టిదానిని బోధింపుమని శౌనకుడు సూతుని అర్థించుచున్నాడు.

చ॥ అలసులు, మందబుద్ధి బలు లల్పతరాయువు లుగ్ర రోగ సం
కలితులు, మందభాగ్యులు సుకర్మము లెవ్వియు జేయజాలరీ
కలియుగ మందు మానవులు కావున నెయ్యది సర్వసౌఖ్యమై
యలవడు నేమిటం బొడము నాత్మకు శాంతి మునీంద్ర చెప్పవే!

ఈ ప్రపంచమున పొందేందుకు ఎన్నో ఉన్నవి. అవి ఇవి యననేల? పరమాత్మ గూడ లభించును. కానీ సోమరికి ఏమియును లేదు. సోమరులు, మందభాగ్యులు నగు మనుజులు నిర్భాగ్యులై యుందురు. అట్టి వారిని గూడా భాగవతము తరింపజేయును. బంధములను భాగవతము తొలగించును. భయము నంతమొందించును. మనో నైర్మల్యమును ప్రసాదించును. పూర్ణశాంతి నొసంగును.

సీ॥ ఎవ్వని యవతార మెల్లభూతములకు సుఖమును వృద్ధియు సొరిదిజేయు
నెవ్వని శుభనామ మేప్రొద్దు నుడువంగ సంసార బంధంబు సమసిపోవు
నెవ్వని చరితంబు హృదయంబు జేర్పంగ భయమంది మృత్యువు పరువువెట్టు
నెవ్వని పదనది నేపారు జలములు సేవింప నైర్మల్య సిద్ధి గలుగు
తే॥ దపసు లెవ్వని పాదంబు దగిలి శాంతి తెరువు గాంచిరి వసుదేవ దేవకులకు
నెవ్వ డుదయించె దత్కథ లెల్ల వినగ నిచ్చ వుట్టెడు నెఱిగింపు మిద్ధ చరిత

భగవత్కథలు ఆపాతమధురములు. సాధారణముగ తీపి నెక్కువగా తినినచో వెగటు పుట్టును. కానీ భగవానుని గాథలలో నిండియున్న తీపి వెగటును కలిగించదు. ఆరగించు కొలది రుచి నధిక మొనర్చుచుండును. ప్రతిక్షణ వర్ధమానమై, అనుభవరూపమై యుండును. చెట్టు మొదలు యందు నీరు పోసినచో చెట్టు పచ్చగా పెరుగును. అలాగే కర్ణములయందు కథామృతమును పోసినచో బ్రతుకంతయు తేజోవంత మగును. భక్తి వృద్ధియగుచుండును.

దైవభక్తి దేహభ్రాంతిని తొలగించును. శాశ్వతుడైన పరమాత్మ జ్ఞానమును గుర్తింపజేసి అశాశ్వతమైన దేహముపై నున్న భ్రాంతిని అంతమొందించును. కథాశ్రవణము కామక్రోధముల నంతమొందించును. మనస్సులో నిర్మల భావములను నిలుపును. మోక్షమునకు ముఖ్య ప్రతిబంధకమగు సంశయములను తొలగించును. భూతదయను పెంపొందించును. నిత్యతృప్తి నొసగును.

దురంతమగు, దుస్సహమగు, దుస్తరమైన దురితము లనెడి భయంకరాగ్నులు గోవింద కథా సుధారస వర్షధారా ప్రవాహముచేగాని ఆరవు. నిరంతరము భగవత్కథా శ్రవణము చేయువారి బుద్ధి భగవంతునితో నిండియుండును. భగవానుని దివ్యమం

గాథలు కన్నులకు గట్టినట్లు ఎదురుగ గోచరించు చుండును. మేను పులకించు చుండును. హృదయము పరవశించుచుండును. నేత్రములు వర్షించుచుండును. [illegible] కార్యము నాచరించుచున్నను పరమాత్మయే మదిలో మెదలుచుండును. ఈ స్థితిని ఒక్క శ్రవణమే కల్పించగలదు. సంసార జలధిని దాటుటకు కథాశ్రవణ మందించు భక్తియే ఉత్తమ నావయై యున్నది.

సీ॥ హరినామ కథన దావానల జ్వాలచే గాలవే ఘోరాఘ కాననములు
వైకుంఠ దర్శన వాయు సంఘంబుచే దొలగవే భవదుఃఖ తోయదములు
కమలనాభధ్యాన కంఠీరవంబుచే గూలవే సంతాప కుంజరములు
నారాయణ స్మరణ ప్రభాకర దీప్తి దీఱవే షడ్వర్గ తిమిరతతులు
ఆ॥ నళిన నయన భక్తి నావచే గాక సంసార జలధి దాటి చనగరాదు
వేయునేల మాకు విష్ణుప్రభావంబు దెలుపవయ్య సూత! ధీ సమేత!

"మహానుభావా! సూతదేవా! కలియుగము వచ్చినదని మేము గ్రహించితిమి. పరమ పవిత్రమైన ఈ నైమిశారణ్యమున యజ్ఞము నాచరించుటకు సంకల్పించి ఇచ్చటి కరుదెంచితిమి. కలియుగము నందలి కల్మష జలధిని దాటవలెనని భావించితిమి. సంసార మహార్ణవమును దాటుటకు సిద్ధపడి యుంటిమి. హరికథా శ్రవణము నందు మా బుద్ధి ఆసక్తి నొందియున్నది. భగవత్కథలను ఎంతగ ఆలకించినను మా చిత్తము తృప్తి చెందుట లేదు. మఱల మఱల వినవలయుననియే అనిపించుచున్నది.

"భక్తులను రక్షించుటకై శ్రీమహావిష్ణువు కృష్ణుడై జన్మించుటను నీవు పూర్ణముగ తెలిసికొని యుంటివి. ఆ దివ్యగాథను శ్రద్ధావంతులమై మేము వినదలచితిమి. మహాత్మా! నీవు మా పుణ్యఫలముగా లభించితివి;" యనిరి.

సద్యః పునంత్యుపస్పృష్టాః స్వర్ధున్యాపోऽనుసేవయా

గంగానది పరమ పవిత్రమైనది. కానీ కృష్ణకథ ప్రవేశించిన తరువాత గంగయొక్క ప్రాశస్త్యము తగ్గిపోయినది. స్పృశించిన వారినే గంగ పునీతము చేయును. కానీ దర్శన మాత్రముననే సాధువులు పవిత్రత నొసంగెదరు. కనుక భగవానుని కథల నెరిగిన మహాభక్తుల దర్శనభాగ్యము పుణ్యాత్ములకే లభించును. నావికుడుండినచో నావ చక్కగ తీరమును చేరును. మహాత్ముల సహచర్యము బ్రతుకును తరింపజేయును.

క॥ జలరాశి దాట గోరెడి కలము జనుల్ గర్ణధారు గాంచిన భంగిన్
గలిదోష హరణ వాంఛా కలితుల మగు మేము నిన్ను గంటిమి సూతా!

భక్తి వైశిష్ట్యము

"మహాత్మా! ధర్మరక్షకుడగు శ్రీకృష్ణుడు అవతారమును సమాప్తి చేయగా భారతమున గోల్పోయిన ధర్మము నెవరి నాశ్రయించెను?" యని శౌనకాది మునులు రోమహర్షణుని పుత్రుడగు సూతుని ప్రశ్నించిరి.

శౌనకాది మునులను సంతృప్తి పరచుటకు సూతుడు భాగవతకథను చెప్పనారంభించెను. కథను ప్రారంభించుచు మహానుభావుడైన శుకమహర్షికి నమస్కరించు చున్నాడు. భాగవతులకు నమస్కరించనిదే భాగవత మహాత్మ్యము అనుభవమునకు అందదు.

శుకబ్రహ్మ పరమ భాగవతోత్తముడు. వ్యాసుని కుమారుడు. సుమారు పదునారు సంవత్సరముల వరకు శుకదేవుడు తల్లి గర్భమునందే వసించుచుండెను. జన్మింప కుండెను. తండ్రియగు వ్యాసుడు ఒకనాడు "నాయనా! నీవు గర్భమున ఎంతకాల ముండెదవు? నీవు జన్మింపకుండుటకు కారణమేమి?" యని ప్రశ్నించెను.

శ్రీశుకుడు తల్లి గర్భము నుండి ఇట్లు పలికెను: "నాకు ప్రపంచమును దర్శింపవలె ననెడి అభిలాష లేదు. అచ్చట అజ్ఞాన సుడిగుండము గలదు. అదొక విషవలయముగా నాకు తెలియుచున్నది. మాయా నిర్మితమైన ప్రపంచముతో నేను సంగత్వము నేర్పరచు కొనుటకు సిద్ధంగా లేను. పాప నిలయమైన ప్రపంచములో కాలుబెట్టుటకు నేను భీతి చెందుచున్నాను" యని శుకుడు సమాధాన మొసగెను.

పుణ్యాత్ముడెవరు? పాపమును గాంచి భీతి చెందువాడు. పాప దర్శనము ఎవరికి భీతిని కల్గించునో, పుణ్యాచరణము నందు ఎవరు సంతృప్తులై యుందురో వారే భాగవతులు.

కొందరు అనేకములైన భక్తి సాధనల నాచరించు చుందురు. కానీ పాపాచరణమును మానరు. అట్టివారిని భగవానుడు అనుగ్రహింపడు. పరమాత్మ నీ అర్చనను గాకుండా దాని నాచరించు అంత:కరణమును గాంచును.

శుకునిలోని పాపభీతిని గాంచిన భగవానుడు శ్రీశుకుని ఆశీర్వదించెను. భక్తులైన వారిని పాపము అంటదని చెప్పెను. భగవదాజ్ఞను శిరసా ధరించి శ్రీశుకుడు జన్మించెను.

శుకు డుదయించక మునుపే అతనియందు భక్తి ఉదయించి యుండెను. అందుచేత శుకుడు జన్మించగనే జగన్నాథుని అన్వేషింపసాగెను. తనకు వాసయోగ్యమైనది వనమే యని నిర్ణయించుకొనెను. పరమాత్మ నన్వేషించుచూ శుకుడు వనముల కేగుచుండెను.

పుట్టగనే శుకబ్రహ్మ సత్యాన్వేషణమును ఆరంభించెను. కొందరు గిట్టేవరకు అసత్యజీవనమునే గడుపుచుందురు. పుట్టినదెందుకనెడి ప్రశ్న ఎవరి మనస్సులో పుట్టునో వారి పుట్టుక ధన్యమగును.



నైమిశారణ్యంలో బాగవతమును బోధిస్తున్న సూతమహర్షి

మాతాపితలను వీడి జగత్పిత నన్వేషించుచు శ్రీశుకుడు బయలుదేరుచుండెను. తల్లి మనస్సు కలత చెందెను. శుకుని లాంటి బిడ్డడు దూరమగుటను సహింపలేక పోయెను. తన బిడ్డ యొక్క ప్రయాణము నాపుమని వ్యాసుని ప్రార్థించెను.

"ప్రియమైన వాటిని పరమాత్మకు సమర్పించాలి. బిడ్డడు మనకు ప్రియమైనవాడు. అతనిని పరమాత్మకు సమర్పించుటయే ధర్మము" యని మహాజ్ఞాని యగు వ్యాసుడు పలికెను. తల్లి దిగులుచెందెను.

సద్భక్తితో పాటు సమర్పణ భావము కూడా ఉండాలి. భగవంతుడు ప్రసాదించిన దానిని తిరిగి ఆయనకు సమర్పించని వాడు దోషి యగును. దొంగ యగును. కొందరు భక్తిని కలిగి యుందురు. కానీ త్యాగమునకు దూరులై యుందురు. అట్టి జీవులు వాసన లేని పూల వంటివారు. భక్తికి తోడుగా త్యాగము నిలిచినచో సుగంధ భరిత సుమములవలె పరమాత్మ పూజ కుపకరింతురు.

కదలిపోవుచున్న బిడ్డను గాంచి తల్లి కలత చెందసాగెను. పుత్రుని పరమాత్మకు సమర్పించినను నిర్విచారుడై, నిర్భీతుడై వెడలుతున్న పూపవయస్కుడగు శుకుని గాంచి వ్యాసభగవానుడు కూడ విహ్వలు డాయెను. "పుత్రా! పుత్రా!" యంటూ వెంబడించెను. వ్యాసుని వేదనను గాంచి వృక్షములు గూడ వ్యథచెంది "కుమారా!" యని పలికినవట. కథను ప్రారంభించే ముందు కరుణా పూరితమైన ఈ సన్నివేశమును స్మృతికి దెచ్చుకొని సూతుడు శుకునికి వందన మాచరించుచున్నాడు.

మ॥ సముడై యెవ్వడు ముక్తకర్మచయుడై సన్యాసియై యొంటి బో
వ మహాభీతి నాహో కుమార! యనుచున్ వ్యాసుండు పీరంగ వృ
క్షములుం దన్మయతం బ్రతిధ్వనులు చక్కంజేసె మున్నట్టి భూ
తమయున్ మ్రొక్కెద బాదరాయణి దపో ధన్యాగ్రణిన్ ధీమణిన్

పుత్రవాత్సల్యముతో విహ్వలుడైన వ్యాసుని గాంచి వృక్షములు గూడ స్పందించెను. ప్రేమ స్పందింప జేయలేని వస్తువు ప్రపంచములో గోచరించదు. వ్యాసుని వ్యథను గాంచిన వృక్ష సమూహము ఒక్కసారిగ "కుమారా! కుమారా!" యని పలికినవి. ఇచ్చట నిగూఢమైన విషయములు చోటుచేసుకొని యున్నవి.

చేరువైన ముద్దుబిడ్డడగు శుకుడు తండ్రియగు వ్యాసుని వదలి వెళ్ళునట్లు, ముద్దులొలుకు పలుకులతో చెట్టుపై నిలిచిన శుకములు చెట్టును వీడి వెళ్ళుచుండును. బాధల ప్రపంచములో ఎవరు సుఖింపగలరు? సర్వులకు బాధలు సమములే యని తెలుపుచు వృక్షములు వ్యాసుని ఓదార్చుచున్నవి.

తల్లిదండ్రుల నుండి బిడ్డ లుద్భవించునట్లు, వృక్షముల నుండి ఫలము లావిర్భవించును. సారవంతమైన ఫలములను వృక్షములు పరుల కొసగునే గాని తాము ఉంచుకొనవు. ప్రీతియైన వానిని పరమాత్మకు సమర్పించువారు ధన్యాత్ములు.

"మా బిడ్డలగు ఫలములను మేము పరులకు దారబోసి తృప్తిచెందుచున్నాము. నీవును పరోపకారార్థము నీ పుత్రుడగు శుకుని త్యాగ మొనర్చితివి. విలపింపకుము" యని

వృక్షములు ఓదార్చుచున్నవి. అంతియే గాదు. శుకుని కొరకు వ్యథ చెందుతున్న కరుణాపూరిత హృదయము వృక్షములను కదలించగా అవి మాతృభావమున "పుత్రా-పుత్రా" యని రోదించినవి. అట్టి శుక మహర్షిని ధ్యానించి, ప్రార్థించి సూతుడు కథను ప్రారంభించెను.

యస్స్వానుభావ మఖిల శ్రుతిసార మేకం
అధ్యాత్మ దీప మతితితీర్షతాం తమోఽన్ధమ్!
సంసారిణాం కరుణయాఽఽహ పురాణ గుహ్యం
తం వ్యాససూను ముపయామి గురుం మునీనామ్!

"సర్వవేద సారము, పురాణ రహస్యము, స్వానుభవ విషయము నగు భాగవతమును, అజ్ఞానాంధకారము నుండి తరించుట కభిలషించు జనులకు కరుణామయుడై బోధించినవాడు, మునులకు ఆచార్యుడు, వ్యాస తనయుడు నగు శుకబ్రహ్మను శరణు జొచ్చుచున్నాను" యని సూతుడు శుకుని ప్రార్థించెను.

నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయ ముదీరయేత్

"నారాయణునకు, నరునకు, సరస్వతీ దేవికి, వ్యాసదేవునికి నమస్కరించిన పిమ్మట భవసాగరమును దాటించు ఈ గ్రంథమును చెప్పుచున్నాను.

"మునులారా! సర్వలోకములకు శుభములను జేకూర్చు విషయమును మీరు నన్నడిగితిరి. ధర్మము అతి సూక్ష్మమైనది. శ్రీకృష్ణుని యందు నిష్కామముగ చిత్తము లగ్నమైనచో అట్టి ధర్మము శ్రేష్ఠమైనది. నిరపేక్షులైన భక్తులు శ్రేష్ఠులు. శ్రవణభక్తి ద్వారా లభ్యమగు స్థితి నిష్కళంకమై యుండును" యని సూతుడు చెప్పసాగెను.

భగవానుని గూర్చి శ్రవణము చేసినచో భక్తి వృద్ధి యగును. పరమాత్మ యెడల ఆసక్తి మెండగును. శ్రవణము నందు అకుంఠితమైన శ్రద్ధ యుండవలెను. లేనిచో ఆసక్తి వృద్ధిచెందదు. తీవ్రమైన ఆసక్తితో శ్రవణము చేయువారు భగవత్కృపకు పాత్రులగుదురు. జ్ఞానమును పొంద గలుగుదురు.

వాసుదేవే భగవతి భక్తి యోగః ప్రయోజితః
జనయత్యాశు వైరాగ్యం జ్ఞానం చ యదహైతుకమ్

"వాసుదేవుని యందు ఏర్పడిన భక్తి - వైరాగ్యమును పుట్టించును. జ్ఞానమును కలిగించును" యని సూతుడనెను.

భగవత్కథాశ్రవణము నందు ఆసక్తి లేనివాడు ధర్మము నెంతగా అనుష్ఠించినను మోక్షము నొందలేడు. శ్రమనే ఫలముగా పొందును. త్రివర్గము లనేడి ధర్మార్థ కామములు మోక్షమును ప్రసాదించలేవు. కనుక ఏ ధర్మము ననుష్ఠించుచుండినను మనుజుడు తన మనస్సును పరమాత్మ యందే ఉంచవలెను. మునులందరు ఇలాగే తరించుచుందురు.

పరమాత్మ విషయమున సుదృఢమైన విశ్వాస ముండవలెను. విషయభోగములను త్యజింపవలెను. భోగాసక్తి తగ్గినచో భక్తి వృద్ధిచెందుతున్నదని భావము. భక్తి కోరికలను

కదలనివ్వదు. నిరోధ రూపమై యుండును. భగవానుని యందు అనన్య చింతను పెంపొందించుచు, దానికి అన్యమైన విషయముల యందు ఉదాసీనతను కల్పించును. కనుక సదా ఏకాంత భక్తిని అలవరచుకొనవలెనని సూతుడు తెలిపెను.

తస్మాదేకేన మనసా భగవాన్ సాత్వతాం పతిః
శ్రోతవ్యః కీర్తితవ్యశ్చ ధ్యేయః పూజ్యశ్చ నిత్యదా

"ఏకాంత భావముతో సదా శ్రవణము చేయదగినవాడు, కీర్తింపదగినవాడు, స్మరింపదగినవాడు, పూజింపదగినవాడు భగవానుడే."

భగవత్కథా శ్రవణ మనెడి ఖడ్గముచే బంధమును కల్పించు కర్మలను ఛేదింపవలెను. కర్మలను త్యజింప నవసరము లేదు. ఆసక్తిని విడచిపెట్టిన సరిపోవును. భోగాసక్తి లేనిచో వాసనలు తయారుగావు. భగవచ్చింతనము నిర్విఘ్నముగ సాగినచో హృదయమున వాసనల జోరు తగ్గిందని భావము. భోగాసక్తిని విడచినచో వ్యక్తి సుఖించును. శాశ్వతానందమును బొందును.

ఆహారమును భుజించుట తప్పుగాదు. పరమాత్మకు అర్పించకుండా భుజించుట దోషము. పరమాత్మకు సమర్పించిన పిదప భుజించినచో అది ప్రసాదమగును. ప్రసాదము ప్రశాంతత నందించును.

భక్తి భోగాసక్తిని నిర్మూలించి భగవంతుని యందు ఆసక్తిని పెంచును. ఇట్టి భక్తిని మెల్లమెల్లగ అభ్యసించాలి. భక్తి నాల్గు విధములైన సాధనల ద్వారా లభించునని సూతుడు చెప్పుచున్నాడు. 1. తీర్థక్షేత్ర సందర్శనము 2. సద్గురు సేవ 3. భక్తుల సేవ 4. కథాశ్రవణము. ఈ విధమైన భక్తి సాధనలు పాపములను నశింప జేయును. వాసనలను ప్రక్షాళన మొనర్చును. గుణజనిత వికారములు అదృశ్య మగును. భక్తి హృదయమును నిర్మల మొనర్చి, జ్ఞానోదయమునకు సిద్ధము చేయును. పునాది లేనిదే భవనము నిలువదు, భక్తి లేనిదే జ్ఞానము కుదరదు. అట్టి జ్ఞానము వాసుదేవ చైతన్యమే గాని వేరొకటి కాదు.

వాసుదేవ పరం జ్ఞానం వాసుదేవ పరం తపః
వాసుదేవ పరో ధర్మో వాసుదేవ పరా గతిః

"వాసుదేవుని తెలిపెడి జ్ఞానమే జ్ఞానము. వాసుదేవుని లక్ష్యముగ నిర్ణయించుకొనిన తపస్సే తపస్సు. వాసుదేవుని కొరకు చేయు ధర్మమే ధర్మము. వాసుదేవుడే సర్వులకు గమ్యుడై యున్నాడు" అని సూతమహర్షి శౌనకాది మునులకు భక్తి వైభవమును చెప్పుచూ భగవానుని అవతార విశేషములను వర్ణించుచున్నాడు.

ఆదినారాయణ స్వరూపము నిర్గుణ మైనను భక్తుల కొరకు భగవానుడు సగుణ రూపమును ధరించి అవతరించెను. ఇవి మొత్తము ఇరువది నాలుగు అవతారములు గలవు. భాగవతమును ప్రవచించే ముందు అవతార విశేషములను సూతుడు సుందర ముగా వర్ణించుచున్నాడు.

భగవానుని అవతారములు

భాగవతమున కృష్ణకథయే ముఖ్య ఫలము. అందుచేతనే దశమస్కంధమును భగవానుని ముఖముతో పోల్చినారు. కృష్ణకథ చివరలో వచ్చును. ప్రస్తుతము మనము ప్రథమ స్కంధమున యున్నాము. ఇప్పుడు భగవానుని అవతారములను సంక్షిప్తముగ చెప్పుచున్నాడు. ఇది ప్రథమ స్కంధమున తృతీయాధ్యాయము.

అవ్యక్త చైతన్యము వ్యక్త మగుటయే అవతారము. అవతారము యనగా క్రిందికి దిగుట యని అర్థము. నిరాకారుడైన భగవానుడు శిష్టజన రక్షణార్థం సాకార రూపుడుగ వ్యక్తమగుటయే అవతారము. భగవంతుడు ఎక్కడ అవతరించును? ఎక్కడనుండి అవతరించును? సర్వగతుడైనవాడు ఒకచోట అవతరించినచో అతడు పరిమితుడు గాకుండునా? పరిమితుడైనవాడు పరిపూర్ణుడెలా కాగలడు? పరిపూర్ణుడు గానిచో సర్వగతుడెలా అగును? భగవానుడు సర్వవ్యాపియైనపుడు సర్వమూ భగవత్స్వరూపమే కాగలదు. ప్రతి వస్తువు, ప్రతి వ్యక్తి భగవదవతారమే యగును. ఈ అద్వైత భావనలో అవతారము ఆవిర్భవించలేదు. భగవదవతార మూర్తుల యందు చైతన్యము ప్రస్ఫుటముగ దర్శింపబడి మనలోని అజ్ఞాన పొరలు పలుచబడే స్థితి ఏర్పడును. అజ్ఞాన మెంతగా కరుగుచుండునో జ్ఞాన మంతగ పెరుగుచుండును. అజ్ఞానము సమూలముగ నశించగనే జ్ఞానానుభూతి ఏర్పడి, ప్రతి వ్యక్తి, ప్రతి వస్తువు భగవదవతారముగ గోచరించును.

జీవులు ఆవిర్భవించడానికి, భగవానుడు అవతరించడానికి ఎంతయో తేడా కలదు. సంచిత కర్మవలయంలో చిక్కుకొని, ప్రారబ్ధమును వెంట నిడుకొని జీవులు ఈ ప్రపంచములో కాలుమోపుతారు. అందుచేత త్రాటితో కట్టివేయబడిన పశువువలె స్వేచ్ఛను కోల్పోయి ఒక నిర్దిష్టమైన గాడిలో నిలబడి నియమిత జీవనాన్ని అనుభవిస్తూ, పరిమిత జీవనాన్ని కొనసాగిస్తుంటారు. కానీ భగవానుని అవతారము అలాంటిది గాదు. తనకు ఏ విధమైన సంచితము లేదు. ప్రారబ్ధము లేదు. కేవలం జీవులను ఉద్ధరించవలె ననెడి దివ్య సంకల్పముతో తన మాయను ఆధారముగా జేసికొని మాయను పాలించుచు ఈ జగత్తులో వ్యక్త మగును. అందుచేత అవతార వైశిష్ట్యమును అవగతము చేసుకోలేక జనులు మథనపడుతుంటారు. కర్మాతీతుడైన భగవానుడు ఏ కర్మానుభవమునకై అవతరించును? అనెడి శంక చాలామందిలో కదలుచుండును. భగవానునకు పాప పుణ్యములు లేవు. పుణ్యాత్ముల పుణ్యకర్మలు, పాపాత్ముల పాపకర్మలు కలిసి భగవానుని ఆవిర్భావమునకు కారణమగుచున్నవి. మన పాపపుణ్యముల కారణంగా అరుదెంచిన జన్మమున కలిగెడి సుఖదుఃఖములను మనమే అనుభవించునట్లు, పాపాత్ముల, పుణ్యాత్ముల కర్మల కారణంగా అరుదెంచిన భగవదవతారము వలన లభించెడి శుభాశుభములను వారే అనుభవించుచుందురు. శ్రీరాముని ఆవిర్భావమునకు రావణుని పాపకర్మయే కారణము గాదు. విభీషణుని పుణ్యకర్మ కూడాను. శ్రీకృష్ణుని అవతారమునకు రుక్మిణీ దేవి పుణ్య కర్మయే గాదు. శిశుపాలుని పాపకర్మ కూడాను. ఎవరి ఫలములను వారే అనుభవించు

చుందురు. భక్తులు భగవద్దర్శనముతో పునీతులగుచుందురు. దురాత్ములు భగవానుని చేతిలో హతులగుచుందురు. ఈ విధముగా భగవదవతారము భూదేవి నుద్ధరించు చుండును. **"భూమేః భారావతారాయ"** భూ భారమును తగ్గించుట కొఱకే భగవానుడు అవతరించుచుండును.

"అసంఖ్యాః అవతారాః హరేః" శ్రీహరి యవతారములు అసంఖ్యాకములు. శ్రీమహావిష్ణువు తన యోగమాయచే అసంఖ్యాకమైన అవతారములు ఎత్తును. పూర్ణ, అంశ, ఆవేశావతారములుగ పృథివిపై అవతరించును.

అజాయమానో బహుధా విజాయతే తస్య ధీరాః పరిజానన్తి యోనిమ్

పుట్టుక తెలియని భగవానుడు అనేక రూపాలలో అవతరించుచుండును. అయితే భగవానుని అవతార వైభవమును ధీరపురుషులగువారే తెలిసికొనగలరు.

జన్మ కర్మ చ మే దివ్యం ఏవం యో వేత్తి తత్త్వతః
త్యక్త్వా దేహం పునర్జన్మ నైతి మామేతి సోఽర్జున

"అర్జునా! ఎవడు దివ్యమైన నా జన్మమును, కర్మమును వాస్తవముగ తెలిసికొనుచున్నాడో అట్టివాడు ఈ శరీరమును విడచిన పిదప జన్మము నొందక నన్నే పొందుచున్నాడు" అని భగవద్గీత జ్ఞానయోగము నందు భగవానుడు తెలిపియున్నాడు.

దుష్టశిక్షణ, శిష్టరక్షణ, ధర్మ సంస్థాపన యనునవి భగవదవతారము ఆవిర్భవించుటకు గల కారణములని భగవద్గీత తెలుపుచున్నది. దుష్టశిక్షణ యనునది ఏ నాలుగైదు వేల సంవత్సరములకు పూర్వము ఏ కంసుని గాని, లేదా రావణుని గాని సంహరించుటయే అయినచో ఈనాడు దుష్టశక్తులచే పీడింపబడు మనము భగవదవతారములను ఉపాసించి పొందే ప్రయోజన మేమున్నది?

దుష్టులు బయట లేరు. లోపలే యున్నారు. మనలోని దుష్టభావములు తొలగించబడితే విశ్వము విశ్వనాథ స్వరూపముగ గోచరిస్తుంది. మనలను బాధించునది బాహ్య రాక్షసులు గారు. ఆంతరంగిక శత్రువులే చాలా ప్రమాదముగ మారి మనలను హింసించుచున్నారు. మనలోని దుష్ట సంకల్పాలు, అశుభవాసనలే నిజమైన అసురులు. వ్యక్తి ఆంతర్యములో చోటుచేసికొని యున్న దుష్టభావ రాక్షసులను సంహరించి, సుగుణ సంపదను రక్షించి, వ్యక్తి జీవితమును ధర్మ మార్గములో నుంచు చొరవయే అవతారము. కనుక భగవానుడు ప్రతి హృదయములోను అనుకూల సమయము నందు అవతరిస్తాడు. ఆంతర్యములో దర్శన మొసగబోవు అవతారవైశిష్ట్యమును అవగాహనతో గ్రహించు అధ్యయన శిక్షణయే బాహ్యము నందు అవతారములు దర్శన మిచ్చుటలోని మహత్తర ఆశయము. ఆంతర్యములో ఏర్పడు దీప్తికి బాహ్యము నందు స్ఫూర్తి కలుగవలెను. శ్రీమహావిష్ణువు తన యోగమాయచే అసంఖ్యాకమైన అవతారములు ఎత్తును. **"అవతార హ్యసంఖ్యాయః"** అని శాస్త్రము తెలుపుచున్నది.

ఈ అవతార విశేషములు వేదమువలె ప్రాచీనమైనవి. ఇవి పురాణములందు గోచరించును. పురాణములు భగవానుని నిశ్వాసలని బృహదారణ్యకము తెలిపింది. కనుక

పురాణములను, వాటి నిజ స్వరూపములను తత్త్వదీపిక ద్వారా అన్వేషించి దర్శింపవలసిన అవసరమెంతైనా గలదు. **"పురా అపి నవం ఇతి పురాణమ్"** పురాతన విషయములును నవీనముగ అగుపించునది ఏదియో అదియే పురాణము యని భావము. కనుక పురాణములలోని సన్నివేశములను, కథలను, భావములను ఆధునిక విజ్ఞాన, మనస్తత్త్వ శాస్త్ర పరిధుల నుండి దర్శించి, అవగాహన చేసికొనవలెను.

భగవానుని అవతార విశేషములను శౌనకాది మునులకు సూతుడు తెలుపుచున్నాడు. ప్రథమంగా భగవానుడు సనక సనందనాది మహర్షుల రూపమున అవతరించెనని చెప్పుచున్నాడు.

స ఏవ ప్రథమం దేవః కౌమారం సర్గ మాశ్రిస్థః
చచార దుశ్చరం బ్రహ్మ్మ బ్రహ్మచర్య మఖండితమ్

శ్రీమహావిష్ణువు మొదట సనక, సనందన, సనాతన, సనత్కుమారుల రూపములతో ఆవిర్భవించెను. దుస్సాధ్యమైన అఖండ బ్రహ్మచర్యము ననుష్ఠించెను. బ్రహ్మజ్ఞులై భాసిల్లెను.

బ్రహ్మచర్యము యొక్క ప్రాశస్త్యమును మొదటి అవతారము ప్రబోధించుచున్నది. బ్రహ్మచర్యము లేనివారికి బ్రహ్మము అనుభవమునకు అందదు. సాధకుడు ప్రారంభమున బ్రహ్మచర్యమును విధిగా పాటించాలి. వీర్యనష్టము మరణము నందించునే గాని అమృతత్వమును ప్రసాదించదు. మనము భుజించిన ఆహారము రసముగను, రక్తముగను, మాంసముగను క్రమ పరిణామము చెందుతూ చివరగ వీర్యశక్తిగా సార రూపమును ధరిస్తుంది. కనుక వీర్యమునకు దేహములో ఒక స్థానమంటూ లేదు. అది దేహమంతట యుండి దేహమునకు శక్తిని, దీప్తిని అందించును. సారము నశించగనే ఫలములెలా నిరుపయోగము లగునో వీర్యనష్టము వలన జీవి నశించును. వీర్యము దేహమంతట యుండుట వలన వీర్యనష్టము జరుగువారికి దేహమంతయు నీరసమగును. రసహీనులకు నీరసమే ప్రాప్తించును.

యథా పయసి సర్పిస్తు గుడ శ్చేక్షురసే యథా
ఏవం హి సకలే కాయే శుక్రం తిష్ఠతి దేహినామ్

"పాలలో ఘృతము దాగియున్నట్లు, చెరకు నందు బెల్లము అవ్యక్తమై యున్నట్లును మన దేహమంతటా వీర్యం వ్యాపించి యుంది" యని శుశ్రుతుడు వైద్యగ్రంథంలో తెలిపియున్నాడు.

బ్రహ్మచర్య మహిమచే ఆంజనేయుడు సముద్రమును లంఘించెను. భీష్ముడు స్వచ్ఛంద మరణము నొందెను. బ్రహ్మచర్యమును పాటించుట చేతనే శ్రీరాముడు రావణుని, లక్ష్మణుడు ఇంద్రజిత్తుని చంపగలిగిరి. భవసాగరమును దాట నిచ్ఛగించు సాధకులు తప్పక బ్రహ్మచర్యము నవలంబించవలెను. బ్రహ్మచర్యము యొక్క ప్రభావముచే ఇంద్రియములను నిరోధించవలెను.

ఈ సందర్భమున బ్రహ్మచర్యమునకు మరియొక అర్థమును గూడ గ్రహింపవలసిన అవసరమున్నది. బ్రహ్మ మనగా వేదమని గూడ భావము. చర్యమనగా చరించుట యని అర్థము. బ్రహ్మచర్యమనగా బ్రహ్మము నందు చరించుట. అనగా వేదము నధ్యయనము చేయుట యని భావము. బ్రహ్మచారి ఇంద్రియ నిగ్రహము గలవాడై శాస్త్రాధ్యయనమును సాగించవలెను. సనక సనందనాది మహర్షులు దిగంబరులై యుండెడివారు. వారి బ్రహ్మచర్యము అసమానము. అందుచేత వారు ముదిమి నెరుగని వారై సదా బాలుర వలె గన్పించుచుందురు.

రెండవ యవతారము వరాహావతారము. ఇదొక విశిష్టమైన అవతారము. **"వర"** యనగా శ్రేష్ఠమని అర్థము. **"అహము"** యనగా రోజు యని భావము. వరాహ మనగా శుభదినము యని అర్థము. సుదినమని భావము. సుదిన మనగా ఎయ్యది?

మృదంగ తాళము తంబుర శ్రుతి గూర్చి
మృదురాగముల గీర్తనలు పాడిన విన్న దినమే సుదినము

యని భద్రాచల రామదాసు కీర్తించినారు.

భక్తి రసామృతము మన హృదయములో ఏరోజు స్రవించునో అదియే శుభ దినము. వరాహము. భక్తి లోభము నంతమొందించును. ప్రశాంతతను, సంతృప్తిని కల్గించును. వరాహమూర్తి హిరణ్యాక్షుని వధించెను.

హిరణ్యాక్షుడనగా బంగారముపై దృష్టి గలవాడని భావము. మమకారమునకు ప్రతిరూపము. "అంతా నాకే కావాలి" యని హిరణ్యాక్షుడు భూమినే చాపగా చుట్టినాడు. ఇదియే లోభగుణము. వరాహమూర్తి యజ్ఞ రూపుడు. అనగా త్యాగమూర్తి. త్యాగమే లోభమును జయించును.

మన హృదయములో కీర్తనము ద్వారా భక్తి ఉద్భవించినచో అట్టి భక్తి త్యాగమును మనసున నిలుపును. సూర్యోదయము అంధకారము నదృశ్యమొనర్చునట్లు త్యాగము లోభమును హరించును. ఇదియే వరాహావతార వైశిష్ట్యము. ఉన్నదానితో తృప్తిచెందెడి అంతఃకరణము ఏర్పడుటయే వరాహావతార వైశిష్ట్యము. బ్రహ్మచర్యము, త్యాగము, సంతృప్తి యనెడి లక్షణములు ఎవని హృదయము నధిష్ఠించునో అతడు భక్తిపరుడగును. కనుకనే తరువాత ఆర్షావతారము వచ్చును.

మూడవది నారదావతారము. **"నారం దదాతి ఇతి నారదః"** జ్ఞానమును ప్రసాదించువాడు నారదుడు యని అర్థము. మూఢభక్తి సుస్థిరముగా నుండదు. జ్ఞానయుతభక్తియే దృఢముగా నుండును. ఇదియే నారదావతారము. భక్తి ముక్తిని ప్రసాదించును. భక్తికి గమ్యము భగవానుడే. ఇదియే నాల్గవదియైన నారాయణావతారము.

చతుర్థావతారము నరనారాయణుల స్వరూపము. ధర్ముని భార్యయగు మూర్తి గర్భమున జన్మించి దుష్కరమగు తపస్సు చేసెను. భగవత్స్వరూపము తపోమయము. కనుక తపస్సు ద్వారానే భగవానుని పొందవలెను. పైసా కొరకు తపించడం అందరూ చేయగలరు. కానీ పరమాత్మ కొరకు అందరూ తపించలేరు. అది వైరాగ్యవంతులకే

సాధ్యము. విరాగి గాని వానికి పరమాత్మ యందు రాగ ముదయించదు. వైరాగ్యముచే భక్తి మూలుగుచుండును. ఈ విషయమును ఐదవ అవతారము తెలుపును.

అయిదవ అవతారము కపిలదేవునిది. ఇచ్చట వైరాగ్యయుత భక్తి, జ్ఞానము, తపస్సు తెలిసివచ్చును. కపిలుడు తన తల్లియగు దేవహూతికి జ్ఞానోపదేశము చేయును. ఈ విషయము తృతీయ స్కంధమున వచ్చును. అదియే కపిల గీత యనబడినది. జ్ఞానవైరాగ్యములచే దృఢమైన భక్తిని ఎవరూ కదలించలేరు. అది ప్రజ్ఞాన ఘన స్వరూపము. ఈ విషయమును ఆరవ యవతారము తెలుపును.

ఆరవ అవతారము దత్తాత్రేయుడు. అత్రి అనసూయల పుత్రుడు. ఇతడు అవధూత గీత, జీవన్ముక్త గీత యనెడి గ్రంథములను* రచించెను. ఇతడు ప్రహ్లాదునకు గూడ జ్ఞానబోధ చేసెను. దత్తాత్రేయుడు అనసూయ పుత్రుడు. అసూయ లేనివారు, నిర్మత్సరులు జ్ఞానపుత్రుని బొందెదరు. గుహ్యతమమైన ఆత్మజ్ఞానము అసూయా పరులకు లభించదు.

ఇదం తు తే గుహ్యతమం ప్రవక్ష్యా మ్యనసూయవే
జ్ఞానం విజ్ఞాన సహితం యద్ జ్ఞాత్వా మోక్ష్యసేఽశుభాత్

"దేనిని తెలిసికొనిన పిదప అశుభము నుండి విడిపడెదవో అట్టి అనుభవ సహితమైన రహస్య జ్ఞానమును అసూయలేని నీకు చెప్పుచున్నాను" యని శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీతలోని రాజవిద్యా రాజగుహ్య యోగము నందు తెలిపెను.

జ్ఞానము కలిగిన తరువాత జీవితము యజ్ఞస్వరూపముగ మారును. కనుక ఏడవ అవతారము యజ్ఞరూపము. ఋచి యను బ్రాహ్మణునకు అకూతి యనునామె యందు భగవానుడు యజ్ఞరూపమున అవతరించెను. ఇది ఏడవ అవతారము.

జ్ఞాన, యజ్ఞరూపములు త్యాగమయములే గనుక సన్యాసమునకు ప్రతీకములు. అందుచేత బుద్ధిమంతులగు వారికి పరమహంస విధిని బోధించుటకై భగవానుడు ఋషభదేవుని రూపమున అవతరించెను. ఇది ఎనిమిదవ అవతారము.

యతిపురుషుడు ఇతరుల కొఱకే జీవించును. ఇతరుల సంతోషమునే తన సంతోషముగ భావించును. లోకకళ్యాణమును సదా వాంఛించుచుండును. ఇదియే పృథుమహారాజుగా అవతరించిన తొమ్మిదవ అవతారము. ఋషుల ప్రార్థన నాలకించిన భగవానుడు పృథివి నుండి ఓషధులను పిండెను. ఈ అవతారము పరమ రమణీయమని సూతుడు పలికెను.

పదియవ అవతారము మత్స్యావతారము. ఈ మత్స్యావతారమున హయగ్రీవుడను రాక్షసుని సంహరించుట ద్వారా దుష్టశిక్షణయు, సత్యవ్రతుడను భక్తుని రక్షించుట ద్వారా శిష్టరక్షణయు, వేదములను వెలికితెచ్చి బ్రహ్మదేవుని కిచ్చుట ద్వారా ధర్మ సంస్థాపన జరిగి అవతార ప్రాముఖ్యమును చక్కగా విశదపరచడము జరిగినది.

---

*ఈ రెండు గ్రంథములపై స్వామీజీ రచించిన వ్యాఖ్యలు కలవు.

కూర్మావతారము పదునొకండవ అవతారము. క్షీరసాగరమును దేవదానవులు కలసి మథించునపుడు శ్రీహరి కూర్మరూపమును దాల్చి మందరపర్వతమును వీపుపై ధరించెను. వాసనా సాగరమున మునిగిపోవుచున్న బుద్ధి యనెడి మందరాచలమును ధరించు భగవద్భక్తి యొక్క వర్ణనయే కూర్మనారాయణుని వర్ణనముగా మనకు భాగవతములో తెలియును. ఈ వర్ణనము అష్టమ స్కంధమున వచ్చును.

పంద్రెండవ అవతారము ధన్వంతరి రూపము. ఈయన అమృతహస్తుడై సాగరము నుండి బయల్వెడలును. జ్ఞాన నిర్మథనాభ్యాసము జరిగినపుడు హృదయసాగరము నుండి బయల్వెడలు అమృత స్వరూపమునకు ధన్వంతరి ప్రతీకము.

పదమూడవ అవతారము మోహినీరూపము. ఇచ్చట దానవులను వంచించి, దేవతలకు అమృతము నొసగును. ఇది బహుసుందరమైన అవతారము. దుష్ట వాసనలను నిర్జీవ మొనర్చి, సద్వాసనలు పెంపొందించుకోమని తెలుపును.

చతుర్దశం నారసింహం బిభ్రద్దైత్యేన్ద్ర మూర్జితమ్
దదార కరజై ర్వక్షస్యేరకాం కటకృద్యథా

నృసింహావతారము పదునాల్గవ అవతారము. రాక్షసుడు, గర్వితుడునైన కనక కశిపుని చాపలల్లువాడు వెదురుబద్దను జీల్చునట్లు గోళ్ళచే జీల్చెను.

హిరణ్యకశిపుడు అహంకారము యొక్క స్వరూపము. కనుక మమకారరూపుడైన హిరణ్యాక్షుని వలె తేలికగా చంపబడడు. అహంకారము ఎప్పుడూ జీవిని అంటుకొనియే యుండును. అది రాత్రిపూట చావదు. పగలు చావదు. లోపల చావదు. బయట చావదు. జంతువుల వలన చావదు. జనులవలన చావదు. ఇది చావడమంటూ జరిగితే మధ్యమస్థితి నుండియే చస్తుంది. ఈ సత్యమును వ్యక్త మొనర్చుచు రెండుగా పగిలిన స్తంభము మధ్యనుండి నరసింహమూర్తి ఆవిర్భవించెను.

పదునైదవ అవతారము వామనావతారము. బలిచక్రవర్తిని వంచించి దేవతలకు స్వర్గము నిచ్చుట ఈ అవతారమున విశేషము. ఈ అవతారమున యుద్ధము లేదు. బలి చక్రవర్తి భక్తి యనెడి బలమును గలిగియుండెను. అందుచేత శక్తితో గాక బలిని యుక్తితో వామనమూర్తి జయించెను.

పదునాఱవ అవతారము పరశురామావతారము. పరశురాముని భార్గవరాముడని కూడ పిలుతురు. త్రేతాయుగారంభమున పరశురాముడు ఆవిర్భవించి, క్షత్రియ కులమును నాశన మొనర్చినట్లు తెలియుచున్నది. ఇతడు ఇరువది యొక్కమారు పృథివిపై దండెత్తి దైవద్వేషులు, బ్రాహ్మణ ద్వేషులగు క్షత్రియులను పరిమార్చెను.

పదునేడవ అవతారము వేదవ్యాసుడు. సత్యవతీ పరాశరులకు బిడ్డడై జన్మించి, లోకకళ్యాణార్థమై వేదములను విస్తరింపజేసెను. అష్టాదశ పురాణములను రచించెను. ఉప పురాణములను రచించెను. భారతమును రచించెను. భాగవతమును రచించెను. బ్రహ్మసూత్రములను రచించెను. వ్యాసుడు లేని సనాతన ధర్మ వైభవము అనూహ్యముగ మిగులును.

పదునెనిమిదవ అవతారము శ్రీరామావతారము. రాముడు పోతపోసిన ధర్మ స్వరూపము. శ్రీరాముడు ఆదర్శ పురుషుడుగా, ఆదర్శ పుత్రుడుగా, ఆదర్శ ప్రభువుగా, ఆదర్శ భర్తగా, ఆదర్శ స్నేహితుడుగా, ఆదర్శ శిష్యుడుగా, ఆదర్శ గురువుగా, ఆదర్శ సోదరుడుగా, ఆదర్శ శత్రువుగా అన్యులు అనుకరించలేని రీతిలో జీవించి, సర్వులకు మార్గ దర్శకుడయ్యెను.

పందొమ్మిదవ, ఇరువదియవ అవతారములలో భగవానుడు బలరామకృష్ణులుగ అవతరించెను. వీరిరువురు భూ భారమును హరించిరి. శ్రీకృష్ణ పరమాత్మ పదార కళలతో మూర్తీభవించిన పూర్ణావతారము. ప్రేమావతారము. జగత్తులో గోచరించిన ఏకై పురుషోత్తము డితడే.

ఇరువది యొకటవ అవతారము బుద్ధావతారము. భాగవత రచన జరుగు నాటికి ఈ అవతారము ఆవిర్భవించలేదు. భవిష్యత్తులో ఆవిర్భవించునని సూతుడు చెప్పెను. బుద్ధభగవానుడు మహాత్యాగి. ఆదర్శవంతుడు. అపార కరుణా సముద్రుడు. కాలపరిస్థితులను దృష్టియం దిడుకొని నైతిక జీవనమును ప్రజలలో ప్రవేశపెట్టుటయే ముఖ్యోద్దేశ్యముగా కలిగియుండుటవలన బుద్ధుడు భగవంతుని గూర్చి ప్రవచించక, ధర్మమునకే ఎక్కువ ప్రాధాన్యము నొసగెను.

ఇరువది రెండవ అవతారము 'కల్కి' యవతారము. ఇది కలియుగాంతమున వచ్చును. అధర్మము పెచ్చు పెరిగినపుడు ధర్మ సంస్థాపనకై శంబల యనెడి గ్రామమున విష్ణుయశు డనెడి బ్రాహ్మణునకు కల్కిరూపమున భగవానుడు ఆవిర్భవించును. ఈ విధముగ అసంఖ్యాకములై యున్న హరి యవతారములు- చదివిన వానిని పాపవిముక్తుని గావించుచున్నవి.

ఆ॥ అతి రహస్యమైన హరి జన్మ కథనంబు మనుజ డెవ్వడేని మాపురేపు
జాల భక్తి తోడ జదివిన సంసార దుఃఖరాశి బాసి తొలగిపోవు!

యని ఆంధ్ర భాగవతమున పోతనామాత్యుడు తెలిపెను.

భగవానుని అవతార వైభవమును గాంచలేని మూఢులు ఆయనను దేహధారిగా భావించుచుందురు. ఆకాశమున మేఘరాశిని అరోపించునట్లు, వాయువునందు ఇసుకరేణువుల నాపాదించునట్లు సచ్చిదానంద రూపుడగు భగవానుని యందు దేహమును గాంచుచున్నారు. ఈ అవిద్యావరణము నుండి బయటపడిన జీవుడు సర్వగతుడైన పరమాత్మను దర్శించుచున్నాడు.

రంగస్థలంపై నటించు నటుని మూర్ఖుడగు మానవుడు గుర్తించలేని విధముగ, మూఢుడైన మానవుడు నామరూపముల వెనుక భాసించు అస్తి భాతి ప్రియ రూపుడగు పరమాత్మను గాంచలేకున్నాడు. గాంచినవాడు ధన్యుడగుచున్నాడు. నిష్కల్మష హృదయముతో శ్రీహరిని భక్తి చేయువారికి అతడు సులభుడగును.

ఉ॥ ఇంచుక మాయ లేక మది నెప్పుడు బాయని భక్తి తోడ వ
ర్తించుచు నెవ్వడేని హరి దివ్య పదాంబుజ గంధరాశి సే
వించు నతం డెఱుంగు నరవింద భవాదులకైన దుర్లభో
దంచితమైన యా హరి యుదార మహాద్భుత కర్మమార్గముల్

సూతుడు చెప్పుచున్నాడు. వేదవ్యాస భగవానుడు భాగవత పురాణమును రచించెను. శ్రీకృష్ణుడు వైకుంఠమున కేతెంచగనే కలియుగ మానవులు అజ్ఞానవశులైరి. అట్టి వారి నుద్ధరించుటకు సర్వవేద సమానము, కళ్యాణప్రదమునగు భాగవతము ఆవిర్భవించినది. ఈ పురాణము జీవుల అజ్ఞానాంధకారమును తొలగించుటలో ఆదిత్యుని వంటిది.

సీ॥ పుణ్యకీర్తనుడైన భువనేశు చరితంబు బ్రహ్మ తుల్యంబైన భాగవతము
సకల పురాణరాజము దాల్చి లోక భద్రముగ ధన్యముగ మోదముగ బ్రీతి
భగవంతుడగు వ్యాస భట్టారకు డొనర్చి శుకు డనియెడు తన సుతుని చేత
జదివించె నింతయు సకల వేదేతిహాసములలోపల నెల్ల సారమైన
ఆ॥ యీ పురాణమెల్ల నెలమి నా శుకయోగి గంగనడుమ వచ్చి ఘన విరక్తి
యొదవి మునులతోడ నుపవిష్టుడగు పరీక్షిన్నరేంద్రు డడుగ జెప్పె వినుడు

వేదేతిహాసములలోని సారభూతమగు విషయమును గ్రహించిన వ్యాసుడు శ్రీమద్భాగవతమును రచించెను. అద్దానిని తన కుమారుడు, వైరాగ్యపురుషుడగు శుకయోగికి వినిపించెను. శుకుడు గంగాతీరమున మునిజన పరివేష్టితుడై, విరాగియై ప్రాయోపవేశము జేయుచున్న పరీక్షిన్మహారాజునకు బోధించెను. ఆ సమయమున శ్రోతలలో సూతమహర్షి కూడా యుండెను.

"శౌనకాది మునులారా! గంగాతీరమున శ్రీశుకుడు పరీక్షిత్తునకు బోధించిన భాగవతమును నేను వినియుంటిని. ఆయన దయచే అవగతమొనర్చుకొంటిని. దానినే మీకు బోధింతును" అనెను.

సూతుని మాటల నాలకించిన శౌనకాదులు ఇలా పలికిరి: "సూతుడా! పరమ పవిత్రమైన ఈ భాగవతము ఏ యుగమున చెప్పబడినది? ఎచ్చోట ఇది చర్చింపబడెను? వ్యాసుడు భాగవతమును వ్రాయుటకు గల కారణమేమి? వ్యాసపుత్రుడగు శుకదేవుని గూర్చి మేమెఱుగుదుము. అతడు మహాజ్ఞాని. అభేద దర్శనము చేయువాడు" యనుచు శుకుని గూర్చి చెప్పసాగిరి.

శ్రీశుకుడు దిగంబరుడై వనముల కేగుచుండెను. ఒకచోట కొందరు అప్సరస్త్రీలు ఒక సరోవరమున వివస్త్రలై స్నాన మాచరించుచుండిరి. ఆ సమయమున శ్రీశుకుడు యౌవన సౌందర్యముతో శోభించుచు దిగంబరుడై వెడలుచుండెను. అప్సరసలు ఆయనను గాంచిరి. అయినను వస్త్రములను ధరించలేదు. ఆ మహాత్ముని మనమున దాల్చి నమస్కరించిరి.

ఆ తరువాత వ్యాసుడరుదెంచెను. పుత్రుని అన్వేషించుచు వచ్చెను. అతడు వృద్ధుడు. పైగా వస్త్రములను ధరించియుండెను. అయినను వ్యాసుని జూడగనే అప్సరస్త్రీలు వస్త్రములను ధరించి సిగ్గుతో నిలబడిరి.

వ్యాసుడు వారిని ప్రశ్నించెను. "అప్సరసలారా! ఏమిటి మీ వింత ప్రవర్తనము? నా కుమారుడు యౌవనవంతుడు. అతనిని జూచి మీరు సిగ్గుపడలేదు. నన్ను గాంచి సిగ్గుపడుచుంటిరి. కారణమేమి?" యని అడిగెను.

"అయ్యా! నీ కుమారుడు యవ్వనవంతుడైనను, అతడు నీవలె మమ్ములను ప్రశ్నించలేదు. ఆయన యువకుడైనను వృద్ధునితో సమానుడు. అందుచేత ఆయనను జూచి మేము సిగ్గుపడలేదు. మీరు మమ్ములను గుర్తించినారు. పైగా కారణ మడిగినారు" యని సమాధాన మొసగినారు అప్సరస్త్రీలు.

శుకునకు భేదము గోచరించదు. ఆ దివ్యాత్మునికి స్త్రీలో స్త్రీత్వము గోచరించదు. బ్రహ్మమే గోచరించును. అతడు అందరిలో, అంతటా పరమాత్మనే దర్శించును.

శుకుడు గోచియు లేక పైజన జూచి తోయము లందు ల
జ్జకు జలింపక చీర లొల్లక చల్లులాడెడి దేవక
న్యకలు హా! శుక యంచు వెన్క జనంగ వ్యాసుని జూచి యం
శుకములన్ ధరియించి సిగ్గున స్రుక్కి రందఱు ధీనిధీ!

"సూతుడా! అవధూతయగు అట్టి శుకబ్రహ్మ గంగాతీరమున ఎట్లు లభించెను? అతడు గృహస్థుల ఇండ్లలో పండ్రెండు నిమిషముల కన్నను ఎక్కువకాలము నిలువడు. అట్టి దివ్యాత్ముడగు శుకదేవుడు ఏడురోజులు గంగాతీరమున ఎలా వసించెను? మహాత్ముడైన శుకయోగి నుండి భాగవతామృతమును పానము చేసిన పుణ్యాత్ముడు పరీక్షిత్తుని గూర్చి కూడా మాకు తెలుపుము;" యని శౌనకాది మునులడిగిరి.

క॥ పారముల నెల్ల నెఱుగుదు పారగుడవు భాషలందు బహువిధ కథనో
దారుడవు మాకు సర్వము భారము ముట్టంగ దెలియ బలుకు మహాత్మా

శౌనకాది మునులిలా ప్రశ్నించగా సూతుడు భాగవతరచనకుగల కారణమును, రచనోద్దేశ్యమును తెలుపుచున్నాడు.

వ్యాసుని నైరాశ్యము

ద్వాపర యుగము ముగియు సమయ మాసన్నమాయెను. సత్యవతీ నందనుడగు వ్యాసుడు ఒకనాడు సరస్వతీ నదీజలములలో స్నానాది కర్మములను ముగించి, నిర్మలమై, పవిత్రమై నొప్పారు బదరికాశ్రమమున ధ్యానచిత్తముతో కూర్చొని యుండెను.

వ్యాసుడు వేదములను సంస్కరించిన మహనీయుడు. అష్టాదశ పురాణములకు కర్తయైనవాడు. బ్రహ్మసూత్రములను రచించినవాడు. వేదవ్యాసుడని కీర్తింపబడెను.

వ్యాసుడు అశ్రుపూర్ణవదనుడై విచారములో గూర్చొని యుండెను. ఆ దారిన అదే సమయానికి వెడుచుండిన నారదమహర్షి వ్యాసుని గాంచెను. వ్యాసుని ముఖారవిందమున గోచరమయ్యే బాధను గ్రహించెను. వ్యాసుని ప్రశ్నించెను: "పరాశరాత్మజా! మీ వదనమున విషాదఛాయలు అలుముకొనుటకు కారణమేమి? సర్వశాస్త్ర పారంగతులైన మీకు అశాంతి ఎలా ఏర్పడినది?"

ఉ॥ ధాతవు భారతశ్రుతి విధాతవు వేదపదార్థజాత వి
జ్ఞాతవు గామ ముఖ్యరిపు షట్క విజేతవు బ్రహ్మతత్త్వ ని
ర్ణేతవు యోగినేతవు వినేతవు నీవు చలించి చెల్లరే
కాతరు కైవడిన్ వగవ గారణమేమి పరాశరాత్మజా!

నారదుని మాటల నాలకించిన వ్యాసుడు ఇలా పలికెను: "నారదమునీంద్రా! అదియే నాకును అవగత మగుటలేదు. నీవు త్రిలోక సంచారివి. జ్ఞానివి. నీకు తెలియని విషయము లేదు. నీవు సూర్యునివలె మూడులోకముల యందు చరించుచుందువు. వాయుదేవుని వలె నిఖిల లోకముల యందు మెలగుచుందువు. బ్రహ్మ శరీరము నుండి పుట్టినవాడవు. పురాణపురుషుడైన విష్ణుమూర్తిని కీర్తించుచుందువు. అన్ని దిక్కులయందు నీ పవిత్రపాదముల నుంచితివి. గొప్ప జ్ఞానవంతుడవై తరించితివి.

క॥ పుట్టితి వజు తనువున జేపట్టితివి పురాణపురుషు భజనము పదముల్
మెట్టితివి దిక్కులం దుది ముట్టితివి మహాప్రబోధమున మునినాథా!

"మునీంద్రా! నీకు తెలియని ధర్మము ఏ లోకమునను లేదు. సమస్తమును దర్శించినవాడవు. ఈ నా నైరాశ్యమునకు కారణమేదియో నీకు తెలియును. దయతో నాకు వివరింపుము.

క॥ నీ కెఱుగరాని ధర్మము లోకములను లేదు బహువిలోకివి నీవున్
నా కొఱత యెట్టి దంతయు నాకున్ వివరింపుమయ్య నారద కరుణన్

నారదుడు క్షణకాల మాలోచించి వ్యాసునితో ఇలా పలికెను: "మహాత్మా! నీవు ధర్మార్థకామములను తెలిపెడి త్రివర్గములను గూర్చి మహాభారతాది గ్రంథములలో రచించితివి. శ్రీమహావిష్ణువు యొక్క దివ్యగాథలను కీర్తించు మోక్షప్రదాయకమగు గ్రంథమును రచింపకుంటివి. హరినామ స్తుతికి నోచుకోని కావ్యము విచిత్రార్థములతో గూడి యుండినను కాకుల గర్తమువలె యుండును.

"మహాత్మా! వ్యాసా! జటిలమైన వేదాంత శాస్త్రమును ప్రవచించిన నీవు భగవద్భక్తిని గూర్చి ప్రత్యేకముగా ప్రవచించవైతివి. ఎంతటి జ్ఞానము కలిగినను భక్తి లేనిదే ముక్తి రాదు. భగవానుని అనంత కల్యాణ గుణములను కీర్తించకపోవుటయే నీ ఆవేదనకు ముఖ్యకారణము. హరిభక్తిని విరివిగ పంచెడి భాగవత కావ్యమును రచించి, మీ హృదిలోని ఆవేదనను పోగొట్టుకొనుడు" యని తెలియజేసెను.

ఉ॥ అంచితమైన ధర్మచయ మంతయు జెప్పితి వందులోన నిం
చించుక గాని విష్ణుకథ లేర్పడ జెప్పవు ధర్మముల్ ప్రపం
చించిన మెచ్చునే గుణవిశేషము లెన్నిన గాక నీకు నీ
కొంచెము వచ్చుటెల్ల హరి గోరి నుతింపుమి నార్యపూజితా!

నిర్గతకర్మము, నిరుపాధికమునగు జ్ఞానము హరిభక్తి లేకుండా సిద్ధించదు. ఈశ్వరార్పణ బుద్ధితో చేయబడని కర్మము ఈశ్వరప్రియము గాబోదు. భక్తిరహిత కర్మ జ్ఞానములు నిరర్థకములు. కనుక భవబంధములను తొలగించు వాసుదేవుని లీలా విశేషములను వర్ణింపుమని నారదుడు వ్యాసునికి చెప్పెను. భక్తియుతుడు సంసారమున చిక్కడు. భక్తిరస వశీకృతుండై హరిచరణ సేవను సదా చేయుచుండు ననెను.

ఓం నమో భగవతే వాసుదేవాయ ధీమహి
ప్రద్యుమ్నాయానిరుద్ధాయ నమ స్సంకర్షణాయ చ

అని నారదుడు కీర్తించి, కృష్ణనామ వైభవమును వివరించుచు తన పూర్వజన్మ వృత్తాంతమును వివరించెను.

నారదుని పూర్వజన్మ వృత్తాంతము

పుణ్యకర్మలన్నియు పుణ్యశ్లోకుడగు శ్రీహరిని కీర్తించుటకేనని నారదుడు చెప్పెను. తపస్సు, వేదాధ్యయనము, యజ్ఞానుష్ఠానము, దానము మొదలగువాని ఏకైక ప్రయోజనము పురాణపురుషుడైన శ్రీహరి గుణకీర్తనమే యని పలికిన నారదుడు తన పూర్వజన్మ విషయమును వ్యాసుని కెరింగించెను.

నారదుడు శాపవశాత్తు ఒక దాసి గర్భమున జన్మింపవలసి వచ్చెను. నారదుని తల్లి వేదవాదరతులగు బ్రాహ్మణుల కడ దాసిగా నుండెను. వర్షఋతువు యరుదెంచెను. యోగులైన ఆ బ్రాహ్మణులు ఒకచోట చాతుర్మాస్యవ్రతము నాచరించుచుండిరి. నారదుడు వారికి సేవ చేయుచుండెడివాడు.

బాల్యక్రీడలను బాలుడైన నారదుడు మానివేసెను. ఇంద్రియములను నిగ్రహించెను. మితభాషియై యుండెను. బాలుని ప్రవర్తనమును మెచ్చిన యోగులు అతనిని ప్రేమతో చూచుచుండిరి. ఒకసారి వారు తినగ మిగిలిన ఉచ్ఛిష్టాన్నమును బాలున కొసంగిరి. ఆ ప్రసాదమును భుజించుటచేత నారదునికి ప్రసన్నత ఏర్పడినది. పాపము తొలగినది. చిత్తము పరిశుద్ధమైనది. భగవత్కథల యందు ఆసక్తి మెండైనది.

చాతుర్మాస్యవ్రత సమయమున వేదవాదులగు ఆ యోగులు నిత్యము కృష్ణకథలను గానము చేయుచుండిరి. ఆ దివ్యకీర్తనమును నారదుడు శ్రవణము చేయుచుండెను. శ్రవణఫలముగా శ్రీహరియందు దృఢమైన భక్తి కలిగినది. భక్తి వలన బుద్ధి స్థిరపడినది. గుణదోషము లంతరించినవి. చాతుర్మాస్యము సమాప్తియగు సమయ మాసన్నమాయెను.

యోగులు నారదునికి ఉపదేశము నొసంగిరి. ఆ క్షణము నుండి నారదునికి అర్పణ భావము ఏర్పడినది. సమర్పణ భావము సిద్ధించినది. కర్మలు బంధములు గాకుండెను.

ఆమయో యశ్చ భూతానాం జాయతే యేన సువ్రత
తదేవ హ్యామయం ద్రవ్యం న పునాతి చికిత్సితమ్,
ఏవం నృణాం క్రియా యోగాః సర్వే సంసృతి హేతవః
త ఏవాత్మ వినాశాయ కల్పన్తే కల్పితాః పరే ॥

"వ్యాసుడా! రోగకారణములగు పదార్థములను భుజించుట వలన రోగములెలా ఉపశమింపవో, అజ్ఞాన జనితమైన కర్మలవలన కర్మరూపమగు సంసారము నివృత్తి గాదు. రోగకారణములగు ఆ పదార్థములనే వేరే పదార్థములతో కలసి సేవించునపుడు అవి హాని చేయవు సరిగదా మేలును చేకూర్చును. అలాగే కర్మలు బంధహేతువు లైనప్పటికి ఆ కర్మలనే ఈశ్వరార్పణ బుద్ధితో చేసినచో అవి బుద్ధిని శుద్ధిచేసి ముక్తికి సాధకమగుచున్నవి.

"మహర్షీ! ఈ విధముగా శ్రీకృష్ణుని నేను సేవించుచుంటిని. పరమాత్మ కరుణించినవాడై నాకు జ్ఞానమును, ఐశ్వర్యమును ప్రసాదించెను" యని నారదుడు పలికెను. వ్యాసుని కోర్కె ననుసరించి తన శేషజీవిత విశేషమును గూడ వివరించెను.

నారదుని తల్లి ఒకనాడు ఆవును పాలు పితుకుటకై వెడలెను. ఆమెను త్రోవలో సర్పము కాటువేయగా ఆమె మరణించెను. అద్దానిని గూడ నారదుడు ప్రసాదముగనే స్వీకరించెను. ఆమె మరణానంతరము నారదుడు ఉత్తరదిక్కుగా వెడలెను. ఒక చెట్టు క్రింద కూర్చుని ధ్యానించుచుండెను. ఆ సమయమున శ్రీమహావిష్ణువు నారదుని హృదయమున దర్శనమొసగెను. శ్రీహరి హృదయమున దివ్య దర్శనమును జూపగనే స్పందించిన నారదునికి రోమాంచమాయెను. నేత్రములు ఆనంద బాష్పములతో నిండిపోయెను. ఈలోగా నారాయణుడు అంతర్హితుడాయెను.

నారదుడు దుఃఖించసాగెను. భగవద్దర్శనాభిలాషియై విలపించసాగెను. అంతట నారాయణుని అశరీరవాణి ఇలా పలికెను: "వత్సా! ఈ జన్మమున నీవు నన్ను దర్శించలేవు. వాసనలతో గూడియున్న చిత్తము నన్ను దర్శించలేదు. నాపై నీకు భక్తి కలుగుటకు, విస్తరించుటకు నేను నీకు ఒకమారు నా దర్శనము నొసగితిని. నీవు మహాత్ములకు చేసిన సేవవలన నీ బుద్ధి స్థిరపడినది. భక్తిని చేయుచు నింద్యమగు ఈ దేహమును త్యజించి నీవు నాకు దాసుడవయ్యెదవు" అనెను.

తదనంతరము నారదుడు సిగ్గును విడచి హరినామ సంకీర్తనము జేసెను. భగవత్కథలను స్మరించెను. సంతుష్టచిత్తుడాయెను. అహంకార, మమకారములను విడచెను. నిర్మత్సరుడయ్యెను. దేహమును త్యజించెను. పాంచభౌతికమగు శరీరము పతనమాయెను. ఈవిధముగా నారదుడు విష్ణుపార్షదు డయ్యెను.

"వ్యాసుడా! నీ ఆవేదనకు కారణమును నీ వడుగగా చెప్పితిని. అంతేగాదు. నా జన్మ, కర్మ విశేషములను గూడ తెలిపితిని;" యని పలికిన నారదుడు వ్యాసుని యనుజ్ఞను బొంది, వీణను మ్రోగించుచు, వాసుదేవుని దివ్య నామమును కీర్తించుచూ వెడలిపోయెను. నారదుడు అదృష్టవంతుడని సూతుడు శౌనకాదులతో చెప్పెను.

అశ్వత్థామ అనర్థావేశము

నారదమహర్షి వెడలిన తరువాత సరస్వతీ నదీతీరమున యున్న శమ్యాప్రాసమను ఆశ్రమమున ఆసీనుడై వ్యాసుడు శ్రీమద్భాగవతమును రచించెను. పరమపవిత్రమగు ఈ భాగవతమంతయు తన కుమారుడగు శుకునకు బోధించెను.

కురుక్షేత్రమున యుద్ధము ముగిసెను. భీమసేనుని గదాఘాతములచే దుర్యోధనుని తొడలు విరిగిపోయెను. దుర్యోధనునకు సంతసమును కల్పించు ప్రయత్నములో అశ్వత్థామ ఆలోచనా రహితుడై నిద్రించుచున్న ద్రౌపదీ కుమారుల శిరస్సులను ఖండించెను. దుర్యోధనుడు సంబరపడునని భావించి అశ్వత్థామ అనర్థావేశములో ఆ పని చేసెను. కానీ దారుణమైన ఈ కృత్యమును దుర్యోధనుడు గూడ ఖండించెను. అందరూ అశ్వత్థామను నిందించిరి.

తలలు తెగి పడియున్న తనయులను గాంచి దుర్భర దుఃఖముచే ద్రౌపది విలపించసాగెను. దుస్సహమగు శోకముచే కదలిపోయెను. ఏడ్చుచున్న ద్రౌపదిని అర్జునుడు ఓదార్చెను.

"కళ్యాణీ! దుఃఖింపకుము. పోయిన నీ తనయులు తిరిగిరారు. ఏడ్చినంత మాత్రమున నీవు వారిని పునర్జీవితులను గావింపలేవు. నీ బిడ్డలను వధించిన బ్రాహ్మణాధముడగు అశ్వత్థామ యొక్క శిరస్సును ఖండించి నీకు బహుమానముగ నిచ్చెదను. ఆ శిరస్సుపై ఆసీనురాలవు గమ్మ. పుత్రుల దహన సంస్కారములు ముగిసిన పిదప స్నానము చేయుము;" యని పలికి రథము నెక్కి గురుపుత్రుడగు అశ్వత్థామ ననుసరించెను.

కన్ను మిన్ను గానని స్థితిలో అనర్థావేశమున వ్యక్తి పాపము నాచరించును. పాపము కర్మ ముగియగనే ముగియదు. పాపిని పాపము వెంటబడుచునే యుండును. కొందరు మోసము చేసి ధనము నార్జింతురు. కానీ తాము చేసిన పాపము మదిలో కదలుచునే యుండును. నిద్రను నివారించుచునే యుండును.

రథారూఢుడై వచ్చుచున్న అర్జునుని దూరము నుండియే గాంచిన అశ్వత్థామ భీతి చెందినవాడై పరుగిడెను. అర్జునుడు తన సమీపమునకు వచ్చుచుండెను. ఏమిచేయుటకు తోచక ఉపసంహరించుట తెలియకపోయినను అశ్వత్థామ బ్రహ్మాస్త్రమును ప్రయోగించెను. ఈ బ్రహ్మాస్త్రము వలన ప్రచండమైన అగ్ని బయలుదేరి సమస్త లోకములను పీడింపసాగెను. ఏమి చేయవలెనో తోచని అర్జునుడు భగవానుడైన శ్రీకృష్ణుని ప్రార్థించెను.

పరిస్థితులు మన అధీనములో యుండవు. ఏ క్షణమునైనను తారుమారు గావచ్చును. పరిస్థితులు విషమించినపుడు భీతిచెంద నవసరములేదు. పరమాత్మను ప్రార్థింపవలెను. భగవన్నామమును పలుకవలెను. పరిస్థితుల నెదుర్కొను శక్తిని భగవానుడు

మనకు ప్రసాదించును. భక్తుడైన అర్జునుడు బ్రహ్మాస్త్రము వలన సర్వదిక్కుల యందు ప్రకటమైన తేజమును గాంచి, భీతిచెంది పరమాత్మను ప్రార్థించెను.

"శ్రీకృష్ణా! మహాబాహో! ఈ భయంకరాగ్ని సర్వవ్యాపక మగుచున్నది. దీని పుట్టుక ఎక్కడో తెలిసివచ్చుట లేదు. నీవు తప్ప మాకు రక్షకు లెవ్వరును లేరు" యని ప్రార్థించెను.

సీ॥ పద్మలోచన కృష్ణ భక్తాభయప్రద వినుము సంసారాగ్ని వేగుచున్న
జనుల సంసారంబు సంహరింపగ నీవు దక్క నన్యులు లేరు తలచి చూడ
సాక్షాత్కరించిన సర్వేశ్వరుండవు ప్రకృతి పరుండవు ప్రభుడ వాద్య
పురుషుండవగు నీ ప్రబోధంబుచే మాయ నడతువు నిశ్శ్రేయ సాత్మయందు

ఆ॥ మాయయందు మునిగి మనువారలకు గృపసేసి ధర్మముఖ్య చిహ్నమయిన
శుభము సేయుచుందు సుజనుల నవనిలో గావ బుట్టుదువు జగన్నివాస!

క॥ ఇదియొక తేజము భూమియు జదలును దిక్కులును నిండి సర్వంకషమై
యెదురై వచ్చుచు నున్నది విదితముగా నెఱుగ జెప్పవే దేవేశా!

అని అర్జునుడు పలుకగా శ్రీకృష్ణుడు ఇలా చెప్పుచున్నాడు: "అర్జునా! అశ్వత్థామ బ్రహ్మాస్త్రమును ప్రయోగించెను. అతడు ప్రయోగము నెరుగునే గాని ఉపసంహారము నెరుగడు. అర్జునా! నీవు ఉపసంహరింపగలవు. అందుచేత వెంటనే ఆ కార్యమును పూర్తి చేయుము" యనెను.

అర్జునుడు శ్రీకృష్ణుని వచనములను శిరోధార్యముగా భావించెను. అశ్వత్థామ ప్రయోగించిన బ్రహ్మాస్త్రమును నివారించుటకు తన బ్రహ్మాస్త్రమును సంధించుటకు నిర్ణయించుకొని శ్రీకృష్ణునికి నమస్కరించెను.

అశ్వత్థామ ప్రయోగించిన బ్రహ్మాస్త్రమును అర్జునుడు సునాయాసంగా ఉపసంహరించగలడు. కానీ ప్రతి కార్యారంభము నందు పరమాత్మను స్మరించడం అర్జునునకు అలవాటయింది. అదియే అతనిని విజయుడుగా తీర్చిదిద్దింది. మనము కూడా పరమాత్మకు నమస్కరించిన తరువాతనే కార్యము నాచరించాలి. మనలో శక్తి సామర్థ్యము లుండవచ్చును. కానీ మనకు విజయమును చేకూర్చునది పరమాత్మ కృపయేనని మరువరాదు.

భగవత్కృపచే అర్జునుడు బ్రహ్మాస్త్రములను నివారించెను. తరువాత క్రుద్ధుడైన అర్జునుడు అశ్వత్థామను యజ్ఞపశువును బంధించినట్లు బంధించెను.

శ్రీకృష్ణుడు క్రుద్ధుడై అర్జునునితో ఇలా పలికెను: "అర్జునా! ఈ అశ్వత్థామ దారుణ పాపము నొనరించినాడు. నిరపరాధులు, నిద్రితులునైన బిడ్డలను రాత్రిపూట వధించినాడు. ఇతడు క్రూరుడు. నిర్దయుడు. ఈ బ్రాహ్మణాధముని వధింపుము. ఇతడు క్షమాభిక్ష కర్హుడుగాడు.

చ॥ వెఱచిన వాని దైన్యమున వేదుఱు నొందిన వాని నిద్ర మై
మఱచిన వాని సౌఖ్యముగ మద్యము ద్రావిన వాని భగ్నుడై
పఱచిన వాని సాధు జడభావము వానిని గావుమంచు వా
చఱచిన వాని గామినుల జంపుట ధర్మముగాదు ఫల్గునా!

"ఈ బ్రాహ్మణాధముడు చంపగూడని వారిలో చేరడు. ఈ మూఢుని వధించుటయే శ్రేయస్కరము. అర్జునా! ఈ దుష్టుని శిరస్సును కానుకగా నిచ్చెదనని నీవు చెప్పుటను నే నాలకించితిని. ఇతడు గావించిన దుష్టకార్యమును దుష్టుడైన దుర్యోధనుడు గూడ సమర్థించలేదు. అట్టివానిని విడచుట మంచిది గాదు. ఇతడు వధార్హుడే" యనెను.

అర్జునుడు శ్రీకృష్ణుని వచనముల నాలకించెను. కానీ అశ్వత్థామను వధించుట యను కార్యమును విడచిపెట్టెను. గురుపుత్రుడైన బ్రాహ్మణుని వధించినచో పాపమొచ్చునేమో యని అర్జునుడు ఆలోచించెను. ఒక కార్యమును ఆచరించేముందు ఈ కార్యాచరణము పుణ్యమును ఇచ్చునా; పాపమును దించునా? అని ఆలోచింపవలెను. పాపకార్యమైనచో త్యజింపవలెను. పుణ్యాత్ములు పాపము నాచరించుటకు వెనుకాడుచుందురు. పాపమును గాంచి సాధకుడు భయము నొందుట ఒక చక్కని సుగుణము. ఈ సుగుణము వ్యక్తిని శీలవంతునిగ తీర్చిదిద్దును.

అశ్వత్థామను పశువువలె బంధించిన అర్జునుడు అతనిని ద్రౌపది వద్దకు తీసికొని పోయెను. అవమానముతో అశ్వత్థామ తలవంచి నిలబడియుండెను. "ఆవేశములో శిశువులను సంహరించితిని. ఆ దుష్టకార్యమును ఎందుకు చేసితిని?" యని తనలో తాను చింతించుచుండెను. పదుగురిలో తలవంచుకొని నిలబడెడి కార్యము నెప్పుడూ చేయరాదు. పాపము మనిషి తేజస్సును హరించును. వందనీయుడగు వ్యక్తి నిందనీయుడైనచో అది అతనికి మరణము కంటెను ఘోరమై యుండును.

అశ్వత్థామ బంధింపబడి యుండుటను ద్రౌపది సహింపలేకపోయెను. "అతనికి విముక్తిని ప్రసాదింపుడు. నాథా! ఆలోచింపుము. ఎవరివద్ద నీవు అస్త్ర శస్త్ర విద్యలలో పారంగతుడ వైతివో పుణ్యాత్ముడగు ఆ ద్రోణాచార్యుడు పుత్రుడైన ఈ అశ్వత్థామ రూపమున నున్నాడు. ఇతనిని వధించుట గురువును వధించుటయే కాగలదు. అతడు పాపము నాచరించి యుండవచ్చును. నీవును అతనివలె పాపము నాచరింతువా!

"నాథా! ఆలోచింపుము. బిడ్డలను పోగొట్టుకొని నేను దుఃఖించుచున్నాను. ఇతనిని వధించినచో నావలెనె ఇతని తల్లిగూడ రోదించును" యనెను.

ఇచ్చట ద్రౌపది చక్కని ఆదర్శమును అందించుచున్నది. అపకారికి సైతము ఉపకారము చేయు సన్మార్గమును చూపుచున్నది. ఆగ్రహము నెవ్వరైనను ప్రదర్శింపగలరు. నిగ్రహమును ప్రదర్శించువారే పుణ్యాత్ము లనబడెదరు.

బాధలకు గురియైనవారు అలాంటి బాధలు ఇతరులకు సంక్రమించ గూడదని సంకల్పించాలి. తన కేమి జరిగినను తన ద్వారా పాపము జరుగకూడదని ఆలోచించాలి.

ద్రౌపది చెప్పుచున్నది. "నాకు పుత్రులు లేరు. కానీ భర్తలున్నారు. అశ్వత్థామ తల్లియగు కృపి భర్తను పోగొట్టుకొని యున్నది. ఆమెకు ఆశాజ్యోతి బిడ్డడొక్కడే. ఆ వెలుగును గూడ ఆర్పి కృపిని అంధకార కూపములో పడవేయుట సముచితము గాదు" యని ద్రౌపది పలికెను. ద్రౌపది వచనములు సర్వులకు ఆమోదయోగ్యములై, కర్ణపేయములై యుండెను.

బంధింపబడియున్న అశ్వత్థామకు ద్రౌపది నమస్కరించెను. ఇంటి గడప వద్దకు వచ్చిన వాడెవడైనను అతనికి నమస్కరించాలి. ఇంటికి వచ్చినవానిని అవమాన పరచగూడదు. ద్రౌపది అశ్వత్థామతో ఇలా పలికెను:

"తండ్రీ! ఈ పని నీకు తగునా! నా భర్తలందరు మీ తండ్రియైన ద్రోణాచార్యుని వద్ద విద్య నభ్యసించినారు. నీ రూపమున నీ తండ్రియే భాసించుచున్నాడు. శిష్యులైనవారు బిడ్డల వంటివారు. వారి పుత్రులు మీకు పౌత్రులగుదురు. బాలురైన ఆ పసికందులను నిర్దయుడవై అలా దారుణముగా ఎలా వధించితివి?

క॥ భూసురుడవు బుద్ధి దయా భాసురుడవు శుద్ధ వీర భట సందోహా
గ్రేసరుడవు శిశుమారణ మాసురకృత్యంబు ధర్మమగునే తండ్రీ!

"గురుపుత్రా! బిడ్డలు బలిష్ఠులు గారు. శస్త్రధరులు గారు. నిన్నెదిరించలేరు. పైగా వారు శయ్యపై నిద్రించుచున్నారే గాని రణరంగమున లేరు. నీకు వారు ఏమి ద్రోహము చేసితిరి? యుద్ధరంగములో శత్రువుల శిరస్సులను ఖండించినట్లు అమాయకంగా నిద్రించు బాలుర శిరస్సులను ఖండించితివి. నీ చిత్తమెలా అంగీకరించినది? నీ చేతులెలా ఆచరించినవి?

"బ్రాహ్మణోత్తమా! నిన్ను అర్జునుడు బంధించి తెచ్చెనన్న వార్త నీ తల్లికి తెలిసినచో ఆమె ఎంత కుమిలిపోవునో గదా యని నేను విచారించుచున్నాను. నిర్దాక్షిణ్యంగా శిశువులను వధించినచో వారి తల్లినగు నేను దు:ఖింతునని నీ కనిపించలేదా" యనెను.

ధర్మయుతమై, కరుణా పూరితమైన ద్రౌపది పలుకులను సర్వులు ఆమోదించిరి. భీమునకు ద్రౌపది మాటలు నచ్చలేదు. భీముడిలా పలికెను.

"ఈ దుష్టబుద్ధిని విడువకూడదు. ద్రౌపది వెఱ్ఱిదానివలె ప్రసంగించినది. వీడు బ్రాహ్మణుడా! కాడు. కిరాతకుడు. తన బిడ్డలను చంపిన ఈ హంతకుని వధింప కుండుడని ద్రౌపది ఉన్మాదినివలె పలుకుచున్నది. ఈ దౌర్భాగ్యుని చంపవలసినదియే. మీలో ఎవరైనను ఇతనిని వధింపుడు. లేనిచో నా పిడికిటి పోటుతో వాని శిరమును భిన్నము చేసెద" నని పలుకుచూ భీమసేనుడు ద్రౌపది అశ్వత్థామల మధ్యకు వచ్చి నిలబడెను.

శ్రీకృష్ణుడు భీమసేనుని శాంతింపజేసెను. అర్జునునితో శ్రీకృష్ణుడిట్లనెను: "కిరీటీ! శిశువులను నిర్దాక్షిణ్యముగ సంహరించిన ఈ దుష్టాత్ముడు వధార్హుడే. కానీ గురుపుత్రు డైనందున ఇతనిని ద్రౌపది చెప్పినట్లు సంహరించుటయు తగదు. కనుక ఇది వధ గాకుండా చూడుము. అలాగని విడచిపెట్టకుము. మధ్యమార్గము నవలంబించుము."

ఉ॥ అవ్యుడు గాడు వీడు శిశుహంత దురాత్మకు డాతతాయి హం
తవ్యుడు బ్రహ్మబంధు డగు దప్పదు నిక్కము బ్రాహ్మణో న హం
తవ్య యటంచు వేద విదితం బగు గావున ధర్మ దృష్టి గ
ర్తవ్యము వీని గాచుట యథాస్థితి జూడుము పాండవోత్తమా!

అని శ్రీకృష్ణుడు పలుకగనే భగవానుని ఆంతర్యమును గ్రహించిన అర్జునుడు ఖడ్గమును చేబూని అశ్వత్థామ కేశములను ఖండించి అతని మస్తకమున భాసించుచున్న మణిని హరించెను. దానితో అశ్వత్థామ తేజోవిహీనుడాయెను.

అశ్వత్థామకు తగిన దండనయే విధింపబడినదని సర్వులు భావించిరి. కానీ తనకు మరణమే ఈ శిక్షకన్నా నయమని అశ్వత్థామ భావించెను. అవమానము కన్నా మరణమే మేలు. అశ్వత్థామ వెడలిపోయెను. పాండవులు శోకతప్తమైన ద్రౌపదితో గూడి మరణించిన శిశువులకు దహన సంస్కారములను గావించిరి.

కుంతీదేవి భగవానుని కీర్తించుట

పరలోకగతులగు బంధువులకు పాండవులు తర్పణము లొసంగిరి. సోదరులతోను, గాంధారీ ధృతరాష్ట్రులతోను, కుంతి, ద్రౌపది మొదలగువారితో గూడినవాడై ధర్మరాజు గంగాతీరమున ఆసీనుడై యుండెను. అందరూ బంధునాశమును తలచుకొని దుఃఖించుచుండిరి. మునులతో గూడియున్న శ్రీకృష్ణుడు వారి నోదార్చెను. ఈ లోకమున ఎవ్వరూ కాలము నతిక్రమింపలేరనియు, కాలచక్రము నతిక్రమించుట ఎవ్వరికిని సాధ్యపడదు యని భగవానుడు తెలిపెను.

కాలము ఎవ్వరినీ కనికరించదు. కాలములోనే ఒకనాడు మృత్యుగాలము మనిషికి ఎదురౌతుంది. ఈ సత్యమును గ్రహించి దీపముండగనే ఇంటిని చక్కబెట్టుకోవాలి. కాలము మనకొరకు ఆగదు. ఆగని కాలాన్ని దృష్టిలో నుంచుకొని బ్రతుకును సాధనలో ముందుకు సాగించుకోవాలి.

దుర్యోధనుడు గ్రహించిన రాజ్యమును శ్రీకృష్ణుడు మఱల ధర్మరాజున కొసంగెను. ధర్మరాజు చేత మూడు అశ్వమేధయాగములను చేయించెను. ధర్మరాజు యొక్క కీర్తి ఇంద్రుని వలె వ్యాప్తి చెందెను.

శ్రీకృష్ణుడు ద్వారకకు వెడల దలచెను. సాత్యకి, ఉద్ధవులతో గలసి పయనమగుచుండెను. రథము నెక్కుచుండెను. ఇంతలో అభిమన్యుని ధర్మపత్నియగు ఉత్తర భీతితో కలత చెంది పరుగెత్తుకొని వచ్చెను. శ్రీకృష్ణుని శరణుజొచ్చెను.

పాహి పాహి మహాయోగిన్ దేవదేవ జగత్పతే
నాన్యం త్వదభయం పశ్యే యత్ర మృత్యుః పరస్పరమ్

"దేవదేవా! జగదీశ్వరా! మహాయోగీ! నన్ను రక్షింపుము. ఈ ప్రపంచమున ఒకరినొకరు చంపుకొనుటకు సిద్ధపడియున్నారు. నీవు తప్ప ఈ లోకమున నా కభయమిచ్చువారు లేరు.

"అగ్నులను విరజిమ్ముచూ ఈ బాణము నా వైపునకు పరుగెత్తుకొని వచ్చుచున్నది. నాథా! నన్ను అది దహించివేయు ననిపించుచున్నది. నా గర్భము నాశము గాకుండునట్లు ఆశీర్వదింపుము" అని ఉత్తర శ్రీకృష్ణుని ప్రార్థించెను.

శ్రీకృష్ణుడు తన దివ్యదృష్టిచే సమస్తమును గ్రహించెను. అవమానముచే క్రుద్ధుడైన అశ్వత్థామ ఈ ప్రపంచమున పాండవ శేషమును మిగల్చగూడదని భావించి బ్రహ్మాస్త్రమును ప్రయోగించెనని గ్రహించెను. ఈలోగా మండుచున్న ఐదు బాణములు పాండవులవైపు వచ్చుచుండెను. శ్రీకృష్ణుడు సుదర్శన చక్రముచే ఆ బాణములను నివారించెను. తనను నమ్మి జీవించు భక్తులను భగవానుడు సదా రక్షించుచుండును.

బ్రహ్మాస్త్రమును గాంచి ఉత్తర వ్యాకులపడెను. కానీ ఆమె తనవారైన పాండవుల నాశ్రయించలేదు. శ్రీకృష్ణుని శరణుజొచ్చెను. ఆశ్రయమైనవాడు అచ్యుతుడే గాని అన్యులు గారని ఉత్తర గ్రహించెను. అందుచేతనే శ్రీకృష్ణుడు ఉత్తర గర్భమును రక్షించెను.

అశ్వత్థామ ప్రయోగించిన బ్రహ్మాస్త్ర ప్రభావముచే ఉత్తరయొక్క గర్భము భిన్నమగునని భావించిన పరమేశ్వరుడు ఉత్తరయొక్క ఉదరములో ప్రవేశించి తన యోగమాయచే ఆమె గర్భమును కప్పివైచెను.

పుట్టుక నెరుగని పరమాత్మ ఉత్తర గర్భములోనికి ప్రవేశించెను. శ్రీకృష్ణుడు జన్మించినట్లు దేవకీ వసుదేవులకు భావము కలిగెనే గాని వాస్తవానికి శ్రీకృష్ణుడు గర్భములో ప్రవేశించినదిలేదు. జన్మించినది లేదు. సర్వగతుడైన వానికి ఉపాధి ఎలా పొసగును? అయినను భక్తసులభుడైన పరమాత్మ ఉత్తర గర్భములో ప్రవేశించెను. అచ్చట పెరుగుచుండిన పరీక్షిత్తుని రక్షించెను.

పరీక్షిత్తు నొక్కనినే గాదు; ప్రతి జీవిని తల్లి గర్భములో పరమాత్మయే రక్షించు చున్నాడు. పుట్టిన తరువాత తానే రక్షించుచున్నాడు. గిట్టిన తరువాత గూడ తానే రక్షిస్తున్నాడు. సర్వవేళల సర్వ జీవులను పరమాత్మయే రక్షించుచున్నాడు.

శ్రీకృష్ణుడు ద్వారకకు వెడలుటకు సిద్ధపడెను. ద్రౌపదితోను, కుమారులతోను గూడినదియై కుంతీదేవి శ్రీకృష్ణుని సమీపించి స్తుతింపసాగెను.

కుంతీదేవి శ్రీకృష్ణుని సమీపించి ఆయనకు నమస్కరించెను. ప్రతిరోజు శ్రీకృష్ణుడు కుంతీదేవికి నమస్కరించును. కానీ నేడు కుంతీదేవి శ్రీకృష్ణునికి నమస్కరించినది. "అత్తమ్మా! అదేమిటి? నేను నీ మేనల్లుడను. నేను నీకు నమస్కరించాలి గాని నీవు నాకు నమస్కరింపగూడదు" యని శ్రీకృష్ణుడనెను.

"కృష్ణా! ఇంతవరకు నే నలాగే భావించితిని. కానీ నేడు నీ స్వరూపము నాకు తెలిసివచ్చినది. నీవు సాక్షాత్తు పరమాత్మవు. సర్వులకు ఆరాధ్యమూర్తివి. నీవు ఆదిదేవుడవు. సర్వగతుడవు. ఇంద్రియాతీతుడవు. అపరిచ్ఛిన్నుడవు.

కృష్ణాయ వాసుదేవాయ దేవకీ నందనాయ చ
నందగోప కుమారాయ గోవిందాయ నమోనమః

"నందగోప తనయుడు, దేవకీ పుత్రుడు, వాసుదేవుడు, గోవిందుడు నగు శ్రీకృష్ణునకు పదే పదే నమస్కరించుచున్నాను."

నమః పంకజనాభాయ నమః పంకజమాలినే
నమః పంకజ నేత్రాయ నమస్తే పంకజాంఘ్రయే

"పద్మమును నాభియందు గలవానికి నమస్కారము. పద్మమాలను కంఠము నందు ధరించిన వానికి నమస్కారము. పద్మలోచనుడగు వానికి నమస్కారము. పద్మచిహ్నములైన పాదములు గలవానికి నమస్కారము.

"కృష్ణా! దుష్టుడైన కంసుడు నీ తల్లిదండ్రులను కారాగారమున బంధించి చాలాకాలము బాధించినాడు. నీవు తల్లిదండ్రులకు విముక్తిని ప్రసాదించితివి. అలాగే నేను గూడా నీవలన నా పుత్రులతో గూడ విముక్తిని బొందితిని" యనెను.

భక్తులైన వారికి భగవానుడు సదా మేలు చేయుచునే యుండును. కానీ దానిని మనుజులు విస్మరించుచుందురు. పరమాత్మ జీవితములో మనకు ప్రసాదించిన అవకాశములను స్మరించుకొని సదా ఆయనకు భక్తులమై యుండవలెను. పరిస్థితులు మారవచ్చును. కానీ భక్తి మారకూడదు.

కురుక్షేత్రమున అర్జునుడు తీవ్రముగా వ్యథచెందెను. అట్టి దుఃఖములో గూడ పరమాత్మనే శరణుజొచ్చెను. కుంతీదేవికి ఈనాడు ఏవిధమైన కష్టములు లేవు. ధర్మరాజు రాజ్యపాలనము చేయుచున్నాడు. అయినను ఆమె శ్రీకృష్ణుని ధ్యానించుచునే యున్నది. భీష్ముడు అంపశయ్యపై పరుండి యుండినపుడు గూడ శ్రీకృష్ణుని ధ్యానించి, విష్ణుసహస్ర నామమును గాన మొనరించెను. దుఃఖములోగాని, సుఖములోగాని, అవసానదశయందు గాని స్మృతిలో నిలువదగిన ఆశ్రయుడు శ్రీకృష్ణుడే యని ఈ ముువ్వురును ఋజువు చేసిరి.

కుంతీదేవి శ్రీకృష్ణునికి అమోఘమైన ప్రార్థనను వినిపించెను. గతంలో ఈవిధమైన ప్రార్థనను ఎవ్వరు చేసియుండరు.

విపదః సన్తు నః శశ్వత్తత్ర తత్ర జగద్గురో
భవతో దర్శనం యత్స్యా దపునర్భవ దర్శనమ్

"కృష్ణా! ఏ ఆపదలయందు నీవు మాకు దర్శనము నొసంగుచుందువో అట్టి ఆపదలను మఱల మఱల మా కొసంగుము" యనెను.

కుంతీదేవి ఆపదల నివ్వమని ఆహ్వానించుచున్నది. పరమాత్మను మరపించే సంపదల కన్నను పరమాత్మను జ్ఞాపకము చేయు ఆపదలే శ్రేయస్కరములని భావించినది.

"కృష్ణా! నీవు బాలుడుగ యుండినపుడు నేను గోకులమునకు వచ్చితిని. ఆనాడు నేనొక వింత దృశ్యమును గాంచితిని. నీవు పెరుగుకుండను పగులగొట్టితివని యశోద

నిన్ను త్రాటితో బంధించుటకు త్రాడును తెచ్చినది. అప్పుడు నీవు కన్నీటిని కదలించితివి. కాటుక జారి చెక్కిళ్ళ నంటినది. భయపడుతూ తలను వంచి నిలబడితివి. ఆ దృశ్యము ఇప్పటికిని నా కళ్ళముందు నిలిచియే యున్నది" యనెను.

భగవానుని దివ్యమయ లీలలను స్మృతికి తెచ్చుకొని మననశీలురగువారు, మాధవ నామామృత పానచిత్తులు నగు భక్తులు సదా కృష్ణానందము నందే మైమరచి యుందురు. కుంతీదేవి వలె శ్రీకృష్ణుని దివ్యమయ చేష్టలను, వాటిలోని అంతర్భావములను సాధకులు సదా స్మరించుకొనుచుండవలెను. కర్మలమధ్య భగవానుడు స్మృతిలో కదలవలెను. లేదా నామము ద్వారా రూపమును, రూపము ద్వారా రూపరహిత చైతన్యమును అనుభవమునకు తెచ్చుకొనవలెను.

శృణ్వన్తి గాయన్తి గృణన్త్యభీక్ష్ణశః స్మరన్తి నన్దన్తి తవేహితం జనాః
త ఏవ పశ్య న్త్యచిరేణ తావకం భవ ప్రవాహో పరమం పదాంబుజమ్

"కృష్ణా! నీ చరితమును ఎవరు సదా ఆలకించుచుందురో, కీర్తించుచుందురో, పలుకుచుందురో, స్మరించుచుందురో, ఆనందించుచుందురో అట్టివారు త్వరగ భవబంధముల నుండి విముక్తులై నీ పాదారవిందములను దర్శించుదురు."

"కృష్ణా! నీవే మా దైవము. నీవే మాకు గమ్యము. నిన్ను ఆశ్రయించుకొని మేము జీవించుచున్నాము. అట్టి మమ్ములను వదలి వెళ్ళదలచితివా ప్రభూ! ప్రాణము లేని దేహము వలె నీవులేని పాండవులుందురు. మేము పాలించు ఈ భూమి నీ పాద చిహ్నములతో శోభించుచున్నది. నీవు వెడలినచో దాని శోభ అంతరించును. తండ్రీ! పాండవులపై నాకున్న ప్రేమను త్రుంచివేయుము. కృష్ణా! అఖండమగు గంగా ప్రవాహము సాగరము . వైపునకే పరుగులిడునట్లు, అన్యరాగ మెరుగని నా బుద్ధి నీయందే రమించుచున్నది;"యనెను.

ఉ॥ యాదవులందు బాండవుల యందు నధీశ్వర! నాకు మోహ వి
చ్ఛేదము సేయుమయ్య, ఘనసింధువు జేరెడి గంగభంగి నీ
పాద సరోజ చింతనముపై ననిశంబు మదీయ బుద్ధి న
త్యాదరవృత్తితో గదియు నట్లుగ జేయగదయ్య యీశ్వరా!

కుంతీదేవి మధుర వచనములతో శ్రీకృష్ణుని స్తుతించెను. ఆయన దివ్యలీలలను కీర్తించెను. శ్రీకృష్ణుడు మందహాసమును చిందించుచు ఆమెను మోహమునకు గురి చేసెను. శ్రీకృష్ణుడు బయలుదేరుటకు సిద్ధమాయెను. కుంతీదేవి శ్రీకృష్ణునకు నమస్కారము నందించెను.

శా॥ శ్రీకృష్ణా! యదు భూషణా! నరసఖా! శృంగార రత్నాకరా!
లోకద్రోహి నరేంద్ర వంశ దహనా! లోకేశ్వరా! దేవతా
నీక బ్రాహ్మణ గోగణార్తి హరణా నిర్వాణ సంధాయకా
నీకున్ మ్రొక్కెద ద్రుంపవే భవలతల్ నిత్యానుకంపానిధీ!

శ్రీకృష్ణుడు బయలుదేరుటకు సిద్ధమయ్యెను. శ్రీకృష్ణుని తమతోపాటు కొంత కాల ముండుమని ధర్మరాజు ప్రార్థించెను.

ధర్మరాజు దుఃఖమగ్నుడై యుండెను. తన బంధువులందరు మరణించిరని వగచుచుండెను. వ్యాసాది మహర్షులు గూడ హితోపదేశము చేసిరి. అయినను అతని మనసు శాంతించలేదు. అతడు తీవ్ర శోకమునకు గురియయ్యెను.

"ఆహా! నేనెంత మూర్ఖుడను? స్వార్థపరుడను? నా హృదయములో అజ్ఞానాంధకారము దట్టముగ వ్యాపించియున్నది. ఒకనాడు నక్కలకు, కుక్కలకు ఆహారమగు ఈ దేహముకొరకు ఎన్నో అక్షౌహిణీ సేనలను సంహరించితిని. బ్రాహ్మణులను వధించితిని. స్నేహితులను సంహరించితిని. మిత్రులను మట్టుబెట్టితిని. సోదరులను చంపితిని. గురువులను హరించితిని. ఈ పాపమునకు నిష్కృతి లేదు. ఎన్నికోట్ల జన్మలెత్తినను ఈ పాపము కరుగదు.

"యుద్ధమున వధించుట పాపకార్యము గాదని శాస్త్రములు వచించుచున్నను నా మది కుదుటపడుటలేదు. తృప్తి కలుగుట లేదు. స్త్రీలకు భర్తలను దూరము చేసిన పాపము యజ్ఞకర్మల ద్వారా పోతుందని నేను భావించుట లేదు.

యథా పంకేన పంకాంభః సురయా వాసురాకృతమ్
భూత హత్యాం తథైవైకాం న యజ్ఞైర్మార్ష్టు మర్హతి

"బురదనీటిని బురదతో శుభ్రము చేయలేము. కల్లుకుండను కల్లుతో పరిశుద్ధ మొనర్పలేము. అలాగే ఒక్క ప్రాణినైనను హింసించుట వలన కలిగిన పాపమును బహు యజ్ఞము లాచరించినను పోగొట్టుకోలేము;" యని ధర్మరాజు దుఃఖించుచుండెను.

"ఎందుకు చంపితిని?" అని యుద్ధానంతరము ధర్మరాజు విలపించుచున్నాడు. "ఎందుకు చంపాలి?" యని అర్జునుడు యుద్ధారంభముననే దుఃఖించెను. పూర్వ సంకల్పము మనిషిని పరిపూర్ణునిగ మార్చుతుంది. గతజల సేతుబంధనము ఎవ్వరికి శ్రేయము నొనగూర్చదు.

ధర్మరాజు దుఃఖమును గాంచి ద్వారకకు బయలుదేరిన శ్రీకృష్ణుడు తిరిగి హస్తినాపురమునకు వచ్చెను.

"నా ప్రార్థన నాలకించి శ్రీకృష్ణుడు ప్రయాణము నాపుకొని తిరిగి వచ్చెను" యని కుంతీదేవి భావించి సంతృప్తి చెందెను.

" నా అభ్యర్థనను మన్నించి శ్రీకృష్ణుడు హస్తినాపురమునకు తిరిగి వచ్చెను" యని ధర్మరాజు భావించెను. తన ఆవేదనను తొలగించుటకే అచ్యుతు డరుదెంచెనని అభిప్రాయపడెను.

"నాకు కృష్ణుడు స్నేహితుడు. మిత్రులను వదలి చనుట అంత సులభసాధ్యమైన పని గాదు. నా భాగ్యము పండినది" యని అర్జునుడు చింతించెను.

"నా సోదరుడు గనుక నామీద ప్రేమతో వెళ్ళలేక తిరిగి వచ్చెను" అని సుభద్ర భావింపగా, నాయందు గల వాత్సల్యముచే వెనుదిరిగి వచ్చెనని ద్రౌపది భావించెను.

అయినా శ్రీకృష్ణుడు ఏ కారణము వలన తిరిగి వచ్చెను? ఏమో ఆ జగన్నాథునకే ఎరుక. తమ కొరకే వచ్చినట్లు అందరూ భావిస్తున్నారు. కానీ నిర్యాణమునకు సిద్ధంగా యున్న మహాభక్తుడగు భీష్మునికి దర్శనము నొసగుటకు వచ్చినాడని ఎందరికి తెలుసు?

భీష్మ నిర్యాణము

యుద్ధఫలితములు యుధిష్ఠిరుని కలతపెట్టెను. భీష్ముడు అంపశయ్యపై పరుండి యుండెను. ధర్మజ్ఞుడైన భీష్ముని కడ ధర్మరహస్యముల నెరిగినచో ధర్మజుని బుద్ధి స్థిరపడునని భావించిన శ్రీకృష్ణుడు ధర్మరాజుని భీష్ముని కడకు పంపెను.

భీష్ముడు శరతల్పగతుడై యున్న ప్రదేశమునకు ధర్మరాజు వెళ్ళెను. ఆయన వెంట ఆయన సోదరులు, వ్యాసుడు, ధౌమ్యుడు, శ్రీకృష్ణుడు గూడ వెళ్ళిరి. భీష్ముని దర్శించుటకు అనేకమంది రాజర్షులు, బ్రహ్మర్షులు, దేవర్షులు వచ్చియుండిరి. నారద, వ్యాస, భరద్వాజ, వసిష్ఠ, గౌతమాదులు గూడ వచ్చియుండిరి.

మహాత్ముల మరణము మంగళకరమైనది. దానిని గాంచుటకు దివ్యాత్ములెల్లరు విచ్చేసిరి. మహాత్ములు జీవనదుల వంటివారు. నది పుట్టిన చోటికి వెళ్ళి చూసినచో దాని వైభవ మేమియును గోచరించదు. కానీ అదే నది సాగరమున సంగమించునపుడు విశాలముగా, శోభాయమానముగా గోచరించును.

మహాత్ముల జననము సామాన్యముగనే యుండును. కానీ వారి నిర్యాణము అమోఘముగ యుండును. అద్భుతముగ యుండును. చరించడములోనే నది విశాలమైంది. జీవించడములోనే మహాత్ముడు వికాసమును బొందుతాడు.

భీష్ముడు తనను దర్శించుటకు వచ్చిన మునులందరికి నమస్కరించెను. సదా తన హృదయంలో అర్చింపబడుతున్న అంతర్యామియగు శ్రీకృష్ణదేవుడు మాయామానుష విగ్రహుడై ఎదుట నిలబడి యుండుటను గాంచెను. దివ్య పారవశ్యంతో చలించిపోతూ చేతులెత్తి శ్రీకృష్ణునకు నమస్కరించెను.

ప్రేమానురాగ జనిత బాష్పములతో నిండిన నేత్రములు గల భీష్ముడు పాండవులను జూచెను. వినయ ప్రేమ సుందరులయిన పాండునందనులను గాంచి గంగానందనుడు స్పందించెను.

"పాండవులారా! మీరు ధర్మము నాశ్రయించి జీవించినారు. బ్రాహ్మణులను అనుసరించినారు. భగవానుని దిక్కుగా దలచి బ్రతికినారు. అయినను మిమ్ములను బాధలు వదలిపెట్టలేదు. కష్టాలు కనికరించలేదు. ఇది చాలా విచిత్రముగా నాకు దోచుచుండును.

ఆ॥ ధరణి సురులు హరియు ధర్మంబు దిక్కుగా బ్రతుక దలచి మీరు బహు విధముల
నన్నలార! పడితి రాపత్పరంపర లిట్టి చిత్రకర్మ మెందు గలదె?

"పాండవులారా! మీరు శిశువులుగా యున్న కాలమున మీ తండ్రి పాండురాజు మరణించెను. మిమ్ములను వృద్ధిజేయుటకు నా కోడలగు కుంతీదేవి ఎంతగానో శ్రమించినది. అనేక కష్టములను అనుభవించినది.

"నాయనలారా! మేఘములు వాయువు యొక్క అధీనములో యుండి కదలునట్లు ఈ ప్రపంచము కాలాధీనమై యున్నది. కాలము ప్రసాదించే కష్టముల ననుభవింపక తప్పదు. భగవానుని లీలలు సామాన్యులకు అనూహ్యములు. ఏ సమయమున ఎవరి జీవితమును ఏ విధముగ మార్చునో ఎవ్వరికీ తెలియదు. అతని మాయను గాంచుటలో మహాత్ములు గూడ అంధులే యగుచున్నారు.

ఆ॥ ఈశ్వరుండు విష్ణు డెవ్వేళ నెవ్వని కేమి సేయు బురుషు డేమి యెఱుగు
నతని మాయలకు మహాత్ములు విద్వాంసు లడగి మెలగుచుందు రంధులగుచు

"పాండవులారా! దైవతంత్రమైన ఈ విషయమున మీరు చింతింప నవసరము లేదు. ధర్మరాజా! నీ భాగ్యమే భాగ్యము! సర్వగతుడైనవాడు నీకు సర్వమై నిలిచాడు. చూసితిరా! భగవానుని కరుణ అనిర్వచనీయము. అప్రమేయము. మరణ సమయమున ఈ దీనుని కరుణించుటకు తానే స్వయముగా వచ్చియున్నాడు. నా మరణమును మంగళకరము జేయుటకు ప్రేమతో అరుదెంచినాడు" అనెను.

మహాత్ముడైన భీష్మునికి మరణకాలమున మాధవదర్శన మగుచున్నది. మరణము మంగళకరముగ మారుచున్నది. పరమాత్మను దర్శించుచు ప్రాణములను విడువవలెనని భీష్ముడు సంకల్పించెను. దానిని నిజము చేయుటకు నిరంజను డరుదెంచెను.

జీవితము శుభముగ నడచినచో మృత్యువు గూడ శుభకరముగనే యుండును. జీవితకాలమంతయు పరమాత్మను ధ్యానించు వారలకు మృత్యు సమయమున యమదూతలకు బదులుగ యదుభూషణుడు దర్శనమిచ్చును. "భగవాన్! నా మరణ సమయమున నా నేత్రములలో నిలువుము" అని నిత్యము భగవంతుని స్మరింపవలెను.

స దేవదేవో భగవాన్ ప్రతీక్షతాం కలేవరం యావదిదం హినోమ్యహమ్

"దేవదేవుడగు భగవానుడు నా యెదుట యుండి ఈ దేహము పతనమగు వరకు నాకు గోచరించుగాక!" యని భీష్ముడు తలచెను.

సూతుడు చెప్పుచున్నాడు: "శౌనకాది మునులారా! ఆ సమయమున ధర్మరాజు అనేక విషయములను, ధర్మసూక్ష్మములను అడిగెను. భీష్ముని ద్వారా చక్కని ధర్మములను నేర్చెను. రాగ వైరాగ్యోపాధులతో గూడిన ప్రవృత్తి నివృత్తి ధర్మములను చెప్పెను. దానధర్మములను, రాజ ధర్మములను, ధర్మార్థ కామమోక్షములను, వానిని బొందు సాధనములను తెలియజేసెను. సర్వ ధర్మములలో ఉత్తమమగు ధర్మ మెయ్యది? యని ధర్మరాజడిగెను. విష్ణుసహస్రనామమును పారాయణము చేయుటయే ఉత్తమ ధర్మమని భీష్ముడు తెలిపెను. విష్ణుసహస్రనామ పారాయణము వలన సర్వదుఃఖములు ఉపశమించునని భీష్ముడు తెలిపెను.

దివ్యాత్ములైన శ్రీకృష్ణార్జునుల సంవాదము వలన మనకు భగవద్గీత లభించినట్లు, భీష్మ యుధిష్ఠిర సంవాద ఫలితముగ మనకు విష్ణుసహస్రనామము* లభించినది. భగవద్గీతను శ్రవణము చేయుటకు అర్జునుడు అధికారి యైనట్లు, విష్ణుసహస్రనామమును ఆలకించుటకు ధర్మరాజు అధికారి యయ్యెను. ధర్మయుత జీవనము, సహనము, శాంత స్వభావములతో జీవితమును సత్యమార్గములో నడుపుటయే అతని అర్హతకు కారణములైనవి.

ఉత్తరాయణ పుణ్యకాలము సమీపించినది. ఈ పుణ్యకాలమున దేహమును చాలింపవలెనని భీష్ముడు అభిలషించి యుండెను. భీష్ముడు ఇంద్రియములను అంతర్ముఖము గావించెను. మనస్సును అనాసక్త మొనర్చెను. శ్రీకృష్ణుని యందే లగ్నమొనర్చెను. శ్రీకృష్ణుని దర్శించుచు ప్రాణములను త్యజించుటకు సిద్ధపడెను. భీష్ముడు శ్రీకృష్ణుని స్తుతించెను. ఇది అసమాన స్తోత్రము. దీనినే భీష్మస్తుతి యనియు, భీష్మస్తవరాజ స్తోత్రమనియు పిలుతురు. వ్యాసభగవానుడు అద్భుతముగా రచించిన ఈ స్తుతిని పోతనామాత్యుడు ఆంధ్రమున అత్యద్భుతముగ తెనిగించెను. కొన్నిటిని అందించే ప్రయత్నమును చేయుదును.

మ॥ త్రిజగన్మోహన నీలకాంతి తనువుద్దీపింప బ్రాభాత నీ
రజ బంధు ప్రభమైన చేలము పయిన్ రంజిల్ల నీలాలక
వ్రజ సంయుక్త ముఖారవింద మతి సేవ్యంబై విజృంభింప మా
విజయుం జేరెడు వన్నెలాడు మది నావేశించు నెల్లప్పుడున్

"సృష్టికి కారణభూతుడు, యదుశ్రేష్ఠుడు, త్రిభువన సుందరాకారుడు, నీలమేఘ శ్యాముడు, పీతాంబరధారి, అర్జున సఖుడు, యుద్ధరంగమున గుఱ్ఱపు డెక్కలచే లేచిన దుమ్ముచేత కప్పబడినవాడు, ముంగురుల నుండి జారిన స్వేద బిందువులు గలవాడు, నా శరఘాతములచే గాయపడిన దేహము గలవాడు నగు శ్రీకృష్ణుని యందు నా చిత్తము స్థిరముగా నిలుచుగాక!

క॥ తనవారి జంప జాలక వెనుకకు బో నిచ్చగించు విజయుని శంకన్
ఘన యోగ విద్య బాపిన మునివంద్యుని పాదభక్తి మొనయున్ నాకున్

మహాభారత యుద్ధమున ఏ విధమైన అస్త్రశస్త్రములు ధరింపనని శ్రీకృష్ణుడు ప్రతిజ్ఞ చేసెను. యుద్ధరంగమున భీష్ముని బాణముల తాకిడికి అర్జునుడు కలత చెందెను. మూర్ఛిల్లెను. అది గాంచిన శ్రీకృష్ణుడు రథమునుండి క్రింది కురికెను. రథచక్రమును చేబూని ఏనుగు మీదికి దుముకు సింహము వలె పరుగెత్తెను. ఆ దివ్యరూపమును గాంచి భీష్ముడు పరవశించెను. తన్మయుడయ్యెను. తన జన్మ ధన్యమైనదని భావించెను. భక్తుడైన అర్జునునకు విజయమును చేకూర్చుటకు తన ప్రతిజ్ఞను వమ్ము చేసికొనుటకు గూడ భగవానుడు వెనుకాడలేదు. తాను అపజయము పాలైనను తన భక్తులకు జయము కలుగవలెనని భావించెను. ఆ ప్రేమను దర్శించి భీష్ముడు పులకాంకితుడయ్యెను. భగవానుడు రథచక్రమును చేబూని తనపై కురికిన ఆ ప్రేమమయ దృశ్యమును పోతనామాత్యుడు అత్యద్భుతముగ రచించెను.

---

* స్వామీజీ రచించిన "విష్ణుసహస్రనామము" వ్యాఖ్యానము చూడగలరు.

సీ॥ కుప్పించి యెగసిన గుండలంబుల కాంతి గగన భాగంబెల్ల గప్పి కొనఁగ
నుఱికిన నోర్వక యుదరంబులో నున్న జగముల వ్రేగున జగతి గదల
జక్రంబు జేపట్టి చనుదెంచు రయమున బైనున్న పచ్చని పటము జాఱ
నమ్మితి నాలావు నగుబాటు సేయకు మన్నింపు మని క్రీడి మఱల దిగువ
తే॥ గరికి లంఘించు సింహంబు కరిణి మెఱసి నేడు భీష్ముని జంపుదు నిన్ను గాతు
విడువు మర్జున యనుచు మద్విశిఖ వృష్టి దెరలి చనుదెంచు దేవుండు దిక్కునాకు.

ఈవిధమైన రూపము తన నేత్రములలో నిలిచి యుండుగాక! యని భీష్ముడు స్తుతించుచున్నాడు. ధర్మరాజు రాజసూయయాగ మొనరించినపుడు సభామధ్యమున శోభించిన దివ్యరూపము తనకు నేత్రపర్వ మొనర్చుగాక యని ధ్యానించుచున్నాడు.

ఏ భగవానుని పలుకులను, నవ్వులను, నడకలను అనుకరించి ప్రేమ స్వరూపిణులగు గోపికలు బంధములను తొలగించుకొని తరించిపోయిరో అట్టి శ్రీకృష్ణ భగవానుడు తన చిత్తమున నిలుచుగాక యని ప్రార్థించుచున్నాడు.

క॥ పలుకుల నగవుల నడపుల నలుకల నవలోకనముల నాభీరవధూ
కులముల మనముల తాలిమి కొలుకులు వదలించు ఘనుని గొలిచెద మదిలోన్

ఈవిధముగా శ్రీకృష్ణుని హృదయంబున దాల్చి, నిశ్వాసల నాపెను. ఇంద్రియ మనోబుద్ధులను కృష్ణుని యందే నిలిపెను. శ్వాసను నిరోధించి ప్రాణములను త్యజించెను. నిరుపాధికమైన వాసుదేవ పరబ్రహ్మము నందు భీష్ముడు లీనమయ్యెను. దానిని గాంచి సర్వులు సాయంకాల సమయాన పక్షులవలె మౌనముగా నిలబడిపోయిరి. ఆకాశమునుండి పుష్పవృష్టి వర్షించినది.

ధర్మరాజు భీష్మునకు అంత్యక్రియల నాచరించెను. నిగ్రహమును కోల్పోయి పిల్లవానివలె దుఃఖించెను. ధర్మరాజు శ్రీకృష్ణుని వెంటనిడుకొని హస్తినాపురమునకు వచ్చెను. దుఃఖితులై యున్న గాంధారీ ధృతరాష్ట్రులను ఓదార్చెను. ధృతరాష్ట్రుని ఆజ్ఞతో, శ్రీకృష్ణుని ఆశీర్వాదముతో ధర్మరాజు రాజ్యమును పాలింపసాగెను.

భీష్ముడు మహాభక్తుడు. ఆయన గాథ అమరగాథ. ఆయన జీవితము సర్వులకు ఆదర్శనీయము. అనుసరణీయము. స్ఫూర్తిదాయకము.

భీష్ముని గూర్చి మహాత్ములు ఒక చక్కని విషయమును చెప్పుచుందురు. దీనికి ప్రమాణ మున్నట్లు నాకు తెలియుటలేదు. అయినను విషయము సరసపూర్ణమై యున్నందున భావజగత్తులో విహరించుట కుపకరించునని భావించి తెలుపుచున్నాను.

భీష్ముడు అంపశయ్యపై యుండెను. ఆ సమయమున శ్యామసుందరుడు భీష్ముని ప్రశ్నించెను. "భీష్మా! నీవు ధర్మాత్ముడవు. ధర్మజ్ఞుడవు. అధర్మపరులైన దుర్యోధనాదుల వైపు నిలబడి పోరుట నీకు తగునా?" యని ప్రశ్నించెను.

అందులకు భీష్ముడు ఇలా సమాధాన మిచ్చెను. "భగవంతా! నా దేహము కౌరవుల సైన్యమున నిలబడి యుండెనే గాని నా మనస్సంతయు పాండవులవైపే యుండెను. నీవు అర్జున సారథివి. నేను కౌరవుల పక్షమున నిలబడినచో యెదురుగ నిన్ను గాంచు భాగ్యమునకు నోచుకొందును. పాండవుల వైపు నిలచినచో ఇట్టి భాగ్యము ప్రాప్తించునా?" యని భీష్ముడు ప్రశ్నించినాడట. ఎంత చక్కని భావము! సదా పరమాత్మనే దర్శించాలని అభిలషించే ఆ మహాత్ముని హృదయ సౌందర్యమును ఎవరు వర్ణించగలరు?

శ్రీకృష్ణుని ద్వారకానగర ప్రవేశము

ధర్మరాజు రాజయ్యెను. బంధువులను వధించితి ననెడి బాధను మనసులో ధరించి యుండెను. అందుచేత రాజ్యభోగముల యందు ఆసక్తి లేకుండెను. కానీ రాజ్యమును చక్కగా పాలించుచుండెను. ధర్మము చతుష్పాదములతో చరించుచుండెను.

సకాల వర్షములుండెను. గోవుల పొదుగులు క్షీరపూర్ణమై యుండెను. పంటలు సమృద్ధిగ నుండెను. వృక్షములు రసపూర్ణములైన ఫలములతో నిండియుండెను. పాండవులను ఓదార్చుటకై శ్రీకృష్ణుడు కొంతకాలము హస్తినాపురములో యుండి, అక్కడనుండి ద్వారకకు బయలుదేరెను. శ్రీకృష్ణుని ఎడబాటును సహించలేక హస్తినాపురమున సర్వులు శోకసముద్రమున మునిగిరి. "శ్రీకృష్ణుని గూర్చి ప్రసంగించు సత్పురుషుల సాంగత్యమును వదలుటచే చాలా దు:ఖము ననుభవించుచుందుము. సాక్షాత్తు శ్రీకృష్ణునితో కలిసి తిరిగినవారు ఆయన వియోగమును భరింపగలరా?" యని సూతుడు ప్రశ్నించెను.

శ్రీకృష్ణుడు బయలుదేరు సమయమున దు:ఖించుట అమంగళకరమని భావించి పొంగివచ్చు దు:ఖమును పాండవులు ఆపుకొనుచుండిరి. మృదంగ భేరీ వీణాదులు మ్రోగింపబడినవి. శ్రీకృష్ణుని దర్శింప నభిలషించు అంత:పుర స్త్రీలు మేడలమీద నిలబడి పుష్పములను గురిపించిరి. అర్జునుడు ముత్యాల మాలాయుతమగు రత్న నిర్మితమైన దండముతో గూడిన తెల్లని ఛత్రమును శ్రీకృష్ణుని శిరముపై నుంచెను. రథముపై సాత్యకీ ఉద్ధవులు నిలబడి చామరములను బట్టుకొనిరి. దారిలో అన్నివైపుల నుండి పుష్పధార పడుచుండెను. "శ్రీకృష్ణునకు జై" యనెడి విజయఘోషలు మిన్నుముట్టుచుండెను. పురస్త్రీలందరు పరస్పరము సంభాషించుకొనుచు శ్రీకృష్ణుడే భగవానుడని చెప్పుకొనుచుండిరి. కొంతదూరము సైన్యమును వెంట నిడుకొని పాండవులు కృష్ణుని అనుసరించిరి. ఆయన యాజ్ఞచే వెనుదిరిగిరి.

ద్వారకకు చేరుసరికి సాయంత్రమయ్యెను. సూర్యుడు అస్తమించెను. శ్రీకృష్ణుడు రథము నుండి దిగి ఒక జలాశయమును జేరి సంధ్యావందనము నాచరించెను. సర్వసాధనా ఫలరూపమగు శ్రీకృష్ణునకు సంధ్యావందనము యొక్క అవసరమున్నదా? శ్రేష్ఠుడైన వాడు తనకు అవసరము లేకున్నను అన్యుల కాదర్శముగా నుండుటకు ఆయా కర్మముల నాచరించుచుండును.

యద్య దాచరతి శ్రేష్ఠ స్తత్త దేవేతరో జనః
స యత్ప్రమాణం కురుతే లోక స్తదనువర్తతే

"శ్రేష్ఠుడగువాడు దేనిని నాచరించునో ఇతరులు అద్దానినే ఆచరింతురు. శ్రేష్ఠుడు దేనిని ప్రమాణముగ గ్రహించునో ఇతరులును దానినే ప్రమాణముగ గ్రహింతురు" అని శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతలోని కర్మయోగము నందు తెలిపియున్నారు.

శ్రీకృష్ణుడు ద్వారకలో ప్రవేశించెను. పాంచజన్యమును పూరించెను. ఆ ధ్వని నాలకించిన ద్వారకావాసులు శ్రీకృష్ణుని దర్శింపవలె ననెడి అభిలాషతో పరుగెత్తికొని వచ్చిరి. మొదట ధ్వని వినిపించును. తరువాత దర్శనము లభించును. ఎవరయితే భగవన్నామ మనెడి ధ్వనిని విందురో వారే శ్రీకృష్ణుని దర్శనభాగ్యమును పొంది తరింతురు.

నామము జీవులను నామి వద్దకు చేర్చును. శంఖధ్వని ద్వారకావాసులను శ్రీకృష్ణుని వద్దకు చేర్చినది. నామము సర్వపాపములను పోగొట్టును. అధర్మపరుని గూడ నామము ఉద్ధరించుచున్నది.

సర్వ ధర్మ బహిర్భూత స్సర్వపాపరత స్తథా
ముచ్యతే నాత్ర సందేహో విష్ణోర్నామానుకీర్తనాత్

"సర్వ ధర్మముల నుండి తొలగినవాడైనను, సర్వపాపముల నాచరించువాడైనను భగవంతుని కీర్తించుట వలన ముక్తిని బొందుచున్నాడు" యని వైశంపాయన సంహితలో చెప్పబడి యున్నది.

శ్రీకృష్ణుడు ద్వారకలో శంఖమును పూరించెను. నామసాధన చేసినచో భవబంధములు తొలగునని పరోక్షముగా శంఖధ్వని ద్వారా తెలిపెను. ఈ విషయమునే సూతమహర్షి శౌనకాదులతో చెప్పుచున్నాడు.

తముపశ్రుత్య నినదం జగద్భయ భయావహమ్
ప్రత్యుద్యయుః ప్రజాః సర్వా భర్తృ దర్శన లాలసాః

"సంసార భయమునకు భయమును కల్గించు శంఖధ్వని నాలకించి తమ నాథుని దర్శించుటకు ద్వారకావాసులెల్లరు అచ్చటికి యరుదెంచిరి" యని సూతుడనెను. భగవన్నామమే భవభయహరము గనుక శంఖధ్వనిని నామకీర్తనగా సమన్వయించుటలో అసమంజస మేమియును లేదు.

ద్వారకావాసులు శ్రీకృష్ణుని చుట్టుముట్టిరి. నమస్కరించిరి. కుశలమడిగిరి. బిడ్డలు తండ్రితో భాషించునట్లు పులకితగాత్రులై పలికిరి.

"కృష్ణా! నీకు శుభము గలుగుగాక! నీవే మాకు తండ్రివి. తల్లివి. బంధువువు. నాథుడవు. గురుదేవుడవు. దేవదేవుడవు. నిన్ననుసరించు మా జన్మ ధన్యమైనది. స్వర్గవాసులకు సైతము అలభ్యమగు నీ దివ్యసుందర రూపము మాకు ప్రత్యక్షమైనది. కృష్ణా! బంధువుల కొరకై నీవు చాలాకాలము హస్తినాపురమున, వ్రజపురమున యుంటివి.

నీవు లేని మేము సూర్యుడు లేని నేత్రముల వలె యుంటిమి" యనిరి. శ్రీకృష్ణుడు వారితో భాషించి కుశలమడిగెను. ద్వారకావాసులిలా పలికిరి.

క॥ ఉన్నారము సౌఖ్యంబున విన్నారము నీ ప్రతాప విక్రమ కథలన్
మన్నారము ధనికులమై కన్నారము తావ కాంఘ్రి కమలములు హరీ:

క॥ ఆరాటము మది నెఱుగము పోరాటము లింద్లకడల బుట్టవు పురిలో
జోరాటన మెగయదు నీ దూరాటన మోర్వలేము తోయజనేత్రా!

యని ద్వారకావాసులు శ్రీకృష్ణుని ప్రార్థించిరి.

పరీక్షిత్తు జననము

నైమిశారణ్యంలో శౌనకాది మునులు సూతుని ప్రశ్నించుచున్నారు. "మహాత్మా! మహాజ్ఞానియగు పరీక్షిత్తుని వృత్తాంతమును తెలుపుడు. శుకుని ద్వారా పరీక్షిత్తు గ్రహించిన జ్ఞానమును శ్రద్ధావంతులమగు మాకు తెలుపుము" యనిరి.

సూతుడు శౌనకాదులకు చెప్పుచున్నాడు. "ధర్మరాజు ప్రజలను కన్నబిడ్డలవలె పాలించుచుండెను. శ్రీకృష్ణ చరణకమల సేవాభాగ్యము లభించుటచే అతనికి భోగముల యందు ఆసక్తి లేకుండెను. ఆకలిగొన్న వానికి ఆహారము తృప్తినొసగును గాని చందన తాంబూలాదులు తృప్తి నొసగవు. అలాగే ధర్మరాజునకు శ్రీకృష్ణ సందర్శనాభిలాష కన్నను అన్యముగా వేరొక వాంఛ లేకుండెను" యని పలికి పరీక్షిత్తుని జన్మవృత్తాంతమును సూతుడు చెప్పసాగెను.

అశ్వత్థామ ప్రయోగించిన బ్రహ్మాస్త్రము ఉత్తర గర్భములోనికి ప్రవేశించెను. చతుర్భుజుడగు నారాయణుడు ఆ సమయమున సుదర్శనచక్రధారియై పరీక్షిత్తుని రక్షించెను. ఆ దివ్య రూపమును పరీక్షిత్తు దర్శించెను. గదను త్రిప్పుచు బ్రహ్మాస్త్రమును ఛేదించుచున్న పురుషుని దర్శించెను. పరీక్షిత్తు పుణ్యాత్ముడు. తల్లిగర్భము నందే పరమాత్మను దర్శించిన ధన్యాత్ముడు.

పరీక్షిత్తు జన్మించెను. అనుకూలమైన శుభగ్రహములు ఆ సమయమున ఇతర గ్రహములతో కలిసి యుండెను. రెండవ పాండురాజు వలె పరీక్షిత్తు ప్రకాశించుచుండెను.

తస్య ప్రీతమానా రాజా విప్రై ర్ధౌమ్య కృపాదిభిః
జాతకం కారయామాస వాచయిత్వా చ మంగలమ్

"ధర్మరాజు ప్రీతిచెందిన చిత్తము గలవాడై ధౌమ్యుడు, కృపాచార్యుడు మున్నగు పెద్దలద్వారా స్వస్తి పలికించి, బాలునకు జాతకర్మాదుల నొనరించెను."

శుభఫలితమునకు సూచకంగా ధర్మరాజు అనేక దానములను చేసెను. జీవితములో మనకు ఏ శుభము కలిగినను అద్దానిని భగవత్ప్రసాదముగా స్వీకరింపవలెను. ప్రసాదమును ఒంటరిగ భుజింపరాదు. ఇతరులతో పంచుకొని అనుభవింపవలెను. కనుక ఏ

శుభఫలితము కలిగినను, దానిని ప్రసాదముగా స్వీకరించి, అందులో కొంతభాగమును సమాజమున కుపకరించవలెను. బాలుని జాతకమును చెప్పుమని ధర్మరాజు బ్రాహ్మణుల నడిగెను.

బ్రాహ్మణులు పరీక్షిత్తుని భవిష్యత్తు వైభవోపేతముగా నున్నదని కీర్తించిరి. అతడు అసమాన తేజోసంపన్నుడనిరి.

పరీక్షిత్తు ఇక్ష్వాకునివలె ప్రజలను రక్షించును. రామునివలె సత్యరూపుడగును. శిబివలె దానము లొసగును. అగ్నివలె భయంకరముగ నుండును. సాగరునివలె గంభీరముగ యుండును. సింహము వంటి పరాక్రమము గల్గియుండును. భూమివలె సహనము కల్గియుండును. శివునివలె ప్రసన్నుడై యుండును. హరివలె సర్వులకు ఆశ్రయస్థానమై యుండును. బలిచక్రవర్తి వలె ధైర్యవంతుడై యుండును. ప్రహ్లాదుని వంటి భక్తి కలిగి యుండును. యజ్ఞము లాచరించును. పెద్దలను గౌరవించును అని బ్రాహ్మణులు చెప్పిరి. ఉత్తరయొక్క కుమారునికి పరీక్షిత్తుయని నామకరణము చేసిరి. ఆ పేరెందులకు పెట్టిరి?

స ఏష లోకే విఖ్యాతః పరీక్షిదితి యత్ప్రభుః
గర్భే దృష్ట మనుధ్యాయన్ పరీక్షేత నరేష్విహ

"తల్లిగర్భమున దర్శించిన దివ్యపురుషుని ధ్యానించుచు, అతడు ప్రపంచమున గల జనులలో ఎవరాయని సదా అన్వేషించుచుండుటచేత అతడు పరీక్షిత్తుడని పిలువబడెను."

ప్రపంచము నామరూపాత్మకము. పరమాత్మ సచ్చిదానంద స్వరూపము. నామ రూపములలో నిగూఢమైయున్న పరమాత్మ నెవడు అన్వేషించుచుండునో అతడే పరీక్షిత్తు డనబడును. పరీక్షిత్తునివలె ప్రతి ఒక్కరు పరమాత్మ నన్వేషింపవలెను.

పరీక్షిత్తుడు బాలుడయ్యెను. బాల్యావస్థయందే అతడు ధర్మబుద్ధి గలవాడై యుండెను. కృష్ణభక్తుడై యుండెను. సర్వప్రాణి హితుడై యుండెను. బుద్ధిమంతుడై యుండెను.

విదురుని ఆగమనము - గాంధారీ ధృతరాష్ట్రుల నిర్గమనము

విదురుడు తీర్థయాత్రలు పూర్తిచేసికొని హస్తినాపురమునకు వచ్చెను. విదురుడు తీర్థాటన సమయాన ప్రభాస క్షేత్రమునకు రాగానే కౌరవులు మరణించిన వార్త ఉద్ధవుని ద్వారా తెలిసికొనెను. అనంతరము మైత్రేయునిద్వారా జ్ఞానమును బొంది బంధుజనులున్న హస్తినాపురమునకు వచ్చెను.

విదురుడు వాస్తవానికి బంధువులను సందర్శించుటకు రాలేదు. వారి బంధములను తొలగించుటకు వచ్చెను. విందు నారగించుటకు రాలేదు. వయస్సువచ్చినా విజ్ఞానము రాని ధృతరాష్ట్రునకు వికాసము నందించుటకు వచ్చెను.

విదురునకు ధర్మరాజాదులు స్వాగతము పలికిరి. ఇంతకాలము విదురుని చూడనందుకు బాధపడుతూ కన్నీటిని విడిచిరి. ధర్మరాజు విదురుని గూర్చుండబెట్టి పూజించెను.

విందారగించి విశ్రమించుచున్న విదురుని కడకేగి ధర్మరాజు అవనత శిరస్కుడై ఇలా పలికెను. "తండ్రీ! గతంలో మేము అనేక ఆపదలకు గురి అయితిమి. విషప్రయోగము, లక్కగృహ దహనము మొదలైన ఆపదల నుండి మీచే రక్షింపబడితిమి. పక్షి సంతానమువలె దిక్కు లేక యున్న మేము మీ పక్షపాత నీడలో పెరిగితిమి.

క॥ పక్షులు తమ ఱెక్కలలో బక్షంబులు రాని పిల్ల పదువుల మమతన్
రక్షించిన క్రియ మీరలు, పక్షీకరణంబు సేయ బ్రతికితిమి గదే

"తండ్రీ! మీ తీర్థాటన విశేషములను వివరింపుడు" యని ధర్మరాజు విదురుని అడిగెను. విదురుడు ముక్తసరిగ ముఖ్యమైన విషయములను మాత్రమే చెప్పెను.

తీర్థాటన యనునది పవిత్రమైన కార్యము. తీర్థక్షేత్రములను సందర్శించుట యనునది విషయ సేకరణకు, స్థలసందర్శనమునకు కాగూడదు. విశిష్ట జీవనమును గడుపుటకై యుండాలి. గృహస్థులైనవారు ఇంటిలో యుండి సాధనను కొనసాగించలేరు. అట్టివారు యాత్రలకు వెళ్ళి, పుణ్య క్షేత్రాలలో ఎక్కువకాలము విశేషసాధన లాచరించాలి. తీర్థాటన సమయాన సాధన విశేషముగా జరుగనిచో ఆ తీర్థయాత్ర నిష్ఫలమైనదని భావము.

విదురుడు కొన్ని సంవత్సరములు తీర్థయాత్రలు చేసెను. అయినను ఏమియు తెలియని వానివలె వినమ్రుడై యుండెను. ఆత్మస్తుతి విదురునకు మరణ సదృశమై యుండెను. నేటి కాలమున ఎవరైనను యాత్రలకు వెళ్ళినచో, వారు తిరిగివచ్చిన తరువాత ప్రక్కఇంటి వారికి నిద్రే యుండదు.

గొప్పలు చెప్పుకొనేందుకు, తప్పులు దాచుకొనేందుకు మనము అలవాటుపడి యున్నాము. శ్రేయోమార్గమున చరించువారు తప్పులను చెప్పాలి. ఒప్పులను దాచుకోవాలి. చేసిన పుణ్యాన్ని మరచిపోవాలి. చేసిన పాపాన్ని జ్ఞాపక ముంచుకోవాలి. దానివలన పుణ్యము ఎక్కువగా చేసుకొనే అవకాశము లభించును. పాపమును క్షాళన మొనర్చుకొనే పరిస్థితి ఏర్పడును.

కొన్ని రోజులు గడచెను. ఒకనాటి అర్ధరాత్రి సమయాన విదురుడు ధృతరాష్ట్రుని సమీపించెను. కాలమహిమను వివరించెను. ఈ ప్రపంచములోని సంయోగ వియోగాలను వివరించి చెప్పెను.

"రాజా! నీ సోదరులు, కుమారులు, బంధువులందరూ నాశనమైరి. నీ దేహము గూడ ముసలితనముచే నీరసించి యున్నది. నీ ఆయువు తీరు సమయ మాసన్నమగుచున్నది. ఇంకను నీవు పరుల గృహమును అంటిపెట్టుకొనియే యున్నావు.

"నీవు జాత్యంధుడవు. చెవిటివాడవైతివి. స్మృతిని కోల్పోయితివి. దంతములను పోగొట్టుకొంటివి. జీర్ణశక్తి నశించిపోయెను. కఫ ముద్భవించుచున్నది. అయినను నీవు విషయాసక్తిని విడచుటలేదు.

శా॥ పుట్టంధుండవు పెద్దవాడవు మహాభోగంబులా లేవు నీ
పట్టెల్లం జెడిపోయె దుస్సహ జరాభారంబు పైగప్పె నీ
చుట్టాలెల్లను బోయి రాలు మగడున్ శోకంబునన్ మగ్నులై
కట్టా దాయల పంచనుండ దగవే కౌరవ్యవంశాగ్రణీ!

"భ్రాతా! మీరు వారింటికి నిప్పుపెట్టితిరి. విషమును వారికి బెట్టితిరి. వారి భార్యయగు ద్రౌపది నవమానించితిరి. వారి సంపదలను దోచుకొంటిరి. రాజ్యము నపహరించితిరి. నేడు వారు పెట్టెడి అన్నమును దిని బ్రతుకుచున్నారు. ఇది మీకు ఉచితమా!

"ఒకవైపు దైన్యము ననుభవించుచు మరొకవైపు ధన్యుడవైనట్లు భావించు కొనుచున్నావు. నీ దేహము పాతవస్త్రమువలె జీర్ణమగుచున్నది. ఇది అనివార్యమైన విషయము.

అహో మహీయసీ జన్తోర్జీవితాశా యయా భవాన్
భీమాపవర్జితం పిండ మాదత్తే గృహపాలవత్

"ఆహా! ఈ ప్రపంచంలో జీవుల యాశ ఎంత విచిత్రమైనది? సోదరా! ఆశకు దాసుడవైన నీవు నీ పుత్రుని జంపిన భీముడుపెట్టు పట్టెడన్నమును పెంపుడు కుక్కవలె దినుచున్నావు" అనెను.

"విదురా! నన్ను ఏమి చేయమందువు? పైగా ఇది రాత్రికాలము" అని ధృతరాష్ట్రుడనెను.

"రాజా! దివారాత్రములు చక్షుష్మంతులకే గాని అంధులకు గాదు. పగటిపూట ధర్మరాజు మిమ్ములను వెళ్ళనివ్వడు. ఈ రాత్రి సమయమే అనువైనది. బయలుదేరుడు. ఉత్తరదిక్కుగా బయలుదేరుడు. రాబోవు కాలము అనుకూలమైనది గాదు," యనెను.

ధృతరాష్ట్రుడు అంగీకరించెను. గాంధారి, ధృతరాష్ట్ర విదురులు గలసి హిమాలయములకు వెళ్ళిరి. అచ్చట సప్తస్రోత మనుచోట వసింపసాగిరి.

పరమ పవిత్రమైన గంగానది సప్తఋషులను తృప్తిపరచుటకై ఈ సప్తస్రోత మనుచోట యేడు పాయలుగా చీలినది. అచ్చోట మూడువేళల ధృతరాష్ట్రుడు స్నానమాచరించుచు, జలమును మాత్రము గ్రహించుచు జీవించుచుండెను.

మరునాటి ఉదయము యుధిష్ఠిరుడు సంధ్యావందనాది కర్మములను పూర్తి చేసికొని గాంధారీ ధృతరాష్ట్రులకు నమస్కరించుటకై అంతఃపురములోనికి వచ్చెను. ఎంత వెదకినను విదురుడు, ధృతరాష్ట్రుడు, గాంధారి కనిపించలేదు. ఉద్విగ్న మనస్కుడైన ధర్మరాజునకు సంజయుడు అగుపించెను.

"సంజయా! వృద్ధుడు, అంధుడుయైన మా పెద్దతండ్రి ఎక్కడ? మా తల్లియగు గాంధారి ఎక్కడ? ఆత్మీయుడు, పినతండ్రి యగు విదురుడెక్కడ? బంధువులందరు మరణించుట వలన నావంటి దౌర్భాగ్యుని వలన కీడు కలుగునని భ్రమించి గంగలో దూకి జీవితమును సమాప్తము చేసికొనియెనా?

"సంజయా! నా మనస్సు కలవరపడుచున్నది. మా తండ్రి మా చిన్నతనముననే మరణించెను. వీరిరువురే మమ్ములను బిడ్డలవలె పెంచి పెద్దచేసినారు" అని దుఃఖింప సాగెను.

సీ॥ మా తల్లిదండ్రులు మందిరమున లేరు సంజయ! వారెందు జనిరొ నేడు
ముందఱ గానడు ముదుసలి మాతండ్రి పుత్రశోకంబున బొగులు దల్లి
సౌజన్యనిధి ప్రాణసఖుడు మా పినతండ్రి మందబుద్ధులమైన మమ్ము విడిచి
యెందు బోయిరో మువ్వు రెటిగింపు గంగలో దన యపరాధంబు దడవికొనుచు

ఆ॥ భార్యతోడ తండ్రి పరితాపమున బడు గపట మింతలేదు కరుణ గలదు
పాండు భూవిభుండు పరలోక గతుడైన మమ్ము బిన్నవాండ్ర మనిచె నతడు

ధర్మరాజు మాటల నాలకించి సంజయుడు దుఃఖించెను. కన్నీరు తుడుచుకొనుచు, "ధర్మరాజా! ప్రతి విషయమును ధృతరాష్ట్రుడు నాతో సంప్రదించుచుండెను. ఈ విషయమున నన్ను మరచిపోయెను. నిన్న విదురునితో శయ్యామందిరమున మంతనము లాడుచుండెను. నేడు వారెవ్వరూ లేనివారై, ఉన్న నన్ను ఏమియును లేని వానినిగ జేసిరి. నన్ను వంచించి వెడలిపోయిరి" అని దుఃఖించుచుండెను.

ఇంతలో తుంబురునితో గూడి నారదమహర్షి అరుదెంచెను. యుధిష్ఠిరుడు ధర్మాత్ముడు. అట్టివానికి కష్టము లొచ్చినచో వాటిని నివారించుటకు, కన్నీరు తుడుచుటకు మహాత్ములు వత్తురు.

ధర్మరాజు అనుజులతో గూడి మహర్షులను పూజించెను. వినమ్రుడై ఈవిధముగా పలికెను:

"దేవా! నారదమహామునీ! దుఃఖసాగరమున బడిన ఆర్తులకు నీవు నావికుని వంటివాడవు. మా తల్లిదండ్రులు ఎవ్వరికి చెప్పకుండా వెడలినారు. వారు ఎచ్చటున్నది తెలియుటలేదు. పుత్రులను పోగొట్టుకొని దుఃఖపీడితురాలైన మా తల్లి గాంధారి ఏ విధమైన బాధల ననుభవించుచున్నదో?" యని ఏడ్వసాగెను.

ధర్మరాజుని ఓదార్చుచు నారదమహర్షి చెప్పుచున్నాడు: "పాండవాగ్రజా! ఈ విశ్వము ఈశ్వర వశము. ఆయనయే ప్రాణులను కలుపుచున్నాడు. నియమముల నెరిగి ఆయనయే విడదీయుచున్నాడు.

"క్రీడాకారుడు బంతులతో, పాచికలతో క్రీడించుచుండును. పాచికలు కలియుచుండును. అలాగే విడిపోవుచుండును. ఆ విషయమున క్రీడాకారుని ప్రమేయమే

గాని క్రీడోపకరణముల ప్రమేయముండదు. మోహమే సర్వదుఃఖములకు కారణమై యున్నది. నీ తల్లిదండ్రులను గూర్చి విలపించుచున్నావు. నీ దేహము శాశ్వతమా!

అహస్తాని సహస్తానా మపదాని చతుష్పదామ్

ఫల్గూని తత్ర మహతాం జీవో జీవస్య జీవనమ్

"హస్తములు లేని జంతువులను హస్తములు గల మనుజులు తినుచున్నారు. పాదహీనములగు తృణాదులను పాదములుగల పశువులు మేయుచున్నవి. చిన్న జీవులను పెద్దజీవు లారగించుచున్నవి. ఒకజీవి మరియొక జీవికి జీవిక యగుచున్నది.

"రాజా! నీ పినతండ్రియగు విదురుడు, పెదతండ్రియగు ధృతరాష్ట్రుడు, గాంధారియు కలిసి సప్తస్రోత మనుచోట వసించుచున్నారు. ధ్యానమగ్నులై యున్నారు. ధర్మరాజా! సర్వకర్మ నిర్ముక్తులై యున్నవారికి నీవు విఘ్నములను కల్పింపకుము. నేటికి ఐదవరోజున ధృతరాష్ట్రుడు దేహమును త్యజించును. ఆయన దేహమునుండి బయల్వెడలిన యోగాగ్నిచే అతడు భస్మీభూతుడగును. పతివ్రతయగు గాంధారి గూడ అగ్నిలో దూకి మరణించును. అదిగాంచి సంతాపమునొందిన విదురుడు మరల తీర్థయాత్రలకు బయలుదేరును" అని చెప్పి తుంబురునితో గూడి నారదుడు వెడలెను. నారదుని సత్యవచనములను మనమున దాల్చి ధర్మరాజు శోకమును విడచిపెట్టెను.

విదురుడు గాంధారీ ధృతరాష్ట్రులను బోధద్వారా బాగుచేసెను. నారదుడు ధర్మరాజు బుద్ధిని స్థిరపరచెను.

ఈ ప్రపంచములో ఎవ్వరూ స్థిరము గాదు. అందరును ఒకనాడు పోయెడివారే. పోయేవారిని గూర్చి చింతించుట కన్నను ఉన్నవారు పోయేదెప్పుడో ఆలోచించుట మంచిది. ఈ ప్రపంచంలో ఎవరూ మరొకరితో కలసి వెళ్ళలేరు. కలసి రాలేదు గనుక కలసి వెళ్ళేది యుండదు. అందరికీ ఒంటరితనమే. ఇది అనివార్యము.

చనిపోయిన వానిని శ్మశానమునకు గొనిపోవునపుడు బంధుమిత్రాదులు అతని ననుసరించి వెనుక వెళ్ళుచుందురు. నీవు ఈ ప్రయాణములో సాగిపోతున్నావు. మా ప్రయాణము నీ వెనుకే సాగుచున్నది యని గ్రహించుటకే అలా నడచుచుందురు.

మరణము ప్రాప్తించే వరకు మానవుడెన్నియో ఆలోచనలు చేయుచుండును. కుమారులను గొప్పవాళ్ళను చేయాలి. కుమార్తెలను గొప్పవారింటికి పంపాలి. బంధువులను ఆదుకోవాలి. మేడలు కట్టాలి. ఆస్తులను పెంచాలి. పేరు ప్రఖ్యాతులను ఆర్జించాలి. ఇలా ఎన్నెన్నో ఆలోచనలను చేయును. కానీ ఏదో ఒక్కక్షణాన ఎక్కడనో ప్రాప్తించే మృత్యువుతో తన ఆలోచన లన్నింటికీ ఒకేసారి తెరపడును.

ధర్మరాజునకు హితవుచెప్పి నారద తుంబురులు వెళ్ళిరి. ఆరు మాసములలో కలి ప్రవేశించుచున్నది. దుష్టభావాలతో, దుశ్చర్యలతో కలియుగ మానవులు వాతావరణమును కూడా దూషిత మొనర్చుదురు. కలియుగము ప్రవేశించుచున్నందున ధర్మరాజాదులకు కూడా సమయమాసన్న మగుచున్నదని నారదుడు సూచనచేసి వెళ్ళెను.

అపశకునములు - అరిష్టములు

అర్జునుడు ద్వారకకు వెడలియుండెను. కొన్ని మాసములు గడిచెను. ధర్మరాజునకు అనేక దుశ్శకునములు గోచరించెను. అరిష్టములు అగుపించెను. కాలవైపరీత్యము సంభవించెను. ధర్మరాజు తన రాజ్యములో సంభవించుచున్న అరిష్టములను గాంచి కలతచెంది భీమసేనునితో ఇలా చెప్పెను:

"భీమసేనా! అర్జునుడు ద్వారకకు వెళ్ళి ఏడు మాసములైనది. ఇంతవరకు రాలేదు. శ్రీకృష్ణుడు తన అవతార వైభవమును ఉపసంహరింప దలచినట్లు నారదుడు చెప్పగా విని యున్నాను. నా మనస్సెందులకో ఆందోళన చెందుతున్నది. ఆ దివ్యాత్ముని కృప చేతనే మనము సుఖముగా జీవనయాత్ర చేయుచున్నాము. భీమా! నేను చాలా దుశ్శకునములను గాంచుచున్నాను" అని చెప్పసాగెను.

"ఉదయభానుని కెదురుగ నిలుచుని ఒకనక్క రోదించుచుండెను. ఒక శునకము నన్ను జూచి ఏడ్చెను. గుఱ్ఱములు విలపించుచున్నవి. గుడ్లగూబలు, కాకులు విషాద రవములను వినిపించుచున్నవి. సూర్యుడు కాంతిహీనుడై గన్పట్టుచున్నాడు. దూడలు పాలు త్రాగుటలేదు. తల్లులు పాలిచ్చుట లేదు. గోవులు దుఃఖించుచున్నవి. ఆలయములలో దేవతామూర్తులు కాంతిహీనములై యున్నవి.

"భీమసేనా! నిన్నటిరోజున నేను వాహ్యాళికి వెళ్ళియుంటిని. అక్కడ ఒక లోహకారుడు కనిపించెను. అతని చేతియందు ఒక విచిత్రమైన వస్తువును గాంచితిని. అది ఏమిటని ప్రశ్నించితిని. తాళమని అతడు సమాధానమిచ్చెను. చూచితివా! ప్రజలలో చోరభయము ఆరంభమైనది. తాళములు వేసి యుంచవలసిన పరిస్థితి ఆసన్నమైనది;" అని చెప్పసాగెను.

"ప్రజలు అబద్ధము లాడుచున్నారు. ప్రతి చిన్నవిషయానికి క్రుద్ధులగుచున్నారు. లోభము బాగా ప్రబలినది. స్నేహములో మోసం చేరిపోయింది. వనములు కాంతి హీనములై గన్పట్టుచున్నవి. గ్రామముల శోభ అంతరించినది.

క॥ కాకంబులు వాపోయెడి ఘూకంబులు నగర బగలు గుండ్రలు గొలిపెన్
లోకంబులు విభ్రష్ట శ్రీకంబులగతి నశించి శిథిలములయ్యెన్

"భీమా! ఆరునెలల క్రితం ఒక వైశ్యుడు తన గృహమును బ్రాహ్మణున కమ్మెను. కొంత కాలమైనది. ఆ గృహమును బ్రాహ్మణుడు మరమ్మతు చేయుచుండగ అతనికి కొంత బంగారము లభించెను. బ్రాహ్మణుడు ఆ బంగారమును తీసికొని వైశ్యుని వద్దకెళ్ళెను. తాను కొన్నది ఇంటినే గాని స్వర్ణమును గాదనియు, ఆ స్వర్ణము వైశ్యునకే చెందుననియు చెప్పెను. దానికి వైశ్యు డంగీకరించలేదు. గృహమును విక్రయించడము

జరిగినది గనుక అందులోని సర్వమును విక్రయించినట్లే అగుననియు గనుక ఆ సువర్ణము విప్రునికే చెందునని చెప్పెను. నా రాజ్యము ఇలాంటి ధర్మాత్ములతో నిండియుండెను.

"ఆరునెలలలో ఎంతో మార్పు వచ్చినది. నిన్నటిరోజు వారిరువురు నావద్దకు వచ్చినారు. ఆ సువర్ణముపై తమ తమ హక్కును ప్రకటిస్తూ వాదోపవాదాలు చేశారు. ప్రజల బుద్ధులు మారిపోయినవి."

అర్జునుడు ద్వారకనుండి వచ్చెను. అర్జునుని ముఖమున విషాదఛాయలు నిండియుండెను. కాంతివిహీనుడై గన్పట్టుచుండెను. అర్జునుని గాంచి ధర్మరాజు ఉద్విగ్న మనస్కుడయ్యెను.

"అర్జునా! ద్వారకలో మన బంధువులందరు కుశలమా? నీ ఆరోగ్యము బాగున్నదా? నీవు కాంతిహీనునివలె గన్పట్టుచున్నావు. బంధువుల గృహమున ఎక్కువ రోజులు గడిపితివి. గౌరవమునకు లోటు రాలేదు గదా! ఆశ్రితులను నిరాదరణ చేయలేదు గదా! అతిథులను విడచి భోజనము చేయలేదు గదా! హేయమైన కర్మను చేయలేదు గదా! అర్జునా! భక్తవత్సలుడైన శ్రీకృష్ణుడు ద్వారకా పట్టణమునందలి సుధర్మ సభామందిరమున సుఖముగ నున్నాడా?" యనెను.

శా॥ అన్నా ఫల్గున! భక్తవత్సలుడు బ్రహ్మణ్యుండు గోవిందు డా
పన్నానీక శరణ్యు డీశుడు జగద్భద్రానుసంధాయి శ్రీ
మన్న వ్యాంబుజ పత్రనేత్రుడు సుధర్మామధ్య పీఠంబునం
దున్నాడా బలభద్రు గూడి సుఖియై యుత్సాహియై ద్వారకన్

అర్జునుడు పొంగివచ్చుచున్న దుఃఖము నాపుకొనుచు "అన్నా!" యని భోరున విలపించుచు ధర్మరాజు పాదములపై పడెను.

"అగ్రజా! నా శ్రీకృష్ణుడు నన్ను వదలివెళ్ళెను. నా శోభ అంతరించుటకు ఇదియే కారణము. ప్రాణము పోయిన తరువాత దేహము శవమై అప్రియమగునట్లు, శ్రీకృష్ణుడు లేని ఈ జగత్తు అప్రియముగ గోచరించుచున్నది. ద్రుపదరాజు సభలో ఏ శక్తి నావెంట యుండుట వలన మత్స్య యంత్రమును ఛేదించితినో ఆ శక్తి ఈనాడు నాకు దూరమైనది. ఏ దివ్యతేజము నా రథములో ఆసీనమై యుండుట చేత భీష్మ, ద్రోణ, కర్ణ, శల్యాదులనెడి భయంకర తిమింగలములచే నిండిన దుస్తరమగు కౌరవసేనా సాగరమును అనాయాసముగా దాటితినో ఆ తేజము ఈనాడు నాకు దూరమైనది. కార్యము నారంభించునపుడు "పార్థ! అర్జునా! సఖా! కురునందనా!" అని వినిపించెడి మనోహర వాక్కులు ఇక నా శ్రవణపుటములలోనికి ప్రవేశింపవు. నా దీపములో తైలము అయిపోయినది. అందుచేతనే స్త్రీలకు రక్షకుడుగా నున్న నన్ను కొందరు గోపులు ఓడించిరి.

చ॥ అటమట మయ్యె నా భజవ మంతయు భూవర! నేడు చూడుమా
యిటువలె గారవించు జగదీశుడు కృష్ణుడు లేని పిమ్మటం
బటుతర దేహలోభమున బ్రాణము లున్నవి వెంట బోక, నే
గటకట పూర్వజన్మమున గర్మము లెట్టివి చేసివాడవో

"రాజా! ద్వారకలో మునిశాపము వలన నీవు కుశల మడిగిన మన బంధువు లెల్లరు ముసలం పట్టి పరస్పరము బాధించుకొని హతులైరి. వారిలో నలుగురైదుగురు మాత్రమే మిగిలిరి;" అనెను.

శ్రీకృష్ణుని అమృతమయ వాక్కులు అర్జునుని మదిలో ప్రతిధ్వనించుచుండెను. శ్రీకృష్ణ పాదారవింద ధ్యానము వలన మనస్సులోని దోషములన్నియు తొలగిపోయెను. భగవానుడు బోధించిన గీతాజ్ఞానము తిరిగి ప్రస్ఫుటమయ్యెను. అర్జునుడు కృష్ణ స్మరణలో తృష్ణకు దూరుడయ్యెను. శోకమునకు దూరుడయ్యెను.

శ్రీకృష్ణుని గమనమును గూర్చి అర్జునుడు చెప్పగా ఆలకించిన కుంతీదేవి తన మనో బుద్ధులను శ్రీకృష్ణుని పాదారవిందముల యందు నిలిపి ఇహలోకమును త్యజించెను. స్థిర బుద్ధిగల ధర్మరాజు శ్రీకృష్ణుడు లేని ఈ ప్రపంచమున మనుగడను సాగించుట నిరర్థకమని భావించెను.

శ్రీకృష్ణుడు ఈ ప్రపంచమును త్యజించి వెళ్ళిననాడే జగత్తున కలి ప్రవేశించినది. కలి యనగా కలహము. కృష్ణుడున్న చోట కలి యుండదు. ఎవరయితే కృష్ణనామమును సదా కీర్తించుచుందురో వారిని కలి అంటదు.

ధర్మరాజు తన మనుమడును, ఉత్తర యొక్క కుమారుడును అగు పరీక్షిత్తునకు రాజ్యము నొసగెను. ధర్మజుడు సన్యసించెను. చిరిగిపోయిన వస్త్రములను ధరించి, జుట్టును విరబోసికొని, పిచ్చివానివలె ఎవరు పిలిచినను మారు పలుకక గృహమును విడచి ఉత్తరదిశగా బయలుదేరి వెడలెను. సోదరులందరు అన్నయగు యుధిష్ఠిరు ననుసరించిరి. కృష్ణగత చిత్తులైన పాండవులు శ్రీకృష్ణుని చరణకమలములనే ధ్యానించుచు పయనించిరి.

విదురుడు గూడ శ్రీకృష్ణుని పాదపద్మముల యందు లగ్నమైన చిత్తము గలవాడై, సదా భగవానునే ధ్యానించుచు ప్రభాస తీర్థమున దేహమును చాలించెను. నిరపేక్షులగు తన భర్తలు శ్రీకృష్ణుని పొందిరని గ్రహించిన ద్రౌపది గూడ శ్రీకృష్ణునే ధ్యానించుచు ఆయననే పొందెను.

పరీక్షిత్తుని ప్రతిపాలనము

పాండవులు మహాప్రస్థానము చేసిరి. శ్రేష్ఠులైన వారి సలహాలను పాటిస్తూ, పరీక్షిన్మహారాజు ధరిత్రిని చక్కగా పరిపాలించుచుండెను. ధర్మము చతుష్పాదాలతో నిలబడియుండెను. జనన సమయాన జ్యోతిష్కులు ఊహించిన వన్నియు సత్యము లయ్యెను.

పరీక్షిత్తుడు ఉత్తరుని కుమార్తెయగు నిరావతిని వివాహమాడెను. ఆమె వలన నలుగురు కుమారులు గలిగిరి. వారిలో జనమేజయుడు ఒకడు. కృపాచార్యుని గురువుగా పొందినవాడై పరీక్షిన్మహారాజు మూడు అశ్వమేధ యాగముల నొనరించెను.

అశ్వమును అనగా గుఱ్ఱమును బలిపశువుగా నిర్ణయించి నిర్వహించు యజ్ఞమునకు అశ్వమేధ యాగము అనిపేరు. అశ్వము చపలత్వమునకు సంకేతము. అందుచేతనే గుఱ్ఱము నేత్రములకు గంతలు గట్టి నడపించుచుందురు. ఈ విధమైన చంచలత్వము మానవునిలో ఇంద్రియ మనోబుద్ధులనెడి మూడింటిలోను తెలియుచున్నది. ఇంద్రియములను నిగ్రహించి, మనస్సును నియమించి, బుద్ధిని స్థిరపరచువాడే స్థితప్రజ్ఞత్వమునకు అర్హుడగును. కనుక ఆత్మజ్ఞానమునకు ఉపకరించు ఈ త్రివిధ సాధనలు యజ్ఞస్వరూపములే యని భావింపవలెను. పరీక్షిత్తుడు మూడు అశ్వమేధ యాగములను నిర్వహించి ఇంద్రియ మనోబుద్ధులను స్వాధీన పరచుకొనెను. అనగా జీవిని చలింపజేయు వాసనలు ప్రక్షాళనమైనవి యని భావము.

హే నిదాఘ మహాప్రాజ్ఞ నిర్వాసన మనాభవ బలాచ్చేతః సమాధాయ నిర్వికల్ప మనాభవ

"మహాప్రాజ్ఞుడవైన ఓ నిదాఘుడా! మనసును వాసనా రహితముగ జేయుము. చిత్తమును బలవంతముగ నియమించి నిర్వికల్ప మనస్కుడవు కమ్ము" యని అన్నపూర్ణోప నిషత్తు ప్రవచించినది.

కృపాచార్యుని గురువుగా పొంది పరీక్షిత్తు మూడు అశ్వమేధయాగములను నిర్వహించెను. గురువు యొక్క కృప లేనిదే సాధకుని మనస్సు నిర్వికల్పమును బొందలేదు. గురుదేవుని కృపయే కృపాచార్యుడు.

ఆచార్యః ప్లావితా తస్య జ్ఞానం ప్లవ ఇహోచ్యతే

"జ్ఞానమనెడి తెప్పచే తీరమునకు జేర్చు నావికుడే గురుదేవుడు".

పరీక్షిత్తుడు దిగ్విజయ యాత్ర చేసెను. ఆ సమయమున కలిపురుషుడు ఒకచోట గోమిథునమును కాలితో తన్నుచుండుటను పరీక్షిత్తుడు గాంచెను. పరీక్షిత్తుడు ఏదైనను పాపము నాచరించినచో అతని మనసులోనికి ప్రవేశింపవచ్చునని కలి ఆలోచించెను. ప్రభువు మనసు పాడైనచో ప్రజల మనసులను పాడుచేయుట పెద్ద కష్టముగాదని అతని అభిప్రాయము. కానీ పరీక్షిత్తుడు పాపరహితుడు. నిర్వాసనా మనస్కుడు.

దిగ్విజయయాత్రా సమయాన ఒకచోట పరీక్షిత్తుడు ఒక గోమాతను, ఒక వృషభమును గాంచెను. వృషభము ఏకపాదముతో నిలబడి యుండెను. గోమాత బిడ్డలులేని తల్లివలె దుఃఖించుచుండెను. వృషభము ధర్మస్వరూపము. ఆవు ధరణీ స్వరూపము.

ధర్మో విశ్వస్య జగతః ప్రతిష్ఠా

"సమస్త ప్రపంచముయొక్క మనుగడకు ధర్మమే ఆధారముగా యున్నది" యని తైత్తిరీయోపనిషత్తు ప్రవచించినది. అట్టి ధర్మము మూడు పాదములు లేనిదై యుండెను. ధర్మదేవుడైన వృషభము ధరణీమాతయగు గోమాతతో ఇలా పలికెను:

"కళ్యాణీ! నీవు ఆరోగ్యముగా నుంటివా! నీ దీనావస్థను గాంచి నేను కలత పడుచున్నాను. ఏదో విషయము నిన్ను బాధించుచున్నట్లున్నది. త్రిపాద హీనుడనగు నన్నుజూచి దుఃఖించుచుంటివా? లేక ప్రభువుల దుష్టపరిపాలన నీకు దుఃఖమును కలిగించినదా? లేక క్షామములో బాధపడు ప్రజలను గాంచి దుఃఖించుచుంటివా?

"ఓ ధరణీ! కాలములో మార్పువచ్చినది. భర్తలు భార్యలను రక్షించుటలేదు. తండ్రులు సంతానమును పోషించుటలేదు. కర్కశముగ రాక్షసులవలె ప్రవర్తిస్తున్నారు. ఆచారహీనులైన వారివద్ద జ్ఞానమున్నది. బుద్ధిగలవారు బుద్ధిలేని నాయకులను సేవించుచున్నారు. ఇదంతయునూ జూచి దుఃఖించుచుంటివా?" యని ప్రశ్నించెను.

గోమాత రూపములో యున్న భూమాత పలుకుచున్నది: "ఓ ధర్మదేవుడా! నా బాధ నీకు తెలియనిది గాదు. నీవు పూర్వము చతుష్పాదములతో పూర్ణంగా శోభించుచుంటివి. ఈనాడు ఒక్కపాదముతో చరించుచున్నావు. సర్వగుణములకు ఆశ్రయుడగు శ్రీకృష్ణుడు ఈలోకమును వదలివెళ్ళినాడు. పాపాత్ముడగు కలిపురుషుడు జనులను బాధించుచున్నాడు. దానిని గాంచి నేను శోకించుచున్నాను" అనెను.

కలికి కళ్ళెము

ఏకపాదముపై నిలబడియున్న వృషభ మును రాజలక్షణములు లేక రాజ చిహ్నములను మాత్రమే ధరించియున్న దండధరు డొకడు కఱ్ఱతో కొట్టుచుండుటను పరీక్షిత్తుడు చూసెను. అలాగే అతనిచేత తన్నబడియున్న గోమాతను గూడ గాంచెను. దండధరునితో పరీక్షిత్తుడిలా పలికెను:

"ఓయీ! నీవెవడవు? నటుని వలె రాజవేషమును ధరించియున్నావు. కర్మచే నీచునివలె గోచరించుచున్నావు. దుర్బలులగు నోరులేని పశువులను ఎందులకు కొట్టు చున్నావు?"

శా॥ నిన్నుం గొమ్ముల జిమ్మెనో కదిసెనో నిర్భీతివై గోవులం
దన్నం గారణమేమి మద్భుజ సనాథక్షోణి నే వేళలం
దున్నేరంబులు సేయరా దెఱుగవా ధూర్తత్వమున్ భూమి భృ
త్సన్నాహంబు నొనర్చె దెవ్వడవు నిన్ శాసించెదన్ దుర్మతీ!

పరీక్షిత్తుడు వృషభము నుద్దేశించి, "ఏకపాదముతో సంచరించు నీ వెవరవు? నిన్ను జూచి నేను జాలి పడుచున్నాను. నా రాజ్యములో కన్నీరు పెట్టినవారు నీవు తప్ప మరెవ్వరు నాకు గోచరించలేదు. నీవు దుఃఖింపవలదు. ఈ దుష్టుని నేను శాసింపగలను.

యస్య రాష్ట్రే ప్రజాః సర్వాస్త్రస్యన్తే సాధ్వ్య సాధుభిః
తస్య మత్తస్య నశ్యన్తి కీర్తి రాయుర్భగో గతిః

"పార్థ! ఎవని రాజ్యమున ప్రజలు దుష్టులచే పీడితులగుదురో అట్టి రాజు కీర్తి, ఆయువు, సంపద, గతియు సర్వము నాశనమగును.

"మురభినందనా! నీ మూడు పాదము లేమైనవి? వాటిని ఖండించిన వా[illegible] నిన్ను కుంటివానిగ జేసిన దెవరు? నిరపరాధులకు అశుభము కలుగకూడదు!" [illegible]

వృషభరూపములో యున్న ధర్మదేవత చెప్పసాగెను: "రాజా! క్షత్రియుడే రక్షించు[illegible] పాండవుల వంశములో నీవు ఉత్కృష్టుడవు. అభయమిచ్చుటకు దగినవాడవే. [illegible] పాదములను ఖండించిన దెవ్వరో నాకు తెలియుట లేదు. కాలము అని కొందరు, కర్మయని మరికొందరు, స్వభావమని ఇంక కొందరు చెప్పుచున్నారు. రాజా! దుఃఖమునకు కారణమును మీరే యోచింపుడు;" యనెను.

పరీక్షిత్తు ఇలా పలికెను: "వృషభమా! నిన్ను హింసించిన దెవరో నీకు తెలి[illegible] చెప్పుటకు నీవు ఇష్టపడకున్నావు. నీవు ధర్మదేవతవేనని నాకనిపించుచున్నది. [illegible] బాధించినవాడు కలిపురుషుడే యని గూడ అవగతమగుచున్నది.

"కృతయుగమున నీవు నాలుగు పాదములతో శోభాయమానముగ చరించుచుంటివి. తపస్సు, దయ, శౌచము, సత్యము యనునవియే ఆ నాలుగు పాదములు. గర్వము వలన తపస్సు చెడినది. స్త్రీ సాంగత్యము వలన పవిత్రత పాడైనది. మధుపానము వలన దయ దూరమైనది. ఇక ఇప్పుడు సత్యమొక్కటియే మిగిలియున్నది. దాని బలముపైననే నీవు జీవించుచున్నావు. కలిపురుషుడు అసత్యము ద్వారా నీ ఈ ఒక్కపాదమును గూడ గ్రహింపవలెనని భావించుచున్నాడు. గోరూపమున యున్న భూదేవి దుఃఖమును గూడ నేను గాంచినాను. మీరు దుఃఖింపవలదు. నేను మిమ్ములను రక్షించెదను" అని పరీక్షిత్తు ఖడ్గమును చేబూనెను. కలిపురుషుడు భీతిచెందినవాడై, రాజ చిహ్నములను త్యజించి పరీక్షిత్తుని పాదములపై బడెను.

పరీక్షిత్తుడు కలిపురుషునితో నవ్వుతూ ఇట్లనెను: "కలీ! అర్జునుని వంశీయులకు శరణాగతులైనవారు భయపడ నవసరములేదు. కానీ నీవు అధర్మప్రవర్తకుడవు. అందుచేత నా రాజ్యములో నీకు స్థానము లేదు" యనెను.

"రాజా! నీయాజ్ఞను నేను పాలింతును. నేనెక్కడ చరించినను బాణము నెక్కుపెట్టియున్న నీవే నాకు గోచరించుచుందువు. కనుక నేను ఎక్కడ స్థిరముగ నుండగలనో నీవే తెలుపుడు" యనెను.

"కలిపురుషుడా! జూదము, మద్యపానము, వ్యభిచారము, హింస యను నాలుగు స్థానముల యందు వసింపు" మనెను.

ఈ నాలుగు చోట్ల అధర్మము నిలిచియుండునని భావము. అధర్మమున్న చోట కలి వసించును. ఈ నాలుగు స్థానములను పొందిన కలిపురుషుడు మరియొక స్థానము నివ్వుమని కోరగా పరీక్షిత్తు సువర్ణము నిచ్చెను. బంగారు నందు గూడ కలి నిలిచియుండును.

కలియొక్క కల్మషము నుండి విడిపడ గోరువారు ఈ ఐదు విషయముల యందు జాగరూకులై యుండవలెను.



పరీక్షిన్మహారాజు కలిని దండించుట

పరీక్షిత్తు ధర్మదేవత యొక్క తపస్సు, దయ, శౌచము యను మూడు పాదములను గూడ పునరుద్ధరించెను.

పరీక్షిత్తుని పరిక్లేశము

"నేను ప్రవేశించుటకు పరీక్షిత్తుడు ఐదు స్థానముల నొసగినాడు. ఈ అయిదింటిలో ఏదో ఒకదాని ద్వారా పరీక్షిత్తుని స్థానములోనికి గూడ ప్రవేశింపగలను" యని కలిపురుషు డాలోచించెను.

ఒకనాడు పరీక్షిత్తునకు వింతయైన ఆలోచన కలిగెను. తన కొరకు తాతయైన అర్జునుడు ఏమి దాచియుంచెనో కనుగొనవలెనని బుద్ధిపుట్టెను. అన్వేషణ జరుపుచుండగా ఒకపెట్టెలో సువర్ణ కిరీటము లభ్యమయ్యెను. వెంటనే దానిని పరీక్షిత్తు శిరముపై ధరించెను. ఆ కిరీటము జరాసంధునిది. జరాసంధుని పుత్రుడు యర్థించినను ఇవ్వకుండా భీముడు బలవంతముగ సంగ్రహించి తెచ్చెను. అందుచేత ఈ సంపద అధర్మముతో కూడియుండెను. అందుచేత పాండవులెవ్వరు దానిని ధరింపకుండిరి. నేడు పరీక్షిత్తుడు దానిని ధరించెను. సమయము కొరకు నిరీక్షిస్తుండిన కలిపురుషుడు దాని ద్వారా పరీక్షిత్తునిలో ప్రవేశించెను. ఆ కిరీటమును ధరించి పరీక్షిత్తుడు వేటాడుటకై అరణ్యమున కేగెను.

శౌనకాది మునులకు సూతమహర్షి చెప్పుచున్నాడు: "శౌనకాదులారా! పరీక్షిత్తుడు పుణ్యాత్ముడు. అశ్వత్థామ ప్రయోగించిన బ్రహ్మాస్త్రముచే తప్పుడైనను శ్రీకృష్ణుని యనుగ్రహమునకు పాత్రుడై తల్లిగర్భమున మృతిచెందలేదు. శృంగి శాప కారణముగా మృత్యువు యెదుట నిలిచినను భీతిచెందని దివ్యాత్ముడు. శుకమహర్షి కడ జ్ఞాన గంగను పానంచేసి పాంచభౌతికమైన మృతకళేబరమును గంగలో విడచిన మహితాత్ముడు. భగవత్కథలను చెప్పువారు, ఆలకించువారు, భగవానుని పాదపద్మములను సేవించు వారు మోహమునకు గురికారు."

క॥ హరివార్త లెఱుగువారికి హరిపదముల దలచువారి కనవరతంబున్
హరికథలు వినెడివారికి మరణాగత మోహ సంభ్రమము లేదనఘా ॥

సూతుని జ్ఞానవచనముల నాలకించిన శౌనకాది మునులు సూతునకు నమస్కరించుచు "మహానుభావా! నీకు శుభమగుగాక! మృతజీవులమైన మాకు శ్రీకృష్ణదేవుని అమృతమయ గాథను వినిపించుచున్నావు. భక్తుల సాంగత్యము అపూర్వమైనది. అమోఘమైనది. అది స్వర్గమోక్షాదుల కన్నను శ్రేష్ఠమైనది. దేవా! నీవు పరమ భాగవతోత్తముడవు. పరమ పవిత్రము, భక్తియోగప్రదమునగు భాగవతమును మాకు వినిపించుము;" యనిరి.

"ఋషులారా! మీరు వేదవిదులు. జ్ఞానరూపులు. శ్రీకృష్ణదేవుని లీలా విశే...
వర్ణించమని నన్ను అడిగితిరి. నాకు తెలిసినంత వరకు వివరింతును. పక్షి ...
ననుసరించి ఆకాశమున విహరించినట్లు నా బుద్ధి ననుసరించి మీకు వివరింతును...
పరమపవిత్రమైన భాగవత కథను చెప్పుట కుపక్రమించెను.

ఓం నమో భగవతే వాసుదేవాయ

ఒకనాడు పరీక్షిన్మహారాజు వేటాడుటకు వనమున కెళ్ళెను. వేటాడి అలసిపో... శ్రమాధిక్యత వలన దాహము అధికమయ్యెను. ఎంత వెదకినను ఆ ప్రదేశమున జల... లభించలేదు. అన్వేషణ జరుపుచుండగ పరీక్షిత్తునకు ఆశ్రమమొకటి కనిపించె... తొందరగా ఆశ్రమప్రదేశమున కరుదెంచినాడు. అది శమీక మహాముని ఆశ్రమము. ఆ సమయానికి శమీక మహర్షి ధ్యానమగ్నుడై యుండెను. మనస్సు సంపూర్ణము... అంతర్ముఖమై యుండెను. సంకల్పాల సందడి అణగియుండెను. నిర్వికల్ప సమాధిలో శమీకుడు నిరంజన రూపుడై నిలచియుండెను. పరీక్షిత్తు ఋషిని ప్రశ్నించెను.

క॥ తోయములు దెమ్ము మాకీ తోయము వేటాడువేళ దొల్లిపొడమ దీ
తోయము క్రియ జల దాహముతోయము వారలును లేరు దుస్సహ మనఘా!

పిపాసాపీడితుడై యున్న పరీక్షిత్తుడు మంచి నీరివ్వమని మహర్షిని అర్థించాడు. అంతర్ముఖమై యున్న మహర్షికి బాహ్యశబ్దాలు వినిపించునా? పరీక్షిత్తుని పలుకులు శమీకుని మనస్సును చేరలేక పోయాయి. పరీక్షిత్తుని మనస్సు చివుక్కు మన్నది. చిత్తము వికలమైనది. హృదయము గాయపడింది. మహర్షి తనను అవమాన పరచు చున్నట్లు భావన కలిగింది. ఇంద్రియ ప్రకోపములో ఇంద్రుడైనా దారితప్పుట తథ్యము. దాహముచే పీడింపబడుటచే కలవరపడుతున్న పరీక్షిత్తుని చిత్తము ఆలోచనా శక్తిని, అవగాహనను కోల్పోయింది. అవగాహన లోపించిన అంత: కరణలో ఆవేశము కలుగుటలో ఆశ్చర్యము లేదు.

కామాత్క్రోధో௨భిజాయతే

తీరని కోరిక క్రోధంగా మారింది. ఇంతలో ఋష్యాశ్రమ సమీపమున మృతసర్పమొకటి గోచరించినది. పరీక్షిత్తుని అంతర్యంలోని ఆవేశానికి బాహ్యంలో ఆకృతి లభించినట్లైనది. అంతే. ఆ మృతసర్పాన్ని తెచ్చి శమీకుని మెడలో వేసినాడు. ఆహా! దురవగాహన ఎంతటి దుశ్చర్యను కదిలించినది? ఆవేశము ఎంతటి అనర్థమును కలిగించినది?

మృతసర్పము మెడలో పడినదని శమీకునికి తెలియలేదు. తెలిసికొనెడి మనస్సు అంతకు పూర్వమే శమీకునిలో చచ్చి పడియుండుటయే ఈ అగ్రాహ్యస్థితికి కారణము. పరీక్షిత్తుడు దిగ్భ్రాంతి చెందెను. తాను భావించింది వేరు. జరిగింది వేరు. శమీకుడు వాస్తవంగా సమాధిలో నున్నాడా? లేక తనను అవమాన పరచుటకు అలా నటించుచున్నాడా? అని తెలిసికొనేందుకే పరీక్షిత్తుడు అలా ప్రవర్తించాడు. శమీకుని స్థితి నిజసమాధియే నని

తెలియగనే బాధాహృదయంతో చేసిన తప్పిదానికి కలత చెందుతూ పశ్చాత్తాపముతో రాజు వెనుదిరిగి వెళ్ళెను.

ఈ సంఘటనను సమీపంలో నున్న కొందరు బ్రహ్మచారులు చూశారు. వెంటనే వెళ్ళి నదీతీరమున యున్న శమీకుని కుమారుడగు శృంగికి తెలిపారు.

శృంగి మనస్సు కలతపడింది. మహాత్ముడైన తన తండ్రి శమీకునికి జరిగిన అన్యాయానికి ఆవేదన పడ్డాడు. ధర్మమును రక్షింపవలసిన ప్రభువే ధర్మము నుల్లంఘించినాడు. ఇది భయంకరమైన నేరము. ఇది క్షమార్హము గాదని భావించాడు.

నా తండ్రియగు శమీకుడు భగవత్స్వరూపుడు. దూషణము లెరుగనివాడు. భీషణము తెలియనివాడు. భగవన్నామమునే భూషణముగా సదా ధరించువాడు. తీక్షణమైన ప్రవర్తన తెలియనివాడు. ఈషణత్రయమును దాటినవాడు. విష్ణుభక్తి తప్ప అన్యము లెరుగని పావనాత్ముడు. దానము లాశించడు. ధనము నభిలషింపడు. వనప్రదేశములో మననము సాగించుకొనుచు జీవించుచున్న ఆ సాధుసత్తముని గళమున మృతభుజంగమును ఉంచుట ఏమి వైపరీత్యము? ఇది క్షమించరాని దోషము అని పలుకుచు శృంగి కౌశికీనది వద్దకెళ్ళి ఆచమనం చేసి పరీక్షిత్తునికి శాపము ననుగ్రహించెను.

ఉ॥ ఓడక వింటి కోపున మృతోరగమున్ గొనివచ్చి మాఱు మా
టాడక యున్న మజ్జనకు నంసతలంబున బెట్టి దుర్మద
క్రీడ జరించురాజు హర కేశవు లడ్డిన నైన జచ్చుబో
యేడవనాడు తక్షక ఫణీంద్ర విషానల హేతి సంహతిన్

"ఈ రాజులు ఉచ్ఛిష్టములను తిను కాకులవలె బలిసి ఘోరమైన పాపములను చేయుచున్నారు. దాసులై కూడా ఇంటినిగాయు కుక్కలవలె యజమానిని తిరస్కరించు చున్నారు. వీరు క్షమార్హులుగారు. మర్యాదహీనుడు, నా తండ్రికి ద్రోహము చేసిన పరీక్షిత్తుని నేటికి ఏడవనాడు తక్షకుడు కాటు వేయగలడు" అని శృంగి పరీక్షిత్తుని శపించెను.

అంతా జరిగిపోయింది. పరీక్షిత్తుని అంతిమ క్షణము నిర్ణయింపబడింది. క్షణికావేశము బ్రతుకును శ్మశానానికి తరలించింది. నిగ్రహాన్ని కోల్పోవడం వలన నిండుజీవితం నీరుగారి పోయింది. పదిలంగా యున్న పరీక్షిత్తుని బ్రతుకు ఫణిరాజుకు బలి అయింది.

పరీక్షిత్తుని శాపగ్రస్తుని జేసి శృంగి ఆశ్రమానికి అరుదెంచినాడు. తండ్రి మెడలోని మృత సర్పమును దీసి దూరంగా పారవేశాడు. శృంగిలోని ఆవేశము ఇంకా చల్లారలేదు. ఆగ్రహం అంతరించలేదు.

ఇంతలో తండ్రియైన శమీకుడు బహిర్ముఖుడయ్యాడు. కళ్ళు తెరిచి చూశాడు. ఆగ్రహోదగ్రుడైయున్న తన కుమారుని గాంచినాడు. ప్రక్కనే అల్లంత దూరాన పడియున్న మృతసర్పాన్ని వీక్షించాడు. జ్ఞానదృష్టి ద్వారా జరిగిన విషయము నంతటిని క్షణంలో అవగత మొనర్చుకున్నాడు. బాధాతప్తుడైనాడు. తన బిడ్డడైన శృంగి చేసిన తప్పిదమునకు

చింతించినాడు. పరమభాగవతోత్తముడైన పరీక్షిత్తుడు శాపమునకు గురియగుట శమీకునకు అపరిమితమైన దుఃఖమును కలిగించినది. జరిగిన దానికి చింతించుచు మహాత్ముడైన శమీకుడు శృంగిని సమీపించి ఇలా పలికెను:

"కుమారా! ఎంత పొరపాటు చేసితివి? శ్రీకృష్ణభగవానుని నిర్యాణము తరువాత కాపరిలేని గొర్రెలమంద చోరులవాత పడినట్లు, ఈ ప్రపంచము ధర్మమును కోల్పోయి చరించుచున్నది. ధర్మదేవతకు నూతన సొగసులిచ్చి ధర్మమును చతుష్పాదములతో చరింపజేయు ధీశాలియగు పరీక్షిత్తుడు ధర్మాత్ముడు. అట్టి మహితాత్ముడు చేసిన చిన్న పొరపాటుకు ఇంతటి కఠిన శిక్షను విధించితివా? ధర్మాత్ముని శపించితివా? దుర్మార్గులు దుష్టక్రియలకే అలవాటుపడి యుంటారు. సజ్జనాత్ములగువారు ప్రారబ్ధాధీనులై ఎప్పుడైనా ఏదో అయోమయ పరిస్థితులలో ఒక అపచారాన్ని చేస్తారు. ఆ తరువాత ఎంతగానో చింతిస్తారు. పశ్చాత్తాపంతో కుమిలిపోతారు. కుమారా! వారు యొనర్చెడి సహస్ర సత్కార్యములను విస్మరించి, వారాచరించిన ఒక దుష్కార్యానికి వారిని శిక్షిస్తే, ఆ తరువాత వారిలాగ ధర్మాచరణ జేయువారు భువికి లభించుదురా? ఎంత పొరపాటు చేసితివి? అతిథిగా అరుదెంచిన విమలచరితుని సత్కరించుటకు బదులుగ శాపము నిచ్చితివా? ఇది నీకు ధర్మమా?

"కుమారా! పరీక్షిత్తు లాంటి రాజు లేనిచో లోకములో చోరులు అధికమయ్యెదరు. హింస ప్రబలిపోవును. పశు, స్త్రీ, ధనాదుల నపహరింతురు. తరువాత ధర్మము నశించును. ధర్మము నశించగనే జనులు కుక్కలవలె, కోతులవలె అర్థకామముల యందే అభిరుచి కలిగియుందురు. చూసితివా! నీ శాపకారణముగ దేశమునకు ఎన్ని అనర్థములు వాటిల్లుచున్నవో గాంచితివా!" అని శమీకుడు పరితపించెను. తన బిడ్డడు ఆవేశములో అనాలోచితముగ చేసిన తప్పిదమును మన్నించమని శ్రీకృష్ణుని ప్రార్థించెను.

క॥ భూపతికి విరపరాధమ శాపము దా విచ్చె బుద్ధి చాపలమున మా
పాపడు వీడొనరించిన పాపము దొలగింపు కృష్ణ! పరమేశ! హరీ!

అని పరమేశ్వరుని శమీకుడు ప్రార్థించాడు. ఆహా! ఇదికదా సాధుహృదయము. తమకు జరిగిన అన్యాయమును కర్మ ఫలితంగా భక్తులు భావిస్తారే గాని అన్యాయము చేసిన వారిపై ప్రతీకారమును చేయరు. పగబూనరు.

శమీకుడు మునిబాలురను చేరబిలిచి శృంగి యొసంగిన శాపమును పరీక్షిత్తునకు వివరించమని చెప్పిపంపెను. మునిబాలురు శాప విషయమును పరీక్షిత్తునకు తెలిపిరి. శమీకుని విషయంలో తానొనరించిన తప్పిదమును తలచుకొని మఱల మఱల బాధ పడుతున్న పరీక్షిత్తునకు శాపమును గూర్చి తెలియగనే అతని హృదయము తేలికపడెను. తన పాపానికి త్వరలోనే ఫలితము లభించినదని భావించెను. ఏడురోజులలో తన జీవితము సమాప్త మవుతున్నదని గ్రహించెను.

శాంతిని అన్వేషిస్తూ ప్రపంచమనెడి వనములో పరిభ్రమించే జీవుడే పరీక్షిత్తుడు. ప్రాపంచిక విషయానంద మనెడి పిపాస తీరేదిగాదు. పరీక్షిత్తుడు పిపాసా పీడితుడయ్యాడు. విషయపిపాస తీరేదికాదు. తృప్తి నిచ్చేదిలేదు. పరీక్షిత్తు పిపాస కూడా అలాగే తయారైనది.

శాంత్యుపశమనములను పొంద నిచ్ఛగించిన పరీక్షిత్తు అన్వేషణలో శమీకుని ఆశ్రమాన్ని కనుగొనెను. శమమనగా మనోనిగ్రహమని భావము. మనసును నిగ్రహించిన వాడే శమీకుడు. అతడే సద్గురువు. సద్గురువు సదా అంతర్ముఖుడై యుండును. శిష్యుడు ప్రవేశించలేని ఆంతరంగిక హర్మ్యములో గురుదేవుడు నివసించుచుండును. ఆ కారణము చేతనే పరీక్షిత్తుని మాటలు శమీకునికి వినిపించలేదు.

శిష్యుడగువాడు విద్యారంభమున యున్న విద్యార్థియే గనుక ఆరంభశూరత్వము, ఆవేశము యనెడి రెండు చక్రముల బండిపై సదా చరించుచుండును. ఆవేశపరుడైన శిష్యుడు ఆత్మానుభవముగల ఆచార్యుని ఆంతర్యాన్ని అర్థం చేసుకోలేడు. పైగా అపార్థము చేసికొనుటకు గూడ వెనుకాడడు. ఆవేశజనిత అపార్థజీవనము ఆచార్యుని అవమానపరచినా, అష్టకష్టములకు గురిచేసినా ఆశ్చర్యపడ నవసరము లేదు. శమీకుని మెడలో పరీక్షిత్తు మృతసర్పాన్ని వేసెను. దారితప్పిన శిష్యుడు గురువు మెడకు గుదిబండయై నిలుచును. అంతమాత్రాన గురువు చలించునా? గోవింద పాదారవిందముల యందు చిత్తమును లయమొనర్చి చరించువానిని అయోమయ జీవుల అనర్థ ఆవేశములు చలింపజేయగలవా? శమీకుడు చలించలేదు.

ఆచార్యుడు ఆగ్రహించకపోవచ్చు. అక్రమజీవనము అప్రతిష్ఠపాలు గాకపోవునా? కర్మ ఆచరింపబడిన తరువాత ఫలము అందకపోవునా? పరీక్షిత్తుని దోషమును గాంచి శృంగి కదలిపోయెను. శాపము నందించెను. శృంగమనగా కొమ్ము యని అర్థము. దేహమును దాటి కొమ్ము పెరుగునట్లు కర్మ ఆగినను కర్మఫలము కదలి ముందుకుపోవును. అనుభవమును తప్పక అందించును. కర్మఫలమే శృంగి యని భావము. కర్మ ఫలానుభవమును అనుభవించక తప్పదు. శృంగి శాపమూ అంతే.

కర్మఫలితాలు భగవదధీనములు. వాటిని ఎవ్వరూ నివారించలేరు. విడచిన బాణాన్ని వెనుకకు మఱలించలేని విధముగ ఆచరింపబడిన కర్మవలన కలిగే ఫలితమును నిరోధించలేము. అలాగే శృంగి శాపము కూడ అనివార్యమై యున్నది.

పొరపాటు మానవ సహజము. మనిషే పొరపాటు చేస్తాడు. పశ్చాత్తాప హృదయంతో సవరించుకొని జీవిస్తే తాను మనీషి అవుతాడు. మనీషి యైనవానికి మహాత్ముల సహచర్యం లభిస్తుంది. మహాత్ముల సహచర్యం లభించినవాడు మహర్షి అవుతాడు.

తనను గాయపరచిన శిష్యుని గళమునుండి కూడ అమృతనాదమును ఆలకించవలెనని ఆశించువాడే ఆచార్యుడు. ఆచార్యునిది ప్రేమహృదయము. మాతృహృదయము. అమృత హృదయము. అమరజీవనము నందించు అపూర్వహృదయము.

తనను అవమానపరచిన శిష్యుని గూడ ఆశీర్వదించే అమృతహృదయుడు సద్గురువు. పరీక్షిత్తుని చర్యకు శమీకుడు బాధపడలేదు. పైగా ప్రేమను చిందించాడు. మునిబాలురను పంపి కర్తవ్యమును సూచించినాడు.

దారితప్పిన శిష్యుని గురువు తృణీకరించడు. విస్మరించడు. తన ప్రేమ వీక్షణములను సదా అతనిపై కురిపించుచునే యుండును. నిరంతరము ప్రవచనము లనెడి మునిబాలుర ద్వారా సత్యసందేశమును అందించుచునే యుండును.

శమీకుని సందేశాన్ని మునిబాలురు పరీక్షిత్తునకు తెలిపారు. పరీక్షిన్మహారాజుకు కనువిప్పు కలిగింది. శాపవార్త తనలో వైరాగ్యజనిత నైరాశ్యమును నింపింది. ఇహలోక సౌఖ్యాలు, పరలోక భోగాలు తుచ్ఛమనిపించింది. సమస్తమును పరీక్షిత్తు త్యజించాడు. మనసును మాధవుని యందే నిలిపినాడు. ప్రాయోపవిష్టు డగుటకు గంగాతీరమునకు కరుదెంచినాడు.

మ॥ తులసీ సంయుత దైత్య జిత్పద రజస్తోమంబు కంటెన్ మహో
జ్జ్వలమై దిక్పతి సంఘ సంయుత జగత్సౌభాగ్య సంధాయియై
కలి దోషావళి నెల్ల బాపెడి వియద్గంగా ప్రవాహంబు లో
పలికింబోయి మరిష్యమాణు డగుచుం బ్రాయోపవేశంబునన్

ముకుందుని చరణకమలముల చెంత అనన్య చింతనావ్రతుడై, సంగత్వము వీడి మునివ్రతుడయ్యెను. గంగానదిలో ధర్మాత్ముడైన పరీక్షిత్తుడు ప్రాయోపవిష్టుడై యున్నాడని తెలియగనే మహాత్ములూ, మహర్షివర్యులైన మహితాత్ములెల్లరు విచ్చేసిరి. విశ్వకళ్యాణ కర్తయగు విశ్వామిత్రుడు, పవిత్రాత్ముడగు పరశురాముడు, వరిష్ఠుడగు వసిష్ఠుడు, నారాయణ నామామృతపాన చిత్తుడగు నారదుడు, భ్రాజిత జ్ఞానరూపుడగు భరద్వాజుడు, ఆత్మవిదుడైన అగస్త్యుడు, లోకమిత్రుడగు మైత్రేయుడు ఇత్యాది మహానుభావులందరు అరుదెంచిరి.

శమీకుని సందేశ మనెడి గురువచనము నాలకించగనే శిక్షణ యోగ్యుడైన శిష్యుడనెడి పరీక్షిత్తుడు స్పందించెను. గురుబోధ నిజముగ అవగతమైనచో అట్టివారిలో మోహజాడ్యములు, అహంకార మౌఢ్యములు తలఎత్తవు. సంగత్వము నశించును. జ్ఞానాభిలాష స్ఫురించును. అలాగే పరీక్షిత్తుని యందు వైరాగ్యముదయించి జ్ఞాన సముపార్జనకై హృది ఆరాటపడసాగెను. ఇదియే ఆత్మాన్వేషణ. ఆనందాన్వేషణ. ఆత్మకన్నా అన్యమైన విషయముల యందు మనస్సు చరించని, రమించని నైరాశ్య జీవనస్థితి.

విరాగియైన సాధకుడు గృహఛిద్రములను విలోకించుచు కూర్చొనడు. జ్ఞానగంగా తీరమును చేరును. ఆత్మార్పణ గావించుకొని యైనను ఆత్మానుభూతి నొందుటకు ప్రయత్నించును. అదియే పరీక్షిత్తుని ప్రాయోపవేశము. పుష్పము విరబూయగనే ఆహ్వానముతో పనిలేకనే తుమ్మెదలు అరుదెంచునట్లు పరిశుద్ధాంత:కరణ గల సాధకుని ఉద్ధరించుటకు మహాత్ములు అరుదెంచుచుందురు. అలాగే గంగాతీరమున ప్రాయోపవిష్టుడగు పరీక్షిత్తుని చెంతకు మహాత్ములు అరుదెంచినారు.

పరీక్షిన్మహారాజు మహాత్ములను అర్చించినాడు. వందన మాచరించినాడు. చేతులు జోడించి నమస్కరించుచు, వినమ్రతతో "మహానుభావులారా! మృతసర్పమును మహర్షి మెడలో అనాలోచితముగ పడవైచి అనర్థమును, అమంగళమును కొనితెచ్చుకొంటిని. ఈ

పాపము తొలగు ఉపాయమును సెలవిందు. పవిత్రాత్మ స్వరూపులారా! ఈశ్వర సంకల్పమును ఎవరు కాదనగలరు? విధాత నిర్ణయాలను ఎవరు ఎదిరించి పోరాడగలరు? తక్షకునికి నా దేహమును సమర్పించుటకు సిద్ధముగా యున్నాను. కాని రాబోవు జన్మజన్మలకు శ్రీహరి పదాబ్జములపై చింతనాసక్తి నిలుచునట్లు ఈ భృత్యుని అనుగ్రహింపుడు" అని ప్రార్థించెను.

తన పుత్రుడైన జనమేజయుని రప్పించెను. రాజ్యభారమును అతని కప్పగించెను. మహాత్ములకు నమస్కరించి భక్తి పరవశుడైన పరీక్షిత్తుడు

క॥ ఏడు దినంబుల ముక్తిం గూడగ నే రీతి వచ్చు గురు సంసార
క్రీడన మేక్రియ నెడతెగు జూడుడు మా తండ్రులార శ్రుతి వచనములన్

అని ప్రార్థించెను. అవును. ఏడురోజులలో ముక్తి ఎలా లభిస్తుంది? ఏ సాధన లాచరించిన ఈ శీఘ్రఫలము ప్రాప్తిస్తుంది? అని మహాత్ములు పరస్పరము చర్చించుకొనుచుండ, సకలాగమార్థ పారంగతుడును, అకలంక గుణాభిరాముండును, అవధూత రూపుండును, సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూపుండును, వ్యాసపుత్రుండును నగు శుకయోగి మహాత్ము డచ్చటికి అరుదెంచెను.

శుకబ్రహ్మ రాక సర్వులను పరవశింపచేసింది. ఆదిత్యుని కిరణ సమూహమును గాంచి కమలములు విరబూయునట్లు శుకభాస్కరుని జ్ఞానతేజము వలన మహాత్ముల హృదయ పద్మములు విరబూసి ఆనంద మధువును చిందించినవి.

పరీక్షిన్మహారాజు శుకబ్రహ్మను అర్చించినాడు. గృహస్థుల ఇండ్లయందు పండ్రెండు నిముషముల కన్నను ఎక్కువసేపు నిలువని శుకావధూత పరీక్షిత్తుని పుణ్యముల పంటగా నేడు లభించెను. చేసిన భక్తి ఎన్నడూ వృథా గాదు. చూపిన ప్రేమ ఎప్పటికీ నశించదు.

పరబ్రహ్మ స్వరూపులైన శుకయోగీంద్రులను పరీక్షిత్తు మనసారా కీర్తించాడు. ఆసన్న మరణులైనవారు చేయదగిన కార్యమును ఎరుక పరచవలసిందని ఐదు పదిచేసి అర్థించాడు.

సీ॥ అవ్యక్త మార్గుండ వైన నీ దర్శన మూఱడి బోనేర దభిమతార్థ
సిద్ధిగావించుట సిద్ధంబు నే డెల్లి దేహంబు వర్జించు దేహధారి
కేమి చింతించిన నేమి జపించిన నేమి గావించిన నేమి వినిన
నేమి సేవించిన నెన్నడు సంసార పద్ధతి బాసిన పదవి గలుగు

తే॥ నండు మనరాదు గురుడవు యోగి విభుడ వాను బతికిన తడవెంత యంతసేపు
గాని యొకదెస నుండవు కరుణతోడ జెప్పవే తండ్రి ముక్తికిం జేరు తెరువు!

అని పరీక్షిన్నరేంద్రుడు శుకబ్రహ్మ నడిగెను. అభ్యర్థించెను. ప్రార్థించెను.

ప్రథమ స్కంధము సమాప్తము

..... ఓం .....



అశుభహారం - శుభకరం

యత్కీర్తనం యత్స్మరణం యదీక్షణం
యద్వన్దనం యచ్ఛ్రవణం యదర్హణమ్
లోకస్య సద్యో విధునోతి కల్మషం
తస్మై సుభద్రశ్రవసే నమో నమః

ఎవరిని కీర్తించుట వలన, స్మరించుట వలన, దర్శించుట వలన, ఎవరికి నమస్కరించుట వలన, ఎవరిని గూర్చి వినుట వలన, అర్చించుట వలన లోకము నందలి సమస్త పాపములు వెంటనే నశించు చున్నవో అట్టి శుభకీర్తిమయుడగు భగవానునకు మాటిమాటికి నమస్కారములు.

Salutations again and again to that Lord of most auspicious renown, by singing whose praises, by thinking of, Seing, greeting and adoring whom and by hearing whose glory men are cleansed of their impurities at once.

శ్రీమద్భాగవతము మహాజ్ఞానియైన వ్యాస మహర్షి కలము నుండి కదలి, మహా వైరాగ్యమూర్తియైన శుకబ్రహ్మ గళము నుండి స్రవించి, మహా భక్తుడైన పరీక్షిత్తుని హృదయమున నిలిచినది. కనుక ఈ మహోత్కృష్ట గ్రంథము భక్తి, జ్ఞాన, వైరాగ్య స్వరూపముగ తెలియుచున్నది.

వ్యాసమహర్షి విరచితమును, నిరోధలీలా ప్రతిపాదకమునగు ఈ భాగవత గ్రంథము పరమ పావన గ్రంథము. భాగవతము అనెడి పదములోని ఐదు అక్షరములు స్వరూపాను భూతికి పంచ సోపానముల వలె తెలియుచున్నవి.

"భా" యనెడి మొదటి అక్షరము భక్తిని తెలుపుచుండ, రెండవ అక్షరమైన **"గ"** శబ్దము ప్రజ్ఞాన ఘనమైన జ్ఞానమును నిర్దేశించుచుండ, మూడవ అక్షరమైన **"వ"** శబ్దము వివేకయుతమైన వైరాగ్యమును సూచించుచుండ, నాల్గవ అక్షరమైన **"త"** శబ్దము తమోభాస్కరమగు తపస్సును నిర్వచించుచుండ, ఐదవ అక్షరమైన **"ము"** శబ్దము మోక్షరూపమగు ముక్తిని ముంజేతి కంకణము వలె చూపుతున్నది. భక్తి జ్ఞాన వైరాగ్యములను వెంట నిడుకొని తపోధనుడవై ముక్తి సింహాసనమును అధిష్ఠింపుమని భాగవతము బోధిస్తుంది.

వ్యాస భాగవతము సంస్కృత సౌరభముతో గుభాళించు చున్నందున భాషా వైదుష్యము లేనివారు అందులోని సుగంధమును ఆఘ్రాణించ లేక పోతున్నారు. పోతనామాత్యుని భాగవతము ద్రాక్షాపాకమైనను పద్యభరితమై నందున సామాన్య జనులు గ్రహించుటకు సులభం గాకున్నది. అందుచేత మూల గ్రంథములను చదువలేని వారు సులభముగా గ్రహించుటకు, ముఖ్యముగా కథలోని ఆధ్యాత్మిక భావ సౌందర్యమును దర్శింప జేయుటకు

జ్ఞానబ్రహ్మ
స్వామి సుందర చైతన్యానందుల వారు

ఈ చైతన్య భాగవతము ద్వారా ఆ బృహత్కార్యమును నిర్వహించి, ఆంధ్రదేశానికి ఎనలేని కృషి చేసినారు.

ఇది అందరూ చదువ వలసిన గ్రంథము. చదువుతూ ఉండవలసిన గ్రంథము. ఎప్పటికీ చదువదగిన గ్రంథము.

శ్రీకృష్ణార్పణమస్తు.


2

ఉపోద్ఘాతము

ఇది ద్వితీయ స్కంధము.

భగవానుని స్వరూపమైన భాగవత గ్రంథములో ద్వితీయ స్కంధము జానువులు మొదలుకొని కటి ప్రదేశము వరకు అని తెలుపబడినది.

ఆహారము యొక్క రుచి తినడంలో ఉంది. సాధన యొక్క రుచి ఆచరించడములో ఉంది.

శరత్కాలము సమీపిస్తే నదుల వేగము తగ్గుతూ ఉంటుంది. సాధన శోభిస్తుంటే మనస్సులో ఆవేదన క్షీణిస్తూ ఉంటుంది. అభ్యాసముపై ఆనందము ఆధారపడి ఉంటుంది. సాధనపై సమ్యగ్దృష్టి ఆధారపడి ఉన్నది.

కళ్ళెము లేని గుఱ్ఱము ఎటైన నడువవచ్చు. నిగ్రహము లేని మనస్సు ఎలాగైనా చరించవచ్చు. వాదనలను వదలి, సాధనలో సాగేవారికి బాధలుడిగి, బరువులు దిగి బ్రతుకు ఆనందమయంగా సాగిపోతుంది.

ఈ ద్వితీయ స్కంధమున గ్రంథము యొక్క మంగళాచరణము జరిగినది. అదృష్టవంతుడైన అధికారికి ఆత్మవిదుడైన ఆచార్యుడు ఇక్కడే లభిస్తాడు. పుణ్యాత్ముడైన పరీక్షిత్తునికి జ్ఞానియైన శుకబ్రహ్మ ఈ స్కంధము నందే తన జ్ఞానబోధను ప్రారంభిస్తాడు.

ఈ స్కంధము ముముక్షువుల మస్తకములను చక్కగా శుభ్రము చేయు రసాయనమును కలిగియున్నది. బహిర్ముఖ మయ్యే చిత్తమును అంతర్ముఖము గావించుటకు అనేక సాధనలు ఈ స్కంధమున అందించబడినవి. నిజస్థితి నందుకొనుటకు నిండుగా సహకరించే నిచ్చెనలు ఈ స్కంధమున చక్కగా పొందుపరుపబడినవి. సాధ్య సాధనములు వివరింపబడినవి. భక్తి వైభవము వర్ణింపబడినది. వందన ప్రాముఖ్యము విశదీకరింపబడినది. విరాడ్రూపము కనుల ముందు సుస్పష్టమొనర్పబడినది.

ఈ స్కంధము సాధకులకు అత్యంత ఉపయుక్తమైనది. సాధన లేనిదే వేదన అంతరించదు. రోదన అదృశ్యం గాదు. సాధకులారా! అంధకార సదృశమైన జీవన బాటలో జ్ఞాన రూపమైన దారి దీపము ఈ స్కంధమున అందించ బడినది. అందుకోండి. అందముగా నడక సాగించండి.

చైతన్య భాగవతము

ద్వితీయ స్కంధము

ధర్మామృతం

మరణ మాసన్నమైన వారి కర్తవ్యమును, అకర్తవ్యమును దెలుపమని పరీక్షిత్తుడు శ్రీశుకులవారిని అర్థించెను. అధికారియైన పరీక్షిత్తునకు భాగవత ధర్మామృతమును పోయుటకు శ్రీశుకుడు సిద్ధమాయెను. మృత్యువాసన్నమైన వానికి అమృతమే అవసరము. అది అమరులైన సురులు పానము చేయు అమృతము గాకూడదు. జనన మరణములను ఛేదించెడి భక్త్యామృతమై యుండాలి. జ్ఞానామృతమై యుండాలి. ధర్మామృతమై యుండాలి. అద్దానిని పానము చేయుటయే జీవుల అమృతమయ ధర్మము. భక్త్యామృతమును పానము చేసిన వారికి మృత్యుభయముండదు. వారు అమృతరూపు లగుచున్నారు. ఈ విషయమును త్యాగరాజు ఒక కీర్తనలో అద్భుతముగా గానం చేస్తారు. భక్తులకు యముని వలన భయము లేదనియు, భక్తులను భగవానుని అభయహస్తము రక్షించుచుండగా వారు నిర్భయులై, నిర్మలులై యున్నారని కీర్తించినారు.

భజనపరుల కేల దండపాణి భయము మనసా

అజ రుద్ర సురేశుల కా యాస్థాన మొసగు - రామ ॥భజన॥

యని భక్తి వైభవమును అరటి పండొలచి చేత నుంచినట్లు సురటిరాగంలో కీర్తించారు.

అదృష్టవంతుడైన అధికారికి ఆత్మవిదుడైన ఆచార్యుడు లభించును. పుణ్యాత్ముడైన పరీక్షిత్తునికి శుకబ్రహ్మ లభించాడు. ఆకృష్టచిత్తుడై, అవధానయుతుడైన పరీక్షిత్తునకు శుకబ్రహ్మ బోధించుచున్నాడు.

వరీయా నేషతే ప్రశ్నః కృతో లోకహితం నృప
ఆత్మవి త్సమ్మతః పుంసాం శ్రోతవ్యాదిషు యః పరః

"రాజా! నీవడిగిన ప్రశ్న వరిష్ఠమైనది. లోకహితమైనది. ఆత్మవిదులకు సమ్మతమైనది. శ్రోతలకు శుభముల నొసగునది" యనెను.

భాగవతములో శ్రీశుకులవారు ప్రప్రథమంగా పలికిన అమృతపలుకులివి. ఈ శ్లోకము మంగళప్రదమని నా అభిప్రాయము. భక్త్యామృతధారలను సదా పానము చేయు శుకయోగీంద్రులు ఈ శ్లోకమునందు శిష్టాచార సంప్రదాయము ననుసరించి మంగళాచరణము చేయుచున్నారు.

నిర్విఘ్న పరిసమాప్తి కామః మంగళ మాచరేత్

గ్రంథారంభమున మంగళ శ్లోకముంటుంది. ఆ మంగళ శ్లోకములో అనుబంధ చతుష్టయ ముండాలి. ఇది సంప్రదాయము.

అనుబంధ చతుష్టయమనగా 1. విషయము, 2. సంబంధము, 3. అధికారి, 4. ప్రయోజనము. ఈ నాలుగు విషయములు ఆరంభ శ్లోకములో ఉండాలి.

శ్రీశుకులవారు ప్రారంభిస్తూ పరీక్షిత్తు డడిగిన ప్రశ్న వరిష్ఠమైనదని చెప్పుచున్నారు. అనగా సర్వశ్రేష్ఠమైనదని భావము. సర్వశ్రేష్ఠమైనది బ్రహ్మవిద్యయేగాని మరొకటి కానేరదు. బ్రహ్మవిద్య వరిష్ఠమైనది.

అధీహి భగవన్ బ్రహ్మవిద్యాం వరిష్ఠాం

"భగవంతుడా! వరిష్ఠమైన బ్రహ్మవిద్యను నాకు బోధించుము" యని అశ్వలాయన మహర్షి అథర్వణ వేదంలో భగవంతుడైన బ్రహ్మదేవుని ప్రార్థిస్తాడు.

రెండవది సంబంధము. గ్రంథములోని విషయము బ్రహ్మజ్ఞానము; గ్రంథనామము భాగవతము. **"భగస్య ఐశ్వర్యస్య ఇదం భాగమ్"** భగమనగా ఐశ్వర్యము. జ్ఞానైశ్వర్యమును ప్రసాదించునది భాగవతము. భాగవతమనగా దేవ సంబంధమైనదని కూడా అర్థము. కనుక గ్రంథవిషయమునకు **(వరిష్ఠం)** గ్రంథనామమునకు **(భాగవతం)** సంబంధమున్నది. దీనికన్నను ఉత్కృష్టమైనది లేదు. అందుచేతనే **"పుంసాం శ్రోతవ్యాదిషు యః పరః"** యని శ్రీశుకులు ప్రవచించినారు.

శ్రీమద్భాగవతే మహామునికృతే కిం వా పరైః

"మానవుని తరింపచేయుటకు వ్యాసభగవానునిచే రచింపబడిన భాగవతము కన్నను ఉత్తమమైనది మరియొకటి ఉండబోదు" యని కౌశిక సంహిత తెలిపినది.

మూడవది అధికారిత్వము. భాగవత గ్రంథమును అధ్యయనము చేయుటకు అధికారి ఎవ్వడు? "రాజా!" **(నృప)** యనెడి సంబోధన అధికారిని సూచించుచున్నది. గ్రంథములో అధికారియైన పరీక్షిత్తుడు రాజుయై యుండును. రాజనగా రాజ్యమును పాలించువాడనే అర్థములో గ్రహింపరాదు. సర్వాభీష్టములు ఎవ్వరికి తీరినవో వాడు రాజు.

ప్రాపంచిక విషయాల వెంట అర్చిరాని బ్రతుకు బొచ్చెను చేతబట్టుకొని విషయానందము కొరకు దెంపర్లాడే బిచ్చగానివలె గాక ఆత్మ సామ్రాజ్యమును రాజువలె ధరించువాడు అధికారి యగుచున్నాడని భావము.

నాల్గవది ప్రయోజనము. గ్రంథము అధ్యయనము చేయుటవలన కలిగెడి ప్రయోజనము యని భావము. **"లోకహితం"** యనునది ప్రయోజనము. లోకమునకు హితము చేయుట ప్రయోజనము. మితములైన అన్యాశ్రయములను తొలగించి హితమైన నిత్యానుభూతిని ప్రసాదించునది యని అర్థము. ఆత్మవిద్య కన్నను హితమైనది మరియొకటి లేదుగదా!

నాతఃపరం వేదితవ్యం హి కించిత్

"ఆత్మకన్నను అన్యముగా తెలియదగినది ఏదియును లే" దని శ్వేతాశ్వతరోపనిషత్తు.

ఈ విధముగా ప్రథమశ్లోకమున పరీక్షిత్తుని అభ్యర్థనమును మన్నిస్తూ, విషయమును మన్నన చేయుచు మంగళాచరణమును గావించినారు శ్రీశుకబ్రహ్మ. మంగళకరమైన జీవితము నెరుగనివారై, బ్రతుకును వమ్ము చేసుకుంటున్న మనుజుల వ్యర్థజీవనమును రెండవ శ్లోకమునుండీ ప్రారంభిస్తూ, తదనంతరము భక్తి వైభవమును తెలుపుచున్నారు.

"గృహమేధులగు నరులు లేశమైనను ఆత్మతత్త్వము నెరుగరు. రాత్రులయందు సంభోగ నిద్రాదులయందు కాలమును వ్యర్థము చేసికొందురు. పగటిపూట ధనార్జనమునందు గడుపుచుందురు. పగటిసమయము నంతటిని కడుపు కొఱకే గడుపుకొందురు. భార్యాపుత్రాదు లందరును అనిత్యులే. ఈ సత్యము నెరుగక బ్రతుకును వృథా చేసికొను చున్నారు.

ఆ॥ పశుకళత్ర పుత్ర బాంధవ దేహాది సంఘమెల్ల దమకు సత్యమనుచు
గాపురములు సేసి కడపట జత్తురు కనియు గాన రంత్య కాలసరణి

"రాజా! వారి పూర్వీకులందరు కాలగర్భంలో కలసిపోయినారు. ఇది తెలిసికూడా చూసియు చూడనట్లే మనుజులు చరించుచున్నారు. నాశము గోచరించుచున్నను నారాయణుని యందు బుద్ధిని నిలుపలేకయున్నారు" అని శ్రీశుకుడు ప్రవచించుచున్నాడు.

దేహము అన్నియు అంతము గలిగినవియే. దేహముయొక్క చివరి శోభ అంత్యేష్టిలో అగ్ని రూపముగా వెలిగి మరుగున పడిపోవుటయే. రాకపోకల రహదారులలో మజిలీలున్నట్లు, జనన మరణ రహదారిలో ఈ జీవితమూ ఒక మజిలీయే. ఆగినంతకాలము పట్టదు తిరిగి పోవడానికి. సుఖాల అలసటయే. తెరలు పొరలుగా ఆవేదనయే.

తాతలు గతిస్తున్నారు. తండ్రులు గతిస్తున్నారు. భార్యాబిడ్డలు గతించనున్నారు. గతులు తెలిసేదెప్పుడు? మతులు నిలిచేదెప్పుడు? బాధలకు చిత్తము, బాదుకొనేందుకు ధాతి ఉపకరిస్తున్నాయి. ఏడ్చేవారైనా ఎంతకాలం ఉంటారు? కాలానికి నిలువగడుతూ తామని నోట పడుతుంటారు. పూలు, కాయలు లేని చెట్లను పక్షులు వదలి వెళ్ళునట్లు, ప్రాణములను పోగొట్టుకొనినవాని దేహమును భార్యాపుత్రులు వదలి వెళ్ళుదురు. ఇంటిలోని ధనాన్ని ఇతరు లనుభవిస్తారు. ఒంటిలోని ధాతువులను జంతువు లారగిస్తాయి.

మృతం పుత్రం దుఃఖ పుష్టం మనుష్యా ఉత్క్షిప్య రాజన్ స్వగృహో న్నిర్హరన్తి

తం ముక్త కేశాః కరుణం రుదన్తి చితా మధ్యే కాష్ఠ మివ క్షిపన్తి

"ఎన్నో దుఃఖములను భరించి జనులు పుత్రుని పెంచెదరు. అట్టి బిడ్డడు మరణించగనే ఆ దేహమును లేపి గృహములనుండి వీధులలోనికి లాగివేయుచున్నారు. ఒకవైపు జాలి కలిగి ఏడుస్తున్నారు. మరొకవైపు జాలిలేకుండా పాడె మధ్య కట్టెవలె దేహమును పారవేయుచున్నారు" యని మహాభారతములోని ఉద్యోగపర్వము ఉద్విగ్న మనస్సుతో పలికింది.

నేడు మేటి యైనవాడు రేపు కాటిలో కాలుతాడు. నిజం తెలియని దోషము వలన భుజము సంసారాన్ని మోయుచున్నది. బాల్యంలో అమాయకంగా మోస్తుంది. యవ్వనములో అజ్ఞానంతో మోస్తుంది. వృద్ధాప్యంలో అయోమయంగా మోస్తుంది. అన్ని దశలలో మాయదే అగ్రస్థానం. శల్యగతమైనా శనిస్థానమే. ఎంత అనుభవించినా సుఖం లేదు. ఉద్యోగ విరమణ చేసిన తరువాత కూడా నూతన ఉద్యోగంలో కాలిడుటయే. కాటికి చేరేవరకు కాయకష్టము తీరుటలేదు. మనస్సులోని మంట లారుటలేదు. విరమించడములో 'వి' ని విస్మరించి రమించడమే జరుగుచున్నది.

Almost all men who are secure from want and care, now that atleast they have thrown off all other burdens, become a burden to themselves.

"లోటులేని, చింతలేని జీవనాన్ని సాగిస్తున్నామని భావించువారెల్లరు అన్ని బరువులను దించుకున్నాక తమకు తామే గుదిబండలుగా మిగిలిపోతున్నారు." యని షోప్యెహర్ అభిప్రాయపడినాడు.

గడచింది గతమని, నడచేది సమ్మతమని గ్రహించాలి. వ్యర్థమైన గతం తిరిగి అర్థవంతము గాదు. భవిష్యత్తులో పరమార్థం లభించాలంటే వర్తమానం సమర్థవంతముగా సాగాలి. కనుక శుభము నాశించువారు, సుఖమును బొందగోరువారు పరమాత్మనే స్మరించాలి. కీర్తించాలి. పూజించాలి. ధ్యానించాలి. తరించేందుకు ఇదియే ఏకైక మార్గమని శ్రీశుకుడు ప్రవచించుచున్నాడు. ఆచరింపదగిన దిదియేనని పరీక్షిత్తుని ప్రశ్నకు సమాధాన మొసంగుచున్నాడు.

తస్మాద్భారత సర్వాత్మా భగవా నీశ్వరో హరిః

శ్రోతవ్యః కీర్తితవ్యశ్చ స్మర్తవ్యశ్చేచ్ఛతాఽభయమ్॥

"రాజా! కనుక మోక్షార్థి యగువాడు సర్వాత్ముడు, భగవానుడు, ఈశ్వరుడు, హరియునగు పరమాత్మనే శ్రవణము చేయాలి. కీర్తించాలి. స్మరించాలి."

క॥ కావున సర్వాత్ముండు మహా విభుడు విష్ణుడీశు డాకర్ణింపన్
సేవింపను వర్ణింపను భావింపను భావ్యు డభవ భాజికి నధిపా!

యని పోతనామాత్యుని అనువాదము.

ఆశింపదగినవాడు అచ్యుతుడొకడే. కీర్తింపదగినవాడు కృష్ణుడొక్కడే. వ్యవహారము మనుజుని బంధింపదు. మమకారమే బంధిస్తుంది. వ్యాపారము దోషముగాదు. వ్యాపారములోపడి పరమాత్మను మరచిపోవడము దోషము. అన్నీ ఉన్నాయి. వాటితోపాటు శనికూడా యున్న దన్నట్లు, సమస్తముండినను భక్తిహీనుడు శక్తిహీనుడే.

కీర్తన మహోన్నతమైనది. కీర్తన చేయువారు కీర్తిమంతులగుదురు. నారాయణ దివ్య శబ్దమున్నది. నాలుక స్వాధీనము నందున్నది. ఇంకేమి అవసరము? నామామృతమును జుర్రుటయే జీవులకు తక్షణ కర్తవ్యం కావాలి. భగవంతుడు నామవశుడు. నామమును పట్టిన వారికి నారాయణుడు లభించును.

కరిసీ సోస్ మాయేచా ఆసోసు నవ్హై తుజ్ సోరసు నామె వీణ్

నామాచాచ్ మంత్ర్ నామాచేచి తంత్ర్ నామావిణ పవిత్ర్ నవ్హెసి దేఖా॥

"మాయయొక్క ఆశలోబడి ఎందుకు శోకిస్తావు? నామము కన్నను అన్యమైన దానిలో సుఖము లభించదు.

నామమే మంత్రము. నామమే తంత్రము. నామమునొదలి అన్య సాధనములతో సాధ్యమును సాధించగలవేమో చూడుము" యని సంత్ నామదేవ్ మహరాజ్ నామవైభవమును గూర్చి ఒక అభంగములో కీర్తించారు.

అసంస్కారులైన శుష్కవేదాంతులు కొందరు నామవైభవమును నిరసిస్తుంటారు. అట్టి వాచావేదాంతులకు శ్రీశుకబ్రహ్మ ఈ సందర్భమున చక్కని చురక వేయుచున్నారు.

ప్రాయేణ మునయో రాజన్నివృత్తా విధిసేధతః

నైర్గుణ్యస్థా రమన్తే స్మ గుణానుకథనే హరే

"రాజా! కృత్యాకృత్యములకు అతీతులైనవారు, నిర్గుణస్థితిని బొందిన మునులే భగవానుని కీర్తించుట యందు ఆసక్తులై యుందురు" అనెను.

నామసాధనకు అందరూ నోచుకోలేరు. పాటలెవ్వరైనా పాడగలరు. పాటులు తొలగించే కీర్తనమును ఉత్తమ భక్తులే చేయగలరు. భగవానుని కీర్తిని వెల్లడిచేయునదియే కీర్తనమని తెలియవలెను. కీర్తన వలన భక్తుని బ్రతుకు శుద్ధిపడును. భక్తిశ్రద్ధలు పెంపొందును.

"రాజా! ద్వాపర యుగాంతమున సర్వవేదసారమగు ఈ పవిత్ర భాగవత పురాణమును నా తండ్రియైన వ్యాసునికడ నేను శ్రవణము చేసితిని. రాజా! నేను అద్వైత తత్త్వమునందు స్థిరపడిన వాడనైనను శ్రీకృష్ణుని దివ్యలీలలచే ఆకర్షింపబడి అద్దానిని శ్రవణము చేసితిని. భాగవతమునందు శ్రద్ధ గలవారికి భగవానుడు లభించును.

"సంసారమునందు నిర్వేదమును పొందినవారు నామసంకీర్తనము ద్వారానే తరింతురు. కొంతకాలము నామము నుచ్చరించువారు అంత్యకాలము వరకు నామముచేత నడుపబడెదరు" అనెను.

శ్రీశుకుని మాటల నాలకించిన పరీక్షిత్తుడు "దేవా! నాకు ఏడు దినములలో మరణము నిలచియున్నది. ఈ ఏడు రోజులలో నేను తరించగలనా?" అని వినమ్రుడై ప్రశ్నించెను.

"రాజా! పూర్వము ఖట్వాంగుడను రాజుండెడివాడు. అతడిక ఒక ముహూర్తకాలము మాత్రమే జీవింతునని తానే గ్రహించెను. వెంటనే సమస్తమును త్యజించి, మనస్సును శ్రీహరియందు నిల్పి, తదేక ధ్యానముతో తరించిపోయెను. నీకు ఏడు రోజుల సమయమున్నది. సంశయింపకుము. సాధన లాచరింపు" మనెను.

సద్గురువు లభించిన పిదప గూడ సంశయములతో చరించువానికి సద్గతి యుండదు. పరీక్షిత్తుని పుణ్యమా! యంటూ శుకబ్రహ్మ గురువుగా లభించెను. శుకబ్రహ్మలాంటి గురువు లభించిన వారికి ఏడు రోజు లవసరములేదు. ఏడు క్షణాలు చాలు.

అంత్యకాలమున మృత్యుభయ ముండరాదని శ్రీశుకుడు తెలిపెను. నిర్మల హృదయముతో, నిర్భయముగ దేహమును త్యజించుట యనునది సర్వులకు సాధ్యమయ్యే కార్యము గానేరదు. దినమంతయు నిర్దోషముగ జీవించువారు రాత్రులయందు హాయిగా నిద్రపోతారు. కల్మషకార్యము లందు నిమగ్నమైన జీవులు నిద్రపోలేరు సరిగదా ఆవేదనకు లోనై దుఃఖిస్తుంటారు.


మృత్యువు భయంకరమైనది. అనివార్యమైనది. కాని భక్తులైన వారిని మృత్యువు భయపెట్టలేదు. భగవానుని అభయహస్తము వారిని నిర్భయులుగా చేయును. మహాభారతముకూడా ఈ సత్యమునే వచించుచున్నది.

భయం న చాముత్ర న చేహ తేఽస్తి

"అట్టివానికి పరమునగాని, ఇహమునగాని భయముండదు" అని విదురుడు చెబుతాడు. నిర్దోషులు నిర్మలంగా నిద్రించునట్లు, పాపరహితులు మరణకాలమున అనాయాసంగా దేహాన్ని త్యజిస్తారు. దేహముపై ఆసక్తి లేనందున ఆ దేహమునకు సంబంధించిన భార్యాపుత్రుల యందుకూడా అనాసక్తులై, అనాయాస, ఆనంద మరణము నొందెదరు. ఈ స్థితి ఉన్నపళంగా మృత్యువులో లభించదు. జీవితములో పండిన శాంతియే మృత్యుసమయాన హృదయములో నిండి వెల్గొందును. కనుక ఈ స్థితికై మనుజుడు కృషి చేయాలి.

"గృహములో వసించుచున్నను, గృహము మనస్సులో లేకుండా చూసుకోవాలి. నావలో నీళ్ళెక్కరాదు. మనస్సులో విషయాలు ప్రవేశించరాదు. బ్రహ్మచర్యమును విధిగా పాటించాలి. ఏకాంతవాసము నలవరచుకోవాలి. ప్రాణాయామమును కొనసాగిస్తూ ప్రణవధ్యానమును సాగించాలి. మనస్సును నిగ్రహించాలి. సంకల్పాలను నిరోధించాలి" యని శ్రీశుకుడు చెప్పుచున్నాడు.

ప్రాణాయామ సహిత ప్రణవ ధ్యానమును ఉపనిషత్తులు తెలిపియున్నవి. ఆ ధ్యానమునే శ్రీశుకదేవు లిచ్చట చెప్పుచున్నారు. పూరక రేచక కుంభకాదులలో ప్రాణమును యామము చేయవలెను.



శుకుడు వ్యాసుని వద్ద భాగవతమును శ్రవణము చేయుట

నిషేధనం ప్రపంచస్య రేచకాఖ్య స్సమీరితః
బ్రహ్మైవాస్మీతి యావృత్తిః పూరకో వాయు రుచ్యతే
తత స్త ద్వృత్తి నైశ్చల్యం కుంభకం ప్రాణ సంయమః

"రేచకములో ప్రపంచమును నిషేధించాలి. పూరకములో "నేనే బ్రహ్మము" అని భావించాలి. "అహం బ్రహ్మ" యనెడి భావమును స్థిరముగా కుంభకములో నిలపాలి" యని తేజోబిందూపనిషత్తు తెలిపినది.

ఓంకార ధ్యానము పరమ పవిత్రమైనది. అకార, ఉకార, మకారములలో జాగ్రత్స్వప్న సుషుప్త్యవస్థలను ఐక్యమొనర్చి ధ్యానించువారికి నిర్వికల్ప సమాధి లభించును.

ఓ మిత్యేకాక్షరం బ్రహ్మ ధ్యేయం సర్వ ముముక్షుభిః

"ఓం" అనెడి ఏకాక్షరరూపమైన బ్రహ్మమునే ముముక్షువు లెల్లరు ధ్యానించాలి" యని ధ్యానబిందూపనిషత్తు పలికినది.

శ్వాస ద్వారా ప్రణవోపాసన చేసి మనస్సును నిగ్రహించమని శుకుడు తెలుపుచున్నాడు. ప్రాణ బంధనమువలన మనస్సు లీనమగును. బుద్ధి శుద్ధిపడును. అట్టి బుద్ధి మనస్సుతో ఇంద్రియములను విషయములనుండి మరలించగలదు. కర్మలచే ఆకర్షింపబడిన మనస్సు పతనమగును. బుద్ధిచే ఆకర్షితమై ప్రగతినొందును. మనస్సుకు అవగాహనను కల్పించాలి. మనస్సునకు, బాహ్య ప్రపంచమునకు ఏ విధమైన భౌతిక సంబంధమూ లేదు. సమస్తము మనస్సులోనే కల్పింప బడుచున్నవి. దేశకాలాదులు మనస్సును చలింపచేయలేవు. మనస్సు చలించుటకు సిద్ధపడినపుడే బాహ్యవిషయాలు తమ ప్రభావమును మనస్సుపై చూపగలుగును.

The mind in its own place, and in itself can make a heaven of hell, a hell of heaven.

మనస్సు తనంతట తానే, తానున్న స్థితిలోనే స్వర్గమును నరకంగాను, నరకమును స్వర్గముగాను చేసుకుంటుంది" అని మహామేధావియగు మిల్టన్ మహాశయుడు ప్రసిద్ధమైన తన "పారడైజ్ లాస్ట్" అనెడి గ్రంథములో, అనేక అహేతుక, అశాస్త్రీయ విషయాల మధ్య ఈ అద్భుతమైన సత్యమును పలికినాడు.

కనుక ప్రాణమును నిరోధించి, మనస్సును నిగ్రహించి, ఇంద్రియములను నియమించి, హరియందు చిత్తముంచి, బుద్ధిని స్థిరమొనర్పవలెను.

ఆ॥ పవనము నియమించి, పరిహృత సంగుడై యింద్రియముల గర్వ మెల్లమాపి
హరి విశాలరూప మందు జిత్తము జేర్చి నిలుపవలయు బుద్ధి నెఱపి బుధుడు

ఈ విధముగా ధారణను కొనసాగించి యోగమును సిద్ధించుకొనవలెను. ఈ ధారణ సమయంలో మనస్సు చలించకూడదు. ఒకవేళ మనస్సు చలించినచో భగవానుని రూపవైభవమును గాంచవలెనని శుకుడు చెప్పుచున్నాడు. ఇక్కడ అతిముఖ్యమైన విషయమును గుర్తించి గ్రహింపవలెను. యోగధారణయందు భక్తిని సంయుత మొనరించుచున్నాడు.

మనో నిర్విషయం యుక్త్వా తతః కించన న స్మరేత్
పదం తత్పరమం విష్ణో ర్మనో యత్ర ప్రసీదతి॥

"మనస్సును నిర్విషయ మొనర్పుము. మరొక విషయమును స్మరింపకుము. ఏ విధముగా మనసెచ్చట ఉపశమించునో అది విష్ణుదేవుని దివ్యసన్నిధి యని గ్రహింపుము" అనెను.

భక్తి లేనిదే యోగము సిద్ధించదు. భక్తి లేని యోగము వాస్తవానికి మరొక రోగము. యోగము చేత మనస్సును నిగ్రహింపవచ్చును. అలా నిగ్రహింపబడిన మనస్సు మాధవునిలో కలియుటకు భక్తియే ఏకైక మార్గము. ప్రేమ ద్వారా హృదయంలో మనస్సు స్థిరముగా నిలబడినచో ముక్తి లభించును. మనస్సు విషయములయందు ప్రవేశించుచుండినచో హృదయము నందు స్థిరపడలేదు. వాసనలు మనస్సును పదే కదలించుచుండును. విషయములు ఇంద్రియములద్వారా మనస్సును బలవంతముగా ప్రపంచము వైపునకు లాగుచుండును. భక్తి - విషయములను, వాంఛలను విరోధించును. అందుచేతనే భక్తిని నిరోధ స్వరూపముగా వర్ణించినాడు భక్త్యాచార్యుడైన నారదమహర్షి వరేణ్యుడు.

సా న కామాయమానా నిరోధ రూపత్వాత్

"భక్తి నిరోధ స్వరూపమై యున్నందున కోరికలను కదలనివ్వదు" యని నారదమహర్షి భక్తి సూత్రాలలో తెలుపుతాడు.

మనస్సు మలినమైనప్పుడు జగద్భ్రాంతి హృదయమున తిష్ఠవేయును. తరిమినను అది తురుముకొనియే వచ్చును. మలిన మనస్సుతో చేయు స్మరణము మరణము నాపదు. భక్తి లేని తపస్సులో శక్తి యుండదు. ప్రేమ లేని అర్చనము యమునితో చర్చను నివారింపలేదు. విషయములను ధ్యానించు మనస్సు విష్ణుదేవుని పొందలేదు. ఈ విషయమును త్యాగరాజస్వామి ఒక కీర్తనలో అద్భుతముగా గానం చేస్తారు.

మనసు విషయ నటవిటుల కొసగితే మా రాముని కృపకల్గునో! మనసా,
తన తలుపు తీసిపెట్టి ఒకరింటికి తా కుక్కలు తోలురీతి గాదో ॥ మనసు॥
తవిటికి రంకాడబోతే కూటి తపిల కోతి కొంపోయినటు గాదో
చెవిటికి ఉపదేశించినటు గాదో శ్రీ త్యాగరాజ నుతుని దలంచక ॥మనసు॥

భర్తను వదలి నటులతో, విటులతో తిరుగుట భార్యకెంత దోషమో, భగవానుని వదలి విషయములవెంట మనస్సు పడుట అంతటి దోషమంటున్నారు త్యాగరాజస్వామి. తానెవరిపై నాధారపడియున్నదో అట్టి భరించే భర్తను వదలి, తన నాకర్షించు విటులను జేరు వనితవలె, మనస్సు ఏ పరమాత్మ నాశ్రయించి కులుకుచున్నదో అట్టి ఆధారరూపుని పరిత్యజించి, తనను మోసగించు విషయముల వెంట పరుగులిడుచున్నది.

ప్రక్కయింటిలో కుక్కలు పడ్డాయని ఒక స్త్రీ ఆ కుక్కలను తోలుటకు పరుగిడినదట. కానీ విచిత్రమేమిటంటే తన ఇంటి తలుపు తెరచియున్నదని గ్రహించ

లేదంటారు త్యాగయ్య. అందరూ ఈ ప్రపంచములో పరుల నుద్ధరించువారే. కానీ తమ చిత్తము చెత్తగా మారియున్నదని గ్రహించు వారెవరు?

ఒక యువతి గోవులకు తవుడు లేదని భావించి, ప్రక్కింటికి తవుడు నడుగుటకై వెళ్ళిందట. ఆ ఇంటి మగాడు ఒంటరితనమును పసిగట్టి ఆవిడతో సల్లాపము లాడ బోయినాడట. తవుడిచ్చు నని భావించి ఆవిడకూడా అతనితో సరసము లాడుచుండినదట. ఈ లోగా ఒక కోతి ఆవిడ ఇంటిలో ప్రవేశించి, ఆమె వండుకొనిన కూటి తపెలె (గిన్నె) ను ఎత్తుకుపోయిన దంటారు త్యాగయ్య.

విషయములనెడి తవుడును పొందే యత్నములో తిండినే పోగొట్టుకొనినట్లు, విషయముల ననుభవించే యత్నములో జీవులు శాంతినే భగ్న మొనర్చుకొంటున్నారు. ఆ తరువాత చెవిటివానికి ఎంత ఉపదేశించినను నిరుపయోగమే అయినట్లు, విషయ చింతనామగ్నమైన చిత్తమునకు సమస్త సాధనలు నిష్ప్రయోజనములే అంటున్నారు.

"మహాత్మా! మనస్సు చంచలము. దుర్నిగ్రహము. దానికి ధారణ కల్గించుటెట్లు? ధారణకు ఉపాయమెయ్యది? మనస్సులోని మాలిన్యము త్వరగా తొలగుటకు ఆచరింపవలసిన సాధనము లేవి? ఈ విషయముల నన్నింటిని నాకు తెలుపుము" యని పరీక్షిత్తుడు శుకబ్రహ్మ నర్థించెను.

శుకబ్రహ్మ చెప్ప నారంభించెను. మొదట ఆసనము సిద్ధించాలి. ఆసన సిద్ధి లేనివానికి ఆత్మజ్ఞానమెలా కలుగును? కొందరు క్షణకాలము కదలకుండా ఒక్కచోట కూర్చోలేరు. కొందరు ఆలయాలలో అర్చన సమయాన కూడా నిర్మలంగా నిలబడలేరు. నూతన అభ్యాసకుని చేతిలో సైకిల్ యొక్క హేండిల్ కదలునట్లు కదుల్తూ ఉంటారు. లేదా రక్షక భటునిచే తరుమబడిన చోరుడు నాలుగువైపుల వీక్షించునట్లు చూపులను కదలిస్తుంటారు. చక్కగా కూర్చొనుట, చక్కగా నిలబడుట, చక్కగా నడచుట, చక్కగా చూచుట మొదలైన వన్నియు ఆసనసిద్ధికి తార్కాణములు.

ఆసనము సిద్ధించిన పిదప శ్వాసను క్రమపరచవలెను. అటుపిమ్మట ఇంద్రియములను నిగ్రహింపవలెను. ఇంద్రియ భోగములో మనిషికి సుఖము లభించదు. పైగా వాసన లధికమగును. ఇంద్రియ సుఖము లనుభవించుటలో వ్యక్తి ఔన్నత్యమేమున్నది? ఇంద్రియ భోగములను శునకాది జంతువులు సైతము అనుభవించుచున్నవి. ఈ విధమైన భావస్పందనతో ఇంద్రియములను నిగ్రహించి, సాంగత్యమును విసర్జించి, భగవానుని రూపవైభవము నందు మనస్సు నుంచవలెను.

విరాడ్రూప వర్ణనము

విశ్వమంతయు భగవానుని స్వరూపముగా దర్శించుటయే విరాడ్రూపము. అది అణువు కంటెను సూక్ష్మమైనను స్థూలముల కంటెను స్థూలతరమైనది. త్రికాలముల యందును కార్యరూపమగు జగత్తు ఏదిగలదో అది యంతయు విరాడ్రూప జనితమే. ఆ విరాడ్రూప చైతన్యమే ధారణ కాశ్రయము.

పాతాళము ఆయనకు పాదమూలమై యుండగా రసాతలము ఆయన పాదములకు ముందు వెనుక భాగమై యున్నది. మహాతల మాయన చీలమండ. తలాతల మాయన కాలిపిక్క. సుతలము రెండు జానువులు కాగా, వితలము రెండు తొడలాయెను. మహీతలము జఘన ప్రదేశము. భువర్లోకము నాభి ఆయెను. స్వర్గమే వక్షస్థలము. మహర్లోకము కంఠప్రదేశము. జనలోకము వదనము కాగా తపోలోకము లలాట మాయెను.

ఇంద్రాది దేవతలు బాహువులై యున్నారు. దిక్కులాయనకు కర్ణములై యున్నవి. అగ్ని ఆయన ముఖమై యుండెను. ఆకాశము నేత్ర గోళమై యుండగా సూర్యుడు నేత్రము లాయెను. రాత్రింబవళ్ళు కనురెప్పలాయెను. ఈ విధముగా ఆ దివ్యాత్మని విరాడ్రూపము వెల్గొందుచుండెను. అనగా గోచరించు ప్రతివస్తువు నందును పరమాత్మయే తెలియవలెను. లేదా సమస్తము పరమాత్మయందే యున్నదనెడి యనుభూతిని పొందవలెను.

క॥ హరిమయము విశ్వమంతయు హరి విశ్వమయుండు సంశయము పనిలే దా
హరిమయము గాని ద్రవ్యము పరమాణువు లేదు వంశపావన వింటే

ఇది కళ్యాణ దృష్టి. కమనీయ దృష్టి. ఈ దివ్యదృష్టి అలవడిన వారికి దోషదర్శనము జరుగదు. అందరిలో పరమాత్మ గోచరించును. ప్రతి ఒక్కరి నేత్రములనుండి తొంగిచూచు నట్లగుపడును. ప్రతి శబ్దము నుండి పలకరించుచున్నట్లు విని మేను పులకరించును. ఈ విధమైన బ్రహ్మభావన ధృవపడుచుండగా జగద్భావన మెల్లగా అదృశ్యమై పోవును. అసంగత్వము వృద్ధిచెందు కొలది ఫలాసక్తిని వదల గలిగినచో బ్రహ్మస్వరూపులము కాగలము. అనంతమును దర్శించిన వారమై ఆత్మవిదుల మగుదుము. ఇచ్చట వీక్షణమేగాని విచక్షణ లేదు. దర్శనమేగాని ధర్మము తెలియదు.

సాధ్య సాధనములు

"రాజా! ఇంతవరకు నేను తెలిపిన ఈ విరాడ్రూప జ్ఞానమును బ్రహ్మదేవుడు తొలుత భగవానుని సన్నిధిలో పొందియుండెను. సృష్టికార్యమునకు ఈ జ్ఞానమే అతనికి ఉపకరించెను. భోగములయందు మనస్సు లగ్నము గాకూడదు. స్వర్గాది భోగములు కూడా అనిత్యములే యని సాధకుడు గుర్తించవలెను. నిరవధికానందమును బొందగోరువాడు నామమాత్ర సారములగు సంసార సుఖ భోగములయందు స్పృహ లేనివాడై యుండ వలెను" యని శ్రీశుకుడు పరీక్షిత్తునకు వైరాగ్యమును ప్రబోధించుచున్నాడు.

భోగాసక్తిని సాధకుడు మనస్సునుండి దూరం చేయాలి. అవసరమునకు మించిన ఆదాయము ప్రయాసయే కాగలదు. వలయుదానినే వాంఛించాలి. విషయసుఖాలు నిత్యసుఖములు గానేరవనెడి భావనను హృదయములో ఆవిష్కరించుకోవాలి.

సిద్ధేఽన్యథార్థే న యతేత తత్ర పరిశ్రమం తత్ర సమీక్షమాణః

"రాజా! జీవితావసరములగు వస్తువులు ఎలాగో సిద్ధించుచుండగ, అట్టివానికై తీవ్ర ప్రయత్నము లాచరింప బనియేమి?" యని శ్రీశుకులవారు ప్రవాహంలాగ జ్ఞానామృతమును పోయుచున్నారు.

"భూమి యుండగా మరియొక పలుపు ఏల? పరమాత్మ అనుగ్రహించిన బాహువులుండగ దిండ్లయొక్క అవసర మేమున్నది? దోసిలి దివ్యముగా నుండగా భోజనమునకు పాత్రలేల? నార చీరలుండగా పట్టువస్త్రముల పాత్ర ఏమి?" అంటున్నారు శుకబ్రహ్మ.

సీ॥ కమనీయ భూమి భాగములు లేకున్నవే పడియుండుటకు దూది పలుపు లేల?
సహజంబులగు కరాంజలులు లేకున్నవే భోజన భాజన పుంజమేల?
వల్కలాజిన కుశావళులు లేకున్నవే కట్ట దుకూల సంఘంబు లేల?
కొనకొని వసియింప గుహలు లేకున్నవే ప్రాసాద సౌధాది పటలమేల?
తే॥ ఫల రసాదులు గురియనే పాదపములు? స్వాదు జలముల నుండవే సకల నదులు?
పొసగ భిక్షము వెట్టరే పుణ్యసతులు ధన మదాంధుల కొలువేల తాపసులకు?

యని సహజ పాండిత్య సౌరభము.

సర్వదా పరమాత్మనే స్మరింపవలెను. సేవింపవలెను. ఈశ్వర సేవనము అలవడనిచో ఈశ్వరత్వము ప్రాప్తించదు. ఈశ్వరుని సేవింపవలె నన్నచో భోగములను సేవించుట మానవలెను. విషయాలు ధ్యానములో విఘ్నములై నిలుస్తాయి.

భోగానుభవము హీనమైనది. అది పశు జీవనమునకు ప్రతిబింబము. షడ్రసోపేతములైన భోజనముల నారగించుటయందు మనుజులకు ఎట్టి అనుభూతి కలుగునో, చచ్చిన దేహాలను దినుటలో కుక్కలకు అదే ప్రీతి కలుగును. దూది పలుపులపై పరుండిన మానవులకు ఎలాంటి సుఖ స్పర్శ జనిత నిద్రయో, పెంటకుప్పలపై బడియున్న పందులకు అదే సుఖము కలుగును. భవనములలో కులుకువారి ఆనంద పలుకు లేవియో బొక్కల నన్వేషించు నక్కల ఈల లవియే. ఇంతవరకు విషయము లనెడి విషమును ద్రాగి మృతి చెందుటకు సిద్ధంగాయున్న ఇంద్రియములకు నామామృతము నందించి పునర్జీవింప చేయాలి. లేనిచో యమభటుల గదాఘాతములకు గురియై, యముని ఇంటి ముంగిట మంటల ననుభవించవలసి వచ్చును.

మ॥ హరి జింతింపక మత్తుడై విషయ చింతా యత్తుడై చిక్కి వా
సరముల్ ద్రొబ్బెడువాడు కింకర గదా సంతాడి తోరస్కుడై
ధరణీశోత్తమ! దండ భృన్నివసన ద్వారోప కంఠోగ్ర నై
తరణీ వహ్ని శిఖా పరంపరలచే దగ్ధుండు గాకుండునే?

ఈ సత్యము లెరిగినవారు విషయాభిలాషులు గారు. అట్టివారు సదా భగవంతుని స్మరించు చుందురు. కొందరు చతుర్భుజుడైన హరిని హృదయములో దర్శించుచుందురు. పరమాత్మ ధ్యానము నిరంతరము సాగుచుండవలెను. నిరాటంకముగా కొనసాగుచుండవలెను.

కొందరు ధ్యానవేళలను గూర్చి ప్రశ్నించు· చుందురు. ఏ కాలములో ధ్యానము చేయుట మంచిది యని ప్రశ్నించుచుందురు. ప్రారంభ సాధకులకు సమయాలు సముచితములే. కానీ ధ్యానము కాలమునకు పరిమితము గాదని గుర్తింపవలెను. బిడ్డను ప్రేమించుటకు సమయమున్నదా? భార్యను ప్రేమించుటకు కాలమున్నదా? పరమాత్మ విషయంలో కాలమెందులకు? శ్రీకృష్ణుని సదా స్మరించాలి. సదా భజించాలి.

ఎంతవరకు ధ్యానము చేయాలి? అని మరికొందరు ప్రశ్నిస్తుంటారు. ధ్యాన తరగతి యనగానే "స్వామీ! ధ్యానము ఎంతసేపు నిర్వహిస్తారు?" అని నన్ను ప్రశ్నిస్తుంటారు. ఏం చేద్దాం. కూర్చోక ముందే లేవాలని మనస్సు ఆరాట పడుచున్నది. ఆరంభించక ముందే బుద్ధి అలసట ననుభవించు చున్నది. ధ్యానము ఎంతసేపు చేయాలి? యని ప్రశ్నించుచున్నాము. మంచిదే. భోజనము నెంతసేపు చేయాలి? యని ప్రశ్నించ మెందుకని? విషయాల యందున్న అభిరుచి విష్ణువునందు లేదు. కడుపు నిండినంతవరకు, ముఖ్యంగా ఆకలి తీరినంతవరకు భుజింపక తప్పదు.

"ప్రతిక్షణంబును ధ్యానంబు సేయుచు నెంత కాలంబునకు బరిపూర్ణ నిశ్చల భక్తి యోగంబు సిద్ధించు నంత కాలంబునుం దదీయ చింతాతత్పరులై యుందు" రని శుకులవారు చెప్పిరని పోతనామాత్యుని ఆంధ్ర భాగవతము.

భగవానుని పాదపద్మ యుగళమునుండి ఒక్కొక్క అవయవమును చక్కగా, స్పష్టంగా ధారణ చేయవలెను. బుద్ధి శుద్ధి యగుచుండగా చిత్తము స్థిరపడుచుండును. ఈ విధముగా భగవానుని దివ్యావయవములను ధారణ చేయవలెను. దైనందిన కార్యములు పూర్తికాగానే పరమాత్మ ధ్యానమును మనుజులు సాగించవలెను.

"రాజా! యోగులు "నేతి - నేతి" యనెడి వాక్యముపై బుద్ధినుంచి, ఆత్మయే సత్యమనియు, దాని కన్యమైన దంతయు అనిత్యమని గ్రహింతురు. ఆ విధముగా వారు అనన్యప్రేమతో అక్షయ రూపుని ధ్యానించి తరింతురు.

న హ్యతోఽన్యః శివః పన్థా విశతః సంసృతావిహ
వాసుదేవే భగవతి భక్తి యోగో యతో భవేత్

"రాజా! భవబంధములలో చిక్కియున్న మానవునకు వాసుదేవుని యందు అకుంఠిత భక్తిని కల్గించు సాధనమే శుభకరమైనది. దీని కన్యమైన మార్గమేదియును లేదు" యని శుకబ్రహ్మ పరీక్షిత్తున కెరింగించెను.

ఇంతవరకు విష్ణుభక్తి యొక్క వైశిష్ట్యమును, వైభవమును వర్ణించిన శుకబ్రహ్మ చిత్తమును నిర్మల మొనర్చుకొనుటకు, భగవద్భక్తిని పెంపొందించుకొనుటకు శ్రీహరికథామృతమును శ్రవణపుటముల ద్వారా పానము చేయుటయే ఏకైక ధర్మమని తెలుపుచు శ్రీమద్భాగవతము నందలి ద్వితీయస్కంధములోని ద్వితీయోధ్యాయమును ముగించుచున్నారు.

సీ॥ అఖిలభూతము లందు నాత్మరూపంబున నీశుండు హరియుండు నెల్లప్రొద్దు
బుద్ధ్యాది లక్షణంబుల గానబడును మహాత్సేవనీయు డహర్నిశంబు
వందనీయుడు భక్తవత్సలుం డత్యంత నియతుడై సతతంబు నియత బుద్ధి
నాత్మరూపకు డగు హరికథామృతమును గర్ణపుటంబుల గాంక్ష దీఱ
తే॥ గ్రోలుచుండెడు ధన్యులు కుటిల బహుళ విషయమలినీ కృతాంగముల్ వేగ విడిచి
విష్ణుదేవుని చరణారవిందయుగము కడకు జనుదురు సిద్ధంబు కౌరవేంద్ర!

మరణకాల మాసన్నమైనవారు ఆచరింపదగిన సాధనను గూర్చి పరీక్షిత్తుడు ప్రారంభమున శుకబ్రహ్మను ప్రశ్నించెను. మరణ మాసన్నమైన వారికి హరిగుణ శ్రవణ కీర్తనాదులే విహితములని శ్రీశుకుడు ఇంతవరకు ప్రవచించెను.

భక్తి వైభవము

"రాజా! బుద్ధిమంతులైనవారికి హరిస్మరణమే విహితమైన సాధనమై యున్నది. దీనివలన పరమ పురుషార్థమైన మోక్షము లభించును" యని పలికి కోరికలు గలవారు విభిన్న దేవతలను ఎలా ఉపాసించెదరో శుకబ్రహ్మ పరీక్షిత్తునకు చెప్పుచున్నాడు.

ఇంద్రియ సామర్థ్యమును గోరువారు ఇంద్రుని సేవించెదరు. సంతానమును వాంఛించువారు ప్రజాపతులను పూజిస్తారు. తేజస్సును గోరువా డగ్నిని ఆరాధించును. ధనము నభిలషించువాడు అష్టవసువులను అర్చించును.

కృషి వాణిజ్యాదులను గోరువారు సాధ్యులను, ఆయుస్సును వాంఛించువారు అశ్వినీ దేవతలను, సౌందర్యము నభిలషించువారు గంధర్వులను, ధనమును గోరువారు ప్రచేతసుని, సంతానము నర్థించువారు పితృగణములను, రాజ్యకాంక్ష గలవారు మనువులను, భోగాభిలాషులు సోముని సేవించుచుందురు. నిష్కాములైనవారు శ్రీమహావిష్ణువును ఆరాధించుచుందురు.

"రాజా! ఉదారచరితులైన నిష్కామయోగులు మోక్షము నభిలషించువారై, భక్తియోగ తత్పరులై విష్ణువు నారాధించుచుందురు. అలాగాక ఎవ్వరయితే అన్యదేవతల నుపాసించుచుందురో అట్టివారికి భగవద్భక్తుల సాంగత్యము లభించును. తద్వారా స్థిరమైన భక్తి ఏర్పడును. వారికి గూడా తదనంతరము సర్వశుభములు చేకూరును.

పరీక్షిన్మహారాజా! భాగవతులైన మహాత్ముల వలన హరిగాథలను శ్రవణము చేయు చుండవలెను. దానివలన రాగద్వేషము లుపశమించును. జ్ఞానము కలుగును. పరమాత్మ ప్రసన్ను డగును. భక్తి వృద్ధి చెందును. ఈ విధమైన సంతృప్తిని బొందిన మనుజుడు సదా హరికథా శ్రవణము నందు ఆసక్తిగలవాడై యుండును. అట్టివాడే నిజమైన భాగ్య వంతుడు" అని శుకబ్రహ్మ పరీక్షిత్తునితో పలికెనని సూతమహర్షి నైమిశారణ్యంలో శౌనకాది మునులకు చెప్పెను.

నిజమే. కథాశ్రవణము చేయువారు నిజ భాగ్యవంతులు. ఈ భాగ్యము ఒకనాడు వ్యాసునివలన శుకునికి, మరొకనాడు శుకునివలన పరీక్షిత్తునకు కలిగినది. ఈనాడు మహానుభావుడైన సూతమహర్షి వలన తమకు కలిగినదని భావించి పరవశించిన శౌనకుడు సూతునితో ఇలా పలికెను:

"మహాత్మా! శుకుని ప్రబోధము నాలకించిన పరీక్షిత్తుడు ఆయనను మరేమి ప్రశ్నలడిగెను? వాటినన్నింటిని మాకు సవిస్తరముగ తెలుపుడు. పరీక్షిత్తుడు పరమభాగవతుడు. అతడు కృష్ణగతచిత్తుడు. బాల్యము నుండియే భక్తిని అవలంబించినవాడు.

బాలః క్రీడనకైః క్రీడన్ కృష్ణ క్రీడాం య ఆదదేః

"పరీక్షిత్తుడు బాల్యక్రీడలయందు గూడ శ్రీకృష్ణఅర్చనాదిరూప క్రీడలనే స్వీకరించెడి వాడు".

భక్తి బాల్యమునందే కలగాలి. ముసలితనములో కలిగే భక్తి ముసలిభక్తిగనే యుండును. అంతఃకరణ కలుషితంగాక మునుపే అచ్యుతునిపై అనురాగ మేర్పడవలెను. విషయవాసనలు హృదయమును స్పృశింపక మునుపే అనంతుడు యెదలో ప్రతిష్ఠింపబడాలి. ధృవ ప్రహ్లాదాదుల భక్తి వైభవ మదియే. భాగవతుల యొక్క వైభవమును బాల్యమే తెలుపును.

The Childhood shows the man, as morning shows the day

"ఉషోదయం దినవైభవమును తెలుపునట్లు, బాల్యోదయం బ్రతుకును ప్రతిబింబిస్తుంది" యని మిల్టన్ మహాశయు డభిప్రాయపడినాడు.

పరీక్షిత్తుడు బాల్యము నందే ముకుందభక్తి నలవరచుకొనెను. శ్రీశుకుడు సదా వాసుదేవ పరాయణుడు. వీరిరువురి మధ్య జరిగిన కృష్ణకథ యొక్క దివ్యచర్చ శ్రోతలను దివ్యులుగా మార్చునని శౌనకుడు తెలుపుచున్నాడు. కృష్ణభక్తి లేనివాడు యమునికి మిత్రుడని పలుకుచున్నాడు.

తరవః కిం న జీవన్తి భస్త్రాః కిం న శ్వసన్త్యుత
న ఖాదన్తి న మేహన్తి కిం గ్రామే పశవోఽపరే

"చెట్లు బ్రతుకుట లేదా? కొలిమి తిత్తులు గాలిని పట్టి విడుచుట లేదా? పశువులు గ్రాసమును తినుట లేదా? మోహించుట లేదా? హరిసేవ నాదలి ఈ కార్యములనే

ఆచరించు మానవులు పశువుల కన్నను మేలగుదురా?" అని ప్రశ్నించి ఇంకనూ చెప్పుచున్నాడు.

ఎవని కర్ణపుటములలో శ్రీకృష్ణనామము ప్రవేశింపదో అట్టివాడు నరరూప పశువు. కుక్క, సూకరము, ఒంటె, గాడిద మున్నగు వానికన్నను తీసిపోడు. అట్టివాడు వ్యర్థుడు. వాని అవయవములు వ్యర్థములైనవి. మనోబుద్ధులు వ్యగ్యములైనవి.

సీ॥ విష్ణు కీర్తనములు వినని కర్ణంబులు కొండల బిలములు కువలయేశ
చక్రి పద్యంబుల జదువని జిహ్వలు కప్పల జిహ్వలు కౌరవేంద్ర
శ్రీ మనోనాథు వీక్షింపని కన్నులు కేకి పింఛాక్షులు కీర్తిదయిత
కమలాక్షు పూజకు గాని హస్తంబులు శవము హస్తంబులు సత్యవచన
ఆ॥ హరిపద తులసీ దళామోదరతి లేని ముక్కు పందిముక్కు మునిచరిత్ర
గరుడగమను భజన గతిలేని పదములు పాదపముల పాద పటల మనఘ!

విష్ణుదేవుని కథలను శ్రవణము చేయని కర్ణపుటములు బిలములే యగుచున్నవి. హరి గాథలను, కీర్తనములను పలుకని నాలుక కప్పనాలుకయే యగుచున్నది. పరమాత్మను వీక్షింపని నేత్రములకు నెమలిఫించ కన్నులకు భేదమేమున్నది? శ్రీనాథుని అర్చించని చేతులు వాస్తవానికి శవహస్తములే. విష్ణుదేవుని పాదములయందు లగ్నమై యున్న తులసీదళ గంధము ఆఘ్రాణింపని ముక్కు నిజానికి పంది ముక్కుయే కాగలదు. భగవానుని దర్శించుటకు వెడలని పాదములకు చెట్ల మొదళ్ళకు భేదమేమున్నది?"

భగవద్భక్తుల పాదరేణువులు ఒకప్పుడైనను శిరమున బడనిచో అతడెంతటి నిర్భాగ్యుడో గదా! హరికీర్తనము జరుగుచున్నను ఎవరి హృదయము ద్రవింపదో, ఎవరినేత్రములు వర్షింపవో, ఎవరికి గగుర్పాటు కలుగదో వారి హృదయము పాషాణమై యుంటుంది. ఈ పరమ సత్యమును పోతనామాత్యుడు అద్భుతముగా కీర్తించినాడు.

సీ॥ నారాయణుని దివ్య నామాక్షరములపై గరగని మనములు కఠిన శిలలు
మురవైరి కథలకు ముదితాశ్రు రోమాంచ మిళితమై యుండని మేను మొద్దు
చక్రికి మ్రొక్కని జడుని యౌదలనున్న కనక కిరీటంబు గట్టెమోపు
మాధవార్పితముగా మనని మానవు సిరి వనదుర్గ చంద్రికా వైభవంబు
ఆ॥ కైటభారి భజన గలిగి యుండనివాడు గాలిలోననుండి కదలు శవము
కమలనాభు పదము గననివాని బ్రతుకు పసిడికాయలోని ప్రాణిబ్రతుకు

"మహాత్మా! భక్తిలేనివారి జన్మ వ్యర్థము. మీ మనోహర వచనములు మాకు మానసోత్సవము నొనగూర్చినవి. ఆత్మవిదుడగు శుకబ్రహ్మ పరీక్షిన్మహారాజునకు ఇంకను యే యే విషయములను తెలిపెనో దయతో మాకు తెలుపవలసినది" యని శౌనకాది మునులు సూతమహర్షిని ప్రశ్నించిరి.

"మునులారా! శుకుని ప్రబోధమువలన పరీక్షిత్తుడు కృష్ణగత చిత్తుడాయెను. బంధములను మనస్సునుండి తొలగించుకొనెను. దేహముపై అభిమానమును త్యజించెను. స్త్రీలు, పుత్రులు, గృహములు, పశువులు, ధనము, బంధువులు, రాజ్యము మున్నగువానిపైన గల ఆసక్తిని విడనాడెను. మీరడిగినట్లే శ్రీకృష్ణ వైభవమును దెలుపుమని ఉదార చరిత్రుడైన పరీక్షిత్తుడు శ్రీశుకుని అర్థించెను" అని సూత మహర్షి పలికెను.

"మహాత్మా! నీవు సర్వజ్ఞుడవు. నీ బోధలవలన నా బాధలు తీరినవి. మహర్షులు కూడ ఊహింపనలవిగాని ఈ విశ్వమును భగవానుడు తన మాయాశక్తిచే ఎట్లు సృజించెనో తెలుపుడు" యని పరీక్షిత్తుడు శుకులవారిని ప్రార్థించెను. శుకబ్రహ్మ చెప్పుచున్నాడు.

వందన వైభవము

శ్రీశుకుడు ప్రథమంగా నారాయణునకు ఇక్కడే నమస్కరించుచున్నాడు. శుకబ్రహ్మ బోధను ప్రారంభించి మూడు అధ్యాయములు పూర్తయినవి. ఇచ్చట నాల్గవ అధ్యాయము ప్రారంభ మగుచున్నది. ఇచ్చోట శుకబ్రహ్మ పరమాత్మకు నమస్కరించుట మంగళాచరణము గావించుట యని కొందరు మహాత్ముల అభిప్రాయము. ప్రారంభములో మంగళాచరణము జరుగక పోవుటకు గల కారణమును వారు మరొక విధముగా భావించినారు.

శ్రీశుకుని హృదయము కృష్ణభక్తి పూర్ణము. అందుచేత కృష్ణకథను ఆరంభించుచున్నా ననెడి ఆనంద పారవశ్యమున మంగళాచరణము చేయు సంప్రదాయమును మరచినాడనియు, నాల్గవ అధ్యాయమున స్మృతి కలిగి పరమాత్మను ప్రార్థించినాడని వారి అభిప్రాయము. భక్తికి సంబంధించి ఇది మహత్తరమైన వ్యాఖ్యానముగా నేను భావించుచున్నాను. కానీ నా భావము ఇందులకు భిన్నముగా యున్నదని వినమ్రుడనై పలుకుచున్నాను.

శ్రీశుకుడు గళము విప్పిన ప్రథమ శ్లోకము నందే సాంప్రదాయానుసారము మంగళాచరణము జరిగినదని నా అభిప్రాయము. ఈ విషయమును ద్వితీయస్కంధము యొక్క ప్రారంభమున నేను సవివరంగా తెలిపియున్నాను. శ్రీశుకుల స్థాయిలో సంప్రదాయాలను ప్రయత్నముతో ఆచరింప బనిలేదు. సంప్రదాయాలు వారి నాశ్రయించి శుద్ధిపడుతూ ఉంటాయని నా ప్రగాఢ విశ్వాసము.

అయితే నాల్గవ అధ్యాయమున శుకమహర్షి ప్రత్యేకించి ఎందుకు వందన మాచరించుచున్నాడు? యనెడి ప్రశ్న మీకు కలుగవచ్చును. దానికి నే నూహించిన కారణము ఈ విధముగా నున్నది. గడచిన మూడు అధ్యాయములలో శుకమహర్షి కృష్ణ కథా వైభవమును కీర్తించినాడు. ఇప్పుడు విశ్వరచనను వినిపించబోవుచున్నాడు. జగన్నాథుని పై నిలిచియున్న మనస్సు జగద్వైభవము నూహించుటకు వెనుకాడును. దీనినే నిరోధ స్వభావముగా నారదమహర్షి భక్తి సూత్రాలలో తెలిపియున్నారు. మాయను వివరించే సందర్భమైనందున శ్రీశుకుడు వాసుదేవునకు వందన మాచరించుచున్నాడని నా అభిప్రాయము. భాగవతుడైన పరీక్షిత్తుడు అర్థించినాడు. కనుక సృష్టిని గూర్చి వివరించక

తప్పుటలేదు. కానీ ఈ విషయము శ్రీశుకుల వారికి ముఖ్య ప్రయోజనముగా గోచరించదు. అందుచేత శ్రీకృష్ణుని ప్రార్థించెను.

మాయా కార్యములను నిర్వహించుట తప్పనిసరి యైనపుడు మనముకూడా శ్రీకృష్ణుని స్మరింపవలెను. అనుచితముల యందు అచ్యుతుడు అంతఃకరణమున నిలిచినచో జీవి పతనము కాదు. ఏ విధమైన చెడుకార్యము నాచరించినను, చెడు నాలకించినను, పొరపాటున ఉచ్చరించినను, వెంటనే **"ఓం నమో భగవతే వాసుదేవాయ"** యనెడి దివ్య మంత్రమును స్మరింపవలెను.

కృష్ణభక్తి యనెడి ప్రేమామృతమును వందన రూపములో అత్యద్భుతముగా వర్ణింపసాగాడు శుకబ్రహ్మ. పరవశించి వింటున్నాడు పరీక్షిత్తుడు.

మ॥ పరుడై యీశ్వరుడై మహా మహిముడై ప్రాదుర్భవ స్థాన సం
హరణ క్రీడనుడై త్రిశక్తియుతుడై యంతర్గత జ్యోతియై
పరమేష్ఠి ప్రముఖా మరాధిపులకున్ భావింపరాకుండు దు
స్తర మార్గంబున దేజరిల్లు హరికిం దత్త్వార్థినై మ్రొక్కెదన్.

"పరమాత్మా! నీవు అప్రమేయుడవు. అద్భుత శక్తిమంతుడవు. సృష్టి స్థితి లయాదులకు కారణుడవు. క్షేత్రములలో క్షేత్రజ్ఞ రూపమున వెలుగొందువాడవు. భక్త సులభుడవు. ఆర్తుల కభయ ప్రదాతవు. పరమహంసలకు ముక్తి ప్రదాతవు. భక్త పాలకుడవు. భక్తి హీనులకు అలభ్యమైన వాడవు. నీ కీర్తనము సర్వకల్మష హరము. నీ స్మరణము మరణ నిరోధకము. నీ దర్శనము దోష నివారణము. నీకు సమర్పించు వందనము బంధ నిర్మూలనము" అంటూ శుకుడు పరవశించి ప్రార్థించుచున్నాడు.

యత్కీర్తనం యత్స్మరణం యద్వీక్షణం యచ్ఛ్రవణం యదర్హణమ్
లోకస్య సద్యో విధునోతి కల్మషం తస్మై సుభద్ర శ్రవసే నమోనమః

"ఆ భగవానుని సంకీర్తనము, స్మరణము, వందనము, శ్రవణము, అర్చనము లోకము నందలి కల్మషములను పోగొట్టును. అట్టి భద్రరూపుడగు మధురమూర్తికి వందనములు."

జ్ఞానమార్గమున చరించిన మహాత్ములు కూడా శ్రీహరి పాదపద్మముల నాశ్రయించుటచేత జగత్తునందు ఆసక్తిలేనివారయ్యారని శ్రీశుకులు చెప్పుచున్నారు. అట్టి శుభకీర్తిగల ఆదిదేవునకు నమస్కారమని మాటిమాటికి శిరమువంచి వందన మాచరించుచున్నారు. జగదాసక్తిని నివారించు పరమాత్మకు నమస్కరించుచున్నారు.

ఉ॥ ఏ పరమేశు పాదయుగ మెప్పుడు గోరి భజించి నేర్పరుల్
లోపలి బుద్ధితో నుభయ లోకము లందుల జడ్డు బాసి యే
తాపము లేక బ్రహ్మగతి దారు గతశ్రములై చరింతు రే
నా పరమేశు మ్రొక్కెద న ఘౌఘ నివృత్తి దు భద్ర కీర్తనున్

"హే భగవాన్! తపో గరిష్ఠులైనను, కీర్తిమంతులైనను, యోగులైనను, జ్ఞానులైనను, వేదజ్ఞులైనను నీకు కర్మముల సమర్పింపనిచో అట్టివారు శుభమును పొందలేరు. మంగళరూపుడవైన అట్టి నీకు నమస్కారము" యనెను.

తన నాశ్రయించిన పుణ్యాత్ములకు భగవానుడు పుణ్యము నధికము చేయును. భక్తులకు భక్తిని పెంపొందించును. పాపులను పవిత్రమొనర్చును. ఈశ్వరుడు సద్భక్తులకు ప్రసన్నుడని తపోధనుడైన శుకులవారు నమస్కరించుచున్నారు.

పరమాత్మ వేదమయుడు. ధర్మమయుడు. తపోమయుడు. ప్రేమమయుడు. అట్టి పరమాత్మ దర్శనమును పొందిన మహితాత్ములు తరించుచున్నారు. ఆయనను శ్రీపతిగా, యజ్ఞపతిగా, ప్రజాపతిగా, బుద్ధిపతిగా, జగత్పతిగా, భూపతిగా వర్ణించిన శుకబ్రహ్మ భక్తవత్సలుడైన భగవానుడు యాదవులకు బాలకు డనెను.

క॥ శ్రీపతియు యజ్ఞపతియు బ్రజాపతియుః బుద్ధిపతియు జగదధిపతియున్
భూపతియు యాదవశ్రేణీ పతియున్ గతియు నైన నిపుణు భజింతున్॥

"భగవానుని కొందరు అణువని పల్కెదరు. కొందరు మహత్తని నిర్వచింతురు. కొందరికి ఆయన పరిచ్ఛిన్నుడు. మరికొందరికి అపరిచ్ఛిన్నుడు. కొందరికా దివ్యాత్ముడు గుణయుతుడు. కొందరికి నిర్గుణుడు. ఈ విధముగా తర్కవాదములయందు తగుల్కొనినవారు ఎవ్వని పాదపద్మముల దర్శనము వలన పరతత్త్వమును గ్రహింతురో అట్టి భగవానునకు నమస్కారము" యని శుకుడు ప్రార్థించెను.

"భగవానుడు పంచ మహాభూతములచేత దేహములను సృష్టించెను. అవి నవద్వారములు కలిగిన పురములు. వాటి యందున్నవాడై ఆయన పురుషుడాయెను. సాక్షిరూపుడాయెను. అట్టి పరమాత్మ నా వాక్కుల నలంకరించు గాక" యని శ్రీశుకుడు ప్రార్థించెను.

పరమాత్మ దివ్యస్పర్శకు నోచుకోని పలుకులు ఎవ్వరినీ ఆకర్షింపవు. అమృతమయుని అమృతస్పర్శచే వచనములు అమృతమయము లగును. ఈ విధముగా శ్రీహరిని స్తుతించి, సృష్టి విషయమును ప్రారంభించి, పరమోత్కృష్టమైన భాగవతమును ప్రవచించుటకు ముందుగా తండ్రియు, గురువును నైన వ్యాసదేవునకు నమస్కరించుచున్నాడు.

నమస్తస్మై భగవతే వ్యాసాయామిత తేజసే
వపుర్జ్ఞా నమయం సౌమ్యా యన్ముఖాంబురు హాసవమ్

"జ్ఞానమయుడగు వ్యాసభగవానుని ముఖ కమలమునుండి వెలువడిన జ్ఞానతేనియను భక్తులు పానము చేసిరి. అట్టి తేజోమయుడు, భగవానుడు నగు వేదవ్యాసునకు నమస్కరించుచున్నాను."

ఈ విధముగా ప్రార్థించిన శుకబ్రహ్మ "రాజా! విశ్వరచనను గూర్చి నన్ను అడిగితివి. పూర్వము ఈ విషయమును విష్ణుదేవుడు బ్రహ్మదేవునకు బోధించినాడు. దానినే నారదు

దడుగగా బ్రహ్మదేవుడు నారదున కుపదేశించినాడు. దానినే నేను చెప్పుచున్నాను" యని పలికి వివరించసాగెను.

సృష్టి వర్ణనము

నారదుడు బ్రహ్మదేవునికి నమస్కరించి ఇలా పలికెను: "సురేశ్వరా! భూతభావనా! పూర్వజుడా! నీకు నమస్కారము. జీవబ్రహ్మ తత్త్వములను తెలుపు జ్ఞానము నుపదేశింపుము.

య ద్రూపం యదధిష్ఠానం యతః సృష్ట మిదం ప్రభో
యత్సంస్థం యత్పరం యచ్చ తత్తత్వం వద తత్త్వతః

"ప్రభూ! ఈ విశ్వముయొక్క రూపమెట్టిది? దీనికి ఆధారమేమిటి? ఇది ఎవనిచే సృష్టింపబడినది? ఎవనియందు లీనమగుచున్నది? దీనికి పరుడెవ్వడు? దీని స్వరూపమెట్టిది? ఈ విషయముల యదార్థరూపమును తెలుపుడు.

"ప్రభూ! నీవు త్రికాలవేదుడవు. సృష్టి రహస్యము నెఱిగినవాడవు. అరచేతిలో అమలకము వలె ఈ సృష్టి రహస్యము నీకు గోచరమైయున్నది. తండ్రీ! నేను నిన్నే పరమేశ్వరుడుగా నమ్మి యుంటిని. కానీ నీవు తపస్సు చేయుటను గాంచితిని. నీ తపస్సుకు ఫలము నిచ్చువాడుండి తీరవలెను గదా! అదియే వాస్తవమైనచో అతడు నీ కన్నను విశిష్టుడగుచున్నాడు. ఈ సందేహము నన్ను కలతపెట్టుచున్నది.

"తండ్రీ! నీకు జ్ఞానమెలా లభించినది? నీకు ఆధారమెవ్వరు? నీ స్వరూపమెట్టిది? నీకు ప్రభువు ఎవరు? నీవు ప్రాణులను అద్భుతముగా సృష్టించుచున్నావు. దేవా! ఈ ప్రపంచములో ఏ వస్తువు ఉత్తమము, మధ్యమము, అధమము లేదా సమానము అనువిషయములను నేనెఱుగను. ఈ నామ రూపాత్మకమైన ప్రపంచము జనించుటకు కారణమేదియో తెలియకుంటిని. ఈ విశ్వమంతయు నీ నుండియే ఆవిర్భవించినదని విశ్వసించుచున్నాను. మరి నీవు కఠోరమైన తప మెందుల కాచరించితివి? తండ్రీ! కరుణజూపి నా సంశయములను నివారింపుము" యని నారదుడు బ్రహ్మదేవుని అర్థించెను.

నారదునికి బ్రహ్మదేవుడు సమాధానమొసగెను. "కుమారా! చక్కని ప్రశ్న నడిగితివి. నీ సందేహము ప్రశంసనీయమైనది. ఈ ప్రశ్ననడిగి నీవు నాపై అపారకరుణను ప్రసరింపచేసితివి" యనెను.

ఆ మాటలకు నారదుడు విస్మితుడాయెను. బ్రహ్మదేవునిపై తాను దయ చూపడమేమిటి? తన మాటలు విరించిని గాయపరచినవేమో యని కలతచెందెను. వ్యథ చెందెను. నారదుని పరిస్థితిని గమనించిన బ్రహ్మదేవుడు "కుమారా! నేను నిజమే చెప్పుచున్నాను. నీ వడిగిన ప్రశ్నల వలన పురుషోత్తముని గూర్చి కీర్తించే భాగ్యమునకు నేను నోచుకొంటిని.

"నారదా! నన్ను ఈశ్వరునిగా నీవు భావించుకొంటివి. నీవేగాదు. నాకంటె ఉత్తముడైన పరంధాముని ఎఱుగని వారందరు అలాగే భావిస్తుంటారు. నిజానికి పరమేశ్వరునిచేత రక్షితమై యున్న జగత్తునే మేము సృష్టించి పోషించుచున్నాము. మాయను దాటలేని జనులు నన్ను పరమేశ్వరుడని భ్రమించుచున్నారు.

తస్మై నమో భగవతే వాసుదేవాయ ధీమహి

యన్మాయయా దుర్జయయా మాం బ్రువన్తి జగద్గురుమ్

"పరమేశ్వరుని మాయ దుస్తరమైనది. ఆయన మాయచే మోహితులైన జనులు నన్ను జగద్గురువుగా భావించుచున్నారు. అట్టి భగవానుడగు వాసుదేవునకు నమస్కారము.

"కుమారా! మాయ భగవానుని ఎదుట నిలబడలేదు. భర్త తన మోసమును గ్రహించినాడని తెలిసికొనిన స్త్రీ భర్త ఎదుట నిలబడలేనట్లు, జీవులను మోహింపజేయు మాయ భగవానుని ముందు నిలుచుటకు సిగ్గుపడును. సూర్యుని ముందు చీకటి ప్రత్యక్షము గాలేని విధముగా పరమేశ్వరుని ముందు మాయ నిలబడలేదు. అట్టిమాయచే ఆకర్షింపబడిన జీవులు నేను - నాది యనెడి అహంకార మమకారములను తయారు చేసికొనుచున్నారు" అని పరమేశ్వరుని గూర్చియు మరియు సృష్టిని గూర్చియు పరమేష్ఠియగు బ్రహ్మదేవుడు చెప్పసాగెను.

పరమాత్మ అనంతుడు. ఆయన కన్యమైన దేదియును లేదు. వేదములకు ఆయనే ఆశ్రయుడు. ఆయన అవయవముల నుండి సురులావిర్భవించిరి. అతడు సర్వాధ్యక్షుడు. సర్వగతుడు. సర్వసాక్షి. సర్వాంతర్యామి. ఆయనచే సృజింపబడిన నేను ఆయన సృష్టించిన విశ్వమునే సృష్టించుచున్నాను.

మాయ భగవానుని ఆశ్రయించి యున్నది. మాయ త్రిగుణ మిళితమై యున్నది. ఈ గుణముల నాధారముగా జేసికొని పరమాత్మ తన స్వరూపమును వెల్లడిచేయకున్నాడు. మాయనుండి ఆకాశ ముత్పన్నమైనది. ఆకాశమునుండి వాయువు జనించినది. వాయువు నుండి అగ్ని పుట్టెను. అగ్నినుండి జల ముత్పన్న మాయెను. జలము నుండి భూమి పుట్టెను. పంచభూతముల యొక్క సాత్త్వికాంశముల నుండి జ్ఞానేంద్రియములు కలిగినవి. సమిష్టి సాత్త్వికాంశమునుండి అంత:కరణ చతుష్టయము ఏర్పడినది. పంచభూతముల యొక్క రాజసాంశముల నుండి కర్మేంద్రియము లుద్భవించినవి. సమిష్టి రాజసాంశము నుండి పంచప్రాణము లేర్పడినవి. పంచభూతముల యొక్క తామసాంశము పంచీకరణము చెందుటవలన స్థూలదేహము లేర్పడినవి. ఈ విధముగా పరమాత్మవలన సృష్టికార్యము జరిగెను.

"నారదా! నీవడిగిన ప్రశ్నకు సమాధాన మొసగితిని. కార్యకారణములయందు ఏ వస్తువు కూడా పరమాత్మ కంటెను అన్యముగాదు యని గ్రహింపు" మని బ్రహ్మదేవుడనెను.

కారణమైన మట్టినుండి కార్యమగు కుండ యావిర్భవించినది. అలాగే అనేక మట్టి పాత్రము లుద్భవించినవి. వాటి ఆకారములు విభిన్న రూపములుగ తెలియుచున్నందున వాటికి విభిన్న నామము లేర్పడినవి. నామ రూపముల యందు భేదము గోచరించుచుండినను

మూలవస్తువు యైన మట్టియందు మార్పులేదు. నామరూపములు నశించును. అవి అస్థిరములు.

అస్తిభాతి ప్రియం రూపం నామచేదంశ పంచకమ్
ఆద్యత్రయం బ్రహ్మరూపం జగద్రూపం తతోద్వయమ్

అస్తి భాతి ప్రియ మనెడి సచ్చిదానందము, నామ రూపములు అను ఈ ఐదు విషయములు మనకు తెలియుచున్నవి. వీటిలో మొదటి మూడును బ్రహ్మస్వరూపములు. తరువాత రెండును జగద్రూపములు యని శాస్త్రము చెప్పుచున్నది.

కనుక నామరూపాత్మకమైన జగత్తు అస్థిరమైనది. అశాశ్వతమైనది. సాగరము నిత్యము. అలలు అనిత్యము. అలకు రూపముతోపాటు నామమున్నది. అందుచేత అది అదృశ్యమగును. సాగరము నిత్యమై యుండును. అనిత్యమైన అలలకు గూడ సాగరమే ఆధారమై యున్నది. అధిష్ఠానమై యున్నది. ఆశ్రయమై యున్నది. అలలు సాగరమునందే యున్నవి. వాస్తవానికి ఉన్నదంతయు సాగరమే. అల యనునది నామరూపాల అలజడియే.

క॥ **హరి భగవంతు డనంతుడు కరుణాంబుధి సృష్టికార్య కారణ హేతు**
స్ఫురణుం డవ్విభు కంటెం బరు డెవ్వడు లేడు తండ్రి పరికింపంగన్

యని బ్రహ్మదేవుడు శ్రీహరి వైభవమును స్తుతించెను. శ్రీహరి అవతార వైభవములను గ్రహించినవారికి వాసనా క్షయము జరుగునని పలికి, శ్రీమన్నారాయణుని అవతార విశేషములను బ్రహ్మదేవుడు నారదునికి వర్ణించెను.

నారాయణుని లీలావతార వర్ణనము

శ్రీహరి భూతలము నుద్ధరించుటకు వరాహమూర్తియై అవతరించెను. సాగరమున కొండవలె కదలి వచ్చిన హిరణ్యాక్షుని తన దంతముతో చెండాడెను. ప్రజాపతి యగు రుచి యొక్క భార్యయగు ఆకూతి గర్భమునుండి "సుయజ్ఞ" డనెడి పేరుతో జన్మించెను. అతడు తన ధర్మపత్నియగు దక్షిణ వలన దేవతలను కనెను. కర్దమ ప్రజాపతి ధర్మపత్నియగు దేవహూతి గర్భమున తొమ్మండుగురు సోదరీమణులతో పాటు భగవానుడు కపిలుడుగ జన్మించెను. తన తల్లికి బ్రహ్మవిద్యను బోధించెను.

అత్రిమహర్షి నాశీర్వదించి ఆయన కుమారుడుగ అవతరించెను. అతడే దత్తాత్రేయుడు. ధర్ముని ధర్మపత్నియు, దక్షుని పుత్రికయునగు "మూర్తి" యను నామె గర్భమునుండి నర నారాయణులనెడి రెండు రూపములతో జన్మించెను.

నరనారాయణుల తపస్సును భంగము చేయవలెనని మన్మథుడు భావించెను. అప్సర స్త్రీలను పంపి వారిని మోహమునకు గురిచేయుమని తెలిపెను. వారు నరనారాయణ ఋషుల ముందు నాట్యము చేయసాగిరి. వారి హావభావ విన్యాసముల ద్వారా ఆ మహాత్ముల తపమునకు భంగము వాటిల్లునట్లు ప్రయత్నములు చేయసాగిరి.

నారాయణ ఋషి ఆయన ఊరువుల నుండి ఒక అందమైన అమ్మాయిని సృష్టించెను. ఆమె అందము నందును, నాట్యము నందును దేవతాంగనలను మించియుండెను. ఇంతటి సౌందర్యవతి ఆ మహాత్ముని ఊరువులయందే యుండగా ఆయనను మోహమునకు గురిచేయుట సాధ్యమయ్యే కార్యముగాదని భావించినవారై అప్సరస్త్రీలు వెనుదిరిగి వెళ్ళిరి. ఊరువులనుండి ఉద్భవించుట చేత ఆ సుందరాంగి ఊర్వశి ఆయెను.

అందమనేది బాహ్యంలో లేదు. ఆనందమనేది బాహ్యంనుండి రాదు. అన్ని అందాలు ఆత్మ యందే యున్నవి. సర్వానందములకు ఆశ్రయస్థానము ఆత్మయేనని నరనారాయణులు ఊర్వశిని సృష్టించుట ద్వారా ప్రవచించిరి. ఆత్మను గ్రహించినవారికి అనాత్మరూపమైన జగద్విషయముల యందు మోహము జనించదని తెలిపిరి.

బ్రహ్మానందే నిమగ్నస్య విషయాశా న తద్భవేత్

"బ్రహ్మానందమునందు నిమగ్నుడైనవానికి విషయములయందు ఆశ కలుగ నేరదు" యని ఆత్మబోధోపనిషత్తు తెలిపినది.

భగవానుడు నాభి సతీమణి యగు సుదేవికి ఋషభదేవుడై అవతరించెను. జితేంద్రియుడై, పరమహంస వలె చరించెను. అనిర్వచనీయమైన అవ్యక్త ఆత్మతత్త్వమును ప్రదర్శించి చూపెను.

"నారదా! నేను నిర్వహించిన యజ్ఞమునందు ఆ దివ్యాత్ముడు హయగ్రీవుడుగా ఆవిర్భవించెను. ఆయన నిశ్వాస మొనర్చునపుడు నాసాపుటముల నుండి కమనీయమైన వేదఘోష వినిపించు చుండెను" అని సృష్టికర్త వచించి, ఇంకనూ చెప్పుచున్నాడు:

"ఆ దివ్యాత్ముడే యుగాంతమున మత్స్య నారాయణుడుగా అవతరించెను. క్షీరసాగరమును దేవ దానవులు చిలుకునపుడు ఆ మహితాత్ముడే మునిగిపోవు చుండిన మందర పర్వతమును ధరించుటకు కచ్ఛప రూపుడై అవతరించెను.

"సురుల భయమును పోగొట్టుటకు భగవానుడు నృసింహరూపమును ధరించెను. హిరణ్య కశిపుని సంహరించెను. గజేంద్రుని రక్షించుటకు శ్రీహరియై అవతరించి మకరిని వధించెను. ఆ మహితాత్ముడే ఇంద్రునికి రాజ్యము నిచ్చుటకై త్రివిక్రముడై దర్శనమిచ్చి సద్గతిని ప్రసాదించెను.

"నారదా! హంసరూపమున నీకు భక్తి వైభవమును దెలిపినది కూడా ఆ దివ్యాత్ముడే" యనెను.

భక్తి పూర్ణులైన వారికి భగవానుడే ఆత్మవిద్య ననుగ్రహించును. అచ్యుతుడే గురురూపమున నిలుచును. అందుచేత గురువును పరమాత్మగనే భావించాలి. గురువు మనస్సును కష్టపెట్టరాదు. గురువు యొక్క ఆజ్ఞను రెండవసారి గ్రహించే పరిస్థితి కలుగరాదు. గురుసేవలో తృప్తిచెందవలెను. గురువు యొక్క అనుగ్రహములో సర్వము లభించు ననెడి దృఢవిశ్వాసమును కలిగి యుండవలెను.

బ్రహ్మదేవుడు భగవానుని లీలావతారములను వర్ణించుచున్నాడు: "వ్యాధిగ్రస్థుల బాధలను నివారించుటకు భగవానుడు ధన్వంతరి రూపమున వెలసెను. అతడే ధర్మరక్షణార్థము పరశురాముడై ఆవిర్భవించి క్షత్రియ వంశమును ఇరువది యొక్క పర్యాయములు వధించెను. ఇక్ష్వాకువంశమున ధర్మమూర్తియగు శ్రీరాముడుగ అవతరించెను. అతిమానుషములగు కర్మలను ప్రదర్శించుచు మోక్షప్రదాతయగు శ్రీకృష్ణుడుగా లీలా శరీరమును ధరించెను. వేదమును విభజించి, అద్దానిని రక్షించుటకు పురాణ పురుషుడగు వ్యాసుడుగ అవతరించెను. కలియుగాంతమున సర్వులు పాషండులై చరించునపుడు ఆ దివ్యాత్ముడు కల్కిరూపముతో ఆవిర్భవించి, కలియుగమును శాసించును.

"నారదా! నేనుగాని, నీ యగ్రజులగు సనక సనందనాది మహర్షులుగాని ఆ పరమేశ్వరుని అనంత విభూతులను గ్రహింపలేక పోయితిమి" యని బ్రహ్మదేవుడనెను.

మ॥ హరి మాయాబల మే వెఱుంగ నట శక్యంబే సనందాది స
త్పురుష వ్రాతముకైన బుద్ధి నితరంబున్ మాని సేవాధిక
స్ఫురణం దచ్చరితానురాగ గుణ విస్ఫూర్తిన్ సహస్రాస్య సుం
దరతన్ బొల్పగు శేషుడున్ దెలియడన్నన్ జెప్ప లేరొండురుల్

"నారదా! భగవానుని లీలా వైభవములను సంక్షిప్తముగ వివరించితిని. నీవు వాటిని విస్తరింప జేయుము. ఈ విషయముల నన్నింటిని భగవానుడే నాకు స్వయముగా బోధించినాడు. దానినే భాగవతమందురు. దీనిని బోధించునపుడు "శ్రోతలకు భక్తి కలుగుగాక" యని భావించి, బోధింపు" మనెను. నారదుడు తండ్రికి నమస్కరించెను.

పరీక్షిత్తుడు శుకబ్రహ్మను అడుగుచున్నాడు: "మహాత్మా! శ్రీహరి అవతార లీలా వైభవములను బోధించుమని బ్రహ్మదేవుడు నారదునికి చెప్పెను. నారదుడు ఈ అపూర్వ లీలలను ఎవరెవరికి చెప్పెనో వినవలెనని నాకు కుతూహలముగా యున్నది" యనెను.

పరీక్షిత్తుని ప్రశ్నాపత్రము

పరీక్షిత్తుడు తన సంశయముల నన్నింటిని శుకబ్రహ్మ ముందుంచెను. "మహాత్మా! విష్ణుదేవుని శ్రవణ మంగళ గాథను ఎవరు శ్రద్ధతో నాలకింతురో వారు పరమాత్మయందే ప్రవేశింతురు.

"శరదృతువు నీటిలోని మాలిన్యమును పోగొట్టునట్లు శ్రీకృష్ణుడు భక్తుల శ్రవణేంద్రియముల ద్వారా భావపూర్ణ హృదయమున ప్రవేశించి, అచ్చటయున్న వాసనారూప మాలిన్యమును నాశము చేయును.

"అనేక బాధల ననుభవించి ఇంటికి తిరిగివచ్చిన బాటసారి తన గృహమును వీడనట్లు, వాసనా రహితుడగు భక్తుడు శ్రీకృష్ణుని చరణకమలములను త్యజింపడు.

దివ్యాత్మా! నా మనోబుద్ధులను అనాసక్తమొనర్చి, వాటిని కృష్ణుని యందే లగ్నమొనర్చి, నేను దేహమును త్యజించుటకు ననువుగా బోధింపుము.

"పంచభూతములతో సంబంధములేని జీవునకు దేహమెలా ప్రాప్తించినది? లేక కర్మాదులు కారణమా? సంసార సింధువును దాటుటకు సాధన మెయ్యది? భక్తికి అనుకూల, ప్రతికూల విషయములు ఏవి?

"మునిపుంగవా! నేను నిన్ను శరణుజొచ్చితిని. నేను అడిగినవి సముచితములో కావో తెలియదు. ఉచితమైనవి ఏవి అడుగలేకపోతినో తెలియకుంటిని. వాటి నన్నింటిని నాకు దయతో తెలుపుము. నా సంశయములను నివారింపుము.

"విష్ణుదేవుని కథామృతమును పానము చేయుచుండగా నా మది శాంతించును. ఉపవాసము వలన నా దేహము బాధ నొందదు. శృంగి శాపము నన్ను కృంగ దీయదు" యని పరీక్షిత్తుడు పలుకగా శుకబ్రహ్మ సంతుష్టచిత్తు డాయెను. సృష్ట్యారంభమున భగవంతుడు బ్రహ్మదేవున కుపదేశించిన వేదరూపమగు భాగవత పురాణమును చెప్పుటకు శ్రీశుకుడు ఆరంభించెను.

చతుఃశ్లోకీ భాగవతము
(Bhagavata in a Nutshell)

దేహాదులకు మాయయే కారణముగా తెలియుచున్నది. నిద్రించువానికి కలలో గోచరించిన వస్తువులతో సంబంధము లేనట్లు, ఆత్మకు దేహాదులతో సంబంధము ఇసుమంతైనను లేదు. అనేక దశలలో దేహము మార్పు చెందుచూ శోభించుట గూడా మాయయొక్క కార్యమే. మాయకు లోనైనవాడు జీవుడు. అతడు మాయాలోలుడై "నేను-నాది " యనెడి అహంకార మమకారములను తయారు చేసుకొనుచున్నాడు. మాయను వీడిన మనుజుడు మాధవు డగుచున్నాడు యని శుకబ్రహ్మ పరీక్షిత్తునకు బోధించుచున్నాడు.

సృష్టి విషయము సాధారణమైన విషయము గాదు. అందుచేత సామాన్యులకు అవగతముకాదు. బ్రహ్మదేవునకే ఒక సమయములో అర్థము గాకుండెను. అట్టి స్థితిలో బ్రహ్మదేవుడు కఠోరమైన తపమాచరించెను. నారాయణుని కృపకు పాత్రుడై సత్యమును గ్రహించెను. ఈ విషయము శ్రీశుకుల వారు వచించుచున్నారు.

జగత్తు నెలా సృష్టించవలెను? యని చతుర్ముఖ బ్రహ్మ ఆలోచించుచుండెను. కానీ సృష్టించుటకు కావలసిన జ్ఞానము ఆయనకు లభించదాయెను. ఈలోగా జలమునుండి మొదట 'త' యనెడి అక్షరము వినబడెను. ఆ తరువాత 'ప' అక్షరము వినబడెను.

నిష్కించనానాం నృప యద్ధనం విదుః

"విషయములను వదలి పెట్టిన వారికి తపస్సే ఐశ్వర్య" మని ఈ సందర్భమున శుకుడు పలికెను.

ఈ 'తప' యనెడి శబ్దము ఏ వైపు నుండి వచ్చినది? యని బ్రహ్మదేవుడు నలువైపులా చూసెను. కానీ అతని కెవ్వరు గోచరించలేదు. ఒక క్షణము నేత్రములు మూసి ఆలోచించెను. తన నెవరో తపస్సు చేయుమని చెప్పుచున్నట్లు భావించెను. వెంటనే తపస్సున కుద్యుక్తుడయ్యెను. ఇంద్రియ మనస్సులను నిగ్రహించి వేయి సంవత్సరములు బ్రహ్మదేవుడు తపస్సు చేసెను. బ్రహ్మ తపస్సును దర్శించి తృప్తి చెందిన నారాయణుడు బ్రహ్మదేవునకు వైకుంఠ దర్శనము చేయించెను. క్లేశ శోకాదులకు, భయమోహాదులకు తావులేని ఆ శ్రేష్ఠ స్థానమును దర్శించి సంతసించెను. అచ్చోటికి మాయ ప్రవేశింపలేదు. అచ్చట ఐశ్వర్యప్రదాయిని యగు లక్ష్మీదేవి శ్రీహరి చరణపంకజములకు సేవ చేయుచుండును. అట్టి నారాయణుని దర్శనము బ్రహ్మదేవునకు పూర్ణానందము నొసగెను.

భగవానుడు బ్రహ్మదేవునితో ఇలా పలికెను: "బ్రహ్మదేవా! నీవు దీర్ఘకాల తపస్సుచేత నన్ను తృప్తి పరచితివి. నీకు శుభము కలుగుగాక! వరదుడనైన నన్ను వరము లడుగుము. నా దర్శనమే సమస్త శుభముల నొసగును. ఏకాంతమున "**తప తప**" యనెడి నా వాక్కుల నాలకించి నీవు కఠోర తప మాచరించితివి."

తపో మే హృదయం సాక్షాదాత్మాహం తపసోఽనఘ

"వేదగర్భుడా! తపస్సు నా హృదయము. నేను తపస్సునకు ఆత్మను" అనెను.

తపస్సు లేకుండా ఎవ్వరూ తరించలేరు. '**తప**' యనెడి పదము తారుమారైనచో '**పత**' యగును. తపస్సులేనివారు పతనమగుదురే గాని ప్రగతిని సాధించలేరు. సృష్టికార్యమే బ్రహ్మదేవుని తపస్సులో రచింపబడినది. అట్టి తపోమయ సృష్టిలో తపస్సు లేనివారు ఎలా సుఖింపగలరు? పైగా తపస్సే తన హృదయమని భగవానుడు తెలిపినాడు. కనుక తపస్సు లేనివారు భగవత్కృపను పొందలేరు. భగవత్కృప లేనివారికి సుఖశాంతులు లభింపవు.

సృజామి తపసైవేదం గ్రసామి తపసా పునః
బిభర్మి తపసా విశ్వం వీర్యం మే దుశ్చరం తపః

"బ్రహ్మదేవుడా! తపస్సు చేతనే నేను ఈ విశ్వమును సృష్టించుచున్నాను. తపస్సుచేతనే తిరిగి గ్రహించుచున్నాను. తపస్సు ద్వారానే భరించుచున్నాను. దుష్కరమైన తపస్సే నాకు శక్తియైనది" యనెను.

శ్రీమద్రామాయణము "**తపః**" యనెడి పదముతో ప్రారంభమై "**ప్రవర్ధతాం**" అనెడి పదముతో సమాప్తమవుతుంది. అనగా తపస్సు వర్ధిల్లును గాక యని దాని భావము. రామాయణ సారము తపస్సే యని గ్రహించాలి. శ్రీరాముడు పదునాలుగు సంవత్సరములు తపమాచరించి రావణాసురుని వధించినాడు. మనము కూడా జ్ఞానేంద్రియ, కర్మేంద్రియ, అంతఃకరణ చతుష్టయ మనెడి పదునాలుగు దశలలో యున్న అజ్ఞానమును తపస్సు

ద్వారా నశింపజేయాలి. అప్పుడే ఆత్మజ్ఞానము లభించును. ఆత్మవిద్య పరమాత్మ ననుగ్రహించును. కనుక జ్ఞానము, తపస్సు లనునవి వాటికి ఆధారమైన బ్రహ్మమును ప్రసాదించును.

ఆత్మవిద్యా తపోమూలం తద్బ్రహ్మోపనిష త్పరం

"ఉపనిషచ్ఛ్రుతిపాదితమైన బ్రహ్మమే ఆత్మవిద్యకు, తపస్సునకు మూల పురుషు" డని శ్వేతాశ్వతరోపనిషత్తు తెలిపినది.

బ్రహ్మదేవుడు భగవంతునితో ఇలా పలికెను: "దేవా! నీవు సర్వభూతాధ్యక్షుడవు. నీకు సర్వజీవుల మనోసంకల్పాలు తెలియును. నా యభిలాషను దీర్చుము. ఈ సృష్టిరచనా జ్ఞానమును నాకు ప్రసాదింపుము. దేవా! నీ యాజ్ఞను తప్పక పాటించెదను. నేను అహంకార బద్ధుడను గాకుండునట్లు ఆశీర్వదింపుము. నీవు నన్ను స్నేహపూర్వకముగా ఆదరించితివి. నాకు గర్వము కలుగకుండుగాక!" యని ప్రార్థించెను.

"బ్రహ్మదేవా! పరమగుహ్యమైనదియు, విజ్ఞానముతో గూడినదియునగు జ్ఞానమును చెప్పెదను వినుము" యని పలికి భాగవత స్వరూపము నంతటిని నాలుగు శ్లోకములలో చెప్పెను. దీనినే **"చతుఃశ్లోకీ భాగవత"** మందురు.

అహమమే వాసమే వాగ్రే నాన్యద్య త్సద సత్పరమ్
పశ్చాదహం యదేతచ్చ యోఽవ శిష్యేత సోఽస్మ్యహం

"సృష్టికి పూర్వము నేనొక్కడనే యుంటిని. నాకన్యముగ సత్తులేదు. అసత్తును లేదు. సృష్టికి తరువాత గూడా నే నొక్కడనే యున్నాను. ప్రళయము నందు కూడా నేనే యున్నాను.

ఋతేర్థం యత్ప్రతీ తీ యేత నప్రతీయేత చాత్మని
తద్విద్యా దాత్మనో మాయాం యథాభాసో యథాతమః

"నిజానికి లేనిదే యైనను ఆత్మయందు ఏది ప్రతీయమాన మగుచున్నదో, నిజానికి ఏది ఆత్మను అంటలేదో దానిని నా మాయగా తెలియుము.

యథా మహాన్తి భూతాని భూతేషూచ్చా వచేష్వను
ప్రవిష్టా న్యప్రవిష్టాని తథా తేషు న తేష్వహమ్

"మహాభూతములు భౌతికములైన ఘట పటాదులయందు ప్రవేశించినను ప్రవేశింపనట్లే యుండును. అలాగే నేను గూడ సర్వభూతముల యందు ప్రవేశించి యుండినను ఆత్మ రూపముతో సర్వగతుడనై యున్నాను.

ఏతావ దేవ జిజ్ఞాస్యం తత్త్వ జిజ్ఞాసు నాత్మనః
అన్వయ వ్యతిరేకాభ్యాం యత్స్యా త్సర్వత్ర సర్వదా!

"సర్వత్రా, సర్వదా ఏది బోధితమై యుండునో అట్టిదానిని అన్వయ వ్యతిరేక పద్ధతుల ద్వారా ఆత్మయని గ్రహింపుము."

రజ్జువు వలె సృష్టికి పూర్వము బ్రహ్మ మొక్కటియే యుండెను. రజ్జువునందు సర్పము గోచరించినట్లు బ్రహ్మమునందు మాయ తెలియుచున్నది. సర్పము రజ్జువును

కలుషితము చేయలేదు. మాయ బ్రహ్మము నంటలేదు. సర్పము ద్రష్టయొక్క మనస్సులో యున్నదే గాని రజ్జువునందు లేదు. అలాగే మాయగూడ జీవుని అంతఃకరణమునకు సంబంధించినదియే గాని బ్రహ్మము నందు లేదు. మనస్సున్నంత వరకు మాయా రూపమగు ద్వైత ప్రపంచము తెలియుచుండును. మనస్సు నశించగనే మాయ గలించును. మహిమ శోభించును.

చిత్త త్యక్తే లయం యాతి ద్వైత మే తచ్చ సర్వతః
శిష్యతే పరమం శాంత మేక మచ్చ మనామయమ్

మనస్సును త్యజించినచో ఈ సమస్తమైన ద్వైత ప్రపంచము లయించి పోవును. ఆ తరువాత ఉత్కృష్టమైన, శాంతరూపమైన, అద్వయమైన, శోకరహితమైన ఆత్మయే భాసించును" అని అన్నపూర్ణోపనిషత్తు.

సర్పముగా తెలియునది వాస్తవానికి రజ్జువే. సర్పమునకు రజ్జువే అధిష్ఠానముగా యున్నది. నామరూపాత్మకమగు జగత్తునందు నిజానికి అధిష్ఠానమైన బ్రహ్మమే యున్నది. కార్యరూపముగా తెలియవచ్చు జగత్తునందు బ్రహ్మమే పరివ్యాప్తమై యున్నది.

Through out the physical world runs that unknown content which must surely be our consciousness.

ఈ భౌతిక దృశ్యమాన జగత్తు నంతటిని ఏ అదృశ్యవస్తువు వ్యాపించియున్నదో అది మన చైతన్యము కన్నను అన్యము గానేరదు" యని భౌతిక విజ్ఞానశాస్త్రవేత్త సర్ ఆర్థర్ ఎడ్డింగ్టన్ అభిప్రాయ పడటము జరిగినది.

ఒక రంగుల వస్త్రమును తీసికొందుము. అందులో అనేకములైన బొమ్మలు గోచరించుచుండును. మయూరములు, పావురములు, చిలుకలు మొదలగు బొమ్మలు ఆ వస్త్రము నందు కనబడుచుండును. యదార్థానికి అక్కడ కనబడు బొమ్మలు దారముకన్నా భిన్నముకాదు. అన్ని రూపములుగ తెలియునది దారమొక్కటియే. అలాగే నామరూపాత్మకమైన ఈ ప్రపంచములో అసంఖ్యాకములైన రూపములు మనకు గోచరించుచున్నను, అవి యన్నియు బ్రహ్మము కన్నా అన్యము గానేరవు. దారము సత్యము. చిత్రములు మాయ. అలాగే బ్రహ్మము సత్యము. జగత్తు మాయ. జగత్తులో బ్రహ్మము ఓతప్రోతమై యున్నది.

యత్కిం చేదం ప్రాణి జంగమం చ పతత్రిచ యచ్ఛ స్థావరం సర్వం తత్ప్రజ్ఞాన నేత్రం

స్థావర జంగమాత్మకమగు ఈ ప్రపంచ మంతయు బ్రహ్మమే. సమస్త రూపములు బ్రహ్మముగనే యున్నవి" యని ఐతరేయోపనిషత్తు.

సమస్తము బ్రహ్మమే అయినపుడు మాయ కల్పించెడి భిన్నత్వము నెలా అధిగమించాలి? యనెడి శంక కలుగవచ్చును. దీనికి ఒక చక్కని శాస్త్రీయమైన విచారణ మార్గమును ఉపనిషత్తు ప్రవేశ పెట్టింది. అదియే అన్వయ వ్యతిరేక పద్ధతి యనబడినది. వ్యతిరేక పద్ధతి ద్వారా అనిత్యమైన దానిని నిరాకరించి అన్వయ మార్గము ద్వారా సమన్వయ పరచుకొని సత్యమును దర్శించుట ఈ పద్ధతిలోని విశేషము. ఈ మార్గము

ఉపనిషత్తుల యందు ప్రముఖముగా చెప్పబడినది. దానినే ఇచ్చట భగవానుడు బ్రహ్మదేవునకు చెప్పుచున్నాడు.

తానున్నట్లు ప్రతివ్యక్తికీ తెలుసు. కానీ ఎలా ఉన్నది తెలియదు. సమస్తమును తాను వీక్షించుచున్నాడు. సర్వమును గ్రహించే తానెవరో తనకు తెలియుటలేదు. **"అహం"** అనగా నేను అని అర్థము. **"ఇదం"** అనగా ఇది అని భావము. తెలుసుకొనునది **"అహం"** కాగా తెలియబడునది **"ఇదం"** యగుచున్నది. ఈ ఇదమే దృశ్యము. ద్రష్టయైన అహం కన్నను అన్యము. సర్వశాస్త్రములు ఇదంను గూర్చి పలుకుచున్నవే గాని అహంను గూర్చి తెలుపుట లేదు. నీవే నీకు తెలియనపుడు సమస్తమును తెలిసికొని సాధించున దేమున్నది? అహమును గూర్చి తెలుపునదియే వేదాంత శాస్త్రము.

చెట్టును నీవు గాంచుచున్నావు. చెట్టు దృశ్యము. నీవు ద్రష్ట. దృశ్యము ద్రష్ట కన్నను వేఱు గనుక చెట్టు నీవు గాదు. అలాగే పర్వతము, సాగరము, తెప్ప, కప్ప, చిప్ప మరేవియును నీవు గావు. నీ చేత చూడబడు చున్నందున ఇవేవియు నీ వయ్యేందుకు వీలులేదు.

వస్తువులవలె నీ దేహమును గూడా నీవు గాంచుచున్నావు. కనుక దేహముకూడా నీ వయ్యేందుకు వీలులేదు. జడమైన దేహము చైతన్యమైన నీవు (ఆత్మ) గానేరదు. అలాగే పరిమితమై, దోషయుతమై, పరిణామశీలమైన ఇంద్రియములు **"అహం"** కానేరవు. దేహము, ఇంద్రియములు **"అహం"** కానిచో మనస్సు నీవై యుండాలి. లేదా బుద్ధి యైనా అయి యుండాలి. మనస్సులో నడిచే సంకల్పాలను, బుద్ధిలో తెలిసే నిర్ణయాలను కూడా నీవు గ్రహించుచునే యున్నావు. గాఢ నిద్రలో మనోబుద్ధులు లేకున్నను నీవు లేకపోవుట యనునది లేదు. అందుచేత నీవు అహమైన ఆత్మయే అయియున్నావు. ఇది వ్యతిరేక పద్ధతి. లేదా నిషిద్ధ పద్ధతి.

ఇప్పుడు ఆత్మను గూర్చి నిర్వచించాలి. ఆత్మ సర్వగతము. అనంతము. అద్వయము. అట్టి ఆత్మకన్నా వేఱుగా రెండవ వస్తువు ఉండేందుకు వీలులేదు. కనుక సర్వమూ ఆత్మయేయని అన్వయించు కొనుటయే ఇచ్చట అన్వయపద్ధతి యనబడుచున్నది.

ఒకడు మిద్దె నెక్కుచున్నాడు. మెట్లపై నడచుచు పైకి ఎక్కుచున్నాడు. ఒక మెట్టునుండి మరియొక మెట్టుపైకి కాలుపెట్టునపుడు మొదటి మెట్టును నిషేధించుటయే జరుగుచున్నది. మెట్టు డాబా గాదని నిర్ణయించుటయే మరొక మెట్టుపై కాలూనుటకు కారణమైనది. అలా **"ఇది కాదు - ఇది కాదు"** (నేతి - నేతి) యని మెట్లను నిషేధిస్తూ డాబా మీదికి వెళ్ళిన పిదప మెట్లు డాబాకన్నను వేఱుగాదని గ్రహించును. ఇదియే అన్వయ క్రమము. ఈ అన్వయ వ్యతిరేక పద్ధతుల ద్వారా ఏకమైన బ్రహ్మమును అనుభవమునకు తెచ్చుకొనవలెను.

కారణం వ్యతిరేకేణ పుమానాదౌ విలోకయేత్
అన్వయేన పునస్తద్ధి కార్యే నిత్యం ప్రపశ్యతి

"ప్రారంభములో మనుజుడు కారణమగు చైతన్యమును జడమగు ప్రపంచముకంటె వేరుగా చూడవలెను. ఆ తరువాత అన్వయ దృష్టితో కారణమును కార్యమునందు దర్శింపవలెను" అని శంకరాచార్యులవారు అపరోక్షానుభూతియను గ్రంథమునందు తెలుపుతారు.

ఈ విధముగా తత్త్వమునెరిగి జీవించినచో అహంకారము కలుగనేరదు యని భగవానుడు బ్రహ్మదేవునితో పలికెను. సర్వవేదసారమును ఈ చతుఃశ్లోకీ భాగవతము ద్వారా తెలిపెను. బ్రహ్మదేవుని ముందే అదృశ్యమయ్యెను. బ్రహ్మదేవుడు భగవానునికి నమస్కరించి, తదనంతరము సృష్టిని చేసెను. బ్రహ్మకుమారుడగు నారదుడు తన సేవలద్వారా తండ్రిని తృప్తిపరచెను. అలా తృప్తి చెందిన తండ్రిని నారదుడు కొన్ని ప్రశ్నల నడిగి సమాధానములను పొంది తృప్తిపడెను.

"రాజా! బ్రహ్మదేవుడు ప్రసన్నుడై భగవానుడు చెప్పిన భాగవతమును తన పుత్రుడగు నారదునకు చెప్పెను. దశ లక్షణ సంయుతమగు ఈ భాగవతమును సరస్వతీ నదీ తీరమున నారదుడు వ్యాసునకు తెలిపెను" యని చెప్పి భాగవత దశ లక్షణములను శుకబ్రహ్మ పరీక్షిత్తునకు దెలిపెను.

అత్ర సర్గో విసర్గశ్చ స్థానం పోషణ మూతయః
మన్వన్తరేశాను కథా నిరోధా ముక్తి రాశ్రయః

1. సర్గము, 2. విసర్గము, 3. స్థానము, 4. పోషణము, 5. ఊతి, 6. మన్వంతరము, 7. ఈశానుకథ, 8. నిరోధము, 9. ముక్తి, 10. ఆశ్రయము.

గుణముల ప్రభావముచేత పంచభూతములు, తన్మాత్రలు, ఇంద్రియములు, మహత్తత్త్వము ఇత్యాదులావిర్భవించినవి. ఇదియే **"సర్గము."** విరాట్పురుషుని నుండి ఉత్పన్నమైన చరాచర సృష్టియే **"విసర్గము."** ఈ సృష్టిని ఒక క్రమములో నుంచగలిగిన భగవానుని శ్రేష్ఠతను **"స్థానము"** అందురు. భక్తులపై భగవానునకు గల అనుగ్రహమును **"పోషణ"** మందురు. కర్మలవలన ఏర్పడెడి వాసనలను **"ఊతు"** లందురు. మన్వంతర ప్రభువు లాచరించు ఉపాసనా ధర్మాదులను **"మన్వంతర"** మందురు. భగవానుని అవతారకథలు, భక్తుల సత్కథలను **"ఈశాను కథ"** యందురు. ప్రళయకాలమున జీవులు భగవానుని యందు లయించుటను **"నిరోధ"** మందురు. ఉపాధి వినిర్ముక్తమైన చైతన్య రూపులగుటను **"ముక్తి"** యందురు. సృష్టి స్థితి లయాదు లెవని వలన జరుగుచున్నవో ఆయనయే **"ఆశ్రయు"** దనబడుచున్నాడు.

ఈ విధముగా భాగవతముయొక్క దశ లక్షణములను వివరించి, తదనంతరము సృష్టి క్రమమును శుకుడు పరీక్షిత్తునకు తెలియచేసెను.

ద్వితీయ స్కంధము సమాప్తము

...... ఓం ......



భవహరణం - అభయ ప్రదానం

అశేష సంక్లేశశమం విధత్తే
గుణానువాద శ్రవణం మురారేః
కిం వా పున స్తచ్చరణార విన్ద
పరాగ సేవారతి రాత్మలబ్ధా

శ్రీకృష్ణదేవుని గుణకీర్తన శ్రవణముల వలన అశేష క్లేశములు అంతరించును. ఆ దివ్యాత్ముని చరణకమల సేవానురక్తి హృదయమున వృద్ధిచెందినచో ఇక చెప్పవలసింది ఏముంటుంది?

All one's afflictions are got rid of by uttering and hearing the praises of Sri Krishna; What wonder, then, that such a result should be brought about by fondness developed in one's heart for worshipping the dust of His lotus feet.


3

ఉపోద్ఘాతము

ఇది తృతీయ స్కంధము.

తృతీయతుర్యా కథితా యదూరూ

తృతీయస్కంధము భగవానుని తొడవంటిది. మనిషి కూర్చోగానే అతని శరీర మంతయు తొడల మీదనే ఆధారపడి యుండును. సాధకుని సాధన సుఖకరముగా సాగడ మనునది ఈ స్కంధముపై ఆధారపడి యున్నది.

సాధుసాంగత్యము యొక్క ప్రయోజనమును ఈ స్కంధము చక్కగ వివరించినది. ఉద్ధవ మైత్రేయ సంవాదములో భగవత్కృపా విశేషము తెలియును. ముఖ్యముగా ఈ స్కంధమున భగవానుడగు కపిలుడు తల్లియగు దేవహూతికి బోధించిన ఆధ్యాత్మిక విషయములు అపూర్వశోభితములు. అమోఘభరితములు. ఈ స్కంధమున శాస్త్ర హృదయము పండువెన్నెలలో పిండారబోసినట్లు తెలుస్తుంది. ముఖ్యంగా కాలమహిమ, మానవుడు జన్మాంతరములలోను, జనన సమయము నందును పొందెడి అనుభవములను ఈ స్కంధము అత్యద్భుతముగ ప్రవచించెను. భక్తియోగ వైశిష్ట్యము కూడ తెలియును.

కామమును నిగ్రహింపలేక, కామమునకు లొంగిన దితి మమకార రూపుడైన హిరణ్యాక్షుడను అసురుని ప్రసవించగా కామమును నిగ్రహించి, కాంతిని దర్శించి నిర్వికారుడైన కపిల భగవానుని దేవహూతి ప్రసవించినది. ఈరెండు పాత్రలు ఈ స్కంధము నందే తెలుపబడి ప్రేయస్సుకు శ్రేయస్సుకు గల భేదమును వివరించుచున్నవి.

ఈ స్కంధము "ఏవమ్" అనెడి పదముతో ప్రారంభ మవుతుంది. "భగవత్పదార విన్దమ్" యనెడి పదముతో సమాప్తమవుతుంది. ఏవమ్ అనగా ఈవిధముగ యని అర్థము. ఈవిధముగా అనగా ఈ స్కంధములో తెలిపినవిధముగా సాధన నాచరిస్తూ జీవింప గలిగినచో భగవంతుని చరణకమలములు ప్రాప్తించునని చివరలో తెలుపడము జరిగినది. ఈ స్కంధము సర్వ వేదాంత సారమని నా అభిప్రాయము.

చైతన్య భాగవతము

తృతీయ స్కంధము

విదురుని విమలచరితం

విదుర మైత్రేయుల సంవాదమును తెలుపుమని పరీక్షిత్తుడు శ్రీశుకుని ప్రార్థించెను. పరీక్షిత్తుని ప్రశ్నకు సమాధాన మొసగుటకు ముందుగా వినీతుడైన విదురుని గూర్చి శ్రీశుకుడు ఇలా పలికెను:

"రాజా! జగన్నాథుడగు శ్రీకృష్ణుడు పాండవులకు దూతగా కౌరవుల చెంతకేగెను. అచ్చట దుర్యోధనుడు ఘనమైన విందు నేర్పాటు చేసినను దాని నంగీకరించక, పిలువక పోయినను విదురుని ఇంటికి వెళ్ళి విందు నారగించెను. విదురుని గృహమును తన స్వగృహముగా భావించెను" యనెను. విదుర మైత్రేయ సంవాదమును తెలుపుటకు ముందుగా శ్రోతయైన విదురుని గూర్చి ప్రస్తావించెను.

అధర్మముచే ధర్మదృష్టిని కోల్పోయిన ధృతరాష్ట్రుడు దుష్టులైన తన కుమారులను ప్రేమతో పోషించుచుండెను. తన తమ్ముడైన పాండురాజు పుత్రులు, ధర్మాత్ములైన పాండవులను లక్క యింటిలో నుంచి దానికి నిప్పుపెట్టెను. దురభిమానము అనేక దుష్టకార్యములకు నాంది పలుకును.

పాండవుల ధర్మపత్ని, తనకు కోడలు యైన ద్రౌపదిని నిండుసభలో దుశ్శాసనుడు పరాభవింప యత్నించుచుండగా ధృతరాష్ట్రుడు దుర్మతియై సంతసించెను. నిస్సహాయురాలైన ద్రౌపది పులిచేతిలో జిక్కిన లేడివలె విలపించుచుండగా సహించెనే గాని తన కుమారుని

వారింపడయ్యెను. పాపి ఎప్పుడూ పాపకార్యము నందే సంతసించును. పుణ్యకార్య మాచరించుటకు వాని మన స్సంగీకరించదు. పాపి దుష్కార్యమును విజృంభించి యాచరించుచుండును. పుణ్యాత్ములు ప్రయత్నముతో సహనము నలవరచుకొను చుందురు.

హింసా బల మసాధూనాం క్షమా గుణవతాం బలమ్

"దుర్మార్గులకు హింసయే బలము. సన్మార్గులకు సహనమే బలము" యని మహాభారతమున విదురుడు ధృతరాష్ట్రునితో చెప్పును.

కపట జూదమాడి ధర్మరాజుని పరాభవించెను. పాండవులను అరణ్యములకు పంపెను. వన వాసమును పూర్తిచేసికొని వచ్చిన పాండవులు తమ రాజ్యభాగమును తమకివ్వమని కోరగా దాక్షిణ్యము లేకుండా నిర్దయుడై నిరాకరించెను. వంచకుడెప్పుడూ వక్రమార్గముననే చరించును. రాజమార్గమున చరించుట వానికి నచ్చదు. హితము నొసగు మందును రోగి నిరాకరించునట్లు సత్పురుషుల వచనములను వంచకుడు నిరాకరించును.

పాండవులు శ్రీకృష్ణుని దూతగా పంపిరి. జగన్నాథుడైన పరమాత్మ ఎన్నియో హిత వచనములను పలికెను. ప్రియమైన, శ్రేయమైన ఆ వచనములు పాపులగు ధృతరాష్ట్ర దుర్యోధనాదులకు రుచింపకుండెను. మహిమ నెరిగిన దివ్యాత్ములు ఆనందించినారు. తృప్తి చెందినారు.

న తాని పుంసా మమృతాయ నాని రాజ్ఞో రుమేనే క్షత పుణ్యలేశః

"శ్రీకృష్ణుని వచనములు భీష్మాదులకు అమృతరూపములై యుండెను. పుణ్యహీనులైన ధృతరాష్ట్రాదులకు కఠోరముగా యుండెను."

ఎవరు భగవానుని మాట నంగీకరింపరో వారి గృహమును భగవానుడు త్యజించును. భగవానుడు త్యజించిన గృహమును గృహమని పిలువ నవసరములేదు. అది శ్మశానమే యగును. అట్టి గృహమును సర్వులు త్యజింతురు. అచ్చోట ఆహారము నెవ్వరూ గ్రహింపరు.

కేశవార్చా గృహే యస్య నతిష్ఠతి మహీపతే తస్యాన్నం నైవ భోక్తవ్య మభక్షేణ సమం హి తత్

"కేశవుని అర్చించని గృహములో యుండరాదు. అచ్చట భుజింపరాదు. అక్కడ లభించు భోజనము అభక్షణముతో సమానము."

సాదరముగా సర్వభక్ష్యములను ఏర్పాటు చేసినను శ్రీకృష్ణుడు కౌరవ భవనమును విడచిపెట్టెను. పిలువకున్నను వినయ శీలుడగు విదురు నింటికి వెడలెను. ఈ సన్నివేశమే విదురుని విశిష్ట వ్యక్తిత్వమును, విమల చిత్తమును విశదపరచుచున్నది.

విదురుడనగా బుద్ధిమంతుడు యని అర్థము. ఆయన ధర్మపత్నిపేరు సులభ. బుద్ధిమంతులగు వారికి భక్తి సులభముగా లభించును. భక్తిసౌలభ్య మలవడినచో భగవానుడు కూడా సులభుడగును.

సులభతో గూడి విదురుడు తాపస జీవితమును సాగించుచుండెను. భగవంతుని కీర్తనము నందు, సేవయందు మనస్సును లగ్నమొనర్చుచుండెను. సదా ఆకలియైనపుడు అపక్వాహారమునే భుజించుచుండెను. అతిభోజనము గతిని నిరోధించును. మితభోజనమే హితకరమగును. రుచిని జయించినవానికే పరమాత్మపై అభిరుచి పెరుగును.

పాండవుల దూతగా శ్రీకృష్ణుడు కౌరవ సభకు వచ్చుచున్నాడని విదురుడు వినెను. అతని ఆనందమునకు అవధిలేకుండెను. పరమాత్మ దర్శనానికి ఎవరి మనసు ఉరకలేయుచుండునో వాడే పుణ్యాత్ముడు. అతని జన్మయే ధన్యము.

ఇంటిలో మంచి ఆహారపదార్థమును తయారు చేయుచున్నారని తెలిసికొని కొందరు మూడుగంటల ముందు నుండే ఆరగించుటకు ముచ్చటపడుచుందురు. ఊరిలో ఏదో మంచి సినిమా ఆడుచున్నదని తెలిసి కొందరి మనస్సులు చూసినంతవరకు ఊరుచునేయుండును. ఊళ్ళు తిరిగి చూడాలని కొందరు ఉబలాటపడుచుందురు. మనోహర దృశ్యాలను వీక్షించాలని కొందరు మథనపడుచుందురు. ఏవేవో చూడాలని, మరేవేవో రుచి చూడాలని ఆలోచిస్తుంటారేగాని భగవంతుని దర్శించాలని భావింపరు. పుణ్యము కలసి రానిదే పురాణ పురుషుడైన జగన్నాథుని దర్శించాలనే కోరిక కలుగదు.

శ్రీకృష్ణుడు తనకొరకే వచ్చుచున్నాడని విదురుడు భావించెను. భగవానుని ఆగమనములో ధృతరాష్ట్రుని కొలువును దర్శించుట అముఖ్యమనియు, తన నాశీర్వదించుటయే ముఖ్యకారణముగా విదురుడు భావించెను. తన సాధనపై సాధకునకు నమ్మక ముండవలెను. తన కొరకు భగవానుడు తప్పక వచ్చును యనెడి అచంచల విశ్వాస ముండవలెను.

పరమాత్మ సన్నిధికి చేరలేని భక్తులు తమ మనోబుద్ధులను పరమాత్మ యందు నిల్పి ధ్యానమగ్నులై యుందురు. భక్తుల నుద్ధరించుటకు భగవానుడు నడచి భక్తుల గృహముల కేతెంచును. వృద్ధులు, రోగులు ఆలయానికి వచ్చి తనను దర్శింప నశక్తులని గ్రహించి ఉత్సవమూర్తి రూపమున భగవానుడే కదలివచ్చి వారికి దర్శనమొసగును. భగవానుని ప్రేమ వర్ణింప శక్యముగానిది.

సులభా విదురులు ప్రతినిత్యము తాము భుజించు ఫలాదులను ముందుగా శ్రీకృష్ణుని కర్పించి తరువాత తాము ఆరగించెడివారు. పరమాత్మకు నిత్యము మనస్సుతో సమస్తమును నివేదించు చుండినచో ఒకనాడు ఆ దివ్యాత్ముడు ప్రత్యక్షమై, స్వయముగనే నైవేద్యమును గ్రహించును. నామయోగియైన నామదేవుని భక్తికి చలించిన పాండురంగడు స్వయముగనే అతని నుండి నైవేద్యమును స్వీకరించి ఆశీర్వదించెను.

"ఏమండీ! వాసుదేవుడు మన నైవేద్యమును స్వీకరించునా?" యని సులభ యడుగును. వినిర్మల హృదయుడైన విదుర మహాత్ముడు "సులభా! భగవానుడు భక్తి సులభుడు. మన ఇంటికి తప్పక వచ్చును. కానీ మనము పేదవారము. భగవానుడంతటి

యతిథిని సత్కరింప శక్తిగల వారముకాము. దుర్యోధనుడు పరమాత్మ కొరకు రుచికరమైన భక్ష్యముల నెన్నియో తయారు చేయించుచున్నాడు. మన పేదగృహములో ఆయన కేమి లభించును? కాయలు, పండ్లు తప్ప మనమేమివ్వగలము? కనుక మన గృహమున కరుదెంచుట కంటెను దుర్యోధనుని ప్రాసాదమున విశ్రమించుటయే సముచితమని నాకనిపించుచున్నది" యని పలికెను.

"జగన్నాథునకు మన మేమివ్వగలము? సర్వప్రపంచమును అతడే పోషించుచుండగా మనము ఆ దివ్యాత్మున కేమి సమర్పింపగలము? మనము భక్తినే సమర్పింతుము. చేతులెత్తి నమస్కరింతుము. పాదములు కడిగి పూజింతుము" యని సులభ పలికెను.

శ్రీకృష్ణుడరుదెంచెను. సంధి విఫలమయ్యెను. మృష్టాన్నములను భుజింపమని ధృతరాష్ట్రుడు కృష్ణునికి తెలిపెను. పాపమున్నచోట తాను భుజింప నని శ్రీకృష్ణుడు చెప్పెను. పిలువకుండగనే విదురు నింటికి వచ్చెను. పవిత్రులైన భక్తులున్నచోటికి భగవానుడు ఆహ్వానము లేకనే యరుదెంచును. సులభావిదురుల నాశీర్వదించెను. పారవశ్యంలో విదురుని సతీమణియగు సులభ అందించిన పండ్లతొక్కలను పరమాత్మ పరమాన్నముగా భావించి ఆరగించెను. ప్రేమతో పరమాత్మ అనుగ్రహించిన ఫలములను సులభావిదురులు ప్రసాదముగా స్వీకరించిరి.

నిత్యము భగవంతునికి నైవేద్యమును సమర్పించి తదనంతరము భుజింపవలెను. ఇలా అర్చించు భక్తులను ఒకనాడు భగవానుడే స్వయముగా వచ్చి ఆశీర్వదించును. భగవత్ప్రసాదమును భుజించు భక్తులు కల్మషరహితులై, పుణ్యవంతులై, శుద్ధాత్ములై తరింతురు.

నివేదితాన్నం తులసీ విమిశ్రం విశేషతః పాదజలేన సిక్తమ్

యోఽ శ్నాతి నిత్యం పురతో మురారేః ప్రాప్నోతి యజ్ఞాయుత కోటి పుణ్యమ్

"తులసీదళములను గలిపి, భగవానుని పాదజలమును చల్లిన నైవేద్యమును ఎవ్వడు నిత్య మారగించునో అట్టివాడు కోటి యజ్ఞములు చేసిన పుణ్యమును బొందు"నని పద్మపురాణము తెలిపినది.

సులభావిదురులు పరమాత్మ ప్రసాదము నారగించి విశుద్ధచిత్తులైరి. విశుద్ధ చిత్తులైనవారు విశోకులు. అంతేగాదు. అన్యుల శోకములను గూడా పోగొట్టగలిగి యుందురు. వారి బోధద్వారా అన్యులబాధలను నివారింపగలిగి యుందురు. కానీ దానిని గ్రహించు శ్రోత పుణ్యము నార్జించినవాడై యుండాలి.

పాండవుల అభిప్రాయములను గ్రహించి సంజయుడు ధృతరాష్ట్రుని వద్దకు వచ్చెను. ధర్మరాజు ధర్మవైభవమును, దుర్యోధనుని దుర్వృత్తిని కొద్దిగా వివరించి, మిగిలిన విషయములను రేపు సభలో తెలుపునట్లు పలికి విశ్రాంతి గైకొనుటకు వెడలిపోయెను.

సంజయుని పలుకులు ధృతరాష్ట్రునికి నిద్రను, సుఖమును దూరం చేశాయి. కొంతసేపు ఆలోచించి, ధృతరాష్ట్రుడు విదురునికై కబురు పెట్టెను. అన్నగారి పిలుపు నందుకొని విదురుడు రాజభవనమున కేగెను. ధృతరాష్ట్రునికి హితబోధ చేసెను. దీనినే "విదుర నీతి" యని పిలుతురు. విదురనీతి ఏమి చెప్పునో గ్రహించే ముందు భారతమునందు విదురనీతి యొక్క స్థానమును తెలిసికొందుము.

భారత సాగరములో ఆణిముత్యాలు

భారతమునకు పంచమవేదమనిపేరు. ఈ భారత గ్రంథంలో అసమాన శోభతో మూడు ఆణిముత్యాలు ప్రకాశిస్తున్నాయి. మొదటిది ఉద్యోగపర్వములోని **సనత్సుజాతీయము**. రెండవది భీష్మపర్వంలోని **భగవద్గీత**. మూడవది అనుశాసనిక పర్వంలోని **విష్ణుసహస్రనామము**. ఈ మూడును అమూల్యమైన జ్ఞానమణులు. ఈ మూడింటికి ఆదిశంకరులు భాష్యమును రచించినారు.

సనత్సుజాతీయమును సనత్సుజాతుడు ధృతరాష్ట్రునకు చెప్పెను. భగవద్గీతను శ్రీకృష్ణుడు అర్జునునకు చెప్పెను. విష్ణుసహస్రనామమును భీష్ముడు ధర్మరాజునకు చెప్పెను. ఈ మూడును మోక్షసంబంధమైన గ్రంథములు. పారమార్థికతనే ముఖ్యఫలంగా గలిగి చెప్పబడినవి. ఇవిగాక ధర్మ సూక్ష్మములను, నైతికవిశేషములను తెలియజేయు రెండు విజ్ఞానమణులు కూడా గలవు. ఇవి ఇహమునకు సంబంధించినవి. అంతేగాక పరమునకు ఉపయోగపడునవి. మేడ నెక్కుటకు మెట్లవలె మోక్షమునకు ఇవి మార్గములై యున్నవి. అవి 1. ఉద్యోగపర్వములోని **విదురనీతి** 2. శాంతి అనుశాసనిక పర్వములలోని **భీష్ముని ధర్మబోధ**. వీని తెలిసినవానికి ధర్మం తెలిసివస్తుంది. ధర్మం తెలిసినవాడు మోక్షమును గ్రహింపగలడు.

నీతిబాహ్యుడైన ధృతరాష్ట్రునకు ధర్మం తెలిసిరాదు. అందుచేత విదురుడు నీతిని బోధించెను. అదియే విదురనీతి. అనేక నైతిక సూత్రములను విదురనీతి చక్కగా వర్ణించును.

విదురుడు ధృతరాష్ట్రుని సమీపించెను. ధృతరాష్ట్రుడు విదురునితో ఇలా పలికెను: "విదురా! ధర్మరాజు కడనుండి వచ్చిన సంజయుడు నన్ను గర్హించెను. ధర్మరాజు చెప్పిన విషయమును రేపు కొలువులో చెప్పెదనని పలికి వెడలెను. అతడేమి చెప్పనోయని నా మనసు కలవరపడుచున్నది. అవయవములు శిథిలము లగుచున్నవి. నేను తీవ్రముగా వ్యథ చెందు చున్నాను.

"జాగ్రతో దహ్యమానస్య శ్రేయో యదను పశ్యసి తద్బ్రూహి త్వం హి నస్తాత ధర్మార్థకుశలోహ్యసి"

నాకు నిద్రపట్టుటలేదు. ఒడలు కాలిపోవుచున్నది. ఇట్టి నేను శ్రేయమును గాంచలే నున్నాను. నీవు ధర్మాధర్మముల నెరిగినవాడవు. నాకు బోధచేయుము. నన్ను

శాంతింపజేయుము" అనెను. అన్నగారి మాటల నాలకించిన విదురుడు నిద్రపట్టక పోవుటకు కారణములను తెలిపెను. ఈ విషయమును కవిబ్రహ్మయగు తిక్కన సోమయాజి అందముగా అల్లిన కందములో గనెదము.

క॥ బలవంతుడు పైనెత్తిన బలహీనుడు, ధనముగోలు పడిన యతడు మ్రు
చ్చిల వేచువాడు, కామాకుల చిత్తుడు నిద్రలేక కుందుదు రధిపా!

"ధనవంతుడు పైకి వచ్చినపుడు నిస్సహాయుడైన బలహీనుడు, ధనమును కోల్పోయినవాడు, కాముకుడైనవాడు, చోరుడైనవాడు ఈ నల్వురికి నిద్రపట్టదు. రాజా! ఈ దోషములు నిన్ను తాకలేదు గదా!" యని విదురు డడిగెను.

జగత్తులో పాపకృత్యములందు చరించువాడు రాత్రులలో హాయిగా నిద్రింపలేడు. వాని పాపమే వానిని మేల్కొలుపు చుండును. నిద్రలోనే మేల్కొను పాపి ధ్యానమునందు నిలువగలుగునా? పాపము మనిషిని ధ్యానమున బాధించును. అందుచేత భగవానుని పొందగోరువారు పాపజీవనమును విడనాడాలి. సదాచారవంతులే సమదర్శులు కాగలరు.

ధృతరాష్ట్రుని వాక్కుల నాలకించిన విదురునకు అతని పరిస్థితి పూర్తిగ అవగతమాయెను. పాపకర్మలు మనస్సును పట్టి పీడించుచున్నవని గ్రహించెను. దుర్యోధనాదులు పాండవులను పెట్టిన బాధలు మనోగగనంలో కదలసాగెను.

క॥ పెట్టిరి విషాన్న మంటం గట్టిరి ఘనపాశములను గంగానదిలో
నెట్టిరి, రాజ్యము వెడలం గొట్టిరి ధర్మంబు విడిచి కుటిలాత్మకులై!

అని పోతనామాత్యుడు తృతీయ స్కంధమున రచించెను. విదురుడు ధృతరాష్ట్రునితో చెప్పుచున్నాడు:

"మహారాజా! మీరు పెట్టిన దారుణమైన బాధలను పాండవులు సహించినారు. వారి రాజ్యమును వారి కొసగుట శ్రేయమని నా కనిపించుచున్నది. మీరు పెట్టిన దుస్సహమగు బాధలకు బదులిచ్చుటకు భీముడనెడి కాలసర్పము బుసలుగొట్టుచు నిరీక్షించుచున్నది. నీ ఇంటిలో కుమారుని రూపంలో పాపము చెలామణి యగుచున్నది. పైగా సర్వశుభములకు ఆశ్రయస్థానమైన శ్రీకృష్ణుడు పాండవుల వద్దయున్నాడు. నా మాట నాలకించి వారి రాజ్యమును వారికొసగుము.

ఆ॥ వారి తండ్రిపాలు వారికి నొసగి నీ పాలు సుతుల కెల్ల బంచియిచ్చి
చలము విడిచి ధర్మమలవడ నీ బుద్ధి జొనుపు వయ్య కులము మనుపవయ్య!

"రాజా! పుత్ర వ్యామోహమును వీడుము. అతడు పుత్రుడు గాడు. తండ్రికి నరకమును ప్రసాదించువాడు పుత్రుడగునా? కులమునకు అపకీర్తిని దెచ్చువాడు కుమారుడగునా? నీ శత్రువే పుత్రుని రూపమున ఇంటిలో ప్రవేశించి యున్నాడు" అనెను.

సాధారణంగా పుత్రులు నాలుగు విధములుగ యుందురు. మొదటివాడు సేవకుడు. రెండవవాడు శత్రువు. మూడవవాడు ఋణగ్రస్థుడు. నాల్గవవాడు తటస్థుడు.

గత జన్మలలో మనము కొందరిని సేవించియుందుము. ఆ ఋణమును దీర్చుకొనుటకై వారు పుత్రులుగా జన్మింతురు. అనుక్షణము తండ్రికి సేవజేయుచు సుఖింపజేయుదురు. వీరు **సేవాపుత్రులు.**

రెండవవారు శత్రువులు. గతజన్మలలో మన శత్రువైనవాడు పగదీర్చుకొనుటకై పుత్రుడుగా జన్మించును. తండ్రిని అనుక్షణము దుఃఖమునకు నడిపించుచుండును. విరుద్ధభావములనే ప్రకటించుచుండును. వికృత చేష్టలనే చేయుచుండును. తల్లిదండ్రుల దుఃఖమునే తన సుఖముగా భావించును. ధనమును పాడుజేయును. ఇంటి గౌరవమును మంట గలుపును. అపకీర్తిని తెచ్చిపెట్టును. అసభ్యముగ ప్రవర్తించును. తండ్రి ఆస్తికుడైనచో తాను నాస్తికుడగును. తండ్రి సూచించిన విషయమును చేయుటకు నిరాకరించును. ఇతడే **శత్రుపుత్రుడు.**

మూడవవాడు ఋణగ్రస్థుడు. అప్పులెప్పుడూ ముప్పులే. అప్పుల తెప్పలో ఎక్కినవాడు ఎప్పుడైనను మునుగువాడే. మనము గతజన్మలలో ఋణమును పుచ్చుకొని తీర్చకుండా మరణించినచో, దానిని గ్రహించుటకు అప్పిచ్చినవాడే పుత్రరూపమున జన్మించును. ఇచ్చినదానిని పుచ్చుకొని తృప్తిచెందడు. అడ్డమైన వడ్డీలన్నీ కలిపి గడ్డుసమస్యగా తయారవుతాడు. "ఇస్తావా - లేదా!" యని గత జన్మములో ప్రశ్నించేవాడు. ఇప్పుడలా గాదు. "ఎవరికోసమిస్తావు?" అంటాడు. చిలుక ఈ గూటిలో యున్నను పలుకు ఆనాటిదే. ఇతడు **ఋణపుత్రుడు.**

నాల్గవవాడు తటస్థుడు. ఎవరైనా ఆపదలో యున్నచో సహాయంచేసే సుగుణము నేర్పరచుకోవాలి. తటస్థవైఖరి మంచిదికాదు. గత జన్మలలో ఈ విధమైన తటస్థవైఖరి ద్వారా మనము చాలామందిని బాధపెట్టియుందుము. వారు ఈ జన్మలో పుత్రులుగా జన్మించి తటస్థవిధానము ననుసరించుచుందురు. తల్లిదండ్రులు బాధపడుచున్నను పట్టించుకోరు. తటస్థుడైన పుత్రుడు బాధ్యతలను గుర్తించడు. తటస్థముగా యుండును. తన అవసరములను దీర్చమనునే గాని తండ్రి సంపాదన ఎలా ఉన్నది? అని ఆలోచించడు. తాను పెద్దయై ధనార్జన చేయును. కానీ తల్లిదండ్రుల కివ్వకుండా తటస్థముగా యుండును. వివాహమైన తరువాత పండుగ వచ్చినచో భార్యకే చీరలు గొనును. తల్లివిషయంలో తటస్థముగా యుండును. ఇతడే **తటస్థపుత్రుడు.** లేక ఉదాసీనపుత్రుడు యని పిలువబడుచున్నాడు.

విదురుడు చెప్పుచున్నాడు: "ధృతరాష్ట్ర మహారాజా! బాగా ఆలోచింపుము. దుర్యోధనుడు భగవానుని ద్వేషించుచున్నాడు. అతనివలన పుత్రభావమును విడనాడుము. దుర్యోధనుడు భగవానుని ద్వేషించుచున్నాడు. అతనివలన నీ మనస్సు కూడా పాడగుచున్నది. నీ వైభవము నశించుచున్నది. వంశ గౌరవము కృశించుచున్నది. అశుభకరుడగు ఈ దుర్యోధనుని విడువుము.

తే॥ ఒకనికై యిట్లు కులమెల్ల నుక్కడంప నెత్తికొనజూచె దిది నీతి యే నృపాల
వినుము నామాట నీ సుయోధనుని విడిచి కులము రాజ్యంబు దేజంబు నిలుపవయ్య!

"ధృతరాష్ట్రా! ధర్మరాజు సుగుణవంతుడు. సౌశీల్యము గలవాడు. సహృదయుడు. వంశగౌరవమును వృద్ధిచేయువాడు. త్రిలోకాధిపత్యమును పొందదగినవాడు. నీవు అభిలషింప దగినవాడు. ధర్మాత్ముడు. మీరెన్ని విధములుగ వారిని హింసించినను అతడు సహించెను. రాజా! రోగముల వాతబడినవానికి సుఖముండునా? దుర్యోధన, దుశ్శాసన, శకుని, కర్ణాదులతో గూడియున్న నీకు శాంతి మిగులునా?

దుర్యోధనే సౌబలే చ కర్ణే దుఃశాసనే తథా
ఏతే ష్వైశ్వర్య మాధాయ కథం త్వం భూతి మిచ్ఛసి

"రాజా! నీవు దుర్యోధనునకు, శకునికి, కర్ణునకు, దుశ్శాసనునకు వశమైతివి. ఇక నీకు శుభమెలా కలుగును?" యని వ్యాసభారతము.

"రాజా! నీకు హాయినొసగు పాండవులను దూరము చేసికొంటివి. నిద్రను భగ్నము చేయు దరిద్రమును దగ్గర జేర్చుకొంటివి. స్త్రీ, జూదగాడు, బాలుడు చెప్పిన మాటల నెవ్వరాలకింతురో అట్టివారు, టాళ్ళతో తయారైన నావ నదిలో మునుగునట్లు నశించి పోవుదురు. నా మాట వినుము. మంచివారైన జ్ఞాతులను పోగొట్టుకొనుట వైభవమును పోగొట్టుకొనుటయే కాగలదు" యని పలికి రీతిని సరిజేయు ప్రయత్నములో నీతిని గూర్చి ప్రవంగించెను. దీనినే **"విదురనీతి"** యని మహాభారతము - ఉద్యోగపర్వమున తెలిపియున్నారు.

"విదురనీతి" యనెడి ఈ అమూల్య విషయము ఎనిమిది అధ్యాయములలోను, ఐదువందల తొంభైఆరు శ్లోకములలోను మహాభారతమున ఉద్యోగపర్వమునందు శోభించుచున్నది. భాగవతము నందు దీని ప్రసక్తి మాత్రమే గలదు. మీలో ఆసక్తిని అణచలేక, అలాగని గ్రంథమును విస్తరించే ధైర్యము చాలక, మెచ్చి తృప్తి చెందేందుకు, వచ్చి నడచేందుకు మచ్చుకగా కొన్ని నీతి వాక్యాలను మీ ముందుంచుతాను. కొద్దికాలములోనే "విదురనీతి" పై సమగ్రవ్యాఖ్యానము నందించగలను. శ్లోక, తాత్పర్య, వ్యాఖ్యతో మీ ముందుంచగలను.

విదురనీతి

ప్రథమాధ్యాయము :-

చక్కనివాక్కులు గలవాడు, తర్కమెరిగినవాడు, సమయస్ఫూర్తిగలవాడు, అవసరమైనచోట శాస్త్రమును చెప్పగలవాడు, విషయమును త్వరగా నెరుగువాడు, మేలు చేయువాడు, కీడుచేయనివాడు పండితు డనబడును.

శాస్త్రజ్ఞానము లేక పలవరించువాడు, గాలిమేడలు కట్టువాడు, అధర్మపనులలో ఆభరణములను కొనువాడు, తన పనిని వదలుకొని లోకవ్యవహారమున మెప్పుకై చరించువాడు, సదా సంశయములు గలవాడు, తొందరపనులను ఆలస్యముగా చేయువాడు,

పిలువకనే పోవువాడు, అడుగకపోయినను చెప్పువాడు, తన తప్పును ఇతరులపై మోపువాడు మూఢు డనబడును.

రుచిగల పదార్థములను ఒక్కడే తినరాదు. బాటలో ఒంటరిగా వెళ్ళరాదు. అందరు నిద్రించునపుడు ఒక్కడు మేల్కొనరాదు. ముఖ్య విషయముల నొక్కడే ఆలోచింపరాదు.

ఈ ప్రపంచమున ఇద్దరే అధములు గలరు. కార్యశూన్యుడైన గృహస్థుడు. సర్వకార్యారతుడైన సన్యాసి. అలాగే ఇరువురు దుఃఖభాగులు గలరు. వారెవరనగా శత్రువులను మిగిల్చిన రాజు. ఇంటి నొదలిపెట్టని పండితుడు.

ఏమరిపాటుగల వానివలన దొంగలు బ్రతుకుచుందురు. రోగులవలన వైద్యులు జీవించుచుందురు. కాముకుల వలన వేశ్యలు మనగలుగుదురు. యజ్ఞము చేయువారి వలన ఋత్విక్కులు వసించుచుందురు. పేచీలున్నచోట న్యాయాధిపతులు రాణించు చుందురు. మూర్ఖులవలన పండితులు తిండారగించు చుందురు. ఆ యారుగురి వలన ఈ యారుగురు బ్రతుకుచున్నారు.

"పదుగురాడు మాట పాడియై ధర జెల్లు" యని మనము వినియున్నాము. "పదుగురాడుమాట పనికిరాదు" యని విదురనీతిలో తెలియును. ఆ పదుగురెవరో వినండి. 1. మత్తుడు, 2. ప్రమత్తుడు, 3. ఉన్మత్తుడు, 4. అలసిపోయినవాడు, 5. క్రుద్ధుడు, 6. ఆకలితో యున్నవాడు, 7. తొందరపాటువాడు, 8. అత్యాశాపరుడు, 9. భయపడువాడు, 10. కాముకుడు.

ఏకయా ద్వే వినిశ్చిత్య త్రీం శ్చతుర్భి ర్వశే కురు
పఞ్చ జిత్వా విదిత్వాషట్ సప్త హిత్వా సుఖీ భవ

"ఒకదానిచే రెంటిని నిర్ణయించి, మూటిని నాల్గింటితో వశపరచుకొనుము. అయిదింటిని జయించి, ఆరింటిని తెలిసికొని ఏడింటిని త్యజించి సుఖింపుము" అని విదురుడనెను. ఎంతచక్కని శ్లోకమో చూసితిరా! దీనిలోని అంతర్భావమును గ్రహించెదము.

ఒకటైన బుద్ధిచేత నిత్యానిత్యములను రెండింటిని నిర్ణయించాలి. సాధన చతుష్టయమనెడి నాల్గింటిచేత కామక్రోధ లోభము లనెడి మూడింటిని వశపరచుకొనవలెను. పంచేంద్రియములనే అయిదింటిని జయించి, మోసపుచ్చెడి అరిషడ్వర్గము లనెడి ఆరింటిని కనిపెట్టి, సప్తవ్యసనములనెడి ఏడింటిని విడచి సుఖింపవలెనని భావము.

ద్వితీయాధ్యాయము :-

పాపుల సాంగత్యమువలన పాపము చేయనివారు గూడ శిక్షింపబడుచుందురు. ఎండిన వాటితో చేరుటవలన తడిసినవి గూడ కాలిపోవుచున్నవి. కావున పాపము చేయువారి సంపర్కము మంచిదికాదు.

తినుటకు వీలుగా నుండాలి. తినుటకు యోగ్యముగా యుండాలి. తినిన పిదప చక్కగా జీర్ణము కావాలి. జీర్ణమైన పిదప చక్కగా దేహమున కుపకరించాలి. అట్టి ఆహారమునే భుజించాలి.

చూపులో, మనసులో, మాటలో, కర్మలో లోకము నెవడు ఆకర్షించునో
లోకము ప్రసన్నముగా చూచును. ఎన్నటికి ఫలితము నివ్వని కార్యములను మొదలిడరాదు.

యథా మధు సమాదత్తే రక్షన్ పుష్పాణి షట్పదః
తద్వదర్థా న్మనుష్యేభ్య ఆదద్యా దవిహింసయా

"పూలు కందకుండా తుమ్మెద తేనెను గ్రహించునట్లు ప్రభువు ప్రజలను నొప్పింపక వారినుండి ధనమును గ్రహింపవలెను" అని విదురుడనెను.

తృతీయాధ్యాయము :-

దీపముచేత చీకటిలో యున్న వస్తువు తెలియును. నడవడిక చేత ధర్మము తెలియును. వ్యవహారముచేత మంచితనము తెలియును. శూరుడైనవాడు భయము లేర్పడినపుడు తెలియును. ధీరుడు కష్టములలో తెలియును. మిత్రులెవరో, శత్రువులెవరో ఆపదలలో తెలియుదురు.

మంచి పనులు చేయుటవలన సంపద కలుగును. నేర్పువలన సంపద వృద్ధి చెందును. సామర్థ్యము వలన కుదుట పడును. మిడిసి పడనిచో నిలువగలుగును.

రాత్రి సుఖముగా నిద్రించుటకు తగిన స్థితిని పగటియందే తయారుచేసుకోవలెను. వర్షాకాలమున హాయిగా జీవించు యత్నమును తక్కిన యెనిమిది మాసములలో చేయవలెను. వృద్ధాప్యమున సుఖించుటకు బాల్యముననే యత్నింపవలెను. మరణానంతరము సుఖించుటకు జీవితమంతయు కృషిచేయవలెను.

జరారూపం హరతి హి ధైర్యమాశా మృత్యుః ప్రాణాన్ ధర్మచర్యా మసూయా
క్రోధః శ్రియం శీల మనార్యసేవా హ్రియం కామః సర్వమే నాభిమానః

"ముసలితనము రూపమును చెరచును. ఆశ ధైర్యమును పోగొట్టును. మృత్యువు ప్రాణములను హరించును. అసూయ ధర్మాచరణమును వక్రింపజేయును. క్రోధము సంపదను వశింపజేయును. నీచులసేవ శీలమును పాడుచేయును. కామము లజ్జను తొలగించును. అభిమానము సమస్తమును ధ్వంసమొనర్చును" అని విదురుడనెను.

చతుర్థాధ్యాయము :-

మానవుడు తనను నిందించువారిని తిరిగి నిందించనిచో ఆ నిందలు నిందించినవానినే దహించి వేయును. అదియును గాక నిందించినవాని పుణ్యము సహించినవానిని చేరును.

రథము చిన్నదైనను పెద్దబరువును మోయగలుగును. పెద్దవియైన వృక్షములు ఆ విధముగా మోయలేవు. శ్రేష్ఠులైనవారు ఎంతటి బరువునైనను మోయ గలుగుదురు. ఇతరులు ఉన్నతులుగా గోచరించినను భారమును మోయలేరు.

సంతాపము వలన రూపము చెడును. బలము తగ్గును. జ్ఞానము క్షీణించును. రోగము వృద్ధి చెందును. రాగోరినది రాదు. శరీరము దహింపబడును. శత్రువులు ఆనందింతురు. కనుక శోకించుట తగదు.

చలచిత్త మనాత్మాన మిన్ద్రియాణాం వశానుగమ్
అర్థాః సమభివర్తన్తే హంసాః శుష్కం సరో యథా॥

"చిత్తము చలించువానిని, జ్ఞానము లేనివానిని, ఇంద్రియములకు వశమైన వానిని-సంపదలు, ఎండిన సరస్సును హంసలు చేరనట్లు, చేరకుండును" అని విదురుడనెను.

పంచమాధ్యాయము :-

మనిషి వంద సంవత్సరములు జీవించునని వేదములు పలుకుచున్నవి. మరి మానవుడు అంతకాలము ఎందులకు జీవింపలేకున్నాడు? ఏ కారణములో అతనిని మధ్యలో చంపుతున్నవి. అవి ఏవనగా! 1. గర్వము, 2. అతిగా వాగుట, 3. పాపాచరణము, 4. క్రోధము, 5. తనసుఖమునే చూచుకొనుట, 6. నమ్మినవారిని మోసపుచ్చుట. ఈ ఆరును పదునైన కత్తులై ఆయువును ముక్కలు చేయుచున్నవి.

కొందరు దుష్టులు కలిసి చేసిన ఆలోచనను వెంటనే తిరస్కరింపరాదు. మీపై నాకు నమ్మకము లేదు యని పలుకరాదు. ఏదో కారణము చెప్పి తప్పించుకొనవలెను.

మహతే యోఽపకారాయ నరస్య ప్రభవే న్నరః
తేన వైరం సమాసజ్య దూరస్థోఽస్మీతి నాశ్వసేత్

"గొప్పకీడు చేయు మనుజునిలో శత్రుత్వము పెట్టుకొని, అతడు దూరముగా యున్నాడని ధీమాగా యుండరాదు" యని విదురుడు పలికెను.

షష్ఠాధ్యాయము :-

తనయందు దోషములనుంచుకొని, నిర్దోషులైన తనవారిని బాధించు మనుజుడు పామున్న ఇంటిలో ఉండువానివలె నిద్రలేక, శాంతిలేక యుండును.

నమ్మదగనివానిని నమ్మరాదు. నమ్మదగినవానిని గూడ హద్దుమీరి నమ్మరాదు. నమ్మకము వలన జనించు భయము వ్రేళ్ళను గూడ త్రెంచును.

పెద్దలు అరుదెంచునపుడు యువకుని ప్రాణములు పైకిలేచును. అతని కెదురేగి నమస్కరించుటవలన తిరిగి యువకుడు ప్రాణములను బొందును.

పూజనీయా మహాభాగాః పుణ్యాశ్చ గృహదీప్తయః
స్త్రియః శ్రియో గృహస్యోక్తా స్తస్మా ద్రక్ష్యా విశేషతః

"స్త్రీలు పూజార్హులు. గొప్ప వైభవోపేతులు. పుణ్యవతులు. ఇంటికి దీపము వంటివారు. ఇంటిలోని లక్ష్మీస్వరూపిణులు. వారిని శ్రద్ధతో కాపాడవలెను" అని విదురుడనెను.

సప్తమాధ్యాయము :-

గొప్ప ప్రజ్ఞావంతులు బోధించు విషయము గూడ ఒక్కొక్కసారి నిష్ఫలమగుచుండును. ఎందులకనగా బోధించు విషయమును శ్రోత గ్రహింపలేకపోవుట, గ్రహించినను ఆచరింపకుండుట.

వినయము చెడ్డపేరును తొలగించును. పరాక్రమము చెడును నిర్మూలించును. సహనము క్రోధమును చంపును. ఆచారము చెడు నడవడిని పోగొట్టును.

ఒక్క మాటలో చెప్పవలె నన్నచో తనకు విరుద్ధమైన దానిని పరులకు చేయకుండుటయే ధర్మము. తోచినట్లు ప్రవర్తించుట అధర్మము.

సహస్రిణోఽ పి జీవన్తి జీవన్తి శతిన స్తదా ధృతరాష్ట్ర విముఞ్చేచ్ఛాం న కథఞ్చిన్న జీవ్యతే

"వేలకొలది ధనమున్నవారు జీవించుచున్నారు. వందలున్నవారు బ్రతుకుచున్నారు. ధృతరాష్ట్రా! సంపదపై ఆశను వీడుము. ఏ విధముగ నైనను బ్రతుక వచ్చును" అని విదురుడు పలికెను.

అష్టమాధ్యాయము :-

కట్టెలతో అగ్ని శాంతించదు. నదులతో సముద్రము నిండదు. జీవులతో యముడు తృప్తిని బొందదు. పురుషులతో కులట సంతృప్తి పడదు.

కాయలు, పండ్లు లేని చెట్లను పక్షులు వదలి వెళ్ళునట్లు, మృతుడైన వాని దేహమును బంధుమిత్రాదులు త్యజింతురు. పోయినవాని సంపద నెవరో అనుభవింతురు. దేహధాతువులను పక్షులు, అగ్ని తినివేయును.

జీవుడు ఒక నదిలాంటివాడు. పుణ్యమే అందులోని జలము. సత్యరూపమైన బ్రహ్మమునుండి జీవుడనే జీవనది పుట్టినది. ధీర స్వభావమే దాని తీరము. కరుణయే కెరటము. అందు జలకమాడిన పుణ్యజీవి పవిత్రుడగును.

సుఖార్థినః కుతో విద్యా నాస్తి విద్యార్థినః సుఖమ్
సుఖార్థీ వా త్యజే ద్విద్యాం విద్యార్థీ వా త్యజేత్ సుఖమ్॥

"సుఖము గోరు వానికి విద్య ఎక్కడిది? విద్యగోరువానికి సుఖము లేదు. సుఖమును కోరినచో విద్యను త్యజింపవలెను. విద్యను గోరినచో సుఖమును విడనాడవలెను" అని విదురుడనెను.

ఈ విధముగా అనేకములైన నీతులను విదురుడు ధృతరాష్ట్రునకు బోధించెను. బోధ యొక్క ఫలము ఎప్పుడు తెలియును? శ్రోత ఆచరించినపుడే తెలియును. మరి ఈ బోధవలన ధృతరాష్ట్రునిలో మార్పు వచ్చెనా? రాలేదనియే చెప్పాలి. మార్పు రానిచో బోధ వ్యర్థమే గదా? యనెడి సందేహము కలుగవచ్చును. ఈ సందేహము సరియైనది గావేరదు. ఎక్కడో విత్తనము ఒకటి మొలకెత్త లేదని వర్షమును నిరుపయోగముగ వర్ణింతుమా? రోగి మరణించినాడని వైద్యుని, ఔషధమును నిష్ప్రయోజనముగ నిరాకరింతుమా? ఒక్కడు బోధను వినవచ్చును. ఆచరింపవచ్చును. ఆచరింపక పోవచ్చును. అది ఒక్కరి కొరకు గాదు. సర్వులకొరకే బోధ సమర్పింపబడును. సంస్కారహీనులు బోధను విస్మరించి బాధలను వరింతురు. మహాత్ముడైన విదురుని పలుకుల నాలకించిన దురాత్ముడగు ధృతరాష్ట్రు డేమనెనో చూడండి.

"విదురుడా! నీవు సదా ఇలాగే నాకు బోధించుచున్నావు. కానీ దుర్యోధనుని తలచిన వెంటనే నా బుద్ధి మారిపోవుచున్నది. అదృష్టము నెవ్వరూ మార్చలేరు. పురుష ప్రయత్నము వ్యర్థమనియే నా అభిప్రాయము. ఏది ఏమైనను నేను దుర్యోధనుని వదలలేను" యని ధృతరాష్ట్రుడనెను. అంధత్వము దోషము కాదు. అజ్ఞానమే దోషము.

తే॥ నీవు చెప్పిన మాటలు నిర్మలములు నిపుణ సమ్మతములు రాజనీతి మార్గ
బోధకంబులు నైనను బుత్రు విడువ నోప "ధర్మోజయతి" యని యుండువాడ!

యని తిక్కన సోమయాజి భారతము.

విదురుని మాటల నాలకించిన దుర్యోధనుడు క్రుద్ధుడాయెను. విదురుని తీవ్రమైన పదములతో నిందించెను.

"విదురా! నీవు దుర్మతివి. దాసీ పుత్రుడవు. నీ సలహా లిక్కడ అసంగతములు. ఎవరి తిండి తిని బలిసితివో వారి శత్రువులకు హితము చేయుచుంటివి. ఈ దుష్టుని వధింపక నగరమునుండి వెడలగొట్టుడు" యని భటులను దుర్యోధనుడు యాజ్ఞాపించెను.

క॥ దాసీపుత్రుని మీర లుదాసీనుం జేయ కిటకు దగునే పిలువగా
నాపీమండై ప్రేలెడు గాసిలి చెడిపోవ వెడలగా నడువు డికన్

కర్ణశూలములైన దుర్యోధనుని దుష్టవాక్కుల నాలకించియు విదురుడు సహించి యుండెను. తాను చెప్పిన నీతిని ఆచరించి చూపెను. తానాచరించినపుడే తన సందేశములు ఇతరులకు ఆదర్శ మవుతాయి.

విదురుడు అసమాన శక్తిమంతుడు. దృష్టిని సారించి దుర్యోధనుని దహింప చేయగలడు. కానీ క్షమాగుణము విశిష్టమని గుర్తెరిగి యుండుటచే సుయోధనుని క్షమించెను. బాధలను భరించు నేర్పు గలవాడు భగవానుడే యగును.

విదురుడు ఆలోచించెను. తనను నిందించుటలో దుర్యోధనుడు నిమిత్తమాత్రు డనియు, ఈ కౌరవ దుస్సంగమును త్యజింపుమని శ్రీకృష్ణుడే అలా పలికించినా డనియు భావించెను. ధనుర్బాణములను అచ్చటనే విడచి వెళ్ళిపోయెను. ఆదర్శజీవికి ఆయుధము అవసరము లేదు.

స నిర్గతః కౌరవ పుణ్యలబ్ధో గజాహ్వయా తీర్థపదః పదాని

"కౌరవుల పుణ్యముగా లభించిన విదురుడు హస్తినాపురమును వీడి తీర్థాటనమునకు వెళ్ళెను."

విదురుడు వెడలిపోయెను. వాస్తవానికి వెళ్ళింది విదురుడు గాదు. కౌరవుల పుణ్యము. మనుజులు తాము చేసికొనిన పుణ్యము వలన మహాత్ముల సహచర్య భాగ్యమును పొందుదురు. పుణ్యము క్షీణింపగనే వారిని దూరము చేసికొందురు.

విభీషణుని వెడలగొట్టి రావణుడు మృతిచెందెను. విదురుని వెడలగొట్టి దుర్యోధనుడు పతనమయ్యెను. సత్పురుషుల నెవరు అవమానింతురో వారిని భగవానుడు కూడా

రక్షింపదు. మహాత్ముల యండ దొరికిన వారిని పరమాత్మయే కాపాడుచుండును. పాండవుల వెనుక నిలిచి వెలుగుతున్న సత్యమిదియే.

విదుర ఉద్ధవుల సమాగమము

విదురుడు ఒంటరిగ తీర్థాటన సాగించెను. పరిశుద్ధమైన జీవితమును గడుపుచు నిరాడంబరుడై చరింపసాగెను. ఎక్కువకాలము జపధ్యానాదుల యందు కాలము గడుపసాగెను. భారత వర్షములోని అనేక పుణ్యతీర్థములయందు చరించుచు విదురుడు ప్రభాస క్షేత్రమునకు వచ్చెను. వెదురునుండి జనించిన అగ్నిచే వెదురువన మంతయు దగ్ధమగునట్లు, ఒకరి నొకరు ద్వేషించుకొనుటచే తన బంధువులందరు హతులైనట్లు విదురుడు ప్రభాసక్షేత్రమున ఆలకించి, దుఃఖితుడయ్యెను. వెంటనే సరస్వతీ నదీతీరమున చేరెను.

సరస్వతి జ్ఞానస్వరూపము. కర్మలు బాధల నందించును. శోకము నందించును. శోకతప్తమైన హృదయమును జ్ఞానము శుద్ధిచేయును. విదురుడు అచ్చటనుండి యమునానదీ తీరమునకు వెడలెను. అచ్చట భాగవతోత్తముడగు ఉద్ధవుని దర్శించెను.

భక్త సమాగమము అమోఘము. పుణ్యాత్ములగు వారికి తీర్థాటన సమయమున భక్తుల సహచర్యము లభించును. ఉద్ధవుని జూచి తన్మయ మొందిన విదురుడు ఉద్ధవుని గాఢాలింగన మొనర్చుకొనెను. ఆ తరువాత శ్రీకృష్ణుని యొక్క, కృష్ణుని పరివారము యొక్క కుశలమును ప్రశ్నించెను.

తీర్థయాత్రలయందు నియమములను, వ్రతములను అనుష్ఠింపవలెను. లౌకిక సంసర్గము లేకుండా జాగ్రత్తపడవలెను. పుణ్యఫలవశమున భక్తులు లభించినచో వారికి నమస్కరించి భగవద్విషయములను ఆలకింపవలెను. భగవంతుని గూర్చియు, భగవద్బంధువులను గూర్చియు ప్రశ్నించి గ్రహింపవలెను. తీర్థయాత్రలు పూర్తిచేసికొని వచ్చు సమయానికి తీర్థరూపులై యుండాలి.

విదురుడు శ్రీకృష్ణుని గూర్చి ప్రశ్నించెను. భగవానుని విషయము ప్రస్తావింపబడగనే ఉద్ధవుడు పులకితుడయ్యెను. మారుపలకలేక పోయెను. ఉద్ధవుడు పరమ భాగవతోత్తముడు. కృష్ణగతచిత్తుడు. బాల్యమునుండియే చిత్తమును చిత్తచోరుడగు కృష్ణునకు అంకిత మొనర్చిన ధన్యాత్ముడు.

శ్రీశుకుడు చెప్పుచున్నాడు: "పరీక్షిన్మహారాజా! చిన్నతనము నుండియు ఉద్ధవుని మనస్సు పరమాత్మ యందే లగ్నమై యుండెను. భోజనాదుల యందు గూడ ధ్యాసయుండెడిది గాదు."

యః పంచహాయనో మాత్రా ప్రాతరాశాయ యాచితః
తన్నైచ్ఛద్రచయన్ యస్య సపర్యాం బాలలీలయా!

రాజా! ఐదేండ్ల ప్రాయమున ఆ ఉద్ధవుడు బాల్యక్రీడ ద్వారా శ్రీకృష్ణుని అర్చించుచుండెను. భోజన మారగించుటకు అతని తల్లి పిలుచుచుండినను అతడు వెళ్ళెడివాడు గాడు. భోజనము నందు ఉద్ధవునికి రుచి గోచరింపకుండెను."

బాల్యము నందు భగవంతుని గుర్తించువారు, అర్చించువారు పుణ్యాత్ములు. గోపబాలురు శ్రీకృష్ణుని సామాన్య బాలుడుగ భావించి ఆయనతో క్రీడించుచుండెడివారు. కానీ ఉద్ధవుడు భగవన్మహిమ నెరిగి యుండెను. శ్రీకృష్ణుడు ఆటలాడు సమయమున ఒంటరిగ లభించినచో వెంటనే ఆయన చరణకమలములను గట్టిగ పట్టుకొని "నాకు ముక్తి నెప్పుడు ప్రసాదించెదవు?ముకుందా!నన్నెప్పు డుద్ధరించెదవు " యని ప్రార్థించెడివాడు.

శ్రీకృష్ణుని అర్చించుచున్నట్లు క్రీడ నభినయించెడివాడు. ఆకలిని కూడా మరచెడివాడు. కొందరు భగవద్భజనలో మనస్సు లగ్నమగుటకు ఉపవాసములు చేయుచుందురు. కానీ భగవత్స్మరణలో ఆకలినే మరచియుండవలెను. ఇదియే నిజమైన ఉపవాసము. ఉద్ధవు డలా ఉపవసించెడివాడు.

అట్టి భాగవతోత్తముడైన ఉద్ధవుడు శ్రీకృష్ణునియొక్క కుశలమును విదురుడు ప్రశ్నింపగనే ముకుంద పాదారవింద మకరంద సుధాంబోధిలో గ్రుంకులిడెను. గద్గదకంఠుడాయెను. బాష్పజలపూరిత లోచనుడయ్యెను. భగవత్ప్రేమలో నిమగ్నుడైన ఉద్ధవుని నేత్రములనుండి అశ్రువులు ప్రవహించుచుండెను. ప్రత్యుత్తర మీయలేక నిశ్శబ్దముగ నుండెను. ఉద్ధవుని పారవశ్యమును గాంచి విదురుడు సంతృప్తి చెందెను.

కొన్ని క్షణములు గడచిన పిదప ఉద్ధవుడు విదురుని గుర్తించెను. పొంగి పొరలుచున్న కన్నీటిని తుడుచుకొంటూ ఇలా పలికెను:

"విదురా! ఈ లోకము విచిత్రమైనది. పాల సముద్రమునుండి పుట్టిన చంద్రుని అచ్చటనే యుండిన చేపలు గుర్తించలేని విధముగ ఎల్లప్పుడు కలసియున్నను యాదవులు శ్రీకృష్ణుని తెలిసికొనలేకపోయిరి. మాయ నెవరు జయింపగలరు? శ్రీకృష్ణుని యాదవ శ్రేష్ఠుడుగా భావించిరేగాని జగద్రక్షకుడుగ గ్రహింపలేకపోయిరి. వారెంతటి యదృష్టహీనులో గదా?

"కృష్ణుడు మా బంధువు. యాదవుడు యని చెప్పుకొనుచుండుట నే నాలకించితిని. అంతియే గాదు. శిశుపాలాదులు క్రూరులై శ్రీకృష్ణుని నిందించుటను గూడ నాలకించితిని. విదురుడా! మాయను దాటుట అసాధ్యము. మన స్వామియగు శ్రీకృష్ణుడు ప్రేమను పంచెడి కార్యములో నిమగ్నుడై గోకులమున అనేకములైన దివ్యలీలలను ప్రదర్శించెను. హాస్య వినోదములను చూపెను. కానీ ఆ దివ్యప్రేమను వారు అర్థము చేసుకోలేకపోయిరి. గర్వితమతులై చరించిరి. ఈ స్థితిని గాంచిన యదుభూషణుడు వ్రజపురమును విడచి వెళ్ళెను. గోపికలు చెట్టును వీడిన పక్షులవలె విలపించిరి. భగవానుడు నిర్హేతుకమైన తన ప్రేమను సర్వులకు సమముగా పంచును. భక్తిద్వారా ఆ ప్రేమను వృద్ధిగావింపకుండినచో వారినుండి మరల గ్రహించును.

ప్రదర్శ్యాతప్త తపసా మవితృప్త దృశాం నృణామ్
ఆదాయాన్తర ధాద్యస్తు స్వబింబం లోక లోచనమ్

"విదురా! తపస్సు చేయనివారు, తృప్తిచెందని దృష్టిగలవారు నగు మనుజులకు శ్రీకృష్ణుడు తన మూర్తిని జూపెను. వారు గ్రహింపకపోవుటచే మఱల తానే తిరిగి గ్రహించి అంతర్హితుడయ్యెను.

"విదురా! అవ్యయుడగు శ్యామసుందరుని దివ్యలీలలు సామాన్యులకు అవగతము గానేరవు. ఆయన ప్రేమ సాగరుడు. అమృత స్వరూపుడు.

తాతాంబ కంసాదురు శంకితానాం ప్రసీదతం నోఽకృత నిష్కృతీనామ్

"జననీ జనకులారా! కంసునికి భయపడి నేను మిమ్ములను సేవింపలేకపోయితిని. నా అపరాధమును మన్నింపుడు. నన్నునుగ్రహింపుడు." యని శ్రీకృష్ణుడు దేవకీ వసుదేవులను ప్రార్థించెను. విదురా! చూచితివా! శ్రీకృష్ణుని ప్రేమ అనంతమైనది.

"విదురా! కంసవధానంతరము శ్రీకృష్ణుడు ఉగ్రసేనుని సమీపించి, ఆయనకు చేతులు జోడించి నమస్కరించుచు, "దేవా! ఈ రాజ్యభారమును వహింపుము" యని భృత్యుని వలె విన్నవించుకొనెను. ఆ దృశ్యమును గాంచిన మేము మిక్కిలి వ్యథ చెందితిమి.

"విదురుడా! విషమొసగిన రాక్షసియగు పూతనకు అమృతత్వమును ప్రసాదించిన మన స్వామిని ఏమని పొగడెదను? నేను ఆ రాక్షసులకు గూడ నమస్కారము లర్పించుచుందును. భగవానుని దర్శించిన రాక్షసులు గూడ పుణ్యాత్ములనియే నా భావము.

"మన స్వామియగు శ్రీకృష్ణుడు పదునొకండు వత్సరములు వ్రజభూమిలో తన దివ్యలీలలను ప్రదర్శించెను. ఒకప్పుడు సామాన్య బాలునివలె రోదించును. మరియొకప్పుడు ఆనందముగా నవ్వును. దివ్యమైన తన వేణుగానముతో యావత్ప్రపంచమును మోహింపజేయును.

"విదురా! పరమేశ్వరుడగు శ్రీకృష్ణుడు సర్వులలో తానొకడై చరించుచుండెను. ఆ దివ్యాత్ముని కొద్దిమంది మాత్రమే గ్రహింపగలిగిరి. మాయా మోహితులైనవారు హతులగు సమయ మాసన్నమాయెను. శరణాగతులగు భక్తుల నుద్ధరించు భగవానుడు గర్వితులైన తనవారిని సంహరింప దలచెను. సరస్వతీ నదీతీరమును సమీపించెను. జలము నాచమించెను. ఒక చెట్టుక్రింద కూర్చొనెను. "ఉద్ధవా! నీవు బదరికాశ్రమమునకు వెళ్ళుము" అని నాతో పలికెను.

"విదురా! పరమాత్మ యొక్క అభిప్రాయమును ఆయన కృపచే గ్రహింపగలిగితిని. అందుచేత బదరికాశ్రమమునకు వెడలక ఆయన పాదపద్మములను వదలక యుంటిని.

"విదురా! అది చిన్న అశ్వత్థవృక్షము. స్వామి దాని నానుకొని కూర్చుండి యుండెను. ఆయన యెడమ తొడపై కుడికాలు నుంచుకొని యుండెను. ఆనందముగ గన్పట్టుచుండెను.

శ్యామవర్ణుడై, ప్రశాంతారుణలోచనుడై, చతుర్భుజుడై, పీతాంబరధారియై నేత్రపర్వము నొసగూర్చిన శ్రీకృష్ణుని దర్శించి ధన్యుడనైతిని.

మ॥ కంటిఁ గంటి భవాబ్ధి దాటగ, గంటి నాశ్రిత రక్షకుం
గంటి యోగి జనంబు డెందము గంటి జుట్టము గంటి ము
క్కంటికిం గనరాని యొక్కటి గంటి దామరకంటి జే
కొంటి ముక్తి నిధానముం దలకొంటి సౌఖ్యము లందగన్

"విదురా! ఇంతలో పరమభాగవతోత్తముడు, వ్యాసుని మిత్రుడునగు మైత్రేయ మహాముని అచ్చటికి అరుదెంచెను. పరమాత్మకు భక్తితో నమస్కరించెను. ఆనంద భక్తి భావము లుప్పొంగ నవనత శిరముతో వినమ్రుడై నిలబడెను. శ్రీకృష్ణ భగవానుడు నా అలసటను పోగొట్టుటకై, అనురాగ హాస్యములను మేళవించి అమృతవచనముల నందించెను" యనెను.

భగవానుడు చెప్పుచున్నాడు: "ఉద్ధవా! అనేక జన్మలలో నన్ను బొందుటకు నీవు సాధన చేసితివి. ఈ జన్మమున దానిని సాధించుకొంటివి. ఇదియే నీ చివరి జన్మ కాగలదు. నా కృప నీకు పూర్ణముగా లభించినది" యనెను.

"విదురా! పరమాత్మ యొక్క ఈ ప్రేమవచనముల నాలకించి తన్మయుడనైతిని. నా కంఠము మూగబోయెను. నేను భగవానుడైన శ్రీకృష్ణుని ఈ విధముగా ప్రార్థించితిని.

కోన్వీశతే పాద సరోజ భాజాం సుదుర్లభోఽర్థేషు చతుర్ష్వపీహ
తథాపి నాహం ప్రవృణోమి భూమన్ భవత్పాదాంభోజ నిషేవణోత్సుకః

"భగవాన్! నీ పాదపద్మముల యందు చిత్తము లగ్నమైన వారికి ఏ ప్రయోజనము లభింపకుండును? అయినను నాకు ఏ ప్రయోజనములు అవసరము లేదు. నీ చరణ కమల సేవనమే నాకు తృప్తి నొసగును యని పలికితిని.

"విదురుడా! నేను పరమాత్మను ఒక్క వరమును గోరితిని. నాకు అర్హత యున్నచో భాగవత ధర్మమును బోధింపుమని ప్రార్థించితిని. పద్మలోచనుడగు పరమాత్మ నాకు పరతత్త్వమును బోధించెను. దానిని మననము చేసికొనుచు పరమాత్మ యాజ్ఞ ననుసరించి బదరికాశ్రమమునకు వెళ్ళుచూ, మార్గమధ్యమున శ్రీకృష్ణుడు చరించిన ఈ పుణ్య భూమిని దర్శించుటకు వచ్చి, ఇచ్చట పుణ్యవశమున నిన్ను గాంచ గల్గితిని.

సోఽహం తద్దర్శ నాహ్లాద వియోగార్తి యుతః ప్రభో
గమిష్యే దయితం తస్య బదర్యాశ్రమ మండలమ్

"విదురా! నేను మిశ్రమ భావాలతో కదలిపోవు చున్నాను. భగవానుని దర్శనము వలన నాకెంతో ఆనందము కలిగెను. అలాగే వియోగము వలన తీవ్రమైన దుఃఖము కలిగెను. మహాత్మా! పరమాత్మకు ప్రియమైన బదరికాశ్రమమునకు నేను వెడలుచున్నాను" యని ఉద్ధవుడు పలికెను.

శ్రీకృష్ణుని అవతార సమాప్తి విషయమును తెలిసి విదురుడు అమితముగా దుఃఖించెను. ఉద్ధవుని వంటి పుణ్యము లేనందున పరమాత్మ దర్శనమునకు, బోధకు నోచుకొనుట జరుగలేదని వ్యథచెందెను. ఉద్ధవునితో ఇలా పలికెను:

"మహాత్మా! ఉద్ధవా! నీవు పుణ్యాత్ముడవు. ధన్యుడవు. భగవత్కృప నీపై అపారముగ వర్షించినది. మీరు భగవద్భక్తులు. మేము మీ భృత్యులము. మా యందు దయయుంచి పరమాత్మ బోధించిన దివ్య జ్ఞానమును మాకు అనుగ్రహింపుము" యని విదురు డనెను.

"విదురా! నీవు సామాన్యుడవు గావు. నీకు మించిన భాగ్యవంతులు ఈ పుడమిలో లేరు. భగవానుడే నిన్ను తలచునంతటి ఘనుడవు. నీ జన్మ ధన్యమైనది" యని ఉద్ధవు డనెను.

"మహాత్మా! ఉద్ధవా! ఏమనుచుంటివి? పరమాత్మ నన్ను తలచెనా! ఈ కింకరుడు పరమాత్మ హృదిలో మెదిలెనా?" యని దుఃఖింపసాగెను.

"విదురా! భక్తులు భగవానుని స్మరించుచుందురు. కాని భగవానుడు భక్తులను స్మరించుట యనునది సాధారణ విషయము గాదు. నీవు మహాభక్తుడవు. అందుచేత పరమాత్మ అవతార లీలను సమాప్తి చేయు సమయాన నిన్ను దలచెను. విదురా! భగవానుడు నాకు తత్త్వోపదేశము చేయునపుడు మైత్రేయఋషి అరుదెంచెను. నీకు ఉపదేశము చేయుమని మైత్రేయమహర్షిని నా సమీపముననే భగవానుడు ఆదేశించినాడు. నీవు మైత్రేయుని సేవించి జ్ఞానమును బొందుము" యని పలికి మరునాటి ఉదయముననే ఉద్ధవుడు బదరికాశ్రమమునకు వెడలెను.

పరమాత్మ ప్రేమసాగరుడు. ఆయన ప్రేమకే లభించును. భగవంతుని కొరకు ఆచరించిన కర్మ లేవియును వృథాగావు. విదురుని భక్తి సఫలమాయెను. పరమాత్మ విదురుని గూర్చి ఆలోచించెను. విదురుని తరింపజేయుటకు మైత్రేయుని పనిముట్టుగా జేసికొనెను. భక్తితో పండ్లతొక్కను సమర్పించిన విదురుడు లీలా సమాప్తి సమయాన పరమాత్మ మదిలో కదిలాడసాగెను. భగవానుడు భక్తికి లొంగిపోవును.

ఆత్మానాం చ కురుశ్రేష్ఠ కృష్ణేన మనసేక్షితమ్
ధ్యాయన్ గతే భాగవతే రురోద ప్రేమవిహ్వలః

"పరీక్షిన్మహారాజా! వైకుంఠమునకు వెడలుచు తనను గూర్చి శ్రీకృష్ణుడు తలచుకొనెనని విదురుడు ఉద్ధవునిద్వారా వినెను. ఉద్ధవుడు వెడలగా ఆ విషయమును మరల మరల తలచుకొని వ్యథ చెందసాగెను.

"రాజా! విదురుడు మహాభక్తుడు. ఉద్ధవుడు పరమాత్మతో సమానుడు. వీరిద్దరి సమాగమము త్రివేణీ సంగమము కంటెను పవిత్రమైనది. తన స్వరూప జ్ఞానమును ఉద్ధవుడు పూర్ణంగా గ్రహించినట్లు పరమాత్మ తెలియజేసెను. అందుచేతనే తన జ్ఞానము మనుజులకు ప్రాప్తించుటకు అవతారమును చాలించిన పిదప గూడ ఉద్ధవు నొక్కడినే ఈ ప్రపంచమున విలిపెను.

నోద్ధవోఽ ణ్వపి మన్న్యూనో యద్గుణై ర్నాదితః ప్రభుః
అతో మద్వయునం లోకం గ్రాహయన్నిహ తిష్ఠతు

"నాకంటెను ఏ మాత్రము ఉద్ధవుడు తక్కువవాడు కాడు. అతనిని ఇంద్రియములు చలింప లేవు. విషయములు కదలింపలేవు. కనుక జనులకు జ్ఞానము నుపదేశించుటకు ఉద్ధవుడు ఈ ప్రపంచములో నుండుగాక!" యని పరమాత్మ సంకల్పించెనని శ్రీశుకుడు పరీక్షిత్తునికి చెప్పెను.

విదురుడు మైత్రేయుని కలియుట

వినిర్మల హృదయుడగు విదురుడు గంగాతీరమున మైత్రేయ మహర్షిని దర్శించెను. నమస్కరించెను. అనుకూల సమయమున ఇలా ప్రశ్నించెను:

"మహాత్మా! సుఖప్రాప్తికై జనులు కర్మల నాచరించు చున్నారు. కానీ కర్మల వలన సుఖము చేరువగుట లేదు. దుఃఖము దూరమగుట లేదు. ఈ సృష్టిలో జీవుల స్వభావముల యందు, కర్మల యందు భేద మెలా ఏర్పడెను? ఈ సృష్టిలోని కార్యములను కొనసాగించుటకు పరమాత్మ అనేక లీలలను ప్రదర్శించెను. వీటి నన్నింటిని మాకు తెలుపుము;" యని విదురు డడిగెను.

మైత్రేయుడు చెప్పసాగెను: "విదురా! నీవు శ్రీకృష్ణుని దయకు నోచుకొనిన ధన్యాత్ముడవు. సర్వజీవులపై అనుగ్రహమును ప్రసరింపజేయుచు చక్కని ప్రశ్నల నడిగితివి. ఈ విషయము నీ కీర్తిని ఇనుమడింప జేయును. నీవు శ్రీకృష్ణునికి ప్రియభక్తుడవు. వైకుంఠమునకు వెడలు సమయమున శ్రీకృష్ణపరమాత్మ నీకు తత్త్వోపదేశమును చేయుమని నన్నాజ్ఞాపించెను. నీ జన్మ రహస్యమే అమోఘమైనది.

మాండవ్యశాపా ద్భగవాన్ ప్రజా సంయమనో యమః
భ్రాతుః క్షేత్రే భుజిష్యాయాం జాతః సత్యవతీ సుతాత్

"గతములో దండధరుడగు యముడవు నీవే. మాండవ్య మహర్షి శాపముచే వ్యాసుని వలన దాసీ పుత్రుడుగ జన్మించితివి" యనెను.

ఒకానొక సమయమున కొందరు చోరులు రాజుగారి ధనాగారము నుండి ధనము నపహరించి పారిపోవు చుండిరి. ఈ విషయమును భటులు కనిపెట్టిరి. వెంటనే వారు చోరులను వెంబడించి తరిమిరి. చోరులు పరుగిడ సాగిరి. కానీ వెంబడించు రాజభటులు సమీపమున కరుదెంచుటను గాంచి, మరో మార్గము తోచక అక్కడికి సమీపమున యున్న మాండవ్య మహర్షి ఆశ్రమమున ధనరాశులను పడవేసి వెళ్ళిరి. రాజభటులు ఆశ్రమంలో ధనరాశులను కనుగొనిరి. మాండవ్య మహర్షిని చోరుడుగా గుర్తించిరి. బంధించి రాజుగారి సమక్షమున నిలిపిరి.

మాండవ్య మహర్షియే చోరుడని గుర్తించిన ప్రభువు ఆ మహాత్మునికి మరణశిక్ష విధించెను. మహర్షిని వధించుటకు గొనిపోయిరి. ఎన్ని విధముల ప్రయత్నించినను మహర్షి

మరణింపకుండెను. నిరపరాధి నెవ్వరు శిక్షింప గలరు? రాజునకు సత్యము తెలిసెను. తన తప్పిదము తెలిసి వచ్చెను. మహాత్ముడైన మాండవ్య మహర్షి పాదములపైబడి క్షమాభిక్షవేడెను. రాజును క్షమించుటకు అంగీకరించిన మాండవ్య మహర్షి యమధర్మరాజును క్షమించుటకు అంగీకరించలేదు. చేయని నేరానికి వధ్యశిలపైకి ఎందులకు ఎక్కించితివి? యని యముని ప్రశ్నించెను.

భీతిచెందిన యమధర్మరాజు "నీవు శిశువుగా యున్నప్పుడు కీటకములను పట్టి బాధించితివి. అందులకు ఈ స్వల్పమైన శిక్ష విధింపబడినది" యనెను.

"శూన్య భావముతో పాపమొనరించిన శిశుచేష్టకు ఫలితమును స్వప్నమున కల్పించవలె నని శాస్త్రము చెప్పుచున్నది. కానీ నీవు జాగ్రదవస్థ యందే పాపఫలితము నొసంగితివి. అందుచేత నీవు దాసీ పుత్రుడవై జన్మించెదవు గాక!" యని మాండవ్యమహర్షి యముని శపించెను. ఈ కారణముగా యముడు విదురుడై జన్మించెను.

మాండవ్యమహర్షి శుభచరితుడు. అందుచేత దండధారియగు యమధర్మరాజునే దండించ గలిగెను. సత్యము బలీయమైనది. సత్యచరితులైన దివ్యాత్ముల ఎదుట ఎవ్వరైనను తలవంచక తప్పదు. "నాలో ఏ పాపమున్నది?" అని మాండవ్య మహర్షి ధైర్యముగా యముని ప్రశ్నించెను.

విదురు డడిగిన ప్రశ్నలకు మైత్రేయుడు సమాధాన మొసగుటకు ప్రారంభించెను. సృష్టి విషయమును వివరించెను. ఏకమైన పరమాత్మ యందు భిన్నముగా తెలియు జగత్తుయొక్క కార్యమును విశదపరచెను.

పరమాత్మ అద్వయుడు. మాయ నాధారముగా గొని పరమాత్మ ఈ జగత్తును సృజించెను. పంచతన్మాత్రలు, త్రిగుణములు, పంచభూతములు, జ్ఞానేంద్రియ, కర్మేంద్రియములు, అంతఃకరణ చతుష్టయము, పంచీకరణము నొందిన పిదప ఏర్పడిన స్థూల జగత్తు, స్థూల దేహములు ఇత్యాదు లేర్పడిన క్రమమును మైత్రేయుడు విదురునకు తెలిపెను. కార్యకారణ రూపమగు మాయను గూర్చి వివరించి, అసద్రూపమైన మాయను విస్మరించి చైతన్యరూపుడగు పరమాత్మను తెలిసికొనుటయే జీవుల ప్రధాన కర్తవ్యమని తెలిపెను.

శరణాగతులైన వారు తాపోపశాంతికి పరమాత్మ చరణకమలములనే ఆశ్రయింప వలెను. శ్రీహరి చరణములు గంగాదేవికి ఉద్గమ స్థానములు. అట్టి పాదపద్మముల నాశ్రయించువారు ధన్యులగుదురు. "నేను - నాది" యనెడి అహంకార మమకారముల వలలో చిక్కినవారు పరమాత్మ అంతర్యామిగా యున్నను గ్రహింపలేకున్నారు.

యోగులు చిత్తమును నిరోధించి, సంకల్పములను అరికట్టి పరమాత్మను పొందుటకు ప్రయత్నించు చుందురు. ఇది చాలా శ్రమతో కూడిన విషయమై యున్నది. భక్తులైనవారు శ్రమ తెలియనివారై యుందురు. సదా పరమాత్మ చరణకమలముల నాశ్రయించి యున్నందున భ్రమ తొలగినవారై యుందురు. ఈ విధముగా పలికి శ్రీహరి దివ్యవైభవమును వివరించుటకు మైత్రేయు డుపక్రమించెను.

తథాపి కీర్తయామ్యఙ్గ యథామతి యథాశ్రుతమ్
కీర్తిం హరేః స్వాం సత్కర్తుం గిరమన్యాభిధాసతీమ్

"విదురా! గురుసన్నిధిలో నేను శ్రవణము చేసిన హరివైభవము నా బుద్ధి ఎంతవరకు నిలుపుకొన గలిగినదో అంతవరకు నీకు తెలిపెదను. పరమాత్మ కన్నను అన్యములగు విషయములను భాషించుట వలన నా పలుకులలో ఏర్పడిన మాలిన్యమును ఈ విధముగా తొలగించుకొందును" అని మైత్రేయు డనెను.

మైత్రేయుడు పుణ్యచరితుడు. పుణ్యశ్లోకుడైన పురాణపురుషుని దివ్యవైభవమును గురుసన్నిధిలో శ్రవణముచేయు భాగ్యమునకు నోచుకొనిన దివ్యాత్ముడు. హరికీర్తి అనిర్వచనీయ మైనది. అట్టి హరి వైభవమును వర్ణించు గురుదీప్తి అమోఘమైనది. వైభవోపేతుడైన గురుదేవుని దివ్య వచనములను హృదయము నందు నిక్షిప్త మొనరించు కొనుట పుణ్యాత్ములకే సాధ్యము.

గురుదేవుని ద్వారా గ్రహించిన జ్ఞానమును ఇతరులకు పంచే సదాచారము మహోన్నతమైనది. జ్ఞానదానము మహత్తరమైనది. మహోన్నతమైనది. జ్ఞానదానము చేయు మహితాత్ములు తమ కత్యంత ప్రియులని శ్రీకృష్ణపరమాత్మ గీతయందు తెలిపియున్నారు.

నీరు ఎత్తయిన ప్రదేశములందు నిలువక పల్లపు ప్రాంతములకు ప్రవహించునట్లు, జ్ఞానము అహంకారుల మదిలో నిలువక వినమ్రులైన వినీతుల హృదయములలో ప్రతిష్ఠిత మగుచున్నది. మైత్రేయుని వినమ్రవచనములు అతని హృదయ సౌందర్యమునకు అద్దము పట్టినట్లున్నవి. తన వాక్కుల యందలి దోషములను నివారించు కొనుటకు శ్రీహరి వైభవమును కీర్తించుచున్నట్లు మైత్రేయుడు వినమ్రుడై పలుకుచున్నాడు.

ఉ॥ అన్యకథానులాపము లహర్నిశముం బతియించి చాల మా
లిన్యము నాత్మశోభనవి లీనత నొందు మదీయ జిహ్వా సౌ
జన్యము తోడ గ్రోలు హరి సద్గుణ దివ్య కథామృతంబు స
న్మాన్య చరిత్రమై నెగడు మద్గురువాక్య పదంబు జెందగన్

దేహము నంటిన మాలిన్యమును జలము ద్వారా శుభ్రము చేయునట్లు పరమాత్మ కన్యములైన విషయములను పలుకుట వలన మలినమైన వాక్కులను హరికీర్తనము ద్వారా శుభ్రము చేసికొనవలెను. వాక్శుద్ధిలేనివారి పలుకులో వాగ్దేవత నిలువదు. భక్తులైనవారు పరుషవాక్కులను పలుకరాదు. పొరపాటున అలా జరిగినచో వెంటనే భగవన్నామము నుచ్చరింపవలెను. సదా ఈ విధముగా వాక్కును పవిత్ర మొనరించుకొనుట భక్తుని ప్రధాన కర్తవ్యమై యుండవలెను. నిరంతరము హరినామ మాధుర్యము ననుభవించు జిహ్వకు అసలు మాలిన్యమే అంటదు యనునది గమనించదగిన రహస్యము. తామరాకును నీరంటనట్లు హరిభక్తులను పాపము లంటవు.

ఏకాన్తలాభం వచసో ను పుంసాం సుశ్లోక మౌలే ర్గుణ వాద మాహుః

"విదురుడా! పుణ్యశ్లోకుడైన భగవానుని వైభవమును కీర్తించుటయే మనుజుల వాక్కులకు ఉత్తమ లాభమును కలిగించును.

"విదురా! హరికీర్తనము వాక్కులకు ఉత్తమలాభమును కలిగించునట్లు, హరికథా శ్రవణము వీనులకు ఏకాంత ప్రయోజనమై యున్నది. భగవానుని మహిమను పూర్ణముగా గ్రహించుట ఎవ్వరికిని సాధ్యముగాదు.

క॥ హరిమహిమముఁ దన్నాభీ సరసిజ సంజాతుఁడైన చతురాననుఁడుం
బరికించి యెఱుఁగఁడన్న నితరమనుజులఁ జెప్పనేల తత్త్వజ్ఞనిధీ॥

యని మైత్రేయుడు పలుకగా విని సంతసించిన విదురుడు తన సంశయములను నివృత్తి చేసుకొనుట కుపక్రమించి మైత్రేయుని ప్రశ్నించెను.

"మహాత్మా! మైత్రేయమహామునీ! భగవానుడు చిన్మాత్రుడు. అవికారుడు. నిర్గుణుడు. అట్టి పరమాత్మలో గుణములు, క్రియలు ఎట్లు కలిసినవి? ఈ జగత్తును పరమాత్మ ఎందులకు సృష్టించెను? క్రీడార్థమని కొందరు, లీలామయమని మరికొందరు చెప్పుచుందురు. బాలురు క్రీడింతురు. వారియందు క్రీడాభిలాషయుండును. మరి నిత్యతృప్తుడైన పరమాత్మలో క్రీడాభిలాష ఎలా పొసగును?

"జీవుడు జ్ఞానస్వరూపుడు. పరిశుద్ధమైన జీవునికి అజ్ఞానమేల అంటెను? పరమాత్మ అంతర్యామి యైనపుడు ఆనంద నివృత్తి ఏల సంభవించెను? దుఃఖప్రాప్తి ఎలా కలిగెను? సర్వజ్ఞుడైన మహామునీ! అవిద్యా ప్రభావముచే నా చిత్తము భిన్నమగుచున్నది. నా సంశయములను తొలగింపుము" అని విదురుడు ప్రార్థించుచూ ప్రశ్నించెను. ప్రశ్నించుచూ ప్రార్థించెను. మైత్రేయుడు సమాధాన మొసగెను. బంధము జీవునకు కల్పితమేగాని వాస్తవము గాదనెను.

యదర్థేన వినాముష్య పుంస ఆత్మ విపర్యయః
ప్రతీయత ఉపద్రష్టుః స్వశిరశ్ఛేద నాదికః

"విదురుడా! స్వప్నమున తన శిరము ఛేదింపబడినట్లు ఒకవ్యక్తి కల గనును. అది వాస్తవము గాక పోయినను వాస్తవమైనట్లు అతడు భ్రమించును. అలాగే పరిశుద్ధమైన జీవునకు బంధము మొదలైనవి లేకపోయినను ఉన్నట్లు గోచరించును.

స్వప్నద్రష్టకు స్వప్నములోని దృశ్యములు తనకంటెను అన్యముగా తెలియుచుండును. వాస్తవానికి మనస్సే ద్రష్టగను, దృశ్యముగను వ్యవహరించు చున్నది. స్వప్నజగత్తును సృష్టించినది, అనుభవించినది ఏదైనను అది మనస్సు కంటెను భిన్నము గానేరదు.

స్వప్నే స జీవ స్సుఖదుఃఖభోక్తా స్వమాయయా కల్పితజీవలోకే

"స్వప్నమునందు జీవుడు తన మాయచే కల్పింపబడిన ప్రపంచము నందు సుఖదుఃఖముల ననుభవించు చున్నాడు" యని కైవల్యోపనిషత్తు తెలిపినది.

స్వప్నము ననుభవించు వరకు స్వప్నము వాస్తవముగనే గన్పట్టును. జాగ్రదవస్థకు రాగానే స్వప్నము, స్వప్నగత బంధము రెండును అసత్యములే యని తెలియును. అలాగే మాయనుండి విడిపడిన జీవునకు ఈ ప్రపంచము మాయాకల్పితమని తెలియును. బంధము ఆరోపితమైనదిగా మిగిలిపోవును.

"విదురా! జలము నందు చంద్రుడు ప్రతిబింబించును. జలము చలించినపుడు చంద్రుడు కంపించునట్లు తెలియుచుండును. జలమున ప్రతిఫలించిన చంద్రుని ప్రతిబింబమునందు ఏ విధమైన కదలికలు లేకపోయినను ఉన్నట్లు తెలియుచుండును. అలాగే శుద్ధమైన జీవుని యందు శోకమోహాదులు లేకపోయినను ఉన్నట్లు తెలియుచున్నవి.

చ॥ లలిత విలోల నిర్మల జల ప్రతిబింబిత పూర్ణచంద్రమం
డలము దదంబు చాల నవిడంబన హేతువు నొందియున్ వియ
త్తలమున గంపమొంద నివిధంబున సర్వ శరీర ధర్మముల్
గలిగి రమించు నీశునకు గల్గగ నేరవు కర్మబంధముల్

"కంపనాదులు జలమునకు సంబంధించినవియే గాని చంద్రునికి సంబంధించినవి గావు. అలాగే అనాత్మ లక్షణములగు శోకమోహాదులు మాయాజనితమైన అంతః కరణమునకు సంబంధించినవియే గాని ఆత్మకు సంబంధించినవి గావు. ఆవరణ దోషము చేత ప్రతిబింబ దర్శనములో భ్రాంతి తయారైనది. బింబదర్శనముచే జ్ఞానము కలుగుచున్నందున అజ్ఞానమంతరించి, శోక మదృశ్యమగుచున్నది.

"ఆకాశమున బింబరూపుడగు చంద్రుడొక్కడే గలడు. ఆ ఒక్కడే అనేకములైన జలాశయములలో ప్రతిబింబించినపుడు అనేకములుగ తెలియుచున్నాడు. ఇదియే ఉపాధి భేదము. చంద్రుడు వాస్తవానికి అద్వయుడైనను అనేక చంద్రులుగ తెలియునట్లు, ఆత్మ ఏకమైనను దేహములగు ఉపాధుల భేదము వలన అనేకములుగ తెలియుచున్నది.

ఏక ఏవహి భూతాత్మా భూతే భూతే వ్యవస్థితః
ఏకధా బహుధా చైవ దృశ్యతే జల చంద్రవత్

"సర్వభూతముల యందును అనేకముగా తెలియు ఆత్మ వాస్తవానికి ఏకమే. అట్టి ఆత్మ నీటిలో ప్రతిబింబించిన చంద్రుని వలె ఏకమయ్యును అనేకములుగా తెలియుచున్నది" యని అమృత బిందూపనిషత్తు ప్రవచించినది.

"జీవునకు ఈ అజ్ఞానము తొలగవలెను. భక్తి యోగము నవలంబించుట చేత అవిద్య మెల్లమెల్లగ అంతరించు నని మైత్రేయుడు విదురునకు చెప్పెను. సర్వసాక్షియగు శ్రీకృష్ణుని యందు చిత్తము లగ్నమైనపుడు నిద్రించువానికి దుఃఖములు తెలియని విధముగా జీవుడు సర్వోపద్రవముల నుండి విడిపడి సుఖించు చున్నాడు.

మైత్రేయుని తత్త్వోపదేశము నాలకించిన విదురుడు తృప్తిచెందెను. తన సంతృప్తిని వెల్లడించుచు మైత్రేయునితో ఇలా పలికెను:

"మహాత్మా! నీ పవిత్ర వాక్కులనెడి ఖడ్గముచే నా సందేహములు ఛేదింపబడినవి. పరమాత్మ సర్వ స్వతంత్రుడని గ్రహించితిని. జీవుడు పరతంత్రుడని తెలిసికొంటిని. ఈ విషయమున సంశయము అనర్థము నొసంగునని గూడా గ్రహించితిని.

"మహామునీ! మాయామయమగు ఈ ప్రపంచము వాస్తవానికి లేనిదే యని పరోక్షముగా గ్రహించితిని. నీ పాదములను సేవించుట ద్వారా అద్దానిని అపరోక్షముగా మార్చుకొందును. తమలాంటి ఏకాంత భక్తుల పాదసేవనము శ్రీకృష్ణ సందర్శనాభిలాషను వృద్ధిచేయును. సంసార బంధములు నశించును. మహాత్మా! తత్త్వోపదేశము చేసి నన్ను కృతార్థుని జేసితివి. భగవానుని యొక్క దివ్య విభూతులను గూడా దయతో తెలియజేయుము. శ్రీకృష్ణుని తృప్తిపరచు మార్గములను కూడా తెలుపుము. ఎలా జీవించిన శ్రీకృష్ణుడు ప్రసన్నుడగునో విశదపరచుము" యని విదురుడు వినమ్రుడై పలుకగా సంతసించిన మైత్రేయుడు వివరించుట కుపక్రమించెను.

పుట్టించువాని పుట్టుక

"విదురా! పరమ పవిత్రమైన భాగవత పురాణమును నీకు బోధించుచున్నాను. అల్ప సుఖాభిలాషులై అధిక దుఃఖానుభవమునకు గురియగుచున్న అజ్ఞానుల అవిద్యానివృత్తికై ఈ భాగవతము చెప్పబడినది. ఈ భాగవత పురాణమును సంకర్షణ భగవానుడు సనత్కుమారునకు బోధించెను. సనత్కుమారుడు సాంఖ్యాయన ఋషికి వివరించెను. సాంఖ్యాయన ఋషి నా గురుదేవు డగు పరాశరమహర్షికి తెలిపెను. పరాశర మహర్షి నాకు అనుగ్రహించెను. అతి శ్రద్ధ గలవాడ వైనందున నేను నీకు చెప్పుచున్నాను" అని మైత్రేయుడు చెప్పసాగెను.

వేయి చతుర్యుగముల పర్యంతము జలమున శయనించియుండిన నారాయణుడు సృష్టి కార్యమునకై సర్వజీవుల సూక్ష్మ దేహములపై దృష్టిని సారించెను. ఈ సమస్త సూక్ష్మశరీర విశేషము పద్మాకారముగ రూపుదాల్చెను. అది సూర్యునివలె ప్రళయ జలమును ప్రకాశింప జేయుచుండెను. ఆ పద్మములోనికి విష్ణుమూర్తి ప్రవేశించెను. ఆయన ప్రవేశించిన ఆ పద్మమునుండి చతుర్ముఖ బ్రహ్మ ఆవిర్భవించెను. అతడిని స్వయంభువు యని విజ్ఞులు కీర్తింతురు.

పద్మకర్ణిక యందు ఆసీనుడై యున్న బ్రహ్మదేవునకు ఏమియు గన్పట్టకుండెను. అతడు ఆకాశము నలునైపుల మెడనుత్రిప్పి గాంచసాగెను. ఈ కారణము చేత వేదగర్భుడైన బ్రహ్మ చతుర్ముఖుడాయెను. ఎంత గాంచినను బ్రహ్మకేమియును తెలియకుండెను. తన తత్త్వము గాని, పద్మము యొక్క రహస్యముగాని అవగతము గాకుండెను.

"ఈ పద్మకర్ణికపై కూర్చొనియున్న నే నెవడను? ఈ కమలము జలము నందు నిరాధారముగా ఎలా నిలబడియున్నది? దీని కాధారమైన దేదియో పద్మము క్రింద

యుండవలెను" అని బ్రహ్మదేవుడు భావించెను. వెంటనే తామరతూడులోని సూక్ష్మ రంధ్రము ద్వారా ప్రళయపు నీటిలోనికి ప్రవేశించెను. నారాయణుని నాభీ ప్రదేశమునకు చేరుకొనెను. అయినను ఏమియును అర్థముగాక మిన్నకుండెను. ఈ అన్వేషణ నూరు దివ్యవర్షములు కొనసాగెను. అయినను అది ఏమిటో అంతుపట్ట లేదు. విఫల యత్నమును సాగించిన విధాత మెల్లగా మరల పద్మకర్ణిక పైకి వచ్చి ఆసీనుడై ధ్యానమగ్ను డయ్యెను.

బ్రహ్మదేవుడు నూరు వర్షములు తపమాచరించెను. పూర్వము ఎంత వెదికినను గోచరించని భగవానుడు ఇప్పుడు బ్రహ్మదేవుని హృదయమున శోభించి దర్శన మొసగెను. బ్రహ్మదేవుడు తన హృదయమున పరమాత్మను దర్శించెను.

మ॥ కనియెన్ నిశ్చలభక్తి యోగమహిమం గంజాత గర్భుండు శో
భన చారిత్రు జగత్పవిత్రు విలసత్పద్మాకళత్రున్ సుధా
శన ముఖ్య స్తుతిపాత్రు దానవచమూ జైత్రున్ దళత్పద్మనే
త్రు నవీనోజ్జ్వల నీలమేఘ నిభగాత్రుం బక్షిరాట్పత్రునిన్

బ్రహ్మదేవుడు బాహ్యమున ఎంత వెదికినను భగవానుడు గోచరింపకుండెను. భక్తియుతుడై, ధ్యాన మగ్నుడై అంతర్ముఖుడు కాగానే అంతర్యమున దర్శన మొసంగెను. ఆత్మానందము అంతర్యమున పొంద దగినదియే గాని బాహ్యమున లభించునది గాదు యనెడి విషయము సృష్ట్యారంభముననే ప్రబోధించబడెను. ప్రథమానుభవము సృష్టికర్తకే అందెను.

పుండరీకం తు తన్మధ్యే ఆకాశో దహరోఽస్తి తత్
స శివః సచ్చిదానందః సోఽన్వేష్టవ్యో ముముక్షుభిః

"హృదయ పద్మమున చిదాకాశము గలదు. అదియే శివ స్వరూపము. సచ్చిదానంద స్వరూపము. దానినే ముముక్షువులు వెదకవలెను" యని పంచ బ్రహ్మోపనిషత్తు తెలిపినది.

బ్రహ్మదేవుడు భగవానుని దర్శించెను. ప్రళయజలమున తామరతూడువలె శ్వేతవర్ణముతో విశాలమైన ఆదిశేషునిపై భగవానుడు శయనించి యుండెను. ఆదిశేషుని వేయిపడగలు ఛత్రమువలె ఆచ్ఛాదనమై యుండెను. ఆయన కిరీటము నందు పొదగబడియున్న రత్నముల కాంతిచే నలువైపుల చీకట్లు అదృశ్యమయ్యెను. ఆ మనోహరమూర్తి వర్ణించుటకు శక్యము గాక శోభించు చుండెను.

ఉ॥ హార కలాప పుష్ప నిచయంబుల జంచ దనర్ఘరత్న కే
యూర కరాంగుళీయక మహోజ్జ్వల బాహు సహస్రశాఖ
లొప్పారగ జూడనొప్పి భువనాత్మక లీల నదృష్టమూల వి
స్ఫారిత భోగివేష్టిత విభాసిత చందన భూరు హాకృతిన్

విధాత యగు బ్రహ్మదేవుడు తన దృష్టినిసారించెను. భగవానుని నాభియందున్న కమలము, జలము, ప్రళయ పవనములు, ఆకాశము తప్ప తనకు మరేమియు గోచరింపకుండెను. సృష్టి చేయుట యందు కోరికను కలిగిన బ్రహ్మదేవుడు భగవానుని స్తుతించెను.

"దేవా! శతవర్షములు ధ్యానించిన పిదప నాకు నీ దర్శన భాగ్యము ప్రాప్తించినది. ఈ గోచరించు జగత్తంతయు నీ కన్నను అన్యము గానేరదు. నీవు అద్వితీయుడవు. విశ్వాతీతుడవు. "ఉపాశ్రితోఽస్మి" నేను నిన్ను శరణుజొచ్చి యున్నాను.

"భువన మంగళ స్వరూపా! శుద్ధ భక్తి గలవారు నీ చరణ కమల సుగంధమును వేదమనెడి గాలిచే పొంది ఆనందించెదరు. నీ చరణ కమలములనే పరమ పురుషార్థముగా గ్రహింతురు. నీ పాదపద్మముల నాశ్రయించు వారిని ధన గృహ బంధువుల కారణముగ లభించు భయ, శోక, దైన్యాదులు బాధించవు. సర్వ శుభములను చేకూర్చి, సమస్త దుఃఖములను పోగొట్టెడి నీ గుణ కీర్తనాదుల యందు చిత్తమును లగ్నమొనర్చలేని దురదృష్టవంతులు విషయ వాసనా సుడిగుండములో పడి పరిభ్రమించు చుందురు.

"పరమపురుషా! నీవు భక్తప్రియుడవు. వారి యభీష్టములను తీర్చుటకు వారుపాసించు రూపములలో వారికి దర్శన మొసగుచుందువు.

నాతిప్రసీదతి తథోపచితోప చారై రా రాధితః సురగణై ర్హృది బద్ధకామైః
యత్సర్వ భూత దయయా సదలభ్య యైకో నానాజనే ష్వవహితః సుహృదన్తరాత్మా!

"భగవాన్! నీవు సర్వభూతముల యందు అంతర్యామివై యున్నావు. సర్వలోకైక బంధువుగా దెలియుచున్నావు. భక్తిలేని వారికి నీవు దుర్లభుడవు. భక్తులైన వారిపై దయజూపి ప్రసన్నుడవగుచున్నావు. కోరికలతో గూడియున్న దేవతలు నిన్ను ఎన్నివిధములుగ ఉపాసించినను నీవు వారికి లభించుట లేదు.

"భక్తవరదా! నీవే ఆత్మవు. పరమాత్మవు. సర్వులకు పరమాశ్రయుడవు. లీలావతారుడవు. పూర్వకల్పము ననుసరించి ప్రపంచమును సృష్టించు శక్తిని నాకు ప్రసాదింపుము. భగవంతా! సృష్టికార్య మొనర్చినను దానియందు అభిమానము కలుగకుండ నన్నాశీర్వదింపుము. జగత్తును విస్తరింపజేయు సమయమున నా వేదవాక్కుల యందు ఉచ్చారణ దోషములు లేకుండునట్లుగ ఆశీర్వదింపుము. అపార కృపాసాగరా! నీ దివ్య దృష్టిని ఈ దీనునిపై ప్రసరింపజేయుము. అమృతమయమగు నీ మధుర వచనముల నాలకించు భాగ్యమును నాకు ప్రసాదింపుము" అని బ్రహ్మదేవుడు ప్రార్థించెను.

సీ॥ జలజాక్ష! యెట్టి విజ్ఞాన బలంబున గల్పింతు నఖిల లోకంబు లోలి
నతజన ప్రియుడవు నాకట్టి సుజ్ఞాన మర్థియై గృపసేయు మయ్య వరద!
సృష్టి నిర్మాణేచ్ఛ జెంది నా చిత్తంబు దత్కర్మ కౌశలి దగిలి యుండి
యును గర్వవైషమ్యమును బొందు కతమున దురితంబు బొరయక తొలగునట్టి

తే॥ వెరవు నాకెట్లు కలుగు న వ్విధము దలచి కర్మవర్తను నను భవ త్కరుణ మెఱసి
తగ గృతార్థుని జేయవే నిగమ వినుత సత్కృపామూర్తి యోదేవ చక్రవర్తి !

యని ప్రార్థించి బ్రహ్మదేవుడు మౌనము వహించెను.

భగవత్సేవానంతరము మౌనముగా కొంతకాల ముండవలెను. పూజకాగానే పరులతో భాషించుట, అన్యకర్మలాచరించుట చేయరాదు. ధ్యానానంతరము వెంటనే లౌకిక విషయములందు పాల్గొనరాదు. దైవసేవ పూర్తికాగానే కొంత సమయము మౌనమును పాటించాలి. అప్పుడే ఆచరించిన సేవ సఫలమగును.

మధుసూదనుడగు పరమాత్మ బ్రహ్మదేవునకు ప్రసన్నుడయ్యెను. సృష్టిని చేయుమని ఆజ్ఞ నొసగెను.

"వేదగర్భా! విషాదమును వీడుము. మఱల తపస్సు చేయుము. తద్వారా నీవు నా నిజ వైభవమును గాంచగల్గెదవు. ఈ లోకముల యందు నిండియున్న నన్ను గాంచగల్గెదవు. అంతేగాదు. సమస్తలోకములు నా యందెలా ఉన్నవో గూడా చూచెదవు.

యదాతు సర్వభూతేషు దారుష్వగ్ని మివ స్థితమ్
ప్రతి చక్షీత మాం లోకో జహ్యాత్ తర్హ్యేవ కశ్మలమ్

"కాష్టముల యందున్న అగ్నివలె సర్వభూతముల యందు వసించియున్న నన్నెవ్వరు దర్శింతురో వారు మోహము నుండి విడిపడి తరింతురు.

"బ్రహ్మదేవా! అనేక విధములైన జీవులను నీవు సృష్టించినను నీ చిత్తము మోహితము గాకుండా నేను నిన్ను ఆశీర్వదించుచున్నాను. విధాతా! నేను నీకు కారణుడను. నీ మనస్సును నాయందు లగ్న మొనర్చితివి గాన నీవు ఆద్యఋషివైతివి. నీకు శుభము కలుగుగాక!

అహమాత్మాఽఽత్మనాం ధాతః ప్రేష్ఠస్సన్ ప్రేయసామపి
అతో మయి రతిం కుర్యాద్దేహాదిర్యత్కృతే ప్రియః

"బ్రహ్మదేవా! ఉపాధులను ధరించిన జీవులకు నేను ఆత్మనై యున్నాను. అలాగే ప్రియాతి ప్రియమైన వస్తువులలో ప్రియతమమైనది, నిర్దోషమైనది ఏదిగలదో అదియును నేనే. నా వలననే దేహాదులు ప్రియముగ గోచరించుచున్నవి. అందుచేత నన్నే ప్రేమింపుము" యని పలికెను.

ఈ విధముగా పద్మనాభుడైన నారాయణుడు బ్రహ్మదేవునకు ఆశీస్సుల నందించి అంతర్హితు డయ్యెను. తదనంతరము బ్రహ్మదేవుడు భగవానుని అనుగ్రహముచే సృష్టికార్యమును నిర్వహించెను.

ప్రారంభమున తమస్సును, ఆ తరువాత కామక్రోధ మోహములను సృష్టించెను. అవి సృష్టికర్తనే మోహింప జేయుచుండెను. అదిగాంచి బ్రహ్మదేవుడు అసంతృప్తు డయ్యెను. తరువాత చిత్తమును భగవద్ధ్యానము నందు నిలిపి జితేంద్రియులైన సనక, సనందన, సనాతన, సనత్కుమారు లను నల్వురు పుత్రులను సృజించెను. తదనంతరము

వారిని సృష్టికార్యము నిర్వహింపుమని బ్రహ్మ తెలిపెను. నివృత్తి ధర్మాచార్యులగు ఆ మహాత్ములు అందులకు ఇష్టపడకుండిరి.

బ్రహ్మదేవునకు నిగ్రహింపను వీలులేని విధముగా క్రోధము కలిగెను. ఆ క్రోధము కనుబొమ్మల నుండి బాలుని రూపమున బయల్వెడలెను. ఆ బాలుడు పెద్దగా విలపించెను. అతిగా రోదించినందున అతడు రుద్రుడని పిలువబడెను. సృష్టికార్యమును నిర్వహింపమని బ్రహ్మదేవుడు తన కుమారుడైన రుద్రుని ఆజ్ఞాపించెను.

రుద్రుడు సృష్టికార్యమును చేసెను. ఆయనవలన జనించిన రుద్రులు సృష్టిని భక్షింపసాగిరి. ఈ విషయమును గాంచి బ్రహ్మ సంశయమున బడెను. తన కుమారుడైన రుద్రుని బిలిచి ఇలా పలికెను: "రుద్రుడా! సంహారకులగు వారిని సృష్టించి నందున సృష్టి బీభత్సమాయెను. ఇలాంటి సృష్టిని ఇకమీదట చేయకుము. నీవు మరల తపమాచరించి శుభకరమగు సృష్టిని చేయుము" అనెను.

తపస్సు చేయుటకు రుద్రుడు వనములకేగెను. సృష్టికార్యమును గూర్చి అమితముగ ఆలోచించుచున్న బ్రహ్మదేవునకు పదిమంది పుత్రులు కలిగిరి. వారు 1.మరీచి, 2.అత్రి, 3.అంగిరసుడు, 4.పులస్త్యుడు, 5.పులహుడు, 6.క్రతువు, 7.భృగువు, 8.వశిష్ఠుడు, 9.దక్షుడు, 10.నారదుడు.

బ్రహ్మదేవుని నాలుగు ముఖముల నుండి నాలుగు వేదము లుద్భవించినవి. ఇంద్రాది దేవతలు ఆయన దేహమునుండి బయల్వెడలిరి. అయినను సృష్టికార్యము సంతృప్తికరముగ విస్తరించలేదు. దైవము అనుకూలించుట లేదని బ్రహ్మదేవు డాలోచించుచుండెను. ఈలోగా ఆయన మూర్తి రెండుగా విభక్తమాయెను. ఈ విభక్త రూపమునే కాయము యని విజ్ఞులు పిలిచిరి. ఈ విధముగా శరీరమునకు కాయమనెడి పేరు కలిగెను.

విడిపడిన ఈ రెండు మూర్తుల నుండి స్త్రీ పురుషు లుత్పన్నులైరి. ఆ ఇరువురిలో సార్వభౌముడగు స్వాయంభువ మనువు పురుషుడు కాగా, ఆయన పట్టమహిషియగు శతరూప స్త్రీ ఆయెను. అప్పటి నుండి మైథునము ఆచారమై, ప్రజలు వృద్ధిచెంద సాగిరి.

స్వాయంభువ మనువు శతరూప యందు ఐదుగురు సంతానమును వృద్ధిచేసెను. ఆ ఐదుగురిలో ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు పుత్రులుకాగా, ఆకూతి, దేవహూతి, ప్రసూతి యనుముగ్గురు పుత్రికలైరి.

ఆకూతిని ఋచి యను ఋషి కిచ్చెను. దేవహూతిని కర్దముని కిచ్చెను. ప్రసూతిని దక్షునకిచ్చెను. వీరి సంతానము ద్వారా సృష్టి వృద్ధిచెందినది.

వరాహావతారము

స్వాయంభువ మనువు తన భార్యయగు శతరూపతో గూడి బ్రహ్మదేవునకు నమస్కరించి ఇలా పలికెను: "తండ్రీ! నీవు జన్మదాతవు. భూతపోషకుడవు. నీవు

ఆప్తకాముడవు. మేము నీ సంతానము. నీకు మేము చేయవలసిన సేవలను అనుగ్రహింపుము. ఇహ, పర సాధనమగు కార్యము నొసగి మమ్ముల నాశీర్వదించుము" అనెను.

బ్రహ్మదేవుడు ఇలా పలికెను: "కుమారా! మీకు శుభము కలుగుగాక! నీవు సజ్జన సంతానమును వృద్ధిచేయుము. ధర్మబద్ధముగ భూమిని పాలింపుము. యజ్ఞముల ద్వారా దేవతలను సంతోషపెట్టుము. ప్రజలను సంతోషపెట్టుము" అనెను.

"తండ్రీ! నాకు, ప్రజలకు నివాసస్థానమగు భూమి ప్రళయ జలమున మునిగియున్నది. దానిని పైకి తెచ్చు ప్రయత్నమును చేయుము. నీ ఆజ్ఞను నేను తప్పక నెరవేర్చెదను" అని స్వాయంభువ మనువు సమాధాన మొసగెను.

జల మధ్యమున మునిగియున్న భూమిని ఎలా వెలికి తీయవలెనో అవగతము గాక బ్రహ్మదేవుడు ఆలోచించుచుండెను. ఇంతలో ఆయన నాశికారంధ్రము నుండి వరాహరూపములో బిడ్డ డుదయించెను. అంగుష్ఠ ప్రమాణములో అవతరించిన వరాహమూర్తి చూచుచుండగనే ఏనుగంత పెరిగిపోయెను. బ్రహ్మదేవుడు ఈ విచిత్రమును విస్మయముతో విలోకించుచుండెను. ఇంతలో వరాహమూర్తి కొండంత అయ్యెను. గంభీరముగ గర్జించెను. బ్రహ్మాది దేవతల నుద్ధరించుటకై జలములోనికి ప్రవేశించెను. భూమిని తెచ్చుటకు భూపతి వెడలెను.

పర్వతరూపుడైన వరాహమూర్తి సాగరమున పడగానే ఆ వేగమునకు సముద్రము ధ్వనిచేయుచు రెండుగా చీలిపోయెను. భయకంపితుడైన సాగరుడు తన కెరటము లనెడి కరములను చాచి "యజ్ఞదేవా! నన్ను రక్షింపుము" యని ప్రార్థించెను. వరాహమూర్తి అపార జలరాశిని ఛేదించుకొంటూ రసాతలమున కేగెను. అచ్చట సర్వజీవుల కాశ్రయమైన భూమిని గాంచెను. వెంటనే భూమిని తన కోరలపై ధరించి వచ్చుచున్న వరాహమూర్తి వైభవోపేతముగ గన్పట్టుచుండెను.

భగవానుడు భూమిని తెచ్చునపుడు హిరణ్యాక్షుడను దైత్యుడు ఆయనమీదికి దండెత్తి వచ్చెను. మృగరాజు గజరాజును వధించినట్లు, వరాహమూర్తి హిరణ్యాక్షుని సంహరించెను. బ్రహ్మాదులు వరాహమూర్తిని భగవానునిగ తెలిసికొని మంత్రముల ద్వారా స్తుతించిరి.

సీ॥ దేవ! జితం జితం! తే పరమేశ్వర జిత యజ్ఞభావన శ్రుతి శరీర!
కారణ సూకరాకారుండ వగు నీకు నతిభక్తి మ్రొక్కెదమయ్య వరద!
భవదీయ రోమకూపము లందు లీనంబు లై యుండు నంబుధు లట్టి యధ్వ
రాత్మకమై తనరారు నీ రూపంబు గానంగరాదు దుష్కర్మ పరుల
తే॥ కట్టి నీకు బ్రణామంబు లాచరింతు మఖిల జగదేక కీర్తి దయానువర్తి
భవ్య చారిత్ర పంకజ పత్ర నేత్ర చిరశుభాకర యిందిరా చిత్తచోర!

అజితుడా! యజ్ఞరూపుడా! వేదమయ శరీరుడా! నీకు నమస్కారము. నీ కీర్తి అమోఘమైనది. దేవా! సర్వవేదములను నీవు రోమకూపముల యందు నిలిపితివి. నీ

చర్మము నందు గాయత్ర్యాది ఛందము లున్నవి. రోమములలో బర్హిస్సులున్నవి. నేత్రముల యందు ఆజ్యంబులున్నవి. నీ తుండంబున యజ్ఞపాత్రము లున్నవి. ఉదరమున ఇడాపాత్ర యున్నది. శ్రవణ పుటములలో చమస మనెడి సోమపాత్రయున్నది. నీ చర్వణమే అగ్నిహోత్రమై యున్నది. నీ దేహము నందలి సంధులన్నియు సర్వయజ్ఞ స్వరూపములై యున్నవి. నీవు జ్ఞానప్రదాతవు. భక్త సులభుడవు. నీ వైభవము అగమ్యము. అపారము. నీకు మా నమస్కారము" యని బ్రహ్మాది ఋషులు యజ్ఞ వరాహమూర్తిని స్తుతించిరి.

రసాతలము నుండి భూమిని పైకి తెచ్చి జలములపై నుంచి వరాహమూర్తి అంతర్హితు డయ్యెను. సర్వులు వరాహమూర్తిని కీర్తించిరి.

క। హవరూపివి హవనేతవు హవభోక్తవు నిఖిల హవ ఫలాధారుడవున్
హవరక్షకుడవు వగు నీ కవితథముగ నుతులొనర్తు మయ్య ముకుందా!

"మహర్షీ! వరాహ భగవానునకు, హిరణ్యాక్షునకు యుద్ధమెందులకు జరిగెను? ఎలా జరిగెను? ఈ విషయమున హరి కథయందు నా మనస్సు తృప్తి చెందుట లేదు. హిరణ్యాక్షుడెవరు? వరాహమూర్తిపై అతడు ఎందులకు దండెత్తెను? ఈ విషయము నంతటిని నాకు సవిస్తరముగా తెలుపుము" అని విదురుడు మైత్రేయు నడిగెనని శ్రీశుకుడు పరీక్షిత్తునకు చెప్పెను.

"వరాహము" యనునది శుభకరమైన నామము. **'వర'** యనగా ఉత్కృష్టమని అర్థము. **"అహము"** అనగా రోజు అని భావము. వరాహమనగా శుభదినమని అర్థము. అనగా జ్ఞానము అవతరించురోజు యని భావము. జ్ఞానరూపమైన వరాహమూర్తి ఆవిర్భవించగనే, సూర్యోదయముతో అంధకార మదృశ్య మగునట్లు, అజ్ఞానరూపుడైన హిరణ్యాక్షుడు అంతరిస్తాడు.

విదురుని పలుకుల నాలకించిన మైత్రేయుడు ఇలా పలికెను: "విదురా! చక్కని ప్రశ్న నడిగితివి; ఈ కథాంశము అమృతమయ మైనది. ఇది మృత్యువును హరించును. నారదుని ద్వారా హరి మహిమ నెరిగిన ధృవుడు విష్ణులోకమున కేగెను. నీవు ఇప్పుడడిగిన అపూర్వ విషయమును పూర్వము బ్రహ్మదేవుడు దేవతలకు చెప్పగా నేను వినియుంటిని. ఆ విషయమును నీకు తెలిపెదను. ఆలకింపుము" అనెను.

దితి గర్భవతి యగుట

దితి-మరీచి మహర్షి నందనుడగు కశ్యపుని అర్ధాంగి. కశ్యపునికి దితి, అదితు లను ఇరువురు పత్నులు. అదితికి చక్కని సంతానము కలిగినది. దితికి సంతానము లేకుండెను. దితికి సంతాన వాంఛ కలిగెను.

దితి యనగా ద్వైతభావన యని అర్థము. ద్వైతబుద్ధి ఎన్నడైనను కోరికల పుట్టయే. అదితి అభేద రూపమైనందున దివ్యమైన సంతానమును విశేషముగ కలిగియుండెను. అనగా అన్ని రూపములను తన రూపముగనే అనుభవించు చుండును.

ఒకనాటి సంధ్యాసమయము. కశ్యపుడు పయోహోమముచే యజ్ఞపతియగు విష్ణువును యాగశాలలో పూజించుచుండెను. అదే సమయానికి కశ్యపుని అర్ధాంగియగు దితి మనస్సులో సంతానాభిలాష కలిగినది. కామాతురతతో దితి కదలిపోవసాగినది. మన్మథ బాణములచే తీవ్రముగా పీడింపబడినది. చక్కగా అలంకరించుకొని సంభోగార్థమై పతిని సమీపించినది.

కశ్యపుడు ధ్యానమగ్నుడై యుండెను. కామాంధురాలైన దితి భర్తను సమీపించి ఇలా పలికెను: "కీర్తిమంతుడా! మదపుటేనుగు విజృంభించి అరటిచెట్టును పీడించునట్లు, మదనుడు పుష్పబాణము నెక్కుబెట్టి నీతో సంగమించుటకు నన్ను బాధించుచున్నాడు. సంతానవతి యగు సవతి వైభవమును గాంచి వెలితిహృదయముతో దుఃఖించుచున్న నన్ను సుఖపెట్టుము. సంతానవతిని గావింపుము. నీలాంటి పుత్రుని ప్రసవించగలిగిన స్త్రీ లోకపూజితురాలగును.

క॥ పతి సమ్మానము వడసిన సతులకు నభిమత పదార్థ సంసిద్ధియు మా
ర్జిత శయము గలిగి లోకస్తుతమై చెలువారు చుండు జువ్వె మహాత్మా!

"దివ్యాత్మా! భర్తయే ధర్మపత్ని వలన పుత్రుడుగా జన్మించును. ఒక దీపమును మరియొక దీపము వలన వెలిగించినచో శిఖ ఒక్కటెయైనను దీపములు రెండుగా ప్రకాశించును గదా! మహాత్మా! కమలలోచనుడా! నా కోర్కెను దీర్చుము. మహాత్ములవద్ద సమర్పించిన ప్రార్థనలు వ్యర్థములు గావు. నా మనోభీష్టమును ఈడేర్చుము;" అనెను.

దితి మదిలో బీభత్సముగ విజృంభించియున్న మదనుని కశ్యపుడు గనినవాడై "దేవీ! నీ కోర్కెను తప్పక నెరవేర్చెదను. పతిని తృప్తి పరచుట పతి యొక్క ధర్మము. ధర్మాచరణమునకు సహకరించుట వలన భార్య ధర్మపత్నియైనది. అట్టి పుణ్యశీలను తృప్తి పరచుట భర్తకు తక్షణ కర్తవ్యము. గృహేశ్వరీ! నీ వలన నా జన్మ చరితార్థమైనది. నీవు నాకు చేసిన హితమును నేను జన్మ జన్మలకు మరువలేను. పుత్రుని బడయుట దంపతుల ధర్మము. నేను ప్రసవించుటకు అసమర్థుడనైనను ప్రసాదించుటకు సమర్థుడనై యున్నాను.

"దేవీ! నిన్ను తృప్తి పరచుట నా ధర్మము. నీవు సుపుత్రుని గని సంతసించినచో నా మది ఎంతగనో పొంగిపోవును. పుత్రుని వలన నీ కీర్తి ఇనుమడించినచో అది గాంచి నేను సంతుష్టుడనగుదును. ప్రాణేశ్వరీ! అలాగే నీకు అపకీర్తి లభించినచో నేను తప్పక దుఃఖింతును. నిన్ను లోకము నిందించినచో నేను శోకము ననుభవింతును. కనుక నామాట వినుము. కొంతకాలము నిరీక్షింపుము. ఇది సాయంసంధ్యా సమయము.

"మానినీ! ఘోరదర్శనమును ప్రసాదించు ఈ సమయము కడు ఘోరమైనది. భూతనాథుడగు మహేశ్వరుడు ప్రమథగణ పరివేష్టితుడై, వృషభారూఢుడై గగనమున

చరించుచుండును. ఇది రతికి అనుకూల సమయముకాదు. పైగా పాపము కూడాను. నా మాటను గౌరవింపుము. ఒక్క ముహూర్త కాలము సహనము వహింపుము. ఆ తరువాత నీ కోర్కెను నా విధిగా తీర్చెదను. ఈ సమయము రతిక్రీడకు నిషేధమని మరువకుము" యని కశ్యపు డనెను.

మ॥ తరుణీ యొక్క ముహూర్త ముండు మిది సంధ్యాకాల మిక్కాల మం
దరయన్ భూత గణావృతుం డగుచు గామారాతి లీలన్ వృషే
శ్వర యానంబున సంచరించుట నభావ్యం బయ్యె నీ యుగ్రవే
ళ రమింపంగ నిషిద్ధ కర్మమగు నేలా ధర్మమున్ వీడగన్

సాయంకాల సమయము దీపారాధనకు అనుకూలమైన సమయము. ఈ సమయముననే ప్రకృతి తేజోరూపులగు సూర్యచంద్రులు క్షీణించి యుందురు. సూర్యుడు అస్తమించుచుండగా చంద్రుడు అల్పకాంతితో ఉదయించుచుండును. "మనసో చంద్రమా" మనస్సునకు చంద్రుడు అధిష్టానదేవత. సూర్యుడు బుద్ధికి ప్రకాశము నిచ్చును. ఈ ఉభయులు కాంతిహీనులై యున్న సాయంసంధ్యా సమయము ప్రమాదమైనది. ఈ సమయమున కామము మనోబుద్ధులను పట్టిపీడించును. సంధ్యాసమయమున కామవశమైన మనోబుద్ధులు నిశా సమయమున కామాజ్ఞకు తలవంచి చరించును. అందుచేత సాయంకాలము భగవానుని సాయమును బొందవలెను. దీపారాధనము చేయాలి. దీపము బాహ్య చీకట్లను పోగొట్టును. ఆంతర్యములో కీర్తనా దీపమును వెలిగించినచో ఆంతర్యములోని అజ్ఞాన చీకట్లు గూడా అంతరించును. సత్సంగ సంకీర్తనాదుల ద్వారా దారితప్పెడి మనోబుద్ధులను నిగ్రహించుకోవాలి.

ఈ నాడు ఈ సదాచారములన్నీ సమాజములో లోపించాయి. అందుచేతనే అభ్యుదయము లోపభూయిష్టమైనది. బాహ్యమున దీపములను వెలిగించి ప్రార్థన ద్వారా ఆంతర్యములో వెలిగించుకొనుట మన సంప్రదాయము. ఈ నాడు సంప్రదాయమే తారుమారైనది. సాయంత్రమయ్యే సరికి ఇంటిలో దీపములను వెలిగించకుండా తలుపులు మూసి పివిమాల కెళ్ళి చీకటిలో గూర్చుని కల్పిత కష్టసుఖాలను పంచుకొను చుందురు. మనశ్శాంతి పేరిట మహావ్యథకు గురియగుచున్నారు.

సాయంకాల సమయమును పవిత్ర మొనర్చుకోవాలి. సంధ్యా సమయాలను ఎవరు పవిత్రముగా మంచుకొందురో వారు వందనీయులగుదురు. ప్రాతఃస్మరణీయు లగుదురు.

ఆహారం మైథునం నిద్రాం సంధ్యాకాలేషు వర్జయేత్

"భుజించుట, భార్యతో రమించుట మరియు నిద్రించుట యను ఈ మూడు కార్యములను సంధ్యాసమయాలలో చేయగూడదు" యని శంఖస్మృతి తెలిపియున్నది.

కశ్యపుని మాటల నాలకించిన దితి హృదయం నిరాశతో నిండిపోయెను. ముఖము విషాద గ్రస్తమాయెను. అది గాంచిన కశ్యపుడు దితిని సమాధాన పరచుచు ఇలాపలికెను:

"సాధ్వీ! శంకరుడు జీవులను వీక్షించుచు విహరించు ఈ సమయము ఆయన అనుగ్రహమును బడయదగినదియే గాని ఆగ్రహమును బొందదగినది కాదు. భగవానుడైన ఈశ్వరుని అవమానించు వారికి అమంగళ మేర్పడును. దేవీ! శివుడు పిశాచము వలె చరించునని కొందరు ఆ దివ్యాత్ముని పరిహసించు చుందురు.

"శ్మశానమే ఆయన నివాసస్థలము. బిచ్చమెత్తు కొనుటయే ఆయన వృత్తి ధర్మము. ఈ దేహము చివరి క్షణాన భస్మమే యగునని తెలుపుటకే ఆయన భస్మధారియై యుండును. దేహాత్మవాదులు భగవానుని దివ్యలీలలను గాంచలేరు.

క॥ ధరశునక భోగ్యమున నిహపర దూరమునైన తనువు పాథేయముగా
నెటినమ్మి వస్త్ర మాల్యా భరణంబు లలంకరించు పామరజనులున్

"మానినీ! పామరులు ఈ దేహమును స్థిరమని నమ్ముదురు. దేహమే ఆత్మయని భ్రమించి ఒకనాడు కుక్కలు నమిలే ఈ శరీరమును ఆభరణములచే అలంకరించుకొందురు. గంధాద్యను లేపనముల ద్వారా శోభింప చేయుదురు. దేవీ! ఈ దేహమును పాలింపవలెనే గాని లాలింపకూడదు;" యని హితవు చెప్పెను.

ఇచ్చట భార్యభర్తలకు కామభోగమును నిషేధించలేదు. భోగసమయమును నిషేధించుట జరిగినది. మహర్షి యనబడిన వాత్స్యాయనుడు కామసూత్రములను రచించెను. కామము గర్హించదగిన దైనచో ఆయన ఎందులకు రచించెను? మహర్షులు అంతర్ముఖులై గ్రహించి అనుగ్రహించిన సత్యములను ఆచరించినపుడే మానవాళికి శుభము చేకూరును.

నోపేయా త్పురుషో నారీం సంధ్యయో ర్న చ పర్వసు

"త్రిసంధ్యల యందును, పర్వదినముల యందును పురుషుడు స్త్రీతో కలియరాదు" అని వాత్స్యాయనుడు కామసూత్రములలో తెలిపెను. మహర్షులు బోధించిన ధర్మముల నాచరించువారు శుభచరితు లగుదురు.

వివాహ సంస్కార విషయములో కూడా కామము ధర్మమునకు జోడింపబడియే యున్నది. కన్యాదాత యగు వ్యక్తి నూతన వరుని ఈ క్రింది విధముగా శాసిస్తాడు.

దాతా! ధర్మార్థ కామేషు త్వయైషా నాతిచరితవ్యా

"ఓ పెండ్లికుమారా! నీవు వివాహానంతరము ధర్మార్థ కామములను ఈమెతో కలిసి సమానముగా స్వీకరించవలెను." ఇచ్చట కేవలం అర్థకామములకే ప్రాధాన్య మివ్వబడలేదు. ధర్మమునుండి వేరుపడిన అర్థకామాలు ఫలప్రదములు గానేరవు. కనుక కామభోగము నందు గూడా ధర్మచ్యుతి జరుగరాదని శాసించుట జరిగినది. మామగారి శాసనమునకు తలయొగ్గి **"నాతిచరామి"** యని నూతన వరుడు మామగారికి మాట ఇచ్చుచున్నాడు.

ధర్మా విరుద్ధో భూతేషు కామోఽస్మి భరతర్షభ

"ప్రాణుల యందు ధర్మమునకు వైరుధ్యములేని కామము నేనైయున్నాను" అని భగవానుడు భగవద్గీతలోని విజ్ఞాన యోగము నందు తెలిపియున్నాడు. కనుక ధర్మమునకు దూరమైన కామము జీవితమును పాడుచేయును.

కశ్యపుని సలహా దితికి రుచించలేదు. దారితప్పిన మనస్సు సద్భావాలను గ్రహించదు. కామ వేగముతో కదలిపోయిన బుద్ధి సత్య సందేశముల నాలకించదు. ఆవేశానికి వశమైన దితి భర్తమాట నాలకించక వేశ్యవలె ప్రవర్తించినది. సిగ్గు విడచినదియై బ్రహ్మర్షియగు కశ్యపుని పంచెను లాగెను. నిషిద్ధకర్మ యందు సన్నద్ధమైయున్న దితి యొక్క మతి నెరిగిన కశ్యపుడు గతిని సరిజేయుమని పశుపతిని ప్రార్థించి రతి కర్మయందు వర్తించెను.

తదనంతరము కశ్యపమహాముని స్నానాదుల నాచరించెను. ప్రాణాయామాదుల నిర్వర్తించెను. గాయత్రిని జపించెను. ఇంతలో దితి అక్కడికి అరుదెంచి తలవంచుకొని నిలబడెను. సిగ్గుతో కుంచుకపోయెను.

"బ్రహ్మర్షీ! భూతనాథుడగు పశుపతికి అపరాధము చేసితిని. నిజపతి మాటను త్రోసిపుచ్చితిని. క్రుద్ధుడైన రుద్రుడు నా గర్భమును పాడుచేయునేమో యని భీతిల్లుచున్నాను. స్త్రీల విషయములో నిర్దయులైన వారుగూడా దయను జూపుదురు. శివుడు ప్రేమస్వరూపుడు. ఆయన దయను అర్థించుచూ ఆ మహితాత్ముని హృత్పూర్వకంగా ప్రార్థించుచున్నాను" యని పశ్చాత్తాపముతో దితి పలికెను.

"దితీ! కామాతురతలో నీవు దారితప్పి నన్ను గూడా కంటకముల బాటలో నడిపించితివి. ఈ అపరాధమునకు ఫలితముగ నీ గర్భమున ఇరువురు రాక్షసులు జన్మింతురు" అని కశ్యపు డనెను. దారి తెన్ను తెలియక పశుప్రాయులవలె సంగమించు వారి గర్భమున రాక్షస ప్రవృత్తిగల దౌర్భాగ్యులు పుట్టుదురు. ఈ సత్యవార్త నెరిగి దితి దుఃఖించసాగెను.

"దితీ! నీ ఇరువురు పుత్రులు దీనులను చంపుచుందురు. స్త్రీలను చెఱబట్టుదురు. మహాత్ములకు కోపమును కలిగింతురు. ఇది గాంచిన శ్రీమహావిష్ణువు వరాహనృసింహ రూపములతో అవతరించి నీ ఇరువురు పుత్రులను సంహరించును" యని కశ్యపుడనెను. శ్రీనాథుని చేతిలో మరణించే భాగ్యము తన పుత్రులకు కలిగినందుకు దితి సంతసించెను. ద్వైతబుద్ధిలో అంతరేక్షణ జరిగి సత్యావలోకనము జరిగినపుడు అట్టి బుద్ధి ముదమొందును.

"దితీ! స్వయంకృతాపరాధము వలన నీకు దుఃఖము ప్రాప్తించింది. పశ్చాత్తాపమువలన వివేక ముదయించింది. తద్వారా నీవు శ్రీహరిని, హరుని, నన్ను భక్తితో ప్రార్థించితివి. అందుచేత నీ పుత్రుని యొక్క పుత్రుడొకడు భాగవతుడగును. అతడు భక్తులకు ఆదర్శ ప్రాయుడగును. నిర్మల కీర్తి మంతుడగును. అతడే ప్రహ్లాదుడు. పరమ భక్తుడు. మహాత్ముడు. జితేంద్రియుడు. చంద్రుడు తాపమును తొలగించునట్లు ప్రహ్లాదుడు జగత్తునందలి దుఃఖమును హరించును." అని కశ్యపుడు చెప్పెను. తన పుత్రులు శ్రీహరి

పవిత్ర హస్తములలో మరణింతురనియు, తన పౌత్రుడు మహాభక్తు డగుననియు విని దితి సంతృప్తి చెందెను. దితి గర్భమును ధరించెను.

సనకాదులు జయవిజయులను శపించుట

దితి గర్భమున యున్న కశ్యపుని తేజము దేవతలకు కీడు కలిగించును. ఈ కారణముచే దేవతలు ఆ తేజమును నష్టపరచుదురేమో యని దితి శంకించినదియై నూరు సంవత్సరముల వరకు గర్భమును ధరించియుండెను. తత్ఫలితముగా దిక్కులు అంధకారము లగుచుండెను. దేవతల కాంతి క్షీణింపసాగెను. కారణము నన్వేషింపలేని దేవతలు బ్రహ్మదేవుని సమీపించిరి.

"దేవా! నీవు సర్వజ్ఞుడవు. నీకు తెలియని దేదియును ఉండదు. దితియొక్క గర్భము వృద్ధి చెందుచుండగా దిక్కులు, దిక్పాలకులు కాంతిహీనము లగుచున్నారు. మాకు శుభములను గల్పింపుము. పీడితులమైన మమ్ము రక్షింపుము" యని దేవతలు బ్రహ్మదేవుని ప్రార్థించిరి. అరవింద నందనుడగు బ్రహ్మదేవుడిలా పలికెను:

"సురులారా! మీకు పూర్వజులు, నా మానసపుత్రు లగు సనక సనందనాదులు సంసారవిరక్తులై విహరించుచు ఒకనాడు వైకుంఠమునకు వెడలిరి. పరమానంద భరితులైన ఆ మునులు శ్రీహరిని దర్శించుటకు వైకుంఠ ద్వారములను దాటుచుండిరి. ఆఱు ద్వారములను దాటిరి. ఏడవ ద్వారము వద్ద ద్వారపాలకులు నిలబడియుండిరి. మునులు ఏడవ ద్వారమున ప్రవేశించుచుండగా అచ్చట నిలబడియున్న ఇరువురు ద్వారపాలకులు మునులను అడ్డగించిరి;" యని చెప్పసాగెను.

సనకాది మునులు దిగంబరులై యుండిరి. దిగంబరులనగా కౌపీనధారులని భావము గాదు. దేహాభిమానమును త్యజించినవారని భావము. దేహాభిమానులు దైవసన్నిధికి చేరలేరు. మునులు వృద్ధులైనను ఐదు సంవత్సరముల బాలురవలె కన్పించుచుండెడివారు. జ్ఞానములో పండిన వారెప్పుడు చిన్నపిల్లలవలె చరించుచుందురు. బాలురవలె రాగద్వేషములు లేనివారై అమాయకులుగ గోచరించుచుందురు. విజ్ఞులైనందున వినయము గల్గియుందురు.

తానూ వీక్ష్య వాతరశనాంశ్చ తురః కుమారాన్
వృద్ధాన్ దశార్ధవయసో విదితాత్మతత్వాన్
వెత్రేణ చస్ఖలయతామత దర్హణాంస్తౌ
తేజో విహస్య భగవత్పతి కూలశీలౌ

"దిగంబరులు, వయస్సులో పెద్దవారైనను ఐదు సంవత్సరముల వయస్సు గలవారి వలె నగపడువారును, విదితాత్ములును అగు సనకాదులను జూచి, వారి కీర్తిని లెక్కింపక భగవానునకు అవిధేయులై చరించు ఆ ద్వారపాలకులు వారిని తీవ్రముగా అడ్డగించిరి."

వైకుంఠము భగవంతుని స్థానము. అచ్చట దురహంకారము, దౌర్జన్యము, అవిధేయత, పక్షపాతము చోటు చేసుకోగూడదు. వైకుంఠుడైన నారాయణు డుండుటచేత అది వైకుంఠమని పిలువబడినది.

వికుంఠం జ్ఞానం స్థానం వాస్తి స్వరూపత్వే నాశ్రయత్వేన వాస్య

"వికుంఠమనగా జ్ఞానము. అది స్వరూపముగా గలవాడగుటచే నారాయణుడు వైకుంఠు డాయెను."

జ్ఞానరూపుడైన భగవానుడు వసించుచోట అజ్ఞాన ప్రదర్శనలు జరుగకూడదు. అహంకార దర్పాదులు ప్రదర్శింపరాదు. అభేదదర్శనము లభించుచోట భేదము అననుసరణీయము. ఆలయపూజారులు సందర్శకులైన భక్తులలో భేదమును గాంచుచుందురు. కొందరికి తీర్థము ప్రాప్తిస్తే మరికొందరికి తిట్లు లభిస్తాంటాయి. ఆలయ ధర్మకర్తలు గూడ అలాగే ప్రవర్తించుచుందురు. ఆలయాలలో భేద భావములను జూపువారు హీనజన్మలలో పడెదరని శాస్త్ర నిర్ణయము.

ఆనంద రామాయణములో ఒక విషయము చెప్పబడినది. రామలక్ష్మణులు నడచిపోవు చుండిరి. మార్గములో ఒక శునకము విలపించు చుండుటను గాంచిరి. ఆ కుక్క ఎందులకు అలా దుఃఖించు చున్నదో తెలిసికొని రమ్మని రాముడు లక్ష్మణుని పంపెను. లక్ష్మణుడు ఆ కుక్కను సమీపించి కారణమడిగెను. అల్లంతదూరాన కూర్చొని యున్న సన్యాసిని జూపి అతడు తనను కట్టెతో కొట్టెనని శునకము సమాధాన మొసగెను.

శునకమును ఎందులకు కొట్టితివి? అని రాముడు సన్యాసిని ప్రశ్నించెను. కొట్టవలెనని భావన కలిగినందున కొట్టుట జరిగినదని సన్యాసి సమాధానమొసగెను. సర్వసంగ పరిత్యాగియైన ఆ సన్యాసి పలికిన దారుణ వచనములు రామునికి బాధను కలిగించినవి. సన్యాసిని శిక్షించుటకు రాముడు నిర్ణయించుకొనెను. అతనికి ఎలాంటి శిక్షను విధింపవలెనో తెలుపుమని రాముడు కుక్కను అడిగెను. అతనిని దేవాలయ ధర్మకర్తగా నియమించమని శునకము చెప్పెను.

రామునకు విస్మయము కలిగెను. తనను దారుణముగా హింసించిన వానిపై శునకము అపారమైన దయను చూపుటకు కారణమేమిటో అవగతము గాకుండెను. ఈ విషయమును శునకమునే రాముడడిగెను.

"రామా! నీవు సర్వజ్ఞుడవు. నీకు తెలియని దేమున్నది? నేను గత జన్మలో దేవాలయ ధర్మాధికారిగా యుంటిని. అక్కడ యొనర్చిన ఘనకార్యముల ఫలితముగా శునకజన్మనెత్తి అందరిచేత దెబ్బలు తినుచుంటిని. కనుక ఆ సన్యాసిని గూడా ఆలయ ధర్మకర్తగా నియమింపుము." యని శునకము తెలిపెను. కనుక ఆలయాలలో దోష ప్రవర్తన యుండరాదు. అందరిని సమముగా చూడవలెను.

వైకుంఠ ద్వారము వద్ద ద్వారపాలకులు మునులను అడ్డగించిరి. అంతేగాదు. పరమాత్మకు అవిధేయులై యుండిరి. ఆలయాలలో, ఆశ్రమాలలో జీవించువారు వినయశీలురై యుండాలి. విధేయులై వర్తించాలి. సత్ప్రవర్తన గలవారై సందర్శకులను తృప్తి



సనకాది మునులు జయ విజయులను శపించుట

పరచాలి. కఠినంగా ప్రవర్తించ కూడదు. పూర్వజన్మ పుణ్యఫలముగ పవిత్ర స్థలాలలో చరించే అదృష్టం కలుగుతుంది. దురహంకారంతో ఈ మహదవకాశమును దూరం చేసుకొనువారు సద్గతిని పొందలేరు. అవిధేయత అనర్థానికి దారితీస్తుంది.

వైకుంఠంలో సమత్వముండాలేగాని విషమత్వ ముండకూడదు. వైకుంఠములో శ్రీదేవి అతి సామాన్యముగా యుండును. భూలోకమున సర్వులు లక్ష్మీదేవిని పూజించు చుందురు. కానీ వైకుంఠములో లక్ష్మీదేవి నారాయణమూర్తి పాదము లొత్తుచుండును. దైవసన్నిధి వినయమును, విమలచిత్తమును ప్రసాదించును.

పరస్పర వైషమ్యాలతో క్రుద్ధులై యుండు శేషగరుడులు వైకుంఠములో పరస్పరము ఆనందముగా ముచ్చటించుకొనుచుందురు. స్పర్థలు తెలియక జీవించుచుందురు. వైషమ్యాలు తెలియని పవిత్ర సన్నిధానమే వైకుంఠము. దైవపార్షదులగు ద్వారపాలకులు మహాత్ములగు సనకాదులను అడ్డగించగా క్రుద్ధులైన మునులు ఇలా పలికిరి:

"ద్వారపాలకులారా! పూర్వజన్మఫల ప్రభావముచే మీరు ఈ పవిత్రసన్నిధానమున పార్షదులై యున్నారు. వైకుంఠవాసులైన మీలో ఈ విషమత్వమేల ప్రవేశించినది? మమ్ములను అనర్హులుగా గుర్తించి వైకుంఠుని యొద్దకు వెళ్ళనీయక నిరోధించితిరి. అర్హత లేనివారమైనచో వైకుంఠమున కరుదెంచగలమా? ఈ మాత్రపు ఆలోచనను గూడా చేయలేకపోతిరి. నిరుపాధిక సత్తాస్వరూపుడైన భగవానుని సన్నిధిలో ఉపాధి భేదమును దర్శించు చున్నారు.

"ఓ దైవపార్షదులారా! మీరు మందభాగ్యులు. మీకు మంచి చేయగోరినవారమై శాపము నొసగుచున్నాము. మీరు ఈ వైకుంఠమును విడచి కామక్రోధలోభములకు నిలయములగు పాపపు జన్మల నెత్తెదరుగాక!" యని మునులు శపించిరి.

కర్మ,భక్తి,యోగ,జ్ఞానములే వైకుంఠుని దర్శించుటకు అరుదెంచిన నల్వురు మహర్షులు. ఆఱు ద్వారములను దాటివచ్చిన వీరు సప్తమ ద్వారము వద్ద అడ్డగించబడినారు. ఈ సప్తమ ద్వారమే అహంకారము. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యము లనెడి ఆరుద్వారములను దాటి అహంకారమనెడి ఏడవ ద్వారమువద్ద అడ్డగించబడిరి. కామక్రోధములను జయించినవారు సైతము కీర్తికాంక్షను జయించలేక పోవుచుందురు. ఆ కీర్తి కాంక్షయే ద్వారపాలకుల రూపములో యున్న జయవిజయులు. అహంకారము ఒక్కటి మిగిలియుంటే చాలు, అనర్థములన్నీ ప్రాప్తించినట్లే. వేరు జీవంతో యుండినపుడు చెట్టును నరికినా అది తిరిగి యథా ప్రకారము చిగురించునట్లు అహంకారము మిగిలి యున్నచో దూరమైన అరిషడ్వర్గాలు మఱల సమీపించే ప్రమాదము గలదు.

మహర్షుల కోపానికి గురియైన జయవిజయులు శాపగ్రస్తులైనారు. భగవంతుని దర్శింపగోరిన సాధువులను అడ్డగించి బాధించువారు రాక్షస యోనులయందు పడుదురని అవగతమగుచున్నది. భక్తు లిచ్చిన శాపమును భగవానుడు కూడా తొలగించలేడు. భయాందోళనలకు గురియైన జయవిజయులు మునుల పాదములపై బడి క్షమాభిక్ష కోరిరి.

క॥ పరితాపంబును బొందుచు సరసిజలోచనుని భటులు సనకాది మునీ
శ్వరుల పదాంబుజములకుం గర మర్థిన్ మ్రొక్కి నిటల ఘటితాంజలులై

జయవిజయులు పశ్చాత్తాప హృదయులైరి. "మునులారా! మా బ్రతుకుల్లో శనిప్రవేశము జరిగినది. ఘోరమైన శిక్షకు గురియైనాము. మాకు ప్రాయశ్చిత్తము కావలసినదియే. కానీ మాదొక విన్నపము. ఎంతటి నీచపు జన్మలెత్తినను భగవత్స్మృతి లోపించకుండా జీవించునటుల ఆశీర్వదింపుడు" అని పార్షదులు ప్రార్థించిరి.

బ్రతుకు బాధల పాలైనను భగవానుని స్మృతి మదిలో మిగిలియుండువారు ధన్యజీవులగుదురు. పరమాత్మను స్మరించువారలు పతనమైనను ప్రగతినే సాధింతురు. బాధ పడడము వలన బాధలు తొలగవు. పైగా పెరుగుతాయి. భగవన్నామము నుచ్చరింపగలిగినపుడే బాధలు తీరుతాయి. బరువులు తగ్గుతాయి.

సప్తమ ద్వారము చెంత జరుగుచున్న అలికిడి నాలకించిన శ్రీమహావిష్ణువు ద్వారము కడకు వచ్చెను. జరిగిన విషయము నంతటిని గ్రహించెను. ఏడవ వైకుంఠద్వారము వద్ద మునులు నిరోధింపబడి యుండుటను గాంచెను.

జయవిజయులు మునులను అడ్డగించిరి. కీర్తి ప్రతిష్ఠలే జయవిజయులు. వైకుంఠుని దర్శించబోయే సమయంలో కీర్తిప్రతిష్ఠలు అడ్డుగోడలై నిలుస్తాయి. ప్రసిద్ధిని పొందాలని తపించేవారికి సిద్ధి లభించదు. వైభవము పెరిగే కొలది తనదే జయమని సాధకుడు భ్రమించును. అంతేకాదు. తనను మించినవారు లేరని విజయగర్వముతో విఱ్ఱవీగును. ఈ రెండు భావములే జయవిజయులు. జయవిజయులు మునులకు వైకుంఠ ప్రవేశమును నిరోధించినట్లు కీర్తిప్రతిష్ఠలు దైవదర్శనమును నిరోధిస్తాయి. కనుక సాధకుడు కీర్తిప్రతిష్ఠలను స్వప్న తుల్యములుగా భావింపవలెను.

సనకాది మునులు పరమ పవిత్రులు. అరిషడ్వర్గములను జయించి ఆఱు వైకుంఠ ద్వారములను దాటగలిగిరి. అందుచేత వారు సప్తమ ద్వారమును దాటకున్నను శ్రీమహావిష్ణువే నడచివచ్చి వారికి దర్శనమొసంగెను. చేసిన సాధన ఎన్నడూ వృథాగాదు.

వైకుంఠుడు మునులకు దర్శన మొసగెను. ఇది మహోత్కృష్టమైన స్థితి. కానీ వారు లోనికి వెళ్ళగలిగి యుండినచో అది ఇంతకంటెను పరమమైనదిగా యుండెడిది. సగుణదర్శనము శుభప్రదము. కానీ ఆత్మవిదులై, సమదర్శులై శోభించుట ఇంకనూ ఉత్తమము. అహంకారము శేషించి యున్నంతవరకు నిర్వికల్పము సిద్ధించదు.

వైకుంఠుడు నడచివచ్చెను. ద్వారపాలకులపైన, మునులపైన కరుణామయ దృష్టిని సారించెను. మునులు ఆ మహనీయుని దర్శించిరి. భీతులైయున్న పార్షదులు గూడ గాంచిరి.

చ॥ కరమణి హేమకంకణ వికాయ ఝణంకృతు లుల్లసిల్ల న
చ్చర లిడు హంసపక్ష సిత చామర గంధవహోచ్చల త్సుధా
కర రుచిరాత పత్ర సుభగ ప్రవిలంబిత హార వల్లరీ
సరసగళ త్తుషార కణజాల విరాజిత మంగళాంగుడై

విష్ణు భగవానుని అద్భుత సౌందర్య రూపవైభవమును గాంచి మునులు ధ్యానమగ్నులైరి. పీతాంబరధారి యగు నారాయణమూర్తి వనమాలా విరాజితుడై, శంఖచక్ర గదాధరుడై, సుందర కంకణధారియై, లీలాకమలహస్తుడై, గరుడునిపై ప్రేమతో హస్తము నుంచినవాడై, కౌస్తుభమణితో అలంకరింపబడిన కంఠము గలవాడై, చతుర్భుజుడై, పద్మలోచనుడై, ఎఱ్ఱని పెదవులపై మల్లెపూవువంటి తెల్లని, చల్లని నవ్వును ప్రదర్శించువాడై, అరుణవర్ణ మణి సదృశములైన గోళ్ళచే శోభించు చరణకమలములు గలవాడై, ధ్యేయరూపుడై, ధ్యానమూర్తియై, సుందరాకారుడై ప్రభవించు పద్మనాభుని గాంచి ప్రాప్త మనోరథులైన మునులు ధ్యానమగ్నులైరి.

క॥ మానసమున నిలిపిరి తద్ధ్యానాస్పదుఁడైన వాని దత్త్వజ్ఞులకుం
గాననగు వాని భక్త జనానంద కరైక మూర్తి నలరని వానిన్

తాత్త్వికులకు అలభ్యమైనవాడు, భక్తులకే లభ్యమగువాడు నగు శ్రీహరిని దర్శించి మునులు పరమానంద భరితులైరి. భగవానుని కీర్తించుచు ఐదుశ్లోకములను చెప్పిరి. ఈ శ్లోకపంచకము అత్యద్భుతమై అలరారుచున్నందున భక్తులు పఠించుకొందురని భావించి భావయుక్తముగా అందించు చున్నాము. ఈ ఐదు శ్లోకములను శ్రద్ధతో పఠించుటయే పంచామృత పానము.

నారాయణ స్తుతి పంచకము

I యోఽ న్తర్హితో హృదిగతోఽపి దురాత్మనాం త్వం
సోఽ ద్యైవ నో నయన మూల మనన్త రాద్ధః
యర్హ్యేవ కర్ణ వివరేణ గుహాంగతో నః
పిత్రాను వర్ణి తరహా భవదుద్భవేన ॥

దేవా! నీవు జీవుల హృదయ నివాసుడవైనను దురాత్ములైన వారికి గోచరింపకుంటివి. కానీ ఈ నాడు మాకు ప్రసన్నుడవు గాకుండ ఉండలేకపోతివి. నీ కృపచే ఈ నాడు నీ దర్శనభాగ్యమును పొందితిమి. నీ కుమారుడగు బ్రహ్మ తన కుమారులగు మాకు నీ వైభవ రహస్యమును వివరించినాడు. అపుడు మా కర్ణపుటములద్వారా నీవు మా హృదయములో ప్రవేశించితివి.

చ॥ వనజదళాక్ష! భక్త జనవత్సల! దేవ! భవత్సుతుండు మ
జ్జనకుడు నైన పంకరుహ జాతుడు మాకు రహస్యమొప్ప జె
ప్పిన భవదీయ మంగళ గభీర పరిగ్రహ విగ్రహంబు మే
మనయము జూడగంటిమి కృతార్థులమై తగ మంటి మీశ్వరా!

అని పోతనామాత్యుని యనువాదము. పరమాత్మ హృదయస్థుడై యున్నను దుష్టబుద్ధులు గాంచలేరు. గుడ్లగూబ సూర్యుని దర్శించలేని విధముగా దుర్జనులైనవారు భగవానుని దర్శింపలేరు. భగవానుని అనుగ్రహము వలననే భగవద్దర్శనము ప్రాప్తించును. భగవదనుగ్రహము లభింపవలెనన్నచో హృదయము శుద్ధి కావలెను. హృదయ శుద్ధికి జ్ఞానమవసరము. జ్ఞానము శ్రవణము వలననే లభించును. చెవులలో శనిగ్రహము నుంచుకొనువారు భగవల్లీలలను శ్రవణము చేయలేరు. బ్రహ్మదేవుడు బోధించగా భగవద్వైభవము శ్రవణ పుటముల ద్వారా హృదయములో ప్రవేశించెనని సనకాదులు చెప్పుచున్నారు.

2 తం త్వాం విదామ భగవన్ పరమాత్మతత్త్వం
సత్త్వేన సంప్రతి రతిం రచయన్త మేషామ్
యత్తేఽ నుతాపవిది తైర్దృఢ భక్తి యోగై
రుద్గ్రన్థయోహృది విదు ర్మునయో విరాగాః

భగవాన్! అహంకార రహితులు, విరాగులు నగు మననశీలురు నీ కృపవలననే నీ దర్శనమును పొందెదరు. దృఢ భక్తి గల్గిన వారై, పరమాత్మను దర్శింతురు. దేవా! నీవే పరతత్త్వమని మేము తెలిసికొంటిమి. నీవు నిజభక్తులైన వారికి సదానందమును ప్రసాదించుచుందువు.

సీ॥ దేవ! దుర్జనులకు భావింప హృదయ సంగతుడవై యుండియు గానబడవు
కడగి నీ దివ్యమంగళ విగ్రహంబున జేసి సమంచితాశ్రితుల నెల్ల
జేకొని సంప్రీత చిత్తులగా జేయు దతిశయ కారుణ్య మతి దనర్చి
కమలాక్ష! సర్వలోక ప్రజాధిప! భవ దనుసరణాభిలాషానులాప
తే॥ విదిత దృఢభక్తి యోగ ప్రవీణు లగుచు నర్థిమై వీతరాగులై నట్టి యోగి
జన మనః పంకజాత నిషణ్ణమూర్తి వని యెఱుంగుదు రయ్య నిన్నాత్మ విదులు

మొదటి శ్లోకమున శ్రవణమునకు ప్రాధాన్యత నివ్వడము జరిగినది. ఈ రెండవ శ్లోకమున మననము కేంద్ర విషయమై యున్నది. మనన శీలురగువారే పరమాత్మయందు ఆసక్తిని పెంపొందించు కొనినవారై విరాగు లగుదురు. విరాగులైనవారు దేహాత్మ భావమును విడనాడి యున్నందున అహంకార, మమకారములకు దూరులై యుందురు. అహంకార మంతరించిన అంతఃకరణములో దృఢభక్తి ఏర్పడును. భక్తి గలిగినవారిని పరమాత్మ తృప్తిపరచు చుండును. భక్తి ముక్తిని ప్రసాదించును.

3 నాత్యన్తికం విగణయ న్త్యపి తే ప్రసాదం
కి న్త్వన్య దర్పిత భయం భ్రువ ఉన్నయై స్తే
యే ఽ ఙ్గత్వదంఘ్రి శరణా భవతః కథాయాః
కీర్తన్య తీర్థ యశసః కుశలా రసజ్ఞాః

దేవా! నీ వైభవము పరమోత్కృష్టమైనది. నీ వైభవము కీర్తనీయమై యున్నది. పవిత్ర తీర్థ స్వరూపమై యున్నది. నీ చరణముల నాశ్రయించిన భక్తులు ఆప్తకాము లగుచున్నారు. అట్టి వారు ఇంద్రాది పదవుల నభిలషింతురా?

ఉ॥ కావున గీర్తనీయగత కల్మష మంగళ తీర్థకీర్తి సు
శ్రీ విభవ ప్రశస్త సుచరిత్రుడ వైన భవత్పాదాబ్జ సే
వా విమలాంతరంగ బుధవర్గ మనర్గళ భంగి నవ్యమున్
భావమునం దలంచునె కృపాగుణ భూషణ! పాపశోషణా!

శ్రవణ మననములను మొదటి రెండు శ్లోకములలో వివరించిన పిదప మూడవ శ్లోకమున నిధి ధ్యాసను తెలుపుతున్నారు. ఇదియే ధ్యానము లేదా ఆచరణము. శ్రవణానంతరము కీర్తన యుండవలెను. వంట తయారుచేసికొనుట ఆరగించుటకే యున్నట్లు, శ్రవణమననాదులు కీర్తన కొరకై యుండాలి. కీర్తించువారికి పరమాత్మ త్వరగా ప్రత్యక్ష మగునని నారదభక్తి సూత్రములందు తెలుపబడినది. భగవానుని కీర్తిని అనుభవించుటయే కీర్తనము. సంకీర్తనము మనస్సును సద్భావనములతో నింపి సమదర్శనమును ప్రసాదించును. ఇదియే జీవికి ఏకైక లక్ష్యమై యున్నది. పరమాత్మ దర్శనము నపేక్షించు భక్తులు శ్రేయోమార్గ గాములు. అట్టివారు ప్రేయస్సు నాశింపరు. ఇహపర సుఖములయందు వాంఛా రహితులై యుందురు.

4 కామం భవః స్వ వృజినై ర్నిర యేషు నః స్తా
చ్చేతోఽ లివద్యది ను తే పదయో రమేత
వాచశ్చ నస్తులసి వద్యది తేఽ ఙ్ఘ్రి శోభాః
పూర్యేత తే గుణగణైర్యది కర్ణరన్ధ్రః

భగవాన్! మా మనస్సు భృంగకమై నీ అంఘ్రియుగ్మముల యందే చరించుగాక! మా వాక్కులు తులసీదళములై నీ పాద సంబంధమును బొంది శోభిల్లు గాక! మా కర్ణములు నీ వైభవామృతమును గ్రోలి తరించుగాక! భగవాన్! ఇది మాకు లభించిన చాలును. మా చేష్టల వలన నరకాది యోనులలో పుట్టినను మేము చింతింపకుందుము.

చ॥ కర మనురక్తి షట్పదము గ్రమ్మ సుగంధ మరంద వాంఛచే
దరమిడి శాత కంటక వృతస్ఫుట నవ్యతర ప్రసూన మం
జరులను డాయుపోల్కిని భృశంబగు విఘ్నములన్ జయించి నీ
చరణ సరోజముల్ గొలువ సమ్మతి వచ్చితి మయ్య కేశవా!

తుమ్మెదలు నాదము చేయుచు మకరందము కొరకై పద్మముల చుట్టును పరిభ్రమించు చుండును. మా మనస్సులు గూడ తుమ్మెదలై నీ పాదపద్మముల చుట్టూ కీర్తన లాలపిస్తూ తిరుగుచున్నవి. తుమ్మెదలు పూల యందలి తేనెను వాంఛించి కంటకములను గూడ లక్ష్యపెట్టక కార్యము సిద్ధించునట్లు శ్రమించును. అలాగే నీ దర్శనార్థము అరుదెంచిన మేము నీ పార్షదులను లక్ష్యపెట్టకుండా లోని కేగ యత్నించితిమి.

ఇది పాపమే గావచ్చును. దీనివలన మాకు అధోగతి రావచ్చును. కానీ ఇదంతయు నీ దర్శనాభిలాషతో చేసిన దోషమే దేవా! యని సనకాదులు మొరబెట్టుకొనుచున్నారు. ఇంద్రియ మనస్సులను పరమాత్మకు సమర్పించు చున్నారు.

తులసి దళములు వాస్తవానికి మనోహరములు గాకున్నను శ్రీనాథుని పాద స్పర్శచే పునీతమై శోభిల్లుచున్నవి. అలాగే ఎవరివాక్కులు పరమాత్మ వచనములను పలుకునో అట్టి వాక్కులు తులసి దళములవలె పవిత్రమై శోభిల్లును. దళములను కలిగిన చెట్టు వందనీయమైనట్లు భగవానుని దివ్యవాక్కులను పలికెడి మహాత్ములు కూడా వందనీయు లగుదురు.

5 **ప్రాదుశ్చకర్థ యదిదం పురుహూత రూపం**
తేనేశ నిర్వృతి మవా పురలం దృశోనః
తస్మా దిదం భగవతే నమ ఇద్విధేమ
యోఽనాత్మనాం దురుదయో భగవాన్ ప్రతీతః

దేవా! నీవు మా కనుగ్రహించిన దివ్యమయ రూపమును గాంచి మేము అధికసుఖము ననుభవించితిమి. విషయాసక్తులు, ఇంద్రియాత్మవాదులైన మనుజులకు ఇట్టి దర్శనము దుర్లభమే కాగలదు. నీవు సాక్షాత్తు పరమాత్మవు. నీవు మాకు ప్రత్యక్ష దర్శనమొసగితివి. నీకు మా నమస్కారము.

చ ॥ మహిత యశో విలాస గుణమండన సర్వశరణ్య యింద్రియ
స్పృహలకు గానరాక యతసీ కుసుమ ద్యుతి నొప్పుచున్న నీ
సహజ శరీర మిప్పుడు భృశంబుగ జూచి మదీయ దృక్కు లిం
దహహా! కృతార్థతం బొరసె నచ్యుత! మ్రొక్కెద మాదరింపవే!

మొదటి మూడు శ్లోకములలో శ్రవణ మనన నిది ధ్యాసలను తెలిపి, నాల్గవ శ్లోకమువందు దేహేంద్రియ మనోబుద్ధులను పరమాత్మకు సమర్పించుటను ఎఱుకపరచెను. ఈ సాధనల ఫలితముగా లభించిన అనుభవమును ఈ చివరి శ్లోకములో తెలుపుట జరుగుచున్నది.

భగవద్దర్శనము పరమపురుషార్థమైన మోక్షరూప మైనందున అది ఉత్కృష్టఫలమై యున్నది. తద్వారా లభించెడి ఆనందము విషయములకు పరిమితము గానందున అది అల్పానందము గానేరదు. కేవలము భూమానందమే కాగలదు.

విషయ సుఖాలలో రమించు చిత్తము భూమానందమును పొందలేదు. అందుచేత ఆత్మానందమును విషయాసక్తులగు మనుజులు పొందలేరు. అతీంద్రియ ప్రజ్ఞా చైతన్యమును ఇంద్రియ లోలురు అనుభవించలేరు. పరమాత్మ స్వరూపము వాక్కునకు, మనస్సునకు అతీతమైనది. అందుచేత అది అనుభవైక వేద్యము. ఈ అనుభవము సనకాది మునులకు ప్రాప్తించినది.

జయవిజయులు విష్ణుసన్నిధానములోనే మహర్షుల నడ్డగించి విషమత్వమును ప్రదర్శించిరి. అందుచేత రాక్షసజన్మ లెత్తవలసి వచ్చెను. సనకాదిమునులు వైకుంఠ ద్వారమువద్ద క్రుద్ధులైరి. అందుచేత, భగవానుడు వారికి లోనికేగుటకు అవకాశమివ్వకుండా తానే లక్ష్మీదేవితో కలసి వెలుపలికి వచ్చెను.

దేవాలయములో ఏ కొంచెము దోషము నాచరించినను అది మహాపాపమై నిలుచును. ఆలయములో భేదములను పాటించకూడదు. క్రోధమును ప్రదర్శింప కూడదు. బిగ్గరగా కేకలిడరాదు. ఆలయ ఆస్తులను అపహరించరాదు. ఆలయాలు భక్తుల కొరకు ఏర్పడినవి. అచ్చట జరిగే అపచారము భక్తులకే సంబంధించి యుంటుంది. తనకు అపచారము చేసినవారిని పరమాత్మ క్షమించును. భక్తులకు అపచారము చేయువారిని భక్తులు క్షమించవలసినదియే గాని పరమాత్మ క్షమించడు. ప్రతి ఒక్కరు ఆలయాలలో సదాచారవంతులై యుండాలి.

సనకాది మునుల ప్రార్థనలతో తృప్తిచెందిన శ్రీమహావిష్ణువు ఇలా పలికెను: "మునులారా! నా పార్షదులైన ఈ జయవిజయులు నన్ను లెక్కచేయక మిమ్ములను కూడ తిరస్కరించిరి. మిమ్ములను తిరస్కరించుట నన్ను తిరస్కరించుట వంటిదియే. కనుక మీరు విధించిన శిక్ష సముచితమైనదియే. వీరు చేసిన అపచారమును నా అపచారముగనే భావించు చున్నాను. మీరు ప్రసన్నులు కండి. సేవకులు చేసిన అపరాధము వలన యజమాని అపరాధి యగును. శ్వేతకుష్ఠువు చర్మమును పాడుచేయునట్లు దుష్టులగు అనుచరులు యజమాని కీర్తిని నశింపచేయుదురు.

చ॥ తనువున బుట్టినట్టి బెడిదం బగు కుష్ఠ మహా గదంబుచే
వనరి తదీయ చర్మము వివర్ణత నొందిన రీతి భృత్యు లొ
ప్పని పని సేసినన్ విభులు బంధుర చారు యశంబు బేరు బెం
పును జెడిపోయి దుర్యశము బొందుచు నుందురు విష్టపంబులన్

"మునులారా! అనుగత భక్తులైన మీలాంటివారి వలననే నాకీర్తి విస్తరింపబడినది. మీకు ప్రతికూలమైన వాడు నాకును ప్రతికూలుడే. మీరు అర్చించుట వలన నా పాదముల యందలి రేణువులు పవిత్రములై ఆశ్రితులను పవిత్ర మొనర్చుచున్నవి.

"నా ఈ సేవకులు మీకు అపరాధము చేసితిరి. మీరిచ్చిన శాపమును అనుభవించి త్వరగ మఱల నా సదనమునకు అరుదెంచునట్లు మీరు నా యందు దయచూపుడు" యనెను.

మునులు విష్ణుదేవునితో ఇలా పలికిరి: "దేవా! నీవు సర్వేశ్వరుడవు. లోకాధ్యక్షుడవు. సర్వశక్తిమంతుడవు. మీరు నాపై దయచూపుడని నీవు పలుకుట మా కవగత మగుట లేదు. మేము నీ పార్షదులను శిక్షించితిమి. అది సముచితము గానిచో వేరొక శిక్షను విధించినను మాకు సమ్మతమే. లేదా వారి గౌరవమును ఇనుమడింప జేసినను మేము మరో విధముగ భావించము. మేము త్వరపడితిమి. దానికి తగిన విధముగ మమ్ము శిక్షింపుము. మేము అద్దానిని శిరసా వహింతుము" అని మునులు పలికిరి.

"మునులారా! వీరిరువురు రాక్షస యోనియందు వెంటనే ప్రవేశింతురు. వీరు త్వరలో నా సన్నిధికి చేరగలరు" అని పలికి మునులను భగవానుడు తృప్తి పరచెను. భగవానునకు నమస్కరించి, ఆయన కీర్తిని వర్ణించుచు మునులు వెనుదిరిగి వెళ్ళిరి.

భగవానుడు జయవిజయులతో చెప్పుచున్నాడు: "పార్షదులారా! మీరు నిర్భయులై వెళ్ళండి. మీకు శుభమగుగాక! మునులు మీకిచ్చిన శాపమును నేను త్రిప్పగలను. అలా చేయుట ధర్మముగాదు. నా ఆజ్ఞ లేనిదే ఏదియును జరుగదు.

"పూర్వము నేను యోగనిద్ర యందుండగా లక్ష్మీదేవి వైకుంఠమునుండి బయటకు వెళ్ళెను. ఆమె లోనికి వచ్చునపుడు మీ రామెను అడ్డగించితిరి. ఆమె క్రుద్ధురాలై మిమ్ములను శపించినది. ఈ నాడు ఋషులిచ్చిన శాపము అందులకు భిన్నమైనది గాదు. నా యందు క్రోధము గలిగినవారై మీరు శాపవిముక్తులై త్వరగా నన్ను చేరగలరు" యని అంతర్హితుడయ్యెను.

బ్రహ్మదేవుడు చెప్పుచున్నాడు: "దేవతలారా! జయవిజయులు దితి గర్భమున ప్రవేశించి, కశ్యపుని భయంకర తేజముతో వృద్ధి చెందసాగిరి. వారి తేజము ప్రవర్ధమానమగుచుండగ మీ తేజము క్షీణించుచున్నది. ఇది భగవానుని ఆదేశము. ఈ విషయమున మీరు విచారింపబనిలేదు. పరమాత్మయే మిమ్ములను రక్షించును". అని ఓదార్చెను.

హిరణ్యాక్ష హిరణ్యకశిపుల జననము

నూరు సంవత్సరములు బిడ్డలను గర్భమున రక్షించిన దితి భర్త యాజ్ఞ ననుసరించి ప్రసవించెను. దితి ఇరువురు కుమారులను కనెను. జ్యేష్ఠుడు హిరణ్యకశిపుడు. కనిష్ఠుడు హిరణ్యాక్షుడు. వారు జన్మించు సమయమున ఎన్నియో ఉపద్రవములు గోచరించినవి.

భూమి కంపించెను. పర్వతములు వణకెను. భయంకర గాలులు వీచెను. సముద్రుడు కెరటములను చాచి గర్జించెను. మేఘములు లేకనే ఆకాశము గర్జించుచుండెను. నక్కలు అరచుచుండెను. గుడ్లగూబలు శబ్దములు చేయుచుండెను. కుక్కలు రోదించుచుండెను.

గాడిదలు గుంపులుగా చేరి గిట్టలతో భూమిని పెకలించుచుండెను. తమజాతి గర్వించదగినవారు జన్మించినందుకు ఆనందమును వ్యక్తమొనర్చు నట్లుండెను. గాలి లేకుండగనే వృక్షములు కూలిపోవుచుండెను. అసుర సోదరుల ఆవిర్భావమును గని ప్రకృతియే కలత చెందెను. దుష్టుల వలన సర్వులూ దుఃఖము ననుభవింతురు.

హిరణ్యాక్ష హిరణ్యకశిపులు ఆవిర్భవించిరి. వారి దేహములు కఠినమైన రాళ్ళవలె యుండెను. వారు ప్రతిదినము పెరుగుచుండిరి. ఒకనాడు కుట్టించిన బట్టలు రెండవనాటికి పట్టిపోవు. హిరణ్యకశిపుడు అహంకారానికి సంకేతము. హిరణ్యాక్షుడు మమకారానికి ప్రతిరూపము. అహంకార మమకారము లనునవి పెరిగేవే గాని తరిగేవి గావు.

హిరణకశ్యప హిరణ్యాక్షులు పెరిగి పెద్దవారైరి. అనేక దుష్కార్యములకు నాంది పలికిరి. సాధువులను హింసించిరి. యజ్ఞములను పాడుచేసిరి. వారిరువురిని ఎవ్వరూ ఎదిరించలేకపోయిరి. హిరణ్యాక్షుడు మమకారమునకు ప్రతినిధి. అందుచేత అతని తృష్ణ తీరదు. ఆరదు. హిరణ్య మనగా బంగారు యని అర్థము. అక్షి యనగా కన్ను యని భావము. హిరణ్యాక్షుడనగా సంపదపై కన్నుగలవాడని అర్థము. ఆశకు అంతముండదు. తృష్ణ తృప్తిచెందదు. వయస్సు గతించినా తృష్ణ నశించదని వాల్మీకి రామాయణములో వక్కాణిస్తాడు.

తృప్తి తీరని హిరణ్యాక్షుడు వరుణ దేవునిపై దండెత్తెను. వరుణుడు యుక్తిని ప్రదర్శించి ఈ విపత్తునుండి బయటపడ నిచ్చగించెను. హిరణ్యాక్షునితో యుద్ధము చేయగలవాడు శ్రీహరియేనని పలికి తాను తప్పించుకొనెను.

ఆ సమయమున భూమాత సముద్రములో మునిగియుండెను. దురాత్ముల ఉనికిచే భూభారము పెరిగెను. భూమాత సాగరమున మునిగియున్న దనియు, తమకు నిలువను నీడలేక పోయినదని స్వయంభువు మనువు బ్రహ్మదేవునికి మొరపెట్టుకొనగా, బ్రహ్మదేవుడు నారాయణుని ధ్యానించెను. భూదేవిని సాగర గర్భమునుండి వెలికి తీయుటకై నారాయణుడు వరాహమూర్తిగ అవతరించెను. వరాహమూర్తి పర్వతమంత పెరిగి, భయంకరమైన ఘోషతో సాగరమున ప్రవేశించెను. భూమిని కనుగొనెను. తన పాడవైన నాసికముపై భూమిని ధరించి సాగర ఉపరితలముపైకి వచ్చెను.

అదే సమయమున శ్రీహరిని గూర్చి వరుణుడు చెప్పగా హిరణ్యాక్షుడు ఆలకించెను. "ఎవరా శ్రీహరి? ఆ పిరికిపంద ఎక్కడున్నాడు?" యని హిరణ్యాక్షుడు గర్జించెను. నారదుని ద్వారా జాడ తెలిసికొనిన హిరణ్యాక్షుడు సాగర ఉపరితలముపై భూదేవిని నాసికముపై ధరించి నడచుచున్న యజ్ఞనారాయణుని సమీపించెను. వరాహమూర్తిని దర్శించెను. క్రోధాత్ముడైన హిరణ్యాక్షుడు వరాహమూర్తిని నిందించసాగెను.

హిరణ్యాక్షుడు శ్రీహరి నెదిరించుట

హిరణ్యాక్షుడు వరాహమూర్తిని గాంచి "ఈ వన్యమృగము జలములలో కెలా ప్రవేశించినది? ఓయీ మృగాధమా! సూకరమా! భూమిని వదలిపెట్టుము. రసాతలమున వసించు మాకు బ్రహ్మదేవుడు భూదేవిని ప్రసాదించినాడు. నా నుండి నీవు తప్పించుకోలేవు. సూకరాకృతిలో గోచరించు సుదాధమా! అనేక మోసపు పన్నాగములతో మా అసురులను అనేకమందిని నీవు వధించితివి. ఓ మూర్ఖుడా! నిన్ను నా గదా ఘాతముచే వధించి వారి కన్నీటిని తుడిచెదనుగాక!" యని హిరణ్యాక్షుడు శ్రీహరిపై దుమికెను.

వరాహమూర్తి భూమాతను సాగరముపై నుంచి, మునిగిపోకుండా తేలునట్లు తన శక్తిని ప్రసాదించెను. తనపై పరుష వాక్కులను కురిపించిన హిరణ్యాక్షుని వైపు తిరిగి సమాధాన మొసగెను.

"ఓరీ! నీచుడా! నిజమే. నేను మృగమునే. నీలాంటి గ్రామసింహాలను చెండాడేందుకు అవతరించిన మృగరాజును నేనే. నీలాంటి మహావీరుడు ఎదురునిలచి పోరుచుండగ మేమెక్కడికి వెళ్ళగలము? కనుక ఓ రాక్షసాధమా! ఏదీ? నీ పరాక్రమమును జూపి, నన్ను హతమార్చి, మీవారి అశ్రువులను తుడిచి, వారికి ముదమును గూర్చుము.

మ॥ వినరాయోరి! యమంగళాచరణ! యద్వృత్తిన్ ననున్ నీ మది
వ్వనయంబున్ వన గోచరంబగు మృగం బంచు దలంతౌర! నే
వెనయన్ వన్యమృగంబ యౌదు బలియై యేతెంచు నీబోటి యీ
శునక శ్రేణి వధింతు నేడని మొనన్ జే కోర్చి వర్తించినన్

అంటూ శ్రీహరి హిరణ్యాక్షుని సమీపించెను. హిరణ్యాక్షుడు క్రుద్ధుడాయెను. పగబట్టిన సర్పమువలె నిట్టూర్పులు విడుచుచు భగవానునిపై గదను విసిరెను. అది శ్రీహరికి ఏనుగుపై పుష్పహారము పడినట్లుండెను. శ్రీహరి గదను ప్రయోగింపగ హిరణ్యాక్షుడు దానిని అడ్డుకొనెను. ఈవిధముగ హిరణ్యాక్ష వరాహదేవులు పరస్పరము బాధించు కొనుచుండిరి. వారి సంగ్రామమును జూచుటకై బ్రహ్మదిదేవత లరుదెంచిరి. శ్రీహరి హిరణ్యాక్షుని వధించక యుద్ధక్రీడను సల్పుచుండెను. అదిగాంచి సరసిజ గర్భుడగు బ్రహ్మదేవుడు ఇలా పలికెను:

"దేవా! ఈ రాక్షసుడు నా వలన వరములను బొంది శక్తిమంతుడైనాడు. గర్వితమతియై చరించుచు దేవతలను, బ్రాహ్మణులను, గోవులను దుఃఖమునకు గురిచేయుచున్నాడు. ఇతడు అసమాన్యుడు. కంటకతుల్యుడు. మాయావి. అహంకారి. వధార్హుడు. అట్టివానిని జంపుటకు నీవు ఆలస్యము చేయుచున్నావు. వీనితో క్రీడించుట యనునది విషసర్పము యొక్క వాలమును పట్టుకొని క్రీడించుట వంటిది.

ఉ॥ అంచిత దివ్యమూర్తి! పరమాత్మక! యీకలుషాత్ముడైన న
క్తంచరు డస్మదీయ వరగర్వమునన్ భువనంబు లెల్ల గా
రించు మదించి, యిట్టి విపరీత చరిత్రుని ద్రుంప కిట్లు పే
క్షించుట గాదు వీని బలిపేయు వసుంధరకున్ శుభంబగున్

"అచ్యుతా! భక్త రక్షకుడవైన నీవు ఈ దుర్మార్గుని వెంటనే వధింపుము. ఇది సంధ్యాసమయము. అసుర సంధ్యా సమయాన అసురులు బలవంతులై యుందురు. ఈ సమయమున దేవతలకు జయమును ప్రసాదింపుము" అని బ్రహ్మదేవుడు ప్రార్థించెను.

సంధ్యాసమయమున అసురశక్తులు ప్రబలును. అందుచేతనే సంధ్యాకాలమున వందన మాచరించుచుందురు. సంధ్యాసమయమున దుష్టభావములు కదలగూడదు. ఆ సమయమును పవిత్ర మొనర్చుకొనవలెను. సాయంకాల సమయాన కదలిన దుష్టభావాలు రాత్రి సమయాన క్రియలుగా రూపొందును. జపధ్యానాదుల ద్వారా హృదయమున ప్రవేశించిన అసుర భావములను అంతమొందించవలెను.. సంధ్యాసమయమున ఎవ్వరు పవిత్రులై యుందురో అట్టివారు పావనాత్ములై శోభింతురు.

బ్రహ్మదేవుని వచనముల నాలకించి వరాహమూర్తి మందహాసమును చిందించెను. ఆయన మనవి నంగీకరించెను. హిరణ్యాక్షుని వధించుటకు నిశ్చయించుకొనెను.

బ్రహ్మాది దేవతల ప్రార్థనలను నారాయణు డంగీకరించును. భక్తులైన బ్రహ్మాదులు ఏది గోరినను లోక కళ్యాణమునకే కోరుదురు. వారు స్వార్థము నెరుగరు. మమత్వము నెరుగరు. విషమత్వము నెరుగరు. సమత్వమునే వాంఛింతురు. అందుచేత భగవానుడు వారి ప్రార్థన లంగీకరించును. భగవానుడు ప్రార్థనలనే గాక ప్రార్థించు వాని జీవితమును గూడ ఆలకించును.

నిర్భయముగా తనకు ఎదురుగ నిలబడి యున్న హిరణ్యాక్షుని వరాహమూర్తి గదతో కొట్టెను. హిరణ్యాక్షుడు గూడ వరాహదేవునిపై గదను విసిరెను. అది వరాహదేవుని చేతికి తగిలెను. ఆ కారణముగా భగవానుని చేతిలోని గదకూడా క్రిందపడిపోయెను. అయినను వరాహమూర్తిపై గదను ప్రయోగింపక యుద్ధధర్మమును గౌరవించిన వాని వలె హిరణ్యాక్షుడు ప్రవర్తించెను. ఈ విధమైన ప్రవర్తనము ద్వారా వరాహమూర్తికి క్రోధమును కల్గింప యత్నించెను.

వరాహమూర్తి హిరణ్యాక్షుని యుద్ధ ధర్మమును ప్రశంసించెను. వెంటనే సుదర్శన చక్రమును స్మరించెను. సుదర్శనచక్రము చేతియందు తిరుగుచుండెను.

క్రుద్ధుడైన హిరణ్యాక్షుడు దంతములను గొరకుచు "ఓరీ! నీవు చచ్చితివి" యని పలుకుచు వరాహమూర్తిని గదతో కొట్టెను. వాయువేగమున కదలివచ్చిన వాని గదను తన వామపాదముతో దూరముగా తన్నెను. హిరణ్యాక్షుడు నిరాయుధుడై నిలబడి పోయెను. "ఓరీ! రాక్షసుడా! నన్ను జయింపవలె నని సంబరపడుతున్నావు. మరల అస్త్రమును ధరింపుము" అనెను.

హిరణ్యాక్షుడు క్రిందపడిన గదను తీసుకొని వరాహమూర్తిపై విసిరెను. గరుత్మంతుడు సర్పమును పట్టుకొను నట్లు వరాహమూర్తి ఆ గదను చేతపట్టుకొనెను. మఱల ఆ గదను దైత్యున కిచ్చుటకు శ్రీహరి యత్నించెను. పౌరుషము దెబ్బతినిన హిరణ్యాక్షుడు అందుల కంగీకరింపకుండెను.

హిరణ్యాక్షుడు అగ్నితప్తమైన శూలమును చేబూని వరాహమూర్తిపై ప్రయోగించెను. వరాహమూర్తి సుదర్శనముతో త్రిశూలమును ఖండించెను. అదిగాంచి క్రుద్ధుడైన హిరణ్యాక్షుడు వరాహదేవునిపైకి దుమికి, వక్షస్థలముపై బలముగా గుద్ది అదృశ్యమయ్యెను. వరాహమూర్తి ఆ దెబ్బ తినియు చలింపకుండెను. హిరణ్యాక్షుడు తదనంతరము అనేక విధములైన మాయలను ప్రయోగించెను. సుదర్శనచక్రము ద్వారా ఆ మాయల నన్నింటిని శ్రీహరి ఖండించెను.

తన మాయలన్నీ ఫలించక పోగా క్రుద్ధుడైన దైత్యుడు భగవంతుని కడకు వెడలెను. వజ్రాయుధము వలె కఠినమైన తన పిడికిలిని బిగించి నారాయణుని కొట్టసాగెను. వరాహమూర్తి తన చేతితో హిరణ్యాక్షుని కణతపై గొట్టెను. ఆ దెబ్బకు అసురుడు దిగ్భ్రాంతి చెందెను. నేత్రములు బయటకు వచ్చెను. గాలివానకు నేలరాలిన మహావృక్షము

వలె ఆ దైత్యుడు నేలకూలెను. మమకార రాక్షసుడు మట్టి గలిసెను. "ఈ మరణము అందరికీ లభించునది కాదని" బ్రహ్మాది దేవతలు పలికిరి.

హిరణ్యాక్షుడు అదృష్టవంతుడు. ఏ భగవానుని బొందుటకు యోగులు నిరంతరము సాధనల నాచరించు చుందురో అట్టి భగవానుని హస్తస్పర్శకు నోచుకొని, ఆ దివ్యాత్ముని ముఖకమలమును దర్శించుచు ప్రాణములను త్యజించెను.

మ॥ వరయోగీంద్రులు యోగమార్గముల నెవ్వానిన్ మనోవీధి సు
స్థిరతన్ లింగ శరీర భంగమునకై చింతింతు రా పంకజో
దరు పాణ్యాహతి దన్ముఖాంబు రుహమున్ దర్శించుచుం జచ్చెదు
ర్భరితో త్తంసుడు దైత్యవల్లభుని సౌభాగ్యంబు దానెట్టిదో

దైత్యుని మరణమును గాంచి సురులెల్లరు సంతసించిరి. భగవానుని అనేక విధముల స్తుతించిరి.

"విదురా! వరాహభగవానుడు హిరణ్యాక్షుని ఆటబొమ్మ వలె త్రుంచిన లీలలను నేను గురుదేవుని ద్వారా శ్రవణము చేసితిని. ఆ విషయమునే నీకు చెప్పితిని" యని మైత్రేయుడు చెప్పినట్లు సూతమహర్షి నైమిశారణ్యమున శౌనకాది మునులకు చెప్పుచున్నాడు. విదురుడడుగగా స్వాయంభువ మనువు వంశమునెలా వృద్ధిచేసెనో మైత్రేయుడు చెప్పుచున్నాడు.

స్వాయంభువ మనువునకు ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు యను నిరువురు కుమారులు, ఆకూతి, దేవహూతి, ప్రసూతి యనెడి ముగ్గురు కుమార్తెలు గలరు. ఆకూతిని రుచికి, దేవహూతిని కర్దమునికి, ప్రసూతిని దక్షుని కిచ్చి వివాహము చేసెను. మహాయోగి యగు కర్దమ ప్రజాపతి దేవహూతి ద్వారా ప్రజా సృష్టి నెలా సాగించెనో మైత్రేయుడు విదురునికి చెప్పెను.

కర్మిష్ఠుడైన కర్దముడు

అది పరమపవిత్రమైన సరస్వతీతటము నందలి బిందుసరోవరము. ఆ ప్రదేశము అందమైన వృక్షములతోను, మనోహరములైన లతలతోను శోభించు చుండెను. పక్షుల మధుర రవములు శ్రవణ సుఖము నొనగూర్చు చుండెను. పరిపక్వ ఫలయుతమగు తరుశాఖలు దివ్యశోభల నీను చుండెను. మధువును త్రాగిన మధుపములచే ఝుమ్మని ప్రతిధ్వనిత మగు చుండెను. చకోర చక్రవాకాది పక్షుల మధుర మంజుల శబ్దములు కర్ణపేయములై యుండెను. తమాల, సాల, వకుళార్జున. నింబ, కదంబ, పాటలీ, చందన, నారికేళ, బిల్వ, మల్లికాది మంజుల వృక్షపంక్తితో శోభాయమానముగ గన్పట్టుచుండెను. పింఛములను విప్పిన మయూరములు అప్సరసలను మరపించు రీతిన నాట్యమాడు చుండెను. కోయిలల కుహూకారములు వీనులకు విందు నొనగూర్చుచుండెను. గున్నమామిడి

చెట్లపై ఆసీనమైన కోయిలమ్మలు తియ్యమామిడిచిగుళ్ళను తిని పరవశించి చేయుచున్న గానములు గంధర్వులను మరపించు చుండెను.

క॥ లలిత సహకార పల్లవ కలితా స్వాదన కషాయ కంఠ విరాజ
త్కల కంఠ పంచమ స్వర కలనాదము ల్లుల్లసిల్ల గడు రమ్యములై

పుణ్యప్రదేశమగు ఈ బిందుసరోవరమున కర్దమప్రజాపతి పదివేల సంవత్సరములు తపస్సు చేసెను. ప్రజాసృష్టి చేయుమని చెప్పిన బ్రహ్మదేవుని యాజ్ఞను శిరసావహించి తపమాచరించెను. ఆయన తపస్సు ఫలించెను. కర్దముని ధ్యేయమూర్తి పుష్కరాక్షుడగు భగవానుడు దర్శన మొసగెను. కర్దముడు సాష్టాంగ దండ ప్రణామ మాచరించి భగవానుని స్తుతించెను.

"దేవా! నీ దర్శనముచే మా నేత్రములు పవిత్రము లైనవి. బహుకాల సాధనల ఫలితముగా యోగులు నీ చరణకమలములను దర్శించు చుందురు. నీ దర్శనము సర్వోపద్రవములను తొలగించును. నీకు పదేపదే నమస్కరించు చున్నాను."

సీ॥ అబ్జాక్ష! సకల భూతాంతరాత్ముడ వన దనరు చుండెడి నీదు దర్శనంబు
దలకొని సుకృత సత్ఫల భరితంబు లైనట్టి యనేక జన్మాను సరణ
ప్రకట యోగక్రియా భ్యాస నిరూఢులై నట్టి యోగీశ్వరు లాత్మగోరి
యెంతురు యోగీశ్వరేశ్వర యే భవ త్పాదారవింద సందర్శనంబు
తే॥ గంటి, భవవార్ధి గడవంగ గంటి, మంటి, గడగినా లోచనంబుల కలిమినేడు
తవిలి సఫలత నొందె మాధవ! ముకుంద! చిర దయాకర నిత్య లక్ష్మీవిహార!

కర్దముడు చెప్పసాగెను. "దేవా! భవసాగరమును దాటుటకు నీ చరణకమలములు దివ్య నౌకలై యున్నవి. అట్టి నీ పాదములను సకాములైన భక్తులు తుచ్ఛములైన సుఖముల కొరకు ఆశ్రయించుచున్నారు. వారి ప్రార్థనలను గూడ నీవు అంగీకరించుచునే యున్నావు. భగవాన్! ఈ కోరికలు నరకము నందు కూడ సఫలము లగును గదా!" యనెను.

వెలగల ముత్యములను రేగుబండ్లకు దారబోయునట్లు భగవంతుని ఆశ్రయించినవారు ప్రాపంచిక సుఖములను వాంఛించుచున్నారు. ఆద్యంతములు గల సుఖములు వాస్తవానికి నరక తుల్యములే. దుఃఖరూపములే. పరమ పురుషార్థమైన మోక్షమును ప్రసాదించు భగవానుని ఆశ్రయించి అల్పసుఖములను వాంఛించు వారు నష్టబుద్ధులై యున్నారు.

ఏవం విశోధ్య తత్త్వాని యోగీ నిస్పృహ చేతసా
యథా నిరిన్ధనో వహ్నిః స్వయమేవ ప్రశామ్యతి

"ఈ విధముగా తత్త్వము నెరిగిన యోగి నిస్పృహచిత్తము గలవాడై, కట్టెలు లేని అగ్నివలె స్వయముగనే ప్రశాంతుడగుచున్నాడు" యని త్రిశిఖి బ్రాహ్మణోపనిషత్తు తెలిపినది.

కర్దముడు చెప్పుచున్నాడు: "భగవాన్! నేను సకామ భక్తులను ఏవగించుకొన్నట్టి వాడను. అట్టి నేను దురాశాపరుడనైతిని. గృహస్థాశ్రమమున త్రివర్గములను ప్రసాదించుటలో కామధేనువు వంటిది యగు గృహలక్ష్మిని బొందదలచి, నీ పవిత్ర చరణకమలముల నాశ్రయించితిని;" యనెను.

మానవులెల్లరు ఋణగ్రస్తులే. ఋణవిముక్తి నొందనివాడు గుణవిముక్తి నొందలేడు. దేవ, ఋషి, పితృఋణముల నుండి బయటపడుటకు గృహస్థాశ్రమమే అనువైన స్థలము. ఋణవిముక్తిని కాంక్షించి, అనాసక్తితో గృహస్థాశ్రమమున చరించు పుణ్యాత్ములు యోగులు బొందిన దివ్యస్థితిని పొందుదురు. ధర్మమునకు విరుద్ధముగాని కామము బంధమును తొలగించునే గాని తగిలించదు. విడిపించునే గాని నడిపించదు.

అవగాహన కలిగిన వారికి గృహస్థాశ్రమము వాస్తవానికి తపోవనమే. వివాహ సమయంలో ఆచరించెడి విషయములలో విశిష్టమైన సందేశము లున్నాయి. పెండ్లికుమారుడు తాను వివాహము చేసుకోవడంలో గల ఉద్దేశ్యమును తన స్నేహితుల ఎదుట కన్యాదాత యగు మామగారికి వినిపిస్తాడు.

ధర్మ ప్రజా సంపత్యర్థ గ్ంగం స్త్రియ ముద్వహే

"ధర్మాచరణమునకు, సత్సంతానమును పొందుటకు మాత్రమే నేను స్త్రీని అగ్నిసాక్షిగ పరిణయ మాడుచున్నాను" యని పలుకును. ఇది వాగ్దానము. పెళ్ళినాటి ప్రమాణము.

కర్దమ ప్రజాపతి గృహస్థాశ్రమమును ఈ విధముగా అభిలషించెను. అందుచేత అది సకామమనిపించుకోదు. కర్దముడు పరమాత్మకు నమస్కరించి చెప్పుచున్నాడు:

"భగవాన్! నిష్కాములైన నీ భక్తులు సుశీతలమగు నీ చరణచ్ఛాయ నాశ్రయించి భవపరితాపవినిర్ముక్తు లగుచున్నారు. నీ గుణ కథన సుధాస్వాదనముచే పరవశించి ఆనందాబ్ధిలో ఓలలాడు చున్నారు. నిర్భయులైన నీ భక్తులను భయంకరమైన కాలచక్రము కదలించలేకున్నది. దేవా! మేము సకాములమై భవ సాగరమున బడి యున్నను నీ దివ్య మంగళ విగ్రహమునే వీక్షించుచున్నాము. స్వామీ! నీ చరణకమలములకు మఱల మఱల నమస్కరించుచున్నాము" అని కర్దముడు భగవానుని నిర్దోష చిత్తముతో ప్రార్థించెను.

భగవానుడు అమృత సందేశము నందించుచున్నాడు. "కర్దమ మహర్షీ! నీ మనోభావము నే నెరుగుదును. నీ యభిలాషను దీర్చు ప్రయత్నము పూర్వమే జరిగియున్నది. చిత్తమును నా యందుంచి జీవించు భక్తులను నేను సదా అనుగ్రహించుచునే యుందును. నీవు మనోరథప్రాప్తిని బొందితివి.

క॥ మునివర! యే కోరిక నీ మనమున గామించి నను సమంచిత భక్తిన్
వెనరున బూజించితి నీ కనయము నా కోర్కె సఫలమయ్యెడు జుమ్మీ!

"మహర్షీ! ధర్మకోవిదుడు, రాజర్షియగు స్వాయంభువ మనువు ఇక రెండురోజులలో నిన్ను దర్శించుటకు భార్యయైన శతరూపతో గూడి వచ్చుచున్నాడు. వయస్సునందును, శీలమునందును, గుణమునందును సుశోభితయగు ఆతని పుత్రికను నీ కిచ్చి

పరిణయము గావించును. నీ చిరకాల వాంఛ తీరును. నీవు ఆమె ద్వారా తొమ్మండుగురు పుత్రికలను గనెదవు. నీ పుత్రికల వలన మరీచి మొదలగు ఋషులు పుత్రులను ప్రసాదింతురు. నీవు నిష్కామ కర్మ యోగము నాశ్రయించిన వాడవై తుదకు నన్నే పొందెదవు. నీవు ఇంద్రియములను జయింతువు. కరుణామయుడ వయ్యెదవు. సమస్తములో నన్నే దర్శింతువు. సమదర్శివి అయ్యెదవు. మహర్షీ! నీవు పుణ్యాత్ముడవు. శుభచరితుడవు. అందుచేత నేను గూడ నీకు పుత్రునిగా జన్మింతును. దేవహూతి గర్భమున జనించి సాంఖ్యమును ప్రబోధింతును" అని పలికి ఇందిరా రమణుడు బిందుసరోవరమున అంతర్హితుడయ్యెను. కర్దముడు భగవానుని దివ్యవచనములను మననము గావించుకొనుచు పులకితు డగుచుండెను.

దేవహూతీ కర్దముల వివాహము

స్వాయంభువ మనువు భార్యయగు శతరూపతో గూడి కనకరథారూఢుడై, పుత్రికయగు దేవహూతిని కూర్చుండ బెట్టుకొని, విహరించుచు బిందుసరోవరము కడ కరుదెంచెను. మనువు మునిశ్రేష్ఠుడగు కర్దముని పాదములకు నమస్కరించెను. కర్దముడు మనువు నాశీర్వదించెను.

మనువు అసమాన ప్రజ్ఞావంతుడు. మహామనీషి. అయినను మహర్షియగు కర్దము డగుపించగనే ఆయనకు నమస్కరించెను. ఇదియే సనాతన ధర్మజీవన వైభవము. యతి పురుషుల దర్శనము కాగానే మతిని నిలిపి మహిమకు తలవంచెడి వారే సుగతిని బొంది సుకృతాత్ములై శోభిల్లెదరు.

అహంకారులకు ఆచార్యుల వైభవము అందదు. గురువును దర్శించగనే ముందుగా నమస్కరించడం అలవరచుకోవాలి. నవ్వుతూ పలకరించడం, నవ్వుతో పలకరించడం, ఆవువలె తలలూపి నమస్కరించడం, దర్శించిన పిదప కొంతసమయానికి మరొకరు నమస్కరించుట గాంచి అప్పుడు పాదమును గాల్చుకొనిన మార్జాలమువలె లేచి బాకీ తీర్చినట్లు మ్రొక్కడము, నమ్రత లోపించిన నమస్కారములు, వినయమెరుగని వందనములు - ఇవన్నియు ప్రగతి నిరోధకములు. పతన సూచకములు.

గురువులను దర్శించగనే ముందు నమస్కరించి ఆ తరువాత ముచ్చటించాలి. గురువును అర్చించని అహంకారిని గోవిందుడు అంగీకరించడు.

ఆచార్యం మాం విజానీయా న్నావమన్యేత కర్హిచిత్
సమర్త్య బుద్ధ్యాఽ సూయేత సర్వదేవ మయో గురుః

"గురువును నన్నుగా తెలిసికొనుము. గురువు నెన్నటికి అవమానపరచరాదు. మనుజుడని భావించి అసూయ చెందరాదు. గురువు సర్వదేవమయుడు" అని భగవానుడే స్వయముగా చెప్పెను.

మనువు కర్దముని ఆతిథ్యమును స్వీకరించెను. ఆసనమున గూర్చుండెను. కర్దముడు పలుకసాగెను. "రాజర్షీ! నీవు సాధువుల హృదయములకు శాంతిని ప్రసాదించుచున్నావు. అసాధువులను రూపుమాపుచున్నావు. నీ మనుగడయే మహిలో దురాత్ములను అదృశ్య మొనర్చుచున్నది. రాజా! అట్టి నీవు ఇచ్చటికి ఏకార్యార్థమై వచ్చితివో తెలుపుము. నేను ఋజువర్తనముచే దాని నంగీకరింతును" అనెను.

కర్దముని పలుకుల నాలకించిన మనువు ఇట్లు పలికెను: "మహర్షీ! బ్రహ్మదేవుడు వేదమును రక్షించు నుద్దేశ్యముతో తన ముఖమునుండి బ్రాహ్మణులను సృష్టించెను. సర్వజనులను పాలించుటకై ఆయన బాహువుల నుండి క్షత్రియులమగు మమ్ము సృజించెను. కనుక బ్రాహ్మణులు తమ జ్ఞానముచే క్షత్రియులను రక్షించుచుండగ క్షత్రియులు తమ దేహబలముచే బ్రాహ్మణులను రక్షించుచున్నారు. కనుక మీరు మాకు బుద్ధి దాతలు. మేము అలాగే బ్రాహ్మణులను రక్షించుచుందుము. ఈ నాడు నన్ను అదృష్టము వరించినది. మీ దర్శనము చేయించినది. దుష్టులు నిన్ను దర్శింపలేరు" అనెను.

సంత్ పురుషులను సజ్జనులే గుర్తించగలరు. దుర్జనులకు సంతులే గోచరింపరు. సర్వ్యాలూ వారికి హంతకులుగనే గోచరింతురు. కనుక వ్యక్తి సుగుణవంతుడై యుండాలి. ఆచారవంతుడై యుండాలి. అప్పుడే ఆచార్యుని వైభవమును గాంచగలుగును. లేనిచో అద్దములో మన ముఖమే తెలియునట్లు, ఆచార్యునిలో గూడా మన వికారములే తెలియుచుండును.

మనువు చెప్పుచున్నాడు: "మహర్షీ! మీ దర్శన భాగ్యము నా సుకృతఫలము. నా మనవి నాలకింపుము. దీనుడనై విజ్ఞప్తి చేయుచున్నాను. ఈమె నా కుమార్తె. పేరు దేవహూతి. ప్రియవ్రత, ఉత్తానపాదులకు సహోదరి. ఈమెకు చక్కని వయస్సున్నది. వయస్సును మించిన శీలమున్నది. అంతకు మించిన గుణమున్నది. తనకు యుక్తమగు వరుని కొరకు నిరీక్షించుచున్నది. నారదమహర్షిద్వారా మీ వైభవము నాలకించినది. మీ జ్ఞానమును గూర్చి వినినది. మీ రూపమును గూర్చి వినినదియై తీవ్రముగ అభిలషించినది. మిమ్ములనే పతిగా పొందవలెనని నిర్ణయించుకొనినది. మహాత్మా! నీపై మరలిన మనస్సుగల నీమెను శ్రద్ధతో నీ కొసగుచున్నాను. ఈమె నీకు సరియైనది. సిరిలాంటిది. గీచిన గిరి దాటదు. దరిచేరి సేవించును. మీలో హరిని దర్శించును. మరి ఆలస్యమేల?" యనెను.

మ॥ వరయోగీశ్వర! దేవహూతి యను నీ వామాక్షి మత్పుత్రి దా
వర లావణ్య గుణాఢ్యులన్ వినియు నెవ్వారిన్ మదిం గోర, కా
తురయై నారద పంపునన్ మిమ్ము వరింతున్నంచు వేతెంచె, నీ
తరుణీ భిక్ష బరిగ్రహింపుము శుభోదాత్త క్రియాలోలతన్

మనువు ప్రార్థనను కర్దము డంగీకరించెను. "రాజా! నేను ఈమెను గ్రహింతును. గర్భము ధరించువరకు సేవింతును. తదనంతరము నాకు శరణ్యుడగు విష్ణుదేవుని

యాదేశము ననుసరించి పరమహంసలు గడుపు జీవితమును గడిపెదను" యని కర్దము డనెను.

వివాహము విలాసమునకు గాకూడదు. వినోదమునకు గాకూడదు. విజ్ఞానమునకై యుండాలి. వికాసమునకై యుండాలి. ఇంద్రియ లోలత్వమునకు గాక ఇంద్రియ నిగ్రహముకొరకు వివాహ సంస్కార మేర్పడినది.

కాలానికి వసంతము వలె వ్యక్తికి యౌవనము ప్రధానముగ యుంటుంది. యౌవనంలో ప్రతివ్యక్తీ కామాది వాసనలను కలిగి యుంటాడు. స్వభావము ననుసరించి యురుదెంచెడి కామ ప్రేరణను నిరోధించినచో దానివలన విపరీత ఫలితాలు కలిగే అవకాశము ఏర్పడవచ్చు. పొంగివచ్చెడి కామ ప్రవాహాన్ని నిరోధించలేని సామాన్యులు, పరిస్థితుల నాధారముగా గొని నిరోధించి ఉన్మత్తులైన సన్నివేశాలు గూడ గలవు.

కామమును బలవంతముగ లొంగదీయరాదు. వీర్యశక్తిని ఓజశ్శక్తిగా మార్చగలిగే మహాత్ములకే అది సాధ్యపడును. నిగ్రహించే శక్తిలేదని మితిమీరి విహరించినచో బలహీనులై, బుద్ధిహీనులై భ్రష్టులయ్యే ప్రమాదము కూడా గలదు. కనుక అతిని విస్మరించి, స్థితిని గమనించి, హితకరమగు మితమును పాటించువారు సుఖములను బొందుదురు. ఇట్టి శుభకరజీవనమును మానవ జీవితములో ఆవిష్కరింప జేయుటకే వివాహ సంస్కార మేర్పడినది. వివాహితులైనవారు ధర్మమును పాటించుచు చరించాలి. లేనిచో అది పశుజీవనమే కాగలదు. భార్యను ధర్మపత్నిగా హైందవ సంస్కృతి నిర్ణయించింది. కామపత్నిగా నిర్ణయించలేదు. వివాహము కామనాశనము కొరకేగాని కామవిలాసము కొరకు గాదు. ధర్మమార్గంలో కామము నాచరించి, సమయమును గమనించి, నియమమును పాటించి కామమును నశింపచేయాలి. ధర్మములో గూడిన కామము వ్యక్తికి ఔన్నత్యమును చేకూర్చును. ధర్మము తప్పిన కామము అధోగతిని కల్పించును.

ఇంద్రియాణి పురా జిత్వా జితం త్రిభువనం త్వయా
స్మరద్భిరివ తద్వైర మింద్రియై రేవ నిర్జితః

"ప్రభూ! ఇంద్రియములను జయించగలిగిన నాడు నీకు త్రిభువనములను జయించడ మనెడి కార్యము సాధ్యమైనది. ఈ నాడు కామవశుడవై ఇంద్రియములచే జయింపబడి మరణము ననుభవించితివి" యని రావణుని వధను విని మండోదరి విలపిస్తుంది.

కర్దముని యొక్క అభిప్రాయమును మనువు శతరూపకు, దేవహూతికి తెలిపెను. దేవహూతి కర్దముని పరిణయమాడుటకు అంగీకరించెను. కర్దముడు వివాహమును గూర్చి చర్చించిన సందర్భముననే సన్యాసమును గూర్చి ప్రసంగించెను. అయినను దేవహూతి కర్దమ మహామునినే సమ్మతించెను. జితేంద్రియుడగు దివ్యాత్ముడు తనకు భర్త కాబోవు చున్నాడని పొంగిపోయెను.

దమ యనగా ఇంద్రియ నిగ్రహము. కర్దము దనగా ఇంద్రియములను నిగ్రహించిన బ్రహ్మ స్వరూపుడని అర్థము. దేవహూతి యనగా దేవుని ఆహ్వానించునది యని భావము.

హూతిః---------------------------హూయతే ఽ నయేతి హూతిః

కనుక దేవుని పిలుచునది దేవహూతి. శుద్ధమైన మనస్సే భగవానుని ఆహ్వానించును. ఇంద్రియములు నిగ్రహించినవానికి శుద్ధమైన మనస్సు తోడుగా యుండును. వారే కర్దమ దేవహూతులు.

మనువు కన్యాదానము చేసెను. కర్దముడు దేవహూతిని పరిణయమాడెను. శత రూపతో గూడి మనువు బయలుదేరుచు పుత్రికా వియోగ శోకమును భరింపలేక దుఃఖించెను. దేవహూతిని కర్దముని చేతికందించి తాను విమానమెక్కి వెడలిపోయెను.

ఆదర్శ దాంపత్యము

దేవహూతి భర్తృసేవలో నిమగ్నమాయెను. తనసేవలద్వారా భర్తను సంతోషపెట్టు చుండెను. పార్వతి పరమేశ్వరుని సేవించినట్లు దేవహూతి కర్దముని సేవించినది యని దివ్యాత్ముడైన మైత్రేయుడు మహాత్ముడైన విదురునికి చెప్పెను.

విశ్రంభేణాత్మశౌచేన గౌరవేణ దమేన చ
శుశ్రూషయా సౌహృదేన వాచా మధురయా చ భోః
విసృజ్య కామం దంభం చ ద్వేషం లోభ మఘం మదమ్
అప్రమత్తోద్యతా నిత్యం తేజీయాం సమతోషయత్

"ఉద్యమించినదియు, అప్రమత్తయు నగు దేవహూతి కామమును, దంభమును, ద్వేషమును, లోభమును, పాపమును, మదమును త్యజించినదియై, శుచియు, గౌరవము, దమము, శుశ్రూష, స్నేహము, తియ్యని పలుకులు గలిగి సదా భర్తను సంతోష పెట్టుచుండెను."

భర్తను సేవించున దెలాగో దేవహూతి చక్కగ ఆచరించి, సర్వులకు ఆదర్శమాయెను. శ్రమనెవ్వరైనా పడగలరు. సేవనందరూ చేయలేరు. దేహస్థాయిలో జరిగే సహాయము లన్నియు శ్రమలవుతాయి. మనస్సునెరిగి చేయుకార్యములే సేవలుగా మిగులుతాయి.

కొందరు తల్లులు భర్తల విషయంలో చాలా శ్రమిస్తుంటారు. బట్టలుతుకుతారు. వస్తువులను శుభ్రంచేస్తారు. రుచికరమైన భోజనాదులు వండి వడ్డిస్తారు. పాదసేవచేస్తారు. కార్యాలలో సహకరిస్తారు. బాధ్యతలను పంచుకుంటారు. ఈ విధంగా నిరంతరము భర్తవిషయంలో శ్రమిస్తుంటారు. ఈ విధమైన కార్యములవలన కార్యభారమును తగ్గిస్తారు. భర్తకు శ్రమను తగ్గిస్తారు. కానీ ఆనందాన్ని వృద్ధిచేయలేరు. ఇరువురు బాధపడుతూనే యుంటారు. ఎంతచేసినా ఫలితంలేదు యని అర్ధాంగి విలపిస్తూ యుంటుంది. తన బ్రతుకుకు సుఖంలేదని భర్త వాపోతూ ఉంటాడు. ఇలాంటి దంపతులను సమాజంలో అధికసంఖ్యలో చూస్తూ ఉంటాము.

భర్తను చులకనగ మాట్లాడుట, భర్తయొక్క స్నేహితులపై, బంధువులపై ద్వేషమును ప్రదర్శించుట, లోభము నాశ్రయించి అతిథులను గౌరవింపకుండుట, భర్త చిన్నమాట అనినను సహనమును కోల్పోయి పెద్దగా అరచుట, సమయా సమయములను గుర్తింపకుండా ప్రవర్తించుట, జాగరూకత లేకుండుట, స్మృతిని కోల్పోవుచుండుట, తన మాటను నెగ్గించుకొనుటకు అబద్ధములాడుట మొదలగునవి చేయుచు తాను శారీరకముగా చేయుశ్రమలు భర్తకు తృప్తిని గలిగించుటలేదని కొందరు తల్లులు పలుకుచుందురు. దేహస్థాయిలో శ్రమించేవారికి దేహస్థాయి ఫలితాలే అందుతాయి. మనస్సును గ్రహించి మహిమతో చరించువారికి ఆశించదగిన మహోన్నత ఫలితాలందుతాయి.

దేవహూతి భర్తను సేవించుచుండెను. కోరికలను త్యజించి భర్త అభీష్టమే తన యభీష్టమని భావించి యుండెను. నమ్రత గలిగియుండెను. ద్వేషములేక యుండెను. లోభమును త్యజించెను. అంతేగాదు. సదా భర్తపట్ల గౌరవమును ప్రదర్శించు చుండెను.

ఒకసారి దంపతులిరువురు నావద్దకు వచ్చారు. మీ ఆరోగ్యము ఎలావుంది? అని నేను భర్త నడిగాను. కొంత నయమనిపిస్తున్నది యని అతడు నమ్రుడై పలికాడు. వెంటనే భార్యఅందుకున్నది. ఆగకుండా చకచకమని రెండుమూడు నిముషాలు తన అభిప్రాయాలను వేగంగా దొర్లించింది. చివరగా "ఏం చేద్దాం స్వామీ! సకాలానికి భోంచేయమంటే భోంచేయరు. బుద్ధిలేని మనిషి" అన్నది.

నేను కాస్త ఆలోచనలో పడ్డాను. బుద్ధిలేకపోవడంచేత అతడు ఆలస్యంగా భోంచేస్తున్నాడా? లేక ఆలస్యంగా భోంచేయువారంతా బుద్ధిలేనివారేనా? యని నా సంశయము. ఏం చేద్దాం! ఎవరి బాధలు వారివి. ఈలోగా ఏమి ఆలోచించాడో తెలియదు. "స్వామీ! ఆమె మాటలలా ఉంటాయిగాని మనస్సు చాలా మంచిది" అన్నాడు. ఆయన అంత చక్కగా సరిపెట్టుకొనేటప్పుడు నేను పురిబెట్టడ మెందుకని నేను ఆలోచించడము మానివేసి "మంచిది" అన్నాను. ఆ తరువాత అతడాలోచిస్తున్నట్లు కనపడ్డాడు.

మంచి మనస్సు యుండడము నిజానికి వరమే. మాటగూడ మంచిగయుంటే ఏమౌతుంది? సువర్ణానికి సువాసన అబ్బినట్లవుతుంది. మంచి మనస్సును కలిగి యుండుట వాస్తవానికి వరమే అయితే మంచి మాటలేకపోవుట శాపము వంటిదని చాలా మందికి తెలియదు.

దేవహూతి తియ్యని పలుకులతో భర్తను సంతృప్తి పరచిందని మైత్రేయుడు చెప్పుచున్నాడు. ఈ సుగుణము లన్నియు ప్రత్యేకంగా స్త్రీలకొరకే చెప్పబడలేదు. పురుషులు గూడ వీటిని పాటించాలి. అప్పుడే దాంపత్యము శోభిస్తుంది.

సదా సేవాతత్పరురాలైన దేవహూతి భర్తను భగవంతునిగా భావించింది. "నా భర్త గొప్పతపస్వి. నేను తపస్విని కావలెను" యని ఆలోచించి దేవహూతి గూడ కఠోర సాధన లాచరించెను. అటు భర్తకు నిరంతరము సేవలందించుచు, ఇటు తన వ్యక్తిగత

సాధనలను కొనసాగించుచు నియమ నిష్ఠలతో జీవించిన దేవహూతి శరీరము దుర్బలమాయెను. ఈ పరిస్థితిని గాంచి కరుణా మయుడగు కర్దముడు వ్యథ చెందెను.

"దేవహూతీ! నీ సేవలు అసమానములు. అపురూపములు. నీ సేవలతో నన్నెంతో తృప్తి పరచితివి. ఇతరులకు వెలుగు నందించి దీపము తానారిపోవులాగున నాకు సేవల నందించి నీవు కృశించితివి. సర్వులకు దేహము ప్రియమై యుండును. అట్టిదేహముపై గూడ అభిమానమును విడచి నన్ను సేవించితివి. కృశీభూత దేహముతో నీరసించి యుంటివి. నా తపస్సు నీ వలన దివ్యస్థితి నొందినది. నాకు అనేక దివ్యైశ్వర్యములు తపస్సు ద్వారా లభించినవి. మనునందినీ! వాటి యందు నీకును అధికారము గలదు. నీవు ఏదైన వరము నభిలషింపుము. నీ యభీష్టమును దీర్చి నేను సంతసింతును" అని కర్దముడనెను.

ఉ॥ మానిత ధర్మమార్గ మహిమస్ఫుట భూరి తపస్సమాధి వి
ద్యా నిభృతాత్మ యోగ సముపార్జిత విష్ణుకటాక్ష లబ్ద శో
భానఘ దివ్యభోగ బహు భద్ర వితానము లస్మదీయ సే
వానిరతిన్ లభించు ననివారణ నిత్తును దివ్యదృష్టియున్

కర్దముని ప్రేమపూరిత వచనముల నాలకించి పులకితయైన దేవహూతి, "స్వామీ! నా కేమియు వరము లవసరములేదు. మిమ్ములను భర్తగా పొందగలుగుటయే భగవానుడు నాకు ప్రసాదించిన దివ్యవరము" యనెను.

"మనుజా! నీ అవసరమును దృష్టియందిడుకొని అలాపలికితివి. నా ఆనందమును దలచి ఏమైన అడుగుము" అని కర్దముడనెను.

"నాథా! నేను గర్భమును ధరించినంతవరకు మీరు గృహస్థసుఖము ననుభవించునట్లు వివాహసమయమున మాతండ్రిగారికి చెప్పితిరి. ఉత్తముడగు పతిద్వారా సంతానము నుత్పత్తి చేయగలుగుట పాతివ్రత్యము గల స్త్రీకి ఉత్కృష్ట ప్రయోజనముగా తెలియుచున్నది. స్వామీ! నన్ను సంతానవతిని చేయుము. నాకొక పుత్రుని ప్రసాదింపుము" యని ప్రార్థించెను. కర్దముడు అంగీకరించెను.

కర్దముని ఆశ్రమ సమీపమున బిందు సరోవరమున్నది. సరస్వతీ తటమున యున్న బిందు సరోవరములో స్నానమాచరించి రమ్మని కర్దముడు దేవహూతికి చెప్పెను. దేవహూతి బిందు సరోవరములో స్నానమాచరించి వచ్చెను. కృశించిన ఆమె దేహము మనోహరముగ శోభించెను. అధికశక్తితో అలరారుచుండెను. ఆ దివ్యానుభూతిని గాంచి పరవశించినదియై దానికి కారణమును తెలుపమని దేవహూతి కర్దముని అడిగెను.

పూర్వము కర్దముడు చేసిన కఠోర తపస్సును గాంచి విష్ణుదేవుని చిత్తము విచలితమాయెను. హృదయ విదారకమైన ఆ ఘోరతపస్సును గాంచి పరవశుడైన నారాయణుడు కొన్ని ఆనందాశ్రువులను రాల్చెను. భగవానుని అశ్రువులు రాలినచోట చక్కని సరోవర మేర్పడెను. అదియే బిందు సరోవరమని కర్దముడు చెప్పెను.

కర్దముడు తన భక్తిచేత కమల లోచనుడైన భగవానునికి కన్నీరు తెప్పించెను. అదియే భక్తిలో పరాకాష్ఠ. తన భక్తుల బాధలను గాంచి భగవానుడు కన్నీటిని విడచును. ఇదియే భక్తులకు శ్రీరామరక్ష.

సరస్వతీ నది జ్ఞాన స్వరూపము. జ్ఞానరూపమైన సరస్వతీ తటమున బిందు సరోవర మున్నది. అదియే భక్తి స్వరూపము. జ్ఞానము గల వారికే నిజభక్తి ఏర్పడును. జ్ఞానములేని భక్తి మూర్ఖమై, అయోమయమగును. భక్తి జ్ఞానములతో వసించువారు కర్దమునివలె మహాత్ములు కాగలరు.

గృహస్థ సుఖము లనుభవించుటకు ముందుగా బిందు సరోవరములో స్నాన మాచరించి రమ్మని కర్దముడు దేవహూతికి తెలిపెను. సారరూపమైన భక్తిని పొంది సంసారములో ప్రవేశించువారు బద్ధులు గాకుండా యుందురు. పనసపండును గోయువారు చేతికినూనె రాసుకొననిచో అదిచేతి కంటుకొనును. నూనె రాసుకొనినచో అంటకుండును. అలాగే భక్తి గలవారిని సంసారము బంధించదు. భక్తితో పరమాత్మ నెరిగిన వారు బంధముల కతీతులు. ఈ విషయమును శ్రీఆదిశంకరులు హరిస్తుతి యందు ఇలా తెలిపియున్నారు:

స్తోష్యే భక్త్యా విష్ణు మనాదిం జగదాదిం
యస్మిన్నేత త్సం సృతి చక్రం భ్రమ తీర్థం
యస్మి న్దృష్టే నశ్యతి తత్సంసృతి చక్రం
తం సంసార ధ్వాంత వినాశం హరి మీడే ॥

"ఆది లేనివాడును, ఆదిదేవుడును, సంసార చక్రము పరిభ్రమించుటకు కారణమైన వాడును నగు విష్ణుదేవుని భక్తితో స్తుతించెదను. ఎవరి దర్శనముచే సంసార చక్రము అంతమగునో,ఎవరు సంసారమనెడి చీకట్లను పోగొట్టుచుందురో అట్టిహరిని స్తుతించెదను."

కర్దముడు చక్కని విమానమును యోగమాయచే నిర్మించి దేవహూతితో కలసి విహరించెను. విష్ణుపాదార్చితు డైనందున కర్దమునికి సంకల్ప మాత్రమున సమస్తము సమకూరెను. కర్దముడు దేవహూతి ననుగ్రహించెను. ఆమె తొమ్మండుగురు కన్యకలను ప్రసవించెను. ఆ కన్యలందరు సర్వాంగ సౌందర్యముతో శోభించుచుండిరి.

బిడ్డలు కలిగినందున సంసారమును త్యజించుటకు కర్దముడు సిద్ధముగా యుండెను. అదిగాంచి దేవహూతి కలత చెందెను. పొంగివచ్చు దుఃఖము నాపుకొనుచు భర్త కడకెళ్ళి దేవహూతి ఇలా పలికెను:

సీ॥ అనఘ! సంతాన పర్యంతంబు నను గూడి వర్తింతు ననుచు బూర్వమున బలికి
కూతుల నిచ్చితి కొమరార నిప్పుడీ తరుణులు పతులను దమకు దార
యరసి వర్తింతురో యని భీతి నొందెద గావున నీ పుత్రికలకు దగిన
వరుల సంపాదించి పరిణయంబులు సేసి తత్త్వ సంహిత నాకు దవిలి తెలుపు

తే॥ సుతుని గృపసేసి నను గావు సుజన వినుత యర్థి సంసార దుఃఖంబు నపనయింప
నర్హుడవు నీవ కావె మోహమున నింత కాల మూరకపోయె నే గతియు లేక

"నాథా! నన్ను అనుగ్రహించితిరి. నాకు కుమార్తెలను ప్రసాదించితిరి. ఈ కన్యలకు వివాహము చేయుట ఎలా యని భయపడు చుంటిని ద్విజశ్రేష్ఠుడా! ఈ కన్యకలకు సరియగు వరులను జూచి వివాహము చేసి, నాకు తత్త్వమును దెలుపు కుమారుని ప్రసాదింపుము. మీరు అభయ ప్రదాతలు.

"మహాత్మా! ఇంతవరకు విషయవాసనా సుడిగుండములో పడి బ్రతుకును వృథా చేసికొంటిని. తనివిదీర ఒక్కనాడైనను భగవానుని ధ్యానింపలేక పోతిని. మీలాంటి బ్రహ్మజ్ఞానము గలవారి సహచర్యము లభించినను నా చిత్తము విషయ సుఖముల యందే రమించినది. కానీ దేవా! మీ సాంగత్యము నాకు శుభమునే చేకూర్చును. మీరు మహాత్ములగుటయే దానికి కారణము.

సంగో యః సంసృతేర్హేతు రసత్సు విహితోఽధియా
స ఏవ సాధుషు కృతో నిస్సంగత్వాయ కల్పతే

"మహాత్మా! అజ్ఞానముచే అసాధువులతో జేసిన సాంగత్యము సంసార బంధములను తగిలించుచున్నది. కాని సాధుపురుషుల సాంగత్యము సంసార బంధములను తొలగించుచున్నది."

కరుణ రసమును చిందించు దేవహూతి అమృత వచనములకు కర్దముడు చలితహృదయుడయ్యెను. దేవహూతితో ఇలా పలికెను:

"దేవీ! నీవు దురదృష్టమును నీలో గాంచనవసరము లేదు. నీవు పుత్రుని త్వరలో బొందెదవు. నారాయణుడే నీకు పుత్రుడై జన్మించును. నీకు భద్రమగును. భగవానునికై నిరీక్షింపుము. ఇంద్రియములను నిగ్రహింపుము. స్వధర్మము ననుష్ఠింపుము. శ్రద్ధతో భగవానుని భజింపుము. భగవానుడు నీకు పుత్రుడై జన్మించును. నీకు తత్త్వోపదేశమును చేయును. నీ అవిద్య నంతమొందించును. నీవు అదృష్టవంతురాలివి" యనెను.

దేహహూతి సంతుష్ట చిత్తురాలయ్యెను. భగవత్సందర్శనాభిలాషను వృద్ధిచేసికొనెను. కర్దముని ఉపదేశముల యందు విశ్వాసము నుంచెను. నిరంతరము భగవద్భజన యందే మనస్సును లగ్నమొనర్చెను. పరమాత్మ దర్శనానికి తపించువారికి భగవానుడు బిడ్డడై జన్మించును.

కపిలదేవుని జననము

దేవహూతీ కర్దములకు తొమ్మిది మంది కన్యకలు గలిగిరి. ఇప్పుడు భగవాను డగు కపిలుడు కలుగబోవు చున్నాడు. ప్రహ్లాద కుమారుడు తెలిపిన నవవిధ భక్తియే ఈ తొమ్మండుగురు కన్యలు. శ్రవణము, కీర్తనము, స్మరణము, పాదసేవనము, అర్చనము,

వందనము, దాస్యము, సఖ్యము, ఆత్మ నివేదనము యనెడి ఈ తొమ్మిది విధములైన భక్తి స్వరూపమే తొమ్మండుగురు కన్యలు. భక్తి పూర్ణరూపము ధరించిన వారికి జ్ఞానము ఉదయించును. దేవహూతి నవవిధ భక్తి ద్వారా పరమాత్మను సేవించెను. ఆమె భక్తికి ఫలముగా పరమాత్మయే పుత్రుడుగా అవతరించుచున్నాడు.

మహావిష్ణువు కపిలుడుగా అవతరించు శుభసమయము సమీపించెను. ఆకాశమున నిలచి యున్న మేఘములు మృదంగలయలను పలికించుచు గర్జింప నారంభించెను. దేవతలు పుష్పవృష్టిని కురిపించిరి. అప్సర స్త్రీలు నాట్యము చేయుచుండిరి. గంధర్వులు గానము చేయుచుండిరి. ఆకాశము నిర్మలముగ గన్పట్టు చుండెను. నదులన్నియు నిర్మలముగ నుండెను. మయూరములు నాట్యమాడుచుండెను. పక్షులు ఆనందముతో మెల్లగా విహరించు చుండెను. జనుల మానసములు ప్రసన్నములై యుండెను. కపిలు డావిర్భవించెను. **కపిల భగవానునికి జై!**

కపిలుని ఆవిర్భావము నెరిగి మరీచి మొదలైన ఋషులతో గూడి బ్రహ్మదేవుడు వచ్చి దేవహూతీ కర్దముల నాశీర్వదించెను. బ్రహ్మదేవుడిలా పలికెను:

"కర్దమా! నీవు నా ఉపదేశములను పాలించితివి. నాకు సేవ చేసితివి. నీ పుత్రికలు మంగళ స్వభావులు. తమ ప్రభావముచే ఈ సృష్టిని చక్కగా విస్తరించెదరు. కుమారా! నాతో పాటు వచ్చిన మరీచాది మహర్షులకు నీ కుమార్తెల నిచ్చి గౌరవింపుము. నీ కీర్తి జగద్విఖ్యాతమగును. కర్దమా! నీ కుమారుడు సాక్షాత్తు జగదీశ్వరుడు. పురుషోత్తముడు. సర్వజీవుల నుద్ధరించుటకు ఆ దివ్యాత్ముడు కపిలుడుగ అవతరించినాడు. దేవహూతీ! ఈబిడ్డడు నీకు జ్ఞానమును ప్రసాదించును. మీరు భవ్యచరితులు. కృతకృత్యులు. జన్మసఫలత నొందినారు."

క॥ శ్రితభయ హరణుడు, మునిజన నుత చరితుడు, పరుడు మీ మనోరథసిద్ధిన్
వితతంబుగ గావించుట జతురత మీజన్మమింక సఫలత బొందెన్

ఈ విధముగా దేవహూతీ కర్దముల నాశీర్వదించి నారద సనత్కుమారులను వెంట నిడుకొని బ్రహ్మదేవుడు అంతర్హితు డయ్యెను. బ్రహ్మ వెడలిన తరువాత కర్దముడు తన పుత్రికలను మహర్షుల కిచ్చి వివాహము చేసెను.

తన పుత్రికలలో 'కళ' యను కన్యను మరీచి కిచ్చెను. అనసూయను అత్రిమహర్షి కొసగెను. శ్రద్ధయను నామెను అంగిరసునకు ఇచ్చెను. హవిర్భువును పులస్త్యున కిచ్చెను. గతిని పులహును కిచ్చి, క్రియను క్రతువున కొసగెను. ఖ్యాతిని భృగువుకు అర్పించి అరుంధతిని వశిష్ఠునకు సమర్పించెను. అథర్వునకు శాంతి యను నామె నిచ్చెను. ఈ నామములను బట్టి ఆలోచించినచో వీరెల్లరు యజ్ఞరూపులే యని, తత్త్వవిదులే యని చెప్పకనే గ్రహింపవచ్చును.

వివాహము వైభవముగా ముగిసెను. పత్నీసమేతులైన ఋషులు వారి వారి ఆశ్రమములకు వెడలిరి. కర్దముడాలోచించెను. తన గృహమున పుత్రరూపమున యున్నవాడు భగవానుడే యని గ్రహించి ఒకనాడు యేకాంతముగ కపిలుని సమీపించెను.

భగవత్కృప తనపై పూర్ణంగా వర్షించుట చేత ప్రయత్నము లేకనే పుత్రికల వివాహము వైభవముగా ముగిసెను. నారాయణుడే తన గృహమున పుత్రరూపమున జన్మించెను. బరువులు తొలగిపోయాయి. బాధలు తీరిపోయాయి. ఇంక తన కాలము నంతటిని పరిపూర్ణముగా భగవంతుని పాదపద్మముల చెంత నుపయోగించ వలెనని నిర్ణయించుకొని కర్దముడు బిడ్డయైన కపిలుని సమీపించి నమస్కరించెను.

"దేవా! భవసాగరమున బడి క్రుంగుచున్న మాలాంటి జీవులను తరింప జేయుటకు దయామయులగు దేవతలే జన్మలెత్తుచున్నారు. ఇదంతయు భక్తుల భాగ్యఫలము. యోగులైనవారు ఏ దివ్యాత్ముని దివ్యదర్శనమును వాంఛించి అనేక జన్మలలో దృఢతర సాధనల నాచరింతురో అట్టి పురుషోత్తముడు మాపై సంపూర్ణ దయనుంచి బిడ్డడుగా జన్మించినాడు. భగవానుడు సదా భక్తుల పక్షపాతియే గదా!

క॥ అనయము భవదీయాశ్రిత జన సంరక్షణము కొఱకు సమ్మతితో దా
ల్చిన మానవ రూపంబులు నను రూపము లయ్యె గాదె హరి నీకెపుడున్

"దేవా! నాకిచ్చిన మాటను పాలించుటకు నాకు పుత్రుడవై జన్మించితివి. నన్ను కృతార్థుని జేసితివి. నీవు అవ్యక్తుడవైనను నీ భక్తుల ననుగ్రహించుటకు అనేక రూపములను ధరించుచుందువు. నేడు సాంఖ్యమును బోధింప కపిలుడవై నా గృహమున జన్మించితివి. నీకు నా నమస్కారము. నీవు నా పుత్రుడుగా అవతరించుట చేత పితృ, దేవ, ఋషి ఋణముల నుండి విడివడితిని. దేవా! నిన్ను ప్రార్థించుచున్నాను. నే నొక్క విషయము నడుగుచున్నాను. అనుగ్రహింపుము.

పరివ్రజ త్పదవీ మాస్థితోఽహం చ రిష్యే త్వాం హృది యుంజన్ విశోకః

"దేవా! నేను సన్యాస వృత్తిలో యుండి నిన్ను హృదయములో నిలుపుకొని శోక రహితుడనై చరించెదను." యని కర్దముడు విన్నవించెను.

కర్దముని విన్నపము నాలకించిన కపిలదేవుడు "మహామునీ! నీకిచ్చిన వాక్యమును సత్యము చేయుటకు నీకు పుత్రుడుగా జన్మించితిని. కాలములో నష్టమైన ఆత్మ తత్త్వమును తిరిగి ముముక్షువులకు ప్రసాదించుట నా అవతారము యొక్క ప్రయోజనమై యున్నది. నీవు కోరిన విధముగా సన్యాసమును స్వీకరింపవచ్చును. నీ యభీష్ట స్థానములకు వెడలవచ్చును. నీ కర్మలన్నియు నాయందే సమర్పింపుము. మృత్యువును జయింపుము. అమృతత్వమును బొందుము. దానికై నన్ను నిరంతరము భజింపుము.

మామాత్మానం స్వయం జ్యోతిః సర్వభూత గుహాశయమ్
ఆత్మన్యే వాత్మనా వీక్షన్ విశోకో ఽభయ మృచ్ఛసి

"జ్యోతి రూపుడను, సర్వభూతముల యందు అంతర్యామి రూపుడను, ఆత్మస్వరూపుడను అగు నన్ను అంతర్ముఖుడనై దర్శించుచు శోక రహితుడనై అభయ రూపమైన స్థితిని పొందుము.

"మునివరా! నాతల్లియగు దేవహూతికి గూడ నేను ఆత్మవిద్య నుపదేశించెదను. తద్వారా ఆమె తరించును" యని కపిలుడు పలికెను.

కర్దముడు సన్యసించి వెడలెను. సరియైన త్యాగమే సన్యాసము. కర్మల నెవ్వరూ సన్యసించలేరు. కర్మలను త్యాగము చేయుట గాక కర్మలలో త్యాగమును దర్శించాలి. నిష్కామకర్మలు పరిశుద్ధములై జీవులను బంధింపకుండును. సన్యాసి, సర్వబంధముల నుండి విడివడి యున్నాడు. అట్టివాడు కర్మలద్వారా బంధమును తయారు చేసుకోగూడదు. కర్మలు అనివార్యము గనుక ఈశ్వరార్పణ బుద్ధితో చేయడము అలవరచుకోవాలి. సన్యసించిన పురుషుడు భగవంతునికన్నను అన్యమైన ఆలోచనలనుగాని, పనులను గాని చేయకూడదు. ఇంద్రియములను జయించాలి. సదా అంతర్ముఖులై యుండాలి. ఈ విషయములనే కపిలుడు కర్దముని కెరింగించెను. కర్దముడు కపిల భగవానునికి ప్రదక్షిణ నమస్కారములు జేసి వనమునకు వెళ్ళెను.

కర్దమమహాముని అరణ్యముల యందు చరించెను. అహింసావ్రతము నవలంబించెను. పరమాత్మకు సంపూర్ణ శరణాగతు డయ్యెను. నిరంతర తపోధ్యానాదులతో పరమాత్మ అనుగ్రహమును పొందెను. అహంకార మమకారాదులను పూర్ణంగా త్యజించెను. సుఖ దుఃఖాల కతీతుడయ్యెను. సర్వత్ర పరమాత్మనే దర్శింప సాగెను. సదా అంతర్ముఖుడై యుండెను. శాంత రూపుడైయుండెను. ఆయన చిత్తము స్థిరముగ వాసుదేవుని యందే యుండుట వలన సమస్త బంధముల నుండి విడివడెను. రాగద్వేష రహితుడైన కర్దమ మహర్షి భక్తి యోగము ద్వారా భాగవత ముక్తి బొందెను.

కపిల గీత

తండ్రి సన్యసించి వెడలెను. తల్లి కానందము నొసగుటకై కపిల దేవుడు బిందు సరోవరమునందే యుండెను. ఒకనాడు బిందుసరోవర తీరమున ఉపవిష్టుడై యున్న కపిలదేవుని కడకు దేవహూతి యరుదెంచెను. కపిలునితో చెప్పసాగెను:

"ప్రభూ! ఇంద్రియములను తృప్తిపరచే కార్యములో నేను చాలకాలమును వ్యర్థ మొనర్చుకొంటిని. అలసిపోయితినే గాని ఆనందము ననుభవించలేక పోయితిని. అనేక జన్మల తరువాత ఈశ్వరుడవు, ఆదిదేవుడవు, అవిద్యాంధకారమున అలమటించు జీవులకు జ్ఞానదృష్టి నొసగువాడవు నగు నిన్ను నా అదృష్టముగా బొందితిని. దేహాదుల యందున్న అహంకార మమకారాదులను తొలగింపుము. నీ వలననే నా మోహము తొలగవలెను.

తం త్వా గతాహం శరణం శరణ్యం స్వభృత్య సంసార తరోః కుఠారమ్
జిజ్ఞాస యాహం ప్రకృతేః పురుషస్య నమామి సద్ధర్మవిదాం వరిష్ఠమ్

"ప్రభూ! శరణ్యుడవైన నిన్నొక్కడినే శరణు జొచ్చి యున్నాను. నీ దాసులైన వారియొక్క సంసార వృక్షమును ఛేదించుటలో నీవు గొడ్డలివంటివాడవు. ధర్మవిదులలో నీవే శ్రేష్ఠతముడవు. ప్రకృతి పురుషుల విషయమును నీ నుండి తెలిసికొనగోరుచున్నాను" యని దేవహూతి బిడ్డడు, భగవానుడైన కపిలుని ప్రార్థించెను.

ఎవరి మనస్సులో వైరాగ్యము ఉదయించునో వారికే జ్ఞానాభిలాష కలుగును. కళ్ళున్నవాడు, గ్రుడ్డివాడు ఇద్దరూ చీకటిలోనే యుందురు. దీపము కళ్ళున్నవాడికేగాని అంధునకు అవసరము లేదు. మోహము అందరికి యున్నను వైరాగ్యవంతుడు మోహమునుండి విడిపడవలెనని, మోక్షమును బొందవలెనని యోచించును.

ఇంద్రియముల నిస్సార స్థితిని దేవహూతి గాంచగల్గెను. ఎన్నిసార్లు సుఖింపచేసినను తృప్తిచెందని ఇంద్రియములను గాంచి విస్మయ మొందుచున్నది. నేయిపోసి అగ్నిని ఆర్పే ప్రయత్నము ఎలాంటిదో విషయసుఖాలద్వారా ఇంద్రియాలను తృప్తిపరచుట అలాంటిదేనని గ్రహించినది. నిజమైన సుఖము విషయాలలో లేదు. ఇంద్రియ భోగాలలో ఆనందము లభించుట యనునది కుందేటికొమ్ము వంటిది.

అనుభవించిన దానిని మళ్ళీ మళ్ళీ కావలెనని ఇంద్రియములు అభిలషించును. అనుభవించి ఆనందించిన దేమున్నది యనెడి ప్రశ్న ఉత్పన్నముగాదు. చేసిన పనులే చూసివరుచులే. విసుగులేదు. విరామముండదు. నిరంతరశ్రమతో నలుగుటయేగాని శాంతి ఏమిటో తెలిసిరాదు. కనుక ఇంద్రియముల విషయములో సాధకుడు జాగరూకుడై యుండవలెను. ఇంద్రియముల స్నేహము దుఃఖమునే కలిగించును. ఇంద్రియ వినిర్ముక్తులు నిత్యసుఖమును బొందుదురు.

ఇంద్రియాణాం ప్రసంగేన దోషమృచ్ఛత్య సంశయః
సంనియమ్య తు తాన్యేవ తతః సిద్ధిం నిగచ్ఛతి

"ఇంద్రియములను ప్రవర్తింపజేసిన మనుజుడు నిస్సంశయముగ దోషయుతుడగును. అతడే ఇంద్రియములను నియమించగలిగినచో మోక్షమును బొందును" యని నారద పరివ్రాజకోపనిషత్తు తెలిపినది.

ఇంద్రియ సుఖముల యందు మనిషి నిర్విరామంగా చరించుటకు అజ్ఞానమే కారణమై యున్నది. అజ్ఞానము నశింపవలెననిన జ్ఞానము కలుగవలెను. జ్ఞానము ఆత్మదృష్టి నొసగును. అజ్ఞానమువలన కలిగిన దేహభ్రాంతి నశించును. అహంకార మమకారాదులు అదృశ్యమగును.

ఈ విధమైన అవగాహనతో సర్వులకు ఉపకరించు ప్రశ్నలను తల్లినుండి ఆలకించి సంతుష్టచిత్తుడైన కపిలదేవుడు తల్లికి జ్ఞానబోధ చేయుటకు ఉద్యుక్తుడయ్యెను.

"తల్లీ! జనులకు మోక్షము నీయగలిగినది ఆధ్యాత్మిక విద్యయే. అది సుఖ దుఃఖ తాపసాగరము నుండి జీవుల నుద్ధరించును" అంటూ కపిలదేవుడు అద్భుతమైన, శ్రేయము నైన జ్ఞానము నుపదేశించును.

చేతః ఖల్వస్య బంధాయ ముక్తయే చాత్మనో మతమ్
గుణేషు సక్తం బన్ధాయ రతం వా పుంసి ముక్తయే

"తల్లీ! బంధ మోక్షములకు మనస్సే కారణమై యున్నది. విషయముల యందు ఆసక్తిగల వారలకు బంధము ప్రాప్తించును. ఆత్మయందు లగ్నమైన మనస్సు గలవారు ముక్తిని బొందెదరు" యనెను.

విషయ ప్రపంచము అనిత్యమైనది. అనిత్యమైన ప్రపంచము అనిత్య సుఖములనే అందించును. జగత్తంతయు అజ్ఞానముచే బంధింపబడియున్నది. అట్టి జగద్వ్యాపారములు ఎవరి మనస్సు నాకర్షించునో వారుగూడ బంధము నందున్నవారే యని భావము. చిత్తము బ్రహ్మమునందు లగ్నము కాగానే మనుజుడు ఆనందము ననుభవించును. బ్రహ్మము అవినాశియైనందున అట్టి బ్రహ్మము నుండి లభించు ఆనందము గూడ నశించనిదియై యుండును. అమరమై అక్షయమై యుండును. విషయాసక్తి దుఃఖము నందించును. ఆత్మాసక్తి ఆనందము నొనగూర్చును. పతనమైన మనస్సు ప్రపంచమును వాంఛించును. ప్రగతిని గోరు మనస్సు పరమాత్మలో రమించును. ఈ విధముగా మనస్సు బంధమోక్షములకు కారణమగుచున్నది.

అశుద్ధమైన మనస్సు, ఆత్మసుఖము ననుభవించలేదు. మొదట మనస్సును శుద్ధిచేయాలి. స్నానము చేసిన బాలుడు ఆడుటకు వెంటనే వెళ్ళని విధముగా శుద్ధిపడిన బుద్ధి ప్రపంచము నుండి నిరోధింపబడి పరమాత్మలో ఐక్యమగును. దివ్యమైన శాంతి ననుభవించును.

తల్లి రాకముందు తల్లికొరకు బిడ్డ ఏడ్చుచుండును. తల్లి ముందుకు వచ్చి బిడ్డ నెత్తుకోగానే విలపించుట మాని వికసించిన మోముతో బిడ్డ నవ్వుచుండును. మనస్సుకూడా అంతే. ఆనందము లభ్యము గానంతవరకు రోదించుచు విషయ ప్రపంచము ననుసరించి పరుగులిడు చుండును. ఆత్మసుఖము లభ్యముకాగానే చిదానంద సాగరములో మునకలేయుచు ఆనందించు చుండును.

అహం మమాభిమానోత్థైః కామలోభాది భిర్మలైః
వీతం యదా మనః శుద్ధ మదుఃఖ మసుఖం సమమ్

"నేను - నాది యనెడి అహంకార మమకారముల వలన జనించు కామలోభాదులచే మనుజుని చిత్తము కలుషితమై యుండును. తల్లీ! మనస్సు ఈ వికారముల నుండి విడిపడినపుడు సుఖ దుఃఖముల యందు సమస్థితి ననుభవించును" అని కపిలదేవు డనెను.

పరమాత్మయందు ఆనందమొక్కటియే యుండును. ప్రపంచములో దుఃఖము, ఆనందము రెండును యుండును. సత్యమైన ఆత్మను మరచుటచేత మనుజునికి దేహమే

తానానెడి భావమేర్పడినది. ఇదియే దేహాత్మ భావము. దేహము తానని భావించుటచేత ఆ దేహమునకు సంబంధించిన వారంతా తనవారని భావించును. మొదటిది అహంకారము కాగా రెండవది మమకార మగుచున్నది.

ఈ అహంకార మమకారములే సర్వ అనర్థములకు కారణములై యున్నవి. ఎవరిపై మనకు మమకార ముండునో వారిని అమితముగ ప్రేమింతుము. ఇది కామము. వారిని త్యజించుటకు అంగీకరించము. ఇదియే లోభము. ఈ విధమైన మన ప్రవర్తనకు ఎవరైనను అడ్డునిలిచినచో వారిపై క్రోధము కదలును. ఈ కామక్రోధ లోభములే నరకద్వారములని భగవద్గీత ప్రవచించినది.

మమతలు కూడా ఈ ప్రపంచంలో స్థిరముగావు. కొందరిని మనము ప్రాణసమానముగ ప్రేమింతుము. కానీ వారు మనకు అనుకూలముగ జీవించనిచో వారిపై మమతను పోగొట్టుకొని ద్వేషమును పెంచుకొనుచుందుము. కొందరిని కొంతకాలము ప్రేమింతుము. ఎల్లకాలము అందరిని ప్రేమించలేక పోవుదుము. మనలో రాగద్వేషాలు మారుతుంటే వ్యక్తులపై మనకున్న మమతలు మారిపోతూ ఉంటాయి.

ఈ విధమైన మనోజనిత వికారాలతో, స్వార్థంతో జీవించువారు తమకే గాక ఇతరులకు గూడ దుఃఖమును కల్పించుచుందురు. మనస్సులో నడిచే కల్పితభావాలు అనిత్యమైనవి. నిత్యమైన ఆత్మను మరచుటచేతనే అనిత్యమైన విషయముల యందు మన మనస్సు లగ్నమగుచున్నది. సత్యమును స్మరించగనే అసత్యదృశ్యములన్నియు మనస్సునుండి దూరమగును. మనస్సు వికారముల నుండి విడిపడి సుఖించును. సుఖ దుఃఖములు రెండును అనిత్యములని భావించును. సుఖదుఃఖముల నందించెడి మనస్సు కూడా అనిత్యమని గ్రహించును. అప్పుడు మనస్సున కతీతముగా నడచి సుఖించును. ఈ దశలో రాగద్వేషములు తటస్థమగును. అహంకార మమకారాదు లంతరించును. సమస్థితి ప్రాప్తించును. ఇదియే ముక్తస్థితియని గ్రహింపవలెను. భూమిపై నున్నవానికే మాలిన్య మంటును. ఆకాశమున సంచరించువానికి మలిన మంటదు. మనోస్థాయిలో నున్నవారికే అజ్ఞాన మాలిన్య మంటును. మనస్సును దాటిన మహితాత్ములకు మహిమయే గాని మలినమంటదు.

సంవేద్యేన హృదాకాశే మనాగపి న లిప్యతే
యస్యాసౌ వజడా సంవిత్స జీవన్ముక్త ఉచ్యతే

"ఎవని హృదయము ఆకాశమువలె దృశ్యముల నంటక యుండునో, ఎవని బుద్ధి జడముగాక చైతన్యమై భాసించునో అతడే జీవన్ముక్తు"డని మహోపనిషత్తు ప్రవచించినది.

"తల్లీ! దృశ్యములన్నియు ప్రకృతియని తెలియును. అట్టి ప్రకృతి కంటెను పరమై వెల్గొందు చైతన్యస్వరూపుడే పురుషుడు. చైతన్యము శరీరత్రయము నధిగమించి యున్నది. వావవా వివిర్ముక్తమై యున్నది. అట్టి చైతన్యరూపమైన ఆత్మను భక్తి జ్ఞానవైరాగ్యముల ద్వారా దర్శింపుము" అని కపిలభగవాముడు తల్లికి తెలిపెను.

భక్తి వైభవము

భక్తులకు భగవంతుడు గమ్యము. గమ్యమును చేరుటకు అనేక మార్గములున్నవి. సర్వము మాయారూపమని భావించి, భగవంతుడొక్కడే నిత్యుడని సంభావించి వైరాగ్యముతో చరించు మార్గము జ్ఞానమార్గము. సర్వము భగవానుని దివ్యకళా మయముగ దర్శించి ఆనందించు మార్గము భక్తిమార్గము.

కోతి ఒక చెట్టు మీదినుండి మరియొక చెట్టు మీదికి దుముకును. కానీ కోతిపిల్ల తనకు తానుగా తల్లిని కరచుకొని యుండవలెను. దీనినే **మర్కట కిశోర న్యాయమందురు.** ఇదియే జ్ఞాన మార్గము. బాధ్యతంతయు పిల్లమీదనే యున్నట్లు సాధకుడు తనమీదనే తానాధారపడి యుండవలెను.

పిల్లి ఎక్కడికెళ్ళినను పిల్లను నోటకరచుకొని వెళ్ళుచుండును. దీనిని **మార్జాల కిశోర న్యాయమందురు.** ఇదియే భక్తిమార్గము. ఇచ్చట బాధ్యత యంతయు తల్లిపిల్లి మీదనే యుండును. భక్తుని విషయములో భగవంతుడే భారమును వహించుచున్నాడు.అందుచేత భక్తిమార్గము సర్వోత్కృష్టమైనది యని కపిలుడు తల్లికి చెప్పుచున్నాడు.

మనస్సునకు భక్తియనెడి రంగు అంతత్వరగా పట్టదు. అనేక జన్మలలో విషయ వాసనలచే కలుషితమైన మనస్సు ఒక్కసారిగ పరమాత్మను భజించుటకు అంగీకరించదు. బహుకాల వాసనలతో బహు విధములుగ చరించు మనస్సును భగవానుని యందు స్థిరముగ నిలుపుటకు మనకు శక్తి చాలదు. ఇచ్చట అన్యుల సహకారము అవసరమై యున్నది. గత జన్మలలో ఈ మనస్సును అనేకమంది పాడుచేసియున్నారు. అలాగే దానిని బాగు చేసికొనుటకు అనేకమంది సహకారమును పొందవలెను. ఎవరి సహాయమును పొందవలెను? ఈ విషయమునే కపిలదేవుడు తల్లికి చెప్పుచున్నాడు.

ప్రసంగ మజరం పాశమాత్మనః కవయోవిదుః
స ఏవ సాధుషు కృతో మోక్షద్వార మపాకృతమ్

"సంసారము నందలి స్వజనులతో పెట్టుకొనిన మమత్వమే బంధమును కలుగజేసినది. అట్టి ఆసక్తినే సుజనుల యందు చూపినచో మోక్షద్వారములు తెరువబడును అని పండితులు పలికిరి" అని కపిలదేవుడు చెప్పెను.

సత్పురుషులు సాధుస్వభావులు. కళ్యాణ గుణమయులు. వారి సాంగత్యము మనలో భక్తిని వృద్ధిచేయును. దుస్సంగము దుష్టభావములను కదలించునట్లు, సత్సంగము సద్భావములను కదలించును. సుజనులైన భక్తులు ప్రేమమయులు. వారి సాంగత్య ప్రభావముచే మన ఆంతర్యము లోని భక్తి దీపమును, ప్రేమ దీపమును ఆరిపోకుండా కాపాడెదరు. కనుక భవబంధములను తగిలించెడి స్నేహములను పారద్రోలి, సత్సంగమును సేవించవలెను. మహాభక్తుడైన నరసీమెహతా ఈ విషయమును ఒక కీర్తనలో చక్కగా తెలుపుతారు.

సమరనె శ్రీహరి మేల్ మమతా పరీజోనె విచారీనె మూల్ తరూ౯ . . .
దేహతారీ నథీ, జో తుమ్ జుగ్‌తే కరీ రాఖతా౯ నవ రహే నిశ్చే జాయె
దేహ్ సంబంధ్ తజ్యే అవనవా బహు ధశె పుత్ర కళత్ర పరివార్ వహాయె

"శ్రీహరిని స్మరింపుము. మమతలను విస్మరింపుము. నీకు మూలమేమిటో విచారింపుము ....

ఈ దేహము నీది గాదని సహేతుకముగా చింతింపుము. నీవు ఉంచుకో దలచినను అది ఉండేదికాదు. మంటలలో మండేదియే. భౌతికమైన సంబంధములను నీవు త్యజించినచో నీకు సాధుపురుషులలో దివ్యమైన సంబంధ మేర్పడును. భార్యాపుత్రాదుల అనిత్య సంబంధములు తప్పక అంతరించును."

సత్సంగమహిమ నెరింగించిన కపిలభగవానుడు తల్లికి సాధువులను గూర్చి తెలుపుచున్నాడు.

సాధువులు తితీక్ష, దయ, ప్రేమలను కలిగి యుందురు. స్నేహరూపులైయుందురు. వారి ప్రేమను లౌకికులు అపార్థము గావించుకొను చుందురు. చులకన చేయుచుందురు. ప్రేమను అందరూ పొందలేరు. నాదస్వరమునకు జాతినాగులే స్పందించును. మహాత్ముల వైభవమును గాంచి సుజనులే స్పందించు చుందురు. సత్పురుషుని యందు మనకు సద్భావము కలుగకున్నచో మనయందు పాపము నిండియున్నదని భావము.

సాధుమహాత్ములు అజాత శత్రువులు. శాంతరూపులు. అనన్యభక్తి యుతులు. భగవత్కథా శ్రవణమునందు ఆసక్తులై యుందురు. దోషరహితులై యుందురు. ఇట్టి మహితాత్ముల సాంగత్యము వలన భగవద్వైభవము సుస్పష్టమగును. ఇంద్రియములు శాంతించును. మనస్సు స్వస్థత నొందును. సత్సంగము మొదట శ్రద్ధను ఇనుమడింపచేయును. తరువాత అనురక్తి కలుగును. ఆ తరువాత ప్రేమభక్తి ఉదయించును. ఈ భక్తి ద్వారా మనుజుడు భగవానుని బొందును యని కపిలదేవుడు తల్లికి తెలిపెను.

చ॥ అమలిన భక్తి గొందఱు మహాత్ములు మచ్చరణారవింద యు
గ్మము హృదయంబునన్ నిలిపి కౌతుకులై యితరేతరానులా
పముల మదీయ దివ్యతమ పౌరుషముల్ గొనియాడుచుండి మో
క్షము మదిగోర వొల్ల రవిశంబు మదర్పిత సర్వకర్ములై

యని కపిలుడు తెలిపిన మహాత్ముల వైభవమును గూర్చి పోతనామాత్యుని యనువాదము.

ఇంతవరకు భక్తియొక్క వైశిష్ట్యమును వివరించిన కపిలదేవుడు, ఇక నిష్కామభక్తి అన్ని యోగముల కంటెను ఉత్కృష్టమైనదని తల్లియగు దేవహూతికి తెలుపుచున్నాడు.

భక్తిరేవ గరీయసీ

పరమప్రేమ స్వరూపమైన భక్తితత్త్వమును భగవానుని నుండి ఆలకించిన దేవహూతి కపిలునితో చెప్పుచున్నది:

"తండ్రీ! భగవానుడవైన నీయందు భక్తినెట్లు చేయవలెను? నీవు ఇంతవరకు చెప్పిన భక్తి యోగము యొక్క స్వరూపమెట్టిది? నేను స్త్రీని. పైగా మందమతిని. నా బుద్ధి కెరుకపడునట్లు తెలుపుము" యని ప్రార్థించెను.

భగవానుడైన కపిలునకు జన్మనిచ్చిన పుణ్యవతి తనను మందమతిగ చెప్పుకొనుచున్నది. విద్యకు వినయమే భూషణము. పండ్లు నిండిన చెట్టు క్రిందికి వంగి యుండును. ఏమి తెలియకున్నను అన్నియు తెలిసినట్లు దంభమును ప్రదర్శించువారు లౌకికులు. ఎంత తెలిసినను సాగర గంభీరులై తెలియనట్లు మెలగువారు అనన్యభక్తులు.

ఒకనాడు భగవాన్ రమణమహర్షులవారి వద్దకు ఒక పండితు డరుదెంచెను. "స్వామీ! నాకు భగవద్గీత అంతయు తెలియును. ఒక్క శ్లోకము సరిగ అర్థమగుట లేదు" అనెను. వెంటనే రమణమహర్షులవారు "పోనీలే. ఒక్క శ్లోకమేగదూ అర్థముగానిది. మిగిలిన ఏడువందల శ్లోకములను ఆచరించు. సరిపోతుంది" అన్నారు.

కపిలుడు చెప్పుచున్నాడు. "జననీ! చిత్తమును సంపూర్ణముగా పరమాత్మయందు లగ్నము చేయుము. అన్నమును జఠరాగ్ని జీర్ణము చేయునట్లు భగవద్భక్తి వాసనాయుతమగు సూక్ష్మ దేహమును నశింపజేయును. కొందరు మహాత్ములు నా చరణారవింద యుగ్మమును హృదయమున నిల్పి భక్తి చేయుచుందురు. కొందరు నాకు సంబంధించిన కర్మల నాచరించు చుందురు. కొందరు నన్నుగూర్చి కీర్తించుచుందురు. కొందరు నన్ను గూర్చి ముచ్చటించు కొనుచుందురు" అనెను.

భక్తులు సర్వకర్మములను భగవంతుని కొరకే ఆచరింతురు. నిష్కాములై యుందురు. ఈశ్వరార్పణ బుద్ధితో ఆచరించు చున్నందున వారి కర్మలు బంధహేతువులు గావేరవు.

రూపధ్యానమును గూడ సాగించమని కపిలుడు తల్లికి తెలిపెను. ప్రపంచములోని అనిత్యరూపము లెన్నియో మన నేత్రముల ద్వారా మనసును చేరియుండును. భగవానుని దివ్యమయ రూపమును సదా దర్శించుట ద్వారా దృష్టి అమృతమయమగును. రూపధ్యానము వలన ఆనందము ప్రతిక్షణ వర్ధమాన మగుచుండును. దృశ్యముల యందలి దోషములు గానరాకుండును. ధృవునికి రూపధ్యానము వలన ఏకత్వానుభూతి కలిగెను. భక్తులు భగవంతుని యందు పూర్ణభక్తి కలిగినవారై ముక్తినిగూడ నిరాకరింతురు.

మ॥ కణకన్ వారలు వెండి మోక్ష నిరపేక్ష స్వాంతులై యుండి, తా
మణి మాద్యష్ట విభూతి సేవితము నిత్యానంద సంధాయియున్
గణనాతీతము నప్రమేయము సమగ్ర శ్రీకమున్ సర్వల
క్షణ సంయుక్త వికుంఠలోక పదవిం గైకొందు రత్యున్నతిన్

"తల్లీ! స్వర్గాది లోకములు గూడ అనిత్యములే. అందుచేత నా భక్తులు స్వర్గభోగముల యందు ఆసక్తి లేకయుందురు. స్వర్గాది భోగములు నశించును గానీ భక్తిచే నా భక్తులైనవారు బొందు నిరవధిక సుఖము నశింపులేనిది యని గ్రహింపుము. వారిని కాలచక్రము కూడా మ్రింగలేదు.

"నా భక్తులైన వారికి నేను ప్రియుడనై యుందును. కుమారుడునై యుందును. మిత్రుడనై యుందును. గురువు నగుదును. ఇష్టదైవమునై యుందును. వారివారి భావముల ననుసరించి వారి నంగీకరించుచుందును. ఆశీర్వదించు చుందును. తల్లీ! ఎవరయితే సమస్త బంధములను విడనాడి నన్నే ఏకాంతభక్తితో సేవించుచుందురో వారిని భవసాగరము నుండి నేను రక్షింతును.

మ॥ విమమది గాక యీ భువి దివిం బలుమాఱు బరించు నాత్మ దా
ధన పశు పుత్ర మిత్ర వనితా తతిపై దగులంబు మాని న
న్ననఘుని విశ్వతో ముఖు ననన్య గతిన్ భజియించె నేని వా
విని ఘనమృత్యురూప భవ నీరధి నే దరియింప జేయుదున్

"తల్లీ! నా భయము వలననే వాయువు వీచుచున్నది. సూర్యుడు ప్రకాశించుచున్నాడు. వరుణుడు వర్షించుచున్నాడు. అగ్ని దహించుచున్నది. మృత్యువు హరించుచున్నది" యని కపిలదేవుడనెను.

భక్తి ఉత్తమ సంస్కారములను కలిగించును. పరివర్తనమును ప్రసాదించును. దివ్యత్వము ననుగ్రహించును. భక్తివలన హృదయము నవనీతమగును. హృదయము నవనీతము కాగానే దాని నపహరించుటకై నవనీత చోరుడందు ప్రవేశించును. వెన్నలాంటి మనస్సుగల మహాత్ములను వెన్నుడు సదా వెంబడించుచునే యుండును.

భక్తుల హృదయములలో భగవాను డుండును. భక్తుల నాలుకలపై భగవన్నామ ముండును. దీపము వెలుగునపుడు చోరులు ఇంటిలో ప్రవేశింపజాలరు. నామదీపము హృదయ మందిరములో వెల్గొందునపుడు కామక్రోధాది చోరులు ప్రవేశింపలేరు. నామము సదా సాగుచుండినచో మనస్సులోని వాసనలన్నియు క్రమముగా నీరసింపబడి నశించును. నామము మరచినపుడే వాసనలు విజృంభించును. పరమాత్మను విస్మరించినపుడే ప్రపంచము ద్యోతకమగును. భక్తియోగసాధన అన్నివిధముల యోగ్యమై యున్నందుననే యోగులు కూడా భక్తిని వాంఛింతురు యని పలికి ఈ ప్రకరణమును కపిలదేవుడు సమాప్తిచేయు చున్నాడు.

జ్ఞాన వైరాగ్య యుక్తేన భక్తి యోగేన యోగినః
క్షేమాయ పాదమూలం మే ప్రవిశన్త్య కుతో భయమ్

"తల్లీ! యోగులు గూడ వైరాగ్య జ్ఞానములతో గూడిన భక్తియోగమును అవలంబించినవారై యోగక్షేమముల నాశించి అభయప్రదమగు నా చరణముల నాశ్రయింతురు" యని కపిలభగవానుడు తల్లియగు దేవహూతికి తెలిపెను.

తత్త్వ లక్షణములు

"తల్లీ! ఏ జ్ఞానమును బొందుటవలన ఆత్మదర్శన మగునో అట్టి మోక్ష ప్రదాయకమైన తత్త్వ లక్షణములను చెప్పెదను. ఆలకింపుము" అని కపిలుడు చెప్పసాగెను.

ప్రకృతికి అన్యమై, అతీతమై ప్రకాశించు పరమాత్మయే పురుషు డనబడుచున్నాడు. అవిద్యామోహితుడైన జీవుడు త్రిగుణాత్మకమైన ప్రకృతితో సంబంధమును పెట్టుకొని, సమస్తకర్మలకు తానే కర్తయని భ్రమించుచున్నాడు. కర్తృత్వమును ఆపాదించుకొనుట చేత భోక్తృత్వమును కూడా తనలోనే గాంచుచున్నాడు.

"తల్లీ! ఈశ్వరుడు సాక్షి యగుటచే కార్యకారణ కర్తృత్వంబులు ప్రకృత్యధీనంబులనియు, సుఖ దుఃఖ భోక్తృత్వంబులు ప్రకృతి విలక్షణుడైన పురుషుని వనియు తెలియవలెనని చెప్పుదురు" యనెను.

కార్య కారణ కర్తృత్వే కారణం ప్రకృతిం విదుః
భోక్తృత్వే సుఖ దుఃఖానాం పురుషం ప్రకృతేః పరమ్

అని కపిలదేవు డనెను. ఈ శ్లోకమే భగవద్గీతలోని క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగమునందు ఇరువదియవ శ్లోకమై యున్నది.

"తండ్రీ! ప్రకృతి పురుషులు సదసదాత్మక ప్రపంచమునకు కారణభూతులని తెలిసినది. వాని లక్షణములను తెలుపుము" యని దేవహూతి ప్రార్థించగా కపిలదేవుడు చెప్పుచున్నాడు:

క॥ క్రమమున త్రిగుణము నవ్యక్తము నిత్యము సదసదాత్మకము మఱియు బ్రధా
నము ననగా బ్రకృతి విశేషము, లదియు విశిష్టమనిరి సద్విదు లెలమిన్

పంచభూతములు, పంచ తన్మాత్రలు, అంతఃకరణ చతుష్టయము, దశేంద్రియములు కలిపి చతుర్వింశతి తత్త్వములుగ తెలియుచున్నవి. కాలమును ఇరువదియైదవ తత్త్వముగ నిర్ణయించిరి. మహతత్త్వము వికారమును బొందగ మూడు రకములైన అహంకార తత్త్వము వ్యక్తమైనది. సత్త్వ రజస్తమస్సులనెడి ఈ త్రివిధ అహంకారముల నుండి అంతఃకరణ చతుష్టయము, ఇంద్రియములు, భూతములు కలిగినవి. ఆ తరువాత కర్తృత్వము, కారణత్వము, కార్యత్వము సిద్ధించినవి. సంకల్ప వికల్పాత్మక మైన మనస్సు కోరికలను కదిలించెను.

"తల్లీ! జలమున ప్రతిబింబించిన సూర్యుని యొక్క ప్రతిబింబము జలముతో తడుపబడునట్లు జీవాత్మ పరిశుద్ధమై యుండుటచేత గుణములతో సంబంధము లేకయున్నాడు. ఆ జీవుడే గుణయుతుడైనపుడు కర్తృత్వ భోక్తృత్వాభిమానములను ఆపాదించుకొనుచున్నాడు. సంసారమును బొందుచున్నాడు.

"తల్లీ! ఈ జగత్తు స్వప్నము వంటిది. ఇందు సత్యములేదు. నిద్రబోవు వానికే స్వప్నము తెలియును. అవిద్యలో నున్నవానికే జగత్తు తెలియును" యని కపిలుడు చెప్పెను.

స్వప్నగతుడైన వానిని తట్టి లేపువిధమున, అజ్ఞాన నిద్రలో మత్తుడైయున్న వానిని భక్తి, వైరాగ్యములచే లాంగదీసి కొనవలెను. శ్రద్ధాభక్తులను కలిగి, చిత్తమును పరమాత్మ యందు స్థిరముగ నుంచి యత్నించువారు ముక్తులయ్యెదరు.

సీ॥ శ్రద్ధా గరిష్ఠుడై సత్యమైనట్టి మద్భావంబు మత్పాద సేవనంబు
వర్ణిత మత్కథా కర్ణనంబును సర్వభూత సమత్వ మజాత వైర
మును బ్రహ్మచర్యంబు ఘన మౌన మాదిగా గల నిజధర్మ సంగతుల జేసి
సంతుష్టుడును మితాశనుడు నేకాంతియు మనన శీలుడు వీత మత్సరుండు

తే॥ నగుచు మిత్రత్వమన గృప దగిలి యాత్మ కలిత విజ్ఞానియై బంధకంబులైన
ఘన శరీర పరిగ్రహాత్మకంత యందు నాగ్రహము వాసి వర్తింప నగును మఱియు

"జీవేశ్వర తత్త్వజ్ఞానము వలన నివృత్తమైన బుద్ధి జీవాత్మ జ్ఞానమును బొందును. సూర్యుడు జలమునందు ప్రతిఫలించును. ఆ ప్రతిబింబము ఇంటి గోడపై బడును. గోడపై బడిన ప్రతిబింబము నాధారము జేసికొని జలమునందలి ప్రతిబింబమును దర్శింతుము. జలమునందలి ప్రతిబింబము నాధారము జేసికొని గగనమున యున్న సూర్యబింబమును దర్శింతుము.

ఆత్మచైతన్యము జలమునందు సూర్యునివలె బుద్ధియందు ప్రతిబింబించినది. బుద్ధియందలి ప్రతిబింబము జగత్తును ప్రకాశింప జేయుచున్నది. జగత్తునందలి ప్రకాశమునకు బుద్ధియందలి ప్రకాశము కారణమని గ్రహించి అద్దానిని ఆంతర్యములో దర్శించాలి. ఆంతర్యము నందలి చేతనత్వము ద్వారా ఆత్మప్రకాశమును దర్శించాలి" యని కపిలుడనెను.

దేవహూతి కపిలునితో పలుకుచున్నది: "మహాత్మా! ప్రకృతి పురుషులకు అన్యోన్యాశ్రయత్వ మున్నట్లు తెలియుచున్నది. పృథివికి గంధమునకు, సలిలమునకు రసమునకు ఎలా అన్యోన్య సంబంధమున్నదో ప్రకృతి పురుషులకు గూడ యట్టి అన్యోన్య సంబంధము గలదు.

"పురుషుడు అనాసక్తుడు. ప్రకృతి గుణములయందు రమించుచుండును. వీరిరువురు నిత్యులై, అన్యోన్య సంబంధమును కలిగియున్నచో వారు ఎలా వేరు కాగలరు? వేరుగానిచో గుణ సహితమైయున్న ప్రకృతితో సంబంధమును కలిగియున్న జీవునకు ముక్తి ఎట్లు లభించును?" యని ప్రశ్నించెను.

"తల్లీ! మనుజుడు స్వధర్మము నాచరించుచు, కథాశ్రవణము ద్వారా భక్తిని సంపాదించుకొనుచు, జ్ఞాన వైరాగ్యములను బొంది, తపోధ్యానముల ననుష్ఠించుచు, చిత్తైకాగ్రతను బడసినచో కట్టెనుండి పుట్టిన అగ్ని కట్టెను దహించు విధమున పురుషుని యందలి ప్రకృతి నశించిపోవును. మేలుకొనిన వానిని స్వప్నగత విషయములు భయపెట్టలేని విధముగ వివేకియగు పురుషుని ప్రకృతి సంస్కారములు బాధింపలేవు. ఈ విధముగా బహుజన్మలలో అనేక యాతనల ననుభవించిన జీవుడు నన్నాశ్రయించినవాడై, అవిద్య నంత మొందించుకొని, సందేహములను నివృత్తిచేసికొని, తిరిగిరాని స్థానమును బొందుచున్నాడు. ఇదియే మోక్షము. దీనిని బొందినవాని చిత్తము అణిమాది సిద్ధుల యందు ఆసక్తిని జూపదు. సదా నాయందే స్థిరముగా నిలచియుండును. ఇదియే అమృతత్వము. అమృతత్వము బొందిన వానిని మృత్యువు స్పృశించలేదు" యని కపిలుడు చెప్పెను.

ధ్యాన వైభవము

"తల్లీ! ధ్యానయోగము పరమోత్కృష్టమైనది. ధ్యానము చిత్తమును ప్రసన్నము గావించును. నిర్వికల్పస్థితిని ప్రసాదించును" యని పలికి కపిలదేవుడు ధ్యానమును గూర్చి తల్లికి అద్భుతముగ వివరించెను.

మనస్సును నిర్విషయముగ నుంచుట యనెడి ధ్యానస్థితి లభించుటకు ముందుగ ముముక్షువు తీసికొనవలసిన జాగ్రత్తలను గూడ కపిలుడు తెలియచేసెను.

స్వధర్మాచరణం శక్త్యా విధర్మాశ్చ నివర్తనమ్ దైవాల్లబ్ధేన సన్తోష ఆత్మ విచ్చరణార్చనమ్

ధర్మజీవనమునకు దూరమైన వాడు ధ్యానమునందు రమించలేడు. జీవులు నిద్రలేచినది మొదలు ఎన్నియో పాపములను చేయుచుందురు. చేసిన పాపములను మనుజుడు మరువవచ్చును. కానీ ధ్యానసమయమున అవి అన్నియు గుర్తుకు వచ్చును. మనస్సులో ఏ భావములు ధృవపడియుండునో ధ్యానసమయమున అవియే జ్ఞాపకమునకు అందుచుండును. చేయవలసిన కార్యములు చేయకపోయినను, చేయగూడని కార్యములు చేసినను వాటివలన కలిగెడి సంకల్పములు ధ్యానమును విక్షేపమొనర్చును.

దైవము ప్రసాదించిన ద్రవ్యముతో తృప్తిచెందు చుండవలెను. కోరికలు దుఃఖమును కల్గించును. ధనపిశాచి ధ్యానమును భగ్నమొనర్చును. నీవు ఎంతధనము నైనను ఆర్జింపుము. ఖర్చుపెట్టుము. కానీ ధనము ధ్యానసమయమున హృదయములో గలగలమని శబ్దము చేయనిచో అట్టిధనము పుణ్యధనమని గుర్తుంచుకొనుము. ధనమును దానము ద్వారా శుద్ధిచేసి కొనుచుండవలెను. దానము చేయుబుద్ధి ధనికునకు కలుగనిచో అతని ద్రవ్యము పాపద్రవ్యమని గుర్తుంచుకొనుము.

సాధువులకు దానము చేసిన తరువాత దండోరా వేయకూడదు. నీ ధనము వలన సాధువునకు లభించే దేమియును ఉండదు. అతడే నీకు పుణ్యమును ప్రసాదించుచున్నాడు. సర్వసంగ పరిత్యాగులను త్రాసుతోతూచే ప్రయత్నము అనర్థదాయకము.

ధ్యానయోగి ఆత్మవిదు లైనవారి చరణములను సేవించవలెనని కపిలుడు తెలుపుచున్నాడు. సూర్యోదయము లోకమును వెలుగులతో నింపునట్లు, మహాత్ముల చరణపంకజములు మానవుల హృదయములను దివ్యతేజముతో నింపును.

గ్రామ్యధర్మ నివృత్తిశ్చ మోక్ష ధర్మరతి స్తథా మితమేధ్యాదనం శశ్వ ద్వివిక్త క్షేమసేవనమ్

ధ్యానయోగి మోక్షమునే ధ్యేయముగా భావిస్తుండాలి. ఆహార నియమమును పాటించాలి. ఆహారశుద్ధి లేనిచో ధ్యానము వక్రించును. ఆహారమును మితముగా భుజించాలి. హితమైన దానినే గ్రహించాలి. పవిత్రమైన ఆహారము బుద్ధినిగూడ పవిత్రమొనర్చును. పరిమితమైన,పవిత్రమైన ఆహారము సర్వదా ధ్యానయోగికి శ్రేయము నొనగూర్చును.

సాధకుడు ఏకాంతవాసము నలవరచుకొని ధ్యానమును కొనసాగించాలి. జనసంసర్గము సంస్కారములను వక్రింపచేయును. లౌకిక జీవనము అలవడును. జనసంసర్గము వాసనలను విపరీతముగ పెంచును. ధ్యాన సమయమున జనార్దనునికి బదులుగ జనులే గోచరించు చుందురు.

అహింసా సత్యమస్తేయం యావదర్థ పరిగ్రహః
బ్రహ్మ చర్యం తపః శౌచం స్వాధ్యాయః పురుషార్చనమ్

ధ్యానయోగి అహింసావ్రతము నవలంబించాలి. త్రికరణశుద్ధిగ అహింసను పాటించాలి. మాటలలో మృదుత్వముండాలి. చేతలలో చేతనత్వము స్ఫురించాలి. ఆలోచనలు బుద్ధికి ఆనందాన్ని కల్గించాలి. హింసకు అలవాటు పడినవాడు తెలియక తనను తానే హింసించు కొనుచుండును.

సత్యమునే పలకాలి. అసత్యము పలుకుట అనర్థదాయకమని గుర్తుంచుకోవాలి. ఒకవేళ పొరపాటున అబద్ధము లాడినచో వెంటనే పశ్చాత్తాపముతో భగవన్నామమును కీర్తించి వాలుకను శుద్ధిచేసుకోవాలి.

అసత్యము ఎలాంటిదో దొంగతనము కూడ అలాంటిదే. కనుక అస్తేయమును పాటించాలి. అనగా దొంగతనము చేయరాదు. ఈ ప్రపంచములో అందరూ దొంగలే. మనము అందమైన వస్తువును గాంచినపుడు అది మనకు కావలెనని అభిలషింతుము. అదియును దొంగతనమే కాగలదు. కొన్నింటిని మనస్సులో వాంఛింతుము. అనగా మనస్సుద్వారా దొంగిలించు చున్నామని భావము. మనస్సు ప్రవేశించినచోట జరుగు కార్యములన్నియు భావప్రేరితములే యని గుర్తించాలి.

మనకున్నదానిని ఇతరులతో పంచుకోవాలి. అప్పుడే హృదయము శాంతి ననుభవించును. ఇచ్చేవాడే ఉన్నవాడు. పుచ్చుకునేవాడు బిచ్చగాడు. పుచ్చుకొనే వాడిని అందరూ నొచ్చుకుంటూనే యుంటారు. పుచ్చుకొనేవాడు లోకంలో లోకువవుతాడు. విష్ణువంతటివాడు బలిచక్రవర్తిని యాచించి నపుడు పొట్టివాడయ్యెను. ఆయనే అర్జునునకు జ్ఞానము నొసగునపుడు విశ్వరూపుడయ్యెను.

ధనమును పోగొట్టుకొనవచ్చును. శీలమును పోగొట్టుకొనరాదు. యోగులు శీలవంతులై యుండాలి. ధ్యానయోగి బ్రహ్మచర్యము నవలంబించాలి. బ్రహ్మచర్య ప్రభావముచే హనుమంతుడు సాగరమును లంఘించెను. బ్రహ్మచర్యమును పాటించు ముముక్షువులు భవసాగరమును అవలీలగ దాటుదురు.

ధ్యానయోగి స్త్రీలలో బాలకృష్ణుని దర్శించును. అందము మనిషిని ఉన్మత్తుని గావించును. అందములో అచ్యుతుని గాంచువారికి ఆనందము కలుగును. శుకబ్రహ్మ రంభయొక్క సౌందర్యమును జూచి చలించలేదు. ఆమె తన శ్యామసుందరుని వలె అందముగా లేదని తలచెను. జగదీశ్వరుని యందలి అనురక్తి జగత్తుపై విరక్తిని పెంచును.

తపస్సనగా తపించుట యని భావము. భగవత్స్మరణలో ఇంద్రియ మనోబుద్ధులను తపింపచేయాలి. అగ్నితప్త మగుటచే బంగారము శుద్ధమైనట్లు, తపస్సు ద్వారా జీవి శుద్ధిపడును. ధ్యానయోగి దేహమును, మనస్సును, సంకల్పాలను పరిశుద్ధముగా నుంచుకొనవలెను. స్వాధ్యాయమును సాగించుచు భగవదర్చనమును కొనసాగించవలెను.

మౌనము నెక్కువగా పాటించాలి. వాచా మౌనమునే గాకుండా వాసనా మౌనమును కూడా అభ్యసించాలి. పరనింద, ఆత్మస్తుతి యనెడి రెండు దుర్గుణములు ఎవరికి దూరమగునో వారికి మౌనము చేరువగును.

ధ్యానయోగి మొదట ఆసనసిద్ధిని బొందాలి. చక్కగా కూర్చొగలగాలి. ఇది అభ్యాసము వలన లభ్యమగును. ఒక ఉద్యోగి ఆఫీసరు ముందు స్థాణువువలె నిలబడి యుండును. ఆలయంలో అర్చన జరుగునపుడు గాలికి చెట్లు ఊగునట్లు కదలుచుండును. ఇవన్నియు వారివారి సంస్కారములకు దర్పణములు.

దేహమును స్థిరపరచిన పిదప నేత్రములను నిగ్రహించాలి. చంచలమైన దృష్టి చపలబుద్ధికి వ్యక్తరూపము. దేహమును నేత్రములను స్థిరముగ యుంచిన పిదప మనస్సును కదలకుండా అరికట్టాలి. హరి పాదములకు గట్టి బంధించాలి.

భగవత్కథా శ్రవణమునందు తృప్తిచెందే అంతఃకరణమును కలిగియుండాలి. శ్రవణసమయంలో నేత్రములలో నందనందనుడు నివసించాలి. పంచప్రాణములను కర్ణపుటములలో బంధించి భగవల్లీలలను శ్రవణం చేయాలి. ఈ విధమైన ప్రారంభ చర్యలయందు అభివృద్ధిని స్థిరబుద్ధిని సాధించిన పిమ్మట ధ్యానమును కొనసాగించాలి. ధ్యానము పరమోత్కృష్టమైనది. అది సర్వ కల్మషములను అంతమొందించి జీవులకు సర్వోపద్రవ రహితస్థితిని ప్రసాదించును.

యది శైల సమం పాపం విస్తీర్ణం బహు యోజనమ్
భిద్యతే ధ్యానయోగేన నాన్యో భేదః కదాచన

"బహు యోజనములు విస్తరించిన కొండంత పాపమైనను ధ్యానయోగముచే నశించిపోవును. మరియొక భేదోపాయముతో గానేరదు" యని ఉపనిషత్తు ప్రవచించినది.

ధ్యానయోగ విధానము

కపిలదేవుడు చెప్పుచున్నాడు: "తల్లీ! మనునందినీ! మొదట ఆసనమును జయించాలి. ధ్యానమునకు పవిత్రమైన ప్రదేశమును నిర్ణయించుకోవాలి. దర్భాసనముపై మృగచర్మమును పరచి ఆసనమును తయారు చేసుకోవాలి. దానిపై కూర్చొని దేహమును స్థిరముగా నిలిపి ప్రాణాయామమును చేయాలి. ప్రాణాయామము చిత్తమును స్థిరముగ యుంచును.

ప్రాణాయామై ర్దహే ద్దోషాన్ ధారణాభిశ్చ కిల్బిషాన్
ప్రత్యాహారేణ సంసర్గాన్ ధ్యానేనా నీశ్వరాన్ గుణాన్

"ప్రాణాయామము ద్వారా వాతశ్లేష్మాది దోషములు నివారింపబడును. ధారణవలన పాపములు పరిహారమగును. ప్రత్యాహారము ద్వారా విషయాదుల వలన కలిగెడి కిల్బిషములు నశించును. ధ్యానము ద్వారా అసద్గుణములు దగ్ధములగును" యంటూ కపిలుడు ధ్యానప్రక్రియలను చెప్పుచున్నాడు.

ఈ విధముగా బుద్ధిని శుద్ధిచేసికొని ఆ తరువాత నాసాగ్రమునందు దృష్టి నిలిపి పరమాత్మను ధ్యానింపవలెను.

భగవానుని ఏ రూపముతో ధ్యానించిన అతడు ఆ రూపముతో దర్శనము నొసగును. అన్ని రూపములు పరమాత్మయే యైనందున రూపముల మధ్య భేదమును దర్శింప నవసరములేదు. ఒక రూపమునే ధ్యానింప వలెననెడి నిర్దేశ మసలేలేదు. రూపభేదమును శాస్త్రము అంగీకరించినది. కానీ భావ భేదమును శాస్త్రము అంగీకరించదు. ఈ విధముగా పలికి చతుర్భుజుడైన మహనీయమూర్తియగు నారాయణమూర్తిని ధ్యానింపుమని కపిలుడు దేవహూతికి తెలిపెను.

సీ॥ కంజాత కింజల్క పుంజరంజిత పీత కౌశేయవాసు జగన్నివాసు
శత్రుభీకర చక్ర శంఖగదా పద్మ విహిత చతుర్బాహు విగత మోహు
మత భక్తలోక మహో నేత్ర వర్ధిష్ణు లాలిత సద్గుణాలం కరిష్ణు
వరకుమారక వయః పరిపాకు సుశ్లోకు సుందరాకారు యశో విహారు
తే॥ సకల లోక నమస్కృత చరణకమలు భక్తలోక పరిగ్రహ ప్రకట శీలు
దర్శనీయ మహోరథ దాయి గీర్తనీయ తీర్థ యశో మహనీయ మూర్తి

భగవంతుని రూపము మనస్సులో స్థిరముగా నిలువవలెను. భగవానుని సర్వాంగముల యందు మనస్సును స్థిరముగ నిలుపవలెను. ఒక్కొక్క అవయవమును విశేషముగా అవలోకించుట చేత పూర్ణరూపము దివ్యముగ మనస్సులో నిలిచిపోవును. భగవంతుని

ధ్యానమునందు చిత్తము స్థిరముగ నిలువగనే తైలాదులులేక దీపము ఆరిపోవునట్లు, విషయాదులు లేక చిత్తమునందలి అభిమాన జ్వాల ఆరిపోవును.

ధ్యానమునకు ముందుగా దాస్యము అలవడవలెను. దాస్యభక్తి అలవడిన తరువాతనే ధ్యానము పటిష్టమగును. "స్వామీ! నీవు స్వామివి. నేను నీ దాసిని" యని మీరా అనును.

దంసయతే స్వామి కార్యాణి సావధానే నేతి దాసః

"స్వామి కార్యములను అవధానముతో జేయువాడు దాసుడు" అని వ్యుత్పత్తి.

దాస్యభక్తి భాగవతధర్మమై యున్నది. ఈ విషయమును స్కాందపురాణము గూడ ధృవపరచింది.

తస్మిన్ సమర్పితం కర్మ స్వాభావిక మపీశ్వరే
భవే ద్భాగవతం ధర్మం తత్కర్మ కిముతార్పితమ్

"స్వాభావికమైన కర్మను భగవంతుని యందు సమర్పించుటయే భాగవతధర్మము. దీనినే దాస్య మందురు" యని స్కాందపురాణములో తెలుపబడినది.

ప్రతివ్యక్తికి భక్తి స్వాభావిక కర్మయైయున్నది. భక్తి ఎలా స్వాభావిక మగును? యని కొందరు శంకింప వచ్చును. అసలు భక్తి యన నేమియో మనము విచారింప వలసి యున్నది.

సాత్వస్మిన్ పరమప్రేమ రూపా

"పరమాత్మ వైపునకు మరలిన పరమ ప్రేమయే భక్తి" యని నారదమహర్షి భక్తి సూత్రములలో తెలిపియున్నాడు.

"ప్రేమ సంతలో విక్రయింపబడే వస్తువుగాదు. ప్రతిమానవ హృదయంలో ప్రేమ దాగియున్నది. బాల్యమున ప్రతిబిడ్డ తల్లిని ప్రేమించును. ఈ ప్రేమ స్వాభావికము. విద్య నేర్చుకొనుటకు బిడ్డ బడికేగును. ప్రేమను నేర్పించే బడులు ఎక్కడాలేవు. తల్లిని ప్రేమించమని బిడ్డకు ఎవ్వరూ చెప్పలేదు. అది స్వాభావికమైనది.

బిడ్డ వయస్సులో కొద్దిగా వృద్ధిజెందగనే తల్లికి సహాయము చేయును. ఈ విధముగా తన హృదయము నందున్న ప్రేమను వ్యక్తమొనర్చును. ఆ ప్రేమలో తానూ తృప్తి చెందును. ఆ బిడ్డకే యుక్తవయస్సు రాగానే వివాహమగును. అప్పుడు తప్పని సరిగ తల్లికి దూరమగును. ఇప్పుడు తల్లి జ్ఞాపకాలతో జీవించుచుండును. ఈ విధముగా ప్రతిమానవ హృదయములో బాల్యము నుండియు నిగూఢముగ నిలిచియున్న ప్రేమను నిత్యుడైన భగవంతుని వైపుకి మరల్చవలెను. దీనినే ప్రేమ పూరితమైన దాస్యభావములో భక్తులు పొందుచుందురు.

తాను దాసుడనని భక్తుడు తనను తాను తక్కువ చేసికొనుచుండగా అతని వైభవమును భగవానుడు ఎక్కువ చేయుచుండును.

దాసోస్మీతి నిజం రూపం స్మర స్మృచ్యేత బంధనాత్

ఎవడు తాను దాసుడనని భావించుచు భగవానుని నిజరూపమును స్మరించునో వాడు బంధముల నుండి విడిపడుచున్నాడు.

కపిలదేవుడు దేవహూతికి చెప్పుచున్నాడు: "తల్లీ! దాస్యభావముతో సదా నా స్వరూపమునే ధ్యానించువారు అవిద్య నంతరింప జేసుకొని నన్నే బొందుచున్నారు" అని చెప్పసాగెను.

మత్తు పానీయముచే మత్తెక్కిన మనుజునకు తన దేహముపై వస్త్ర ముండినను, ఊడినను తెలియకుండును. అలాగే ధ్యానయోగి దేహముపై ధ్యాస లేనివాడై యుండును. ప్రారబ్ధవశమున అతడు కర్మలాచరించు చుండినను వాటికి అంటనివాడై, స్వాప్నిక విషయముల వలె వాటిని గాంచుచుండును. కనుక భక్తియోగము మోక్షము ననుగ్రహించును.

"తల్లీ! ప్రేమాధిక్యము వలన భార్యాపుత్రాదులను మనుజుడు నిత్యమని భావించును. కాని వాస్తవానికి ఈ బంధములన్నియు అనిత్యములే. ఆత్మ ఏకము. దేహాదులకు భిన్నమై యుండును. భక్తిని కలిగిన ధ్యానయోగి సమస్త జీవులయందు ఆత్మను, ఆత్మయందు సమస్త జగత్తును దర్శించు చుండును.

"జననీ! అగ్ని ఒక్కటియే యైనను తాను వ్యక్తమయ్యే కట్టెలను బట్టి పొట్టిగను, పొడవుగను తెలియులాగున అద్వయమైన ఆత్మ దేహాదుల వలన అనేక విధములుగ గన్పట్టుచుండును. ధ్యానయోగి యీ విషయము నెరిగినవాడై ఏకాత్మను దర్శించుచుండును." అని ధ్యానయోగ విధానమును సమాప్తి చేసెను.

సీ॥ సుతదార మిత్రానుజుల కంటె మర్త్యుండు భిన్నుడై వర్తించుచున్న రీతి
విస్ఫు లింగోల్ముక విపుల ధూమములచే హవ్యవాహనుడు వేఱయిన రీతి
వల నొప్పు దేహంబు వలన నీ జీవాత్మ పరికింప భిన్న రూపమున నుండు
దవిలి భూతేంద్రియాంతః కరణంబుల భాసిల్లుచున్న యీ ప్రకృతి రూప
తే॥ బ్రహ్మమున కాత్మ దా బృథగ్భావ మగుచు ద్రష్టయయి బ్రహ్మ సంజ్ఞచే దనరుచుండు
నఖిల భూత ప్రపంచంబు లందుదన్ను దవిలి తనయందు నఖిల భూతముల గనుచు

పరాభక్తి

భక్తి ప్రేమ రూపమైనను వ్యక్తుల యందలి గుణభేదములను బట్టి అనేక విధములుగ తెలియుచున్నది. మొదటిది ప్రేమభక్తి లేక పరాభక్తి. దీనినే అనన్యభక్తి యని గూడ పిలుతుము. రెండవది గౌణభక్తి. ఇది గుణ సహిత మైనందున గౌణభక్తి యని పిలువబడినది.

గౌణభక్తి సాత్త్వికమని, రాజసమని, తామసమని మూడువిధములుగ నుండును. హింసా దంభ మాత్సర్యములను కలిగి భేదభావములతో చరించుచు ఎవ్వడైతే భగవానుని భజించునో వాడు తామసభక్తుడు.

ఈ తామసభక్తుల వలన సమాజాభ్యుదయము కుంటుపడును. వీరు దేవుని పేరిట హింసను రేకెత్తింతురు. ఆడంబరములతో ఊరేగుచుందురు. ఈర్ష్యాసూయలను ప్రదర్శించు చుందురు. ఆత్మను దర్శించలేని ఈ మూర్ఖులు ఉపాధులనే ముఖ్యముగా భావించు చున్నందున భేదభావములతో ప్రవర్తించుచుందురు.

రెండవవారు రాజసభక్తులు. వీరిలో రజోగుణము ఎక్కువగా గోచరించు చుండును. వీరిలో వాంఛ లెక్కువగా యుండును. పేరుప్రఖ్యాతులను ఆశించుచుందురు. ఐహిక సంపదలను కాంక్షించుచుందురు. వీరు గూడ ఉపాధి దృష్టియందే ఉండుట చేత భేదమునే దర్శించు చుందురు.

మూడవవారు సాత్త్వికభక్తులు. వీరు అభేదమును దర్శింపలేకున్నను, భేదమును మదిలో ధరించియున్నను పాపప్రక్షాళనము కొఱకు, కర్మలను ఈశ్వరార్పితము గావించుట కొరకు భక్తిని చేయు చుందురు.

ఈ ముగ్గురును గౌణభక్తి క్రిందికి వత్తురు. తరువాత వచ్చువారు ముఖ్యభక్తులు, లేదా పరాభక్తులు. వీరిది గుణాతీతభక్తి. ఇది పవిత్రమైన శుద్ధభక్తి. అఖండభక్తి. గంగానది ఏ విధముగా సాగరము వైపునకు నిరాటంకముగా పరుగులిడు చుండునో ఆ విధముగా సర్వాంతర్యామి యగు పరమాత్మ వైపుకు నడచే అకుంఠిత భక్తి. అవిచ్ఛిన్న భక్తి. ఫలితములపై దృష్టిలేని ఈ గుణాతీత భక్తియే పరాభక్తి యని చెప్పబడినది. ఈ పరాభక్తిలో చరించు పుణ్యాత్ములకు, పరమాత్మకు భేదమే లేదని నారదమహర్షి భక్తి సూత్రాలలో తెలుపుతాడు.

చ॥ మనుసుత! మద్గుణ శ్రవణ మాత్ర లభించిన యట్టి భక్తిచే
ననఘుడ సర్వశోభన గుణాశ్రయుడన్ బరమే శ్వరుండనై
తనరిన నన్ను జెందిన యుదాత్త మనోగతు లవ్యయంబులై
వననిధి గామి యైన సురవాహిని బోలె ఫలించు నిమ్ములన్

"తల్లీ! ఈ పరాభక్తినే ఆత్యంతిక భక్తి యని కూడా పిలుతురు. ఇది గుణాతీతభక్తి. దివ్యమైన ఈ భక్తియే సర్వులు పొందదగినదియై యున్నది. దీనిని సాధించుటకు ఆచరించవలసిన సాధనలను చెప్పుచున్నాను. ఆలకింపుము" అని కపిలభగవానుడు చెప్పసాగెను.

ధర్మయుతుడు పూజాది కర్మములను నిర్వర్తించవలెను. ఇంటిని దేవాలయముగా భావింపవలెను. పరమాత్మకు సమర్పించనిదే ఆహారమును భుజించరాదు. ఒక్కమూర్తినే ఇష్టదైవముగా స్వీకరింపవలెను. అన్యదేవతా మూర్తులను ద్వేషింపరాదు. తానారాధించు పరమాత్మను సర్వభూతములలో గాంచు చుండవలెను. పరమాత్మకు తన ఆవరణములో యున్న పుష్పములను మాత్రమే కోసి సమర్పింపవలెను. స్థూలమైన పుష్పములతోపాటు భావనా సుమములను గూడ సమర్పింపవలెను.

అహింసా ప్రథమం పుష్పం పుష్ప మింద్రియ నిగ్రహః
సర్వభూత దయాపుష్పం క్షమాపుష్పం విశేషతః
శమః పుష్పం తపః పుష్పం ధ్యాన పుష్పం తథైవచ
సత్యం చైవాష్టమం పుష్పం ఏతై స్తుష్యతి కేశవః

యెనిమిది రకములైన భావనా సుమములచే శ్రీహరిని సంతోషపెట్టవలెనని పురాణవచనము. అవి ఏవనగా 1.అహింస, 2. ఇంద్రియనిగ్రహము, 3. భూతదయ, 4.సహనము, 5.మనోనిగ్రహము,6.తపస్సు, 7. ధ్యానము, 8.సత్యము. ఈ ఎనిమిది భావనా సుమములు భగవానునకు అత్యంత ప్రీతికరములైనవి.

ఆత్యంతిక భక్తి సాధనచేయు సాధకుడు పెద్దలను గౌరవింపవలెను. దీనులపై దయజూపవలెను. సమానులతో స్నేహము చేయవలెను. అందరిలో పరమాత్మ యున్నాడనెడి భావనను మరువరాదు. ఇంద్రియములను నిగ్రహింపవలెను. సదా భగవన్నామమును కీర్తించు చుండవలెను. కీర్తన చేయువారు కీర్తిమంతు లగుదురు.

కృష్ణేతి మంగళం నామ యస్య వాచి ప్రవర్తతే
భస్మీభవంత రాజేంద్ర మహాపాతక కోటయః

"రాజేంద్రా! ఎవరి నాలుకపై కృష్ణనామము కదలుచుండునో అట్టివాడు చేసిన కోటి పాపములైనను భస్మమైపోవును" యని విష్ణుపురాణము తెలిపినది.

నామమును సదా కీర్తించుచు ఆత్మ తత్త్వమును మహాత్ముల చెంత శ్రవణము చేయుచుండ వలెను. సత్సంగమును వదలరాదు. అహంకారమును త్యజింపవలెను. ఇలా జీవించు చుండినచో చిత్తము నిర్మలమగును. అట్టి చిత్తము పరమాత్మను బొందగలుగును.

పుష్పముల యందలి సౌరభము వాయువు ద్వారా ఘ్రాణేంద్రియమునకు చేరునట్లు, రాగద్వేషముల నుండి విడివడిన చిత్తము పురుషోత్తముడగు పరమాత్మను బొందును.

అహం సర్వేషు భూతేషు భూతాత్మా వస్థితః స్సదా
తమవజ్ఞాయ మాం మర్త్యః కురుతేఽర్చా విడంబనమ్

"జననీ! నేను ఆత్మరూపుడనై సర్వభూతముల యందును వసించుచున్నాను. ఈ సత్యము నెరుగని మర్త్యులగు జీవులు నన్ను విగ్రహముగా భావించి అర్చించుచున్నారు. ఇది అపరాధమే" యనెను.

అర్చనలో విగ్రహముండును. మనస్సును విగ్రహించుటకు విగ్రహ ముపకరించును. అంతేగాదు, భక్తి పూర్ణరూపమును ధరించినచో విగ్రహము నుండియే అనుగ్రహము కూడా లభించును. విగ్రహము నందు పరమాత్మను దర్శింపవచ్చును. కానీ పరమాత్మను విగ్రహమునకే పరిమితము చేయరాదు. విగ్రహము యందు బ్రహ్మభావనను కలిగి యుండవలెను. సాధన ఆ స్థాయిలో ఆగకూడదు. ఆత్యంతిక భక్తి సాధనచేయు సాధకుడు ఇంకా ముందుకు సాగిపోవాలి. అందరిలోను పరమాత్మను దర్శించే అమృతమయ దృష్టిని తయారుచేసుకోవాలి. తాను పరిమితుడై భగవంతుని పరిమిత మొనర్చరాదు.

చ॥ అనిశము సర్వభూత హృదయాంబుజ వర్తి యనం దనర్చు నీ
శుననను నవజ్ఞసేసి మనుజుం డొగి మత్ప్రతి మార్చనా విడం
బనమున మూఢుడై యుచిత భక్తిని నన్ను భజింపడేని వ
మ్మనుజుడు భస్మకుండమున మానక వేల్చిన యట్టి వాడగున్

"తల్లీ! దేహాత్మభావముతో ఎవడు భేదదృష్టి గలిగి యుండునో, ద్వేషభావములతో నిండియుండునో అట్టివాడు ఆత్యంతిక భక్తుడు కాలేడు. అట్టివాడు అశాంతితో అలమటించు చుండును. ఎవడైతే ప్రాణులను ద్వేషించునో అట్టివాడు నా ప్రతిమ నర్చించినను నన్ను బొందలేడు" అని కపిలుడు చెప్పుచున్నాడు.

సర్వభూతములలో పరమాత్మను దర్శింపవలెను. సర్వులను ప్రేమింపవలెను. దానాదుల ద్వారా వారిని తృప్తి పరచవలెను. ఈ విధముగా జీవించు భక్తుడు సర్వులలో శ్రేష్ఠుడు.

"తల్లీ! నేను నీకు భక్తి యోగమును, అష్టాంగ యోగమును బోధించితిని. ఈ రెండింటిలో దేని నాచరించినను ముక్తి లభించును" యని కపిలుడనెను. కాలమహిమను గూర్చి కూడ తల్లికి తెలిపెను.

కాలము శక్తిమంత మైనది. కాలమునకు ప్రియాప్రియము లుండవు. కాలమునకు తనవారంటూ ఎవ్వరూలేరు. కాలము ఎవ్వరి కొరకు నిరీక్షించదు. కాలంలో సర్వులు నీరసించు చున్నను తాను నీరసము నెరుగదు. కాలము సర్వమును హరించును.

కాలమునకు భయపడి సూర్య, చంద్ర, నక్షత్రాగ్నులు ప్రకాశించు చున్నవి. కాలమునకు భయపడి నదులు పారుచున్నవి. చెట్లు పుష్పించి ఫలించుచున్నవి. బ్రహ్మాది దేవతలు గూడ కాలమునకు భయపడియున్నారు.

ఈ కాలమే దంపతులను ఏకము చేయుచున్నది. వేరుచేయుచున్నది. సంతానమును కలిగించు చున్నది. ఉత్సాహమును కల్పించుచున్నది. నిరుత్సాహమును పంచుతున్నది. అవ్యయమై యున్నది. అనంతమై యున్నది. అనాదియై యున్నది.

జీవుల సుడిగుండాలు

"తల్లీ! కాలము భయంకరమైనది. అగాధమైనది. దానిని జయించుట ఎవరికిని సాధ్యముగాదు. దాని లోతును ఎవ్వరూ తెలిసి కోలేరు. గాలిచే చెదరగొట్టబడు మేఘములు గాలియొక్క బలమును తెలియనట్లు, జీవుడు కాలముయొక్క బలమును తెలిసికొనజాలడు" అని కపిల భగవానుడు జీవుల గతిని, గతులను అద్భుతముగా ప్రవచించుట కుపక్రమించాడు.

మానవుడు తానాశించు ఆనందము వస్తువుల నుండి లభించునని భ్రమించి, వాటిని సేకరించుటకు నానాయాతనలు పడుచున్నాడు. అంతగా కష్టించి సాధించిన

వస్తువులను కాలము క్షణంలో హరించుచున్నది. అది గాంచి మనుజుడు తీవ్రముగా దు:ఖించుచున్నాడు. కాలములో సాధింపబడున వన్నియు కాలంలోనే నశించుచున్నవి.

దుర్మతియైన మనుజుడు మోహమునకు గురియై, దేహమును, భార్యా పుత్రాదులను, గృహమును, పొలమును, ధనమును నిత్యమని భావించును. దేహము క్షీణించుటకు ప్రారంభించును. భార్యా పుత్రాదులు గతించుచుందురు. గృహము ఛిద్రమగు చుండును. పొలము బీడు పడును. ధనము దొంగలవాత బడును. లేదా రాజులు హరింతురు. నశించే వీటన్నింటిని తలచుకొని మానవుడు దుర్భర దు:ఖము ననుభవించు చుండును. పోగేవాటిని ఎవ్వరూ ఆపలేరు.

అనీశ్వరో ఽయం పురుషో భవా భవే సూత్రప్రోతా దారుమయీవ యోషా

"కలిమిలేముల యందు పురుషునకు స్వాతంత్ర్యము లేదు. త్రాడుకట్టి లాగబడుచున్న కొయ్యబొమ్మవంటివాడు " యని మహాభారతము ప్రవచించినది.

కుటుంబము నందలి అత్యాసక్తిచే దానిని పోషించుటకు మనుజుడు అధికముగ శ్రమించును. సర్వావయవములను శిథిల మొనర్చుకొనును. పాపములను విరివిగ చేయుచుండును. విషయములు విషతుల్యములని ఎరుగక వాటియందు భోగాసక్తితో రమించు చుండును.

స్త్రీలు ఏకాంత సమయాలలో ముచ్చటించు రహస్య భాషణము లనెడి అయస్కాంతముచే ఆకర్షింపబడి తన్మయుడగు చుండును. "మీరే నాదైవం. మీరే నాప్రాణం. మీ కొరకే నా జీవం. మీతోనే నా మరణం. మీ ముందు చంద్రుని చల్లదనం వెలవెలపోతుంది. సూర్యుని ప్రతాపం క్షీణించి పోతుంది. మిమ్మల్ని పొందటం నా అదృష్టం!" ఇలాంటి తల తిరుగుడు పలుకులచే పిచ్చివాడై స్త్రీయొక్క కొంగు బట్టుకొని తిరుగునే గాని, వాస్తవము యొక్క రంగు నెరుగడు. "మా నాన్న మంచాడు" అనగానే బాలుర మధుర వాక్కులను విని పరవశించి పోతాడు. ఆ మాటతో తనను ముంచాడని గ్రహించలేడు. దు:ఖమునే సుఖమని భ్రమించు చుండును.

క॥ అతి మూఢహృదయ డగుచు దురిత కర్మారంభమున జరించుచు దురుణీ
కృత గోప్య భాషణములను సుతకల సంభాషణముల జొక్కుచు మఱియున్

మమకారమును పెంచుకొనిన వాడై చేయరాని పనులద్వారా ధనము నార్జించును. కుటుంబీకులు అనుభవించిన పిదప మిగిలిన దానినే అనుభవించును. పాపమును మాత్రము తానొక్కడే అనుభవించును. ఆదాయము జానెడైనచో ఆశలు మూరలుండును. ఆశలు తరుముతుండగా అప్పుల పంచన తల దాచుకొనును. అప్పులు తీర్చలేక అబద్ధాలతో తీర్పులు చెప్పుచుండును.

The second vice is lying; the first running into debt

"అప్పు చేయడము మొదటి దుర్గుణము. అసత్య మాడడము రెండవ దుర్గుణము" యని బెంజిమన్ ఫ్రాంక్లిన్ అంటాడు.

అవసరాలు తీరువరకే ఆత్మీయులు నిలుస్తారు. అవసరాలు తీరనిచో, అభిరుచులు పోనిచో ఎవ్వరూ ఆదరింపరు. పూల విషయం దేవుడెరుగు. కట్టెలమ్మే స్థితి గూడ కరువై పోతుంది. ప్రేమలు పాషాణాలవుతాయి. ఆదరణలు ఆక్రోశాలుగా మారుతాయి. పలకరింపుల స్థానే పలవరింతలు ప్రారంభమౌతాయి. వినోదాలు విడ్డూరాలుగా మారుతాయి. విచిత్రాలుగా గోచరిస్తాయి. విషాదాలై మిగుల్తాయి. పోషించలేని సమయ మాసన్నమైనపుడు రైతులు ముసలి ఎద్దును త్యజించినట్లు పుత్రకళత్రాదులు యజమానిని త్యజిస్తారు.

సీ॥ బలిమి సాలక మందభాగ్యుడై కుమతియై పూని యప్పుడు క్రియా హీను డగుచు
దవిలి వృథా ప్రయత్నంబులు సేయుచు మూఢుడై కార్పణ్యమున జరించు
నట్టి యకించను డగు వాని జూచి తద్దార సుతాదు లాత్మలను వీడు
గడు నశక్తుడు ప్రోవగా జాల డితనిని సెగ్గింతు రర్థి గృషీ వలుండు
తే॥ బడుగు ముసలెద్దు రోసిన పగిది నంత నతడు నే వెంటలను సుఖం బందలేక
తాను బోషించు జనులు దన్ దనర బ్రోవ బ్రతుకు ముదిమియు మిక్కిలి బాధపఱుప

కాలము ఎవ్వరినీ కనికరించదు. కాలమునకు ధర్మమేగాని దయలేదు. కాలము పరుగుదీస్తుంటే యౌవనము పతనమౌతూ ఉంటుంది. వయస్సుకూడా విచిత్రమైనది. మూడు ముడులను బిగించిన బలమైన చేతులు తిరిగి చూచుసరికి ముడతలుపడి ఉంటాయి. ముసలితనం ప్రాప్తిస్తుంది. ఇంతవరకు ఎవరిని పోషించుటకు తీవ్రముగా కష్టించెనో ఇప్పుడు వారిచేత పోషింపబడుతూ కఠోరమైన పలుకులను వినలేక కష్టపడుచుండును.

శరీరము దుర్బలమై పోయింది. ముఖము ముడతలు పడింది. చూసినందుకు రుసుమును చెల్లింపమంటూ అందము నంతటిని అద్దము అపహరించినది. భోగము అనుభవించిన దేహము రోగముల పాలైనది. ఆకలిలేదు. నిద్రపట్టదు. తిన్నది దేహాన్ని పాడుచేసింది. విన్నది చెవులను చెడిచింది. చూసింది చూపును వక్రింప చేసింది. పాతలన్నీ రోతలయ్యాయి. బ్రతుకు మోయలేని మోతగా తయారైంది. వేదనలు వెన్నునంటి యున్నాయి. రోదనలు దారి చూపుతూ ముందు నడుస్తున్నాయి. భార్యాబిడ్డలు అవమానముతో బెట్టు అన్నమును కుక్కవలె గతికి బ్రతుకును కాలంతో అతికించుకోవలసిన దుర్గతిలో జీవితమును వెళ్ళబుచ్చు చుండును.

క॥ వెడరూపు దాల్చి బాంధవు లడలగ నిర్యాణమునకు నభిముఖుడై, యి
ల్వెడలగ జాలక శునకము వడువున గుడుచుచును మేను వడవడ వడకన్

"తల్లీ! మృత్యువు సమీపించును. ప్రాణవాయువుచే నెట్టబడిన నేత్రములు గోళములవలె ఉబ్బి బయట పడును. కఫవాతములు శ్వాసల నడ్డగించు చుండును. కంఠమునకు అవరోధమును గల్పించు చుండును. జననీ! చావు కోఱల్లో చిక్కియున్న

వానిని గని బంధువులు దు:ఖించుచుందురు. ఎన్నియో విషయములను జ్ఞాపకము చేయుచు పలకరించు చుందురు. అతడు సమాధాన మీయలేని దురవస్థలో చిక్కుకొనియుండును. దు:ఖించు బంధువులను తలచి భీరుడగును. చివరకు ఏమియును చేయలేక చావును ఆలింగనము చేసికొనును" యని కపిలదేవుడు తల్లియగు దేవహూతికి చెప్పెను.

మృత్యుశయ్యపై పరుండియున్న మానవుని ఆలోచనలను నమోదు చేయు యంత్రమే గనుక ఉండినచో మృత్యులయ్యే వారి భావములన్నియు, ఒకే విధముగా యుండెడివి. "అయ్యో! అనవసరముగ నా జీవితము నంతటిని వృథాచేసికొంటిని. ఎండమావుల వెంట పరుగిడుటలోనే నా కాలమంతయు కరిగిపోయినది. ఈ బుద్ధి ముందుగనే యుండినచో వెతలు తెలియని వెలుగును దర్శించి యుండేవాడిని" యనెడి మూగబాధయే అందరినుండి వినిపిస్తుంది.

మరణకాలము అతి భయంకరమైనది. భగవంతుని ధ్యానించుటకు అది అనువైన సమయము గాదు. బ్రతుకులో లేని వెలుగు చావులో రాదు. ఆరోగ్యముతో జీవించి యుండగనే భగవంతుని ధ్యానించడం అలవరచుకోవాలి. దీపమున్నప్పుడే ఇల్లు చక్కబెట్టుకోవాలి. శక్తి యున్నప్పుడే ముక్తిని అన్వేషించాలి. చావు రాకముందే చావును దర్శించాలి. అట్టివారే తరించగలరు. మృత్యుశయ్యపై మాధవస్మరణ యనునది సామాన్య మానవులకు సాధ్యమయ్యే కార్యముగాదు. ఈ విషయము మహాభక్తులైన కులశేఖర ఆళ్వారు తన **"ముకుందమాల"** గ్రంథములో *అత్యద్భుతంగా రచిస్తారు.

కృష్ణ! త్వదీయ పదపంకజ పంజరాన్త మద్యైవ మే విశతు మానస రాజహంసః
ప్రాణ ప్రయాణ సమయే కఫవాత పిత్తైః కంఠావ రోధన విధౌ స్మరణం కుతస్తే

"హే కృష్ణా! నా చిత్తమనెడి రాజహంస ఇప్పుడే నీ పాదపద్మము లనెడి పంజరము నందు ప్రవేశించుగాక! ప్రాణోత్క్రమణ సమయాన కఫవాత పిత్తములచే కంఠము మూతబడి నోరు తెరుచుటకు వీలులేని దుర్దశలో నిన్ను స్మరించుట ఎలా సాధ్యపడును?"

కపిలుడు చెప్పుచున్నాడు: "తల్లీ! మరణ సమయాన భయంకరరూపులగు యమదూతలు దర్శనమిత్తురు. స్వజనులను వదలలేక, యమదూతలతో ఏగలేక భయకంపితుడై మరణ సమయాన జీవుడు మలమూత్రములు విడచును. ప్రాణములు బలవంతముగ లాగివేయబడును. దేహి పోవగా దేహము మిగులును. చిలుక ఎగిరిపోగా గూడు రాలిపోవును" యని చెప్పసాగెను.

గగనమునుండి శ్మశానములో తన దేహము పడేపాట్లను జీవుడు గాంచును. దిక్కులేని దేహము కట్టెల మధ్య దగ్ధమగు చుండును. ఆహా! ఏమి దురవస్థ ప్రాప్తించినది? కులికిన దేహము కాష్ఠంలో కాలిపోవు చున్నది. చిటపటమని పగిలే చర్మమును గాంచి జీవి దు:ఖితుడగును. చూస్తుండగనే దేహము రెండుకిలోల ఎరువుగా మారిపోయింది.

* స్వామీజీ రచించిన "ముకుందమాల" వ్యాఖ్యానము చూడగలరు.

"తల్లీ! మరణానంతరము ఈ దేహము యొక్క దీనావస్థ వర్ణింపనలవిగానిది" యని కపిలదేవుడు దేవహూతికి చెప్పుచున్నాడు.

దేహమును వదలిన జీవుడు శవము చుట్టును జేరి బంధువులు చేయు ప్రసంగముల నాలకించును. నా వాటా నాకు రానిదే శవాన్ని ముట్టనీయ ననెడి పలుకుల నాలకించును. వాటా కొరకు శవాన్ని కాటా వేసే మానవ జీవన బాటను గాంచి దు:ఖించును. ఆస్తి ననుభవించింది జాలక అస్తికలతో గూడ ఆడుకొనే పైశాచిక మానవ స్వభావమును గాంచి వ్యథచెందును.

శవాన్ని కదలిస్తారు. "ఏమి సాధించాడు? ఎంతో శ్రమించాడు" అని శవ వాహకుల మాటలు హృదయాన్ని శూలాలతో గ్రుచ్చినట్లుంటాయి. ఒకనాడు పూలు జల్లిన వారు ఈ నాడు మట్టి జల్లుతున్నారు. ఎవరి నయితే వదల లేనివాడై పరమశరణ్యుడైన భగవానుని జీవితకాలంలో విడచెనో ఆ బంధువులే తన దేహాన్ని నిర్దాక్షిణ్యంగా శ్మశానంలో పడేసి వెనుదిరిగి వెళ్ళారు.

ఋణానుబంధం తీరిపోయింది. ఏనాటి ఋణమో కుక్కలు యరుదెంచాయి. నక్కలు కదలివచ్చాయి. పిలిచినట్లు, గ్రద్దలు గుమిగూడాయి. విందు నారగించేందుకు వాయసములు వాలాయి. పూడ్చిపెట్టబడిన దేహాన్ని కుక్కలు నక్కలు కలసి బయటికి లాగాయి. నక్కలు దేహాన్ని చీల్చుతున్నాయి. కుక్కలు మాంసాన్ని నములుతున్నాయి. కాకులు అప్పులవాళ్ళవలె పొడిచి తింటున్నాయి. గ్రద్దలు ప్రేగులను లాగుతున్నాయి. తన శరీరానికి పట్టిన దురవస్థను గాంచిన జీవుడు కన్నీటిని గార్చుచు విలపిస్తున్నాడు. ఈ పరిస్థితి జన్మనెత్తిన ఏ దేహానికైనా తప్పదు. స్వర్గ నరకాలు ప్రత్యేకంగా ఎక్కడుండాలి? ఈ బాధలు చాలవా?

అత్రైవ నరకః స్వర్గ ఇతి మాతః ప్రచక్షతే యా యాతనావై నా రక్యస్తా ఇహాప్యు పలక్షితాః

"జననీ! స్వర్గ నరకములు ఈ లోకము నందే గలవనియు, నరకమున యున్న దుఃఖము లన్నియు ఈ ప్రపంచము నందే గోచరించుచున్నవి యని తత్త్వవేత్తలు చెప్పుచున్నారు" యని కపిలుడనెను.

"మాతా! ఇన్ని బాధలకు గురియై దేహమును, కుటుంబమును పోషించిన మనుజుడు ఆ రెండింటిని ఇచ్చుటనే వదలి, పాప పుణ్యములను దారిబత్తెముగ దీసికొని ఒంటరిగ వెడలుచున్నాడు. తాను ఆర్జించిన పాపద్రవ్యమును కుటుంబీకులు అనుభవింతురు. కానీ పాపమును మాత్రము తానే అనుభవింపవలసి యుండును.

"జననీ! ఈ జనన మరణ చక్రము కాలమువలె అవ్యయమైనది. మరణించినవాడు నరక యాతనల ననుభవించి మఱల జన్మించును. అది కూడా నీకు తెలిపెదను. జీవులెలా ఈ ప్రపంచము నుండి నిష్క్రమింతురో తెలిసికొంటివి. వారు తిరిగి ఎలా ప్రవేశింతురో కూడ తెలిపెదను. వినుము. మనునందినీ! పురుషోత్తముడగు పరమాత్మను బొందినంత వరకు జీవులకు ఈ గమనా గమనములు తప్పవు. చావు పుట్టుకలు ఆగవు" యని కపిలదేవు డనెను.

ఈ మానవ జీవితము నీటి బుడగ వంటిది. గాలిపడగ లాంటిది. దీనిని నమ్మి కాలమును వృథా చేసికోగూడదు. మరణమునకై ఏ క్షణమైనను సిద్ధపడి యుండవలెను. ప్రతి ఒక్కరిని మరణము నీడలా వెంటాడుతున్నది. ఈ సత్యమును సాధకులు సదా దర్శించుచుండ వలెను.

యథా ఫలానాం పక్వానాం నాన్యత్ర పతనాద్భయమ్
ఏవం నరస్య జాతస్య నాన్యత్ర మరణాద్భయమ్

"పక్వానికొచ్చిన ఫలములు ఏక్షణమున నైనను భూమిపై రాలిపోవును. అలాగే జన్మించిన మనుజుడు ఏ క్షణమున నైనను మరణము నొందును" యని శ్రీమద్రామాయణములోని అయోధ్యకాండ యందున్నది.


పునరాగమనము

గతి తెలియని మానవుడు దేహమును, కుటుంబమును త్యజించి చితిలో ప్రవేశించిన విధమును కపిలభగవానుడు తెలిపెను. జీవితకాలములో జీవులు అనేక కర్మల నాచరింతురు. కేవలము పుణ్యకర్మల నాచరించినవారు దేవతా శరీరములను ధరించి, దుఃఖ రహిత స్థితి ననుభవింతురు. కేవలము పాపకర్మల నాచరించినవారు తిర్యగ్యోనుల యందు ప్రవేశింతురు. మిశ్రమ కర్మల నాచరించువారు తత్ఫలితములైన సుఖదుఃఖముల ననుభవించుటకు మానవజన్మ నెత్తుచుందురు. జీవుడు దేహమును వదలిపోవు విధమును తెలిసికొంటిమి. మఱల జన్మ కరుదెంచు విధమును కపిలుడు తల్లికి తెలుపుతున్నాడు:

కర్మణాదైవ నేత్రేణ జన్తుర్దేహోపపత్తయే
స్త్రియాః ప్రవిష్ట ఉదరం పుంసో రేతః కణాశ్రయః

"జననీ! గతంలో ఆచరించిన కర్మల ననుసరించి దైవముచే ప్రేరితుడైన జీవుడు దేహమును ధరించుటకై తల్లి యొక్క ఉదరములో ప్రవేశించుటకు పురుషుని రేతఃకణము నాశ్రయించును."

పురుషుని శుక్లము స్త్రీ గర్భములో ఒకరాత్రి యందు శోణితముతో మిళితమగును. అయిదు రాత్రులలో నీటిబుడగ ఆకారమును బొందును. పది దినములలో రేగుపండువలె కఠినమగును. ఆ తరువాత మాంసపు ముద్దయగును. నెలరోజుల పిదప శిరస్సు ఏర్పడును. రెండవ మాసములో కాళ్ళు, చేతులు మొదలైన అవయవము లేర్పడును. మూడవ నెలలో గోళ్ళు, వెంట్రుకలు, శల్యములు, చర్మము ఇత్యాదు లేర్పడును. నాల్గవ మాసములో సప్తధాతువు లేర్పడును. ఐదవ మాసములో ఆకలిదప్పులు కలుగును. ఆరవ మాసమున తల్లి గర్భములో తిరుగును. తల్లి గ్రహించిన అన్నపాదుల ద్వారా జీవుడు వృద్ధిచెందుచుండును. సమ్మతము గాకున్నను ఆ జీవి మలమూత్రముల గుంటలో బడి దొర్లుచుండును.



క॥ జనయిత్రి గర్భమందును ఘనక్రిమి విణ్మూత్ర రక్త గర్తము లోనన్
మునుగుచు జఠరాగ్నిని దిన దినమును సంతప్యమాన దేహుం డగుచున్

మలమూత్రములతో నిండిన ఆ గుంటలో కొన్ని క్రిములు గూడ యుండును. ఆకలిగొన్న యా క్రిములు ఈ జీవుని సున్నితమైన దేహమును కుట్టుచుండును. బాధ అధికమైనపుడు గర్భములోని జీవుడు మూర్ఛితు డగుచుండును. తల్లి భుజించిన ఆహారము నందలి లవణము, కారము, వగరు, పులుపులు బిడ్డను తీవ్ర బాధకు గురి జేయుచుండును. చల్లని పదార్థములను గ్రహించినపుడు గర్భములోని జీవుడు ముడుచుకొనును. తీవ్రమైన ఉష్ణ పదార్థములను స్వీకరించినపుడు కుమిలిపోవును. తల్లి గర్భమున తలను క్రింద యుంచి పడియుండును.

అకల్పః స్వాంగ చేష్టాయాం శకుంత ఇవం పంజరే

"అవయవములను కదలించలేని వాడై పంజరములో బంధింపబడిన పక్షివలె పడియుండును"

ఏడవ మాసము రాగానే జీవునిలో చింతన మారంభమగును. పూర్వజన్మమున ఆచరించిన కర్మము లన్నియు స్మృతిలో మెదలును. చేసిన కర్మలను తలచుకొని చింతించును. ఆచరించిన పాపముల నవలోకించి దుఃఖించును. అనేక విధములైన ఆలోచనలను జేయుచుండును.

గర్భములోని జీవుడు చింతించు విధమును కపిలుడు తల్లికి తెలుపుచున్నాడు: "అయ్యో! ఈ గర్భవాసము ఎంత దుర్భరము? ఎంత దుఃఖకరము? నేను శోక సాగరమున మునిగియున్నాను. పూర్వము అన్యుల కొరకు పాపములు చేసినాను. ఇప్పుడు వాటి ఫలితములను ఒంటరిగ అనుభవించుచున్నాను. గతంలో అనేకములైన యోనులను గాంచితిని. వివిధములైన ఆహారములను భుజించితిని. అనేకములైన స్తనముల ద్వారా క్షీరమును పానము చేసితిని. ఈ ప్రపంచములో నాకు జన్మస్థలము కానిది ఏది? శ్మశానము గాని భూమి నా కెక్కడున్నది? అని విలపించుచు భగవంతుని ప్రార్థించును.

"మూత్ర పురీషములతో నిండిన గుంట వంటి తల్లిగర్భములో నేను పడియున్నాను. జఠరాగ్ని వలన దహింపబడు చున్నాను. ఈ దుర్గంధ భూయిష్ట మలిన కూపము నుండి బయట పడుటకు మాసములను లెక్కించుకొనుచున్నాను. గతంలో నేను ఎన్నియో సార్లు పుట్టితిని. ఎన్నియోసార్లు మరణించితిని. కానీ సత్యమును దర్శించలేక పోతిని. నేను ఈ గర్భము నుండి బయట పడినచో మఱల బంధములను తగిలించుకొన కుందును. పరమాత్మనే సదా స్మరింతును. పాపకార్యముల నాచరింపకుందును;" యని తలపోయును.

యోని బన్ధాత్ప్రముచ్యేయం యది తప్స్యే మహత్తపః

"ఈ యోని బంధమును త్రెంచుకొని బయట పడినచో గొప్ప తపస్సు నాచరింతును" యని గర్భస్థ శిశువు ఆలోచించునని ఉపనిషత్తు ప్రవచించినది.

తల్లి గర్భములోని జీవుడు పరమాత్మను ప్రార్థించు విధమును కపిలదేవుడు దేవహూతికి తెలుపుచున్నాడు:

"హే భగవాన్! పురుషోత్తమా! నీవు దయాసాగరుడవు. నన్ను ఈ దుర్భర దుఃఖము నుండి విడిపింపుము. ఈ గర్భమునుండి బహిర్గతము కాగానే సర్వకర్మలకు స్వస్తి చెప్పి పరమాత్మ ధ్యానము నందే కాలమును గడిపెదను. పూర్వము నాస్తికుడనై అనేక పాపములను చేసితిని. ఆ పాప ఫలములను నేడారగించున్నాను;" యని ఈ విధమైన వైరాగ్యముతో జీవింతును" యని ప్రార్థించును.

చ॥ పరగుచు నున్న దుర్వ్యసన భాజనమై ఘనదుఃఖమూలమై
యరయగ బెక్కు తూంట్లుగలదై క్రిమిసంభవమైన యట్టి దు
స్తర బహుగర్భవాసముల సంగతి మాన్పుటకై భజించెదన్
సరసిజనాభ! భూరిభవసాగరతారక పాదపద్మముల్

"ఈ జీవుడు గతంలో వేలకొలది యోనులలో ప్రయాణమును సాగించియున్నాడు. నేడు ఈ యోని నుండి బయటపడలేక యున్నాడు. ఈ స్థితిలో ప్రసూతి వాయువు అతనిని లోనుండి బయటకు నెట్టును. తలక్రిందులైన జీవుడు అతి కష్టములో భూమిపైపడును. ఆ సమయమున అతని శ్వాస ఆగిపోవును. దానితో పూర్వస్మృతి మరుగున పడిపోవును. రక్తసిక్తమైన దేహముతో భూమిపైబడిన జీవుడు మలమునందు జనించిన క్రిమివలె హస్తపాదములను కదలించును. మాటిమాటికి ఏడ్చుచుండును.

"ఈ విధముగా దుర్భరమైన జననము నొందిన జీవుడు వృద్ధినొందు విధము గూడ దుర్భరముగనే యుండును" యని కపిలుడు దేవహూతికి చెప్పుచున్నాడు.

"బిడ్డదైన జీవుడు అయోమయంగా, అమాయకంగా జీవించుచుండును. తన అభిప్రాయము లెరుగని వారి ద్వారా పెరుగుచుండును. ఆకలితో బిడ్డ విలపించు చుండగ, కడుపునొప్పి యేమోనని భావించి పెద్దలు మందు నిచ్చుచుందురు. ఉదరబాధతో ఉక్కిరి బిక్కిరి యగునపుడు, ఆకలియేమోనని భ్రమించి పాలు పట్టించు చుందురు. ఈ చర్య ఉదరబాధను పెంపొందించును.

"మంచములోని నల్లులు, పరుపుపై నున్న చీమలు కుట్టుచుండగా బిడ్డ రోదించుచుండును. చెప్పుటకు నోరులేక విలపించుచుండును. బిడ్డ నిద్రించుటకు విలపించుచున్నాడని భావించి తల్లి అతనిని నిద్రపుచ్చుటకు ఊయల నూపుచుండును. కొన్ని పర్యాయములు నిద్రముంచుకొచ్చి బిడ్డ దేడ్చుచుండగా, విషయము నెరుగని తల్లి ఆ సమయమునవే బిడ్డకు స్నానము చేయించును. పసితనములో ఈ వైవిధ్యమును భరించలేక బిడ్డ తికమక పడుచుండును. శైశవదశ యంతయు ఈ విధముగ గడచును.

"బాల్యావస్థలో క్రీడలయందు, విద్యాభ్యాసము నందు కాలము దొర్లిపోవును. యౌవనము సంభవించును. అనేక రూపములు ప్రారంభమగును. కామ క్రోధాలు, ఆవేశాలు, అవర్గాలు పడగలు విప్పి నాట్యము చేయును. అభిమానము వృద్ధి నొందును.

అహంకారము దర్శనమిచ్చును. మూఢుడగు జీవుడు పడిన బాధల నన్నిటిని మరచి మఅల కర్మ సుడిగుండములో పడి పరిభ్రమించు చుండును. సంసారమును తయారు చేసికొనును. దుష్టులతో కలసి తిరుగునే గాని శిష్టులతో సహవాసము చేయడు.

"స్త్రీల సాంగత్యమును చేయును. చిత్తమును కామవాసనలతో దూషితమొనర్చు కొనును. భక్తియోగమున చరించువ్యక్తి స్త్రీ సాంగత్యమును త్యజించాలి. నాచుగప్పిన కూపమే స్త్రీ యని సదా భావించు చుండవలెను. స్త్రీలు పురుషులను గూడ అలాగే భావించు చుండవలెను.

"తల్లీ! బోయవాని సంగీతము మృగము యొక్క చావుకు కారణమైనట్లు, సంసార తీపి జీవి మృత్యువుకు కారణమగుచున్నది. సూక్ష్మదేహము స్థూలదేహము నుండి విడిపడుటయే మృత్యువనియు, అవి రెండును మఅల కలియుటయే 'జన్మ' యనియు తెలుపబడినది. బుద్ధిమంతుడైన మానవుడు ఈ చావుపుట్టుకలను గురించి, మోహమును చెందక సదా పరమాత్మను ధ్యానిస్తూ జీవించాలి;" యని కపిల భగవానుడు తెలిపెను.

ప్రేయస్సు - శ్రేయస్సు

మలిన మనస్సు నిర్మలాత్మను గూర్చి చింతించలేదు. మనస్సును మొదట శుద్ధిచేయాలి. భక్తి, జ్ఞాన, వైరాగ్యములను మనస్సులో నింపాలి. అప్పుడే ఆత్మదర్శనమునకై ఆసక్తి మెండగును. ఆత్మ సందర్శనాభిలాషులు సమస్తమును ఆత్మగనే దర్శించుచుందురు. పరిమితమైన ప్రేమ ప్రేయస్సుకు సంబంధించినది. అపరిమితమైన ప్రేమ శ్రేయస్సుకు సంబంధించినది. ప్రేయస్సు శాశ్వత సుఖము నందించదు. శ్రేయస్సు అల్పసుఖము నెరుగదు. కనుక శాశ్వతానందమును బొందగోరు జనులు ఆత్మదృష్టితో జీవించడం అలవరచుకోవాలి.

ప్రేయస్సును గోరువారు గృహాసక్తులై యుందురు. కామ్యకర్మల యందే మనస్సును లగ్న మొనర్చుచుందురు. రజోగుణముతో చరించుచుందురు. ఛిద్రమనస్కులై యుందురు. విషయ సుఖముల యందు రమించుచుందురు. త్రివర్గములనే అనుసరించు చుందురు. భగవంతుని శ్రవణ కీర్తనాదుల నుండి విముఖులై యుందురు.

మధుర పదార్థముల నొసగినను పందులు మలమునే భుజించును. అలాగే లౌకికులైన మానవులు హరికథాశ్రవణము నిచ్ఛగించక ప్రాపంచిక విషయముల యందు ఆసక్తిని చూపుచుందురు.

చ॥ విమత గుణోత్తరుండు నురు విక్రముడైన హరిన్ భజించి త
న్మన న లసత్కథామృతము మామగ గ్రోలుట మాని దుష్కథల్
విని ముదమందు చుందురు వివేక విహీనత మారబంది యాత్మను
మధురాజ్య భక్ష్యములు మాని పురీషము కేగు చాడ్పునన్

గృహాసక్తులైన మనుజులు పుణ్యార్జన ఫలితముగ పిత్రులోకములను బొందుదురు. భోగానుభవము కాగానే మరల మర్త్య లోకమున బడుచుందురు. కనుక భక్తిని గల్గి సంపూర్ణముగ భగవాను నాశ్రయించినవారై, ఆరాధించువారై జీవింపవలెనని కపిలుడు దేవహూతికి తెలిపెను. పరమేశ్వరుని చరణకమలములే జీవులకు పరమాశ్రయములని తెలిపెను.

భక్తియోగము శ్రేష్ఠమైనది. పవిత్రమైనది. సర్వమూ భగవంతుని యాజ్ఞచే నడుపబడు చున్నదనెడి విశ్వాసమును భక్తి కలిగించును. అన్యవిషయముల యందు అరుచి పుట్టించును. పాప జీవనమును నిరోధించును. ఒకరి యందు రాగము, మరియొకరి యందు ద్వేషము; ఒక వస్తువు నందు ప్రియము, మరియొక వస్తువు నందు అప్రియము లనెడి వైరుధ్యములను హృదయము నుండి తొలగించును. ఈ విధముగా నిర్మలమైన పవిత్ర హృదయములో పరమాత్మ సాక్షాత్కార మగును. ఏ నిర్మలాత్ముని హృదయములో భగవానుడు దర్శనీయుడగునో అట్టి మనుజుడు సర్వత్ర భగవానునే దర్శించును. కనుక పురుషోత్తముడైన పరమాత్మనే భజింపుమని కపిలదేవుడు దేవహూతికి చెప్పెను.

క॥ విను సర్వభావముల బరముని వనఘు ననంతు నీశుఁ బురుషోత్తము స
న్మనమున భజియింపుము ముదమున బునరావృత్తి లేని ముక్తి లభించున్

"జననీ! నేను నీకు బోధించిన భక్తియోగము ముక్తిని తప్పక ప్రసాదించును. నేను జ్ఞానమును, భక్తి యోగమును రెండింటిని బోధించితిని. ఈ రెండింటిలో ఏ మార్గమున చరించినను ముక్తి తప్పక లభించును. జ్ఞానయోగములు పరస్పర విరుద్ధములని అజ్ఞానులు పలుకు చుందురు. ఆ రెండును అన్యోన్యాశ్రయములు. వినీతులై, అసూయా రహితులై, శాంతరూపులైన భక్తులు నేను బోధించిన ఈ ఉత్తమధర్మము నాచరించి తరింతురు.

మోక్షప్రాప్తి

మైత్రేయుడు చెప్పుచున్నాడు: "విదురుడా! దేవహూతి ధన్యురాలైనది. శ్రవణ ఫలమును బొందగలిగినది. మోహ సుడిగుండము నుండి బయట పడినది. శ్రవణము చేయుట వలన పుణ్యము లభించును. పుణ్యముండి శ్రవణము చేయగలిగినచో ముక్తి లభించును. బిడ్డడైన భగవంతుడగు కపిలునకు చేతులెత్తి నమస్కరించెను. మనసారా కపిలభగవానుని స్తుతించెను." యనెను.

దేవహూతి దేవదేవుని స్తుతించుచున్నది: "దేవా! నీవు అనంతుడవు. నిన్ను నేను ఎలా గర్భమున ధరించితివని విస్మయ మొందుచున్నాను. నీవు అప్రమేయుడవు. అద్వితీయుడవు. అయినను నీ భక్తుల నుద్ధరించుటకు అనేక రూపములను ధరించితివి. నీ నామమును

కీర్తించువాడు, నీ కథల నాలకించువాడు, నిన్ను స్మరించువాడు ఎంతటి హీనుడైనను శ్రేష్ఠుడే యగును."

క॥ నీ నామ స్తుతి శ్వపచుండైనను జిహ్వాగ్రమందు ననుసంధింపన్
వానికి సరి భూసురుడుం గానేరదు చిత్రమిది జగంబుల నరయన్

యని దేవహూతి స్తుతింపగా భగవానుడగు కపిలుడు తల్లితో ఇట్లు పలికెను.

"జననీ! మనునందినీ! నీవు ఆచరింపదగిన సద్విషయములనే నేను నీకు బోధించితిని. నా ఈ అభిప్రాయము బ్రహ్మవేత్తలకు గూడ సమ్మతమైయున్నది. నీవు ఈ విషయములను చక్కగా అనుష్ఠింపుము. త్వరలో నన్ను బొందగలవు" యని పలికి తల్లి యనుమతిని బొంది కపిలుడు వెడలిపోయెను.

పుత్రుడగు కపిలదేవుడు ఉపదేశించిన భక్తియోగమును దేవహూతి ఆచరింపసాగెను. సదా ధ్యానమగ్నురాలై యుండెను. నారచీరలను ధరించి, నిరంతర తపోధ్యానాదులచే దేహమును శిథిల మొనర్చుకొనెను. కపిలునికి దూరమై దేవహూతి తీవ్ర ఆవేదనకు గురి అయ్యెను. దూడను పోగొట్టుకొనిన గోవువలె వ్యథచెందెను.

ఆహారమును పరిమితముగ గ్రహించుచుండెను. సదా పరమాత్మనే చింతించు చుండెను. ఆశ్రమ ప్రదేశమును గూడ త్యజించెను. బంధము లన్నియు మెల్లమెల్లగా తొలగిపోయెను. భ్రాంతి తొలగిపోయెను. జరిగిన దంతయు స్వప్నమువలె అనుభవమునకు అందెను. దేహముపై విస్మృతి కలిగెను. ఆమె భగవానుని బొందెను. దేవహూతికి సిద్ధి లభించెను.

మైత్రేయుడు చెప్పుచున్నాడు: "విదురా! కపిలదేవుని అనుగ్రహమును బొంది ఏ ప్రదేశమున ఆమె సిద్ధిపొందినదో దానినే "సిద్ధపద" మని పిలుతురు. తల్లిని ఉద్ధరించిన ప్రదేశమైనందున దానిని **'మాతృగయ'** యని కూడ పిలుతురు. ఆమె దేహముకూడ తీర్థరూపమును ధరించెను. విదురా! నీవు యడిగిన విషయముల నన్నిటిని చెప్పితిని. పరమ పవిత్రమైన కపిలగీతను గూడ చెప్పితిని. ఈ విషయమును ఉత్తమ భక్తితో ఎవ్వడు ఆలకించునో, పఠించునో, అట్టి పుణ్యశీలురు విగతపాపులై, పుండరీకాక్షుని చరణార విందములను బొంది తరింతురు" యనెను.

తృతీయ స్కంధము సమాప్తము.

...... ఓం ......



కమలం - కమనీయం

నమః కమలనాభాయ

నమః కమలమాలినే

నమః కమలపాదాయ

నమస్తే కమలేక్షణే

పద్మనాభునకు నమస్కారము. పద్మమాలను ధరించిన వానికి వందనము. కమలముల వంటి చరణములు గలవానికి ప్రణామము. కమల నేత్రునకు నమస్కారము.

Obeisance to you who have a lotus sprung from your navel ! Obeisance to you who are adorned with a wreath of lotuses ! Obeisance to you, Whose feet resemble a pair of lotuses ! And Obeisance to you, O Lord with lotus - like eyes !



ఉపోద్ఘాతము

ఇది చతుర్థ స్కంధము

చతుర్థ స్కంధము భగవానుని రెండవ ఊరువువై యున్నది. కనుక తృతీయ స్కంధము వలెనే చతుర్థ స్కంధము అమోఘమైన స్కంధము

దైవ దూషణము ఆత్మహాని సదృశము. అహంకారము అనర్థ దాయకము. అహంకారము ఎంతటివానికైనను వినాశము నందించునని దక్షుని ప్రవర్తన నిరూపిస్తుంది. భావశుద్ధి లోపించిన కార్యములు ఎంత ఘనమైన వైనను అనర్థదాయకములే యని దక్షయజ్ఞము నిరూపిస్తుంది. దక్షుడు నిర్వహించుట వలన యజ్ఞశాల యుద్ధభూమిగా మారింది. అర్జునుడు యుద్ధమునకు నిలబడిన స్థలము యజ్ఞస్థలి యైనది.

దృఢ నిశ్చయముతో సాగే సాధన లన్నియు సత్ఫలితాలనే అందిస్తాయి. అకుంఠిత దీక్షతో సాధనను సాగించువారు ఎంతటి కష్టతరమైన కార్యమునైనను సాధించగలరని ధ్రువుని చరిత్ర తెలుపుతుంది. బాల్యమున వికసించిన భక్తిపుష్పము తప్పక జ్ఞానఫలము నందించునని ఋజువు చేస్తుంది.

కర్మలు పరిమితములు. పరిమితములైన కర్మలు అపరిమిత ఫలితముల నివ్వలేవనియు, పరమ పురుషార్థమైన మోక్షమే వాంఛనీయ మనియు ప్రాచీనబర్హికి నారదుడు బోధించును. వాసనలవలన కర్మలు కలుగును. ఈ కర్మల యొక్క ఫలితములను చక్షురాదీంద్రియముల ద్వారా జీవుడు అనుభవించును. ఈ విషయములనే మాటిమాటికి చింతించుచు జీవుడు మరల కర్మల నాచరించుచుండును. ఇవి బంధహేతువులు. దుఃఖకారణములు. ఈ సత్యమును తెలిపెడి పురంజనో పాఖ్యానము ఈ స్కంధమున అతి రమణీయమైన ఆధ్యాత్మిక సమన్వయ స్వరూపము.

ఈ స్కంధము భక్తి జ్ఞానముల అపూర్వ సమ్మేళనము.

చైతన్య భాగవతము

చతుర్థ స్కంధము

శతరూప మనువులకు ఆకూతి, దేవహూతి, ప్రసూతి యను ముగ్గురు కుమార్తెలు కలిగిరి. జ్యేష్ఠ పుత్రికయగు ఆకూతిని ప్రజాపతియగు రుచి కిచ్చి వివాహము చేసెను. రెండవ పుత్రికయగు దేవహూతిని కర్దముని కిచ్చెను. మూడవ పుత్రికయగు ప్రసూతిని బ్రహ్మ నందనుడగు దక్షునకిచ్చెను.

కర్దమ దేవహూతులను గూర్చి తృతీయ స్కంధమున మైత్రేయుడు విదురునకు వివరించి చెప్పెను. మిగిలిన విషయమును ప్రస్తావించుటతో మైత్రేయుడు చతుర్థ స్కంధమును ప్రారంభించుచున్నాడు. కర్దముని కుమార్తెల విషయమును మైత్రేయుడు చెప్పుచున్నాడు.

మరీచుని అర్ధాంగి, కర్దముని పుత్రికయగు 'కళ' యను నామె కశ్యపుడు, పూర్ణిమానుడు అను ఇరువురు కుమారులను గనెను. ఆ ఇరువురి వంశమే ప్రపంచమున వ్యాప్తి నొందెను. అత్రి భార్యయగు అనసూయకు దత్తాత్రేయుడు, దుర్వాసుడు, సోముడు అను ముగ్గురు పుత్రులుద్భవించిరి. ఆ ముగ్గురు త్రిమూర్తుల అంశములతో జన్మించిరి.

పాతివ్రత్య మహిమ

"గురుదేవా! సృష్టి స్థితి లయములకు కారణ భూతులగు త్రిమూర్తులు అత్రిమహర్షి గృహమున ఎందులకు అవతరించిరి?" యని విదురు డడుగగా మైత్రేయుడు చెప్పుట కుపక్రమించెను. ముందుగా మహితాత్ములు, పుణ్యాత్ములునైన అత్రి అనసూయలను గూర్చి తెలిసికొందుము.

అత్రి యనగా త్రయము లేనివాడు. త్రిపుటి లేని వాడు యని భావము. శరీర త్రయ మనెడి పురత్రయమున సంచరింపనివాడు అని భావము. దేహాభిమానము లేనివాడు. కర్తృత్వ భోక్తృత్వ అభిమానములు లేనివాడని అర్థము.

అనసూయ అనగా అసూయ లేనిది యని అర్థము. బుద్ధి అసూయ నుండి విడివడినచో శుద్ధిపడును. అసూయాపరులు ఆత్మజ్ఞానమునకు అర్హులు గారు. అసూయలేని వారినే పరమాత్మ ప్రేమించును. "అర్జునా! నీవు అసూయలేని వాడవగుటచేత నీకు గుహ్యాతమమైన శాస్త్రమును బోధించుచున్నాను" యని శ్రీకృష్ణుడు రాజవిద్యా రాజగుహ్యా యోగమును ప్రారంభించుచు పలికినాడు.

జీవుడు అత్రియై, బుద్ధి అనసూయ యైనపుడు అట్టి దంపతులకు జ్ఞానమను దత్తాత్రేయుడు పుత్రుడై జన్మించును.

దేవర్షియగు నారదుడు ఒకసారి కైలాసమునకు బోయెను. పార్వతీదేవి నారదునికి ప్రసాదమును పెట్టెను. నారదుడు ఆ ప్రసాదము నారగించుచు మెచ్చుకొనెను. ఈ ప్రసాదము బాగున్నది. కానీ మహాపతివ్రతయగు అనసూయాదేవి పెట్టిన ప్రసాదము ఇంకా మధురముగా యున్నది యనెను. పార్వతీదేవి నారదుని ప్రశ్నించి అనసూయాదేవి వివరములను తెలిసికొనెను. అనసూయపై పార్వతికి ఈర్ష్య జనించెను. భర్తయైన పరమశివుని బిలచి అనసూయ పాతివ్రత్యమునకు పరీక్షపెట్టమని ప్రార్థించెను. ఉమాపతి గొప్ప సంకటములో పడెను. భార్యలు పెట్టే బాధలు బ్రహ్మచారి నారదున కెలా తెలిశాయి? ఊరకరాడు మహాత్ముడు అని శివుడు తనలో తాను చింతించెను. ఉమాదేవి యనగా తపస్సు యని భావము.

ఇత్యనేన తపసో మాత్రా నిషిద్ధత్వా దుమా

ఉ=ఓబిడ్డా, మా=వలదు .... ఇట్లు తల్లిచే తపస్సువలన నిషేధింపబడెను. కనుక ఉమ **అయినది.**

తపోధనులలో ఈర్ష్య, క్రోధము లాంటివి చోటు చేసుకొనును. సాధకులు ప్రయత్నశీలురై వాటిని పోగొట్టుకొనవలెను. లేనిచో దానివలన సాధనయే భగ్నమగును.

నారదుడు తదనంతరము వైకుంఠమునకు వెళ్ళెను. లక్ష్మీదేవి నారదుని భూలోక విశేషముల నడిగెను. "అమ్మా! పూర్వము వైకుంఠ వైభవమును గూర్చి భూలోక ప్రజలు చాలా గొప్పగ చెప్పుకొనెడి వారు. ఇప్పుడు అది కాస్త తగ్గినది" యనెను. కారణమేమని లక్ష్మీదేవి యడుగగా నారదుడు అనసూయాదేవి యొక్క గొప్పతనమును వివరించెను. లక్ష్మీదేవి వైభవము కన్నను అనసూయ వైభవము విశిష్టముగా యున్న దనెను.

లక్ష్మీదేవికి అనసూయపై అసూయ పెరిగెను. శివునకు ఎదురైన సమస్య నారాయణునికి గూడ ఎదురయ్యెను. అనసూయను పరీక్షింపుమని లక్ష్మీదేవి నారాయణుని పట్టుపట్టెను.

లక్ష్మి యనగా ఐశ్వర్యము అని భావము. సంపద గలవానిలో గర్వము చోటు చేసికొనును. తనకన్నను గొప్ప ఐశ్వర్యము గలవానిపై ఈర్ష్య ఏర్పడును. సర్వమును తానే

నడుపుచున్నట్లు తనవలననే నడచు చున్నట్లు సంపన్నుడు భావించును. తన స్థానమున మరొక రుండరాదని చింతించును. **"లక్ష్యతే సర్వో ఽన యేతి లక్ష్మీః"** సర్వము ఈమె చేత చూడ బడుట చేత ఈమె లక్ష్మి యాయెనని భావము.

లక్ష్మీపార్వతులతో ముచ్చటించినట్లే సరస్వతీ దేవితో కూడ నారదుడు ముచ్చటించెను. సరస్వతి బ్రహ్మదేవునికి తన విన్నపమును వినిపించెను.

సరస్వతి విద్యా స్వరూపము. జ్ఞానము గలవారిలో గూడ అసూయ పెరుగును. వినయము గలిగినదియే విద్య యగును. సమభావము లేని విద్య శోభించదు. అందుచేత విద్యావంతులు అసూయా రహితులై యుండవలెను. **"వణ్యతే .... స్తూయతే = వాణీ"** యనెడి అర్థము గూడ కలదు. అనగా పొగడబడునది. స్తుతింపబడునది యని కూడ భావము. విద్యావంతులు మన్ననలను వాంఛింతురు. తాము పొగడ్తలను వాంఛింతురు గనుక ఇతరులు పొగడనిచో సహింపలేరు. అసూయను పెంచుకొందురు. ఇది పాండిత్యమునకు మచ్చలాంటిది.

బ్రహ్మ విష్ణు మహేశ్వరులు అనసూయా దేవి గృహమునకు వెళ్ళిరి. ఎవరయితే అసూయలేకుండా జీవింతురో అట్టివారి కడకు పిలువకుండానే భగవంతు డరుదెంచును. అసూయాపరులు ఎన్ని పూజలు చేసినను వారి అసూయను వీక్షించుచు పరమాత్మ విగ్రహమునందు యుండునే గాని వ్యక్త మయ్యేందుకు ఇష్టపడడు.

త్రిమూర్తులు అత్రి ఆశ్రమము ముందు భిక్షము నడుగుచు నిలబడిరి. భక్తి ప్రేమ స్వరూపము. **"సా త్వస్మిన్ పరమప్రేమరూపా"** యని నారదమహర్షి భక్తి సూత్రములలో తెలుపును. ప్రేమ పవిత్రమైనది. ఉత్కృష్టమైనది. అమృత స్వరూపమైనది. కామమునకు తావివ్వనిది. గుణములను కదిలించనిది. అట్టి ప్రేమను భగవానుడు అర్థించును. దివ్యమైన ప్రేమ గల భక్తులు భగవానుని అర్థించునట్లు చేయుదురు. భగవానుడు వారి ననుసరించియే చరించు చుండును. అందుచేత భక్తులున్న చోట భగవానుని దర్శింపవచ్చును యని పెద్దలు చెప్పుచుందురు.

పుండలీకుని భక్తికి స్పందించిన విఠలుడు ఇటుకరాతిపై నిలబడి ఇప్పటికిని భక్తుల కొరకు నిరీక్షించుచునే యున్నాడు. శ్రీమహావిష్ణువు ప్రహ్లాదకుమారుని క్షణము వీడకుండెను. భగవానుని ఆకర్షించునది ప్రేమ యొక్కటియే.

త్రిమూర్తులు మాఱువేషమును ధరించి భిక్ష పెట్టమని అనసూయను అర్థించిరి. అనసూయ భిక్షపెట్ట నెంచెను. మీరు నగ్నముగా యుండి భిక్షపెట్టినచో మేము స్వీకరింతుమని త్రిమూర్తులు చెప్పిరి.

ఎవరయితే వివస్త్రలగుదురో వారి భక్తినే పరమాత్మ గ్రహించును. వస్త్రము దేహమునకు ప్రతీకము. దేహాభిమానమును త్యజింపనిచో అట్టివారి భక్తిని భగవానుడు స్వీకరింపడు. దేహాభిమానము అజ్ఞానమే యగును. అజ్ఞానులు పరమాత్మను గాంచలేరు.

అహం మమేతి యో భావో దేహాక్షా దావనాత్మని
అధ్యాసోఽయం నిరస్తవ్యో విదుషా బ్రహ్మ నిష్ఠయా

"దేహమునందు "నేను - నాది" యనెడి భావములను కలిగి యుండుటయే అజ్ఞాన మనబడినది. కనుక పండితులగువారు బ్రహ్మనిష్ఠద్వారా ఈ అజ్ఞానమును తొలగించు కొనవలెను" యని ఉపనిషత్తు తెలిపినది.

అనసూయాదేవి ఆలోచించినది. నగ్నముగా యుండి భిక్షనొసగినచో తన పవిత్రతకు భంగము వాటిల్లును. ఒకవేళ భిక్ష నొసంగనిచో యతులను నిరాకరించినట్లగును. అనసూయ ధ్యానమగ్నురాలై త్రిమూర్తులపై జలమును సంప్రోక్షించగా, ఆ ముప్పురును బాలకులై గోచరించిరి. పాతివ్రత్యము యొక్క శక్తిముందు త్రిమూర్తులు గూడ పాపలగుదురు.

అత్రి యరుదెంచెను. బాలురను వీక్షించెను. జరిగిన దంతయు గ్రహించెను. ఈ లోగా ముగ్గురమ్మలు యరుదెంచిరి. అత్రిమహర్షి ఆ బాలురను తిరిగి త్రిమూర్తులుగ మార్చెను. సంతసించిన త్రిమూర్తులు మీ ఇంటిలో మేము బిడ్డలమై జన్మించి ఆడుకొందుము యని వరమొసగిరి.

అనసూయ ముప్పురు కుమారులను ప్రసవించెను. విష్ణువు దత్తాత్రేయుడుగను, రుద్రుడు దుర్వాసుడుగను, బ్రహ్మదేవుడు సోముడుగను జన్మించిరి.

మనువుయొక్క కనిష్ఠపుత్రిక యగు ప్రసూతిని బ్రహ్మకుమారుడగు దక్షుడు వివాహమాడెను. వీరికి పదునారు మంది కన్య లుద్భవించిరి. వారిలో పదమూడు మందిని ధర్మున కిచ్చి వివాహము గావించెను. వారి పేర్లు ఇలా ఉన్నవి:

1) శ్రద్ధ 2) మైత్రి 3) దయ 4) శాంతి 5) తుష్టి 6) పుష్టి 7) క్రియ 8) ఉన్నతి 9) బుద్ధి 10) మేధ 11) తితిక్ష 12) లజ్జ 13) మూర్తి. ధర్మజీవనమునకు అలవాటు పడినవారిలో ఈ పదమూడు లక్షణము లుండును.

వీరు సంతానవతులైరి. శ్రద్ధ సత్యమును గనెను. **"శ్రద్ధావాన్ లభతే జ్ఞానం"** శ్రద్ధగలవారు జ్ఞానమును బొందుదురు. జ్ఞానమే సత్యము. శాస్త్ర విషయము నందును, గురువాక్యము నందును విశ్వాసము నుంచుటయే శ్రద్ధయగును. ఇట్టి శ్రద్ధవలన సాధకునకు సత్యదర్శన మగును.

మైత్రి ప్రసాదమును, దయ అభయమును, శాంతి సౌఖ్యమును, తుష్టి హర్షమును, పుష్టి గర్వమును, క్రియ యోగమును, ఉన్నతి దర్పమును, బుద్ధి అర్థమును, మేధ స్మృతిని, తితిక్ష మంగళమును, లజ్జ వినయమును గనెను. ధర్ముని పదమూడవ భార్యయగు మూర్తి భగవత్స్వరూపు లగు నరనారాయణులను ఋషులను గనెను.

ప్రతివ్యక్తి ధర్మబద్ధమైన జీవితమును గడుపవలెను. ధర్మముతో పాటు పైన తెలిపిన, శ్రద్ధ మొదలగు పదమూడు సద్గుణములను తోడు జేసికొని చరింపవలెను. పదమూడవ భార్యగా ధర్మునకు మూర్తి కలిగెను. మూర్తియనగా స్వరూపము. శ్రద్ధ గల వారికి మూర్తి లభించును. మూర్తి ద్వారా స్వస్వరూప జ్ఞానము లభించును. అదియే నరనారాయణ ఋషుల అవతారము.

పదమూడు మంది కన్యలను ధర్మున కిచ్చి వివాహము చేసిన పిదప, మిగిలిన ముగ్గురికి గూడ దక్షుడు వివాహములు చేసెను. ఒకామెను అగ్ని కిచ్చెను. ఒకామెను పితృ గణమున కిచ్చెను. మిగిలిన కన్యయగు సతీదేవిని శివున కిచ్చెను. సతీదేవి సర్వవిధముల భర్తయగు రుద్రదేవుని సేవించుచుండెను. కానీ ఆమె సుపుత్రుని బొందలేక పోయెను. దక్షుడు శివునిపై విరోధము నేర్పరచుకొనెను. సతీదేవి యౌవనముననే దేహమును త్యజించెను.

విశ్వనాథునితో విరోధము

విదురుడు మైత్రేయుని ప్రశ్నించుచున్నాడు: "మహాత్మా! ప్రశాంత చిత్తుడు, దేవతా శ్రేష్ఠుడగు శివునిపై దక్షునకు ద్వేష మేల కలిగెను? కుమార్తెయగు సతీదేవిపై అంత నిర్దాక్షిణ్యంగా ప్రవర్తించుటకు గల కారణమేమి? నాకు వినిపింపుము" యని అడిగెను. మైత్రేయుడు చెప్పసాగెను.

పూర్వము ప్రజాపతుల యజ్ఞమున దేవతలు, ఋషులతో పాటు పరమశివుడు గూడ ఆసీనుడై యుండెను. ఆ సమయమున దక్షప్రజాపతి అచ్చటికి విచ్చేసెను. దక్షుని రాకను గని సభలోని వారందరు లేచి నిలబడిరి. కానీ శివుడు నిలబడ లేదు. అతడు ధ్యానమగ్నుడై యుండెను.

శివుడు సదా ధ్యానమునందే యుండును. శివుడనగా మంగళ స్వరూపు డని భావము. సదా ధ్యానమగ్నులై యుండువారు మంగళ స్వరూపు లగుదురు. ధ్యానము మనస్సును అంతర్ముఖ మొనర్చును. ప్రాపంచిక విషయవృత్తులను నిరోధించును. కనుక సాధకులు సదా ధ్యానమగ్నులై యుండవలెను.

పని లేనపుడు కొందరు ఆలోచించుటయే పనిగ పెట్టుకొనియుందురు. కార్యాచరణము నందు ఆలోచనలు విధిగా నడచును. కార్య నిర్ముక్తులై యుండు సమయాన ఆలోచనలు కదలించుట కంటెను, ఆలోచనలను ఆపి మనస్సును పరమాత్మయందు లగ్నము చేయుట ఉత్తమ కార్యమనిపించుకొనును. మనిషి ఎక్కడున్నను మనస్సులో భక్తి ప్రవాహము నడచుచుండినచో అట్టివాడు ఉత్తమభక్తుడగును. శివుని వలె మంగళ స్వరూపుడగును.

హరిబోలా గాతాఁ హరిబోలా ఖాతా సర్వకార్య కరితాఁ హరిబోలా
హరిబోలా భాండతాఁ హరిబోలా కాండతా ఉఠతాఁ బైసతాఁ హరిబోలా

"పాడేటప్పుడు నామమే. ఆరగించునపుడు హరినామమే. సర్వకార్యము లాచరించుచు హరినామమే. పోరాటములో హరినామమే. ఆరాటములో హరినామమే. లేచేటప్పుడు హరినామమే. కూర్చునేటప్పుడు హరినామమే" యని సంత్ ఏకనాథ్ మహరాజ్ ఒక అభంగములో కీర్తించారు.

శివుడు సత్రయాగమున ఆసీనుడై యుండెను. అయినను అతడు రామనామమును ధ్యానించుచుండెను. దక్షుడు వచ్చినది కూడ గమనించలేదు.

కొందరు జపంచేస్తూ వచ్చే పోయేవారిని చూస్తూ ఉంటారు. అంతే గాదు. జపము చేయునపుడు మీరు ఈ విషయములను ప్రక్కగదిలో మాట్లాడుతూ యుండిరి అనికూడా చెబుతుంటారు. మనస్సు రెండుపనులను ఏక కాలములో చేయలేదు. మాటలు వినబడినవి యంటే మననము మూగబోయిన దని భావము. దృశ్యములు గోచరించినవి యంటే హృదయంలో భగవానుని మూర్తి అదృశ్యమైనది యని భావము.

ఒక శ్రామికుడు తన దుకాణం వద్ద బాణములను పదును పట్టుచుండెను. ఆ సమయమున రాజుగారు రథ, గజ, తురగాదులతో, బంధుజనులతో గూడి అట్టహాసంగా ఆ దారిన వెడలెను. అయినను ఆ శ్రామికుడు ఈ విషయమును గుర్తించలేదు. కొంతసేపటికి ఒక వ్యక్తి వచ్చి "రాజుగారు ఈ మార్గమున వెళ్ళినారా?" యని శ్రామికుని ప్రశ్నిస్తాడు. నేను బాణములను పదును పెట్టుచుంటిని. ఆ విషయమును నేను గుర్తించలేదు యని ఆ శ్రామికుడు సమాధాన మొసగెను. ఈ విషయమును ఆలకించిన దత్తాత్రేయుడు తన మనసున ఆ శ్రామికుని గురువుగా గ్రహించెను. ఏకాగ్రత అంటే ఏమిటో తెలిసికొనెను. ప్రతి సాధకుడు ఆ శ్రామికునివలె దృశ్యముల యందు మనస్సును చొరనివ్వక భగవంతుని యందే ఏకాంత భక్తిని అలవరచుకొనవలెనని దత్తాత్రేయుడు ప్రబోధించెను. పరమాత్మ యందు మనస్సు లగ్నమైన వానికి పరిదృశ్యమాన మగు ప్రపంచము మనస్సులో ప్రవేశింప గూడదు.

బ్రహ్మానన్దే నిమగ్నస్య విషయాశా న తద్భవేత్

"బ్రహ్మానందమునందు నిమగ్నమైన వానికి విషయాభిలాష కలుగదు" యని ఆత్మబోధోపనిషత్తు ప్రవచించినది.

తన ప్రవేశమును గాంచి శివుడు అందరివలె నిలబడ లేదని భావించి దక్షుడు క్రుద్ధుడయ్యెను. అచ్చట గూడి యున్న సదస్సుల నుద్దేశించి దక్షుడిట్లనెను:

"బ్రహ్మర్షులారా! దేవతలారా! నేను ఒక విషయమును చెప్పుచున్నాను. ఇది నా అజ్ఞానమని భావింపకుడు. మాత్సర్యమని తలపకుడు. దయపెట్టి ఆలకింపుడు. ఈ శివుడు సంప్రదాయమునకు ద్రోహము చేసినాడు. శిష్టాచారమును మంట గలిపినాడు. ఇతడు నా కుమార్తె యగు సతీదేవిని వివాహమాడెను. మర్యాదను గూడ పాటించలేని ఈ మందభాగ్యుడు సభలోకి వచ్చిన నన్ను ఒక్కమాటయైనను పలుకరించలేదు. ఈ వ్యక్తి దిగంబరుడై, పిచ్చివానివలె నవ్వుచు, ఏడ్చుచు శ్మశానమున సంచరించు చుండెను. పేరుకు శివుడేగాని వాస్తవానికి అశివుడు. ఇట్టి దుష్టునకు నా బిడ్డ నిచ్చి వివాహము చేసితిని. పరాధీనుడైన బ్రాహ్మణుడు అర్హత లేని వానికి గూడ వేదమును చెప్పునట్లు ధర్మ మర్యాదల నతిక్రమించు ఈ దుర్మార్గునికి నేను నా కుమార్తె నిచ్చితిని" యనెను.

సీ॥ అనయంబు లుప్త క్రియా కలాపుడు మానహీనుడు మర్యాదలేనివాడు
మత్త ప్రచారు డున్మత్త ప్రియుడు దిగంబరుడు భూతప్రేత పరివృతుండు
దామస ప్రమథ భూతములకు నాథుండు భూతలిప్తుం డస్థి భూషణుండు
నష్ట శౌచుండు నున్మదనాథుడును, దుష్ట హృదయు డుగ్రుడును బరేత భూని
తే॥ కేతనుడు వితత ప్రస్త కేశు డశుచి యైన యితనికి శివనాము డను ప్రవాద
మెటుల గలిగె నశివుడగు వితని నెఱిగి యెఱిగి వేదంబుశూద్రున కిచ్చినటుల॥

సముద్రమును ఎవ్వరూ శుష్కింప చేయలేరు. సూర్యుని ఆర్పలేరు. ఆకాశమును ఖండింపలేరు. వాయువును పిడికిట బంధించలేరు. అలాగే వందనీయులైన వారిని ఎవ్వరూ నిందించలేరు. అలా నిందించినను అవి వారి పాలిట స్తుతులై ప్రకాశించును. ఈర్ష్యాసూయలతో చాలామంది మహాత్ములను నిందించు చుందురు. దానివలన మహాత్ముల ఖ్యాతి పెరుగునే గాని తరుగదు.

దక్షుడు శివుని నిందించెను. పరిశీలించి చూడగా ఆ నిందలన్నియు స్తుతులై యున్నవి. గంగా ప్రవాహమున మురికినీరు విలీనమైనను అది గూడ పవిత్రమే యగును.

శివుని **"మానహీనుడు"** యని దక్షుడు దూషించెను. నిజమే గదా! మానావమానములు దేహాభిమానులకే గాని దేవదేవునకు గాదు. నిర్గుణుడైన శివునకు మానావమానము లుండవు. అందుచేత ఆయన మానహీనుడే. దక్షుడు శివుని విషయమున చేసిన దూషణము వాస్తవానికి భూషణమే అయినది.

"మర్యాదలేనివాడు" అని శివుని నిందించెను. మర్యాద యనునది ఆచారమునకు సంబంధించిన విషయము. సాంఘిక కట్టుబాట్లకు సంబంధించినది. కానీ పరమశివుడు లౌకిక ఆచార వ్యవహారముల కతీతుడు. వ్యవహారిక ప్రపంచమునకు శివుడు అందడు.

"పిచ్చివాడుగా తిరుగుచుండును" అదియునూ సత్యమే. జ్ఞాని "బాలోన్మత్తవత్" పిల్లవానివలె, పిచ్చివానివలె మెలగుచుండును. పిచ్చివాని అంతర్యము మనకు ఎలా అవగతము కాదో, జ్ఞాని యొక్క ఆంతరంగిక వైభవము గూడ అర్థముగాదు. అందుచేత ఆ ప్రేమమూర్తి ఉన్మత్తుడే. అంతేగాదు. ఆయన దక్షుడన్నట్లు ఉన్మత్త ప్రియుడు గూడ. ప్రేమసాగరుడైన భగవానుడు ప్రేమరూపులైన భక్తులకు ప్రియుడే. అహంకారులకు అప్రియుడే.

'శివుడు దిగంబరుడ'ని దక్షు డనెను. అవును. నిరాకారుడైన మంగళరూపునికి వస్త్రము నెలాచుట్టగలము? అందుచేత దిక్కులనే అంబరముగా గలిగియున్నాడు. దిగంబరుడనుమాట శివునియొక్క అనంతత్వమును తెలుపుచున్నది. ఉత్కృష్టతను నిరూపించుచున్నది.

'భూతప్రేత పరివృతుండ'ని నిందించెను. అదియును సత్యమే. శివసన్నిధి సర్వులకును పెన్నిధియే. శివసన్నిధికి ఎవ్వరైనను వెళ్ళవచ్చును. శివాలయము సదా తెరువబడియే యుండును. దేవతలే ప్రవేశించినచో ఇక భూతముల నెవ్వరుద్ధరింతురు?

నేను నా స్థాయిగల వారితోనే మాట్లాడుదును అని అహంకారి అనును. సంత్ మహాత్ములు అందరితోను సామాన్యులవలె భాషింతురు. వారు ప్రేమ మూర్తులగుటయే

అందులకు కారణము. మహాత్ముల యందే అంతటి ప్రేమ గోచరించునప్పుడు మహాత్ముల హృదయాంతర్వాసి యగు మహేశ్వరునిలో యుండదా? కనుక ఆ ప్రేమమూర్తిని భూతప్రేత పిశాచములు గూడ సమీపించును. శివుడు వారందరిని పవిత్రులుగ మార్చుచుండును.

శివుడు **క్రియాహీనుడని, గుణహీనుడని** నిందించుట వాస్తవానికి అసమాన ప్రార్థనయై యున్నది. గుణములు మనోస్థాయిలోని విషయములు. మనస్సును దాటిన తరువాత భాసించు పరమేశ్వరునిలో మనస్సు లేనందున అతడు గుణహీనుడే. గుణాతీతుడే.

కర్మలు అజ్ఞాన జనితములు. అసంతృప్తి సూచకములు. నిత్యతృప్తుడైన పార్వతీ నాథుడు నిష్క్రియుడు. కర్మలకు అతీతుడు. అందుచేత అతడు కర్మహీనుడే. నిష్క్రియత్వ చైతన్యమే. గుణక్రియలు సావయవములలోనే జరుగును. నిరవయవ చైతన్యము గుణకర్మల కతీతము.

సమస్తా విద్యో పాధి స్సాకార స్సావయవ ఏవ
సావయవ త్వా దవశ్య మనిత్యం భవత్యేవ

"సమస్తములైన అవిద్యోపాధులన్నియు సాకారములే. సావయవములే. సావయవములు గనుక అవి యన్నియు అసత్యములే" యని త్రిపాద్విభూతి మహానారాయణోపనిషత్తు ప్రవచించినది.

దక్షుడు నిందించినను శివుడు సహించెను. తిరిగి నిందించకుండెను. జ్ఞానవంతు లెప్పుడూ నిందలను వందనములుగ స్వీకరిస్తుంటారు. దుర్యోధనుని నిందలను పాండవులు భరించిరి. శిశుపాలుని నిందలను శ్రీకృష్ణుడు సహించెను. నిందింపబడినంత మాత్రాన వారి ప్రాముఖ్యము తగ్గలేదు.

దక్షుని నిందావాక్యముల నాలకించిన శివపార్షదుడగు నందీశ్వరుడు సహింపలేక పోయెను. వెంటనే దక్షుని శపించెను. "దేహాభిమానముతో దుష్టుడవై మంగళకరుడైన పరమశివుని సభలో నీవు నిందించితివి. ఏ ముఖముతో శివుని నీవు నిందించితివో ఆ ముఖము త్వరలో మేకవంటి ముఖమగును" యని శాపము పెట్టెను. శివనిందను ఆలకించిన సభలోని ద్విజులను గూడ నంది శపించెను.

మహేశ్వరుని నిందించువారికి, మహాత్ములను దూషించువారికి సద్గతి లభించదు. నిందించుట ఎంతపాపమో, నిందల నాలకించుట గూడ అంతపాపము. మహాత్ములను పొరపాటున గూడ నిందించకూడదు. ఒకవేళ ఇతరులు నిందించినను వానిని ఆలకించరాదు. అమట కన్నను వినుటయే ప్రమాదకరము.

శివుడు కైలాసమునకు తిరిగి వచ్చెను. దక్షుని నిందావాక్యములను మదిలో ధరింపకుండెను. మరచిపోయెను. సతీదేవికి గూడ చెప్పకుండెను. శుభచరితులు చెడును మరచి పోవుదురు. భగవానుని స్మృతికి తెచ్చు విషయములనే చింతించు చుందురు.

దక్ష యజ్ఞము

గర్వితుడైన దక్షుడు ఘనమైన యజ్ఞమును నిర్వహించెను. ఆ యజ్ఞమునకు సర్వులను ఆహ్వానించెను. కానీ శివుని ఆహ్వానించలేదు. ఆ మహాయజ్ఞమును గాంచుటకు పత్నులతో గూడి దేవతలందరు వెడలు చుండిరి. ఈ విషయమును సతీదేవి గ్రహించెను. శివుని సమీపించెను.

"స్వామీ! మీ మామగారగు దక్షప్రజాపతి ఘనముగ యజ్ఞమును నిర్వహించు చున్నాడని తెలిసినది. దేవతలందరు ఆ యజ్ఞమున పాల్గొనుటకు వెడలుచున్నారు. మీరు అంగీకరించినచో మనము కూడా వెళ్ళెదము" యనెను.

"నాథా! చాలాకాలము నుండి మా బంధువులను దర్శింపవలెనని నాకు కోరికగా యున్నది. నా మనోరథమును నెరవేర్చుడు. మీరు స్థితప్రజ్ఞులు. అతీతులు. నేను ఆ స్థాయిగల దానను గాను. తల్లిగారింటికి ఆహ్వానము లేకుండా వెళ్ళినను దోషముండదు. నా ఆనందము మీ అంగీకారముపై ఆధారపడియున్నది" యనెను.

సతీదేవి మాటల నాలకించిన మహేశ్వరుడు ఇలా పలికెను: "దేవీ! ఆహ్వానములేక పోయినను బంధువుల ఇంటికి వెళ్ళవచ్చునని నీవు పలికిన వచనము అతి సుందరము. సుమనోహరము. కానీ ఆ బంధువులు ద్వేషమెరుగనివారై యుండాలి. అక్రోధులై యుండాలి. ఈర్ష్యాసూయల నధిగమించిన వారై యుండాలి;" యని చెప్పసాగెను.

విద్య, తపస్సు, విత్తము, సుందర శరీరము, యౌవనము, వంశ వైభవము ఈ షడ్గుణములు సత్పురుషుల వైభవమును వృద్ధి చేయును. ఈ ఆరు లక్షణములు హీనులలో యున్నచో వైపరీత్యమును కల్పించును. ఈ కళ్యాణ గుణములు గల వ్యక్తిలో నమ్రత చోటు చేసికొన్నచో అతని జీవితము దేదీప్యమానమగును. గర్వము చోటు చేసికొనినచో పతనము ఆరంభమగును. గర్వితమతులు యతుల నెరుగరు. మతి తప్పి వర్తింతురు.

"దేవీ! మీ తండ్రియగు దక్షుడు నన్ను నిష్కారణముగ నిందించెను. నేను ఆ విషయమును మరచితిని. దక్షుడు వినయమును కోల్పోయినాడు. గర్వముతో ఊరేగుచున్నాడు. మనవారనెడి దృష్టితో దుష్టులను సమీపించుట మంచిది గాదు. వారి గృహములకు వెడలుట యుచితము గానేరదు. కుటిలురు, క్రుద్ధులునైన ఆ బంధువులు మరొక విధముగ ప్రవర్తింతురు. పరుషవాక్కులను ప్రయోగింతురు. బంధువుల నిందావాక్యములు బాణముల దెబ్బలకన్నను బాధాపూరితముగ యుండును. బాణములచే శరీరమునకు గాయమైనను ఆదమరచి వ్యక్తి కొంతకాలము నిద్రింపవచ్చును. కానీ బంధువుల పరుష వాక్కులచే గాయపడిన వారు నిద్రాసుఖమును గూడ బొందలేరు. రాత్రింబవళ్ళు దుఃఖమునే అనుభవించవలసి యుండును;" యనెను.

చ॥ సమదరిపు ప్రయుక్త పటు సాయక జర్జరితాంగుడయ్యు దుః
ఖమును దొఱంగి నిద్రగను గాని కృశింపడు మానవుండు నో
యుమ! విను మిష్టబాంధవ దురుక్తులు మర్మము లంటనాట జి
త్తమున నహర్నిశంబు బరితాపము నొంది కృశించు నెప్పుడున్

"దేవీ! నీ తండ్రికి నీవనిన చాలా ఇష్టము. కానీ నీవు నా అర్ధాంగివి యగుటవలన నీ తండ్రికడ గౌరవ ప్రేమలకు దూరమై యున్నావు. నాపై అకారణ దోషమును పెట్టుకొని అతడు క్రుద్ధుడై యున్నాడు. క్రుద్ధుడైన వానికి మంచి చెడులు అర్థంగావు. అతడు నిన్ను తప్పక అవమానించును.

"సుందరీ! నిరహంకారులైన వారి కీర్తి ప్రతిక్షణ వర్ధమానమై యుండును. దానిని గాంచి దుర్జనులు ఈర్ష్యలను రగుల్చుకొందురు. ద్వేషములను పెంచుకొందురు. తమ కీర్తిని పెంచుకోలేరు. ఇతరుల కీర్తిని గాంచి అసూయాపరులై పట్టుతప్పి వర్తించుచుందురు.

"దేవీ! దక్షుడు నీ తండ్రియే గావచ్చును. అయినను ఇప్పుడు అతని వద్దకు నీవు వెళ్ళుట మంచిది గాదు. నీకు అపరాధము జరుగక పోవచ్చును. కానీ తప్పక అవమానము జరుగును;" అనెను.

అధముల సహచర్యము అధోగతినే అందించును. శివుని ద్వేషించువారితో మైత్రి మంచిది గాదు. భక్తులైన వారు భగవంతుని ద్వేషించు వ్యక్తులకు దూరముగా యుండవలెను. నాస్తికుల, శత్రువుల మాటలు గూడ చెవిని పడరాదని నారద భక్తి సూత్రముల యందు గలదు.

శివుడు ఇన్ని విధముల చెప్పుచున్నను సతీదేవి మనస్సు తల్లిగారింటిపైపే యుండెను. తల్లిదండ్రులను మెప్పించి, ఒప్పించి శివుని యజ్ఞమునకు ఆహ్వానించునట్లు చేయగలనని సతీదేవియొక్క మనోభిప్రాయము. మన మనోభిప్రాయములపై ఆధారపడుట కన్నను శివుని యాజ్ఞను పాలించుటయే ఉత్తమమైన కార్యము. కానీ సతీదేవి వెళ్ళుటకే నిశ్చయించుకొనెను.

"దేవీ! నా మాట నాలకింపుము. నా మాటను తిరస్కరించి నీవు వెళ్ళినను నీకు శుభము కలుగదు. మాననీయులు బంధువుల వలన కలిగెడి అవమానమును భరించలేరు. దానివలన మరణము సంభవించే ప్రమాదము కూడా కలదు" యని శివుడు పలికెను.

యది వ్రజిష్య స్యతిహాయ మద్వచో భద్రం భవత్యా న తతో భవిష్యతి
సంభావి తస్య స్వజనా త్పరాభవో యదా స సద్యో మరణాయ కల్పతే

"నా మాటలను తిరస్కరించి అచ్చటి కేగినచో నీకు శుభము కలుగదు. మాననీయునకు బంధువుల వలన కలిగెడి అవమానము మరణ సదృశమగును" యనెను.

దాక్షాయణి దేహత్యాగము

దక్షయజ్ఞమునకు వెళ్ళి తీరవలెనని దాక్షాయణి పట్టుపట్టెను. శివునకు ఇష్టము లేకుండెను. నివారించినచో సతీదేవి సంతాపమునకు గురియగును. అంగీకరించినచో దక్షుని వలన అవమానముల పాలై నశించును. ఏమి చేయుటకును పరిస్థితి అనుకూలించనందున శివుడంతటివాడు మౌనము వహించెను.

నిండుకుండ శబ్దము చేయదు. వ్యర్థులగువారే అర్ధ జ్ఞానముతో మిడిసి పడుచుందురు. పరిస్థితులు అనుకూలించనపుడు తొందరను విడనాడాలి. మౌనమును వహించాలి. ఆలపించడము మాని ఆలోచించడము చేయాలి.

సతీదేవి బయలు దేరెను. పరమశివునకు దూరముగా వెళ్ళుటకు నిశ్చయించుకొనెను. విధివ్రాతలు విచిత్రముగనే ఉంటాయి. బంధువులను జూడవలెననెడి ఉత్సాహముతో మందిరములో నుండి బయటకు వచ్చును. శివుడు కోపించునేమో యని సందేహించి మరల లోనికేగును. ద్వంద్వముల మధ్య సతమతమయ్యే వ్యక్తులకు శాంతి లభింపదు.

దంపతుల మధ్య గొడవలు ఆరంభమైనపుడు గృహములను వదలుట మంచిదిగాదు. బంధుజన ప్రీతిలో సతీదేవి హృదయము పరితాపమునకు గురిఅయ్యెను. ఆమె నేత్రముల వెంట బాష్పములు రాలుచుండెను. క్రోధముచే ఆమె దేహము కంపించుచుండెను. తీక్షణవీక్షణములను రుద్రునిపై వర్షింపచేయుచుండెను. ఆ సమయమున శివుడు తాను భర్తయని మదిలో భావించుచుండెను. భరింపవలసినవాడు భర్త. క్లిష్ట సమయాలలో తన బాధ్యతలను గుర్తెరిగి వర్తించువారు తప్పిదములనుండి తప్పుకొనుచుందురు.

సతీదేవి తుదకు పితృగృహమునకు వెడలెను. మంగళకరుడైన మహేశ్వరుని వదలి మమతలను పెనవేసుకొని వెళ్ళెను. రిక్తహస్తములతో సతీదేవి వెడలుచుండెను. ఆమె వెంట వెళ్ళవలసినదని తన యనుచరులను మహేశ్వరుడు ఆజ్ఞాపించెను. ఆమె వస్తువులను, ఆభరణములను గూడ ఇచ్చి పంపెను. ఆ వస్తువులు తనవద్ద యున్నచో కైవల్యము నైకల్యము నొందునని శివుడు భావించెను. ధ్యానమునకు విఘ్నము సంభవించునని భావించెను.

మనస్సును ఛిద్రమొనర్చు చిత్రములను గృహములలో నుంచరాదు. ఏ రూపములను గాంచినచో మనస్సు విషయ ప్రపంచము వైపునకు దూసుకొని పోవునో అట్టి రూపములను గృహాలలో ఉంచకూడదు. దర్శనమాత్రముననే మనస్సును అంతర్ముఖ మొనర్చు దేవతామూర్తులను, మహాత్ముల, సంత్పురుషుల చిత్రములను యుంచుకొనవలెను. అవియే నిజమైన గృహాలంకరణములు.

రోగి వైద్యశాలకు వెళ్ళును. వైద్యుని గదిలో జూలు గల సింహముయొక్క చిత్రము భయంకరముగ గోడకు వ్రేలాడ దీసియుండును. అది సహజముగ, సజీవమై యున్నట్లు తెలియుచున్నదని వైద్యుని ఆనందము. దానిని చూడగనే గుండె తీవ్రముగా స్పందించినది యనుట రోగి యొక్క అనుభవము.

న్యాయవాది గదిలో లేడిని తరుముతున్న పులి బొమ్మ యుండును. సలహాకు వెళ్ళిన వ్యక్తి సందిగ్ధములో పడిపోవును. అప్రయత్నంగా, ఉన్నపళంగా చూచుట వలన ఆ సమయమున తానే లేడియైనట్లు భావించును.

వైద్యశాలలో భగవంతుని చిత్రములు, మహాత్ముల చిత్రములు యుండాలి. వాటిని గాంచగనే రోగికి మనస్సు కుదుట పడును. ఊరట లభించును. బ్రతుకుపై ఆశ పెరుగును.

అలాగే న్యాయవాది గదిలో ధర్మము కొరకు పోరాడిన ధర్మాత్ముల చిత్రములుండాలి. దేవుని చిత్రము లుండాలి. అలాగని హస్తమునుండి ధనమును వర్షింప చేస్తున్న ధనలక్ష్మి చిత్రమును ఉంచమని నా భావము కాదు. పార్థసారధి చిత్రము నుంచాలి. శ్రీరాముని చిత్రము నుంచాలి. అవి చూచువారిలో విశ్వాసాన్ని పెంపొందిస్తాయి.

భగవంతుని చిత్రములేని గృహము శ్మశానము వంటిదని శాస్త్రాభిప్రాయము. ప్రాణము లేని దేహమువలె గృహము శోభలేనిదై యుండగూడదు.

సతీదేవి వస్తువులను గూడ శివుడు ఆమెతో పంపించివేసెను. భక్తి భగవంతుని దప్ప అన్యమైన వానిని ఆశించదు. వాటి మధ్య రమించదు.

సతీదేవి దక్షుడు యజ్ఞము చేయుచున్న ప్రదేశమునకు వచ్చెను. తల్లియు, తోబుట్టువులును ఆమె నాదరించిరి. కానీ క్రుద్ధుడైన దక్షుడు అదక్షుడై సతీదేవిని తిరస్కరించెను. పరమేశ్వరుని, సతీదేవిని దక్షుడు ఎలా అవమాన పరచినది ఆమెకు తెలిసివచ్చెను. క్రుద్ధయైన దాక్షాయణి దక్షుని గర్హించెను.

దాక్షాయణి పల్కుచున్నది: "తండ్రీ! శివుడు సర్వులకు ప్రియమైనవాడు. ప్రియా ప్రియములకు అతీతుడైన ఆ దివ్యాత్మునకు ప్రియుడు లేడు. అప్రియుడుండడు. వైరుధ్యము లేనివాడు. ముక్తి మార్గమున భక్తులకు సారధ్యము వహించువాడు. మహోన్నతుడు. అట్టి పరమేశ్వరునిపై విరోధమును బూనుట నీకు తప్ప మరొకరికి సాధ్యపడదు.

"జనకా! సజ్జనులకు ఇతరుల దోషములు గూడ గుణములుగనే గోచరించును. కానీ నీవు ఈర్ష్యా లోలురైన నీలాంటివారు గుణములలో గూడ దోషములను గాంచుచుందురు. నీవు పరమశివునిలో దోషమును దర్శించుచున్నావు.

సీ॥ అవయంబు శివ యను నక్షర ద్వయ మర్థి వాక్కున బలుక భావమున దలప
సర్వజీవుల పాపసంఘముల్ సెడునట్టి మహితాత్మునందు నమంగళుండ
వగు నీవు విద్వేషి వగుట కాశ్చర్యంబు నందెద వినుము నీ వదియు గాక
చర్చింప నెవ్వని చరణపద్మంబుల వరపి బ్రహ్మానంద మను మరంద
తే॥ మతుల భక్తిని దమ హృదయంబు లనెడి తుమ్మెదలచేత గ్రోలి సంతుష్టచిత్తు
లగుదు రత్యంత విజ్ఞాను లట్టిదేవు నందు ద్రోహంబుసేసి తేమందు నిన్ను!

"దేహాత్మభావము గలవారే దివ్యాత్ములగు వారిని నిందించుచుందురు. నాన్నా! మహాత్ములు నిందలను పట్టించుకోరు. నిందలను, వందనములను ఒకటిగనే భావింతురు. మహాత్ములు నిందలను సహింతురేమోగాని వారి పాదరేణువులు సహింపవు. అవి నిందించువారిని నాశనముచేయును.

"తండ్రీ! మేము ప్రభువైన శివునకు దాసీ జనమునై యున్నాము. యజమాని యశస్సే మాకు ముఖ్యము. ధర్మాత్ముడైన ప్రభువును అహంకారులు నిందించినచో దాసుడు వాటిని వినరాదు. నిందించిన వానిని చంపవలెను. లేదా నింద వినినందుకు తానైనా చావవలెను. ఈ రెండును చేయుటకు అసమర్థుడైనచో రెండు చెవులును మూసికొని అచ్చోటనుండి వెడలిపోవలెను. సమర్థుడైనచో ఆ దుష్ట నాలుకను ఖండింప వలెను. ఇదియే దాసుడైనవాడు చేయదగిన కార్యము.

చ॥ నెలకొని ధర్మపాలన వినిర్మలు భర్గు దిరస్కరించు న
క్కలుషుని జిహ్వగోయ దగుగా కటు సేయగ నోపడేని, దా
బొలియుట యొప్పు, రెంటికి బ్రభుత్వము చాలమి గర్ణ రంధ్రముల్
బలువుగ మూసికొంచు జన బాడి యటందురు ధర్మవర్తనుల్

"తండ్రీ! నీవు శివద్వేషివి. నీకు బిడ్డగా జన్మించుట నా దురదృష్టము. జుగుప్సను కలిగించు ఆహారమును దినినవాడు దానిని వమనము చేసికొనుట ద్వారా పరిశుద్ధుడగునని బుధులు చెప్పుచుందురు. అలాగే నీవలన సంభవించిన ఈ దేహమును త్యజించుట ద్వారా నేను శుద్ధిపడుదును. మహాత్ముడైన శివునకు చేరువగుదును. నీవలన జన్మించిన ఈ నా దేహము శవతుల్యము."

ఈవిధముగా పలికి సతీదేవి ఉత్తరాభిముఖియై కూర్చొనెను. కనులను మూసి, అంతర్ముఖయై యోగాగ్నిని బహిర్గత మొనర్చెను. శివ ధ్యానములో సతీదేవి నిమగ్న మయ్యెను. యోగాగ్నిచే ఆమె దేహము ప్రదీప్త మయ్యెను. సర్వులు ఆమె మరణమును గాంచి దుఃఖించిరి.

దాక్షాయణి దగ్ధమయ్యెను. సతీదేవి ప్రాణత్యాగమును గాంచిన శివపార్షదులు శస్త్రములను,అస్త్రములను ధరించి దక్షుని వధించుటకు సంసిద్ధులైరి. భృగువు తన తపశ్శక్తిచే వేలాదిమంది దేవతలను సృష్టించెను. వారు శివపార్షదులపై మండుచున్న కట్టెలతో దాడిచేసిరి. భయపడిన శివానుచరులు పలాయనమైరి.

దక్షుని సంహరించుట

నారదుడు కైలాసమునకు వెళ్ళి సతీదేవి యొక్క దేహత్యాగ వార్తను శివునకు తెలిపెను. శివుడు ప్రశాంతముగ కన్పించెను. ఆ తరువాత శివానుచరులు గూడ

బాధింపబడిరని నారదుడు తెలిపెను. ఆ మాట నాలకించగనే శివుడు క్రుద్ధుడయ్యెను. భయంకరమైన రుద్రరూపమును ధరించెను. పెదవిని కొరకుచు తన మస్తకమునుండి ఒక జడను ఊడబెరికి గొప్ప శబ్దము చేయుచు క్రింద కొట్టెను.

శా॥ ఆద్యుం డుగ్రుడు నీలకంఠు డిభ దైత్యారాతి దష్టోష్ఠుడై
మాద్యద్భూరి మృగేంద్ర ఘోషమున భీమప్రక్రియన్ నవ్వుచున్
విద్యుద్వహ్ని శిఖా సముచ్చయరుచిన్ వెల్గొందు చంచజ్జటన్
సద్యః క్రోధము తోడ బుచ్చి వయిచెన్ క్ష్మాచక్ర మధ్యంబునన్

ఆ జడనుండి గొప్ప పర్వతదేహుడైన వీరభద్రు డుదయించి తన శిరముతో ఆకాశమును స్పృశించెను. "ప్రభూ! నేనాచరింపదగిన కార్యమును ఆజ్ఞాపింపుడు" యని వీరభద్రుడు శివుని ప్రార్థించెను.

"వీరభద్రుడా! నీవు నా అంశమున జన్మించితివి. భయంకరమైన ఓ భద్రుడా! నా యనుచరులతో గూడి దుష్టుడైన దక్షుని యజ్ఞమును ధ్వంసము చేయుము."

వీరభద్రుడు రుద్రునకు ప్రదక్షిణ మాచరించి నమస్కరించెను. వెంటనే అతడు దివ్యమైన బలముతో శోభించెను. పరమాత్మ చుట్టు పరిభ్రమించువారు శక్తిమంతులై యుందురు.

వీరభద్రుడు భయంకర రూపమును ధరించి, దారుణ ధ్వనియుతుడై శివపార్షదులతో గూడి దక్షుడు యజ్ఞమును నిర్వహించు ప్రదేశము వైపునకు పరుగులిడెను. చేతియందు భీతిని గొల్పు త్రిశూలమును ధరించి యుండెను.

శివసైన్యము కదలివచ్చుచుండగా లేచిన ధూళి వాయుమండల మంతయు వ్యాపించెను. యజ్ఞశాల యందున్న వారందరు ఈ ధూళిని గాంచి అనేక విధములుగ భావింపసాగిరి. ఈ ధూళి ప్రళయమును సూచించు నట్లున్నదని తలచిరి.

దక్షపత్నులు విచార మగ్నులైరి. దక్షుడు నిరపరాధి యగు సతీదేవిని అవమానించెను. ఆ పాపమే ధూళి రూపమున వచ్చుచున్నదని భావించిరి. ఈ లోగా వీరభద్రుడు యజ్ఞస్థలి వద్దకు వచ్చెను. శివానుచరులు గూడ వచ్చి కలిసిరి. భూమ్యాకాశములు ప్రతిధ్వనించునట్లు భయంకర శబ్దములు వినిపించెను. గొప్ప ధైర్యము గల దక్షుడు గూడ ఆ శబ్దముల నాలకించి భీతి చెందెను.

శివసైన్యము యజ్ఞశాలలో ప్రవేశించెను. కొందరు యజ్ఞ మంటపమునకు అమర్చియున్న కట్టెలను ఊడబెరికిరి. కొందరు పత్నీశాలను పగులగొట్టగా, కొందరు సభామంటపమును ధ్వంసమొనర్పగా, మరికొందరు అగ్నీధ్రశాలను ఛిన్నాభిన్న మొనర్చిరి. కొందరు పాకశాలను పాడుచేసిరి. యజ్ఞపాత్రలను ధ్వంస మొనర్చిరి. కొందరు మునులను దూషించిరి. కొందరు ద్విజులను బాధించిరి.

భృగువును శివపార్షదుడగు మణిమంతుడు బంధించెను. దక్షుని వీరభద్రుడు పట్టుకొనెను. సూర్యదేవుని చండేశుడు, భగదేవతను నందీశ్వరుడు బంధించిరి.

భృగువు యొక్క మీసములను వీరభద్రుడు పెరికివేసెను. దక్షుడు సభలో శివుని నిందించినపుడు భృగువు మీసములను దువ్వుచూ శివుని పరిహసించెను. అందువలన భృగువు యొక్క మీసములను వీరభద్రుడు తీసివేసెను.

శివుని దక్షుడు నిందించునపుడు పూషాదేవుడు దంతములను జూపుచు నవ్వెను. అందుచేత పూషా యొక్క దంతములను వీరభద్రుడు ఊడగొట్టెను.

శివుని అవమానపరచుచున్న దక్షుని కనుసైగద్వారా భగదేవత రెచ్చగొట్టెను. అందుచేత వీరభద్రుడు భగదేవతను క్రిందపడవైచి రెండునేత్రములను పీకి వేసెను.

వీరభద్రుడు దక్షుని క్రింద పడవైచి వక్షస్థలముపై కెక్కి దక్షుని మస్తకమును త్రుంచి వేసెను. దక్షుడు మరణించెను. ఈ విధముగా దక్షయజ్ఞమును ధ్వంస మొనర్చి వీరభద్రుడు కైలాసము చేరెను.

దక్షయజ్ఞమునకు హాజరైన దేవతలందరు భీతి చెందినవారై బ్రహ్మదేవుని వద్దకెళ్ళి మొరబెట్టుకొనిరి. బ్రహ్మదేవుడు దేవతలను వెంటనిడుకొని కైలాసమును చేరెను. దేవతలు శివుని ప్రార్థించిరి. క్షమింపుమని అర్థించిరి. శివుడు ప్రసన్నుడయ్యెను. బ్రహ్మదేవునికి నమస్కరించెను.

"పరమశివా! యజ్ఞ రూపుడవగు నీ వలన దక్ష యజ్ఞము భగ్నమగుట మా బోటి వారలకు తృప్తి నిచ్చుట లేదు. దుష్టుడైన దక్షుని అపరాధమును మన్నింపుము. విఘ్నమైన యజ్ఞము నీ సాన్నిధ్యములో పూర్ణమగునట్లు ఆశీర్వదింపుము" యని పలికెను.

"బ్రహ్మదేవా! అజ్ఞానులైన దక్షాదుల యొక్క దురితములను, అపరాధములను గూర్చి తలంపను. మర్యాదను రక్షించుటకై వారిని శిక్షించితిని. నాకు ఏ ప్రాణియందును ద్వేషము లేదు" అనెను.

తన భార్యయగు సతీదేవి మరణమునకు కారణమైన వారిపై గూడ శివునకు ద్వేషము లేకుండెను. ద్వేషములు, దోషములు తెలియనివారు శివరూపు లగుదురు. దోషములను గాంచకుండుట దైవ లక్షణము. భగవత్కృపను బొందగోరువారు దైవ లక్షణములను వంట బట్టించుకోవాలి. ద్వేషమును నశింప చేసుకొని ప్రేమించడము అలవరచు కోవాలి.

శివుని అమృతమయ ప్రేమ వచనముల నాలకించి దేవత లందరు హృష్ట చిత్తముతో విజయఘోష లొనర్చిరి. బ్రహ్మదేవుడు శివుని దీసికొని దక్షుడు యజ్ఞమును నిర్వహించిన ప్రదేశమునకు వచ్చెను. దేవతలందరు వారిరువురిని అనుసరించిరి.

దక్షుని మొండెము దిక్కులేనిదియై పడియుండెను. శివుని యాజ్ఞ ననుసరించి దేవతలు దక్షుని మొండెమునకు యజ్ఞపశువు యొక్క శిరమును దగిలించిరి. శివుడు తన కృపా దృష్టిని దక్షునిపై ప్రసరింపజేసెను. దక్షుడు నిద్రనుండి లేచినట్లు లేచి కూర్చొనెను. ఎదుట నిలబడియున్న పరమశివుని గాంచి దక్షుడు పశ్చాత్తాప హృదయుడై శివుని స్తుతించెను.

"దేవా! పరమశివా! దుష్టుడనైన నన్ను క్షమింపుము. నేను నిన్ను అవమానపరచితిని. నిన్ను నిందించిన దోషానికి నేను పతితుడనైతిని. దేవా! ప్రేమమయుడనైన నీవు నన్ను క్షమించి నాపై కృప జూపితివి;" యని ప్రార్థించెను. శంకరుని యాజ్ఞచే మఱల దక్షుడు యజ్ఞమును ప్రారంభించెను.

తనను అవమాన పరచినను దానిని అముఖ్యముగా భావించి, యజ్ఞ నిర్వహణమే ముఖ్యముగా శివుడు భావించెను. తమకు ఏమి జరిగింది యని గాకుండా తమద్వారా ఏమి జరిగింది యని ఆలోచించువారే మంగళ స్వరూపు లగుదురు.

దక్షుడు హవిస్సును హస్తము నందుంచుకొని విశుద్ధ చిత్తముతో ధ్యానింపగనే కరుణామయుడగు శ్రీమహావిష్ణువు దర్శన మొసగెను.

సీ॥ మానిత శ్యామాయ మాన శరీర దీధితులు నల్దిక్కుల దీటుకొనగ
గాంచన మేఖలా కాంతులతోడ గౌశేయ చేలద్యుతుల్ సెలిమిసేయ
లక్ష్మీ సమాయుక్త లలిత వక్షంబున వైజయంతీ ప్రభల్ వన్నె సూప
హాటక రత్న కిరీట కోటి ప్రభల్ బాలార్క రుచులతో మేల మాడ
తే॥ లలిత నీలాభ్ర రుచి గుంతలములు దనర బ్రవిమలాత్మీయ దేహజప్రభ సరోజ
భవ భవామర ముఖ్యుల ప్రభలు మాప నఖిల లోకైక గురుడు నారాయణుండు

పరమశివుడు నారాయణునకు నమస్కరించి, "వరదా! నీ చరణపంకజములు సర్వార్థ సిద్ధిప్రదములు. మునిజనసేవితములు. మా మనస్సు సదా నీ పాదపద్మముల యందే లగ్నమై యుండును. సదా జడులవలె నీ చరణకమలములను చింతించుచున్న మమ్ము ఆచారహీనులని అవివేకులు భావింతురు. అయినను మేము వాటిని లక్ష్యపెట్టము" యనెను.

అన్యరాగ విస్మరణము జరిగినపుడే అనన్యభక్తి ఏర్పడినదని భావము. భక్తుడైనవాడు విమర్శలను లక్ష్యపెట్టగూడదు. నిర్భయులై చరించాలి. మనిషి పాపము నొక్కదానికే భయపడాలి. పాపమును గాంచి భీతి చెందువారు పుణ్యాత్ము లగుదురు.

మైత్రేయుడు విదురునికి చెప్పుచున్నాడు: "విదురా! ఈ విధముగా సర్వుల హృషీకేశుడైన నారాయణుని కీర్తించుచుండగా దక్షుడు మఱల యజ్ఞము నారంభించెను. తన వంతుగా యజ్ఞ భాగమును గ్రహించిన నారాయణుడు దక్షునితో ఇలా పలికెను:

"దక్షుడా! నా భక్తుడు అద్వైత భక్తిని కల్గియుండును. సర్వులలో నన్నేదర్శించును. బ్రహ్మ, రుద్రాది దేవతలను నా కన్నను అన్యముగా నా భక్తుడు తలపడు. మా ముఖ్యురిలో భేదమును గాంచువాడు శాంతిని బొందడు;" యనెను.

"విదురా! దక్ష యజ్ఞము మద్దరించిన రుద్రదేవుని చరితమును నేను పరమ భాగవతోత్తముడైన ఉద్ధవుని ద్వారా వింటిని. ఈ చరిత్రను ఎవ్వరు భక్తితో

క్రింతురో, ఆలకింతురో అట్టివారు భవసాగరమునుండి బయటపడి తరింతురు" యని మైత్రేయుడనెను.

అధర్మ వంశచరిత్ర

మానవులు ధర్మమార్గ ప్రవర్తకులు. ఈ ధర్మాచరణ మనునది భగవానుడు మానవునకు ప్రత్యేకంగా ప్రసాదించిన వరము వంటిది. దేవతలు ధర్మమార్గమున చరించే అవకాశము లేనివారు. పశుపక్ష్యాదులు అజ్ఞానదశలో యున్నందున ధర్మమార్గమున అర్హతను కోల్పోయి ఉన్నవి. మానవుడొక్కడే ధర్మమార్గమున చరించగలడు. అందుచేతనే మానవుని శరీరము ధర్మక్షేత్రమని చెప్పబడినది.

ధర్మములో సరియైన అవగాహన లేనివారు అరిషడ్వర్గములకు దాసులై అధర్మపరు లగుదురు. అట్టి వా రాచరించెడి ధర్మకార్యములుగూడ అధర్మమునకే ప్రతిరూపములుగ యుండును. దక్షుడు యజ్ఞ మాచరించగా అది యుద్ధమాయెను. అర్జునుడు సాగించిన యుద్ధము యజ్ఞమై భాసించెను. అహంకార ప్రేరిత కర్మములు అనర్థమునే అందిస్తాయి.

దక్షుడు దంభమును పెంచుకొని ధర్మమును విస్మరించాడు. దక్షతను గోల్పోయి దండింప బడినాడు. పుణ్యము లేకున్నా ఫరవాలేదు. పాపము లేకుండా చూసుకోవాలి. ధర్మము నాచరింపకున్నా దోషములేదు. అధర్మము నాచరింపకుండా ఉండాలి.

విషతప్తమైన ఆహారమునెవ్వరూ భుజింపరు. అయితే ఆహారములో విష మున్నదని తెలియని వారు భుజించుటకు సంకోచింపరు. అలాగే కార్యముల యందు అధర్మ మెలాంటిదో మొదట తెలుసుకోవాలి. అధర్మము యొక్క ఫలితముల నెరిగినవారు అధర్మము జోలికిపోరు. అందుచేత అధర్మ వంశచరిత్రను మైత్రేయుడు విదురునకు చెప్పుచున్నాడు.

అధర్మ మనెడి వానికి మిథ్యయను భార్యయుండెను. ఈ మిథ్యవలన అతనికి దంభుడను పుత్రుడు, మాయ యను పుత్రిక కలిగినది.

దంభునికి లోభమను పుత్రుడు జన్మించెను. లోభమునకు క్రోధము పుత్రుడుగ జనించెను. క్రోధమునకు దురుక్తి యను పుత్రిక కలిగెను. దురుక్తి భీతియను కుమార్తెను, మృత్యువను కుమారుని గనెను. వీరివలన యాతన యనుపుత్రిక, నరకమను పుత్రుడు ఉద్భవించిరి. ఈ విధముగా మైత్రేయుడు విదురునకు అధర్మవంశ చరిత్రమును వినిపించెను.

ధర్మమనెడి పదమునకు అనేక అర్థములు గలవు. ఈ ధర్మమనెడి పదమును షడ్దర్శనాచార్యులు కూడా బహుచక్కగా నిర్వచించినారు.

యతోఽభ్యుదయ నిశ్శ్రేయస సిద్ధిః సధర్మః

"వ్యక్తి ఔన్నత్యమునకు, సమాజ కళ్యాణమునకు ఉపకరించునదియే ధర్మము" అని వైశేషిక దర్శన శాస్త్రంలో కణాదమహర్షి చెబుతారు.

కనుక ధర్మాచరణము మీదనే వ్యక్తి వికాసము, సమాజ అభ్యుదయము ఆధారపడి యున్నవని భావము. కనుక ఉన్నతిని గోరు మానవులు ధర్మమును విస్మరించరాదు.

చోదనా లక్షణోఽర్థో ధర్మః

యని పూర్వమీమాంస దర్శనము నందు జైమినిమహర్షి చెబుతారు. ఎవరి లక్షణములను, గుణములను అనుసరించి వారివారి ధర్మములను నిర్వహింపవలెనని అర్థము.

వ్యక్తి వికాసము సమాజముమీదను, సమాజాభ్యుదయము వ్యక్తిమీదను పరస్పరము ఆధారపడి యున్నందున, ఆ రెండింటిని పుష్టిమార్గమున నడుపు ధర్మమును సర్వులు ఆచరింప వలసినదియే.

వెలుగుట దీపము యొక్క ధర్మము. ఈదుట చేపయొక్క ధర్మము. దీపము వెలుతురు నివ్వనిచో ఆరిపోయిన దని అర్థము. చేప ఈదుట మానినచో చచ్చిపోయినదని భావము. వ్యక్తి ధర్మము నుపేక్షించినచో పశుతుల్యు డయ్యాడని భావము. కనుక ధర్మము నుపేక్షించినవాడు పతితు డగుచున్నాడు.

ధర్మ ఏవ హతో హన్తి ధర్మో రక్షతి రక్షితః
తస్మాద్ధర్మం న త్యజామి మనోధర్మో హతోఽవధీత్

"ధర్మమును రక్షించినవాడు ధర్మము చేత రక్షింపబడును. ధర్మమును నశింపచేయు వాడు ధర్మముచే నశింపబడును. కనుక ధర్మమును ఎవ్వరూ త్యజింపరాదు. దానిని రక్షించుకొనుటకు దీక్ష వహింపవలెను" యని మహాభారతము తెలిపినది.

"ధృఞ్ ధారణే" యను ధాతువు నుంచి ధర్మమనెడి శబ్దము ఆవిర్భవించినది. ధారణ యనగా ధరించుట యని యర్థము.

"ధరతీతి ధర్మః" ఇచ్చట ధరించుట, పోషించుట యనెడి రెండు కర్తవ్యములను నిర్వహించునది ధర్మ మనబడుచున్నది. ధర్మము నాశ్రయించియే భూదేవి సమస్తమును మోయుచున్నది. ధర్మము నాశ్రయించియే రాజులు ప్రజలను పాలించు చుందురు.

ఒక వస్తువు గాని, వ్యక్తి గాని ధర్మము వలననే తన అస్తిత్వమును కాపాడుకొనుట జరుగుచున్నది. వేడి అగ్ని యొక్క ధర్మము. ఉష్ణము లేనిచో అది అగ్ని అనిపించుకోదు. స్వభావము నశించగనే స్వరూపము కూడా నశించును. ధర్మమును కోల్పోవగనే తన మనుగడకే ముప్పు వాటిల్లును.

అలాగే ఈ ప్రపంచం కూడా ధర్మము మీదనే ఆధారపడి యున్నది. ధర్మమే ఆధారమై ప్రపంచమును నిలబెట్టు చున్నది.

ధర్మో విశ్వస్య జగతః ప్రతిష్ఠా

"ఈ విశ్వము యొక్క మనుగడ ధర్మము మీదనే ఆధారపడియున్నది" యని తైత్తిరీయోపనిషత్తు ప్రవచించింది.

ఈ విధముగా మానవ జీవితమే గాకుండా యావత్ప్రపంచము ధర్మము మీదనే ఆధారపడి యున్నదని స్పష్టమగు చున్నది. ఒక భిక్షగానికి ధనికుడు కొంత ధనమునుగాని లేదా వస్త్రములను గాని దానము చేయును. కానీ నేను ధర్మము జేసితిని యని పలుకును. నీ వెంత ధర్మము జేసితివి? అని ప్రశ్నించు చుందుము. దాన విషయమున ధర్మ మనెడి పదము ఎందులకు కదలినది?

దానం చేయుట నీ ధర్మము. నీ స్వభావము గనుకనే పరమాత్మచే తయారైన ఈ శుభకర సృష్టిలో ప్రతి వస్తువునకు ఒక ప్రయోజనమున్నది. దానిని తెలిసి జీవించుటయే ధర్మము. ధర్మము అందించునదియే గాని ఆశించునది, యాచించునది గాదు.

సాగరము తన జలములను ఆవిరిగా మార్చి ఊర్ధ్వముగా పంపుచున్నది. మన నుండి ఏదియును ఆశింపకుండా మేఘము వర్షించుచున్నది. నదులు ఎంతగానో జీవులకు ఉపకరించు చున్నవి. కానీ అవి ఏమియును ఆశించుట లేదు. చెట్లు తమ ఫలములను అన్యుల కందించు చున్నవి. అవి తినుట లేదు. తమ క్రింద ఎవ్వరు విశ్రమించినను వారిని సేద దీర్చి పంపును. ధనిక దరిద్రులనెడి భేదమును వృక్షములు దర్శింపవు. సూర్యుడు సదా నీకు వెలుగులను అందించి నీ మనుగడకు అన్నివిధముల సహకరించును. కానీ మన నుండి ఏదియును ఆశించడు. ఇవన్నియు ఫలితము లాశించని మహోత్తమ కార్యాలు. ఈ ధర్మ ప్రవర్తనమే వాటికి నూతన సొగసుల నందించినది.

సూర్యునిలోని తేజమునకు, నదులలోని స్వచ్ఛతకు, సాగరములోని పూర్ణత్వమునకు, వృక్షములోని పచ్చదనమునకు ధర్మమే కారణమై యున్నది. కనుక ధర్మపరులకు దుఃఖము తెలియదు. అధర్మపరులకు సుఖం మిగలదు.

సుఖం చ న వినా ధర్మాత్ తస్మా ద్ధర్మో పరో భవేత్

"ధర్మము ఆచరింపని వారికి ఎలాగూ సుఖము లభించదు గనుక, కనీసం తన సుఖము కొరకైనా మనుజుడు ధర్మము నాచరింపవలెను" యని శుక్రనీతి తెలిపింది.

ధర్మవైశిష్ట్యము తెలియని వాడు అధర్ము డవుతాడు. అభాగ్యు డవుతాడు. అయోగ్యు డవుతాడు. అశాంతిరూపు డవుతాడు. అధర్మరూపుని వంశము ఎలా ఉండునో చెప్పెదను, వినుమని మైత్రేయుడు విదురునికి చెప్పుచున్నాడు.

అధర్ముని సంసారము చాలా విచిత్రమైనది. వింతయైనది. విడ్డూరమైనది. అధర్మునికి భార్య గలదు. ఆవిడ పేరు మిథ్య. అనగా అసత్యమని అర్థము. అధర్మమునకు అర్థాంగి అసత్యమే.

ఆత్మా సత్యం తదన్యత్ సర్వం మిథ్య

ఆత్మ ఒక్కటియే సత్యము. దాని కన్యమైన దంతయు మిథ్యయని శ్రీశంకరాచార్యుల వారు తెలిపిరి.

అధర్మపరుడు అసత్యరూపుడై యుండును. పొరపాటున కూడా సత్యమును వచింపడు. అసత్యము నందు దంభము చోటు చేసుకొని యుండును. కనుక అధర్మ అసత్యాలకు పుట్టే బిడ్డలు దంభము, మాయ. మాయ యనగా లేనిది యని భావము. లేని దానిని ప్రదర్శించుటయే దంభము. ఈ రెండును అసత్యము యొక్క సంతానము. ఈ అసత్యము అధర్మపరుని ఆశ్రయించి యుండును.

దంభునికి లోభుడు జనించును. దంభము గల వానిలో త్యాగముండదు. త్యాగ లక్షణముండియున్నచో దంభమునుగూడ త్యాగమొనర్చి యుండెడివాడే. త్యాగము లేని దంభునికి లోభుడే లాభము.

లోభముతో చరించు దంభుడు త్యాగమయుని వలె కన్పించును. ఒక ధర్మకార్యమును నిర్వహింతురు. ఆ కార్యక్రమంలో శ్రమించే సేవకు లందరు అజ్ఞాతముగ యుందురు. ఏదియును చేయక పచార్లు చేసినవాడు కార్యారంభమున వేదికపై దంభమును ప్రదర్శించును. అలసిపోయినట్లు అగుపించును.

లోభుని కుమారుడు క్రోధము. లోభము సదా లాభమునే ఆశించును. దానికి అవరోధము కలిగినచో అట్టి అవరోధమునకు కారణమగు వారిపై క్రోధము కలుగును. లోభము తెలుస్తుంది. క్రోధానికి ఆద్యంతము లెక్కడో తెలిసిరాదు. క్రోధ పరిణామాలు విషమంగా యుండును. **"క్రోధః ప్రాణహరః"** యని శ్రీమద్రామాయణము తెలిపింది.

క్రోధునికి ముద్దుల కుమార్తె ఒకతె గలదు. ఆమె పేరు దురుక్తి. అనగా పరుష వాక్కు యని భావము. కోపము గలవారినుండి పరుషవాక్కులే జనిస్తాయి. అందుచేత దురుక్తి క్రుద్ధునికి బిడ్డగా జన్మించినది.

పరుషవాక్కు ప్రమాదకరము. నోరు మంచిదైతే ఇక చెడు కన్పించదు. చరిత్రను ఎక్కడ తిరగ దోడినను సర్వ దురంతములకు వాక్కే కారణమై యుంటుంది. వాక్కును భూషణముగా ఉంచుకోవాలే గాని దూషణమున కుపయోగించరాదు.

"అంధుని కుమారు డంధుడే" యని ద్రౌపది పలికిన వాక్కు ఎంతటి దారుణ పరిస్థితులకు దారితీసిందో మనకు మహాభారతము విరూపించినది. సీతమ్మ లక్ష్మణస్వామిని కఠినోక్తుల ద్వారా దూరం చేసుకోకుండా ఉన్నట్లయితే రావణాసురుడు చేరువయ్యే వాడేగాదు. నేటి సమాజంలో కూడా ఇలాంటి దృష్టాంతములను అనేకములుగ మనము చూస్తుంటాము. అనేక మారణ హోమాల వెనుక, దారుణ హత్యల మధ్య ఈ పరుష వాక్కులే ప్రధాన కారణాలుగ తెలుస్తుంటాయి.

వాక్కు చెడితే బ్రతుకే చెడిపోతుంది. ఆరోగ్యం క్షీణిస్తుంది. వృద్ధాప్యం సమీపిస్తుంది. మరణం ఆలింగనం చేసుకుంటుంది. అందుచేత దురుక్తికి మృత్యు వనెడి కొడుకు, భీతి యనెడి కుమార్తె జన్మిస్తారు. మృత్యువు వంటియే భీతి యుండును. వారిరువురు కవలలు.

ఈ అధర్మవంశము ఇంతటితో ఆగుటలేదు. మృత్యువుకు ఇరువురు సంతానముగా లభిస్తారు. నరక మనెడి కుమారుడు. యాతన యనెడి కుమార్తె. అధర్మ జీవనము శ్మశానముతో ఆగదు. ఆ తరువాత కూడా ఫలితముల నందించుచునే యుండును.

అధర్మ ప్రవర్తనము వలన నరకప్రాప్తి కలుగును. అక్కడ వివిధములైన యాతన ననుభవించవలసి యుండును. ఇదియే అధర్మ వంశవృక్షము.

ఇది విషవృక్షము. విషమ పరిస్థితులను బ్రతుకులో ఆవిష్కరించే విద్వార వృక్షము. దీని అసంగ మనెడి శస్త్రముచే ఛేదించాలి. ధర్మ మనెడి ఖడ్గముచే ఖండించాలి. వెలుతురు మెల్లమెల్లగ ప్రవేశిస్తూ ఉంటే చీకటి అంతరిస్తూ యుంటుంది. ధర్మం వ్యక్తిలో మెల్లమెల్లగ చోటు చేసుకుంటూ వుంటే అధర్మం అడుగంటి పోతుంది.

ధర్మం శనై స్సంచిను యాత్ వల్మీక మివ పుత్తికాః
పరలోక సహాయార్థం సర్వభూతా న్యపీడయన్

ధర్మము నెలా వృద్ధి చేసుకోవాలి యనెడి విషయమును ఈ శ్లోకము చక్కగా చెబుతుంది. ఈ శ్లోకాన్ని రచించిన దెవరో తెలియదు. దీనికి మూల మెక్కడో తెలియదు. కానీ హృదయంలో ఒక మూల దాగి యుండినది. భావము చక్కగ యున్నది. ఈ సందర్భమునకు మరీ అతికినట్లున్నది. అందువలన గ్రహింపగలరు.

ధర్మమును మెల్లగా ఆర్జించుకోవాలి యని పై శ్లోకము యొక్క కేంద్ర విషయము.

తేనెటీగలు ప్రతిదినమూ సుమములపై వ్రాలి మకరందమును గ్రహిస్తాయి. ఆ తేనెను కొద్ది కొద్దిగా సంగ్రహించి తెచ్చి ఒక తేనె పట్టును నిర్మిస్తాయి. ఈ తేనెను సంగ్రహించే సమయాన పుష్పాలు నలగకుండా చరిస్తాయి. తేనెపట్టును తాము ఆస్వాదిస్తాయి. ఇతరులకు గూడ అందిస్తాయి.

ధార్మికుడైన వ్యక్తి గూడ తేనెటీగల వలె నిత్యమూ కొద్ది కొద్దిగా ధర్మాచరణము ద్వారా ధర్మఫలమును సంగ్రహించాలి. ఆ ధర్మఫలము రేపు తనకు, లోకానికి గూడ ఉపకరించేలా చూడాలి. అయితే ఈ ధర్మాచరణము నందు ఎవ్వరికీ హాని కల్పించకుండా, ఎవరికీ హృదయమును భగ్న మొనర్పకుండా మెలగాలి యని భావము.

అధర్మాన్ని నశింప చేయాలి. ధర్మాన్ని పెంపొందించుకోవాలి. ధర్మవృక్షానికి ప్రేమ ఫలం పుడుతుంది. అది పరమ పురుషార్థమైన మోక్షమును అందిస్తుంది.

ధర్మంలో చ్యుతుడైన దక్షుని గమనించాము. అలా పతనం గాకుండా ఉండేందుకు అధర్మము యొక్క స్వరూపాన్ని గ్రహించాము. ధర్మ బద్ధమైన జీవనానికి లభించే అమృత ఫలమేమిటో ఇప్పుడు చూడబోతున్నాము. అదియే మహాద్భుతమైన ధృవోపాఖ్యానము.

ధృవోపాఖ్యానము

మనువు యొక్క ముగ్గురు కుమార్తెలను గురించి మైత్రేయుడు విదురునకు తెలిపెను. మనువుకు ఇరువురు కుమారులు గలరు. వారే ప్రియవ్రత, ఉత్తానపాదులు. ప్రియవ్రతుని గూర్చి పంచమ స్కంధమున వివరించును. ఈ చతుర్థ స్కంధమున ఉత్తానపాదుని చరిత్రవచ్చును.

ఉత్తానపాదునకు సునీతి, సురుచి యను నిరువురు భార్యలు గలరు. సురుచికి ఉత్తము డను బాలుడు కలిగెను. సునీతికి ధృవుడు కలిగెను. ఉత్తానపాదునకు సురుచి యందే ప్రీతి ఎక్కువగా యుండెను.

ఇది ఎవరి జీవితగాథయో యని ఆలోచింప పనిలేదు. ఇది మనందరి యొక్క జీవితగాథయే. ప్రతి మానవుడు ఉత్తానపాదుడే. ఉత్తానపాదుడనగా పాదములను పైన ఉంచిన వాడని భావము. ప్రతి జీవియును తల్లి గర్భమున తలక్రిందులుగ పడియుండును. పాదములను పైన యుంచి, తలను క్రింద భాగమున నిలిపి యుండును. కనుక ప్రతి జీవియు ఉత్తానపాదుడే.

అతనికి సునీతి, సురుచి యనెడి ఇరువురు భార్యలు గలరు. సునీతి యనగా చక్కని ధర్మము యని అర్థము. సురుచి యనగా విషయ సుఖముల యందు ప్రీతి యని భావము. మానవుడు రుచికి ప్రాధాన్యత నొసగునే గాని నీతికి ప్రాధాన్య మొసగడు. ఉత్తానపాదుడు సురుచికి ప్రియుడే గాని సునీతికి గాడు. అతనికి సురుచి యందే గాఢానురక్తి యుండెను.

సురుచి ప్రేయస్సు నందించును. సునీతి శ్రేయస్సు నందించును. మనుజులకు శ్రేయస్సు కన్నను ప్రేయస్సునందే అభిరుచి మెండుగా యుండును. ప్రియమైనవి ప్రేయస్సు యనబడును. ప్రియము అనగా ఎవరికి ప్రియము? యనెడి ప్రశ్న తలఎత్తును. ఇంద్రియ మనో బుద్ధులకు అని జవాబు వచ్చును.

జీవులు ఇంద్రియ మనస్సులను తృప్తిపరచుట యందే కాలము నంతటిని వ్యయమొనర్చు చుందురు. మనస్సు సినిమా చూడవలె ననును. వెంటనే మనుజుడు ఆ ప్రయత్నములో యుండును. సినిమాను చూడకపోతే ఏమి? అని ప్రశ్నించడు.

నాలుక రుచుల నభిలషించును. జీవుడు నాలుక అడిగిన రుచుల నన్నిటిని అందించును. అయినను దానికి తృప్తి యుండదు. ఎంతకాల మారగించినను సంతృప్తి చెందదు. చూసిన రుచులే అయినను పదే పదే అభిలషించుచు జీవుని కష్టపెట్టుచుండును.

ఇంద్రియములను నిగ్రహించువాడే ఈ ప్రపంచములో సుఖించును. ఇంద్రియములు మనస్సును చలింపచేయును. ఆ తరువాత మనస్సును వెంట గొనిపోయి అనేకమైన విషయసుఖముల యందు రమించి దుఃఖమయ జీవితము నందించును. కనుక ఇంద్రియములను ప్రయత్న పూర్వకముగ నిగ్రహించాలి. ఇంద్రియములు నిగ్రహింపబడినచో మనస్సు గూడ నిగ్రహింపబడును. మనస్సును విచలిత మొనర్చునవి ఇంద్రియములే యని గీతాచార్యుడు గూడ బోధించెను.

యతతో హ్యపి కౌన్తేయ పురుషస్య విపశ్చితః
ఇన్ద్రియాణి ప్రమాథీని హరన్తి ప్రసభం మనః

"అర్జునా! వివేకియైన పురుషుడు ప్రయత్నించు చుండినను మథనము చేసెడి ఇంద్రియములు అతని మనస్సును బలవంతముగ హరించుచున్నవి" యని శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీత సాంఖ్య యోగములో తెలుపుతారు.

సాధారణంగా మనస్సు ననుసరించి నడచేవారే గాని ధర్మము ననుసరించి నడచేవారుండరు. మనస్సు కోరికల పుట్ట. అదియే సురుచి. సునీతి ధర్మ స్వరూపము.

ఉత్తానపాదుడు పెద్దభార్యయైన సునీతిని ప్రేమించడు. చిన్న భార్యయైన సురుచి మీదనే మోహము కలిగి యుండును. బ్రహ్మము అనగా పెద్దది యని అర్థము. పెద్దదియైన బ్రహ్మమును ఎవ్వరూ అభిలషించరు. అల్పమైన ప్రపంచము మీదనే ఆశలను పెంచుకొందురు.

స్వతః పూర్ణః పరాత్మాత్ర బ్రహ్మ శబ్దేన వర్ణితః

"స్వయముగా పరిపూర్ణమైన పరమాత్మయే బ్రహ్మ యనెడి శబ్దము చేత చెప్పబడినది" యని శుకరహస్యోపనిషత్తు ప్రవచించినది.

ఉత్తానపాదుడు సురుచి వలన ఉత్తముడను కుమారుని బొందెను. విషయానందములో ఉత్తమ సుఖము లభించినదని ఉత్తానపాదుడు భ్రమించును. **"ఉత్"** అనగా మీద లేక పైన యని భావము. **"తమః"** యనగా అంధకారము యని అర్థము. పైన అంధకారము ఆవరించి యున్నవాడు ఉత్తముడు. ఎవరి మనస్సులో అవిద్య చోటు చేసికొని యుండునో అతడే ఉత్తముడు యని భావము.

విషయానందములో రమించువారు అవిద్యాంధకారములోనే రమించుచుందురు. అట్టివారికి పరమాత్మ జ్ఞానము కలుగదు.

సునీతికి ధృవుడు బిడ్డడై జన్మించును. ధృవమనగా స్థిరమైనది లేక నశింపులేనిది యని అర్థము. ఎవరయితే ధర్మమార్గమున చరింతురో, ప్రేమమార్గమున ప్రవర్తింతురో అట్టి వారికి అక్షయ జ్ఞానము లభించును. అందుచేతనే సునీతికి ధృవుడు బిడ్డడయ్యెను.

యే త్వక్షర మనిర్దేశ్య మవ్యక్తం పర్యుపాసతే
సర్వత్రగ మచిన్త్యఞ్చ కూటస్థ మచలం ధృవమ్

యని నిర్గుణ పరబ్రహ్మము యొక్క లక్షణములను భగవద్గీత వివరించినది. అవి 1) అక్షరము 2) అనిర్దేశ్యము 3) అవ్యక్తము 4) సర్వత్రగము 5) అచింత్యము 6) కూటస్థము 7) అచలము 8) ధృవము.

కనుక ధృవమనగా అవికార్య సత్తా స్వరూపము. అదియే జీవికి నిత్యసుఖమును ప్రసాదించును. అయినను మానవులు తాత్కాలిక సుఖములైన విషయానందమును వాంఛింతురే గాని శాశ్వతమైన ఆత్మానందమును అభిలషింపరు. సురుచికి దాసులే గాని సునీతికి దూరులే.

ఒకనాడు ఉత్తానపాదుడు ఉత్తముని యొడిలో గూర్చుండబెట్టుకొని ముద్దాడుచుండెను. ధృవుడు చూచెను. తానుగూడ తండ్రియొడిలో గూర్చొనవలెనని అభిలషించి దగ్గరగా వెళ్ళెను. కానీ సురుచి యొక్క భయముతో రాజు అంగీకరించలేదు.

ధృవుడు నిర్విషయానందము. కాని అట్టి ఆనందమును జీవుడైన ఉత్తానపాదునకు కలుగకుండా వాసన యనెడి సురుచి నిరోధించును. జీవుడు భక్తియుతుడైనచో తనచరిత్ర ముగియునని వాసన చింతించును.

తండ్రికి దగ్గరవుతున్న ధృవుని సురుచి వారించెను. ధృవునితో ఇలా పలికెను. "ధృవుడా! నీవు తండ్రి యొడిలో గూర్చొనుటకు అర్హుడవుగావు" యనెను.

ఆ మాటకు ధృవుడు ఆశ్చర్యపోయెను. ప్రశ్నార్థకంగా సురుచి వైపు చూచెను. నేను రాజకుమారుడను గానా? యనెడి ప్రశ్న ముఖమున గోచరించెను.

న వత్స నృపతేర్ధిష్ణ్యం భవానారోఢు మర్హతి
న గృహీతో మయా యత్త్వం కుక్షావపి నృపాత్మజః

"వత్సా! నీవు రాజకుమారుడవైనను నా యొక్క గర్భమున జన్మింపక పోవుటచేత రాజుయొక్క తొడపై కూర్చొనుటకు అర్హుడవుగావు.

"ధృవా! నీవు చిన్నవాడవు. నీవు వేరే స్త్రీకి జన్మించితివని బహుశ నీకు తెలియక పోవచ్చును. అయినా అర్హత లేని విషయము నభిలషించుచున్నావు. కుమారా! ఒకవేళ ఉత్తముని వలె నీవు గూడ రాజ సింహాసనము నధిష్ఠింపవలెనని భావించినచో నా గర్భమున జన్మింపుము" యనెను.

క॥ అదిగాన నీ వధోక్షజు పదపద్మము లాశ్రయింపు పాయక హరి నా
యుదరమున బుట్ట జేయును వదలక యట్లయిన ముదము వఱలెడి నీకున్

సవతి తల్లిమాటలు బాలుడైన ధృవుని హృదయముపై మాయని గాయమును చేసెను. ఆమె మాటలకు ధృవుడు కలత చెందెను. తండ్రి ఆమె మాటల నాలకించుచుండెనే గాని వలదని నివారించకుండెను. ధృవుడు విలపించుచు తల్లియైన సునీతి కడకెళ్ళెను.

ధృవుని దుఃఖమునకు కారణము ఏమిటని సునీతి ప్రశ్నించెను. తల్లి ఎంత ప్రశ్నించినను ధృవుడు చెప్పలేదు. చెప్పినచో తన సవతితల్లిమీద చాడీలు చెప్పినట్లుగునని ధృవుడాలోచించెను. సునీతి బిడ్డడు సుబద్ధిగాక మరేమగును?

దాసిద్వారా జరిగిన విషయము నంతటిని సునీతి గ్రహించెను. సురుచి మాటలను తలచుకొంటూ సునీతి కూడా దుఃఖించెను. బాలుని మనస్సు గాయమైనందుకు చింతించెను. సునీతి చింతించినదేగాని సురుచిని ఒక్కమాట అనలేదు. నిందించలేదు. తాను సురుచిని నిందించినచో ఆ మాటల ప్రభావము తన బిడ్డపై బడునని సునీతి భావించెను. ఐశ్వర్యము లేకపోయినను ఫరవాలేదు గాని జ్ఞానము దిగజారిపోకూడదని సునీతి ఆలోచించెను. బిడ్డలకు తల్లులే సంస్కారముల నందించాలి.

చిన్నబిడ్డల ముందు నిందావాక్యములను పలుకరాదు. బిడ్డలలో అనుకరణ సహజాత ముండును. **(IMITATIVE INSTINCT)** పెద్దల సంస్కారములు పిల్లలకు చాలా త్వరగా అలవడును.

సునీతి బిడ్డడగు ధృవుని యొడిలోనికి తీసికొని "నాయనా! దుఃఖింపకు. ఈ ప్రపంచములో ఎవ్వరు ఎవ్వరికి అపకారమును చేయలేరు. గత జన్మలలో మనము ఇతరులను కష్టపెట్టి యుండినచో ఇప్పుడు దాని ఫలమైన దుఃఖమును అనుభవించు చుందుము.

క॥ అనఘా! యీ దుఃఖమునకు బనిలే దన్యులకు సొలయ బలవంతంబై
తన పూర్వజన్మ దుష్కృత ఘనకర్మము వెంట నంటగా నెవ్వలనన్

"నాయనా! నీవు దురదృష్టవంతురాలైన నా కడుపున పుట్టితివి. నా పాలతో పెరిగితివి. సురుచి వాస్తవమునే పలికినది. నేను రాణినిగాదు. కనీసము రాజుకు దాసిని గూడ కాలేకపోతిని.

"తండ్రీ! ఎవరిపైనను అసూయను పెంచుకొనకుము. నీకు సురుచి సవతి తల్లియైనను సత్యమునే బోధించినది. శ్రీహరి పాదపద్మములను సేవింపుమని తెలిపినది. నాయనా! బిచ్చమెత్తవలసి వచ్చినచో పరమాత్మనే యడుగుట మంచిది. అతని కృప అక్షయము. నీవు మోయలేనంత సంపదను నీ కతడొసంగును.

"ధృవా! అందరికీ తండ్రి వాసుదేవుడే. ఆయన యొడిలో ఒక్కసారి గూర్చొనినచో మరొకరి యొడిలో గూర్చొనవలెనని అనిపించదు. వెళ్ళుము. వనముల కేగుము. భక్తవత్సలుడైన శ్రీహరిని ధ్యానింపుము;" యనెను.

ధృవుడు తల్లిని దీనముగా జూచెను. "కుమారా! ఎందులకు ఆలోచించుచుంటివి? ప్రేమలేని అంతఃపురము కన్నను అడవియే మేలు. నాన్నా! నిన్ను ఒంటరిగ పంపుటలేదు. నా ఆశీర్వాదమును తోడిచ్చి పంపుతున్నాను. ధృవా! నేను ఒంటరిగ వెళ్ళుచున్నాను అని భావింపకుము. దీన దయాళుడైన శ్రీహరి నిన్ను వెన్నంటియే యున్నాడు. తల్లి గర్భమున ఎవడు నిన్నుగాపాడెనో వాడే అరణ్యములలో నీకు అండగా నిలుచును" యనెను.

వనముల కెళ్ళుటకు ధృవుడు నిర్ణయించుకొనెను. తల్లికి సాష్టాంగ వందన మాచరించెను. బిడ్డను తల నిమురుతూ, ఆశీర్వదించి, "కుమారా! నాకు నమస్కరించితివి. అలాగే నీ సవతి తల్లికి కూడా నమస్కరింపుము. ఆమె ఆశీర్వాదము గూడ పొందుము" యనెను. తన బిడ్డను అన్ని విధముల అవమానపరచినను ఆమె ఆశీర్వాదము పొందుమని ధృవుని పంపెను. సునీతి లాంటి తల్లులు ఆదర్శమూర్తులు. తన బిడ్డడు ద్వేషముతో అడవికి వెళ్ళినచో ఆ యాలోచన అతని ధ్యానమును భగ్నమొనర్చునని సునీతి ఆలోచించెను.

సాధకులైనవారు ఈర్ష్యా ద్వేషములను వదలి జీవింపవలెను. మనస్సులోని వాసన ధ్యాన సమయమున తలఎత్తును. ప్రేమనిండిన హృదయాలే ధ్యాన సమయమున శ్రీహరిని హృదయమున స్థిరముగ నిలుపుకొనగలుగును.

తల్లి యాజ్ఞను పాలించి ధృవుడు సవతి తల్లియగు సురుచికి నమస్కరించెను. తాను అవమానపరచినను ధృవుడు తనకు నమస్కరించెనని భావించి ఆశీర్వదించెను. ఆశీర్వదించెనేగాని ఆదరము చూపలేకపోయెను. పాషాణ హృదయాలు త్వరగా మారవు.

ధృవుడు అడవికి వెళ్ళెను. అరణ్యమున నడచుచు ధృవుడు ధైర్యముగా యుండెను. శ్రీహరి నా వెంటనే యుండునని మా అమ్మ చెప్పినది. కనుక నాకు భయము లేదని భావించును. అచంచల భక్తి, అకుంఠిత దీక్ష గలవారు భగవానుని దర్శింప గలుగుదురు.

ధృవుడు వెడలుచుండెను. మార్గమున నారదమహర్షి ఎదురయ్యెను. అర్హత గలవాని వద్దకు గురువు నడచి వచ్చును. మార్గముననే గురువు గోచరించును.

స్పృష్ట్వా మూర్ధన్య ఘఘ్నేన పాణినా ప్రాహ విస్మితః

"ధృవుని గాంచి విస్మితుడైన నారదమహర్షి తన శుభకరమగు హస్తముచే ధృవుని మస్తకమును స్పృశించెను." గురువు శిష్యుని మస్తకమును స్పృశించగనే శిష్యుని మస్తకము శుద్ధియగును.

ధృవుడు నారదునికి నమస్కరించి శ్రీహరిని బొందుటకు సుఖకరమైన మార్గమును బోధింపుమని ప్రార్థించెను. ధృవుని పలుకులకు సంతుష్టచిత్తుడైన నారదుడు ఇలా చెప్పెను:

జనన్యాభిహితం పన్థాః స వై నిశ్శ్రేయ సస్య తే
భగవాన్ వాసుదేవ స్తం భజ తంద త్ర్పవణాత్మనా

"ధృవా! నీ తల్లియగు సునీతి చెప్పినదియే క్షేమకరమగు మార్గము. అందుచేత నీవు ఏకాగ్ర చిత్తముతో శ్రీహరిని ధ్యానింపుము. వాసుదేవ నామమును స్మరింపుము" యనెను.

"కుమారా! ధృవా! నీకు శుభము కలుగుగాక! యమునా తీరమున మధువన మున్నది. అచ్చట శ్రీకృష్ణపరమాత్మ సదా విహరించుచుండును. అచ్చట కూర్చుండి వాసుదేవ నామమును ధ్యానింపుము" యనెను. శ్రీకృష్ణుని దివ్యమైన రూప వైభవమును ధృవునకు తెలిపి, వాసుదేవ నామమును ధ్యానింపుమని చెప్పెను.

సీ॥ ఆశ్రిత సత్ర్పసాదాభిముఖుండును స్నిగ్ధ ప్రసన్నాన నేక్షణుండు
సురుచిర నాసుండు సుభ్రూయుగుండును సుకపోలతలుడును సుందరుండు
హరి నీల సంశోభితాంగుండు దరుణుండు నరుణావలోక నోష్ఠాధరుండు
గరుణా సముద్రుండు బురుషార్థ నిధియును బ్రణతాశ్రయుండు శోభనకరుండు
తే॥ లలిత శ్రీవత్స లక్షణ లక్షితుండు సర్వలోక శరణ్యుండు సర్వసాక్షి
పురుష లక్షణ యుక్తుండు బుణ్యశాలి యసిత మేఘ విభశ్యాముడవ్యయుండు

అయినట్టి పురుషోత్తముని పూజింపుమని నారదుడు ధృవునకు చెప్పెను. దానితో కూడా అద్భుతమైన మంత్రమును ఉపదేశించెను.

"ఓం నమో భగవతే వాసుదేవాయ"

యనెడి మంత్రము నుపదేశించెను. గురూపదేశమును బొందిన ధృవుడు నారద మహర్షికి ప్రదక్షిణ నమస్కార మాచరించి మధువనమున కేగెను.

ధృవుడు తపస్సు నాచరించుటకు మధువనమునకు వెడలగా నారదమహర్షి ఉత్తానపాదుని వద్దకు వచ్చెను. వాడిపోయిన ముఖముతో కలత చెందియున్న ఉత్తాన

పాదుని గాంచెను. రాజుగారి యొక్క దీనావస్థకు కారణమును చెప్పుమని నారదుడు అడిగెను.

ఉత్తానపాదుడు పశ్చాత్తాపహృదయుడై, "మహర్షీ! భార్యకు వశుడనైన నేను బుద్ధిమంతుడు, ఐదు సంవత్సరముల వయస్సు గల బాలుడును అగు ధృవుని అరణ్యములకు వెడలగొట్టితిని. సుశీలుడు, అనాథుడైన యా బాలుని క్రూరమృగము లేమి జేయునో యని దుఃఖించు చున్నాను. నా యొడిలో గూర్చొనుటకు ప్రేమతో దగ్గరకు వచ్చిన బాలుని తిరస్కరించిన పాపిని" యని దుఃఖించెను.

నారదుడు ఉత్తానపాదునితో ఇలా చెప్పెను: "రాజా! నీ బిడ్డడు పరమాత్మ కృపకు పాత్రుడైన భక్తుడు. అతనిని గురించి నీవు దుఃఖింపవలసిన పనిలేదు. అతని ఖ్యాతి జగద్విదిత మగును. భగవద్దర్శనమునుబొంది త్వరలోనే నీ బిడ్డడు నీ చెంతకు అరుదెంచగలడు" యని పలికి నారదుడు వెడలెను. ఉత్తానపాదుడు నిరంతరము ధృవుని గూర్చియే ఆలోచించుచుండెను.

ధన్యుడైన ధృవుడు

ధృవుడు యమునను సమీపించెను. యమునా నదిలో స్నాన మాచరించి పవిత్రుడై ఆ రాత్రి ఉపవసించెను. శ్రీహరినే స్మరించుచుండెను.

సాధనలో ఉన్నతులు కాగోరువారు ఉపవాస వ్రతమును క్రమమెరిగి ఆచరించుట ఉత్తమము. ఉపవాసము వలన ఇంద్రియములు నిగ్రహింపబడును. మనస్సు అన్యరాగ విస్మరణమునందు యుండును. అలాగని ఆకలిని ఒక వరముగా భావించరాదు. ఆధ్యాత్మిక జీవనము అతిని అంగీకరించదు. మితమే హితమని విశ్వసిస్తుంది.

"ఉప" అనగా దగ్గరగా యని అర్థము. "వాసము" యనగా యుండుట యని భావము. ఉపవాసమనగా దగ్గరగా వసించుట యని భావము. పరమాత్మకు దగ్గరగా వసించెడి అవకాశమును దేహేంద్రియ మనోబుద్ధులకు కల్పించుటయే ఉపవాసము యొక్క ముఖ్యోద్దేశ్యము. కనుక ఉపవాస దీక్షలో మనస్సు అన్యవిషయముల మీదికి వెళ్ళకుండా పరమాత్మయందే ఉపవసించాలి. అందుచేత ధృవుడు తపస్సు ప్రారంభించే ముందు ఉపవసించి, ఆ ఉపవాస సమయాన శ్రీహరి పాదపద్మముల చెంత ఉపవిష్టుడై యుండెను.

ధృవుడు తపస్సు నారంభించెను. మొదటి మాసమున మూడు దినముల కొక్కసారి వెలగపండ్లను, రేగుపండ్లను ఆహారముగ దీసికొని దేహమును రక్షించుకొనుచు మనస్సును ధ్యానము నందుంచెను.

రెండవ నెల ప్రవేశించినది. రెండవ మాసమున ఆరుదినముల కొక్కసారి ఎండుటాకులను, గడ్డిని మాత్రమే తిని తపస్సు చేయుచుండెను. ఎండుటాకులను గూడ

క్రిందపడిన వానిని ఆరగించెనే గాని చెట్టునుండి కోయలేదు. ఈ విధముగా రెండవ మాసము అవిన్ను సాగినది.

ఇక్కడ ఒక్క విషయమును మనము గుర్తించాలి. గ్రహించాలి. రోజులు గడుస్తున్న కొలది ఉపవాస కాలము పెరుగుతున్నది. కానీ తీసికొను ఆహారము గూడ రసహీనమై యున్నది.

మూడవ నెల ప్రవేశించినది. మూడవ మాసమున తొమ్మిది దినముల కొక్కసారి నీటిని మాత్రమే త్రాగుచు భగవత్స్మరణము నందు నిలిచియుండెను.

నాల్గవ మాసమున పండ్రెండు రోజుల కొక్కసారి వాయువును మాత్రమే భక్షించుచు నారాయణుని ధ్యానింపసాగెను. ఐదవ మాసమున ఆహారమును పూర్తిగా విసర్జించెను. ప్రాణమును నిరోధించెను. స్థాణువు వలె ఒంటికాలిపై నిలబడి భగవానుని ధ్యానింపసాగెను. ధృవుడు ఒంటికాలిపై నిలబడగనే ఆ తపోశక్తికి భూమి, ఏనుగెక్కిన పడవవలె ఊగిపోయెను.

ధృవుడు ప్రాణమును నిరోధించగనే దిక్పాలురతో పాటు సర్వజీవులకు సరిగ శ్వాస లందకుండెను. ఈ విధముగా పీడింపబడిన దేవతలు శ్రీహరిని శరణుజొచ్చిరి. ధృవుని కఠోర తపోమహిమయే ఈ విధమైన వాయు నిరోధమునకు కారణమైనదనియు, భయపడ నవసరము లేదని దేవదేవుడగు శ్రీహరి తెలియజేసెను. ఈ విధముగా తెలిపి,

సహస్ర శీర్షాపి తతో గరుత్మతా మధోర్వనం భృత్యదిదృక్షయా గతః

"సహస్ర శీర్షుడైన శ్రీమన్నారాయణుడు తనభృత్యుడగు ధృవుని గాంచుటకై గరుడునిపై నధిరోహించి మధువనమునకు అరుదెంచెను;" యని వ్యాస మహర్షి భాగవతమున రచించెను.

సాధారణంగా భగవంతుని దర్శించుటకు భక్తులు ఆలయాలకు వెళ్ళుచుందురు. కానీ భక్తుని దర్శించుటకు భగవానుడే స్వయముగా యరుదెంచుట ఇచ్చట విశేషముగ తెలియుచున్నది.

భక్తిహీనులై, భుక్తికాములై పరమాత్మను దర్శింపబోవు వారిని పరమాత్మ అనుగ్రహించడు. ఎవరయితే పరమాత్మధ్యాన తత్పరులై యుందురో అట్టివారి సమీపమునకు భగవానుడే నడచి వచ్చును. శ్రీహరి ధృవుని సమీపించెను.

శ్రీహరి మధువనమున ధృవునకు దర్శన మొసగెను. ధృవుడు నమస్కరించుచు అశ్రుపూర్ణ నయనుడై నిలబడెను. శ్రీహరిని స్తుతింపవలెనని అభిప్రాయపడెను. కానీ అదెలాగో ఐదుసంవత్సరముల బాలుడైన ధృవునికి తెలియకుండెను. ధృవుని మనస్సులోని విషయమును శ్రీహరి గ్రహించెను.

భక్తి లేనివారు ప్రక్క యింటివారు నిద్రపోలేని రీతిలో ప్రార్థనలు చేసినను వారి మనస్సులోని కాలుష్యమును గుర్తించిన వాడైనందున పరమాత్మ వారిని కనికరించడు. భక్తి

గల నిర్మలాత్ములు విద్యాహీనులైనను, ప్రార్థనలు చేయలేనివారైనను వారి హృదయములలోని భక్తి సౌందర్యమును గుర్తించుట చేత భగవానుడు వారి ననుగ్రహించును.

బాలుడైన ప్రహ్లాదుని, రాక్షసుడైన విభీషణుని, వానరుడైన సుగ్రీవుని, హీనకులజయైన శబరిని ఇలా ఎందరినో ఉద్ధరించెను. నిరక్షరాస్యులైన వారిచేత ఉద్గ్రంథములను వ్రాయించెను. కబీర్‌దాసునకు అక్షర జ్ఞానము లేదు. కానీ ఆ దివ్యాత్మునికి అక్షయ జ్ఞానమును ప్రసాదించి, ఆయనచేత అద్భుతములైన దోహాలను వ్రాయించెను. అక్షరములు తెలియని మొల్లచేత ఆంధ్రమున ఛందోబద్ధముగ తన చరిత్రనే వ్రాయించుకొనెను.

శ్రీహరి శంఖమును చేబూని ధృవుని మస్తకముపై స్పృశించెను. ఆ దివ్య స్పర్శచే ధృవునకు ఆత్మజ్ఞానము కలిగెను. పరమాత్మ స్థితి అవగతమయ్యెను.

ధ్రువునకు ఇప్పుడు జ్ఞానము కలిగెను. వెంటనే పరమాత్మను స్తుతింప నారంభించెను. చిచ్ఛక్తితో తనలో ప్రవేశించి నిద్రాణమై యున్న జ్ఞానమును వ్యక్త మొనర్చిన నారాయణ దేవునకు నమస్కార మనుచు అద్భుతముగ ప్రస్తుతింప నారంభించెను.

సీ॥ సర్వేశ! కల్పాంత సమయంబు నందు నీ యఖిల ప్రపంచంబు నాహరించి
యనయంబు శేష సహాయుండవై శేషపర్యంక తలమున బవ్వళించి
యోగనిద్రారతి నుండి నాభీ సింధుజ స్వర్ణలోక కంజాత గర్భ
మందు జతుర్ముఖు నమర బుట్టించుచు రుచి నొప్పు బ్రహ్మ స్వరూపివైన
తే॥ నీకు మ్రొక్కెద నత్యంత నియమ మొప్ప భవ్యచారిత్ర పంకజ పత్రనేత్ర
చిరశుభాకార నిత్య లక్ష్మీ విహార! యవ్యయానంద! గోవింద! హరిముకుంద!

ఈ విధముగా ప్రార్థించిన ధ్రువుని మొర నాలకించి "ధ్రువ కుమారా! అన్యులు బొందలేని అక్షయ సుఖమును నీ కొసంగు చున్నాను. ధృవ లోకమును ప్రసాదించు చున్నాను. నీవు ఇల్లు చేరగనే నీ తండ్రి సన్యసించిన వాడై వనములకేగును. నీవు రాజ్యమును పాలింపుము. యజ్ఞములతో నన్ను అర్చింపుము. నన్నే స్మరించుచు చివరగ నీవు నా లోకమునకు వచ్చెదవు. నమస్కృతమైన నా ధామము ఉత్కృష్టమైనది. అచ్చట చేరిన తరువాత తిరిగి రావడ మంటూ జరుగదు;" యని ధ్రువు నాశీర్వదించి విష్ణుమూర్తి వెడలిపోయెను.

ధ్రువునకు వాంఛితార్థములు నెరవేరినవి. కాని హృదయమున ఏదో అసంతృప్తి గోచరించెను. ధృవుడు వ్యథ చెందసాగెను. "అనేక జన్మలలో మహర్షులు సాధించిన విష్ణుదేవుని అనుగ్రహమును నేను ఆరు నెలలలోనే సాధించ గలిగితిని. కానీ నేను అదృష్టహీనుడను. శ్రీహరి పాదపద్మములు లభించినను, సోదరునిపై, సవతి తల్లి పై నున్న మాత్సర్యముచే నేను రాజ్య సుఖమునే వాంఛించితిని. దేవర్షియగు నారదుడు చెప్పిన మాటలను మోహావశముచే మరచితిని.

దైవీం మాయా ముపాశ్రిత్య ప్రసుప్త ఇవ భిన్నదృక్
తప్యే ద్వితీయేఽ ప్యసతి భ్రాతృభ్రాతృ వ్యహ్రు ద్రుజాః

"నిద్రించు వ్యక్తి భిన్న దృష్టిచే ఘోరమైన రూపములను గాంచి దుఃఖించునట్లు నేను గూడ మాయచే మోహితుడనై, ద్వైత దోషముచే ఏకమైన భగవానుని విస్మరించి సోదరుని శత్రువుగా భావించి ఇప్పుడు దుఃఖించు చుంటిని.

"దుస్సాధ్యమైన భగవానుని దర్శనము పొందినను అసత్యమైన సుఖములనే వాంఛించితిని. చనిపోయిన వానికి చేసిన చికిత్స ఎలా వృథా యగునో అలాగుననే నా తపస్సు గూడ వ్యర్థమైనది.

"దరిద్రుడైనవాడు చక్రవర్తిని వరిధాన్యము నర్థించినట్లు పరమాత్మయైన శ్రీహరిని అనిత్య వస్తువుల నిమ్మని యాచించితిని. భగవంతుడు నాకు మోక్షము నీయగోరెను. కానీ నేను ప్రేయస్సునే యర్థించితిని" యని దుఃఖించెను. ఇది వాస్తవానికి ధృవునిలోని అసంతృప్తి కాదు. సగుణ ముక్తి గాక నిర్గుణ ధ్యానమునకై ధ్రువుని హృదయము స్పందించడము ఈ సందర్భమున చక్కగ ప్రతిఫలించు చున్నది.

తన కుమారుడైన ధ్రువుని గూర్చి ఉత్తానపాదుడు ఆలోచించుచు దుఃఖించుచుండెను. ఇంతలో ఒక వ్యక్తి యరుదెంచి ధ్రువుడు వచ్చుచున్నాడని చెప్పెను. ఉత్తానపాదుని ఆనందమునకు అవధులు లేక పోయెను.

రథము నధిరోహించి, బంధు మిత్రాదులతోను, మంత్రులతోను, ద్విజులతోను గూడి శంఖ దుందుభి నాదములు మ్రోగుచుండగ ధృవకుమారుని ఆహ్వానించుటకు ఎదురేగెను. సునీతి, సురుచి, ఉత్తములు గూడ రాజు ననుసరించిరి.

ఆరునెలల క్రితం ఆరుసంవత్సరాలు నిండని బాలుని నిర్దాక్షిణ్యంగా అరణ్యమునకు పంపినవారు ఈ నాడు ఆహ్వానించుటకు అరుదెంచుచున్నారు. భగవానుడు ధృవునికి వశమయ్యెను. అందుచేత ధృవుడు సర్వులకు ప్రీతిపాత్రు డయ్యెను. పరమాత్మకు ప్రీతిపాత్రులైన వారిని ప్రపంచములో అందరూ గౌరవింతురు.

ఉత్తానపాదుడు ధృవుని ఆలింగన మొనర్చుకొనెను. ఆనంద బాష్పములను రాల్చెను. ధృవుని లాంటి బిడ్డని గనిన తనజన్మ తరించినట్లు భావించెను.

ఉత్తానపాదుడు తండ్రి పాదములకు నమస్కరించెను. తండ్రి ధ్రువుని శిరమును మూర్కొని ముద్దాడెను. ధ్రువుడు తల్లులను గాంచి వారికి నమస్కరించుటకు వెళ్ళి మొదట సురుచికి నమస్కరించెను.

సురుచిస్తం సముత్థాప్య పదావనత మర్భకమ్
పరిష్వజ్యాహ జీవేతి బాష్ప గద్గదయా గిరా

"తన పాదములకు నమస్కరించుచున్న బాలుని ప్రేమతో లేవనెత్తి సురుచి కౌగలించుకొని, గద్గద కంఠముతో "చిరంజీవివి కమ్ము" యని ఆశీర్వదించెను.

ధ్రువుని సౌకుమార్యమును గాంచి సురుచి కదలిపోయెను. ప్రేమ పర్వతాలను చలింపజేస్తుంది. మిత్రత్వము నెరిగిన వారిని సర్వులు ప్రేమింతురు.

యస్యప్రసన్నో భగవాన్ గుణైర్మైత్ర్యా ది భిర్హరిః
తస్మై నమన్తి భూతాని నిమ్నమాప ఇవ స్వయమ్

"మైత్రి మొదలగు భక్తి లక్షణములు గలవానికి భగవానుడు ప్రసన్నుడగును. నీరు పల్లమునకు ప్రవహించునట్లు, మైత్రి గలవాని యెదుట సర్వులు అవనత మస్తకులై నిలబడుదురు."

సురుచికి ధ్రువుడు నమస్కరించు చుండగ సునీతి హృదయము ద్రవించెను. నా బిడ్డడు మంచిపని చేసినాడు. నా ఆశీర్వాదములు ధ్రువునకు ఎప్పుడూ ఉంటాయి. తన నమ్రత ద్వారా సురుచి యొక్క ఆశీర్వాదములను గూడ ధ్రువుడు పొందగలిగెను యని సంతసించెను.

తనకు నమస్కరించిన ధ్రువుని కౌగలించుకొని హృదయ బాధను త్యజించెను. ధ్రువుడు, ఉత్తముడు పరస్పరము ఆలింగన మొనర్చుకొనిరి. అధికానందముతో ఊగిపోయిరి.

ఉత్తానపాదుడు ఏనుగు మీద అంబారీలో ఆసీను డయ్యెను. ధ్రువుని తన ప్రక్కన గూర్చొనుమని పిలిచెను. ఆరునెలల క్రితం తన యొడిలో గూర్చొనుటకు అనర్హుడని పరిత్యజించిన ధ్రువుని ఈ నాడు గజారోహణము చేయించు చున్నారు. ఇదియే భక్త విజయము. నిజభక్తి విజయము.

అంబారీ నెక్కుమని తండ్రి పిలిచెను. తన సోదరుడు ఉత్తముడు రానిదే తాను ఏనుగు నెక్కనని ధ్రువు డనెను. ధ్రువుని మాటలకు అందరు ఆశ్చర్యపడిరి. అమితానంద మొందిరి.

ఉత్తానపాదుడు ధ్రువునితోపాటు ఉత్తముని గూడా ఏనుగుపై గూర్చుండ బెట్టుకొనెను. ధ్రువుడు ఈ విధముగా ఆలోచింపసాగెను. "హే భగవాన్! ఈ వైభవమంతయు నీదియే. నీ చరణకమలములను ధ్యానించుట వలన దీనుడనైన నన్ను ఊరేగించు చున్నారు. తండ్రీ! ఈ వేడుకలన్నీ అనిత్యములు. నా హృదయములో నీ మీద యున్న భక్తిని చెదరకుండా కాపాడుము" యని ప్రార్థించెను.

ఉత్తానపాదుడు ఆలోచింపసాగెను. ఒకనాడు తీవ్రమైన విచారమును కొనసాగించెను. అయిదు సంవత్సరముల బాలుడైన ధ్రువుడు భగవంతుని దర్శించి తరించినాడు. తన జీవితము సగభాగము సాగిపోయింది. ఇంకను భగవంతుని యందు మనస్సు లగ్నమగుట లేదు యని దుఃఖించెను.

ధ్రువుడు యౌవనమును బొందెను. ధ్రువుని ప్రజలు, అమాత్యులు అందరును ప్రేమించు చుండిరి. సరియైన సమయ మాసన్నమైనదని భావించిన ఉత్తానపాదుడు ధ్రువునికి పట్టాభిషేకము చేసెను. తాను ఆత్మజ్ఞానమును బొందుటకై అరణ్యముల కేగెను.

ధ్రువుడు భ్రమి యను యామెను వివాహమాడెను. ఆమె వలన కల్పము, వత్సరము యను నిరువురు పుత్రులను గనెను.

ఉత్తమునికి వివాహము గాకుండెను. అతడు వేటాడుటకై గిరి శిఖర ప్రాంతమునకు వెళ్ళగా యక్షుడొకడు ఉత్తముని వధించెను. ఉత్తముని తల్లియగు సురుచి గూడ మరణించెను. సోదరుని మరణవార్త నాలకించిన ధ్రువుడు ఉద్విగ్నమనస్కుడై యక్షులపై దండెత్తెను. యక్షులపై దారుణ శర పరంపరలను గుప్పిస్తూ, ధృవుడు యుద్ధమొనర్చి అనేకమంది యక్షులను సంహారించెను.

ధ్రువుని పితామహుడగు మనువు ప్రత్యక్షమై, "కుమారా! తొందర పడకుము. నీ సోదరుని ఒక యక్షుడు సంహరించెను. క్రోధవశుడవైన నీవు ఎంతో మందిని వధించితివి. ఇది ఘోర పాపముగ పరిణమించును. ఇది భక్తుడవైన నీవు చేయదగిన కార్యము గాదు.

స త్వం హరే రను ధ్యాత స్తత్పుంసామపి సమ్మతః
కథం త్వ వద్యం కృతవానను శిక్షన్ సతాం వ్రతమ్

"ధ్రువా! నీవు నిత్యము శ్రీహరిని ధ్యానించు చున్నావు. హరిభక్తులు నిన్ను ప్రశంసించు చుందురు. నీవు సదా మహాత్ముల మార్గము నభ్యసించు చుందువు. ఇటువంటి నిందార్హమైన కార్యము నెందుల కాచరించు చుంటివి?

"వత్సా! మహాత్ముల యందు దితిక్షయు, సముల యందు మైత్రియు, హీనుల యందు కృపయు, సర్వప్రాణుల యందు సమత్వమును కలిగి ఎవరు జీవించు చుందురో వారియందు భగవానుడు ప్రసన్ను డగును.

"వత్సా! నీవు అద్వైత పరబ్రహ్మము నారాధింపుము. అద్వితీయుడైన పరమాత్మ నారాధించు వారు భేదరహితులై శత్రుమిత్రాదు లనెడి భేదములు తెలియనివారై యుందురు.

కుమారా! మోక్షకాములగు వారికి సాధన విషయమున క్రోధము మిక్కిలి ప్రతిబంధకమై నిలుచును. ఔషధము వ్యాధిని నిర్మూలించునట్లు శాస్త్రజ్ఞానము దానిని తొలగించును."

క॥ విను రోషహృదయు చేతను వనయము లోకము నశించు నౌషధములచే
ఘన రోగములు నశించిన యనువున నదిగాన రోష మణపు మహాత్మా!

అని పలికి మనువు అంతర్హితు డయ్యెను. ధ్రువుడు మనువు బోధను మనమున ధరించి యుద్ధమును విరమించెను.

ధ్రువుడు హింసాత్మకమగు యుద్ధము నుపసంహరించెనని వినగానే ధనపతి యగు కుబేరుడు అతని వద్దకు వచ్చెను. యక్షులు, కిన్నరులు గూడ అతని ననుసరించి వచ్చిరి. ధ్రువుడు వినయముతో వారికి నమస్కరించెను.

"ధ్రువుడా! నీవు భక్తాగ్రగణ్యుడవు. విష్ణుభక్తుడవు. నీ పితామహుని యాజ్ఞను పాలించి యుద్ధమును విరమించితివి. నేను చాలా సంతోషపడితిని. ఏదైనను వరమును

కోరుకొనుము" యని పలికెను. ధ్రువుడు కుబేరునకు నమస్కరించి ఇలా పలికెను. దుస్తరమగు సంసార సాగరమును దాటించు శ్రీహరి పాదపద్మముల యందు స్థిరమైన భక్తి కలిగి యుండునటుల ఆశీర్వదింపుమని ధ్రువుడు కోరెను. కుబేరుడు ఆశీర్వదించి వెడలెను.

క్రోధమును జయించిన వారిని, ధ్యాన తత్పరులను ధనపతి యగు కుబేరుడు ఆశీర్వదించును. వారిని సమీపించును. వరములను కోరుకొనుమని తెలుపును. ధనమును దర్శింపగనే మందమతులైన సాధకులు సాధనను విస్మరించి ఆ ధనవలయంలో చిక్కు కొందురు. శ్రేష్ఠులైన భక్తులు ధనమును పొందినను ధనవ్యామోహము లేకుండా యుందురు. ధ్రువుడు కుబేరునికి నమస్కరించెను. కానీ శ్రీహరి పాదపద్మముల యందలి భక్తినే వాంఛించును. ధన వ్యామోహము ధ్యానమున విఘ్నమును కలిగించును.

ధ్రువునికి ధ్రువస్థానము

ధ్రువుడు నగరమునకు వచ్చెను. ప్రజలను కన్నబిడ్డల వలె పాలించెను. సదా భగవద్భక్తి యందు నిరతుడై యుండెను. ప్రజలు గూడ ధ్రువుని పాలనయందు పూర్ణ విశ్వాసము నుంచిరి. ధ్రువుని తమ తండ్రి యని భావించిరి.

ధ్రువుడు కొంత కాలము రాజ్యమును పాలించిన తరువాత ఒకనాడు తనలో తాను ఆత్మ విమర్శనము గావించుకొనెను. తన దేహము, భార్య, కుమారులు, బంధువులు, మిత్రులు,సైన్యము, ఐశ్వర్యము సమస్తము అనిత్యమే ననియు, కాల గర్భమున కలిసి పోవునవియే యనియు భావించి, భగవత్సేవలో తన కాలమును పూర్తిగ వినియోగించు కొనవలెనని తలచెను. తన రాజ్యమును పుత్రున కప్పగించెను. భగవాను నారాధించుటకై బదరికాశ్రమమునకు వెడలెను.

బదరికాశ్రమ సమీపమున ప్రవహించు గంగలో స్నాన మాచరించి, ఇంద్రియములను నిగ్రహించి, శ్వాసను నిరోధించి, మనస్సును పూర్ణముగ పురాణపురుషుడైన శ్రీహరి యందు నిలిపెను. ఈ విధముగ కొన్ని రోజులు గడచెను. సదా ధ్రువుని హృదయము భక్తి ప్రవాహముతో తన్మయ మగుచుండగ ఆనందాశ్రువులు వర్షధారవలె స్రవించు చుండెను.

భక్తిం హరౌ భగవతి ప్రవహన్న జస్ర మానన్ద బాష్పకలయా ముహురర్ద్యమానః
విక్లద్య మాన హృదయః పులకా చితాంగో నాత్మాన మస్మరద సావితి ముక్తలింగః

సదా హరిభక్తి వృద్ధి చెందుచుండుటచే ధ్రువుని నేత్రముల నుండి ఆనందాశ్రువులు ప్రవహింప సాగెను. హృదయము ద్రవీభూత మయ్యెను. దేహము పులకించెను. దేహాభిమానము నశించెను. తుదకు దేహ విస్మృతి కలిగెను.

ఆకాశము నుండి దివ్య పురుషులు ఆసీనులై యున్న విమాన మొకటి క్రిందికి దిగెను. ఆ విమానము ధ్రువుని ముందు నిలిచెను. విమానములోని దివ్యపురుషులు విష్ణు పార్షదులని ధ్రువుడు గ్రహించెను. దోసిలి యొగ్గి వారికి నమస్కరించెను. వారిని గాంచగనే "**ఓం నమోభగవతే వాసుదేవాయ**" యనెడి నామము నుచ్చరించెను.

విష్ణు పార్షదులు భగవదాజ్ఞాబద్ధులై ధ్రువుని విష్ణులోకమునకు ఆహ్వానించిరి. ధ్రువుడు గంగానదిలో స్నానమొనరించెను. గంగాదేవికి నమస్కరించెను. మునులకు నమస్కరించెను. విష్ణుపార్షదులకు నమస్కరించెను. విమానమునకు ప్రదక్షిణ మొనర్చెను.

విమానములో ఎక్కబోవుచున్న ఆనంద సమయమున ధ్రువుని మనస్సు చలించెను. దుఃఖిత యగు తన తల్లి సునీతి జ్ఞాపకమునకు వచ్చెను. విష్ణు పార్షదులు ధ్రువుని మనోరథము నెరిగిన వారై తనకన్నను ముందుగనే విష్ణులోకమునకు విమానము నెక్కి వెడలుచున్న సునీతిని ధ్రువునకు జూపిరి.

మహాత్ముల మనస్సులో నిలువ గలిగిన పుణ్యాత్ములు తప్పక మాధవ నిలయమును చేరుకొందురు.

ఉత్తానపాదుని కుమారుడగు ధ్రువుడు విమానమును సమీపించెను. ఈ లోగా అచ్చటికి మృత్యువు వచ్చెను. ధ్రువుడు మృత్యువు శిరముపై పాదమునుంచి విమానము నధిరోహించి విష్ణులోకమును జేరెను.

తదోత్తానపదః పుత్రో దదర్శాన్తక మాగతమ్
మృత్యోర్మూర్ధ్ని పదం దత్త్వా ఆరురోహాద్భుతం గృహమ్

ధ్రువుని వైకుంఠయాత్రా సమయమున మృత్యువు సమీపించి, తలవంచి నమస్కరించెను. ధ్రువుడు మృత్యువు శిరముపై కాలు నుంచి విమానము నెక్కెను. నన్ను జయించిన వాని పాదమును శిరముపై ధరించితి నని మృత్యువు పొంగిపోయెను.

ధ్రువుడు వైకుంఠ లోకమునకు వెళ్ళెను. నేను పొందలేని స్థితిని నా శిష్యుడు పొందినాడని నారదుడు ఆనంద పరవశుడయ్యెను. గురుదేవుని స్పందింపజేయు శిష్యులే నిజమైన భక్తులు. అట్టివారే విష్ణుసాయుజ్యము నొందెదరు.

యఃక్షత్ర బంధుర్భువి తస్యాధి రూఢ మన్వా రురుక్షే దపి వర్షపూగైః
షట్పంచ వర్షో యదహోభి రల్పైః ప్రసాద్య వైకుంఠ మవాప తత్పదమ్

"అయిదారు వత్సరముల వయస్సులో ధ్రువుడు కొద్దిరోజుల తపస్సు చేత వైకుంఠుని ఆరాధించి తరించినాడు. ఈ ప్రపంచమున ఎవ్వరైనను బహుకాల తపస్సు చేత ఈ స్థితిని బొందగలరా?" యని నారదుడు పరవశించి పలికెను. గురువు చేత అట్టి యోగ్యతా పత్రమును బొందిన శిష్యు లెందరుంటారు? ధ్రువుడు ఆదర్శ శిష్యుడు.

గురువును సంతృప్తి పరచిన ఉత్తమ శిష్యుడు ధ్రువుడు. ఆయన ఆదర్శ శిష్యుడు. తల్లిదండ్రులను తృప్తి పరచిన ఆదర్శ పుత్రుడు. సోదరుని తృప్తి పరచిన ఆదర్శ సహోదరుడు. ప్రజలను తృప్తి పరచిన ఆదర్శ రాజు. మాధవుని తృప్తిపరచిన ఆదర్శ భక్తుడు.

ఆటలాడుకొనే సమయమున ధ్రువుడు ఆట బొమ్మలతో పాటు, తల్లి దండ్రులను త్యజించి శ్రీహరి ధ్యానమున నిలిచి యుండెను. బాల్యమున సాగిన భక్తియే పరమోత్కృష్టము.

ధ్రువుడు యమునా తీరమున సాధన నుపక్రమించి భగవత్కృపకు పాత్రుడయ్యెను. తుదకు గంగాతీరమున వైకుంఠప్రాప్తి నొందెను. సాధన యమునాతీరమునకు సంబంధించినది. సిద్ధి గంగాతీరమునకు సంబంధించినది. యమున భక్తిస్వరూపము. గంగ జ్ఞానస్వరూపము. భక్తిలో పండిన వారే జ్ఞానము నొంది తరించగలరు.

ధన్యం యశస్య మాయుష్యం పుణ్యం స్వస్త్యయనం మహత్
స్వర్గ్యం ధ్రౌవ్యం సౌమనస్యం ప్రశస్య మఘ మర్షణమ్

"ధ్రువుని చరిత్రము ధన్యము. యశోవర్ధకము. ఆయుర్వర్ధకము. పుణ్యప్రదము. పరమోత్కృష్టము. స్వర్గ ప్రదము. మంగళస్వరూపము. ధ్రువస్థాన ప్రాప్తము సౌమనస్య రూపము. ప్రశంసనీయము. పాపనాశము" యని మైత్రేయుడు విదురునితో పలికెను. ధ్రువుని చరిత్రను సమాప్తము చేయుచు ప్రచేతసుల యజ్ఞస్థలమున నారదుడు ధ్రువుని చరిత్రను కీర్తించినట్లు మైత్రేయుడు చెప్పెను. ఆ మాటల నాలకించిన విదురుడు ప్రచేతసులను గూర్చి చెప్పమనెను. ధ్రువుని వంశములోని వారిని ప్రచేతసు లందురని తెలిపి, ఆ విషయములను వివరింపసాగెను.

ధ్రువుని వంశ వర్ణనము - పృథు చక్రవర్తి

ధ్రువుని వంశమున అంగుడను రాజుండెను. సదాచార వంతుడైన అంగునికి దుష్టుడగు వేనుడు కుమారుడుగ జన్మించెను. వాని చెడువర్తనమును గాంచి కలత చెందిన అంగుడు నగరమును త్యజించి వెడలెను. అది గాంచి ప్రజలు మిక్కిలి దుఃఖించిరి.

యజ్ఞమును నిర్వహింపవలె నని ఋషులు భావించిరి. తానే విష్ణువని వేనుడు పలుకసాగెను. దేవతలను నిందింపసాగెను. దానిని భరించలేని మునులు వేనుని దగ్ధ మొనర్చిరి. విప్రులు వేనుని బాహువులను మథించుట వలన పృథుమహారాజు పుట్టెను.

పృథుచక్రవర్తి రాజయ్యెను. శ్రేష్ఠుడై ధర్మపాలన మొసగెను. పృథుచక్రవర్తి సరస్వతీ నదీతీరమున అశ్వమేధ యాగము నొనరించెను.

అశ్వము అనగా గుఱ్ఱము. **"పంచేంద్రియ హయా నాహుః"** పంచేంద్రియములే గుఱ్ఱములు యని కఠోపనిషత్తు నిర్వచించినది.

అశ్వమేధ యాగ సమయమున గుఱ్ఱమును వదలి పెట్టెదరు. దానిని ఎవ్వరైనను పట్టవచ్చును. ఎవ్వరూ పట్టలేనిచో విజయము ప్రాప్తించినది యని అర్థము.

ఇంద్రియములను విహరింప జేయుటయే అశ్వమును వదలుటలోని అంతర్భావము. ఆ యశ్వమును ఎవ్వరైనను బంధించినచో అది విషయవాసనలో చిక్కుకొని పోయినదని భావము. ఒకవేళ ఎవ్వరైనను అశ్వమును బంధించినచో వారితోపోరాడి జయింపవలెను. ఇంద్రియములను బంధించు వాసనను జయించుటయే అశ్వమేధ యాగములోని అంతరార్థము.

ఇంద్రుడు పృథుమహారాజు వదలిన అశ్వమును హరించి బాధించెను. పృథుమహారాజ కుమారుడు అశ్వమును తిరిగితెచ్చెను. ఇంద్రియములకు రాజైన వాసన యనెడి ఇంద్రుడు అశ్వము యనెడి ఇంద్రియ నిగ్రహమును హరించును. పృథు మహారాజు కుమారుడు అనగా జ్ఞానపుత్రుడు అశ్వమును రక్షించి తెచ్చును.

పృథుచక్రవర్తి నూరు అశ్వమేథ యాగములను చేసెను. యజ్ఞశాలలో శ్రీమన్నారాయణుడు పృథుమహారాజునకు దర్శనమొసగి వరముల నొసగెను.

సనకాదుల ఉపదేశము

ఒకనాడు సనక సనందనాది మహర్షులు పృథుమహారాజు వద్దకు వచ్చిరి. పృథు మహారాజు మహర్షులను సేవించెను. వారిని స్తుతించెను. పృథుమహారాజు అర్చనాభక్తి మారుపేరు. అందుచేత వారిని అర్చించుటలో ఎంతగానో సంతసించెను. పృథు మహారాజు భార్య పేరు అర్చి.

"మహాత్ములారా! నా జన్మ ధన్యమైనది. యోగులకు గూడ లభ్యముగాని మీ దర్శనము మాకు లభ్యమైనది. మీ దర్శనము దైవ దర్శనమే యగును. మీ సేవకు నోచుకున్న గృహస్థులు ధన్యులు. వారే భాగ్యవంతులు. మీలాంటి భాగవతోత్తముల పాదధూళి సోకని గృహములు సర్పములకు నివాసస్థానములగు వృక్షములవలె నిరర్థకములు. మృత్యుభయ ప్రదములు.

చ॥ వరమతులార! యెవ్వని నివాసము దీర్ఘపదాంతరంగులై
పరగినయట్టి భాగవత పాద జలంబులు సోకవేని త
త్పురుషుడు భూరి సంపదల బొంపిరి వోయిన నైన వాని మం
దిర మురగ ప్రకీర్ణ జగ తీజము బోలు నటంద్రు కోవిదుల్!

"మహాత్ములారా! మృత్యురూప సంసారమున నిమగ్నులై యున్న మాకు శుభము ఎలా కలుగును? దయచేసి తెలుపుడు" యని ప్రార్థించెను.

సనకాది మునులు చెప్పుచున్నారు. "రాజా! శ్రీహరి పాదపద్మ సేవనము, గుణాను కీర్తనము నీకు లభ్యమైనవి. విషయముల యందు ఆసక్తియున్న మానవునకు మోక్షము దుర్లభము. కనుక భగవానుని పాదపద్మము లనెడి నౌక నాశ్రయించుకొని వ్యసన సంకులమైన ఈ భవసాగరమును దాటి తరించుము" అనిరి.

సీ॥ వసుమతీ నాథ! ఎవ్వని పాదపద్మ పలాశ విలాస సల్లలిత భక్తి
సంస్మరణంబుచే సజ్జన ప్రకరంబు ఘనకర్మ సంచయ గ్రథిత మగు న
హంకార మను హృదయ గ్రంథి జెఱతురు వివరింప నిట్లు నిర్విషయ మతులు
మహి నిరుద్ధేంద్రియ మార్గులు నైనట్టి యతులకు జేరంగ నలవి గాని

తే॥ యట్టి పరమేశు గేశవు నాది పురుషు వాసుదేవుని భువన పావన చరిత్రు
నర్థి శరణంబుగా దత్పదాంబుజములు భక్తిసేవింపు గుణసాంద్ర! బార్థివేంద్ర!

ఈ విధముగా పృథుమహారాజుకు తెలిపి, ఆయనచే పూజింపబడి సనకాదులు ఆకాశ మార్గమున వెళ్ళిరి.

పృథుమహారాజు తన భార్యయగు అర్చివలన విజితాశ్వుడు, హర్యక్షుడు, ద్రవిణుడు, ధూమకేతుడు, వృకుడు అను నల్వురు పుత్రులను బొందెను. రాజ్యమును పుత్రుని చేతులలో యుంచి, పృథుమహారాజు భార్యా సమేతుడై వనముల కేగెను. ఆయన వెళ్ళగానే ప్రజలందరు దుఃఖించిరి. పృథుమహారాజు వనములలో కఠోరమైన తపమాచరించి తరించి పోయెను.

జీవితమునకు త్యాగమే భూషణము. మోక్షమే ఫలము. సమస్తముండినను పృథు మొదలైనవారు సమస్త భోగములను త్యాగమొనర్చి తపమాచరించి కృతకృత్యులైరి. పరమాత్మ కొరకు ప్రయత్నించని వారి జన్మ నిరర్థకమగును.

కం॥ పరికింపగ నే మనుజుడు హరిపదమును బొంద జేయునట్టి వివేక
స్ఫురణం దనర్చు వానికి బరువడి నిలబొందరాని పదముం గలదే

"విదురా! పరమ పవిత్రమగు పృథుమహారాజు చరిత్రను నీకు వివరించి చెప్పితిని. ఎవరయితే దీనిని నిత్యము శ్రవణము చేయుదురో, కీర్తింతురో వారు పృథు స్థానమును బొందెదరు" యని మైత్రేయుడు చెప్పెను.

పృథుమహారాజు మునిమనుమడగు ప్రాచీనబర్హి వలన ప్రచేతసులు జన్మించిరి. ప్రాచీనబర్హికి శతద్రుతి యను నామె వలన కలిగిన పదుగురు కుమారులే ప్రచేతసు లనబడిరి. నారాయణ సరోవరమున నారదుని ద్వారా ప్రభావితులైన ప్రచేతసులు శంకరుని సాక్షాత్కారమును బొందిరి. వారికి పరమశివుడు జ్ఞానము నుపదేశించెను.

శ్రేయసా మిహ సర్వేషాం జ్ఞానం నిశ్శ్రేయసం పరమ్
సుఖం తరతి దుష్పారం జ్ఞాన నౌర్వ్య సనార్ణవమ్

"ఈ లోకమున సర్వశ్రేయస్సుల కంటెను జ్ఞానమే పరమ శ్రేయస్సుయై యున్నది. ఎవరయితే జ్ఞానమును నౌక నాశ్రయింతురో అట్టివారు వాసనలతో నిండియున్న సంసార సాగరమును అనాయాసముగ దాటగలరు" యని చెప్పెను.

పురంజనోపాఖ్యానము

రుద్రుని ఉపదేశముచే ప్రభావితులైన ప్రచేతసులు తపస్సునందు నిమగ్నులైరి. వారి తండ్రి యగు ప్రాచీనబర్హి వద్దకు నారదు డరుదెంచెను. నారదుడు ప్రాచీనబర్హితో ఇలా చెప్పెను:

"రాజా! నీవు కర్మలయందు చిత్తమునుంచి చరించుచున్నావు. యజ్ఞాదుల నాచరించుచూ కర్మాసక్తుడవై యున్నావు. ఈ కర్మలు భోగానుభవమునకే గాని దుఃఖమును పోగొట్టలేవు. సుఖమును ప్రసాదించలేవు" యనిచెపుతూ పురంజనుని యొక్క ఇతిహాసమును ఉదాహరణముగా వివరించెను.

పురంజనుడు భోగాసక్తి గలవాడు. అతడు భోగముల ననుభవించుటకు ఒక పురమును వెదకసాగెను. అతనికి అవిజ్ఞాత మిత్రుడొకడు గలడు. ఆ మిత్రుడు పురంజనుని సంతోషపెట్టుటకు సదాప్రయత్నించు చుండును. పురంజనుడు తొమ్మిది ద్వారములుగల ఒక పురమున ప్రవేశించెను. ఆ పురములో ప్రవేశించగనే ఒక అందమైన స్త్రీతో అతనికి పరిచయ మేర్పడెను. ఆవిడెవరో తనకు తెలియదు. అయినను పురంజనుడు ఆమెను వివాహమాడెను. ఆమెవలన పదునొకండు వందల సంతానము కలిగెను. ఆమెకు పదిమంది భృత్యులుందురు. ఐదు తలలు గలవాడొకడు కూడా ఆ పదిమందితో కలసి యుండును.

పురంజనుడు ఆమెను ప్రాణసమానంగా భావించి ప్రేమించేవాడు. అతడు విచిత్రములైన భోగముల నన్నింటిని అనుభవించు చుండెను. ఆమె చెప్పినది చేయును. ఆమె చేసినది చేయును.

సీ॥ పాపంబు సేసిన దాను బాపము సేయు గుడిచిన దానును గుడుచు, మఱియు
భక్షింప దానును భక్షించు, నడచిన నడచును, నవ్విన నవ్వు, నేడ్వ
నేడుచు, బాడినబాడు, విన్నను విను, జూచిన జూచు, గూర్చున్న నుండు
దుఃఖింప దీనుడై దుఃఖించు, నిలచిన నిలుచు, నిద్రింపగ నిద్రవోవు

తే॥ ముట్టినను ముట్టు, మూర్కొన్న మూరుకొనును
బలుక బలుకును బవళింప బవ్వళించు
హర్షమును బొంద నాత్మను హర్ష మొందు
మోదమును బొంద దానును మోదమొందు

పురంజనుని యొక్క బలహీనతలను గ్రహించిన గంధర్వరాజగు చండవేగుడు పురంజను పురమును ముట్టడించెను. అచ్చటయున్న పంచశీర్ష పన్నగము వానిని ఎంతగానో విరోధింపసాగినది. దాని శక్తి గూడ క్షీణింపసాగినది.

కాలకన్యక పురంజనునిపై దండెత్తినది. పురంజనుడు చాలా బాధలకు గురి అయ్యెను. మమకారము ఆ సమయమున గూడ పురంజనునికి నశించలేదు.

భయనామ డనువాడు సమయమును కనిపెట్టి పురంజనుని బంధించి కాలకన్య కప్పగించినాడు. అయినను అతనికి ప్రియురాలిమీద వ్యామోహం చావలేదు. అవిజ్ఞాత మిత్రునిపై ప్రేమ ఉదయించలేదు. పురంజనునకు మరణ మాసన్న మగుచుండెను. అయినను అతడు తన ప్రియురాలినే చింతించుట చేత మరుజన్మలో అతడు విదర్భరాజ కుమార్తెగా జన్మించెను.

పురంజనుడు జీవాత్మ. అవిజ్ఞాత మిత్రుడు పరమాత్మ. విషయసుఖములకు నిలయమైన మానవశరీరమే పురము. దేహమునకుగల తొమ్మిది రంధ్రములే పురమునకుగల తొమ్మిది ద్వారములు. భోగబుద్ధియే అందమైన పురంజని. ఆమెతో పురంజనునకు వివాహమాయెను. ఆమెకు పదునొకండు వందల సంతానము. పదిమంది భృత్యులు. ఒకడు పంచశీర్ష పన్నగము. సంతానమనగా మనోవృత్తులు. దశేంద్రియములే పదిమంది భృత్యులు. ప్రాణమే పంచశీర్ష పన్నగము.

దేహము కాలకన్య హస్తగతమగును. జీవుడు కాలములో అనేకబాధల ననుభవించును. అయినను అవిజ్ఞాత మిత్రుడగు భగవానుని జీవుడు తలపడు. మృత్యు సమయమున గూడ వాసనయే ప్రతిబంధకమై యుండును. చనిపోవునపుడు ప్రియురాలిని చింతించుచు మరణించుటచేత తరువాత జన్మలో పురంజనుడు స్త్రీగా ఆవిర్భవించెను.

పురంజనుడు విదర్భ రాకుమారిగ జన్మించెను. ఆమెను మలయధ్వజుడనువాడు వివాహము చేసుకొనెను. వారికి ఒక కుమార్తె, ఏడుగురు కుమారులు కలిగిరి. కుమార్తెను అగస్త్యునికిచ్చి వివాహము చేసినారు.

మలయధ్వజుడు చనిపోయెను. భర్త కొరకు పరితపించుచు ప్రాణత్యాగం చేయుటకు సిద్ధముగా యున్న వైదర్భిని అవిజ్ఞాత మిత్రుడు కలిశాడు. ఆమె యొక్క పూర్వజన్మను గూర్చి వివరించాడు. గతజన్మలో భోగాసక్తిలో పురుషుడుగా యుండిన పురంజనుడే ఈ జన్మలో వైదర్భియై స్త్రీగా జన్మించుట జరిగినదని తెలిపెను. కానీ అవిజ్ఞాత మిత్రుని అనుసరణ మాత్రం నిత్యమని తెలిపెను. పరమాత్మను తెలియనంతవరకు జీవునకు ఇలా జన్మలు ప్రాప్తించుచునే యుండును. సంసారమును నిస్సారమని ఎఱిగి ఆత్మజ్ఞానమునకై ప్రయత్నింపవలెను.

మనో వికల్ప సంజాతం తద్వికల్ప పరిక్షయాత్
క్షీయతే దగ్ధ సంసారో నిస్సార ఇతి నిశ్చితః

"మనస్సు యొక్క వికారములచే జనించునదియు, ఆ వికారములు నశింపగనే నశించిపోవునదియునగు ఈ సంసారము నిస్సారమని తెలియవలెను" యని ఉపనిషత్తు ప్రబోధించినది.

నారదుడు ఈ విధముగా బోధించి ప్రాచీనబర్హి కడ నుండి సిద్ధలోకమునకు వెడలెను. నారదమహర్షి బోధచే ప్రభావితుడైన ప్రాచీనబర్హి కపిలాశ్రమమునకు వెళ్ళెను. అచ్చట తపమాచరించి పరమాత్మను పొందెను.

ప్రచేతసుల తపస్సు నారాయణునకు ఆనందము నొసగెను. వారిని గృహస్థులుగ జీవింపుమని శ్రీహరి తెలిపెను. వారు అలాగే చేసిరి. 'మారిష'యను కన్యను వివాహమాడిరి. మారిషకు దక్షుడు కలిగెను.

ప్రచేతసులకు దివ్యమైన జ్ఞానము కలిగినది. ఒకనాడు ప్రచేతసులకు నారదుని దర్శనమాయెను. నారదుని బోధవలన వారిలో సంశయమేఘాలు ఛేదింపబడినవి. నారదుడు ఇట్లు బోధించెను.

మానవునకు ప్రతి జన్మయందును అంతర్జన్మలుగ మూడుయుండును. జని జనకుల ద్వారా కలుగునది శుక్రజన్మ. ఉపనయనము ద్వారా కలుగునది పావిత్రజన్మ యజ్ఞముద్వారా లభించునది దైవజన్మ. కానీ శ్రీహరి పాదపద్మసేవ లభించనిచో ఈ మూడు జన్మల వలన గూడ లాభముండదు.

పరమోత్కృష్టమైనది ఆత్మయొక్కటియే. సర్వులకు ఆత్మ శ్రీమన్నారాయణుడే. వృక్షమూలమున జలమును పోసినచో చెట్టుయొక్క శాఖలకు, పత్రములకు, పుష్పములకు నీరు లభించును. అలాగే శ్రీకృష్ణుని సేవించుటద్వారా సర్వదేవతలను అర్చించిన ఫలము కలుగును.

మ॥ కమలాధీశ్వరు బూజసేయుట సమగ్రప్రీతి బ్రాణోపహా
రము సర్వేంద్రియ తృప్తి హేతువును, సర్వక్ష్మాజ మూలాభిషే
కము శాఖా భుజ పుష్టిదంబునగురేఖన్ సర్వ దేవార్చణ
క్రమమై యొప్పు ధరావరేణ్య సుతులారా! బుద్ధినూహించినన్

"నారదుని బోధల నాలకించిన ప్రచేతసులు ఆచరించి, అనుభవించినవారై, విష్ణులోకమున కేగిరి" యని మైత్రేయుడు విదురునకు చెప్పెను.

చతుర్థ స్కంధము సమాప్తము

.... ఓం ....





ఉపోద్ఘాతము

ఇది పంచమ స్కంధము.

పంచమ స్కంధము భగవానునికి నాభి వంటిది.

ఈ స్కంధము ఆశ్రమ ధర్మముల నన్నిటినీ ఉద్దీపింప జేయుచు ఆకర్షణీయమైన, ఆదర్శవంతమైన సందేశములతో నిండి యున్నది. ప్రియవ్రతుని చరిత్రము గృహస్థుల నావకు మార్గగామి యై యున్నది. శత్రువును కోటలో నిలచి ఎదుర్కొనుట ఉత్తమమైనట్లు గృహస్థాశ్రమ కోటలో నిలబడి కామ క్రోధాది శత్రువులను ఎదుర్కొని జయించుట ఉత్తమమని బ్రహ్మదేవుడు ప్రియవ్రతునకు తెలుపును.

వివాహము ద్వారా జన్మాంతర వాసనలు నశించును. కొంత కాలము సంసార సుఖముల ననుభవించి, ఆ తరువాత సన్యసించుట ఉత్తమమని తెలుపును. ప్రియవ్రతుని చరిత్రము గృహస్థాశ్రమ వైభవమును కీర్తించుచుండగ, జడభరతుని చరిత్రము అవధూత వైభవమును ఘనముగ స్తుతించినది. ఒకటి మార్గము కాగా రెండవది గమ్యమగు చున్నదని ఈ స్కంధము వివరించును.

వాసన ప్రమాదమైనది. ఏ ఒక్క వాసన దృఢముగ మనస్సునంటినను అది జన్మకు కారణమగును. లేడిని ప్రేమించి, చివరి క్షణాన లేడినే స్మరిస్తూ మరణించినందువ భరతుడు లేడి జన్మనెత్తెను. కనుక వాసనలను తయారుచేసే సంకల్పముల విషయములో సాధకులు జాగరూకులై యుండవలెనని పంచమ స్కంధము బోధించును. ఈ విధముగా ఆంతర్యములో నిక్షిప్తమైయున్న వాసనలను పూర్వచిత్తి అప్సర రూపమున చూపును. ముఖ్యంగా ఈ స్కంధమున వర్ణింపబడిన భవారణ్యము విషయవాసనాపరులకు కనువిప్పును కలిగించును. ఈ స్కంధము సర్వులకు ఉపకరించును.

చైతన్య భాగవతము

పంచమ స్కంధము

ప్రియవ్రతుని చరిత్ర

మనుజులు దుఃఖమును గర్హింతురు. కానీ దుఃఖ కారణములను ప్రేమింతురు. దుఃఖ బీజములను నాటి శోకఫలములు రాగూడదని తలంచుచుందురు. ఇదొక అయోమయ ధోరణి. మండుటెండలో నిలబడి చల్లదనమును అభిలషించుట అవివేకమే అవుతుంది.

సుఖాన్ని అందరూ వాంఛిస్తారు. కానీ సుఖ కారణములను దూరం చేసుకుంటారు. సుఖ బీజములను నాటకుండ ఆనంద ఫలముల నారగింపవలెనని శ్రమించు చుందురు. భ్రమించు చుందురు. ఇదొక అస్తవ్యస్త ధోరణి.

బంధాలు బయట లేవు. అందాలు బయటనుండి రావు. మనస్సులో అసత్యమైన ప్రపంచము శోభించునంత కాలము జీవులకు క్షోభ తప్పదు. పట్టుపరుపులపై పరుండినను రోగికి నిద్రపట్టదు. సుందరమైన ప్రకృతి వాస్తవానికి అంధునకు లేనిదియే. ఆంతర్యంలో బంధాలు పెంచుకొని బాహ్యంలో అందాల నన్వేషించేవానికి భవబంధాలు వీడవు. సంసార సంకెళ్ళు ఊడవు.

సంసారమును త్యజిస్తే పోతుంది గదా అని నీవు ఆలోచించవచ్చు. నిజమే. అలా చేసినచో సంసారము పోవచ్చు. కానీ సంసార బీజాలు లోపల సజీవంగానే ఉంటాయి. నీవు ఎక్కడికెళ్ళినా అవి నీతోనే ఉంటాయి. పెరిగి శాఖోపశాఖలతో వృక్షాలవుతాయి. ఆ నీడలోనే నీవు విశ్రమింపవలసి యుంటుంది.

సంసారమును వదలినంత మాత్రాన శాంతి లభించదు. అలాగని పెనవేసుకున్నంత మాత్రాన సుఖించేది యుండదు. సుఖదు:ఖాలు మనో కల్పితాలు. వాసనలు కర్మ ప్రేరకములు. వాసనలను క్షాళనం చేసుకుంటే నీవు ఎక్కడున్నావనేది సమస్యగాదు. వాసనలు మిగిలివుంటే నీవు ఎక్కడున్నప్పటికీ నీవే ఒక సమస్యగా మిగులుతావు. మనస్సును సంస్కరించుకోవాలి. సంస్కరింపబడిన మనస్సును స్థిరపరచుకోవాలి. తృప్తిగా జీవించాలి. ఈ సత్యాన్ని పంచమ స్కంధము విరివిగా చాటుతుంది.

మనుజుని విషయ వాసనా సుడిగుండములో నుండి ఉద్ధరించువాడు పరమాత్మ యొక్కడే. ఆ దివ్యాత్మునిపై పూర్ణ విశ్వాసమును కలిగియుండాలి. భగవంతుని అనుగ్రహముపై నమ్మకముండాలి. ఇంద్రియములను నమ్మకూడదు. ఆరిపోయే దీపాల వంటి విషయ సుఖాలలో రమించేందుకు ఉత్సాహపడకూడదు.

అనన్యభక్తితో భగవదాశ్రయమును బొందిన వారిని బాధించు శక్తి ప్రపంచమునకు లేదు. భక్తి విశిష్టమైనది. అది భయకారణములకు భయమును పుట్టించును. దు:ఖ కారణములకు దు:ఖమును కలిగించును. యోగక్షేమముల విచారమును దూరము చేయును. సర్వాశ్రయములు దూరమైనను సర్వేశ్వరుడు లభించినచో సమస్తము నీకు వశమే. విశ్వమే నీ వశమగును.

సాగరములో కల్లోల కెరటాలు లేచునట్లు, బ్రతుకులో ఆవేదనా అలలు లేస్తుంటాయి. అలల మధ్యనే సముద్రస్నానాన్ని ముగించుకొను లాగున, ఆవేదనల మధ్యనే బ్రతుకుకు పరమార్థం కల్పించుకోవాలి. ఈ విధమైన జీవన నడకను ఐదవ స్కంధము నేర్పుతుంది. ఈ పంచమ స్కంధము మధురమైన జీవన ఫలములను విరివిగా పంచుతుంది. బ్రతుకుకు ప్రశాంతతను ప్రసాదిస్తుంది.

"మహాత్మా! ప్రియవ్రతుడు పరమ భాగవతోత్తముడు. సదా ఆత్మయందే రమించు వాడు. అట్టి మహితాత్ముడు గృహస్థుడై ఎలా చరింపగలిగెను? రమింప గలిగెను? ముక్తిని గోరువారు కర్మబంధములను తగిలించు గృహఛిద్రముల యందు చరింపరు గదా! పుండరీకాక్షుని చరణముల నీడలో విశ్రమింపగోరు పుణ్యాత్ములు సంసారిక విషయముల యందు విస్పృహ నొందుచుందురు. సంసార స్పృహయున్న వారికి సారరూపుడగు భగవానుడెట్లు లభించును?" యని అభిమన్యుని కుమారుడైన పరీక్షిన్మహారాజు ప్రజ్ఞాఘన సుజ్ఞానుండగు శుకబ్రహ్మను ప్రశ్నించెనని నైమిశారణ్యమున సూతమహర్షి శౌనకాది మునులకు చెప్పుచున్నాడు:

"రాజా! హరిపాదపద్మముల మకరంద రసమున లగ్నమైన చిత్తముగల సత్పురుషులు సంసార విఘ్నముల కారణముగ హరిచింతనమును మానరు. ప్రియవ్రతుడు పుణ్యచరితుడు. నారదమహర్షి వలన తత్త్వ జ్ఞానమును బొంది నివృత్తి మార్గాభిలాషి అయ్యెను. ప్రియవ్రతుని సంసారమున ప్రవేశింపుమని ఆయన తండ్రియగు మనువు కోరెను. ప్రియవ్రతుడు అతనికి దండులకు అంగీకరించలేదు. సంసారము భక్తిని వంచించునని భావించెను.

బోధించుటకై పుణ్యఫల విశేషముగ సృష్టికర్తయగు చతుర్ముఖ బ్రహ్మయే దిగి వచ్చెను" యని శుకబ్రహ్మ బోధింపసాగెను.

నిర్జన ప్రదేశము, ప్రశాంత స్థలమునగు ఒక గుహలో నారదుడు ప్రియవ్రతునికి జ్ఞానబోధ చేయుచుండెను. తన పుత్రుని గొనిపోవుటకు మనువుగూడ అక్కడికి వచ్చి యుండెను. అదే సమయమున హంసారూఢుడై బ్రహ్మదేవుడు అచ్చటి కరుదెంచెను. ప్రియవ్రత మనువులతో గూడి నారదుడు బ్రహ్మదేవుని స్తుతించెను.

బ్రహ్మదేవుడు ప్రియవ్రతునితో ఇట్లనెను: "వత్సా! ప్రియవ్రతా! జీవుడు ఈశ్వరుని అధీనమున యుండువాడే గాని స్వతంత్రుడు గాడు. ముక్కుత్రాళ్ళ ద్వారా మనుజులు పశువులను వశము చేసికొనునట్లు గుణత్రయంబనెడి రజ్జువుచే పరమాత్మ జీవులను వశపరచుకొని యున్నాడు;" యని చెప్పసాగెను.

జీవుడు కర్మల నాచరించును. భగవానుడు ఫలముల ననుగ్రహించును. భగవానుడు ప్రసాదించు ఫలములను ప్రసాదముగ స్వీకరించి అంధుడు కళ్ళున్న వానిని అనుసరించు లాగున జీవులు పరమాత్మను అనుసరించుచుందురు. పరమాత్మ కర్మానుసారంగా ప్రసాదించు సుఖ దు:ఖములను అనుభవించు చుందురు.

ఆత్మవేత్తయగు పురుషుడు కర్మల యొక్క ఫలితముల ననుభవించు చుండినను వాటికి అంటకుండ యుండును. నిద్రనుండి మేల్కొనినవాడు స్వప్నములోని విషయములనెలా భావించునో ఆత్మజ్ఞాని సుఖదు:ఖములను అలా స్వీకరించును. జన్మకు కారణమయ్యే విషయముల యందు అతడు తగుల్కొనడు.

సర్వాన్కామా న్పరిత్యజ్య అద్వైతే పరమే స్థితిః

"ఆత్మవిదుడు సమస్తమైన కోరికలను వదలినవాడై ఉత్కృష్టమైన అద్వయ పరమాత్మయందు మనస్సును నిలిపి యుండును" యని పరమహంసోపనిషత్తు ప్రవచించినది.

ఆత్మజ్ఞానియైన వానికి దేహాంతరప్రాప్తి యుండదు గనుక అతడు సర్వమును త్యజించును. కానీ ఆత్మజ్ఞానము లేనివాడు, ఇంద్రియములను జయింపనివాడు కర్మలను త్యజింపకూడదు. ఒకవేళ త్యజించి అరణ్యములకు వెళ్ళినను సంసారము తయారయ్యే ప్రమాదము గలదు.

సంసార వాసనలు క్షాళనం గానిచో వనాల కెళ్ళి సాధించే దేమియును లేదు. సంసార వాసనలు క్షాళనమైనచో వనాలకు వెళ్ళవలసిన అవసరమేలేదు.

వాసనలు తీవ్రముగా యుండునపుడు సంసారమును వదలకుండా జీవనయాత్ర సాగిస్తుండాలి. సంసారములోనే యుండినచో వాసనలు వృద్ధియగునే గాని శూన్యముగావు. మరి జీవి ఎలా తరించాలి? వాసనలున్నవి గనుక సంసారములోనే యుండాలి. వాసనలను క్షాళన మొనర్చుకొనేందుకు మనస్సులో సన్యాసమును పొందాలి. ఇదియే కర్మయోగ రహస్యము. గృహస్థాశ్రమ ప్రాశస్త్యము.

భయంకరమైన శత్రువులను కలిగియున్నవాడు స్వేచ్ఛావిహారి గాకూడదు. ప్రతి మనుజునికి ఆరుగురు శత్రువులున్నారు. వారే మనస్సుతో గూడిన జ్ఞానేంద్రియములు. ఇవి చాలా భయంకరమైన శత్రువులు. ఏ క్షణాన్నైనా కీడు కల్పించవచ్చును.

శత్రువులను జయించినవాడు నగరమునందుగాని, వనమునందు గాని స్వేచ్ఛగా విహరింప వచ్చును. కోటలో దాగి సైనికుడు శత్రువులను జయించును. అలాగే ప్రతి మనుజుడు గృహస్థాశ్రమ మనెడి కోటలో నిలిచి ఇంద్రియ మనోబుద్ధులనెడి శత్రువులను జయింపవలెను. మనోబుద్ధులతో గూడి జ్ఞానేంద్రియములు నిగ్రహింపబడినచో అదియే పరమాత్మస్థితి యనబడును.

యదా పఞ్చావ తిష్ఠన్తే జ్ఞానాని మనసా సహ
బుద్ధిశ్చ న విచేష్టతి తమాహుః పరమాంగతిమ్

"ఏ స్థితిలో మనస్సుతో గూడి జ్ఞానేంద్రియములు స్థిరముగ నుండునో, బుద్ధి చలింపక యుండునో అట్టి స్థితి పరమోత్కృష్టమైనది" యని కఠోపనిషత్తు తెలిపినది.

సంసారములో యుండి వివేకము ద్వారా వాసనలను తగ్గించుకోవాలి. ఇంద్రియములను జయించినవాడు గృహములో హాయిగా జీవించగలుగును. ఇంద్రియలోలుడు అరణ్యములలో గూడా దుఃఖమునే అనుభవించును. కనుక గృహస్థాశ్రమముననే యుండి తరింపుమని బ్రహ్మదేవుడు ప్రియవ్రతునికి చెప్పెను. ప్రియవ్రతు డంగీకరించెను. సర్వులు నమస్కరించుచుండగ బ్రహ్మ అంతర్హితుడయ్యెను. తండ్రియైన మనువు యొక్క అభ్యర్థనపై ప్రవృత్తి మార్గము వైపునకు తిరగని ప్రియవ్రతుని బ్రహ్మదేవుడు ప్రవృత్తి మార్గము వైపునకు త్రిప్పెను. గృహస్థాశ్రమ ధర్మములను నిర్వహించిన తరువాత ప్రియవ్రతునికి నివృత్తి మార్గము ద్వారా నిర్వికల్పానందము లభించుగాక! యని బ్రహ్మదేవుడు మనస్సులో సంకల్పించెను. మహాత్ముల సంకల్పాలు ఎన్నడూ వృథాగావు.

మనువు ప్రియవ్రతునికి రాజ్యము నప్పగించి తాను సన్యసించెను. విషమంబులనెడి విషయంబుల నుండి విడిపడి కానలకేగెను. భగవదాజ్ఞను శిరసావహించి ప్రియవ్రతుడు రాజ్యభారమును వహించెను. విశ్వకర్మ పుత్రిక యైన బర్హిష్మతి యను నామెను వివాహ మాడెను. భూమండలమును చక్కగ పాలించుచుండెను.

మ॥ ధరణీవల్లభుఁ డా ప్రియవ్రతుడు మోదం బందుచున్ లీల నీ
శ్వరవాక్యంబున గర్మతంత్రపరుడై సంగంబులం బాపు శ్రీ
హరిపాదాంబుజచింతనం దగిలి నిత్యానందముం బొంది దు
ర్భర రాగాదుల బాఱదోలి ప్రజలం బాలించె నత్యున్నతిన్.

ప్రియవ్రతునకు పదుగురు పుత్రులు, ఊర్జస్వతి యను పుత్రిక కలిగెను. ఊర్జస్వతిని శుక్రాచార్యునకిచ్చి వివాహము చేసెను. ఊర్జస్వతి వలన శుక్రాచార్యునకు దేవయాని యను పుత్రిక కలిగెను.

కాలము గడచెను. ప్రియవ్రతునికి మఱల వైరాగ్య ముదయించెను. నివృత్తి మార్గము వైపు మనస్సు మఱలెను. ఒకనాడు పుత్రులను బిలిచి వారికి సమముగ రాజ్యమును పంచి ఇచ్చెను. భోగములను, రాజ్యమును, అర్ధాంగిని మృతదేహమువలె పరిత్యజించి నారదుని మార్గము ననుసరించెను.

సీ॥ అక్కట! యే నింద్రియములచే గట్టంగ బడి యుండి యందుల బాయలేక
యజ్ఞానవిరచితం బగు సర్వవిషయము లను నంధకూపంబులందు బడగి
తరుణులకే వినోద మృగంబ నైయుంటి యవి యెల్ల నే నొల్లననుచు రోసి
హరికృపచే నప్పు డబ్బిన యాత్మవి ద్యను గల్గి తన వెంట నరుగుదెంచు
తే॥ కొడుకులకు నెల్ల రాజ్యము గుదురుపఱచి
తనదు పత్నుల దిగనాడి ధనము నిడిచి
హరివిహారంబు చిత్తంబునందు నిలిపి
పరగ నల్లన నారదపదవి కరిగె.

ప్రియవ్రతుడు అరణ్యముల కేగెను. అతని కుమారుడగు ఆగ్నీధ్రుడు రాజయ్యెను. ధర్మ పరిపాలనమును గావించి జంబూద్వీప వాసులను కన్నబిడ్డలవలె పాలించెను.

ఒకనాడు పితృలోకమును పొందించు పుత్రులను పొందవలె ననెడి కోరిక ఆగ్నీధ్రునికి కలిగెను. మందర పర్వతమున కేగి అచ్చట ఆగ్నీధ్రుడు బ్రహ్మదేవుని వేడుచూ తపస్సు చేయనారంభించెను. ఆగ్నీధ్రుని తపస్సును గాంచి కమల సంభవుండు తాను యరుదెంచక ఒక అప్సరస్త్రీని పంపెను. ఆమె పేరు పూర్వచిత్తి.

ఆగ్నీధ్రుని చరిత్ర

ఆగ్నీధ్రుడు తపస్సు నారంభించెను. బ్రహ్మ సభలో గాయని యగు "పూర్వచిత్తి" యను అప్సర అచ్చటికి వచ్చెను. ధ్యానమగ్నుడై యున్న ఆగ్నీధ్రుడు కొద్దిగ కళ్ళు తెరచి చూసెను. చిత్తము చలించెను. మనస్సులో మన్మథుడు విహరింప సాగెను.

క॥ సతి! నీ వెవ్వతె వీ ప ర్వతమున కేమేని గోరివచ్చిన వన దే
వతవో శారదవో రతి పతి పంచిన మాయవో తపస్సారమవో.

యని పలికెను. ఆగ్నీధ్రుడు పూర్వచిత్తిని వాంఛించెను. పూర్వచిత్తి ఆగ్నీధ్రుని కామించెను. ధ్యానము స్థానే దాంపత్య జీవితము ప్రారంభమైనది. పూర్వచిత్తివలన ఆగ్నీధ్రునికి తొమ్మండుగురు కుమారులు కలిగిరి.

చిత్తములో నిలిచియున్న పూర్వవాసనలే పూర్వచిత్తి యనబడినవి. తపస్సు నారంభించిన ఆగ్నీధ్రుని పూర్వచిత్తి కలవరపరచింది. తపస్సును భగ్నం చేసింది. మనము గూడ ధ్యానము చేయుట కుపక్రమించగనే పూర్వము గాంచిన రూపములు, పూర్వము

వినిన శబ్దములు, పూర్వము అనుభవించిన విషయములు చిత్తములో మెదులును. అప్పుడు ధ్యానమును భగ్నమొనర్చుటకు పూర్వచిత్తి వచ్చిందని భావించవచ్చును.

పూర్వ వాసనలు ప్రగతి నిరోధకములు. ప్రబల శత్రువులు. వీటిని నిస్సార మొనర్చవలెనేగాని ఎరువు వేసి పెంచకూడదు. స్మృతిలో మెదిలిన గత వాసనలు నూతన పాపములకు నాంది పలుకును. వస్తువులు, విషయాలు బయట యుండును. మనస్సు వాటికి మనోహరత్వమును లోపలనుండి కల్పించును. అవివేకమనెడి తెరనుదించి వాస్తవమును మరుగు పరచును.

పూర్వచిత్తి గతములో పరవశింప జేసిన విషయములను ధ్యానసమయమున నీకు చూపెట్టును. అట్టి సమయమున నీవు అంధుడవై పొమ్ము. గతములో ఈ విషయములను గాంచినాను. అనుభవించినాను. అయినను నా వ్యామోహము తీరలేదు. సంతృప్తి కలుగ లేదు. అసంతృప్తిని, నిరాశను పంచే విషయాలను నే నెందులకు దర్శించాలి. నేను నా శ్యామసుందరుని దర్శిస్తాను. మల్లికార్జునుని ధ్యానిస్తాను అని చెప్పాలి. అలా చేసినచో పూర్వచిత్తి నీరసపడుతుంది. ధ్యానము నిరాటంకముగా సాగుతుంది.

చిత్తమును గతంలో ధ్వంస మొనర్చిన గుహ్య భాషణములు భగవత్సేవలో యుండునపుడు అప్రయత్నముగ వినిపించును. వెంటనే బధిరుడవు గమ్ము. నేను ఈ పూర్వచిత్తి పలుకులను ఆలకించను. ఆస్వాదించను. అచ్యుతుని నామ సంకీర్తనలో లభించిన ఆనందము ఈ శబ్దాలలో యున్నదా? యని నిలదీసి ప్రశ్నింపుము. పూర్వచిత్తి అదృశ్యమగును.

మనస్సును మూగగా మార్చవలె నని నీవు ప్రయత్నిస్తుంటే, నీ నుండి పలుకులను కదలించేందుకు పూర్వచిత్తి యత్నించును. అనివార్యమైనచో అనుసరింపుము. మాటలను కదలింపుము. కానీ అవి మాధవుని గూర్చిన పలుకులై యుండాలి. బిగ్గరగా సంకీర్తనము చేయుము. చెట్టునుండి పక్షులు ఎగిరి వెళ్ళునట్లు మనస్సు నుండి పూర్వచిత్తి పరారగును.

అనుభవించవలె ననెడి కోరికను రగిల్చేదియే పూర్వచిత్తి. కనుక సాధకుడు దీని విషయంలో జాగరూకుడై యుండవలెను. భోగేచ్ఛ బంధమును కల్గించును. దానిని త్యజించినచో మోక్షము లభించును.

భోగేచ్ఛా మాత్రకో బన్ధ స్తత్త్యాగో మోక్ష ఉచ్యతే

"భోగేచ్ఛయే బంధము. దానిని త్యజించుటయే మోక్షము" యని మహోపనిషత్తు ప్రవచించినది.

పూర్వచిత్తి తొమ్మండుగురు పుత్రులను గనెను. ఆగ్నీధ్రుని వదలిపెట్టి పూర్వచిత్తి బ్రహ్మలోకమున కేగెను. ఆగ్నీధ్రుడు తొమ్మండుగురు పుత్రులకు రాజ్యమును విభజించి ఇచ్చెను. పూర్వచిత్తిని వదలి జీవించలేక పోయెను. విషయభోగముల యందు అతనికి తృప్తి లభించలేదు.

విషయ సుఖాలలో మనిషి తృప్తి చెందలేడు. పరిమితమైన విషయాలు అపరిమితమైన ఆనందము నివ్వలేవు. భోగముల ననుభవించుట ద్వారా భోగములు నశింపవు. పైగా భోగములు వృద్ధి చెందును. పూర్వ సంస్కారములు మనస్సులో సంకల్పముల నుదయింప చేయును. వాటిని గూర్చి ఆలోచించకుండా ప్రతిపక్ష భావనతో మెలగినచో సంస్కారములు నశించును. అలాగాక సంస్కార జనిత ఊహలను గూర్చి ఆలోచించినచో తత్ఫలితముగ కర్మలు రూపు దిద్దుకొనును. నూతన సంస్కారములు ఏర్పడును. విషయాలు దూర మగును గాని విషయ చింతనము తోడుగా నిలచి బాధించు చుండును.

పూర్వచిత్తి వెడలిపోయినది. కానీ పూర్వ వాసనను విడచి వెళ్ళినది. ఆగ్నీధ్రుని మనస్సు శాంతించడము లేదు. అప్సరసను గూర్చియే ఆలోచించసాగినది. ఆమె జ్ఞాపకాల సరాలే మనస్సులో వ్రేలాడసాగినవి. అనుక్షణము అప్సరసను గూర్చియే చింతించుచుండిన ఆగ్నీధ్రుడు గతించి అప్సరస లోకమునే చేరెను.

మన గమ్యమును మనమే నిర్ణయించుకొందుము. మనస్సులోని సంకల్పాలే బ్రతుకుకు మార్గమును చూపించును. గమ్యమును నిర్ణయించును. సదాలోచన సన్మార్గమును చూపెట్టును. సన్మార్గము సద్గతిని ప్రసాదించును. దురాలోచన వలన వ్యక్తి దుర్మార్గుడగును. దుర్గతిని బొందును.

అనిత్యమైన విషయములను చింతించుట మానేయాలి. నిత్యమైన దానినే స్మరించాలి. అనిత్యమైన దేహమునందు ఆత్మభావము నుంచరాదు. బుద్ధికి సాక్షియైన సచ్చిదానంద రూపమగు ఆత్మనే ధ్యానించాలి.

సత్యానంద స్వరూపం ధీ సాక్షిణం జ్ఞాన విగ్రహమ్
చింతయాత్మతయా నిత్యం త్యక్త్వా దేహాదికాం ధియమ్

"అనిత్యమైన దేహమునందు ఆత్మబుద్ధిని త్యజించి, సదా నీవు సత్య రూపుడవనియు, జ్ఞాన రూపుడవనియు, బుద్ధికి సాక్షివనియు సదా చింతించుచుండుము" యని స్కాంద పురాణము తెలిపినది.

ఆగ్నీధ్రుడు అప్సరసలోకమున కేగెను. ఆగ్నీధ్రుని పుత్రులగు నాభి మొదలైన తొమ్మండుగురు మేరువు యొక్క తొమ్మండుగురు కన్యలను వివాహము చేసికొనిరి.

ఋషభదేవుడు

ఆగ్నీధ్రుడు పరలోకమును జేరెను. ఆగ్నీధ్రుని కుమారుడగు నాభి లోకకల్యాణము నావిష్కరించు పుత్రుడు కావలెనని సంకల్పము చేసి యజ్ఞమును నిర్వహించెను. కల్యాణ ప్రదము లగు కర్మలన్నిటికీ యజ్ఞము నాభి వంటిది. కనుక నాభి యజ్ఞము చేయకుండా ఉండలేడు.

వేదిమాహుః పరమం తం పృథివ్యాః యజ్ఞమాహు ర్భువనస్య నాభిం

యజ్ఞమనేది సమస్తలోకాలకు నాభివంటిది అనగా నడిబొడ్డువంటి దనియు, అట్టి పవిత్ర యజ్ఞవేదిక భారతదేశమే ననియు వేదమాత ఘోషించినది.

నాభి తన భార్యయగు మేరుదేవితో గూడి యజ్ఞము నాచరించెను. తత్ఫలితముగ భగవానుడే వారికి పుత్రుడుగ జన్మించెను. అతడే ఋషభదేవుడు.

లోకకళ్యాణార్థం చేయు కర్మలన్నియు యజ్ఞములే. అట్టియజ్ఞముల నాచరించు పుణ్యాత్ములకు జ్ఞానపుత్రు డుదయించును. అజ్ఞానము నంతరింప చేయును.

ఋషభుడనగా సర్వ శ్రేష్ఠమయు డని భావము. "పురుషర్షభః, దేవర్షభః" అనెడి పదములు సామాన్య వాడుకభాషలో యున్నవి. సర్వశ్రేష్ఠుడైనవాడు భగవానుడే. ఋషభుడు మానవాళి నుద్ధరించుట కరుదెంచిన భగవదవతారము. జ్ఞానావతారము.

తస్య హ వా ఇత్థం వర్ష్మణా వరీయసా బృహత్ శ్లోకేన చౌజసా బలేన శ్రియా య జసా వీర్య శౌర్యాభ్యాం చ పితా ఋషభః ఇతీదం నామ చకార

నాభి నందనుడు ధవళ కాంతితో శోభించు చుండెను. మహిత బల పరాక్రమ వీర్యాదులను జూచి ఆ బాలునకు ఋషభుడని పేరిడినట్లు భాగవతము చెప్పుచున్నది.

ప్రజల భావములకు అత్యున్నతమైన విలువ నిచ్చు నాభిరాజు తన కుమారుడైన ఋషభునిపై ప్రజలకు అమితానురాగ మున్నదని గ్రహించి సంతృప్తి చెందెను. ఋషభునికి రాజ్యము నప్పగించి తాను భార్యాసమేతుడై బదరికాశ్రమమునకు వెళ్ళెను. శ్రద్ధాభక్తులతో ధ్యానాదుల నాచరించి తరించిపోయెను.

ఋషభుడు ఇంద్రప్రదత్త యగు "జయంతి"ని వివాహమాడెను. ఆయనకు పుత్రు లుదయించిరి. ఋషభుని పుత్రులలో భరతుడు శ్రేష్ఠుడు.

యేషాం ఖలు మహాయోగీ భరతో జ్యేష్ఠః
శ్రేష్ఠగుణ ఆసీద్యేనేదం వర్షం భారతమితి వ్యపదిశన్తి

"ఋషభుని కుమారులలో జ్యేష్ఠుడైన భరతుడు శ్రేష్ఠుడు. గుణసంపన్నుడు. ఆయన పేరు ననుసరించి ఈ వర్షమును భరత వర్షమని జనులు పిలుచుచున్నారు."

ఋషభుడు భగవానుని ఆవేశావతారము. ఆయన సమస్త కళ్యాణగుణ సంపన్నుడు. సర్వత్ర సమదర్శనము జేయుచుండెను. పరుల దుఃఖమును గాంచి దుఃఖించుచుండెడి వాడు. గృహస్థాశ్రమమున జీవులెలా మెలగవలెనో ఆచరించి చూపెను. ఋషభదేవుని పరిపాలనలో ప్రజలు ఎవరును ఏ ఒక్కరిని ఏ సమయము నందును ఏదియును ఆశించ లేదని భాగవతము చెప్పుచున్నది. ప్రజల అవసరాలన్నీ ప్రభువే తీర్చుచుండెను.

ఋషభుడు తన కుమారులకు తత్త్వోపదేశము చేసెను. ఆ తరువాత వారికి రాజ్యములను ప్రసాదించెను. తత్త్వచింతనము లేని రాజు ప్రజల దురదృష్టమునకు ప్రతిరూపమని ఋషభుని అభిప్రాయము. ఋషభుడు పుత్రులకు ఇలా బోధించెను.

మానవ దేహము ప్రశస్తమైనది. విశిష్టమైన మానవ జన్మను బొంది దుఃఖానుభవము నిచ్చు కార్యములను చేయరాదు. భోగేచ్ఛ, భోగానుభవములు మానవజన్మకు లక్ష్యములు

గానేరవు. ఎందువలన అనగా అవి పశుపక్ష్యాదులకు గూడ కలవు. తపోధ్యానాదుల ద్వారా మానవుడు శుద్ధిపడాలి. ఇదియే మానవునకు ఏకైకధర్మము.

భోగముల ననుభవించు మానవుడు రోగనిలయమగు దేహమును బొందును. కర్మల యందలి ఆసక్తి కర్మాచరణకు నాంది పలుకును. కర్మలు జన్మలకు కారణములై దేహములను ప్రసాదించును. దేహిని బాధలకు గురిచేయును. కనుక కర్మలు అనుసరణీయములు గావు. జ్ఞానమే అనుసరింపదగినది.

కం యోజయన్ మనుజోఽర్థం లభేత నిపాత యన్నష్ట దృశం హి గర్తే

అంధుడు దారి తెలియని కారణమున గోతివైపు వెడలుచుండును. అట్టి వానిని "అలాగే వెళ్ళు" మని చెప్పుట యధర్మమే కాగలదు. అలాగే కర్మలయందు చరించు అజ్ఞానిని కర్మాచరణము నందే యుంచినచో అతనికి అపకారము చేసినట్లే యగుచున్నది.

కుమారులారా! అవిద్యను మనుజుడు అంతమొందించాలి. దానికి జ్ఞానమొక్కటియే మార్గము. సూర్యోదయము అంధకారము నదృశ్యము చేయులాగున జ్ఞానోదయము అజ్ఞానాంధకారమును అంతమొందించును.

భగవంతుని యందు సదా ఏకాంత భక్తులై మెలగవలెను. కామ్యకర్మలను త్యజింపవలెను. భగవత్కథలను ఆసక్తితో శ్రవణము చేయవలెను. కామక్రోధాలను దూరము చేసికొని, సదా భగవానుని గుణానుకీర్తనమునందు రమించవలెను. ఇంద్రియ మనోబుద్ధులను నిగ్రహింపవలెను. ద్వంద్వములను సహింపవలెను. సత్సంగమును బొంది తృప్తి చెందవలెను. దేహము అనిత్యమనెడి దృఢభావమును కలిగి యుండవలెను. భక్తి మార్గమునకు అడ్డువచ్చు వారెవరైనను త్యజింప దగినవారే. నా వలెనే మీరు గూడా ధర్మరతులై మెలగుడు. అధర్మము ననుసరింపకుడు.

పృష్ఠే కృతో మే యదధర్మ ఆరాదతో హి మా మృషభం ప్రాహురార్యాః

"నాయనలారా! నేను అధర్మమును ఏ నాడు దగ్గరికి రానివ్వలేదు. అందుచేత ఆర్యులు నన్ను ఋషభుడనిరి;" అని ఋషభదేవుడు కుమారులకు చెప్పెను.

ఋషభదేవుడు తన పుత్రులలో జ్యేష్ఠుడు, శ్రేష్ఠుడునైన భరతుని రాజ్యమునం దభిషిక్తుని గావించెను. ఋషభదేవుడు అవధూత అయ్యెను. వస్త్రాదులను విసర్జించెను. ఆభరణములను త్యజించెను. ఉపాధి వినిర్ముక్తమైన జ్ఞానముతో నగరమును విడచి ఒంటరిగ పక్షివలె వెడలిపోయెను. సమస్తమును త్యజించి జ్ఞానియొక్క అద్భుతస్థితిని ప్రదర్శించి చూపెను.

ఋషభదేవుడు అవధూతయై చరించెను. జడునివలె పడియుండెడివాడు. చూచు వారిని చూడనివాడై అంధుడనిపించుకొనెను. పిలిచిన వారితో పలుకనివాడై మూగవాడయ్యెను. విననివాడై చెవిటివాడయ్యెను. పిచ్చివానివలె సంచరించు చుండెను.

దేశ సంచారియై తిరుగుచుండిన ఋషభదేవుని దుష్టమానవులు అనేక విధముల హింసించిరి. అడవి యేనుగును దోమలు బాధించునట్లు ఆయన చుట్టూమూగి కష్టపెట్టు చుండిరి. కొన్నిచోట్ల జనులు ఋషభుని కొట్టెడివారు. దేహముపై మూత్రమును విడిచెడి వారు. ఉమ్మి వేసెడివారు. రాళ్ళు విసిరెడివారు. మట్టిని చల్లెడివారు. తిట్టెడివారు. ఇన్ని విధముల బాధించు చుండినను ఋషభదేవుడు బాధ నెరుగడు. నిర్మలచిత్తుడై చరించు చుండెను.

పూర్ణజ్ఞాన స్థితిలో నిలచిన ఋషభుడు ఇక కదలలేక పోయెను. సదా ఆత్మానందము ననుభవించుచు పడియుండెను. అజగర వ్రతము నవలంబించెను. లభించినదానిని ఆరగించును. వంటబట్టని దానిని విసర్జించును. ఆహార పానీయములు, మలమూత్రాదులు ఒక్కచోటనే జరుగుచుండెను. ఆ దివ్యాత్ముని నుండి బహిర్గతమయ్యే మలము నందు ఏ విధమైన దుర్గంధము లేకుండెను. పైగా సుగంధమును వెదజల్లి నట్లుండెను.

ఋషభుడు అవధూత స్థితిని సుస్పష్టముగ ఆచరించి చూపెను. వాస్తవానికి ఆయన మోక్షాతీతుడు. బంధ ముక్తుల కతీతుడు. ఆయన ఏ విధమైన సిద్ధులను ప్రదర్శించలేదు. వరించిన సిద్ధుల నన్నిటిని ఆ దివ్యాత్ముడు నివారించెను.

"పరీక్షిన్మహారాజా! బోయవాడు పక్షులను బంధించును. కానీ వాటిని విశ్వసింపడు. వదలినచో ఎగిరి వెళ్ళునని జాగరూకుడై యుండును. అలాగే మహాత్ములు ఇంద్రియ మనస్సులను స్వాధీన పరచుకొనినను వాటిని విశ్వసింపరు. ఈ కారణముగా ఋషభుడు సిద్ధులను నిరాకరించి మనస్సుకు బుద్ధి చెప్పెను.

ఋషభదేవుడు కర్ణాటక దేశమునకు వచ్చెను. అచ్చట ఒక వెదురు వనములో విహరించు చుండెను. వెదురు చెట్లు పరస్పరము రాచుకొనుట వలన అగ్ని జనించెను. అలా జనించిన దావానలము వనము నంతటిని దగ్ధము చేయుచుండెను. ఋషభదేవుడు వనమును వదలి పారిపోలేదు. వాటేసుకొనిన బిడ్డను లాలించినట్లు దరిచేరిన అగ్నిదేవునిపై దయావృష్టిని కురిపించెను. వెదురుచెట్లతో పాటు ఋషభదేవుని దేహము దగ్ధమై పోయెను. ఆ సమయమున గూడ ఆ మహాత్ముని మొగముపై నున్న చిరునవ్వు చెదర లేదు. ఋషభదేవుని ఈ దివ్యమార్గము అన్యులు అనుసరించదగినది గాదు.

కోన్వస్య కాష్ఠా మపరోఽను గచ్ఛే న్మనోరథేనా ప్య భవస్య యోగీ
యో యోగమాయాః స్పృహ యత్యుదస్తా హ్యసత్తయా యేన కృతప్రయత్నాః

"దివ్యాత్ముడగు ఈ ఋషభదేవుని మార్గమును మనస్సు ద్వారా ఏ యోగి యైనను అనుసరింప గలడా? ఏ సిద్ధులను హేయములని ఋషభుడు పరిత్యజించెనో వానిని బొందుటకై యోగులు యత్నించుచుందురు" అని శుకుడు పలికెను. అట్టి ఋషభునికి నేను నమస్కరించు చున్నానని తెలిపి ఋషభదేవుని చరితమును ముగించెను.

భద్రుడైన భరతుడు

ఋషభుని కుమారుడగు భరతుడు రాజయ్యెను. విశ్వరూపుని కుమార్తెయగు పంచజనిని పరిణయమాడెను. ఐదుగురు కుమారులను గనెను. ప్రజలను భరతుడు పరమవాత్సల్యముతో పాలించెను. అందుచేత ఈ దేశమునకు భారతదేశ మనెడి పేరు కలిగెను.

అజనాభం నామైత ద్వర్షం భారత మితి యత ఆరభ్య వ్యపదిశన్తి

"పూర్వము ఈ దేశమును "అజనాభ" మని పిలిచెడివారు. భరతుడు రాజైన తరువాత "భారతదేశ" మని బుధజనులు పిలిచిరి."

భరతుడు అనేక యజ్ఞములను చేసెను. యజ్ఞఫలము నంతటిని శ్రీకృష్ణునకే అర్పించెను. ఈ విధమైన నిష్కామకర్మ ద్వారా భరతుని మనస్సు నిర్మలమయ్యెను. దృఢభక్తి హృదయము నావరించెను. పరాభక్తి అంతర్యమున చోటు చేసుకొనెను. భగవన్నామము నుచ్చరింపగనే దేహము గగుర్పాటు చెందుచుండెను. కంఠము గద్గద మగుచుండెను. సదా మనస్సు ముకుంద పాదారవిందముల యందే లగ్నమై యుండెను. ఈ విధమైన పరాభక్తి వలన ఆయన హృదయము ఆనంద సరోవర మయ్యెను. భరతుని మనస్సు ఆ సాగరమున మునక లేయుచు సంతృప్తి చెందుచుండెను. ఈ కారణముచే బహిర్ముఖము గాలేక కర్మముల నాచరించుటకు వెనుకాడుచుండెను.

భరతుడు జింక చర్మమునే వస్త్రముగా ధరించి యుండెను. వాని కేశములు జడలు గట్టి యుండెను. సదా భగవత్సేవారతుడై యుండెను. నిజభక్త జన హృదయారవింద నివాసుడైన వాసుదేవుని యందు చిత్తమును స్థిరపరచుకొనెను. కృష్ణగత చిత్తుడైన భరతుడు ప్రాపంచిక కర్మము లాచరింపలేనివాడై రాజ్యమును సుతులకొసగి, సర్వమును త్యజించి పులహాశ్రమమును జేరెను.

రమ్యమైన ఆ యాశ్రమ ప్రదేశమున ఇందిరావిభుని హృదయమందిరమున ప్రతిష్ఠించుకొని అనుక్షణము అర్చించుకొనుచు ఆనందించుచుండెను. గండకీనదీ తీరమున గండములు తెలియని నిండు జీవితమును పండించుకొను చుండెను. సదా భగవానుని సేవించుచు తనివి తీరకయుండెను.

సీ॥ ఏ యాశ్రమంబున నిందిరాధీశ్వరు డచ్చటివారల నాదరించి
ప్రత్యక్షమున నుండు బాయక యెప్పుడు నట్టి రమ్యం బైన యాశ్రమమున
నిలిచి సాలగ్రామములు గల గండకీ నది యెందు నెంతయు గదిసి యుండు
నచ్చోట నేకాకి యగుచును భరతుండు బహువిధనవ పుష్పపల్లవముల

తే॥ నతులతులసదళంబుల నంబువులను గంధమూలాదిఫలముల గంజములను
ఘనత నర్పించి నిచ్చలు దనివిలేక సేవసేయుచు నుండె నా శ్రీశు హరిని.

భరతుడు రాజ్యమును త్యజించెను. భార్యాపుత్రులను జయించెను. పులహాశ్రమమును చేరెను. భోగముల ననుభవింపవలసిన వయస్సులో విరాగియై త్యాగమును వరించెను. త్యాగియై చరించెను. సరియైన వయస్సులో భరతుడు జ్ఞానసిరిని వరించెను.

ఉద్యోగ విరమణ తరువాత విరక్తిని పెంచుకొనవలె ననియు, అంతవరకు విషయసుఖాలలో రమించుటయే ఉద్యోగమనియు భావించు చుందురు. ఇదొక అయోమయ ధోరణి. దేహము కృశించినంత మాత్రాన మనస్సు నశిస్తుందని భావించడము శుద్ధ అవివేకము. జీవిత మంతయు ప్రతికూలంగా వర్తించిన మనస్సు వృద్ధాప్యంలో అనుకూలంగా వర్తిస్తుందని భావించడము అజ్ఞానమే అవుతుంది.

ఉద్యోగ విరమణ తరువాత భక్తిని చేయవచ్చునని భావించే ప్రబుద్ధుడు, ఈ లోగానే ప్రపంచంనుండి శాశ్వతంగా నిష్క్రమిస్తే ఎలా? అని ఎందుల కాలోచించడు. సత్యమెరుగని మనస్సునకు సద్భావాలు కలుగవు.

మమత్వము మరణ సదృశము. ఈ ప్రపంచంలో మనము తయారు చేసికొన్నెడి బాంధవ్యము లన్నియు ఒక్కనాడు ప్రాప్తించే మృత్యువుతో అదృశ్యమవుతాయి. తిరిగి ఏ క్షణాన కూడ స్మృతికిరావు. ఈ సత్యమును గ్రహింపలేని వ్యక్తులు మమతల వలలోచిక్కి వ్యథ చెందుచుందురు.

దేహము శక్తివంతముగ యున్నపుడే సాధన లాచరింపవలెను. ముసలితనమున ప్రక్కవారిని బాధించడమేగాని, జీవితమున సాధించే దుండదు. విషయసుఖాలు జనులను మోసం చేస్తుంటాయి. బుద్ధిని పాడు చేస్తాయి. దృష్టిని వక్రంప చేస్తాయి. స్వార్థాన్ని పెంచుతాయి. త్యాగాన్ని దూరంచేస్తాయి. బ్రతుకును అంధకార బంధురముగ మారుస్తాయి.

సత్యం తెలిస్తే మనిషిలో విరక్తి జనిస్తుంది. వివేకము వైరాగ్యము నందిస్తుంది. ముసలితనములో ఏర్పడే భక్తి నిజమైన భక్తి కాదు. అది మూలిగే భక్తి. వయసు మళ్ళిన తరువాత లభించే వైరాగ్యము నిజమైన వైరాగ్యము గాదు. ఫలించని ఆశ లందించిన విరాశయై యుంటుంది.

విద్యార్థులు పరీక్షలు వ్రాస్తారు. అంతేగాని పదవీ విరమణ జేసిన ఉద్యోగులు గాదు. భక్తి వైరాగ్యాలకి నిజమైన పరీక్ష యౌవనములోనే జరుగుతుంది. గెలుపో, ఓటమియో అక్కడే తేలిపోవాలి. ముసలితనములో జరిగే పరీక్ష వాస్తవానికి భక్తికేగాని వ్యక్తికిగాదు.

ప్రతివ్యక్తీ తన జీవితములో ఎన్నో వస్తువులను చేతులతో ముట్టుకుంటున్నాడు. కానీ ఏదియును చేతిలో నిలవడము లేదు. అంతిమ క్షణాన రిక్తహస్తాలే మిగులుతున్నాయి. నష్టరూపాలే గోచరిస్తున్నాయి. బ్రతుకును చేజేతుల పాడుచేసుకోవడమంటే ఇదియే సుమా!

సమయము వడచిపోతున్నది. అవకాశములు ఒకదాని వెంబడి ఒకటి జారిపోతున్నవి. ఆయుష్షు కారిపోవుచున్నది. కానీ మనిషి మారేదెప్పుడు?

ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఒక ఉద్యోగి నా వద్దకు వచ్చాడు. "స్వామీజీ! మీ నుండి చిన్న సలహా కావాలి" అని ప్రారంభించి ఒక మహోపన్యాసాన్ని దంచాడు. ఇంతకీ సారాంశమేమిటి? తాను ఉద్యోగవిరమణ చేశాడు. ఆస్తి ఉంది. బిడ్డలంతా స్థిమితముగా స్థిరపడి పోయారు. రెండువేల రూపాయల వరకు పెన్షన్ వస్తుంది. ఆశ్రమంలో ఉండి పోదామనుకున్నాడట. కానీ వేరే ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగము వచ్చే అవకాశాలున్నాయి. వస్తే సరేసరి. లేకపోతే ఆశ్రమానికి వచ్చి ఉంటానంటాడు.

అతనిని జూచి నాకు జాలేసింది. నేనేమీ మాట్లాడలేదు. చెప్పండి - చెప్పండి యని గ్రుచ్చి గ్రుచ్చి అడుగుతుంటే చెప్పక తప్పింది గాదు. చెప్పేశాను. "అయ్యా! మిమ్మల్ని ప్రభుత్వం ఉద్యోగంనుండి విరమింపచేసింది. దాని అర్థమేమిటి? ఇక మీ సేవలు నిరుపయోగము అని. మీరు ఈ సత్యాన్ని మరచి మళ్ళీ ప్రయత్నిస్తున్నారు. మంచిదే. మీకు మీరు కోరుకొనే కంపెనీలో ఉద్యోగము రావలెనని భగవంతుని ప్రార్థిస్తాను. ఎందుకంటే మిమ్మల్ని నేను ఆశ్రమంలో ఉంచుకోను గనుక" యన్నాను. ఆ మాటకు చలించి పోయిన ఆ వ్యక్తి "ఎందుకని స్వామి?" యని ప్రశ్నించాడు.

"ఈ ఆశ్రమం సాధనాలయం. అనాధ శరణాలయం కాదు" అని చెప్పి, ఆ చర్చను అంతటితో ముగించాను.

బాధ్యతలన్నీ తీరిపోయాయి. అయినా బరువులు మోయాలనే బుద్ధి చావలేదు. ఆశలు అడుగంటలేదు. వ్యామోహాలు చావలేదు. మూడునాళ్ళ ముచ్చటైన ఈ జీవితములో సంపాదనలు, గౌరవాలు, పేరుప్రతిష్ఠలు ఏ పాటివి?

భరతునికి యౌవనము ఉంది. రాజ్యము ఉంది. భార్య ఉంది. భోగములున్నాయి. కానీ వాటన్నిటిపై ఇచ్ఛలేదు. అందుచేత సమస్తమును త్యజించి సర్వేశ్వరుని ఆశ్రయించాడు. అభ్యాసముతో తోడైన సంస్కారాలను ఆలోచనతో, ఆచారముతో పోగొట్టుకొనినాడు.

ప్రతివ్యక్తి ఒకనాడు త్యాగి కావలసిందే. ప్రతివ్యక్తి సమస్తమును విడువవలసిందే. ఈ సత్యమును గ్రహించి ఏ క్షణాన్నైనా త్యజించేందుకు సిద్ధంగా యుండువాడే సాధకుడు. భక్తుడు. వస్తువులు, విషయాలు మనలను త్యజిస్తే మనకు దుఃఖం కలుగుతుంది. మనము అవగాహనతో వదలిపెడితే సుఖం లభిస్తుంది. భార్యాభర్తలలో ఒక్కరే న్యాయస్థానంలో విడాకులకు వినతిపత్రాన్ని సమర్పిస్తారు. విడాకులైన తరువాత వారిరువురు విడిపోతారు. ఆ సమయాన ఒకరు తృప్తితో, మరొకరు అసంతృప్తితో గోచరిస్తారు. ఏదైనా అంతే. ఆసక్తి లేనపుడు ఇంద్ర పదవియైనా ఇంపుగా యుండదు.

విషయాలు, వ్యక్తులు, వస్తువులు ఎంతకాలం తోడుగా యుండినా ఒకనాడు దూరంగాక తప్పవు. ఏవి దగ్గరుండినా ఫరవాలేదు. అవి మనస్సుకు దగ్గర గాకుండా యుండాలి. ఉండినవి ఉంటాయి. ఊడేవి ఊడిపోతాయి. పోయేందుకు వచ్చినవి యుండినను ఒకనాడు పోయేవియే. పోక తెలియనిది, రాకలేనిది ఏదియో అదియే నీకు నిజమైన తోడు. అది పరమాత్మయే గాని మరొకటి గానేరదు. ఈ సత్యమును గ్రహించుట

చేత భరతుడు సమస్తమును త్యజించి పరమాత్మనే పట్టుకున్నాడు. సంసారమున తీవ్ర విరక్తి ఉదయించినపుడే సన్యసించాలి.

యదహరేవ విరజేత్త దహరేవ ప్రవ్రజేత్

"ఎవడు సంసారము నందు విరతుడో వాడే సన్యాసి గావలెను" యని జాబాలోపనిషత్తు తెలిపినది.

ఒకనాడు భరతుడు మహానది యందు స్నాన మాచరించి, నదీతీరమున గూర్చుండి ధ్యానమగ్నుడై యుండెను. ఆ సమయమున గర్భిణియగు లేడి జలార్థినియై నదీ తీరమునకు వచ్చినది. ఆ హరిణి జలమును పానము చేయుచుండెను. ఇంతలో సింహము భయంకరముగ గర్జించెను. ఆ గర్జనము నాలకించిన హరిణము కంపించినదియై, భయముతో నదిని దాటుటకు దుమికెను.

హరిణి గర్భిణియై యున్నందున దుముకునపుడు నధిక భయముచే దాని గర్భము నందున్న జింకపిల్ల యోనిద్వారము నుండి బహిర్గతమై నదిలో పడెను. హరిణి మరియొకవైపు తీరమునుజేరి చనిపోయెను. లేడిపిల్ల జలప్రవాహములో కొట్టుకొని పోవుటను గాంచెను. కరుణార్ద్ర చిత్తుడైన భరతుడు ఆపద్బాంధవునివలె జింకపిల్లను బయటకు తీసెను. తల్లిని పోగొట్టుకొనిన హరిణ శిశువును తన ఆశ్రమమునకు గొనిపోయెను.

హరిణ పోతముపై భరతునకు ప్రేమ అధికమయ్యెను. ఈ పసికూనకు తల్లి లేదు. దీని నెవ్వరు పోషింతురు? నేను దప్ప దీనిని పోషించు వారెవరు? యని భరతుడు భావించెను.

పోషకుడు తానని మనుజుడు భ్రమించుచుండును. సంసారము నంతటిని నేనే పోషించు చున్నాను యని ప్రగల్భములు పలుకు చుండును. తాను ఎవరి దయపై ఆధారపడి జీవించు చున్నాడో మరచిపోవును. తల్లి గర్భంలో అయోమయంగా యున్న తనను రక్షించిన దెవరో మరచిపోవును. నేను ఈ విషయమును సాధించితినని గర్వించును. దానిని సాధించుటకు సాధనమగు బుద్ధి నెవరిచ్చెనో జ్ఞాపకము పెట్టుకొనడు. తన అందమును జూచుకొని మురిసిపోవుచు, అందమును అందించిన వానిని మరచిపోవును.

మన మేదైన సత్కార్యము నొనరించి నపుడు అది భగవదనుగ్రహమని భావింపవలెను. అహంకారము అనర్థదాయకమని మరచిపోరాదు. హరిణ శిశువును భరతుడు రక్షించుట మంచిదే, గాని దానిని రక్షించువాడు తన కన్నను వేరుగా లేడని భావించుట సరిగాదు. ఈ ఆలోచన మనస్సులో వాసనను తయారుచేయును.

రాజ్యభారము వహించవలసిన రాజైన తాను విరాగియై రాజ్యమును త్యజించెను. గొప్పదైన రాజ్యమును త్యజించగలిగెను. కానీ హరిణ పోతమునందు అభిమానమును పెంచుకొనెను. వాసన ప్రారంభములో తరంగమువలె గన్పించును. కాలక్రమేణ సాగర రూపమును ధరించును. ఒకరిపై దయ చూపుటకు మనుజుడేపాటి వాడు? అందరు

సర్వేశ్వరునిపై ఆధారపడి యున్నారు. దయచూపుట తప్పుగాదు. అభిమానమును పెంచుకొనుట అనర్థదాయకము.

భరతుడు హరిణ శిశువును ఆశ్రమములో పెంచుచుండెను. దానిని లాలించు చుండెను. పాలించు చుండెను. పోషించు చుండెను. దానితో క్రీడించు చుండెను. కుక్కను పెంచడము తప్పు లేదు. దానితో క్రీడిస్తూ కుక్కలా మొరగడం మంచిదికాదు. ఈ విధమైన జీవనమును మనము అభిలషించు చున్నామని భగవానుడు తలచినచో ఆ తరువాత మన బ్రతుకు భారమగును.

మృగశిశువుపై ప్రేమ పెరుగుచుండగ అతని వ్యక్తిగత సాధన క్షీణించుచుండెను. పూజకు ఫలపుష్పాదులను దెచ్చుటకు అరణ్యమున కేగినచో క్రూరమృగములు హరిణపోతము నేమి చేయునో యని చింతించి ఆయా కర్మములను త్యజించెను. అది ఎగురుచుండగా భరతుడు గూడ గంతులు వేయును. కొంతసేపు దాని నెత్తుకొని నడచును. కొంతసేపు దానిని యెదపై పరుండ బెట్టుకొని పాటలు పాడును. మరికొంతసేపు ఒడిలో ఉంచుకొని "బడికి పోయేదెప్పుడు?" అని దాని నడుగును. చుంబనాదులతో సంతసించును.

ఇచ్చట అతిముఖ్యమైన విషయమును మనము గ్రహింపవలెను. తన ముత్తాతయగు అగ్నీధ్రుడు పూర్వచిత్తి అప్సర వలలో జిక్కి తపస్సును పాడుచేసికొనెను. పూర్వసంస్కారములతో గూడిన చిత్తమే పూర్వచిత్తి అప్సరయని గ్రహించితిమి. గతములో తయారైన వాసనలు ఈ నాడు సాధనను వక్రింప జేయును. ఇదియే పూర్వచిత్తి అప్సర యనబడినది.

భరతుడు గతంలో పిల్లలను పోషించియుండెను. పిల్లల నెత్తుకొని యుండెను. లాలించి యుండెను. పాలించి యుండెను. అదియే ఇప్పుడు తొంగి చూసినది. పూర్వచిత్తి అప్సర రంగప్రవేశము చేసినది. మృగశాబకము క్రొత్తది గావచ్చు. వాత్సల్యాది ప్రేమలు పాతవియే. గతరుచులే. గతించని అభిరుచులే.

ప్రాపంచిక విషయానుభూతులు ధ్యానములో ప్రతిబంధకములే యని మరువరాదు. అలజడి జీవితమును గడిపిన వాడు హాయిగా నిద్రపోలేడు. వాసనలను హృదిలో నిక్షిప్త మొనరించుకొనినచో అది ధ్యానములో విక్షేపమును కల్పించును. హోరుగాలిలో దీపము ఆరిపోవును. వాసనల హోరుగాలిలో ధ్యానదీపము ఆరిపోవును. భక్తిదీపము ఆరిపోవును.

భరతుడు అర్చన కుపక్రమించును. ప్రతి అరనిముషమునకు మృగశిశువువైపు చూచును. కళ్ళు మూసి ధ్యానము చేయును. కొన్ని క్షణాలు కాగానే కళ్ళు తెరచి హరిణ శిశువును గాంచును. అది క్షేమముగానే యున్నదని భావించి ధ్యానము చేయును.

లేడిపిల్ల ఆశ్రమములో లేదు. భరతుని మనస్సులో చేరిపోయింది. ఇంటిలో ఎందరున్నా ఫరవాలేదు. కానీ మనస్సులో మాధవుడు తప్ప మరెవ్వ రుండకూడదు. సమస్తమును త్యజించి భరతుడు అరణ్యమునకు వచ్చెను. కానీ వాత్సల్యమనెడి వాసన పూర్తిగ నశింపలేదని గ్రహించలేదు. ఏకాంతమున వసించుచున్నను వాసనయనెడి అయస్కాంతముచే ఆకర్షింపబడెను. తనకు తెలియకుండగనే ఆ వాసనను వృద్ధి

చేసికొనుచుండెను. భరతుని ఆకర్షించినది మృగశాబకము గాదు. తనలో నిలిచియున్న పూర్వచిత్తియే. సంస్కారముల స్వరూపమే. వాసనా స్వరూపమే.

సంధ్యా సమయమున గండకీ నదీతీరమున ఆసీనుడై **"సర్వేజనా స్సుఖినో భవన్తు"** యని భరతుడు చెప్పుచుండెడి వాడు. ఇప్పుడు ఆ భావన అదృశ్యమైనది. **"మృగ శిశువునకు శుభము కలుగు గాక"** యని ప్రార్థించుచున్నాడు.

ధన నష్టమును గాంచి లోభి కలవరపడి కలత చెందునట్లు హరిణ శాబకము కొన్నిక్షణాలు కనపడక పోయినచో యుద్విగ్న మనస్కుడై భరతుడు తల్లడిల్లుచుండెను. అది తిరిగి కనిపించునంత వరకు దు:ఖించుచుండెను.

"నా హరిణము క్షేమముగా యుండునా? దానిని తోడేలు తినలేదుగదా? అయ్యో! దిక్కులేని హరిణము నన్నాశ్రయించినది. నేను క్రూరుడను. ద్రోహిని. హరిణమును ఒంటరిగ వదలితిని. భగవాన్! నా మృగశాబకము మృతి చెందలేదు గదా? నిర్భయముగా మఱల లేత పచ్చికను దినుచు ఆశ్రమప్రదేశమున ఆనందముగా సంచరించునా? ఆ మంజుల మనోహర దృశ్యమును గాంచు పుణ్యము నా కున్నదా?" యని విలపించును.

ఈ విషయమును సాధారణముగ మనము ప్రతి ఇంటి యందును గాంచుచుందుము. బిడ్డలను సంతకు పంపి తల్లిదండ్రులు సంతాపముతో కుమిలిపోవు చుందురు. నా బిడ్డ ఇంకారాలేదు. ఏ వైపరీత్యము సంభవించలేదు గదా? యని వ్యాకుల చిత్తులగుచుందురు. వాసన ప్రబలమైనది. ఆ ఆలోచనలే ఆశ్రమ జీవనంలోగూడ భరతునికి కలుగుచున్నవి. అందుచేతనే గృహస్థాశ్రమము పవిత్రమని చెప్పుదురు. గృహస్థాశ్రమమున వాసనలను వశింప జేసికొనినచో సన్యాసము సునాయాస మగును.

లేని ప్రమాదమును మనస్సు ఊహించును. లేని దానిని ఉన్నట్లు జూచును. మనస్సు ప్రమాదములకు నిలయమై యున్నందున ప్రమాదములనే దర్శించును. మనస్సులో కదలే అనవసర సంకల్పము లన్నియు పూర్వచిత్తి అప్సరయేనని భావింపవలెను. మృగ శాబకము నకు ఏమి ప్రమాదము వాటిల్లెనో యని భరతుడు వ్యథచెందును.

క॥ కట్టా! యీ యాశ్రమమున బుట్టినతృణచయము మేసి పొదలినహరిణం
బిట్టట్టు దిరుగుచుండగ బట్టి మృగేంద్రుండు గొట్టి బాధించె నొకో!

"నా హరిణము ఎప్పుడు వచ్చి నన్ను సంతోషపెట్టును? ఎగురుచు, దుముకుచు నన్నెప్పుడు పంతపమున ముంచును? నేను ధ్యానము చేయు సమయాన తన కొమ్ములతో నన్నెప్పుడు గోకును? నేను పూజాది కార్యములందు నిమగ్నమై యుండగ, పూజా ద్రవ్యం బులను హరిణి వాసనచూడగా కోపించిన నేను తీవ్రముగా కుమారుని జూచినట్లు చూడగా, భయపడినట్లు దూరంగా వెళ్ళి, మళ్ళీ నేను ప్రేమతో పిలువగనే చెంగు చెంగున గంతులు వేయుచు నన్ను సమీపించి మూర్కొనే మృగశాబక క్రీడల నే నెప్పుడు దర్శింతును?" అని భరతుడు విలపించును.

ఆహా!...... ఏమి ఈ విచిత్రమైన ప్రారబ్ధము? విఘ్నము లేకుండా ధ్యానము జరుగ వలెనని భావించవలసిన తపస్వి ధ్యానమునకు విఘ్నము కలుగవలెనని యోచించుటయా? భగవత్పూజ కుపకరించు పూజాద్రవ్యములను మృగశాబకము మూర్కొనవలెనని సంకల్పించుటయా? పూర్వచిత్తి అప్సర నాట్యభంగిమలు మనస్సునకు అందునవి గావు. మాయానర్తకి విన్యాసాల ముందు మానవుడు కీలుబొమ్మయే.

యోగానుష్ఠానము అయోమయమయ్యెను. అర్చన అదృశ్యమయ్యెను. పారాయణము పలాయనమయ్యెను. ధ్యానము దారి తప్పెను. కీర్తన కనుమరుగయ్యెను. తపస్సు తరలి పోయెను. సర్వము హరించిపోగా హృదయములో హరిణ శాబకమే నిలచియుండెను. అంతటి తపస్వియగు భరతుడే అలా అయినచో సామాన్యుల విషయము ఏమి చెప్ప గలము? వాసనలు బలీయమైనవి యని శుకబ్రహ్మ పరీక్షిన్మహారాజునకు చెప్పుచున్నాడు.

సీ॥ జననాథ! మున్ను మోక్షవిరోధమని పాయ గారాని పుత్రాదికంబు నెల్ల
బాసి తపస్వియై భరతుండు హరిణశా బకపోషణంబున బాలనమున
నటలాలనప్రీణనానుషంగంబుల మూషకబిల మతిరోషమునను
సర్పంబుసొచ్చిన చందంబునను యోగ విఘ్నంబు మిక్కిలి విస్తరిల్లె
ఆ॥ గాన యెంతవానికైనను గాలంబు గడవ రామి నట్లు గాకపోదు
పరమమునులకైన బాయవు కర్మంబు లొరు లనంగ నెంత నరవరేణ్య!

సంసారమును వదలి మానవు డెక్కడికి పోగలడు? ఎక్కడికెళ్ళినా సంసారమే తయారగును. వాసనా పరిశ్రమలను లోపల నిలుపుకొని ఆశ్రమాల కెళ్ళినా అవి కూడా శ్రమలుగనే మిగులుతాయి. భరతుడు మృగశాబకము యొక్క ఆలోచనలో కాలమును హరింపజేసికొనును. కానీ కాలుడు తన కార్యమును తప్పక ఆచరించును. నీవు ఏమి చేయుచున్నావని యముడు ఆలోచించునా?

ఎలుక కన్నములో సర్పము ప్రవేశించినట్లు ఆపుటకు వీలులేని కాలసర్పము భరతుని సమీపించి యుండెను. ప్రతి మనిషిని మృత్యువు పొంచి యుండును. ఈ సత్యము నెరుగలేక జీవులు కాలమును వృథా చేసికొను చుందురు.

మృత్యువు ఏక్షణమైనను రావచ్చును. ప్రతిక్షణమును మనుజుడు బాగుచేసి కొనినచో మృత్యువు బాగుపడును. జీవితకాలమున మనము దేనిని గురించి చింతింతుమో మృత్యు సమయమున అదియే మదిలో మెదలును.

భరతుని మృత్యువు సమీపించెను. అట్టి సమయమున గూడ మృగశాబకము తన కెదురుగ కూర్చుని పుత్రుని వలె చింతించు చున్నట్లు భరతుడు భావించు చుండెను. కాలానికి ధర్మమే గాని దయ తెలియదు. కనికర మెరుగని కాలము భరతుని కబళించెను. మహానుభావుడైన భరతుడు మృగశిశువుపై నున్న ప్రేమచేత ప్రపంచమును, మృగశాబకమును, తనదేహమును పరిత్యజించి సామాన్యుని వలె మరణించెను.

హారిణమును స్మరించుచు మరణము ననుభవించుట చేత తిరిగి జన్మము తప్ప దయ్యెను. భరతుడు తిరిగి జన్మించెను. మృగమును చింతిస్తూ మరణించినందున మృగ జన్మమే యెత్తెను.

భరతుడు జింకయై జన్మించెను. కాని ఆ లేడికి పూర్వజన్మ స్మృతి యుండెను. నేను ఈ గండకీ నదీతీరముననే ధ్యానము చేసెడివాడను. ఈ నదియందే నేను హరిణ శాబకమును రక్షించితిని. పెంచితిని. పోషించితిని. దానితోపాటు నూతన ప్రారబ్ధమును గూడ పోషించుకుంటిని. రాజ్యమును త్యజించి, భార్యాపుత్రాదులను పరిత్యజించి, ఏకాకినై వాసుదేవ నామామృతపాన చిత్తుడనై జితేంద్రియుడ నైతిని! ఆహా! ప్రారబ్ధము ఎంత బలీయము? వాసన ఎంత బలవత్తరము! మృగశాబకముపై ప్రేమను పెంచుకొని మృగజన్మ నెత్తితిని. యోగభ్రష్టుడ నైతిని. ధ్యాన పతితుడ నైతిని. ఇలా చింతించుచు హారిణీ రూపమున యున్న భరతుడు నిర్వేదమును పొందెను.

మృగరూపమున యున్న భరతుడు మరల పులహాశ్రమము చేరెను. ఉదాసీన వైఖరి నవలంబించు చుండెను. గత జన్మలో చేసిన తప్పిదమును తిరిగి చేయకూడదని జాగ్రత్త పడి యుండెను. ఉన్న ప్రారబ్ధము ననుభవింప వలెనే గాని నూతన ప్రారబ్ధమును తయారు చేసికోగూడదు యని దృఢముగ భావించెను. సాంగత్య దోషము సర్వానర్థములకు మూలమని గ్రహించెను.

బాల హారిణము ముద్దుగ నుండెను. అది నిత్యము గండకీ నదిలో స్నానమాచ రించును. బ్రహ్మ ముహూర్తముననే నిద్రలేచును. సూర్యుని ఎదుట నిలబడి చేతులెత్తి నమస్కరించలేని తన నిస్సహాయతకు చింతించుచు కన్నీరుకార్చును. మహాత్ము లరుదెంచునపుడు వారిని రెప్పవాల్చకుండ వీక్షించుచుండును. గత జన్మలో హరిణమును గాంచి భ్రష్టమైన దృష్టిని మహాత్ముల సందర్శనము ద్వారా బాగుచేసికొన వలెనని భావించును.

ఆకలివేసినచో ఎండుగడ్డిని తినును. పచ్చిగడ్డిని తినదు. పచ్చిగడ్డిపై క్రిములుండినచో అవి నశించునేమో యని ఆలోచించును. ఈ పాపము వలన మరొక జన్మ వచ్చునేమో యని భయపడును. పాపమును చూసి భీతి చెందువారు తప్పక పుణ్యాత్ములగుదురు. పునీతులగుదురు.

సంకీర్తన చెవిని పడినచో ఆశ్రమ ద్వారమున నిలబడి గగుర్పాటు చెందుచు, ఆనందాశ్రువులను రాల్చుచుండును. ఏకాదశినాడు అది భోజన మారగించదు. ఆహా! పశుజాతిలో పుట్టినను పవిత్ర సంస్కారాలు నశింపవు.

పశుపక్ష్యాదులలో గూడ జన్మాంతర సంస్కారముల ప్రభావమున మహాత్ము లుదయించే అవకాశము గలదు. అందుచేత సాధకులు పశుపక్ష్యాదులను హింసింపకూడదు. హేయముగా నిందించరాదు. పశువులో గూడ నిలుచుని పరమాత్మ భక్తునికి దర్శన మొసగును. ప్రహ్లాదునికి ఏనుగుయందు, సర్పమునందు నారాయణుడే గోచరించెను.

హరిణికి అవసానదశ సమీపించెను. అది తెలిసి బాల హరిణము గండకీ నదికి వెళ్ళెను. ఆ పవిత్ర తీర్థమున స్నానమాచరించెను. నదీ తీరమున ఆసీనమై ధ్యానమగ్న మయ్యెను. కాలుడు సమీపించగా ప్రశాంతముగా ఈశ్వర ధ్యానములో కన్నుమూసెను.

భరతుడు బ్రాహ్మణుడై జన్మించుట

భరతుడు ఒక బ్రాహ్మణ శ్రేష్ఠునికి కుమారుడుగ జన్మించెను. ఆంగీరస గోత్రుడైన యా బ్రాహ్మణుడు పవిత్రుడు. శమదమ వేదాధ్యయన తత్పరుడు. దాన ధర్మముల యందు ఘనుడు. అసూయలేనివాడు. వినయవంతుడు. భక్తి తత్పరుడు.

సద్గుణ సంపన్నులకే సన్మార్గులైన పుత్రులు జన్మింతురు. సత్పుత్రులు కలుగవలెనని ఆలోచించువారు సదాచారము నలవరచుకొన వలెను. సన్మార్గ వర్తనులై యుండవలెను.

ఆత్మజ్ఞుడైన ఆ బ్రాహ్మణునికి ఇరువురు భార్యలు గలరు. జ్యేష్ఠభార్య వలన తొమ్మండుగురు పుత్రులు జన్మించిరి. వారును ఆచారవంతులై, విచారవంతులై తండ్రితో సమానులైరి. ఆ బ్రాహ్మణుని కనిష్ఠ భార్య ఒక పుత్రుని, ఒక పుత్రికను కవలలుగ ప్రసవించినది. వీరిరువురిలో పుత్రుడు భరతుడయ్యెను. మృగ జన్మను త్యజించి బ్రాహ్మ ణోత్తముడుగ జన్మించెను. ఇదియే ఈ మహాత్ముని చివరి జన్మము.

ఎవరికి బాల్యముననే భక్తి ఉదయించునో వారిది చివరిజన్మ కాగలదని శాస్త్ర వచనము. భరతునకు పూర్వజన్మ స్మృతి యుండెను. మృగముగ జన్మించిన విషయము జ్ఞాపక ముండెను. అందుచేత ఈ జన్మలో నూతన సంస్కారములను, వాసనలను లేకుండా జీవింపవలెనని భావించిన భరతుడు జడునివలె, మూగవానివలె మెలగసాగెను.

బ్రాహ్మణుడు భరతుని యందు పుత్రప్రేమను పెంచుకొనెను. కానీ చివరి జన్మ ననుభవిస్తున్న భరతునికి అది ఇష్టము లేకుండెను. సంపర్కము లన్నియు సంస్కారములై నూతన జన్మను ఆవిష్కరించునని అతడు భయపడుచుండెను.

తండ్రి భరతునకు ఇష్టము లేకున్నను ఉపనయన సంస్కారము చేయించెను. తండ్రి మంత్రములను వల్లించ మనినచో వాటిని విరుద్ధముగ వల్లించును. మలమూత్రము లను విడచిన పిదప శౌచాదులను కూడా ఆచరింపకుండెను. గాయత్రిని బోధింప యత్నించిన తండ్రి యొక్క కృషి యంతయు నిష్ఫలమాయెను. కుమారుడు గొప్ప పండితుడు గావలెనని తండ్రి ప్రయత్నించెను. కానీ ఫలితము సిద్ధింపదయ్యెను. ఈలోగా మృత్యువు సమీపించెను. తండ్రి మరణించెను. తల్లి తండ్రితో పాటే మరణించెను.

తండ్రి మరణానంతరము సోదరులు భరతుని విద్యాభ్యాసాది విషయముల యందు శ్రద్ధ చూపకుండిరి. జడుడు వలె చరించు భరతుని జడ భరతుడని పిలువ సాగిరి. సోదరులందరు వేదముల యందలి కర్మకాండమునకే పరిమితమై యుండిరి. జ్ఞానకాండకు సంబంధించిన భరతుడు వారికి అవగతము గాకుండెను. జనులు రకరకము లైన మాటలతో భరతుని అవమానించు చుండిరి.

ఎవరైనను పలకరించినచో భరతుడు పలికేవాడుగాడు. గతజన్మలో పలుకు తెలియని మృగ శాబకముతో గూడ పలికిన ఫలితంగా మృగజన్మ నెత్తవలసి వచ్చినది. కనుక ఈ జన్మలో ఎవరితోను పలుక గూడదని భరతుడు నిర్ణయించుకొనెను. ఒకవేళ మాట్లాడవలసి వచ్చినచో భక్తులతో మాట్లాడాలని, భగవంతునితో మాట్లాడాలని భావించెను.

భరతుని జడుడని భావించి కొందరు అతనిచేత పనులు చేయించు కొనెడివారు. భరతుడు వినమ్రుడై వారు చెప్పిన పనుల నాచరించెడివాడు. వారందించిన ఆహార పదార్థ మును భుజించెడివాడు. రుచిపై అభిరుచి లేకుండా భుజించు చుండెడివాడు.

భరతుడు దేహమును వస్త్రములతో కప్పుకొనడు. శీతోష్ణములకు కలత చెందడు. భూమిపైననే శయనించెడి వాడు. స్నానము లేనందున దేహము మలినమై యుండెను. కౌపీనమును మాత్రమే ధరించి యుండెడివాడు. తండ్రి ధరింపజేసిన యజ్ఞోపవీత ముండెడిది. అతనిని బ్రాహ్మణాధముడని పిలిచెడివారు.

ఇతరులు అతనిచేత పనిచేయించుకొనెడి వారు. అదిగాంచి సోదరులు గూడ పని చేయించుకొనెడివారు. సోదరులు బియ్యపునూకను, తవుడును, వంటపాత్రలలో మిగిలియున్న మాడును పెట్టెడివారు. భరతుడు అద్దానిని అమృతముగ స్వీకరించెడి వాడు.

తే॥ అతులదివ్యాన్న మైన మృష్టాన్నమైన వెద్ది వెట్టిన జిహ్వకు హితముగాని
తలచి భక్షించుగా కొండుదలచి మిగుల బ్రీతి సేయడు రుచులందు బెంపుతోడ.

వాక్కును అవసరమైన విషయములకే వినియోగించుకొన వలెనని భరతుడు తెలుపును. ఆహారమును రుచి చూడకుండ భుజింపవలెనని తినుటను నేర్పెను. దారిలో నడచునపుడు జాగ్రత్తగ చూసి నడచును. క్రిములేవైనను కాలిక్రింద నలిగిపోవునేమోయని శంకించుచు భూమిపై పాదము మోపును. చివరిజన్మలో దేహేంద్రియ మనోబుద్దులు అతి సుకుమారము లగును.

వృషలపతి యగు రాజొకడు పుత్రవాంఛతో కాళికాదేవికి నరపశువును బలిగా ఇచ్చుటకు నిర్ణయించెను. ఎవరినైన ఒక నరుని దీసికొని రమ్మని రాజాజ్ఞాపించెను. ఒకచోట భటులకు భరతుడు కనిపించెను. అతనిని బంధించి కాళికాలయమునకు గొనిపోయిరి.

వామాచారులు ఈ సంప్రదాయము ననుసరించు చుందురు. బలిదానము శ్రేష్ఠమైనది. కానీ జంతువులను, మానవులను బలి ఇవ్వగూడదు. తల్లియగు జగజ్జనని బిడ్డల రక్తమును చూడవలెనని వాంఛింపదు. బలి ఇచ్చుట యనగా మనలోని కామక్రోధాది అరిషడ్వర్గములను బలిఇచ్చుట యని భావము.

చోరులు భరతుని స్నానము చేయించిరి. నూతన వస్త్రములచే దేహమును గప్పిరి. అలంకరణములను జేసిరి. భరతుని తీసికొని వెళ్ళి కాళికాదేవి ముందుంచిరి. తలను క్రిందికి వంచమనిరి. భరతుని వధించుటకు భయంకరమగు ఖడ్గమును ధరించిరి.

జగజ్జనని యగు చండిక విగ్రహము నుండి వ్యక్తమైనది. చోరులవద్ద నున్న ఖడ్గము చేబూని వారి మస్తకములను ఖండించినది. భక్తులకు ఎవ్వరూ హాని కల్పించలేరు. రెండు చేతులతో హాని చేసేందుకు మనుజులు యత్నించినచో వేయి చేతులతో భగవానుడు రక్షించును.

"పరీక్షిన్మహారాజా! భాగవతులు, పరమహంసలు నైన మహాత్ములు ప్రాణాపాయస్థితిలో కూడ కలతచెందరు. ఇది వారికి సామాన్యమైన విషయము" యని శుకబ్రహ్మ చెప్పెను.

మహాత్ముల నెవరైతే హింసింతురో వారే హింసింపబడుదురు. మహితాత్ముల వైభవము నిత్యము. సత్యము. నిరంజనము.

క॥ ధరలోన నెవ్వ రేనియు ధరణీసురవరుల కెగ్గు దగ దలచిన వా
రరయగ జెడుదురు నిక్కము హరి ధరణీసురవరేణ్యు లం దుండుటచేన్.

భరత రహూగణుల సమాగమము

ఒకనాడు సింధుదేశపు రాజగు రహూగణుడు బ్రహ్మవిద్యను బొందుటకై కపిల మహర్షి ఆశ్రమమునకు వెడలుచుండెను. పల్లకిమోయు బోయీలలో ఒకడు పారిపోయెను. మరియొకనిని వెంటనే సిద్ధము చేయుమని రాజు తెలిపెను. వాహకుని కొరకు సైనికులు వెదకుచుండగ వారికి భరతుడు కనిపించెను.

ఇతడు దృఢకాయుడై యున్నాడు. ఇతడు బరువును మోయగలడని భావించి బలవంతముగ భరతుని రాజుయొక్క పల్లకి వద్దకు తీసికొని వచ్చిరి. నాల్గవ వాహకునిగ భరతుని నియమించి బోయీలు పల్లకిని మోయుచుండిరి.

విధి బలీయమైనది. ఒకనాడు పల్లకిలో ఊరేగిన భరతుడు ఈనాడు పల్లకిని మోయుచున్నాడు. అయినను భరతుడు కలత చెందలేదు. దేహాభిమానమునకు దూరుడైన భరతునికి కర్మలలో నీచోన్నతములు తెలియుటలేదు.

బోయీలు పల్లకిని కదలించినారు. ప్రయాణము జరుగుచున్నది. రహూగణుడు పల్లకిలో కూర్చుని యున్నాడు. ప్రయాణము సుఖవంతముగ లేదు. పల్లకి బాగా కదలి పోతున్నది. కుదుపు చున్నది. పల్లకి పైభాగము ఒకొక్కసారి రాజు మస్తకమును బలంగా తగులుచున్నది. కారణము రాజుకు తెలియుటలేదు.

భరతుడు పల్లకిని మోయుచున్నాడు. దారిలో ప్రాణిహింస జరుగునేమోయని భయపడుచు తన దృష్టిని నాలుగు మూరలకు మించి పోనివ్వకుండెను. దారిలో చీమలు మొదలైన కీటకములు కనిపించినచో వాటిపై కాలుపడకుండా దుముకు చుండెను. దాని వలన పల్లకి కదలిపోగా, రాజు కలత చెందుచుండెను.

హే వోఢారః సాధ్వతి క్రమత కిమితి విషమ ముహ్యతే యానమితి

"ఓరీ! ఏమిటి విషమంగా పల్లకిని మోయుచున్నారు. జాగ్రత్త వహింపుడు" అనెను.

రాజుగారి దండన రూప వాక్కులు వాహకులలో భయమును కల్పించెను. "ప్రభూ! మేము మా కార్యమునందు అప్రమత్తులుగనే యున్నాము. పల్లకిని చక్కగనే మోయుచున్నాము. కానీ ఈ నూతన వాహకుడు సరిగ మోయుటలేదు. ఇతడు విచిత్రమైన వ్యక్తి వలె గన్పట్టుచున్నాడు. ఇతడు ఎందులకో ఒకొక్కసారి ఆగిపోవును. ఇంకొక్కసారి దుముకును. మరొకసారి పైకెగురును. ఇతని వింత ప్రవర్తన వలన ప్రయాణము విషమంగా మారుతున్నది" అని బోయీలనిరి.

రహూగణుడు పరమ ధార్మికుడు. అయినను ఆ సమయమున పరిస్థితుల ప్రభావముచే క్రుద్ధుడయ్యెను. రాజు భరతుని జూచి పలికెను.

రాజు భరతుని పరిహసించుచు, "సోదరా! పాపము! చాలా కష్టపడితివి. చాలా దూరమునుండి నీవు ఒక్కడివే పల్లకిని మోయుచున్నావు. అయ్యో! బడలిక కలుగలేదు గదా! నీ శరీరము దృఢముగలేదు. అవయవము లన్నియు బలహీనముగ యున్నవి" అని దృఢకాయుడైన భరతుని అవహేళన చేసెను.

భరతుడు మౌనముగ పల్లకిని మోయుచుండెను. తరువాత మరల పల్లకి అటు నిటు కదలెను. రహూగణుడు తీవ్రక్రోధావిష్టు డయ్యెను. "ఓరీ! దౌర్భాగ్యుడా! ఏమి నీ పొగరు? నీవు మరణించి యుంటివా? నేను ప్రభువును. నామాటను తిరస్కరించి వర్తించుచున్నావు. క్షణంలో నిన్ను యమునివలె దండించగలను. జాగ్రత్త" యనెను.

భరతుడు రహూగణునకు సమాధాన మిచ్చెను. రహూగణుని పుణ్యము భరతుడు పలుకునట్లు చేసినది. పుణ్యహీనులు గురుబోధను గ్రహింపలేరు. జీవులు పుణ్యముచే గురు వచనములను గ్రహింపగలుగుదురు. పాపాత్ములు గురుబోధను గ్రహింపలేరు.

భరతుడు చెప్పుచున్నాడు: "రాజా! నేను దృఢకాయుడను గానట్లు నీవు పలికితివి. అది సత్యము. స్థూలముగా యుండుట, కృశించి యుండుట దేహము యొక్క ధర్మము. నేను దేహమును గాను కనుక మీరు వచించినది సత్యమేయగును.

"నీవు జీవించి కూడా మరణించిన వాడవే యని పలికితిరి. అది కూడా వాస్తవమే. నీవు ఏ దేహమును జూచి నేనని భావించి పలుకుచుంటివో ఆ దేహము జీవించియున్నను మరణించినదియే. ఈ ప్రపంచములో ప్రతి వస్తువు కనిపించి కనుమరు గయ్యేదియే. ఈ జగత్తు తెలియుచున్నను లేనిదియే.

"ప్రభూ! ఇక నీవు పలికిన మూడవ విషయము. నేను ప్రభువును యని పలికితివి. అదియును సత్యమే. నీవు పాంచభౌతికమైన శరీరము గావు. ఇంద్రియములు గావు. మనస్సు గావు. బుద్ధివి గావు. వీటన్నిటికీ సాక్షిమాత్రుడవు. చైతన్య రూపుడవైన ఆత్మవు గలివి. ప్రభువువు. సాక్షివి. సర్వగతుడవు.

"రాజా! నీవు పలికిన చివరి విషయము పరిశీలించ దగినదియే. నీవు నన్ను దండింతునని పలుకుట కూడా సమంజసమే. నీవు దేహము యని భావించుట వలన నేను గూడ దేహమే యని భ్రమించి దండింప దలచితివి. రాజా! అసత్య కలాపాలకు వగవ వలేదు. స్వప్నగత విషయాలు జాగ్రదవస్థలో నిరుపయోగములే గదా!" యనెను.

రహూగణ చక్రవర్తికి కనువిప్పు కలిగెను. వెంటనే పల్లకీ దిగెను. తనను మోయుచున్నది పరమహంస యని గ్రహించెను. భరతుని పాదములపై బడెను. ముకుళితహస్తుడై భరతుని ప్రార్థించెను.

"మహాత్మా! నీవెవరు? యజ్ఞోపవీతమును ధరించి యుంటివి. బ్రాహ్మణుడవా! లేక అవధూతవా! తమరు ఎవరి శిష్యులు? ఇలా ఎందులకు సంచరించు చున్నారు? నన్ను ఉద్ధరించుటకు వచ్చితివా! భగవాన్! నేను ఏ మహాత్ముని దర్శనార్థము వెళ్ళుచుంటినో అట్టి కపిలుడు నీవుగాదు కదా!

"దివ్యాత్మా! నేను ఇంద్రుని వజ్రాయుధమును గాంచి భయపడను. త్రిపురారి శూలమును గాంచి భీతిచెందను. అగ్ని, సూర్య, వాయు కుబేరాదులు నాలో భీతిని కల్పించలేరు. తండ్రీ! బ్రహ్మజ్ఞానులైన మహాత్ములను జూచి భీతి చెందుదును. వారికి చేయు అపరాధమును గాంచి తల్లడిల్లెదను. నా తప్పిదమును క్షమింపుము. నీవు పరబ్రహ్మ రూపుడవు. నన్ను కడతేర్చి గాపాడుము" యని ముకుళితహస్తుడై ప్రార్థించెను.

సీ॥ ధరణీసురులలోన దలప నెవ్వడవు నీ వవధూతవేషి వై యవనియందు
నేమిటికై చరియింపంగ వచ్చి తి చట నొక్కడవు నొంటి సనుట నేడు
నను గృతార్థుని జేయ ననుకూలు డగుచున్న యట్టి యా కపిలమహామునీంద్రు
డవా? నీమహత్త్వంబు దవిలి విచారింప నెఱుగక చేసితి, గరుణ జూడు

తే॥ తప్పు సైరింపు,నే యమదండమునకు హరుని శూలంబునకును వజ్రాయుధమున
కనలచంద్రార్కధనద శస్త్రాస్త్రములకు వెఱవ, విప్రునికే మది వెఱచినట్లు.

"పరీక్షిన్మహారాజా! సింధుదేశాధిపతియగు రహూగణునిలో శ్రద్ధ ఉత్పన్నమగుట వేళ అతడు తత్త్వజ్ఞానము నొందుటకు అధికారి యయ్యెను" యని శుకబ్రహ్మ ఈ సందర్భమున ఆసక్తికర విషయమును తెలిపెను.

రహూగణ చక్రవర్తి ప్రథమంగా నిందించినపుడు భరతుడేమియును పలుకకుండెను. రాజు దేహముతో భాసించు చున్నందున అతనితో తాను భాషింప నవసరము లేదని భరతుడు భావించెను.

రెండవసారి దండించినపుడు భరతుడు రహూగణునికి సత్సంగ భాగ్యమును కల్పించ నెంచెను. తాను ఎవరిని మోయుచున్నాడో అట్టివాని మానసిక భారమును గూడ మోయవలెనని సంకల్పించెను. రహూగణుని పుణ్యమును భరతుడు దివ్యదృష్టితో గాంచెను. కపిలుని వద్ద జ్ఞానార్జనకు వెళ్ళుచున్న ఈ రహూగణుని తత్త్వజ్ఞాన సముపార్జనమునకు అధికారిని జేయవలెనని సంకల్పించెను. సత్సంగ మహిమను లోకానికి తెలియ జెప్ప నెంచెను. అహంకారమును వెంటబెట్టుకొని గురువును సమీపించువారు జ్ఞానమును పొందలేరు. నమ్రత గలవారే నిరంజన స్వరూపమును బొందగలరు. రహూగణుని లోని అజ్ఞానమును తొలగించి కపిలు నాశ్రయించుటకు అతనిని అధికారిని చేసెను. భరతునితో

కొన్ని నిముషములు సత్సంగము చేయుటవలన రహూగణునికి సాధన చతుష్టయ సంపద ప్రాప్తించెను.

అద్వైత బోధామృతము

మానావమానముల యందు సమానముగా యున్న భరతుని గాంచి అతడు పరమ హంస యనియు, బ్రహ్మనిష్ఠుడనియు రహూగణుడు భావించెను. తన తప్పిదమును క్షమింపుమని కోరెను. రహూగణుడు పుణ్యాత్ముడు. ధర్మాత్ముడు. తత్త్వజిజ్ఞాస గలవాడు. సత్సంగ ప్రభావము నెరిగినవాడు. రహూగణు డాలోచించెను. మహాత్ముల సహచర్య భాగ్యము ఆశించినప్పుడు లభించదు. లభించినపుడే అవకాశమును వినియోగించుకొని లబ్ధి పొందవలెనని నిర్ణయించుకొని భరతుని కొన్ని ప్రశ్నల నడిగెను.

"మహాత్మా! మీ దివ్యవచనములు నిగూఢ తత్త్వపూర్ణములు. అందులో ప్రచ్ఛన్నమై యున్న జ్ఞానమును నేను గ్రహింపలేక పోతిని. జ్ఞాన సమన్వయమును పొందలేక యుంటిని. సామాన్య మానవులమైన మేము మీలాంటి మహాత్ముల అసమాన బోధను గ్రహింపలేము. దయచేసి నా సందేహములను నివృత్తిచేయుము" యని పలికి తన సంశయములను వెల్లడించెను.

"మహాత్మా! స్థూల సూక్ష్మము లనెడి ఔపాధిక ధర్మములు నాకు లేవు యని మీరు చెప్పినారు. కానీ దానిని నేను గ్రహింపలేకున్నాను. ఉపాధిధర్మము మిథ్యయని నే నంగీకరింప లేకున్నాను. శరీరము ఆత్మతో సంబంధమును కలిగియున్నదని నేను భావించుచున్నాను. దేహము ఇంద్రియములతో సంబంధమును కలిగియున్నది. ఇంద్రియములు మనస్సుతో సంబంధమును కలిగియున్నవి. మనస్సు బుద్ధితో సంబంధమును కలిగియున్నది. బుద్ధి ఆత్మతో ముడిపడి యున్నది. ఇలా దర్శించినచో దేహాత్మల ధర్మములు విడదీయరానివి. క్షీరపూర్ణమైన మృత్తికాఘటమును అగ్నిపై నుంచగనే పాలు తప్తమగుచున్నవి గదా? బయటవేడికి బియ్యం ఉడికి అన్నమగుచున్నది గదా? ఇదంతయూ ఉపాధియుక్తమే గదా?" యని ప్రశ్నించెను.

భరతుడు చెప్పుచున్నాడు: "బియ్యము అగ్ని తాపమునకు అన్నమగుచున్నది. మరి బియ్యమునకు బదులుగా ఱాయిని వేసినచో అది కరుగునా?" యని ప్రశ్నించుచూ తత్త్వజ్ఞానమును భరతుడు అమోఘముగా ప్రవచించెను.

"ఆత్మనిర్వికారి. సాక్షి స్వరూపము. ఆత్మ అసంగమైనందున దానికి ఉపాధులతో సంబంధము లేదు. ఔపాధిక ధర్మములు మనోజనితములు. మనోవికారములు. మనస్సు చేయు మాయా జాలమున చిక్కి తాను దేహమని మనుజుడు భ్రమించుచున్నాడు.

"స్వప్నమున అనేక విషయములు గోచరించును. సుఖదు:ఖములు తెలియును. అవి యన్నియు సత్యములు గావని మనకు తెలుసు. ఈ సత్యము ఎప్పుడు తెలిసినది? మేల్కొనిన పిదపే తెలిసినది. ఎవరయితే ఇంద్రియ సంగత్వము నుండి విడివడి యున్నారో

వారే నిజముగ మేల్కొని యుండువారు. అట్టివారికే ఈ ప్రపంచము మిథ్యయని తెలియును.

"ఈ ప్రపంచమునకు మనస్సు కన్నను వేరుగా అస్తిత్వము లేదు. మనస్సు ఏ విధముగా యున్నచో ప్రపంచము ఆ విధముగ తెలియును. జగత్తులో గోచరించు వికారములు వాస్తవానికి మానసిక వికారములే. పాప పుణ్యము లనెడి వాసనలతో నిండిన మనస్సు కామక్రోధాది వికారములచే విచలితమై గుణయుక్తమై చరించుచుండును. ఆ మనస్సే జీవుని సంసారమును తయారు చేయుచున్నది. మోహవలయంలో పడదోయు చున్నది. దుర్భర ఫలములను పంచిపెట్టు చున్నది.

చిత్తం కారణ మర్థానాం తస్మిన్సతి జగత్త్రయమ్
తస్మిన్ క్షీణే జగ త్క్షీణం తచ్చికిత్స్యం ప్రయత్నత:

"సమస్త విషయములకు మనస్సే కారణమగుచున్నది. మనస్సొక్కటి యున్నచో ముల్లోకము లుండును. మనస్సు క్షీణించిన జగత్తు క్షీణించును. కనుక మనస్సునకు చికిత్స చేయించుటకు ప్రయత్నింపవలెను" యని మహోపనిషత్తు ప్రవచించినది.

"భోగముల యందు ఆసక్తిగల మనస్సు బంధమును కలిగించుచున్నది. దీనిని బట్టి ఆలోచించినచో ఏ మనస్సునకు భోగేచ్ఛ యుండదో అట్టి మనస్సు ముక్తికి కారణమగునని తెలియును.

"జీవుడు స్వభావత: నిస్సంగుడు, నిర్గుణుడు. ఈ సత్యము అవగతము గానంత వరకు జీవుడు మనస్సుతో తాదాత్మ్యం చెంది సంసార వలయమున పరిభ్రమించుచుండును. మనస్సే మనిషికి శత్రువు. దానిని ఉపేక్షించినచో దాని బలము పెరుగును. మేఘము సూర్యుని నిరోధించినట్లు జీవప్రకాశమును మనస్సు నివారించును. హరిగురు చరణోపాసన యనెడి శస్త్రమును చేబూని మనస్సును ఖండింపవలె" నని జడభరతుడు రహూగణునకు చెప్పెను.

రహూగణుడు భరతునికి నమస్కరించెను. "దేహాభిమాన మనెడి సర్పము నా వివేకమును కాటు వేసినది. అమృత తుల్యమైన మీ మాటలు నన్ను పునర్జీవితుని గావించినవి. మహాత్మా! అమృతమయమగు ఈ ఆత్మ విద్యను అజ్ఞానినైన నా కొఱకు సులభతరము చేయుడు" యని ప్రార్థించెను. భరతుడు మఱల బోధించుట కుపక్రమించెను.

"రాజా! పాంచభౌతికమగు శరీరములే ఈ ప్రపంచమున తెలియుచున్నవి. రూపము లన్నియు మృత్తికా నిర్మితములే. పల్లకిని మోయు బోయీల దేహముల యందు మట్టియే యున్నది. వారు మోయు పల్లకి గూడ మట్టియే. ఆ పల్లకియందు ఆసీనమైయున్న సింధు దేశాధిపతి దేహము గూడా మట్టియే. ఆ మట్టి దేహమే తానని గట్టిగ నమ్మియున్న రాజు దేహాభిమానమనెడి రోగముచే బాధపడుచున్నాడు. ఇది యంతయు మిథ్యయే. మాయాకార్యమే" యనెను.

జగత్తు, ఉపాధులు సమస్తము మాయే యైనచో ఇక సత్యమెయ్యది? యనెడి శంక ఉదయించును. దానికి సమాధానము చెప్పుచున్నారు.

జ్ఞానం విశుద్ధం పరమార్థమేక మనన్తరం త్వ బహిర్బ్రహ్మ సత్యమ్
ప్రత్య క్ప్రశాన్తం భగవచ్ఛబ్ద సంజ్ఞం యద్వాసుదేవం కవయో వదన్తి ॥

"సత్యమైనది జ్ఞాన మొక్కటియే. అది నిర్మలమైనది. అతీతమైనది. సర్వగతమైనది. సర్వుల యందు భాసించుచున్నది. ఈ అద్వైతజ్ఞానము యొక్క సంపూర్ణరూపమే వాసుదేవుడు."

ఈ విధమైన అనిర్వచనీయ అద్వయజ్ఞానము సత్సంగము ద్వారానే లభ్యమగునని భరతుడు చెప్పుచున్నాడు. భాగవతోత్తముల పాదరజోభిషేకము లేనిదే తత్త్వజ్ఞానము అలవడదు యని చెప్పుచున్నాడు.

భాగవతుల సహచర్యము విషయ వార్తాప్రసంగము నంత మొందించును. లౌకిక వ్యవహారములను దూరము చేయును. భగవద్గుణాను కీర్తనము అవ్యాప్తమగును. పరమాత్మయందు నిర్మలమైన భక్తి కలుగును.

మహాత్ముల కడ శ్రవణము చేయనివానికి భక్తి కుదరదు. జ్ఞానులైన వారందరు గతంలో శ్రవణము ద్వారానే జ్ఞానము నార్జించిరి. ఋషులు కూడ వేదములను ప్రథమంగా ఆలకించిరి. అందుచేతనే అవి శ్రుతులని పిలువబడినవి.

శ్రవణము సంశయములను నివారించును. ఆత్మానాత్మ వివేకజ్ఞానము నందించును. మనస్సునకు స్ఫూర్తి నిచ్చును. బుద్ధికి దృఢత్వమును కల్పించును. శ్రవణము వలన భక్తి జ్ఞాన, వైరాగ్యము లేర్పడును. కామ క్రోధములు నిర్వీర్యమగును. భూతదయ కలుగును. పశ్చాత్తాపాది సుగుణములు యేర్పడును. హృదయము నిర్మలమగును.

అజ్ఞానాంధకారము నదృశ్యమొనర్చి జ్ఞానజ్యోతిని వెలిగించునది సత్పురుష సాంగత్యమే గనుక ప్రతి ఒక్కరు సత్సంగమును పొందియుండవలెను. సత్సంగము వాసుదేవుని యందు శుద్ధమగు ప్రేమను కల్పించును యని భరతుడు చెప్పెను.

సీ॥ ధరలోన బ్రహ్మంబు దపమున దానంబు లను గృహధర్మంబులను జలాగ్ని
సోమసూర్యులచేత శ్రుతులచే నైనను పరమభాగవతుల పాదసేవ
బొందిన మాడ్కిని బొందంగ రాదని పలుకుదు రార్యులు బరమమునులు
ఘనతపోబాహ్యసౌఖ్యములకు విముఖులు నయపుణ్యులు హరిగుణానువాద
తే॥ మోదితాత్ములు నగు బుధపాదసేవ ననుదినంబును జేసిన నంతమీద
మోక్షమార్గంబునకును బద్మాక్షునందు బట్టువడియుండు నెప్పుడు బరగ బుద్ధి.

"రహూగణ మహారాజా! పూర్వము నేను భరతుడను పేరుతో రాజనై యుంటిని. దృశ్య శ్రవణాదుల యందు మనస్సును లగ్నమొనర్చిన కారణముచే మృగమునై జన్మించితిని. చిరకాల సాధనలు ఈ దోష వర్తనము వలన మృగజన్మను ప్రసాదించినవి.

"రాజా! భగవత్కృప అపూర్వమైనది. అమోఘమైనది. మృగ దేహమును ధరించినను పరమాత్మ కృపచేత నా పూర్వస్మృతి మృతి చెందలేదు. అందుచేత జనసంగమునిన నాకు

భీతి గలిగెను. ఏకాకిగ, ప్రచ్ఛన్నముగ యుండి నా మనస్సును భగవచ్చరణముల యందు లగ్న మొనర్చితిని. రాజా! నీకు ఒక్క సత్యమును చెప్పెదను. దీనిని ప్రగాఢముగ విశ్వసింపుము.

శ్లో॥ తస్మాన్నరోఽసఙ్గ సుసఙ్గ జాత జ్ఞానాసి నైహైవ వివృక్ణ మోహః
హరిం తదీహా కథన శ్రుతాభ్యాం లబ్ద స్మృతి ర్యాత్యతిపార మధ్వనః

"రాజా! భాగవతోత్తముల సాంగత్యము వలన ఉదయించిన జ్ఞానమనెడి ఖడ్గముచే ఈ జన్మము నందే హరికథా శ్రవణ కీర్తనాదుల నాచరించి, సంసార మనెడి సాగరమును దాటి ఆవలి తీరమును చేరి తరించుము." అని భరతుడు పలికెను.

సంసారారణ్యము

ఆత్మ తత్త్వమును వివరించిన పిదప సంసారారణ్యమును గురించి భరతుడు వివరించు చున్నాడు. ఈ సంసారారణ్యమును దాటినవారే శాంతి ధామమును చేరుదురు. మార్గము తెలియని వాడు గమ్యమును చేరలేడు. మార్గము తెలియుటయే గాదు. మార్గముయొక్క తీరుతెన్నులు గూడ తెలియవలసి యుండును. ఇది భయంకరమైన అరణ్యము. భవారణ్యము.

సంసారమార్గము దుస్తరమైనది. సుఖాన్వేషులైన మనుజులు నలువైపుల చరించుచు, దారి తెలియక పరిభ్రమించుచు చివరికి సంసారారణ్యములో ప్రవేశింతురు. కానీ సుఖశాంతులను బొందలేరు.

సంసారారణ్యములో ఆరుగురు చోరులుందురు. వారే మనస్సుతో గూడిన పంచ జ్ఞానేంద్రియములు. సుఖము నార్జింపవలెనని వ్యాపారివలె చరించు వాని బుద్ధి యనెడి సారధి మైమరచి దారి దప్పి యుండుటను గాంచి ఈ ఆరుగురు చోరులు ఆ వణిజుని జ్ఞాన ధనమును హరింతురు.

అరణ్యములో తోడేళ్ళు మేకను హరించునట్లు సంసారారణ్యమున భార్యాపుత్రాదులు మనుజుని చిత్తమున ప్రవేశించి ఛిద్రము చేయుదురు.

సీ॥ ధరణీశ! మాయచేతను దాటగారాని పదమున బుట్టంగ బడ్డజీవు
డెలమిమై గుణకర్మముల జేయుచును లాభ మాశించి తిరుగు బేహారిమాడ్కి
ఫలమపేక్షించుచు బాయక జీవుండు సంసారగహనసంచారి యగుచు
ననవరతము నుండు నా మహావనమందు గామలోభాదితస్కరులు గూడి
తే॥ ధరణి విజితేంద్రియుడుగాని నరుని బట్టి ధర్మ మనియెడి యా మహాధనమువెల్ల
నరసి గొనిపోవుచుండుదు రనుదినంబు గాన సంసారమందు నాకాంక్షవలదు.

ఈ సంసారమనెడి వనమున అసంఖ్యాకమైన తీగలతో, తృణములతో నిండియున్న కూపమున్నది. అదియే గృహము. పైకి అందముగనే గోచరించును. నిరపాయముగనే కనిపించును. కాలుపెట్టగనే దిగబడిపోవును. కనుక భవారణ్యమున ఒంటరిగ పోరాదు. గతంలో ఆ దారిన వెళ్ళిన వారిని అనుసరించాలి. ఆ మార్గము వైకుంఠుని వద్దకు గొని పోవును.

హరివంశీ ముని గేలే గేలే ....

నామాచేని పాథెఁ జాతీల్ వైకుంఠె

"మహర్షులందరు హరినామమనెడి బాటలో సాగిపోయినారు. నామస్మరణ విష్ణు నారాయణుని చేర్చును" యని సంత్ నామదేవ్ మహరాజ్ గానం చేశారు.

భవారణ్యమున నిద్రపోలేరు. విశ్రాంతి లభించదు. కామ్యకర్మము లనెడి దోమలు సదా కుట్టుచుండునని భరతుడు చెప్పుచున్నాడు. విరామ మెరుగక తపించు ఈ బాటసారికి అక్కడ గంధర్వ నగరము గోచరించును. గంధర్వ నగరము అసత్యమైనదియే. అయినను సత్యము వలె గన్పట్టును. అలాగే భవారణ్యమున దేహాదులనెడి అనిత్య విషయాలు నిత్యములై గన్పట్టును.

సంసారమనెడి అరణ్యమున మనుజుని భీతికి గురిచేయు కొరివి దయ్యమున్నది. అదియే సువర్ణము. కలియుగములో కలి సువర్ణము నందుండును. దయ్యమెలా భయ పెట్టునో బంగారు అలా భయపెట్టును. దానిని సంపాదించుటలో బాధ కలదు. నిలువ చేయుటలో బాధ కలదు. పోతుందని బాధ, పోయినను బాధే. ఈ స్వర్ణము సుఖము నందించునా?

నిధి చాలా సుఖమా రాముని సన్నిధి సుఖమా నిజముగ బల్కు మనసా ॥

యని త్యాగరాజస్వామి నిలదీసి మనస్సును ప్రశ్నించాడు.

ధనముపై ఆశను వీడనిచో జీవికి శాంతి లభించదు. ధనాన్ని ప్రేమించి వచ్చేవారిలో ఆత్మీయులెవరో తెలిసికొనుట బహుకష్టము. ధనము లేనినాడు దరిచేరువారే నిజమైన ఆత్మీయులు. ధనము శ్రేష్ఠత్వమునకు చిహ్నముగాదు. ధనము మోసగాండ్ర వద్దయుండును. చోరుల వద్దకూడా యుండును.

అరణ్యమున చరించువాడు వాయువుచే చెదరగొట్ట బడిన ధూళిచే నేత్రములు కలుషితము కాగా ఎలా దారిని గాంచలేక పరిభ్రమించు చుండునో అలాగే సంసారారణ్య మున కామ సుడిగాలిచే లేచిన రజోగుణమనెడి ధూళి నేత్రములను కప్పివేయగా మనుజుడు చూడవలసిన దానిని చూడడు. వినవలసిన దానిని వినడు.

ఈ భవారణ్యమున కర్ణకఠోరమైన భయంకర శబ్దములు వినిపించు చుండును. అవి. దుర్జను లనెడి గుడ్లగూబలు పలుకు కఠోర దుష్టవాక్కులు. ఎంత వినగూడదని ప్రయత్నించినను ఈ ఘోరమైన శబ్దాలు వినిపించుచునే యుండును. భగవానుడు పలికే పోదు మనిషి కొక్కనికే ప్రసాదించాడు. పలుకును అమృతమయం చేసుకోవాలి. అది భగవన్నామమును నుచ్ఛరించుట వలననే లభిస్తుంది.

నిత్య నామ ఘోష్ జయాచే మందిరీ

తేచి కాశీపురీ తీర్థ్ క్షేత్ర్ ....

హరినామామృత్ సెవీ సావకాశ్ ....

"ఎవని గృహములో నిత్యము నామస్మరణము జరుగునో ఆ మందిరము కాశీ క్షేత్రముతో సమానము. అందుకని సావకాశముగా హరినామామృతమును పానము చేయుము" అని సంత్ ఏకనాథ్ మహారాజ్ తెలుపుతారు.

భవారణ్యమున సంచరించు మానవుడు ఆకలికి గురియగును. ఆకలి దీర్చుకొనుటకు అధర్మవృక్షము నాశ్రయించును. మానవుడు తన భుక్తి కొరకు అధర్మపరుల నాశ్రయించి, అట్టి పాప భోజనమును భుజించి మనస్సును పాడు చేసుకొనును.

ఒక్కొక్కసారి దాహముచే బాధపడుచు ఎండమావుల వెంట పరుగులిడును. తిరిగి తిరిగి అలసి పోవుటయే గాని దాహము తీరదు. సంసారబాధలు తీర్చుకొనుటకు లోభులనెడి ఎండమావుల నాశ్రయిస్తాడు. కానీ విఫలుడవుతాడు.

అరణ్యమున గజదొంగలు ధనమును హరింతురు. సంసారారణ్యమున బలవంతుడైన దొంగ సమస్తమును హరించును. అది గాంచి మనుజుడు దుఃఖితుడగును.

ఘోరమైన ఈ భవారణ్యమున గొప్ప గొప్ప పర్వతము లున్నవి. వాటిని అధిరోహించవలె నని ప్రయత్నించును. పాదరక్షలు లేని కారణాన కంటకములు గ్రుచ్చు కొనగ వ్యథ చెందును. సత్యమును దర్శింపవలెనని శాస్త్ర విషయములనెడి గిరులను ఎక్కుటకు ప్రయత్నించును. సహకరించువారు లేనందున సంశయము లనెడి కంటకముల పాలబడి దుఃఖించును.

ఈ విధముగా సంసారారణ్యమున పరిభ్రమించు వ్యక్తి నడచి నడచి అలసిపోయి నడువలేని స్థితిలో అతనిని కొండచిలువ కాటువేయును. సర్పదష్టుడై శవమువలె పడి పోవును. నిద్రయే కొండచిలువ. నిద్రించువాడు శవమువలె పడియుండును.

అరణ్య మధ్యమున తేనెపట్టులను గాంచి కొద్దిగ మధువును రుచి చూడవలెనని సమీపించును. అచ్చట తేనెటీగలచే కుట్టబడి దుఃఖము ననుభవించును. పరస్త్రీ లనెడి మధువును ఆశించి, ఆమె బంధుజన మనెడి తేనేటీగలచే బాధింపబడునని భావము.

"రహూగణ మహారాజా! నీవు కూడా ఈ భవారణ్యము నందే సంచరించు చున్నావు. దండించే కార్యమును విడనాడి ప్రేమించే బాటను ఎన్నుకో. విషయాసక్తిని వదలి నిర్విషయానంద సాగరములో ఓలలాడు. మాయాపాశమును ఛేదించి మాధవుని చేరి తరించు;" యని భరతుడు పలికెను.

జడభరతుని వాక్కుల నాలకించి పరవశుడైన రహూగణుడు "మహాత్మా! మహాత్ముల సాంగత్యము ఈ భూలోకముననే లభించును. కనుక ఈ మానవజన్మ పరమ ప్రశస్తమైనది. పవిత్రమైనది. సదా భగవంతుని స్మరించి తరించిన మీలాంటి మహాత్ముల చరణధూళి ఇక్కడే లభించగలదు. ఆ దివ్యమైన చరణ రజమును శిరమున ధరించిన

పాపి గూడ పవిత్రుడగును. బ్రహ్మాదులకు లభ్యముగాని శుద్ధభక్తిని బొందగలడు. మహాత్మా! నీ సాంగత్య భాగ్యము వలన నా కుతర్కమునకు కారణమగు అజ్ఞానము నశించినది. మహాత్మా! అజ్ఞానినై మిమ్ములను బాధించితిని. నన్ను క్షమింపుడు" అని రహూగణుడు భరతుని పాదములపై బడెను.

కII ధరణీసురవర! నీ శ్రీ చరణాంబుజయుగళరేణుసంస్పర్శము నా
దురితంబు లడచె నింతట హరిభక్తియు నంతకంత కధికం బయ్యెన్.


శుకబ్రహ్మ చెప్పుచున్నాడు: "పరీక్షిన్మహారాజా! భరతుని హృదయము నిస్తరంగ శాంతి సాగరము వలె నుండెను. రహూగణరాజు అవమాన పరచినను, స్తుతించినను ఆ రెండును అతని శాంతిని భగ్నము చేయలేక పోయినవి. రహూగణుడు పరమ భాగవతోత్తముడైన భరతుని వలన జ్ఞానమును బొంది దేహాత్మ భావమును త్యజించెను. రాజా! భగవత్పార్షదులైన భక్తుల చరణధూళి నాశ్రయించిన వారికే దేహాభిమానము తొలగును" అనెను.

ఈ సంసారారణ్యము యొక్క వివరణమును అందివ్వమని ప్రార్థించగా పదునాల్గవ అధ్యాయమున వివరించును. ఆ తరువాత భరతవంశ రాజులను గూర్చి తెలుపును. పోతనామాత్యుడు ఈ అధ్యాయము నుండి పంచమస్కంధము యొక్క ద్వితీయాశ్వాసము ప్రారంభమైనట్లు తెలుపుతాడు. ఇక్కడ నుండి తాత్త్వికవిషయములుగాని, కథలుగాని లేకుండా సామాన్యవిషయములు యున్నందున అలా భావించి యుండవచ్చును. ఈ కారణముగనే నేను గూడ పంచమ స్కంధమును ఇంతటితో సమాప్తి చేయుచున్నాను.

భరతవంశరాజుల చరిత్ర తరువాత భూగోళ వర్ణనము చేయబడినది. ఆ తరువాత గంగయొక్క స్తవము, మరియు సంకర్షణస్తవము చెప్పబడినవి. వివిధములైన వర్షములను వర్ణించుట, కిం పురుష భారత వర్షముల వర్ణనము, ఆఱు ద్వీపముల వర్ణనము, సూర్యుని రథ గమన వర్ణనము, గ్రహముల స్థితిగతుల వర్ణనము, శిశుమారచక్ర వర్ణనము, రాహువు మొదలగు గ్రహముల వర్ణనము, శ్రీసంకర్షణ స్తుతి, నరక వివరణము ఇత్యాది విషయములు చర్చింపబడినవి.

పంచమ స్కంధము సమాప్తము

.... ఓం ....



ఉపోద్ఘాతము

ఇది షష్ఠ స్కంధము.

"షష్ఠో భుజాన్తరమ్"

షష్ఠ స్కంధము భగవానుని యొక్క వక్షస్థలము యని చెప్పబడినది. ఈ స్కంధమున పందొమ్మిది అధ్యాయములు గలవు. ఈ పందొమ్మిది అధ్యాయములలో మూడు సాధన విషయములు చర్చింపబడినవి. 1) ధ్యానము 2) ఉపాసనము 3) సంకీర్తనము.

ధ్యానము పదునాలుగు అధ్యాయములలో ప్రస్తావించబడినది. జీవుని అజ్ఞానము పదునాలుగు దశలలో యుండునని శాస్త్రవచనము. అందుచేతనే అజ్ఞాన స్వరూపమైన రావణుని వధించుటకు రాముడు పదునాలుగు సంవత్సరములు అరణ్యమున తపస్సు చేసెను. ఐదు కర్మేంద్రియములు, ఐదు జ్ఞానేంద్రియములు మరియు మనో బుద్ధ్యహంకార చిత్తములనెడి అంతఃకరణ చతుష్టయము - ఇవియే అజ్ఞానము నిలువయుండు పదునాలుగు స్థానములు. ఈ పదునాలుగు చోట్లగూడ ధ్యానమే ప్రధానమై యుండవలెనని సూచించుటకు ఈ స్కంధమున ధ్యానము పదునాలుగు అధ్యాయములలో చర్చింపబడినది.

రెండవ సాధనాంగమైన ఉపాసనము రెండు అధ్యాయములలో చర్చింపబడినది. ఒకటి స్థూలమైన ఉపాసనము కాగా రెండవది సూక్ష్మమైన ఉపాసనమని చెప్పబడినది. అందుచేత ఈ ఉపాసన విషయము రెండు అధ్యాయములలో చర్చింపబడినది.

మూడవది నామ సంకీర్తనము. ఇది ముల్లోకముల యందును ప్రశంసనీయమైనది. అందుచేత మూడు అధ్యాయములలో వివరించెను. హరి నామము వలన పాపము ప్రక్షాళన మగుటయే గాక బుద్ధి శుద్ధిపడును.

కలి మహిమ వర్ణనాతీతము. ప్రయత్నాలు ఒకవైపు సాగుతూ ఉంటే ప్రమాదాలు మరొకవైపు ఎదురౌతుంటాయి. అగ్ని తృణరాశిని దగ్ధమొనర్చునట్లు భగవన్నామము పాపములను నశింపజేయును. ఈ విషయమును అజామిళోపాఖ్యానము అద్భుతముగ ప్రవచించును.

ఈ స్కంధమున వృత్రాసురుని చరిత్రము, అజామిళోపాఖ్యానము, దధీచి త్యాగము ఇత్యాది అమోఘమైన ప్రకరణము లున్నవి. కష్టములను రూపుమాపే ఈ షష్ఠ స్కంధమును సాధువులు బాగా ఇష్టపడుచుందురు.

చైతన్య భాగవతము

షష్ఠ స్కంధము

నరక నివారణము

పంచమ స్కంధమును సమాప్తి చేయుచు వివిధములైన నరకములను గూర్చి శుకబ్రహ్మ వివరించెను. అది విని పరీక్షిత్తుని మది కలత చెందెను. భరింపరాని ఘోర నరకములను గూర్చి ఆలకించిన తరువాత నరకానుభవము పరీక్షిత్తునిలో మహా భయమును కలిగించెను.

పాపమును గాంచి పుణ్యాత్ముడు భయపడును. పాపాత్ముడు స్వేచ్ఛగా పాపము ననుసరించును. అధర్మపరుడు, దురాచారవంతుడు పాపము కన్నను అన్యమైన దానిని చేయలేడు. పాపము వ్యక్తి శ్రేయమును పాడుచేయును. ప్రతిష్ఠను హరించును. అందుచేత పాపము చేయువాడు జాగరూకుడై యుంటాడు. పాపాచరణము నందున్న అవధానం పుణ్యాచరణము నందు గోచరించదు. తాత్కాలిక భోగములను వాంఛించి పాపకృత్యము లాచరించువారు శాశ్వతముగా దుఃఖముల ననుభవించుటను గాంచుచునే యున్నాము. పాపి భాగ్యహీనుడు. పుణ్యాత్ముడు భాగ్యవంతుడు.

పుణ్యేన వర్ధతే లక్ష్మీః పాపేన క్షీయతే ధృవం

"పుణ్యము వలన సంపద వృద్ధిచెందును. పాపము వలన తప్పక క్షీణించును"యని వేదప్రమాణము.

పరీక్షిత్తుడు పుణ్యాత్ముడు. పాపమును దలచి భీతిచెందుచున్నాడు. పాపాచరణము వలన కలిగెడి భయంకర నరకమున బడకుండా జీవించుటకు ఉపాయములను తెలుపు మని శుకబ్రహ్మను ప్రార్థించెను.

"రాజా! మనుజులు వాక్కు ద్వారా, మనస్సు ద్వారా, క్రియల ద్వారా అనేకములైన పాపములను చేయుచుందురు. ఈ పాపములను ప్రక్షాళనము గావించుకొనుటకు ధర్మ శాస్త్రము అనేక విధులను, ధర్మములను తెలిపియున్నది. వాటిని ఆచరించి పాపము లను పోగొట్టుకొని, నరకమును నివారింపవచ్చును. అలా ప్రాయశ్చిత్తకర్మముల నాచరింపని వారికి నరక యాతనలు తప్పవు" యనెను.

కర్మలు అజ్ఞాన జనితములు. ఇవి పరిమితమైనవి. ఆద్యంతములు గలవి. దోష యుతమైనవి. ఈ కర్మలయందు అభిక్రమనాశము, ప్రత్యవాయము అను రెండు దోషము లుండును.

రైతు పొలమును దున్ని విత్తనములను చల్లును. అవి మొలకలెత్తును. తదనంతరము తీసికొనవలసిన జాగ్రత్తలను తీసికోనిచో ఆ పంట పాడైపోవును. కనుక మధ్యలో ఆగిన కర్మ సత్ఫలితముల నివ్వదు. ఇది మొదటిది. ఇక రెండవ దోషమేమనగా రోగికి వైద్యుడు ఔషధము నొసంగును. రోగనిదానము నందు పొరపాటు జరిగినచో అట్టి ఔషధము ప్రతి కూల ఫలితముల నిచ్చే అవకాశముండును. కనుక కర్మ విషయమునందు జాగరూకులై యుండవలెను.

కర్మలు విరుద్ధ ఫలితముల నందించు నపుడు వాటిని క్రమపరచి, దోషమును నివారించుటకు ప్రాయశ్చిత్త కర్మలను కూడా వేదమాత తెలిసినది. ఉదాహరణకు ఒక విషయమును పరిశీలింతుము. ఒకవైద్యుడు రోగికి 'పెన్సిలిన్' ఇంజెక్షను నొసగెను. అదతనికి పరిపడలేదు. రియాక్షనిచ్చినది. వెంటనే వైద్యుడు 'అవిల్' ఇంజెక్షను నిచ్చుట జరిగినది. ఇదియే ప్రాయశ్చిత్తకర్మ యగుచున్నది. అనగా కర్మయందలి దోషమును నివారించుచున్నదియని భావము.

పాపము నాచరించిన వాడు ప్రాయశ్చిత్తమును చేసుకొనవలెను. కాలికి అంటిన బురదను నీటితో శుభ్రము చేసుకొనునట్లు, కర్మల యందలి దోషములను ప్రాయశ్చిత్త కర్మల ద్వారా పోగొట్టుకొనవలెను. అధర్మము నాశ్రయించి జనులు పాప కర్మల నొన రింతురు. ధర్మము నాశ్రయించి వాటిని పోగొట్టుకొందురు. "ధర్మేణ పాప మపనుదతి" ధర్మము చేతనే పాపము నశిస్తుంది యని తైత్తిరీయోపనిషత్తు ప్రవచించినది.

మహాత్ముడైన పరీక్షిత్తుడు శౌనకుని మెడలో మృతసర్పమును వేయడమనే పాప కృత్యమునకు ప్రాణమునే మూల్యముగా చెల్లింపవలసి వచ్చినది. పాపకార్యము భయం కరమైనది. అందుచేత పాపమన్నను, నరకమన్నను పరీక్షిత్తునకు ప్రళయము వలె తెలియు చున్నది. పాపమును జూచి భయపడువాడు లోకవంద్యుడగును. తన పాపమును గూర్చి సిగ్గుపడు మనుజుడు జగద్గురు వగును.

య ఆత్మనాఽపత్రపతే భృశం నరః స సర్వలోకస్య గురు ర్భవ త్యుత
అనన్త తేజాః సుమనాః సమాహితః స తేజసా సూర్య ఇవావి భాసతే

"పొరపాటున నైనను ఎవరయితే తన దోషములను గాంచి తానే సిగ్గుపడునో అట్టి నరుడు సర్వలోకములకు గురువగును. అనంత తేజముతో, గొప్పమనస్సుతో కూడిన వాడై అతడు సూర్యుని వలె ప్రకాశించును" యని వ్యాసభారతము నందున్నది.

"రాజా! మృత్యువాసన్నము గాక మునుపే, దేహమున పటుత్వము సడలక మునుపే పాపపరిహారార్థము ప్రాయశ్చిత్త మొనర్పవలెను. రోగగతి నెరిగి వైద్యుడు వైద్యము చేయునట్లు పాపగతి నెరిగి మనుజుడు ప్రాయశ్చిత్తములకై యత్నింపవలెను.

క॥ కాలం బెడగని పాపము మూలము జెఱుపంగవలయు మును రోగములం
దేలిన దోషము నెఱుగుచు వాలాయము దాని నడచు వైద్యునిభంగిన్

"రాజా! పాపము భయంకరమైనది. పాపము వలన రాజదండనమే గాక లోక నింద కూడా ఏర్పడును. కనుక పాపము శ్రేయము నొనగూర్చునది కాదని ప్రతిమనుజునికి తెలుసు. అయినను స్వభావముచేత ప్రేరితుడై పాపము లాచరించు చుండును. అట్టి వానిని రక్షించుటకై వేదము ప్రాయశ్చిత్త కర్మములను ప్రవేశపెట్టినది. ప్రాయశ్చిత్తము వలన మనుజుడు పాపవిముక్తుడగును. కానీ మళ్ళీ పాపము నాశ్రయించి, ఆచరించి భ్రష్టుడగును. అట్టివానికి ప్రాయశ్చిత్తము ఏ విధమైన ప్రయోజనమును కలిగించదు. అది గజస్నానము వలె నిరర్థకమగును" యని శుకుడు పరీక్షిత్తునికి దెలిపెను.

పాపములను మనుజులు ప్రక్షాళన మొనరించుకొనవలెను. అంతటితో పరిపోదు. మఱల ఆ పాపములను తిరిగి చేయకుండా ఉండాలి. ఆదివారము వరకు చేసిన పాప ములకు ప్రాయశ్చిత్తము జేసికొని, మరల సోమవారం నుండి పాపము లాచరించు వారికి సద్గతి లేదు. ఋణ విముక్తుడైన వాడు తిరిగి ఋణములను పెంచుకొన్నచో ఎలా సుఖించును? రోగ విముక్తుడైనవాడు తదనంతరము ఆరోగ్య సూత్రములను పాటించి వ్యాధిగ్రస్తుడు గాకుండా జాగ్రత్తపడవలెను.

ఈనాడు జనులలో పాపభీతి నశించింది. ఆత్మప్రీతి అధికమైంది. ఉత్తమమైన మానవజన్మను పొంది మోసాలతో, ద్రోహాలతో, హత్యలతో, మోహాలతో నరరూపరాక్షసుల వలె జీవించటం జరుగుచున్నది. రోజు రోజుకి పాపపర్వతాలు పెరుగుతున్నాయి. అన్యాయాలు, అక్రమాలు జనజీవనంలో సామాన్యమై పోయాయి. మంచి కుంచుక పోయింది. వంచనయే కర్తవ్యంగా మిగిలింది. మంచికి వారసులుగ మిగిలిన ఏ కొందరో ఈ పరిస్థితిని గాంచి వ్యథ చెందుతున్నారు.

The men and women we see in ourselves do not bear the impress of men and women; we are dragged through the world, we are harried, wrinkled, anxious, we all seem but the hacks of some invisible riders. How seldom do we behold franquility.

"ఈనాటి స్త్రీ పురుషులు వాళ్ళని వాళ్ళు తెలిసికొని జీవించలేకపోతున్నారు. ఈ ప్రపంచంలో మనమంతా జీవన కాడికి కట్టబడి ఈడ్వబడుతున్నాము. ముడతలు పడ్డ చర్మముతో వృద్ధాప్యాన్ని సమీపిస్తున్నాం. కనబడని గమ్యము వైపు అనిర్దిష్టమైన దారిలో దౌడు తీస్తున్న రౌతులం. ప్రశాంతతనే గాంచలేని స్థితిలో యున్నా" మని ఎమర్సన్ అభిప్రాయపడినాడు.

కర్మలు పరిమితములు. పరిమిత కర్మలు పరిమిత ఫలితముల నొసగుచుండును. అందుచేత సుఖప్రదములు గాకున్నవి. కల్లు కుండను కల్లుతో కడిగి శుభ్రము చేయలేని విధముగా, కర్మలను కర్మల ద్వారా శుద్ధిచేయలేము. ప్రాయశ్చిత్తము జరిగినంత మాత్రాన పాపాచరణము ఆగినదని భావించుటకు వీలులేదు. పాపము నాచరించు అజ్ఞానులే ప్రాయశ్చిత్త కర్మములను చేయుచున్నారు. పాపానికి ప్రాయశ్చిత్తము జరిగినదే గాని, అజ్ఞాన ముండుటచేత పాప ప్రవృత్తి నశించలేదు. పాప ప్రవృత్తులు అంతర్యంలో దోబూచు లాడుతుంటే పాపవృత్తులు బాహ్యంలో కదుల్తుంటాయి. కుంజర శౌచము వలె పాపము పునరావృతమౌతూ ఉంటుంది.

క॥ కర్మము గర్మముచేతను నిర్మూలముగాదు, తెలియనేరక తా నే
కర్మముసేసిన దత్ప్రతి కర్మంబొనరింపవలయు గలుషవిదూరా!

యని శుకుడు పలికెను. అజ్ఞానమును నివృత్తిచేయు జ్ఞానమే నిజమైన ప్రాయశ్చిత్తమనియు, దానివలననే మనుజుడు సంపూర్ణముగా పాపరహితుడగుచున్నాడు యని శుకబ్రహ్మ పరీక్షిత్తునకు దెలిపెను. నియమ మెరిగి జీవించువాడు నిర్మలుడై సదాచారసంపన్నుడగును. సదాచారమున శుద్ధిపడినవాడు జ్ఞానమునకు అర్హుడై, సర్వాత్మ భావముతో ప్రకాశించు ననెను.

వ్యాధి నివారకమగు ఆహారమును భుజించువానికి వ్యాధులు కలుగవు. ఆరోగ్యము సిద్ధించుచున్నందున పూర్వరోగములు కూడా తొలగిపోయే అవకాశము కలదు. అలాగే నియమము లెరిగి సదాచారవంతు లగువారు ఆత్మజ్ఞానమునకు అధికారు లగుచున్నారు.

మనోవాక్కాయ కర్మముల ద్వారా జీవులాచరించు పాపములను పోగొట్టుకొని శుద్ధి పడుటకు సాధనలను చెప్పుచున్నారు. తపస్సు, బ్రహ్మచర్యము, శమము, దమము, త్యాగము, సత్యము, శౌచము, యమ నియమాదులను ఎవరు చక్కగా అనుష్ఠింతురో అట్టివారు వెదురుపొదను అగ్నిదగ్ధము చేయునట్లు పాపమును హరింతురు యనెను.

చ॥ తపమున బ్రహ్మచర్యమున దానమునన్ శమసద్దమంబులన్
జపమున సత్యశౌచముల సన్నియమాదియమంబులం గృపా
నిపుణులు ధర్మవర్తనులు నిక్కము హృత్తమవాక్యజంపు పా
పపుగుది ద్రుంతు రగ్ని శతపర్వవనంబుల వేర్చుకైవడిన్.

తపము నెరిగినవాడు తాపము నెరుగడు. తపస్సు ద్వారా మనుజుడు శుద్ధిపడవలెను. అగ్ని స్వర్ణమును శుద్ధిపరచునట్లు, తపస్సు మనుజుని శుద్ధిచేయును. తపమాచరించువానికి బ్రహ్మచర్యము అనివార్యమని గ్రహించాలి. బ్రహ్మచర్య మనునది కేవలము దేహమునకే పరిమితమని భావింపరాదు. మనస్సులో ఏవిధమైన అశ్లీల చిత్రాలు కదలనివాడే నిజమైన బ్రహ్మచారి యగును. శమ మనెడి మనోనిగ్రహమును, దమ మనెడి ఇంద్రియ నిగ్రహమును పాటింపవలెను. ఈశ్వరార్పణ బుద్ధితో కర్మల నాచరించుటయే త్యాగ మనబడును. నిజము పలుకువాడే నిజవర్తను డగును. బాహ్యాభ్యంతరము లందు శుద్ధిపడి యుండవలెను. ఈ విధమైన జీవనము సదాచార మనబడును.

వ్యాసనందనుని వాక్కుల నాలకించిన పరీక్షిత్తుడు ఈ సారి తృప్తి చెందినట్లు తెలియుట లేదు. ఏదో వెలితి ఆయన ముఖములో ప్రస్ఫుటముగా గోచరించు చుండెను. వెదురుపొదను అగ్ని దహించివేయునట్లు సదాచారము పాపములను అంతమొందించును అని శుకుడు పలికెను. కానీ వెదురు పొదయొక్క మూలము పూర్ణముగా దగ్ధము గానిచో అది తిరుగ మొలకెత్తే ప్రమాదము గలదు. అలాగే ప్రాయశ్చిత్తాది కర్మలు, సదాచారాది గుణములు మనుజులను మరల పాపకూపములో పడదోయునేమో యనెడి సంశయము పరీక్షిత్తునకు కలిగెను.

పరీక్షిత్తుని సంస్కారమును గాంచి శుకుడు సంతృప్తి జెందెను. పరీక్షిత్తుని యందలి పాపభీతి శుకుని హృదయమును కదలించెను. గురుదేవుని హృదయమును పరవశింప జేయువారే నిజశిష్యులు. కలత పెట్టువారు ప్రారబ్ధ రూపాలు. పరీక్షిత్తుని శంకను నివారించి ఆయన హృదయమును శుకుడు నిర్మల మొనరించుచున్నాడు.

కేచిత్ కేవలయా భక్త్యా వాసుదేవ పరాయణాః
అఘం ధున్వన్తి కార్త్స్న్యేన నీహార మివ భాస్కర

"సూర్యుడు హిమరాశిని అదృశ్య మొనర్చునట్లు, వాసుదేవ పరాయణులగు ఏకాంత భక్తులు పాపములను ఛేదించు చున్నారు" యని శుకుడు పలికెను.

"**అగ్ని - వెదురుపొద**" దృష్టాంతముతో తృప్తిచెందని పరీక్షిత్తుడు "**ఆదిత్యుడు - హిమరాశి**" దృష్టాంతముతో తృప్తిచెందెను. భక్తి ద్వారా పాపము పూర్ణముగా నశించునని విని ఆనందించెను. పాపమును నశింపజేయుటకు తపస్సు కన్నను సత్సంగము ద్వారా లభించిన సద్భక్తియే ఉత్తమమైనదని శుకబ్రహ్మ పలికెను. భక్తి యోగము మహోత్కృష్టమైనది.

శ్రీకృష్ణుని దివ్యపాదారవిందముల యందు ఎవరికి చిత్తము లగ్నమగునో, శ్రీకృష్ణుని గుణకీర్తనాదుల యందు ఎవరి మనస్సు కొంచెమైనను లగ్నమగునో అట్టివారు మృత్యువును జయించుచున్నారని శుకుడు పలికెను.

చ॥ సతతము కృష్ణపాదజలజంబులయందు మనంబు నిల్పు సు
వ్రతులు దదీయశుద్ధగుణరాగులు గాలునియుగ్రపాశసం
హతులధరించు తత్పుభటకౌఘములం గలలోన గాన, రే
గతులను దుష్టకర్మములు గైకొని వారల జెందనేర్చునే?

అని పలికి నామవైభవమునకు దృష్టాంతముగా సర్వులు సాధారణముగా చెప్పెడి అజామిళుని వృత్తాంతమును శుకుడు తెలుపుచున్నాడు. సుఖావబోధార్థము ఉపాఖ్యానములు, ఉదాహరణములు తప్పక అనుసరణీయములని శ్రీశంకరులు భాష్యంలో తెలిపియున్నారు.

అజామిళోపాఖ్యానము

కన్యాకుబ్జమనే పురమున అజామిళుడను బ్రాహ్మణుడు వసించుచుండెను. అతడొక శూద్ర స్త్రీని పరిణయమాడెను. సదాచారమును పోగొట్టుకొనెను. జూదము నాడుచుండెను. మోసము చేయుటకు వెనుకాడకుండెను. దొంగతనము కూడా చేయుచుండెను. మోహ వలయములో చిక్కి అమంగళమైన జీవితమును గడుపుచుండిన అజామిళునకు యెనుబది సంవత్సరములు గడచిపోయెను.

అజామిళునకు పదిమంది పుత్రులు గలరు. వారిలో చిన్న పిల్లవాని పేరు నారాయణుడు. ఈ బాలుడు తల్లిదండ్రులకు అత్యంత ప్రియుడై యుండెను. ఆ పిల్లవాని వచ్చీరాని పలుకులు అజామిళునకు శ్రవణానందము నొనగూర్చుచుండెను. ఆ పిల్లవానితో క్రీడించుచు, భుజించుచూ కాలమును హరింపజేయుచుండెనే గాని మృత్యువాసన్న మగుచున్నదని గ్రహింపలేకుండెను.

భోజనన్ పాయయన్ మూఢో న వేదాగత మస్తకమ్

"ఆహార పానీయముల యందే మనస్సును లగ్న మొనర్చిన మూఢులు అంత్య కాలమును గూర్చి ఆలోచింపరు."

ఆహారము లేనిచో దేహము నశించును. పానీయము లేనిచో శరీరము అంతరించును. దేహరక్షణకు ఆహారపానీయములు అవశ్యములు. కానీ మనుజుడు వాటిని సంపాదించుట యందే కాలమును వృథాచేయకూడదు. దేహరక్షణము ధ్యేయమును సాధించుట కొఱకే గాని భోగముల ననుభవించుటకు కాదు. మోహప్రేరితుడైన మానవుడు భోగముల ననుసరించి పరుగు లిడుచుండునే గాని తనను వెంబడించి వచ్చుచున్న మృత్యువును గాంచడు.

అజామిళునకు మరణకాల మాసన్న మాయెను. కుమారుడైన నారాయణుని యందు అజామిళునకు అమితప్రేమ యుండెను. మరణము చేరువగుచున్న కొలది నారాయణుని

గూర్చి మనస్సు ఎక్కువగా ఆతురత చెందుచుండెను. ఈ లోగా పాశములను ధరించి, వక్రరూపధారులైన ముప్పురు యమదూతలు అజామిళుని ముందు సాక్షాత్కరించిరి.

ప్రాణమును గొనిపోవుటకు ముప్పురు యమదూత లరుదెంచిరి. స్థూల సూక్ష్మ కారణము లనెడి దేహత్రయముతో ఏర్పడిన తాదాత్మ్య భావనయే మృత్యువును అందించును. అందుచేత మూడు దేహములకు ప్రతినిధులుగా ముగ్గురు యమదూత లరుదెంతురు. అంతేగాదు. జీవుని సంసార చక్రమునకు బంధించునవి కర్మలే గనుక ఆగామి సంచిత ప్రారబ్ధము లనెడి కర్మత్రయమునకు ప్రతినిధులుగా ముగ్గురు యమదూతలు వత్తురు. అవస్థలలో తిరుగాడు జీవులకు స్వస్థత లభించదు. మరణము అనివార్యమగును. కనుక జాగ్రత్స్వప్న సుషుప్తులనెడి అవస్థాత్రయమే ముగ్గురు యమదూతలని భావింపవచ్చును.

యమభటులను గాంచగనే అజామిళుడు విహ్వలు డాయెను. మరణ మాసన్నమైనదని గ్రహించెను. పుత్రునిపై మమత ఎక్కువాయెను. భరింపరాని శోకముతో "నారాయణా! నారాయణా! " యని బిగ్గరగా కేకనైచెను. ఆ శబ్దమును విష్ణుదూతలు ఆలకించినారు. వెంటనే బయలుదేరి అజామిళుని వద్ద కరుదెంచినారు.

శ్రద్ధతో భగవన్నామము నుచ్చరించువారికి మొదట భక్తుల దర్శనమగును. తరువాత భగవంతుని దర్శనమగును. పరమ భక్తుడైన విభీషణుడు సదా రామనామమునే జపించుచుండెను. ఆ దివ్యాత్మునికి మొదట హనుమంతుని దర్శనము లభించెను. భక్తుడైన హనుమంతుని దర్శనము నాకు లభించినది గావున రామదర్శనము తప్పక కలుగును యని విభీషణుడు భావించెను. భక్తి వలన భగవంతుని కదలింప గలిగిన వారి చెంతకు మొదట భక్తు లరుదెంతురు. అలాగే నారాయణ నామమును అజామిళు డుచ్చరింపగనే విష్ణుపార్షదులు అతనిని సమీపించినారు.

యమదూతలు పాశమును ప్రయోగించిరి. విష్ణుదూతలు వారి ప్రయత్నమును నిరోధించిరి. యమధర్మరాజు యాజ్ఞను ధిక్కరించు మీరెవ్వరు? యని యమదూతలు విష్ణుదూతలనడిగిరి. వారికి విష్ణుదూతలు ఇలా సమాధాన మొసగిరి:

"యమ కింకరులారా! మీరు యమధర్మరాజు భృత్యులమని చెప్పుచున్నారు. మంచిది. మరి ఏది ధర్మము, ఏది అధర్మమో మాకు తెలుపుడు. మీరు దేని నాధారముగా గొని జీవులను దండించుచున్నారు? దండించుటకు కారణము ఏదిగా నుండవలెను? కర్మాచరణ చేయువారందరూ దండార్హులేనా? లేక కొందరు మాత్రమే శిక్షార్హులా?" యని ప్రశ్నించిరి. వారికి యమదూతలు ఇలా సమాధానము నొసగిరి:

వేద ప్రణిహితో ధర్మో హ్యధర్మ స్తద్విపర్యయః
వేదో నారాయణః సాక్షాత్ స్వయం భూరితి శుశ్రుమ ॥

"విష్ణు పార్షదులారా! దేనిని కర్తవ్యమని వేదము నుడివినదో అదియే ధర్మము. దానికి విరుద్ధమైన దేదైనను అధర్మమే. వేదము నారాయణ స్వరూపమనియు, అపౌరు

షేయ మనియు మేము ఆలకించి యున్నాము" అంటూ విష్ణు సేవకుల ప్రశ్నలకు సమాధాన మొసగిరి.

జీవుల కర్మములకు ఫలములు అనివార్యములు. జీవు లాచరించు సర్వకర్మములకు సాక్షులున్నారు. దండము నిచ్చుటకు వీ రాధారముగా యున్నారు. వారు ఎవరనగా 1. సూర్యుడు, 2. అగ్ని, 3. ఆకాశము, 4. వాయువు, 5. దేవతలు, 6. చంద్రుడు, 7. సంధ్యా కాలము, 8. పగలు, 9. రాత్రి, 10. దిక్కులు, 11. జలము, 12. పృథివి, 13. ధర్మము మొదలైనవి.

కర్మిష్టులైనవారెల్లరు దండన యోగ్యులే నని గ్రహించాలి. దేహధారులు క్షణమైనను కర్మను ఆచరింపకుండా ఉండలేరు. వారిలోని అసంపూర్ణ స్థితియే కర్మాచరణమునకు కారణమగుచున్నది. ఈ లోకమున ఏ విధమైన కర్మను జీవుడాచరించునో పరలోకమున ఆ విధమైన ఫలితమునే అనుభవించును. గతములో ఆచరించిన కర్మల యొక్క ఫలితములనే నేడు మన మనుభవించుచున్నాము.

మంచిబుద్ధి గలవారు దుఃఖము ననుభవించుటకు కారణమేమి? యని కొందరు ప్రశ్నించుచుందురు. వారు ఈ జన్మలో మంచివారుగా యుండవచ్చును. అంతమాత్రాన గత కర్మలు నశించునా? తత్సంబంధమైన కర్మానుభవము గతించునా? కర్మఫలములు అనివార్యములు. భూమిపై ఒక మొక్క లేచును. ఆ మొక్క ఎలా ఉద్భవించినది? ఆ భూమిలో దానికి సంబంధించిన బీజము ఉండుట వలననే అది మొక్కగా బహిర్గతమైనది. ఈ నాడు నేను మంచి ఆరోగ్యకరమైన ఆహారమును భుజించితిని. కానీ ఈ నాడు నా ఆరోగ్యము చెడినది అని ఒక వ్యక్తి యనును. ఆరోగ్యము చెడినది ఈ నాటి భోజనము వలన గాదు. నిన్నటి లేదా మొన్నటి భోజనము వలన గావచ్చును. గొలుసులాంటి బ్రతుకులో ఎక్కడ దోషముండినను దాని ఫలితము మరొకచోట తెలియుచుండును. ఈ సత్యమును మనుజులు గ్రహించలేరు.

యథాజ్ఞప్రమనసా యుక్త ఉపాస్తే వ్యక్తమేవ హి
న వేద పూర్వ మపరం నష్ట జన్మస్మృతి స్తథా ॥

"నిద్రించు వ్యక్తి స్వప్నదేహమునే నిజమని విశ్వసించును. జాగ్రదవస్థ యందలి నిజ దేహమునకు సంబంధించిన జ్ఞానము లేనివాడై యుండును. అలాగే గత జన్మ స్మృతులను తెలియని మనుజుడు ప్రస్తుత దేహము నందే ఆత్మబుద్ధినుంచును" యని యమ దూతలు చెప్పుచున్నారు.

సాలీడు తాను నిర్మించుకొనిన గూటియందు తానే చిక్కుకొని యుండులాగున, జీవుడు తాను తయారుచేసుకొనిన కర్మవలయంలో చిక్కుకొని విముక్తిని పొందలేక యున్నాడు. వెనుకటి సంస్కారముల ప్రభావముచే జీవుడు కర్మ సుడిగుండమున పరి భ్రమించుచున్నాడు. ప్రకృతి సంసర్గము వలననే జీవునకు సంస్కారములు లోనై సంసారమును సృష్టించుచున్నవి. భగవద్భక్తి సంసారమును నిస్సారమొనర్చి జీవుని సార రూపుడైన పరమాత్మయందు నిలిపమొనర్చును.

"విష్ణుదూతలారా! ఈ నాడు మా దండనమునకు గురియగుచున్న అజామిళుని పూర్వ వృత్తాంతమును గూర్చి చెప్పెదము. ఆలకింపుడు" యని యమదూతలు అజామిళుని గూర్చి చెప్పసాగిరి.

అజామిళుడు బ్రాహ్మణుడు. సత్కర్మవర్తనుడు. శాస్త్రజ్ఞానము నెరిగినవాడు. శాంతుడై, దాంతుడై, ధర్మసంశీలుడై యుండెను. సర్వవేదముల నభ్యసించెను. గురువులను సేవించెడివాడు. పెద్దలను గౌరవించెడివాడు. అతిథులను సత్కరించెడివాడు. సర్వ భూత హితుడు. అసూయా రహితుడు.

ఒకనాడు అజామిళుడు తండ్రి యాజ్ఞననుసరించి ఫలపుష్పాదులను, దర్భలను దెచ్చుటకు వనమునకు వెళ్ళెను. వాటిని సంగ్రహించి తిరిగి వచ్చుచుండెను. దారిలో ఒక సన్నివేశము నతడు చూచెను. ఒక భ్రష్టుడైన యువకుడు మద్యపానమును సేవించిన స్త్రీతో సిగ్గువిడిచి విహరించుచుండెను. వారిరువురు పరస్పర మోహితులై, నవ్వుచు, పాడుచు, ఆలింగనాదుల నొనరించుచుండిరి. మత్తులో యున్న ఆ స్త్రీ యొక్క వస్త్రము తొలగి పోయెను. ఆ కాముకుడు మూతలు పడుతున్న నేత్రములను ప్రయత్నముతో తెరచి, తన బాహువులలో ఆ కాముకిని బంధించెను. ఈ దృశ్యమును గాంచి అజామిళుడు వివశుడయ్యెను. మోహితుడయ్యెను. కామవశుడయ్యెను.

అజామిళుడు అయోమయ స్థితిలోపడెను. తనను తాను నిగ్రహించుకొనుటకు ప్రయత్నించెను. తాను నేర్చిన శాస్త్రజ్ఞానము నంతటిని మననము చేసికొనెను. బుద్ధి నుపయోగించి విచక్షణ చేయసాగెను. మోహవలయంలో చిక్కుకొని యున్న తన చిత్తమును ఆ సంకులము నుండి బహిర్గత మొనర్చుటకు తీవ్రముగా యత్నించెను. కానీ ఫలితము లేకపోయెను. ఇంద్రియ పెనుతుఫాను వీచినపుడు ప్రజ్ఞ యనెడి వృక్షము కూడా కూలిపోవును. ప్రయత్నములు సైతము ఫలించవు.

యతతో హ్యపి కౌన్తేయ పురుషస్య విపశ్చితః
ఇన్ద్రియాణి ప్రమాథీని హరన్తి ప్రసభం మనః

"అర్జునా! వివేకియైన పురుషుడు ప్రయత్నించు చుండినప్పటికి మథనము చేసెడి ఇంద్రియములు అతని మనస్సును బలవంతముగ హరించుచున్నవి" యని శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీత - సాంఖ్యయోగము నందు తెలిపియున్నాడు.

అజామిళుడు ఇంటి కరుదెంచెను. తండ్రికి ఫలపుష్పాదుల నిచ్చెను. కర్తవ్యముల నాచరించుటకు బూనుకొనెను. ఏ కార్యమునకు మనస్సు సహకరించుట లేదు. ప్రతి వస్తువు నందు ఆ వేశ్యయే గోచరించుచుండెను. అన్యులు పలికెడి మాటలు స్పష్టముగా తెలియ కుండెను. తన పలుకులను శ్రమతో కదలించవలసి వచ్చెను. క్షణమొక యుగముగా తెలియుచుండెను. అజామిళుడు బయలుదేరి ఆ వేశ్య నివసించెడి గృహమును చేరెను. విష్ణుసన్నిధి కేగెడి పాదములు వేశ్యగృహమున కేగినవి. విధి బలీయమైనది గదూ! విధి వక్రించినపుడు ఆకర్షణల రూపంలో అధోగతులు ప్రాప్తిస్తుంటాయి.

It is one thing to be tempted, another thing to fall.

"జీవితంలో ఆకర్షణ ఎక్కడ ఉంటుందో పతనమూ అక్కడే ఉంటుంది" అంటారు షేక్స్పియర్.

అజామిళుడు జీవితంలో ఒకేసారి అశ్లీలదృశ్యాన్ని చూసాడు. పాపకూపంలో దిగబడి పోయాడు. ప్రతి నిత్యము జనులెన్ని పాపపు దృశ్యములను, అశ్లీల చిత్రములను చూస్తున్నారో చెప్పసాధ్యము గాదు. చిత్తమును చలింపజేసే చలన చిత్రములను వీక్షించుట విధిగా భావించారు. కారణాంతరాల వలన బహుశ సినిమాలకు వెళ్ళలేక పోతారేమోనని "దూరదర్శన" రూపములో వాటిని ఇంటింటికి మోసుకొస్తున్నది అభివృద్ధి చెందిన సాంకేతిక విజ్ఞానము. మనస్సును ఉద్రేకపరచి, హృదయాన్ని కల్లోలపరచే అసభ్య సన్నివేశాలతో అంతఃకరణను పాడుచేస్తున్నాయి అశ్లీల చలన చిత్రములు. శీలాన్ని ఎండగట్టేందుకు వెండితెరలు, కళ్లలు నూరిపోసేందుకు బుల్లితెరలు - వీటి మధ్య మనిషి మనిషిగా ఎలా మనగలడు?

అజామిళుడు ప్రారబ్ధాధీనుడై అప్రయత్నంగా వీక్షించాడు. కానీ నేటి సభ్యమానవులు పురుషార్థమును కూడగట్టుకొని ప్రయత్నపూర్వకంగా ప్రతి ఆదివారము ఆదిమ మానవుని దర్శించాలని ఉబలాటపడుతున్నారు. ఈ దౌర్భాగ్యదృశ్యాల నుండి కనీసం సత్సంగ సభ్యులనైనా మరలించాలని భావించి ప్రతి ఆదివారము సాయంత్రము సత్సంగ కార్యక్రమమును నేను ఏర్పాటు చేశాను. బోధవలన ప్రభావితులై సత్సంగ సభ్యులైనారు గనుక వీరిని మఱలించడంలో బాధ ఉండదని భావించాను. ప్రయత్నం ఫలించినట్టే గోచరించింది.

కలి మహిమ వర్ణనాతీతం! ప్రయత్నాలు ఒకవైపు సాగుతుంటే ప్రమాదాలు మరొకవైపు ఎదురౌతుంటాయి. ఈ లోగా మరొక అవాంతరం అడ్డుదగిలింది. ఆదివారంనాడు బుల్లితెరపై చలనచిత్రప్రసారము. "స్వామీజీ! సత్సంగములో సంఖ్య తగ్గుతూ ఉంది. మరొక రోజుకు మార్చితే ఎలా ఉంటుంది?" అని సత్సంగ అధ్యక్షులు. "పోనివ్వండి. సాయంత్రానికి బదులుగ ఉదయమే సత్సంగాన్ని నిర్వహిస్తే ఎలా ఉంటుంది?" అని కొన్ని సత్సంగాల కార్యదర్శులు. చిత్రాలకు, వైచిత్ర్యాలకు చెదరిపోయే చిత్తాలకు చిత్స్వరూపం తెలిసి వస్తుందా?

మన మనస్సులోకి శనిగ్రహం ప్రవేశించేందుకు నేత్రములే ప్రధానద్వారములై యున్నాయి. నేత్రములలో అపవిత్రం చేరితే బ్రతుకే అన్యాయమైపోతుంది. కనుక అశ్లీల చిత్రాలను చూడరాదు. అసభ్యకరమైన చిత్రములను వీక్షించడము ఎంత ప్రమాదమో, అసభ్యవార్తలను పఠించడము కూడా అంతే ప్రమాదము. నవలలు, శృంగారమును వివరించే పత్రికలు చదువకూడదు. అసభ్యకరమైన దృశ్యాలు, అశ్లీల చిత్రాలు గోచరించినపుడు శ్రీకృష్ణుని రూపమును ధ్యానించాలి. నేత్రాలలో కృష్ణుడు నిలిస్తే తృష్ణ యనెడి శనిగ్రహం ప్రవేశించలేదు. రాముడున్నచోట కాముడు చేరలేడు.

అజామిళుడు వేశ్య గృహమునకు వెడలెను. ఆమె పొందును గోరి ఆమెకు దాసుడయ్యెను. సదా ఆ వేశ్యనే చిత్తమున నిలుపుకొని భ్రష్టుడయ్యెను. తండ్రి సంపాదించిన

ధనముతో ఆ వేశ్యను సంతృప్తి పరచుచుండెను. ఆవిడ అభిలషించు వస్తువులను గొని తెచ్చి, ఆవిడను సంతోషపెట్టుటకు నిరంతరము శ్రమించుచుండెను. శీలవతియు, నవయౌవనవతియు నగు భార్యను త్యజించి ఆ కులటతో కులుకు చుండెను. ఎంత శ్రమించినను వలయునంత ధనము లభింపకుండెను. అందుచేత అజామిళుడు అధర్మ మార్గములను గూడా అనుసరించి, ధనము నార్జింపసాగెను. ఈ విధముగా పాపకర్మముల చేత అతని జీవితమే పాపమయ మయ్యెను.

యమదూతలు విష్ణుపార్షదులతో ఇట్లుపలికిరి: "అజామిళుడు పాపము నాచరించినాడు. కానీ ప్రాయశ్చిత్త కర్మము నాచరింపలేదు. అందుచేత అతడు శిక్షార్హుడు. కనుక అతనిని దండధరుడగు యముని కడకు మేము గొనిపోవు చున్నాము. అచ్చట దండనమునుబొంది ఇతడు శుద్ధిపడును" యని పలికిరి.

"రాజా! ధర్మశాస్త్ర విదులగు విష్ణుదూతలు యమకింకరుల మాటల నాలకించి ఈ విధముగా పలికిరి" యని శుకబ్రహ్మ పరీక్షిత్తునకు చెప్పుచున్నాడు.

"ఆహా! ఎంత కష్టము వాటిల్లినది? ధర్మమూర్తులే అధర్మమును స్పృశించుచున్నారు. పాపరహితులకు దండనము విధించుచున్నారు. తండ్రి వలె వాత్సల్యముతో పాలింపవలసినవారు కర్కశముగ దండించుటకు సిద్ధపడితే ఇక ప్రజలకు దిక్కెవరు? అజామిళుడు పాపమునకు ప్రాయశ్చిత్తమును చేసికొనినాడు. ఒక్క జన్మలోని పాపమునకే గాక అనేక జన్మల యందు ఆచరించిన పాపకృత్యములకు ఏకముగా ప్రాయశ్చిత్తము గావించుకొనెను. పాపమునకు ప్రాయశ్చిత్తమే గాకుండా మోక్షమును గూడా ప్రసాదించు హరినామమును కీర్తించినాడు" అంటూ విష్ణుపార్షదులు అజామిళుని గూర్చి చెప్పసాగిరి.

అజామిళుడు తన కుమారుని "నారాయణా! నారాయణా! త్వరగా రమ్ము!" యని వాణ్యమైన నాలుగక్షరములతో పిలుచుచుండెను. నారాయణుని నామము నుచ్చరించుట చేత అనేక జన్మార్జిత పాపము కూడా నశించినది యని విష్ణుదూతలనిరి. సర్వపాపములను హరినామము పోగొట్టును. నామయోగి యైన వాని బాధ్యతను నారాయణుడే స్వీకరించుచున్నాడు. నామము ద్వారా ఏర్పడు నైర్మల్యము ప్రాయశ్చిత్తాది కర్మల ద్వారా లభించదు.

ప్రాయశ్చిత్త కర్మల వలన పాపములు నశించునే గాని అంతఃకరణశుద్ధి జరుగదు. సమకార్య మేర్పడదు. ప్రాయశ్చిత్త మొనరించిన పిదప మఱల చిత్తము పాపకూపమున ప్రవేశించే ప్రమాదము లేకపోలేదు. శ్రీహరి నామవైభవము అలాంటిది గాదు. హరినామము వలన పాపము ప్రక్షాళన మగుటయే గాక బుద్ధి శుద్ధిపడును. చిత్త సంశోధనము జరుగును.

"యమదూతలారా! అజామిళుడు మృత్యుముఖములో ప్రవేశించు సమయమున హరినామము నుచ్చరించెను. అది అతని సమస్త పాపములను హరించి వేసినది. అందువలన అతనిని మీరు నరకాది లోకములకు గొనిపోవుట సమంజసం గానేరదు. హరినామము నెలా పలికినను అది సద్యః ఫలితములనే ఒసంగును" అని విష్ణుదూతలనిరి.

ఆ॥ బిడ్డపేరు పెట్టి పిలుచుట విశ్రామ కేళినైన మిగుల గేలినయిన
బద్యగద్యగీత భావార్థముల నైన గమలనయను దలప గలుషహరము॥

విష్ణుపార్షదులు చెప్పుచున్నారు. ఎక్కువ పాపము నాచరించువారికి ఎక్కువ ప్రాయశ్చిత్తమును, తక్కువ పాపము నాచరించు వారికి తక్కువ ప్రాయశ్చిత్తమును మహర్షులు తెలిపి యున్నారు. కానీ హరినామము యొక్క వైభవము వేఱుగా యున్నది. నామము ద్వారా జరుగు ప్రాయశ్చిత్తమున ఈ వ్యత్యాసములు లేవు. హరినామ స్మరణము సర్వ పాపములను హరించును.

తైస్తా న్యఘాని పూయన్తే తపో దానవ్రతాదిభిః
నా ధర్మజం తద్ధృదయం తదపీ శాంఘ్రి సేవయా ॥

"తపస్సు, దానము, వ్రతము మొదలైన ప్రాయశ్చిత్త కర్మముల ద్వారా పాపములు నశించును. కానీ వాటివలన పాపకారణమగు చిత్తమాలిన్యము పోదు. శ్రీహరి చరణకమల సేవనమే ఆ దుష్ట సంస్కారమును దగ్ధమొనర్చును" యని విష్ణుదూతలు పలికిరి.

అగ్ని తృణరాశిని దగ్ధము చేయునట్లు భగవన్నామము పాపములను నశింపజేయును. మందు యొక్క ప్రభావము రోగికి తెలియకున్నను, దానిని సేవించగనే ఆ మందు ప్రభావము తెలియులాగున, అజ్ఞానముచే కీర్తింపబడినను భగవన్నామము తన ప్రభావమును వ్యక్త మొనర్చును. కనుక భగవన్నామము సర్వ పాపహరమై యున్నది. అదియును గాక ప్రమాదములకు గురియైనపుడు హరినామము నుచ్చరించినచో ఆయా గండముల నుండి విముక్తి లభించును.

పతిత: స్ఖలితో భగ్నః సన్దష్ట స్తప్త ఆహతః
హరిరిత్య వశేనాహ పుమార్ నార్హతి యాతనామ్

"ఎత్తయిన ప్రదేశము నుండి క్రిందపడినపుడు, జారిపడినపుడు, క్షతగాత్రుడైనపుడు, పాములచే కఱవబడినపుడు, రోగములచే పీడింపబడునపుడు, దెబ్బలు తగిలినపుడు "హరి" యని పలికినచో, ఆయా దారుణ దుఃఖములు హరింపబడును."

అవాంతరము లెదురైనపుడు అచ్యుతుని ఆశ్రయించాలి. చెట్టు నుండి క్రింద పడినపుడు గాని, ఇంటిపై నుండి పడినపుడు గాని, జారిపడినపుడు గాని "అయ్యో - అమ్మో" యని జనులు కేకలిడుచుందురు. అలా అరచుటవలన ఏ ప్రయోజనము ఉండదు. దానికి బదులుగ "హరి" యని భగవన్నామము నుచ్చరించినచో ఆ బాధ నివృత్తి యగును. అంతేగాదు. జీవితములో ఏ కష్టమెదురైనను ముందుగా భగవన్నామము ద్వారా భగవంతునికి నివేదించే ఉత్తమ గుణమును తయారుచేసుకోవాలి. ప్రారబ్ధవశాత్తు బాధలు ప్రాప్తిస్తాయి. ప్రారబ్ధాధీనులైన జీవులముందు విన్నవించుకొని పొందే లాభమేముంటుంది? కుంతీదేవిలాగ బాధలను శ్రీకృష్ణునికి నివేదించాలి. వ్యక్తిగత విషయాలను వ్యక్తులతో గాకుండా, అవ్యక్తుడైన పరమాత్మతో ముచ్చటించే సదలవాటును తయారు చేసుకోవాలి. మరి భగవంతునికి నివేదించాలంటే మనకు భాష ఏమిటి? ఏ భాషలో ముచ్చటించాలి? 'నామ' భాషలో ముచ్చటించాలి. నీ బాధలన్నీ అంతర్యామియైన పరమాత్మకు తెలుసు. నీవు చెప్పనవసరము లేదు. ఆ దివ్యాత్ముని కీర్తిస్తే చాలు. సూర్యుడు అంధకారమును అదృశ్యము చేయులాగున పరమాత్మ పాపములను, బాధలను హరిస్తాడు. విష్ణుదూతలు అజామిళుని మృత్యువునుండి కాపాడిరి.

మరణశయ్యపై పరుండి యుండిన అజామిళుడు విష్ణుదూతలకు, యమదూతలకు మధ్య జరిగిన సంవాదము నాలకించెను. వారిరువురు అదృశ్యమైరి. అజామిళుని హృదయములో పాపచింతనము కూడా అదృశ్యమైనది. దానిస్థానే పశ్చాత్తాపము చోటు చేసుకొనినది. పశ్చాత్తాప హృదయాలు పాప భారమును దించుకుంటాయి. పశ్చాత్తాపము పవిత్రమైన భావసంపద. ఎంతటి పాపదారిద్ర్యము నైనను అది పోగొట్టగలదు. కాని పశ్చాత్తాపము నొందిన తరువాత మఱల పాపము లాచరించువారికి సద్గతి కలుగదు.

అజామిళుడు పరితపించసాగెను. "నేను మహాపాపిని. మహాసాధ్వియగు భార్యను త్యజించితిని. వృద్ధులైన మాతాపితల ననాథులుగ జేసితిని. సురాపానము చేయు వేశ్యకు సంతానమును వృద్ధిచేసితిని. ఘోరకృత్యముల నాచరించి మహాపాపినైతిని. భగవత్కృపచే దివ్యాత్ముల సందర్శనమును, సంభాషణమును నేడాలకించితిని. ఎక్కడ? నన్ను బంధించి గొనిపోవుట కేతించిన పాశహస్తులగు పురుషులెక్కడికి వెడలినారు? నాకు విముక్తి నొసగిన భగవత్పార్షదులగు ఆ సుదర్శనులేరి?

ఉ॥ దారుణపాశబంధనవిధానములన్ నరకార్ణవంబులో
గూరిననన్ను వేడు పెడకుండ నొనర్చినపుణ్యమూర్తు లం
భోరుహనేత్రు లుజ్జ్వల నభోమణితేజులు లోచనోత్సవుల్
చారుదయానమంచిత విచారులు నల్వురు నెందు నేగిరో.

"నేను మహాపాపిని. అయినను విష్ణుదూతల దర్శనముచే నా చిత్తము ప్రసన్నమైనది. 'నారాయణ' నామామృతమును పానము చేయుటచేత మహాపాపియైన నాకు దివ్యాత్ముల దర్శనము లభించినది" యని అజామిళుడు పరితపించుచుండెను. పరమపావనమైన శ్రీహరినామమును పాపియైన తాను పలుకుటయా? యని అతడు విస్మయమొందుచుండెను. ఇచ్చట ఒక సత్యమును మనము గ్రహించాలి. పాపులైనవారు భగవన్నామము నుచ్చరించరాదని కొందరు పిడివాదములు చేయుచుందురు. పాపుల నుద్ధరించుటకే భగవన్నామ మున్నదనెడి సత్యమును గ్రహించలేరు. పశ్చాత్తాప హృదయుడైన అజామిళుడు కూడా అలాగే తలపోసెను.

క్వ చాహం కితవః పాపో బ్రహ్మఘ్నో నిరపత్రపః
క్వచ నారాయణేత్యే తద్భగవన్నామ మంగలమ్

"నేను వంచకుడను. పాపిని. బ్రాహ్మణత్వ నాశకుడను. సిగ్గును విడచినవాడను - అగు నే నెక్కడ? పరమపవిత్రమైన నారాయణ నామ మెక్కడ?" యని విస్మయ మొందుచు, ఈ భాగ్యము అపూర్వసుకృతి ఫలితమని గ్రహించెను.

పూర్వ పుణ్య విశేషము లేనివారు భగవన్నామము నుచ్చరింపలేరు. భజన జరిగే సందర్భాలలో కొందరు వ్యాపారంలో కోట్లు పోగొట్టుకున్న వారివలె నిర్వేదములో గోచరిస్తుంటారు. పెదవి విప్పరు. నామము పలుకరు.

కొందరు నామము జరుగుచున్నంతసేపు ఇష్టములేని వివాహములో పాల్గొనులాగున తలలు వంచుకొని కూర్చొని యుందురు. గతంలో ఏ భయంకర పాపము లాచరించిన దోషమో సిగ్గుతో తలలు అలా వంగిపోతుంటాయి. సరే! ఆ సమయంలోనే విచ్చిన్న కుంభకర్ణ సంజాతుల విషయము ఇక చెప్ప నవసరము లేదు.

నామము నుచ్చరించునవుడు మనలోని పాపములను పరమాత్మ దగ్ధము చేయు చుండును. పరమాత్మ కార్యోన్ముఖుడై యుండు సమయాన మనము అన్యస్మరణలను విస్మరించి శ్రీహరి యందే ధ్యానము నుంచాలి. కీర్తన జరుగునపుడు ప్రక్కవారితో ముచ్చ టించరాదు. ప్రాపంచిక విషయములను మనస్సులలో కదలకుండా జాగ్రత్తపడాలి. భక్తిలేని భజన ఎక్కువకాలం సాగకూడదు.

కీర్తన సాగుచున్నంతసేపు మనస్సు అన్యవిషయముల పైకి వెడలకుండా జాగ్రత్త పడాలి. మనస్సునకు అవగాహన కల్పించాలి. చెడుమార్గముల నన్వేషించుటలో కలిగే కీడును వివరించి చెప్పాలి. సంకీర్తనే సన్మార్గమని తెలియజేయాలి. సంస్కరింపబడిన చిత్తమే సంకీర్తనలో తృప్తి చెందగలదు.

వినవే ఓ మనసా - వివరంబుగ నే దెల్పెద ॥వినవే॥
మనసెరింగీ కుమార్గమున - మరి పొరలుచు చెడవలదె ॥వినవే॥
యీ నడతలు పనికిరాదు ఈశ్వరకృప కలుగబోదు
ధ్యాన భజనసేయవె వర - త్యాగరాజు మనవి ॥వినవే॥

యని ప్రపంచమును త్యజించి, నామ యోగములో పరమాత్మను స్మరించి తరించిన నాదబ్రహ్మోపాసకులు త్యాగరాజస్వామి తెలిపియున్నారు.

కనుక పాపమును జూచి భయపడనవసరము లేదు. పరమ పావనమైన భగవన్నామ ముండగా పాపమును గూర్చి చింతింప నవసరము లేదు. అజామిళుడు పాపియైనను నామోచ్చారణతో పునీతుడయ్యెను. శ్రీహరి పతితపావనుడు. పతితు లుండబట్టే గదా! భగవానుడు పతిత పావనుడైనాడు. ఈ విషయమును సంత్ తులసీదాస్ మహాశయుడు ఒక కీర్తనలో అద్భుతంగా కీర్తిస్తాడు. ఈ కీర్తనలో అజామిళోపాఖ్యాన మంతయు మనకు కళ్ళముందు గోచరించును.

మై హరి పతిత పావన సునై
మై పతిత తుమ్ పతిత పావన్ దో ఉ బానక బనై ॥మై హరి॥
వ్యాధ గనిక గజ అజామిళ సాఖి నిగమని బనై
బిర్ అధమ్ అనేక తారే జాత కాపై గనై ॥మై హరి॥
జాని నామ్ అజాని లీన్హే నరక సురపుర మనై
దాస తులసీ శరణ ఆయో రాఖియే అపనై ॥మై హరి॥

"భగవానుడు పతిత పావనుడని నేను విన్నాను. నేను పతితుడను. నా స్వామి పతిత పావనుడు. ఆహా! ఎంతచక్కని సంబంధము కలిగినది? గనిక, గజేంద్ర, అజామిళాది

ఎందరో పాపులను భగవానుడు ఉద్ధరించినట్లు శాస్త్రము ప్రవచిస్తున్నది. ఎందరో పాపులు భగవానుని అనంత కృపారసమునకు పాత్రులైనట్లు తెలియుచున్నది.

"భగవన్నామమును అజ్ఞానముచే నుచ్చరించిననూ నరక ద్వారమునుండి బయట పడి స్వర్గమును ప్రవేశింతురు. ప్రభూ! నీ నామ ప్రభావము నెరిగి నేను నీ పాదముల నాశ్రయించినాను" యని తులసీదాస్ గానం చేశాడు.

పశ్చాత్తాప హృదయుడైన అజామిళుడు దేహేంద్రియ మనోబుద్ధులను నిగ్రహించుకొని మోహము నుండి విడివడవలెనని సంకల్పించెను. సదా భగవచ్చింతనము నందే నిమగ్నుడై యుండవలెనని నిర్ణయించుకొనెను. అజామిళుడు ఈ క్రింది విధముగా తనలో తాను చింతించెను.

"విషయములు విషతుల్యములు. దేహాభిమానమే భోగాసక్తికి కారణమగుచున్నది. భోగముల యందలి ఆసక్తి కర్మల నాచరింప జేయుచున్నది. కర్మలు జీవుని జన్మచక్రము నకు బంధించు చున్నవి. ఈ బంధము నుండి నేను విముక్తుడ నయ్యెదను. మాయయే వారాంగన రూపమున అరుదెంచి నన్ను వశపరచుకొనినది. అధముడనైన నేను మాయకు లొంగినాను. భామకు బానిస నయ్యాను. ఇక నేను మాయకు లోనుగాకుందును. భోగా సక్తిని త్యజింతును. సర్వులను ప్రేమింతును. సర్వభూత హితుడనయ్యెదను. కరుణా హృదయముతో మెలిగెదను. భగవద్ధ్యానము నందే చిత్తము నుంచెదను. అసత్యములను పలుకను. అన్యాయములను చేయను. అధర్మముల నాచరింపను. అహంకారమును వర్జిం తును. మమకారమును త్యజింతును. మాధవనామ స్మరణలో మైమరచి యుందును" అని భావించెను. అజామిళుని యందుకలిగిన ఈ పరివర్తనము సాధుసాంగత్య ఫలమేనని శుకుడు కీర్తించుచున్నాడు.

ఇతిజాత సునిర్వేదః క్షణ సంగేన సాధు షు
గంగాద్వార ముపేయాయ ముక్త సర్వాను బంధనః

"క్షణమాత్రపు సాధుసాంగత్య ప్రభావముచే అజామిళునకు చక్కని నిర్వేద ముదయించినది. సమస్త బంధములనుండి విడివడి హరిపాదములను చేరుట జరిగినది" యని శుకబ్రహ్మ పరవశించి ప్రవచించెను.

అజామిళుడు దృఢమైన నిర్ణయములను గైకొనెను. వ్రతనియమము లేని వాని వ్రతము నిష్ఫలమగును. ఆచరణ రహితుడు ఆధ్యాత్మిక మార్గమున ప్రగతిని సాధించ లేడు. ప్రతి ఒక్కరు అజామిళుని వలె జీవితములో కొన్ని నిర్ణయములను తీసుకోవాలి. వాటిని క్రమము తప్పకుండా ఆచరించాలి. అట్టివారికే భగవత్కృప లభించును.

అజామిళుడు ఒక దేవాలయమునకేగి అచ్చట ఆసీనుడై భక్తి చేయనారంభించెను. ఆలయములో భగవద్దర్శనము చేయు పుణ్యకార్యము నెప్పుడూ విడనాడగూడదు. భగవంతుని మరచి జీవించిన నరులు భగవానుని ఎదుట పశ్చాత్తాప హృదయంతో నిలబడి బుద్ధిని శుద్ధిచేసుకోవాలి. భగవానుడు అంతటా యున్నాడు గనుక ఆలయ సందర్శనము అనవసర మనెడి శుష్కవాదములు పలుకరాదు.

అజామిళుని మనస్సు నిగ్రహింపబడెను. ఇంద్రియములు అరికట్టబడెను. చిత్తము పరమాత్మ యందే లగ్నమై యుండెను. దేహాధ్యాసను విడచినవాడై, సదా సర్వగతమైన ఆత్మయందే మనస్సును నియమించెను. వాసనలు నిస్సారమయ్యెను. తత్ఫలితముగ విషయాలు నిర్వీర్యములాయెను. ప్రతివస్తువు నందును అజామిళునకు నారాయణుడే గోచరించుచుండెను.

ఒకనాడు ప్రకాశరూపులైన పురుషులు తన ఎదుట నిలబడిరి. యమదూతలు పాశ హస్తులై తనను సమీపించినపుడు ఎవరయితే తనను రక్షించిరో వారే ఈ నాడు వచ్చిన వారని అజామిళుడు గుర్తించెను. వెంటనే శిరమువంచి వారికి నమస్కరించెను. వెంటనే దేహమును విసర్జించెను. దివ్యదేహము నొకదానిని పొందెను. అతనికొరకై గొనిరాబడిన సువర్ణ విమానము నెక్కెను. ఆకాశమార్గము గుండా శ్రీహరి దివ్యసన్నిధికి చేరెను. మహాత్ముల సాంగత్యము పాపియైన అజామిళునికి విష్ణు సాన్నిధ్యమును ప్రసాదించినది. సత్సంగ ప్రభావము వర్ణింప నలవిగానిది.

క॥ హరిభక్తులతో మాటలు ధర నెన్నడు జెడనిపుణ్యధనముల మూటల్
వరముక్తికాంతతేటలు, పరిషద్వర్గంబు చొరని యరుదగుకోటల్.

అని అజామిళుడు భావించెను. ఆ సత్యమును తన జీవితమున దర్శించెను.

అజామిళుని వృత్తాంతము ప్రతిజీవియొక్క వృత్తాంతమేయని తెలియవలెను. "అజ" మనగా పుట్టుకలేనిది. అదియే మాయ. మాయకు అస్తిత్వము లేదు. అభాసయే గాని ప్రభావ మెరుగదు. అట్టి మాయతో కలసినవాడు అజామిళుడు. మాయాలోలుడు మాయా కార్యములనే చేయును. అలాగే అజామిళుడు జార చౌర్యాది నికృష్ట కార్యముల నాచరించి భ్రష్టుడయ్యెను.

పతితుడైన అజామిళుడు భగవన్నామము నాశ్రయించెను. పాపములను క్షాళన మొనర్చుకొనెను. దృఢభక్తితో పరమాత్మను కీర్తించెను. తరించెను. "అజ" మనగా పుట్టుక లేనిది గనుక మాయ యనెడి భావమును పైన గ్రహించినాము. ఇపుడు "అజ" మనగా పరమాత్మయని గ్రహింపవలెను.

అజో నిత్య శ్శాశ్వతోఽయం పురాణో న హన్యతే హన్యమానే శరీరే

"ఆత్మ అజము. నిత్యము. శాశ్వతము. పురాణము. దేహము నశించినను ఆత్మ నశించదు" యని శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీత - సాంఖ్యయోగమున తెలిపెను.

అజామిళుడు పావనమగు సంకీర్తనము ద్వారా బ్రహ్మముతో సంబంధమును పొందెను. భోగాసక్తి యున్నంతవరకు అజామిళుడు మాయనంటి జీవుడై యుండెను. కీర్తనాదుల ద్వారా శుద్ధిపడిన చిత్తము పరమాత్మయందు నిలువగనే అజామిళుడు బ్రహ్మ యుతుడై తరించెను.

ముక్తిని గోరు మనుజులకు భగవన్నామ కీర్తనమే సర్వశ్రేష్ఠమై యున్నది. వివిధములైన ప్రాయశ్చిత్త కర్మములద్వారా చిత్తము తాత్కాలికముగ శుద్ధియైనను మరల రజ

స్తమోగుణములచే మలిన పడవచ్చును. కానీ నామము ద్వారా శుద్ధిపడిన చిత్తమును ఇక ఏ మలినము అంటనేరదు. అందుచేత నామ సంకీర్తనమునకు మించిన సాధన మరియొక టుండదని శ్రీశుకుడు తెలిపెను.

నాతః పరం కర్మ నిబన్ధ కృన్తనం ముముక్షతాం తీర్థపదాను కీర్తనాత్

"కర్మ బంధములనుండి విముక్తిని గోరు ముముక్షువులకు తీర్థపాదుడగు భగవానుని సంకీర్తనము గాక శ్రేష్ఠమగునది మరియొకటి లేదు" యని శ్రీశుకుడు ప్రవచించెను.

యముడు చెప్పిన నియమము

"మునిశ్రేష్ఠా ! యమదూతలు అజామిళుని గ్రహింపలేకపోయిరి గదా! అది వినిన యమధర్మరాజునకు ఆగ్రహము కలుగలేదా? నిగ్రహమును కోల్పోవక యుండెనా? యముని యాజ్ఞ తిరస్కరింపబడినందుకు క్రుద్ధుడు గాకుండెనా? యమదూతలు యమునితో ఏమి చెప్పిరి? వారికి యముడు యేమి చెప్పెను? తెలుపవలసినది" యని పరీక్షిత్తుడు శుకబ్రహ్మ నడిగెను. యముడు తన దూతలతో సంభాషించిన విషయమును శ్రీశుకుడు చెప్పుచున్నాడు.

యమదూతలు యముని సన్నిధికి చేరిరి. జరిగిన విషయము నంతటిని నివేదించిరి. వారి సంశయములను గూడ యమునికి తెలిపిరి. "దేవా! యమధర్మరాజా! ఈ విశ్వములో దండధారులెందరు? శాసనకర్త లెందరు? కర్మఫలముల నొసగు వారెందరు? కర్మఫలముల నొసగువారు అనేకులున్నచో వారిలో ఒకరి భావములు మరొకరి భావములతో ఏకీభవించక పోయినచో జీవులకు లభించెడి కర్మఫలములు తారుమారగును. ఒకరు శుభమును ప్రసాదించినచో మరొకరు అశుభమును అందించే ప్రమాదము లేకపోలేదు. ఒకవేళ వ్యక్తులు వేరైనను శాసనములు వేరుగానందున అభిప్రాయ భేదములకు తావు లేదని మీరు చెప్పవచ్చును. భేదాభిప్రాయములు అపసవ్యఫలము నందించునట్లే ఏకాభిప్రాయము అధికఫలమునకు కారణము గావచ్చును గదా! ఒకే కార్యమునకు ఇరువురు శాసనకర్తల నుండి రెండు ఫలితములు అందవచ్చును గదా! కార్యము లసంఖ్యాకము లైనందున అనేకుల ప్రమేయము అవసరమని భావించినచో అందులో దోషము లేక పోవచ్చును. ఎందరు శాసకులున్నను ముఖ్యశాసనకర్త ఒక్కడే ఉండవలెను గదా!

"ప్రభూ! ఇంతవరకు ఈ అభిప్రాయమును కలిగిన మేము తమరొక్కరే ముఖ్య శాసనకర్తలని భావించితిమి. కానీ ఇపుడు లోకపు తీరు మారినది. తమ యాజ్ఞలను ప్రజలు గ్రహింపని స్థితి తటస్థించినది. తమరి యాజ్ఞానుసారము మేము ఒక పాపిని యాతనా గృహమునకు దెచ్చుచుంటిమి. ఈలోగా అచ్చటికి దివ్యపురుషులు కొందరు వచ్చి, పాశములను ఛేదించి అతనికి విముక్తిని ప్రసాదించిరి. మేము ఆ పాపిని పట్టుకోగానే అతడు "నారాయణా! నారాయణా! త్వరగా రమ్ము!" యని అరచెను. వెంటనే ఆ దివ్య పురుషులు "**మాభై ర్మాభైః**" (భయపడకు, భయపడకు) యని అభయము నొసగుచు

అచ్చుటికి విచ్చేసిరి. అతనిని విడిపించిరి. ప్రభూ! వారెవరు? ఈ విషయమును మాకు తెలుపుడు" యని యమభటులు యమధర్మరాజు నడిగిరి.

దూతల మాటల నాలకించగనే యమధర్మరాజు భక్తితో చలించెను. 'నారాయణ' నామము చెవిని బడగనే దేహమంతయు కంపించెను. మనస్సు పరవశించెను. కొన్ని నిముషములు నిశ్చేష్టుడాయెను. నిర్మల హృదయుడై నేత్రములను మూసి నారాయణుని పాదపద్మములను ధ్యానించి, ఆ తరువాత దూతలతో ఇట్లు పలికెను:

"కింకరులారా! నన్ను సర్వశ్రేష్ఠునిగ మీరు భావించుట ఉచితముగాదు. నన్ను మించిన శ్రేష్ఠుడు గలడు. అతడు సర్వదేవతల కీశ్వరుడు. త్రిమూర్తులు అతని యంశ భూతులు. సమస్తము అతని యధీనమునందే యున్నది. అట్టి వాసుదేవ పరబ్రహ్మమును కీర్తించుటయే ఈ జగత్తులో ఉత్తమ ధర్మమైయున్నది. నామవైభవమును అజామిళుని చరిత్రయే తెలుపుచున్నది గదా! కనుక నామసంకీర్తన చేయు భక్తులు నా దండనకు అర్హులుగారు. వారిని పాప మంటదు. కనుక జీవితములో ఎవరయితే భగవన్నామమును కీర్తింపరో, వాసుదేవుని చరణకమలములను అర్చింపరో, స్మరింపరో అట్టి వారిని నా వద్దకు తీసుకొని రండి" యని పలికి, తెలియక దూత లొనరించిన పాపమునకు క్షమింపుమని యమధర్మరాజు నారాయణుని ప్రార్థించెను.

సీ॥ ఎకసక్కెమున కైన నిందిరారమణుని బలుకంగలేని దుర్భాషితులను
గలలోననైన శ్రీకాంతునిపత్పాద కమలముల్ సూడని కర్మరతుల
నవ్వుచునైన గృష్ణప్రశంసకు జెవి దార్పనేరని దుష్కథాప్రవణుల
యాత్రోత్సవంబుల నైన నీశునిగుడి త్రోవ ద్రొక్కగలేని దుష్పదులను
ఆ॥ బరమభాగవతుల పాదధూళి సమస్త తీర్థసార మనుచు దెలియలేని
వారి వారివారి వారి జేరినవారి దొలుత గట్టి తెండు దూతలార!

అని యమధర్మరాజు దండనమున కర్హులగు వారిని గూర్చి తెలిపెను.

శుకుడు చెప్పుచున్నాడు: "పరీక్షిన్మహారాజా! శ్రీ మహావిష్ణువు యొక్క కీర్తనము విశ్వ మంగళకరము. నామ సంకీర్తనము చేయువారికి దృఢమైన భక్తి ఏర్పడును. రాజా! యమధర్మరాజు వలన ధర్మరహస్య మెరిగిన యమదూతలు ఆనాటినుండి విష్ణుభక్తులను స్పృశించుటలేదు. నేను నీకు చెప్పిన ఈ శుభకర చరితమును పూర్వము అగస్త్యమహర్షి మలయగిరిపై నాకు తెలిపెను" యనెను.

దక్ష ప్రజాపతి నారదుని శపించుట

" శుకదేవా! స్వాయంభువ మన్వంతరమున దేవ, అసుర, మానవ, నాగ, మృగ, పక్ష్యాదులతో గూడిన సృష్టిని గూర్చి మీరు వివరించియున్నారు (తృతీయ స్కంధమున). దానిని పూర్ణముగా వినవలెనని యున్నది. దయచేసి తెలుపుడు" యని పరీక్షిత్తుడు శుకుని అర్థించెను.

శుకబ్రహ్మ చెప్పుచున్నాడు. ప్రాచీనబర్హికి ప్రచేతసులను నామముగల పదిమంది కుమారులుండిరి. నారదుని యుపదేశమువలన విరాగియైన ప్రాచీనబర్హి తపస్సు నాచరించుటకు వనముల కేగెను. ప్రజాపతియగు ప్రాచీనబర్హి అడవుల కేగుటవలన భూమండలమంతయు కల్లోల మాయెను. వ్యవసాయాది కర్మలు కరువైనవి. భూమి యంతయు తరువులచే నిండిపోయెను. ఈ విపత్తును గాంచిన ప్రాచీనబర్హి కుమారులగు ప్రచేతసులు క్రుద్ధులై తరువులను దగ్ధముచేసిరి.

చెట్లన్నీ నశించుచుండెను. అది గాంచి చంద్రుడు ప్రచేతసులకు దర్శనమొసగి, వారి కోపమును ఉపశమింప జేయుటకు ప్రయత్నించెను. "ప్రచేతసులారా! తరువులను దగ్ధముచేయుట సముచిత కార్యము కానేరదు. పాలకులైన మీరు విధ్వంసకాండకు పాల్పడుట సబబుగాదు. ప్రజలకు ఆహారము లభించుటకు భగవానుడు ద్రుమములను సృష్టించెను. ప్రజల ఆహారమును పాడుచేయుట ప్రజాపతులకు తగునా?

అన్నం చరాణామచరా హ్యపదః పాదచారిణామ్
అహస్తా హస్త యుక్తానాం ద్విపదాం చ చతుష్పదః

"చరించని ఫలపుష్పాదులు చరించే తుమ్మెదలకు ఆహారము. పాదములు లేని తృణాదులు పాదచారులగు పశువులకు ఆహారము. చేతులు లేని మృగాదులు హస్తములుగల పులులు మొదలైన వానికి ఆహారము. చతుష్పాదులగు జంతువులు ద్విపాదులగు మనుజులకు ఆహారము.

"పుణ్యాత్ములారా! ప్రజాసృష్టికై వినియోగపడవలసిన మీరు ద్రుమములను దగ్ధమొనర్చి, జీవులకు ఆహారమును లేకుండా చేయుట సబబుగాదు. మీ పూర్వుల వలెనె మీరు గూడ కోపమును త్యజించి, సాధువర్తనులై మెలగుడు. ప్రజల క్షేమమును రాజులే కాపాడవలెను. పిల్లలను తల్లిదండ్రులు పోషింపవలెను. నేత్రములను రెప్పలు కాపాడవలెను. భార్యను భర్త రక్షింపవలెను. బిచ్చగాళ్ళను గృహస్థులు ఆదరించవలెను. అజ్ఞానులకు జ్ఞాని అండగా నిలువవలెను. ప్రజలకు రాజుయే నిజ బంధువై నిలువవలెను.

ఉ॥ తప్పక యర్భకావళికి దల్లియు దండ్రియు, నేత్రపంక్తికిన్
ఱెప్పలు, నాతికిం బతియు, ఱేడు ప్రజావళి కెల్ల, నర్థి కిం
పొప్ప గృహస్థు, మూఢులకు నుత్తము, లెన్న సమస్తబాంధవుల్
ముప్పున గావలేని కడు మూర్ఖులు గారు నిజాలచుట్టముల్.

"కనుక ప్రజలకు సంబంధించిన తరువులను నశింపచేయుట మీకు తగదు. ప్రచేతసులారా! క్రోధము మనుజులకు సామాన్యమైన విషయము. అట్టి క్రోధమును విచారము ద్వారా ఎవ్వరు నిగ్రహించు కొందురో వారు మహాత్ము లనబడెదరు. సంసార సాగరమును దాటెదరు.

" నా మాటను విశ్వసింపుడు. వృక్షములను నశింపజేయకుడు. ఈ వృక్షములచే పోషింపబడిన "మారిష" యను కన్యారత్నమును మీ కొసగెదను. ఆమెను పత్నిగా

స్వీకరించి శాంతింపుడు" యని చంద్రుడు వారిని శాంతింపజేసెను. వారు పదుగురు ధర్మానుయాయులై ఆ మారిషను పరిణయమాడిరి.

రేషతీతి రిషః........................ రిష హంసాయామ్ మా రిషః

"హింసించనివారు........................ లేదా హింసను నివారించువారు "మారిషు" లని భావము.

'మారిష' అహింసకు ప్రతీకము. తరువులను హింసించు ప్రచేతసులు 'మారిష' ను వివాహమాడిరి. అనగా అహింస నవలంబించిరని భావము. ప్రాచీనబర్హి పుత్రులగు ప్రచేతసులు పదుగురు కలసి మారిషను పరిణయమాడిరి. చెట్లను దగ్ధమొనర్చెడి హింసా కార్యమును సాగించుచుండిన పదుగురు పరిణయ మాడుటలో గల అంతర్భావమును గ్రహింపవలెను.

మనము దశేంద్రియముల ద్వారా హింస చేయుచుందుము. అశ్లీల దృశ్యములను నేత్రములు వీక్షించును. దుష్టవాక్కులను నోరు పలుకును. దుర్భాషలను చెవులాలకించును. హస్తములు చెడుకార్యములను చేయును. నాసికము దుర్గంధమును ఆఘ్రాణించును. చర్మము చెడును స్పృశించును. వెళ్ళగూడని చోటికి పాదములు గమించును. మధు మాంసాదులను నాలుక అనుభవించును. ఈ విధముగా దశేంద్రియముల ద్వారా మనుజులు హింసకు అలవాటుపడి యుందురు. ఈ దశేంద్రియముల ద్వారా అహింసను పాటించుటయే పదిమంది ప్రచేతసులు మారిషను వివాహ మాడుటలోని అంతర్భావము. ఎవరి ఇంద్రియములు హింసను విడనాడునో వారు ధన్యాత్ములై తరింతురు.

ఇంద్రియాణాం నిరోధేన రాగద్వేష క్షయేన చ
అహింసయా చ భూతానా మమృతత్వాయ కల్పతే

"ఇంద్రియములను నిగ్రహించుట చేతను, రాగద్వేషములను నశింపజేయుట చేతను, అహింస నవలంబించుట చేతను మనుజుడు మోక్షమును పొందుచున్నాడు" యని నారద పరివ్రాజకోపనిషత్తు ప్రవచించినది.

మారిషకు పదుగురి ప్రచేతసుల వలన ఒక బిడ్డడు కలిగెను. అతడే ప్రాచేతసుడు. వానినే దక్షుడందురు. ఈ దక్షుడు సృష్టించిన ప్రజలచే త్రిలోకములు పూరింపబడినవి.

దక్షునిచే సృష్టింపబడిన ప్రజలు వృద్ధి పొందకపోయిరి. కారణము తెలియకుండెను. దక్షుడు పర్వత ప్రాంతమున కేగి కఠోర తపమాచరించెను. "హంస గుహ్య" మను స్తోత్రము ద్వారా శ్రీహరిని స్తుతించెను. దక్షుని తపస్సుచే తృప్తిచెందిన శ్రీహరి దక్షునికి ప్రత్యక్షమాయెను. ప్రజోత్పత్తికై దక్షుడు తపస్సు చేయుటచే తాను ప్రీతి జెందినట్లు శ్రీహరి తెలిపెను.

సమాజపరముగా ఎవరు శ్రమింతురో, లోకకల్యాణమునకు ఎవరు కృషి చేయుచుందురో అట్టి వారి యెడల శ్రీహరి ప్రీతిగలవాడగును. శ్రీహరి దక్షుని కోర్కెను మన్నించెను. అతనిని ఆశీర్వదించెను. సర్వభూతములు సమృద్ధి పొందునట్లు దీవించెను.

శ్రీహరి యాజ్ఞానుసారము "అసిక్ని" యనెడి కన్యను వివాహమాడిన దక్షప్రజాపతికి హర్యశ్వులను పదివేలమంది కుమారులు గలిగిరి. ప్రజాసృష్టి కార్యమున వారిని దక్షుడు నియమింపగా, హర్యశ్వులు నారాయణ సరోవర తీర్థమునకు వచ్చిరి. ఆ జలమును స్పృశించగనే వారి హృదయము నిర్మలమాయెను. వారి బుద్ధి పరమాత్మయందు తీవ్రముగ లగ్నమగు చుండెను. కానీ సృష్టికార్యమును నిర్వహింపమని తండ్రియగు దక్షుడు తెలిపెను. కార్యాకార్యముల యందు సముచితరీతి నెరుగని దక్షకుమారులు తీవ్రముగా తపస్సు చేయసాగిరి.

ఒకనాడు నారదుడు వారివద్దకు అరుదెంచెను. దక్షకుమారులతో ఇలా పలికెను: "హర్యశ్వులారా! మీరు ఈ భూప్రపంచము నంతటిని జూడలేదు. ఇచ్చట విచిత్రమైన రాజ్యమున్నది. దాని యందు ఒక పురుషుడే యుండును. అచ్చట ఒక బిలమున్నది. దాని నుండి బయల్వెడలుటకు మార్గము లేదు. అచ్చట ఒక స్త్రీ యున్నది. ఆమె చిత్ర విచిత్రములైన రూపములను ధరించు చుండును. అచ్చటయున్న పురుషుడే ఆమె భర్త. అచ్చట ఒక నది ప్రవహించు చుండును. అది రెండు వైపుల ప్రవహించుచుండును. అచ్చటయున్న గృహము ఇరువది యైదు వస్తువులచే నిర్మింప బడియున్నది. అచట ఒక హంసయున్నది. అది అనేక విధములుగ శబ్దము చేయుచుండును. అచ్చట పై భాగమున కత్తులతో, వజ్రములతో తయారైన చక్రము ఒకటి తిరుగుచుండును. వీటిని మీ రెప్పుడైనను చూచితిరా? ప్రపంచమునకు సంబంధించిన జ్ఞానమే లేని మీరు సృష్టి నెలా వృద్ధి పరచగలరు? తండ్రియాజ్ఞ నెలా పాలించగలరు?" యనెను.

నారాయణ సరోవర తీర్థమును స్పృశించుటచేత నిర్మలహృదయులై యున్న హర్యశ్వులు తమలో తాము విచారించుకొనిరి. బుద్ధి శుద్ధి పడినవారికి విచారమునందు జగద్విలక్షణ మేర్పడును. నారదుడు తెలిపిన కూట ప్రశ్నలకు సమాధానములను వారు ఆంతర్యము నుండియే అందుకొనిరి.

నారదుడు తెలిపిన విచిత్రమైన రాజ్యమెక్కడో లేదు. అదియే మానవ ప్రపంచమని గ్రహించిరి. విరాడ్రూప చైతన్యమే అక్కడ తెలియు పురుషుడు. అజ్ఞానమే బిలము. దాని నుండి బయటపడుట కష్టము. మాయయే అచ్చటయున్న స్త్రీ. మాయయనెడి స్త్రీ చిత్ర విచిత్రములగు రూపములను ధరించును. మాయకు వశుడైన జీవుడే ఇచ్చట పురుషుడైనాడు. అచ్చట రెండువైపుల ప్రవహించు నది ఏదియోగాదు. ప్రవృత్తి, నివృత్తులనెడి రెండు విధములైన వేదోక్త ధర్మము. హంస యనగా ప్రతివ్యక్తి హృదయాంతరాళము నుండి స్ఫురించే అనాహత ధ్వని. ఈ ప్రపంచమున కత్తులతో వజ్రములతో తయారైన చక్రము ఒకటి తిరుగుచుండునని నారదమహర్షి చెప్పెను. అదియే కాలచక్రము. జీవులను ఏ క్షణము నందైనను కబళించు మృత్యుపాశము.

ఈ విధమైన శుభకర సమాధానములను పొందినవారై హర్యశ్వులు భక్తిభావముతో నారద మహర్షికి ప్రదక్షిణ మొనరించిరి. ప్రేయస్సును త్యజించి శ్రేయస్సు ననుసరించిరి. ప్రవృత్తిని విడచి నివృత్తి వెంట నడచిరి. మోక్షప్రియులైరి.

తండ్రియగు దక్షుని యభీష్టము నెరవేర దాయెను. తండ్రి యాజ్ఞను పాలించుటలో వారు విఫలులైరి. ఈ వార్తను నారదుడే దక్షునకు తెలిపెను. దక్షుడు దుఃఖము ననుభవించెను. బ్రహ్మదేవుడు దక్షుని ఓదార్చెను. దక్షుడు మరల వేయిమంది కుమారులకు జన్మనిచ్చెను. వారిని సబలాశ్వు లందురు.

దక్షుడు పుత్రులను పిలిచెను. హర్యశ్వుల నాదేశించినట్లే సృష్టికార్యమును వృద్ధి చేయుమని సబలాశ్వులను కూడా ఆదేశించెను. తండ్రి యాజ్ఞను పాలించుటకై సబలాశ్వులు బయలుదేరిరి. వారు గూడ తమ యన్నలవలె నారాయణ సరోవరమునకే అరుదెంచిరి. ఆ పవిత్ర జలమును స్పృశించగనే వారి హృదయము కూడా మలరహితమాయెను.

సబలాశ్వులు కూడా తపస్సు చేయ నారంభించిరి. కొన్ని మాసములు కేవలము నీటిని మాత్రమే త్రాగుచు తపస్సు చేసిరి. కొన్ని మాసములు కేవలము వాయువు మీదనే ఆధారపడి కఠోర తపమాచరించిరి.

ఓం నమో నారాయణాయ పురుషాయ మహాత్మనే
విశుద్ధ సత్త్వధిష్ఠ్యాయ మహాహంసాయ ధీమహి

"విశుద్ధ సత్త్వ గుణముల కాశ్రయుడును, పరమహంస స్వరూపుడును, మహా పురుషుడును అగు నారాయణునకు నమస్కారము. మేము ఆయనను ధ్యానించుచున్నాము." అని పలికి తపస్సు చేయసాగిరి.

పూర్వమువలె మరల నారదు డరుదెంచెను. "దక్షపుత్రులారా! మీకు నేనొక సన్మార్గమును తెలుపుచున్నాను. నా ఉపదేశము నాలకింపుడు. మీరు మీ యన్నలయందు ప్రేమ గలిగియున్నారు. అందుచేత మీ యన్నల దారిలోనే మీరూ చరింపుడు.

భ్రాతౄణాం ప్రాయణం భ్రాతా యోఽను తిష్ఠతి ధర్మవిత్

"ఎవడు ధర్మము నెరుగునో వాడే అగ్రజుల దివ్యమార్గము ననుసరించును" అని పలికి నారదుడు వెడలెను. సబలాశ్వులు గూడా హర్యశ్వుల మార్గమునే అనుసరించిరి. భక్తి మార్గము ననుసరించిరి. విరక్తులై విష్ణుదేవుని ధ్యానించసాగిరి. భగవత్కృపకు పాత్రులైరి. అందుచేత వారు గూడా తండ్రి యాజ్ఞను పాలింపలేనివారై, గడచినరాత్రి తిరిగిరాని విధమున ఇంటికి చేరరైరి.

దక్షుడు తీవ్రముగా కలతచెందెను. పూర్వమువలెనే ఇప్పుడు కూడా తన పుత్రులను నారదుడు నాశము చేసెనని గ్రహించెను. నారదునిపై క్రోధము అధికమయ్యెను. క్రుద్ధుడైన దక్షప్రజాపతి వెంటనే నారదుని సమీపించెను. ఇలా నారదుని శపించెను:

"నారదా! నీవు పాపివి. నీవు సాధువేషమును ధరించిన వంచకుడవు. నా బిడ్డలను సన్యాసులను జేసి నా హృదయమును భగ్నమొనర్చితివి. బ్రాహ్మణులు జన్మించగనే మూడు విధములుగ ఋణగ్రస్థులై యుందురు. అవియే 1. ఋషి ఋణము, 2. దేవ ఋణము, 3. పితృ ఋణము. బ్రహ్మచర్యము ద్వారా ఋషి ఋణము నుండి విముక్తులు కావలెను. యజ్ఞముల ద్వారా దేవఋణము నుండి విముక్తి నొందవలెను. సంతానోత్పత్తి ద్వారా పితృఋణము నుండి విముక్తు లగుదురు. ఈ ఋణత్రయము నుండి నా బిడ్డలు విముక్తులు గాలేకపోయిరి. ఈ దురదృష్టమున కంతటికి నీవే కారణము. వారిని భ్రష్టులను గావించితివి.

"ఈ విధమైన దుష్టకర్మలద్వారా నీవు నీ ప్రభువైన నారాయణుని కీర్తికి గూడా కళంకమును దెచ్చుచున్నావు. నా బిడ్డలు పసిబాలురు. బిడ్డల హృదయాలను నీ సన్యాసి మాటలతో బండలుగా మార్చావు. కారుణ్యాన్ని అదృశ్యం చేశావు. కాఠిన్యాన్ని మారిపోశావు. నీకు దయలేదు. దాక్షిణ్యము లేదు. ధర్మము తెలియదు. న్యాయము అర్థం గాదు. ఇలాంటి నీవు లజ్జాహీనుడవై భక్తుల మధ్య తిరుగుతుంటావు. భక్తులందరూ కరుణామయులై యుందురు. నీకొక్కనికే జగడముల యందు మోజు, బాంధ్యవములను నాశనము చేయుటలో రివాజు లెక్కువగా యున్నవి.

"వైరాగ్యము వలన జ్ఞానము కలుగునని నీ అభిప్రాయమా నారదా? ఓ కపటీ! అదే నిజమైనచో నీవు ఈ వేషము నెందులకు ధరించితివి? వైరాగ్యవంతుడవై తపస్సు చేయ గూడదా? అవివేకీ! విషయానుభవము దుఃఖము నందించు ననుమాట సత్యమే. కానీ ఆయా దుఃఖముల ననుభవించుట చేతనే జీవులలో నిర్వేద మధికమగును. స్వానుభవము వలన కలిగిన వైరాగ్యము స్థిరముగా యుండునే గాని నీలాంటివారి బోధలవలన కలిగే వైరాగ్యము మతాబుల కాంతివలె అదృశ్యమగును.

"మేము గృహమేధులము. ప్రవృత్తి రూపమగు కర్మమార్గమున చరించువారము. నీవు మా విషయమున అనవసర జోక్యమును కల్పించుకొని నా పుత్రులను పాడుచేసితివి. గతములో ఒకసారి సహించితిని. ఇప్పుడు కూడా అదే విధమైన అశుభమును నా కుటుంబమునకు కలుగజేసితివి. పుత్రనాశకా! ఇదిగో శాపమును గ్రహింపుము.

"తస్మాల్లోకేషు తే మూఢ న భవేద్భ్రమతః పదమ్

"మూర్ఖుడా! నీవు దేశదిమ్మరి వయ్యెదవుగాక! నీకు ఎక్కడా స్థానము లభింప కుండుగాక!" యని దక్షుడు నారదునికి శాపమొసగెను.

"దక్షుని శాపమును నారదుడు స్వీకరించెను. రాజా! నీ వాక్కు సత్యమగుగాక!" యని నారదుడు దక్షుని ఆశీర్వదించెను. తిరిగి శాపమిచ్చుటకు శక్తి గలవాడైనను నారదుడు సహనమును ప్రదర్శించెను" యని శ్రీశుకుడు పరీక్షిత్తునకు దెలిపెను.

ప్రతీకారము పామరుల లక్షణము. సహనము సాధుజన సౌశీల్యము. ప్రతీకారమునకు పగ యొక్కటి చాలు. క్రోధమొక్కటి చాలు. కానీ ద్వేషించిన వానిని ప్రేమించుటకు సౌజన్యముండాలి. హృదయ సంస్కారముండాలి. శాపమిచ్చిన వానిని మహాత్ముడే ఆశీర్వదించగలడు.

మన సంప్రదాయములో శాపములు గూడ విచిత్రంగా ఉంటాయి. క్రుద్ధులైన పెద్దలు పిల్లలను "నీ కర్మ కాలిపోను" యని శాపము పెడుతుంటారు. "నీ తల్లికడుపు మండిపోను" అని పూర్వము బిడ్డలను శపిస్తుండేవారు. ఎంతటి భావ సౌందర్యము! కర్కశమైన ఆ కఠోర వాక్కుల వెనుక ఎంతటి కారుణ్యము! "నీ కర్మ కాలిపోను" అన్న

మాటలో ఎంతటి గంభీర భావమున్నది! జ్ఞాన మనెడి అగ్నియే కర్మలను దహింపగలదు. కర్మలుకాలుట యనగా జ్ఞానవంతుడవు కమ్ము యని భావము.

అలాగే తల్లికడుపు మండిపోవుట. మండిన కడుపు పండదు. ఆమెకు శిశు జన్మ లేదు యని అర్థము. మోక్షమును పొందునని భావము. నారదుని విషయములో గూడ దక్షుని శాపము అలాగే పరిణమించినది. "నీకు ఎక్కడా స్థానము లభింప కుండుగాక!" యని దక్షుడు శపించెను. ఎక్కడా లభించనిచో పరమాత్మ వద్దనే లభించునని భావము. నారదుడు అలాగే నారాయణుని యందే సదా చిత్తము గలవాడయ్యెను. అంతేగాదు. తన నాశ్రయించిన వారలను గూడా తరింపజేయు వాడయ్యెను. ఈ కారణముగనే ఆయన నారదుడని పిలువబడెను. **"నారం దదాతీతి నారదః"** జ్ఞానమును ప్రసాదించువాడు నారదుడని భావము.

సాధువులు లోక సంచారులే గదా! వారి సంచారము లోక కల్యాణము కొరకే యుండును. సాధుమహాత్ముల పాదపద్మముల చెంత సర్వతీర్థములు సేదదీరి యుండును. దక్షుడు ఇచ్చిన శాపమును నారదుడు ప్రశాంతముగ స్వీకరించెను. అవగాహన లోపించిన సమాజము సాధువులను హింసించినను సాధుమహాత్ములు సహనమును పోగొట్టుకొనరు. ప్రారబ్ధ ఫలములని సరిపెట్టుకొందురు. ధీరులై యుందురు. అందుచేత పొంగు నభిలషించరు. కృంగు నంగీకరించరు.

సుఖం చ దుఃఖం చ భవాభవౌ చ లాభాలాభౌ మరణం జీవితం చ
పర్యాయశః సర్వమేతే స్పృశన్తి తస్మాద్ధీరో న చ హృష్యేన్న శోచేత్

"సుఖదుఃఖాలు, శుభాశుభములు, లాభనష్టములు, చావుబ్రతుకులు యనునవి ప్రతి ఒక్కరిని వంతులవారీగా కలియుచుండును. కనుక ధీరుడైనవాడు ఈ అనివార్యమగు విషయము నందు పొంగరాదు. కృంగరాదు" యని మహాభారతము తెలిపినది.

దక్షుడు తదనంతరము అరువది మంది కుమార్తెలను గనెను. వారిలో పదిమందిని ధర్మదేవత కిచ్చెను. పదముగ్గురిని కశ్యపున కిచ్చెను. ఇరువదియేడు మందిని చంద్రున కిచ్చెను. భూత అంగిరస కశాశ్వులు ముగ్గురికి ఇద్దరిద్దరు చొప్పున ఆరుమంది నొసగెను. మిగిలిన నలుగురిని తార్క్ష్యున కిచ్చెను. వారి బిడ్డలు, మనుమలే త్రిలోకముల యందును వ్యాపించియున్నారు.

కృత్తికాది తారలు చంద్రుని భార్యలు. చంద్రుడు రోహిణిపై ఎక్కువగ ప్రేమను జూపుచు మిగిలినవారిని త్యజించెను. వారందరు తండ్రియగు దక్షునికి వారి దుస్థితిని గూర్చి మొరపెట్టుకొనిరి. చంద్రుని ప్రవర్తనకు క్రుద్ధుడైన దక్షప్రజాపతి "క్షయరోగపీడితుడ వగుదువు గాక" యని చంద్రుని శపించెను. అందుచేత చంద్రునకు సంతానము లేదు. తదనంతరము చంద్రుడు వినమ్రుడై దక్షుని ప్రార్థించగా దక్షుడు ప్రసన్నుడాయెను. చంద్రునికి కళలను ప్రసాదించెనేగాని సంతానము నొసగలేదు.

భేద దర్శనము అమంగళమైనది. దేహమునకు కుష్టువు ఎంత ప్రమాదమో, మనస్సునకు భేదమంత ప్రమాదము. భేదదృష్టి గలవారు వికృతులగుదురు. అభేదదృష్టి బ్రతుకులో అందమును నింపును. ఆనందమును దింపును.

దేవగురువుగా విశ్వరూపుడు

ఒకనాడు దేవరాజగు ఇంద్రుడు సింహాసనముపై ఆసీనుడై యుండెను. దేవగణము లచే పరివృతుడై యుండెను. ఆ సమయమున ఇంద్రునకు ఆచార్యుడు, సర్వులకు వందనీయుడు, మునిశ్రేష్ఠుడు, దేవగురువువైన బృహస్పతి అచ్చటి కరుదెంచెను. ఐశ్వర్యముచే మదోన్మత్తుడైన ఇంద్రుడు గురువును గౌరవించ కుండెను. లేచి నిలబడి స్వాగతము పలుకకుండెను. ఆరాధ్యుడైన బృహస్పతిని అవమాన పరచెను. బృహస్పతి బాధాతప్త హృదయుడై వెంటనే దేవసభనుండి నిష్క్రమించెను. ఇంద్రునికి శాపము పెట్టగలిగిన శక్తిమంతుడైనను అట్లుచేయక బృహస్పతి మౌనముగా వెడలిపోయెను.

ధనమదము దుర్భరమైనది. ఐశ్వర్య మదముచే కొందరు ఆచార్యుని గూడ అవమానించుటకు వెనుకాడరు. మానావమానములకు అతీతులైన గురువులు ఎవరి గౌరవముల నాశింతురు? సంపదచే జ్ఞానమును పొందుట కష్టము. ఐశ్వర్య గర్వముచే ఆచార్యులను అవమాన పరచినవారు దరిద్రులగుదురు. ఐశ్వర్యములో వక్రించిన బుద్ధి దారిద్ర్యములో చక్కబడును.

బృహస్పతి వెడలెను. ఇంద్రుడు తన తప్పును తాను గ్రహించెను. బృహస్పతిని క్షమాభిక్ష వేడుటకు యత్నించెను. కానీ అప్పటికే పరిస్థితి చేయి జారిపోయెను. ఇంద్రునకు బృహస్పతి లభించలేదు. గురువు లభించినపుడు అహంకారముతో దూరులగువారు దూరమైన గురువును మరల సమీపించలేరు. ఆచార్యుని మనస్సునుండి జారిపోయినవాడు వాస్తవానికి జీవించి యున్నను మరణించిన వాడే యగును. ఇంద్రుడు అశాంతితో దుఃఖించుచుండెను. గురుద్రోహికి మిగిలేది దుఃఖమే. దారిద్ర్యమే.

దుష్టులగు అసురులు దీనిని అవకాశముగా తీసికొనిరి. శుక్రాచార్యుని అంగీకారముతో, ఆశీర్వాదముతో దేవతలపైకి దండెత్తిరి. ఆచార్యుని అండ యున్నంతవరకు అరిషడ్వర్గము లనెడి అసురులు సమీపించలేరు. ఆచార్యుని అనుగ్రహము దూరముకాగానే కామక్రోధముల దాడి ప్రారంభమగును.

దేవతలు దానవుల నెదిరించ లేకపోయిరి. గురుకృపలేని వారు అంతశ్శత్రువులను నిర్జించలేరు. రాక్షసులు దేవతలపై తీవ్రముగా శరములను ప్రయోగించిరి. దేవతలు భగ్న అంగములతో బాధపడుచు అవనత మస్తకులైరి. బ్రహ్మదేవుని శరణుజొచ్చిరి. తన బలము చాలనపుడు దైవబలమే కాపాడాలి.

బ్రహ్మదేవుడు దేవతలతో ఇలా చెప్పెను: "సుర ప్రముఖులారా! మీరు పరాక్రమవంతులై యుండియు అసురులచే పరాభవింప బడితిరి. బ్రహ్మజ్ఞానియైన బృహస్పతికి మీరు చేసిన అపచారమే ఈ దుస్థితికి కారణమైనది. వికృష్టమైన గర్వమే మిమ్ములను నిర్బలులుగా మార్చినది. శక్తిహీనులుగా చేసినది. సంపదకన్నను సంస్కారము గొప్పది"యనెను.

గత జన్మలలో సుసంస్కారులైన ఈ జన్మలో సంపన్నులై జన్మింతురు. సంస్కారము సంపద నందించినది యనెడి సత్యమును మరచినవారై, సంపదను వరించి సంస్కార

మును త్యజించుచుందురు. సంస్కారము కొరవడినచో సంపదయే ఆపదకు శ్రీకారము చుట్టునని గ్రహింపలేరు. మనిషి నింగికెగురవచ్చు. కానీ నిలకడగా నిలబడుట కష్టము.

Man can climb to the highest summits but he cannot dwell there long.

"మనిషి ఉన్నతస్థాయిని అందుకోవచ్చు. కానీ ఎక్కువకాలం ఉన్నతుడుగా మనలేడు."

బ్రహ్మదేవుడు చెప్పుచున్నాడు: "సురశ్రేష్ఠులారా! మీలోని అధర్మవర్తనమే మీకు అపజయము నందించినది. అసురులకు జయమును ప్రసాదించినది. గురువగు బృహస్పతి నవమానించి మీరు అపజయము పాలైనారు. ఆచార్యుడగు శుక్రుని అర్చించి అసురులు జయమును పొందినారు. దేవతలారా! మహాతపస్వియు, బ్రహ్మజ్ఞానియు నగు విశ్వరూపుని ఆశ్రయింపుడు. అతడొక్కడే రక్షింపగలడు" అనెను. గురువులకు జరిగిన అపరాధమునకు బ్రహ్మదేవుడు కూడా క్షమాభిక్ష పెట్టలేడని భావము. సురులు విశ్వరూపుని చెంతకేగిరి. త్వష్ట కుమారుడగు విశ్వరూపుడు దక్షునికి మనుమని కుమారుడు.

"విశ్వరూపా! నీకు శుభము కలుగుగాక! మేము అతిథులమై నీ వద్దకు వచ్చితిమి. మేము శత్రువులచే పరాజితుల మైతిమి. నీ తపోబలముచే మా దుఃఖమును పోగొట్టుము" అని ప్రార్థించిరి. ధనమును విశ్వసించి దేవతలు దుఃఖములను గొని తెచ్చుకొనిరి. దుఃఖమును పోగొట్టునది తపోబలమే యని ఇప్పుడు గ్రహించుచున్నారు.

సురనాథుడైన ఇంద్రుడు అపరాధము చేయగా తత్ఫలితముగా సురులందరు పదవీ భ్రష్టులైరి. పాపము చేయువారి సంపర్కము పాపమునే పంచిపెట్టును. పెద్దలైనవారు చిన్న పనులు చేసినచో పిన్నలుగూడ పెద్దకష్టము లనుభవించవలసి యుండును. ఈ విషయమును మహాభారతములో మహాత్ముడైన విదురుడు ధృతరాష్ట్రునికి అతి రమణీయముగ చెప్పును.

అసంత్యాగాత్ పాపకృతా మపాపాం స్తుల్యో దణ్డః స్పృశతే మిశ్రభావాత్
శుష్కేణార్ద్రం దహ్యతే మిశ్రభావాత్ తస్మాత్ పాపైస్సహ సన్ధిం న కుర్యాత్

పాపము చేయువారికి చేరువుగా యుండుటవలన పాపమెరుగని వారికి కూడా సమానశిక్షయే పడుచున్నది. ఎండిన వాటితో గూడియుండుట వలన తడిసినవి గూడా కాలిపోవుచునే యున్నవి. కనుక పాపము చేయువారితో కలయిక శుభము నొసగదు" యని విదురుడనెను.

దేవతల ప్రార్థనలచే సంతుష్ట చిత్తుడైన విశ్వరూపుడు వారిని రక్షించు బాధ్యతను స్వీకరించెను. దేవతలకు నారాయణ కవచము నొసంగెను. విశ్వరూపుని అనుగ్రహముచే బలయుతులైన సురులు అసురులను జయించి, తిరిగి సురలోకమును బొందిరి.

సర్వాపద్భ్యో హరేర్నామ రూపయానా యుధాని నః
బుద్ధీంద్రియ మనః ప్రాణాన్ పాన్తు పార్షద భూషణాః

"శ్రీహరినామము, రూపము, వాహనమూర్తి, అస్త్రములు, దూతలు - మా మనో బుద్ధులను, ప్రాణేంద్రియములను సర్వాపదలనుండి రక్షించుగాక" యని నారాయణ

కవచమును సురులు పఠించి అసురులను అపజయము పాల్జేసిరి. నారాయణ కవచమును శ్రద్ధతో పఠించువాడు సర్వలోకపూజ్యుడై, సమస్త భయములనుండి విముక్తుడగునని శ్రీశుకుడు పరీక్షిత్తునకు దెలిపెను.

విశ్వరూప సంహారము

విశ్వరూపుడు సురుల యజ్ఞములను నిర్వహించు చుండెను. విశ్వమంతటిని నారాయణ రూపముగ దర్శించువాడు విశ్వరూపుడు. అందుచేత విశ్వరూపుడు భేదము నెరుగడు. పితృ సంబంధులైన దేవతల యజ్ఞములను నిర్వహించు సందర్భములలో మాతృ సంబంధులైన అసురులకు గూడ ప్రీతిని కల్గించుచు ఆహుతుల నిచ్చుచుండెను.

ఇంద్రుడు ఈ విషయమును గ్రహించెను. దానవులకు యజ్ఞభాగముల నిచ్చుట యను కార్యమును గాంచి క్రుద్ధుడాయెను. ఈ విధమైన కార్యము అసురుల శక్తిని వృద్ధి చేయునని భావించి విశ్వరూపుని సంహరించెను.

క్రోధము భయంకరమైనది. కుపితుడైనవాడు యుక్తా యుక్తముల నెరుగడు. ఇంద్రుడు విశ్వరూపుని వధించి బ్రహ్మహత్యా పాపమును బొందెను. తాను చేసిన ఘోర తప్పిదమునకు ఇంద్రుడు దుఃఖించెను. పాపమును ప్రక్షాళనము చేసికొనుటకు ఇష్టపడక సంవత్సరకాలము తానే అనుభవించెను. తదనంతరము మిగిలిన పాపమును భూమికి, వృక్షములకు, స్త్రీలకు, జలములకు పంచెను.

భూమి యందున్న గుంటలు స్వయముగనే పూడిపోవునట్లు భూమి ఇంద్రుని నుండి వరమును బొందెను. దీని ఫలితముగా ఇంద్రుని వద్ద మిగిలియున్న బ్రహ్మహత్యా పాపములో నాల్గవ వంతును భూమి గ్రహించెను. ఈ కారణముగనే భూమిలో చవిటినేల ఏర్పడినది. ఊసరక్షేత్రములో శుభకార్యములు నిషేధింపబడినవి.

విరిగిన చెట్లు మరల చిగురించునట్లు వృక్షములు ఇంద్రుని నుండి వరమును బొందినవి. దీని ఫలితముగా ఇంద్ర కృతమగు బ్రహ్మహత్యా పాపములోని నాల్గవభాగమును వృక్షములు గ్రహించినవి. ఈ పాపమే చెట్ల యందు జిగురు రూపమున వ్యక్తమగును. దాని నారగించుట నిషేధము.

గర్భవతులుగా యుండునపుడు గూడ గర్భపాతము జరుగకుండా సంభోగము కలుగునట్లు స్త్రీలు ఇంద్రుని నుండి వరమును బొందిరి. ఈ కారణముగ ఇంద్రుని పాపములోని నాల్గవ వంతును స్త్రీలు గ్రహించిరి. ఈ పాపము వలన ఏర్పడిన దోషము ప్రతిమాసము నందును ఋతుకాలమున స్త్రీలలో గోచరించు చుండును. రజస్వలయగు స్త్రీని స్పృశించుట నిషేధము.

జలము ఏ వస్తువునందు కలియునో వానికి ఆధిక్యము కలుగునట్లు నీరు ఇంద్రుని నుండి వరమును బొందెను. ఈకారణముగ ఇంద్రకృత పాపములోని నాల్గవభాగమును జలములు గ్రహించినవి. అందుచేతనే జలమునందు నురుగు ఏర్పడెను. నురుగుతో జలమును స్వీకరింపరు.

దీనిని బట్టి మనకు ఒక రహస్యము తెలియుచున్నది. పాపులనుండి సహాయమును గ్రహించినచో వారి పాపములో కొంతభాగము మనకు కూడా సంక్రమించును. పాపులను సేవించుట మంచిదిగాదు. పాపులనుండి దానమును గ్రహింపరాదు. పాపి ఎవరో, పాప మెవరిదో మనకేమి తెలియును? అనెడి సంశయము కలుగవచ్చును. తెలిసి పాపినుండి గ్రహింపకూడదు. సాధారణముగా ఎవరినుండి దేనిని గ్రహించినను అనుగ్రహించువాడు శ్రీకృష్ణుడే యను భావమును మనసులో ధరించి యుండినచో పాపము అంటదు. ఒకవేళ గ్రహించిన తరువాత తెలిసినచో **"హరయే నమః"** అనెడి మంత్రమును కొన్ని పర్యాయములు భక్తితో పఠించవలెను.

విశ్వరూపుడు మరణించెను. ఈ వార్త విశ్వరూపుని తండ్రియగు త్వష్టప్రజాపతికి తెలిసెను. త్వష్టప్రజాపతి తీవ్రముగ వ్యథచెందెను. ఇంద్రుని సంహరించుటకు పగబూనెను.

హతపుత్ర స్తత స్త్వష్టా జుహావేన్ద్రాయ శత్రవే
ఇన్ద్రశత్రో వివర్ధస్వ మా చిరం జహి విద్విషమ్

"విశ్వరూపుడు మరణించగా విశ్వరూపుని తండ్రియగు త్వష్టప్రజాపతి ఇంద్రుని శత్రువును జనింప చేయుటకు యజ్ఞము నుపక్రమించెను. ఆ యజ్ఞమునందు **"ఇంద్ర శత్రో వివర్ధస్వ"** " ఓ ఇంద్ర శత్రువా! నీవు వృద్ధి నొందుము. నీ శత్రువగు ఇంద్రుని వెంటనే జయింపుము" యని సంకల్పము చేయుచు ఆహుతు లిచ్చెను.

ఇచ్చట ఒక విచిత్రము జరిగెను. **"ఇంద్రశత్రో"** అను పదమును ఇంద్రుని యొక్క శత్రువు యను భావముతో షష్ఠీ తత్పురుష సమాసముగ త్వష్ట పలికెను. కానీ ఉచ్చారణ దోషముచే భావము తారుమారయ్యెను. వేదమునందు స్వరము ప్రధానము. స్వరోచ్చారణ దోషమువలన ఇంద్రుని జంపు శత్రువునకు బదులుగా ఇంద్రునిచే జంపబడు శత్రువు జన్మించెను. అతడే వృత్రాసురుడు.

యజ్ఞకుండము నుండి వృత్రాసురుడు జన్మించెను. అతని దేహము ప్రతిక్షణము పెరుగు చుండెను. అతని దేహము కాలిన కొండవలె నల్లగ యుండెను. సంధ్యాకాల మేఘములవలె వాని యంగములు మెరయుచుండెను. వెంట్రుకలు కాలిపోయిన తామ్రమువలె నుండెను. వాని యడుగులకు భూమి కంపించుచుండెను. ఘోరమైన ఆ దానవుని రూపమును గాంచి జనులు భీతులైరి.

అయ్యసురుడు సమస్తలోకముల నావరించెను. అందుచేత వానికి వృత్రాసురుడను పేరు గలిగెను. వృత్రాసురుని వధించుటకు ఇంద్రాదిదేవతలు వెళ్ళి, వాని నెదిరించలేక పరాజితులైరి. పోరాడ నశక్తులైన దేవతలు భీతిచెందినవారై నారాయణమూర్తిని ధ్యానించిరి. దేవతల ప్రార్థనల నాలకించి శ్రీహరి శంఖచక్ర గదా పద్మయుతుడై సురులకు దర్శన మొసంగెను. ఆనంద విహ్వలులైన సురులు జగన్నాథుని ఇలా స్తుతించిరి:

అస్మాకం తావకానాం తత తవ నతానాం హరే తవ చరణ నలిన యుగల ధ్యానానుబద్ధ హృదయ నిగడానాం స్వలిఙ్గ వివరేణాత్మ సాత్కృతానా మనుకమ్పాను రంజిత విశద రుచిర శిశిర స్మితావలోకేన విగలిత మధుర ముఖ రసామృత కలయా చాన్తస్తాప మనఘార్హసి శమయితుమ్ !

"హరే! అనఘా! మేము నీ పాదపద్మముల యందు ప్రణమిల్లి యున్నవారము. నీ చరణకమల యుగళ ధ్యానముచే మా హృదయము బంధింపబడి యున్నది. నీ దివ్య రూపమును ప్రదర్శించి మమ్ముల ననుగ్రహింపుము. అనుకంపాను రంజితము, విశదము, శీతలము, మృదుహాస యుక్తము నగు నీ చల్లని చూపుద్వారాను, అనుకంపాను సంజాతము, మధురము, ప్రియము నగు నీ తియ్యని వాగామృతము ద్వారాను వృత్రాసురుని వలన మాలో ఏర్పడిన భయమును, మానసిక క్షోభము నివారింపుము" అని దేవతలు ఘనముగా ప్రార్థించిరి.

O Lord! O sinless one! Be pleased to cure the fever within our heart by your kind glances, accompanied with a gracious, artless and charming and refreshing smile, as well as by drops of nectar in the form of sweet and flowery words, oozing from your holy mouth, since we, who were already yours, have now been accepted by you as your own by revealing your Divine form before us, and are bent low before you. O divine father! nay, grand father our heart being bound by the chain of love to thy lotus feet through contemplation on them.

దేవతలు శ్రీహరిని ఈ విధముగ అమోఘమైన రీతిలో ప్రార్థింపగా దాని నాలకించిన భగవానుడు ప్రసన్నుడై దేవతలతో ఇట్లు పలికెను:

"సురశ్రేష్ఠులారా! జ్ఞానరూపమైన మీ ప్రార్థన నాలకించి నేను చాలా తృప్తి చెందితిని. ఈ విధమైన జ్ఞానము అవిద్య నంతమొందించును. నా యందు భక్తిని నిలుపును. దేవతలారా! నన్ను బొందిన వానికి ఏ వస్తువైనను అలభ్యము గానేరదు. కానీ నా భక్తులైన వారు నా కంటెను అన్యమైన దానిని వాంఛింపరు.

"మోక్ష మార్గము నెరిగినవాడు ముముక్షువులకు కర్మమార్గము నుపదేశింపడు. రోగి అపథ్యమును గోరవచ్చును. అంతమాత్రాన వైద్యుడు దాని నంగీకరించునా? సురులారా! మీరు ఆలస్యము చేయకుండా ముని శ్రేష్ఠుడగు దధీచి కడకు వెళ్ళండి. విద్యావ్రత తపస్సుల ద్వారా ఆ మహాత్ముని దేహము దృఢమై యున్నది. దధీచి బ్రహ్మజ్ఞానమును బొంది యున్నాడు. అతని దేహము కూడా దివ్యత్వమును బొందియున్నది. ఆ దివ్య దేహమునకై ప్రార్థింపుడు. మీ ప్రార్థనల నాలకించి ఆ మహాత్ముడు తన పవిత్ర దేహమును మీకు సమర్పింప గలడు. త్యాగియైన ఆ మహాత్ముని దేహము నందలి ఎముకలతో విశ్వకర్మ వజ్రాయుధమును తయారు చేయగలడు. ఇంద్రుడా! నీవు వజ్రాయుధముతో వృత్రాసురుని సంహరింపగలవు. సురులారా! మీకు శుభము కలుగుగాక!" యని శ్రీహరి సురుల నాశీర్వదించెను.

మహాత్యాగి దధీచి

భగవానుడు అంతర్హితు డయ్యెను. సురులు దధీచి మహర్షిని సమీపించిరి. అథర్వుని కుమారుడగు దధీచి త్యాగధనుడు. ఉదారచరితుడు. దేవతలు ఆ మహాత్ముని సమీపించి, ఆయనకు నమస్కరించి, ఆ మహాత్ముని దేహమును గోరిరి.

దధీచి నవ్వుచూ ఇలా పలికెను: "దేవతలారా! చాలా సంతోషము. దేహధారులైన మనుజులకు అంత్యకాలమున అనివార్యముగ ప్రాప్తించునది యేదియో మీ రెరుగరా? ఈ జగత్తున జీవించు ప్రాణులకు దేహమే అత్యంత ప్రియమైనది. ఈ దేహమే సర్వ భోగముల ననుభవించుటకు పరికరమునై యున్నది. కనుకనే సర్వులు ఈ దేహమును రక్షించుకొను చుందురు. స్వయంగా భగవానుడు అతిథియై వచ్చినను ఈ దేహమును సమర్పించుట కెవ్వరు ఇష్టపడరు. మరి నన్ను దేహమును సమర్పింపమని మీరు అడుగుట సముచితమా?" యని దధీచి పలికెను.

దధీచి మాటల నాలకించిన దేవతలు ఇలా సమాధాన మొసగిరి: "మహాత్మా! పరోప కారమునకు మించిన పుణ్యకార్యము మరియొకటి ఉండబోదని మీలాంటి మహాత్ములకు తెలియని సత్యము గానేరదు. కరుణామయులు, ఉదారచరితులు, పుణ్యశ్లోకు లైనవారు పరోపకారార్థము దేనినైనను త్యజింతురు. అట్టి పురాణ పురుషులలో మీరు అగ్రగణ్యులు.

నను స్వార్థపరో లోకో న వేద పరసంకటమ్
యది వేద న యాచేత నేతి నాహ యదీశ్వరః

"మహాత్మా! స్వార్థపరులైనవారు అన్యుల బాధల నెరుగరు. యాచకుడు దాత కష్ట ములను తెలిసికొన గలిగినచో అతడు యాచింపడు. అలాగే దాత గూడ యాచకుని బాధల నెరిగినచో యాచకుని విమర్శింపడు" అని భావయుక్తంగా దేవతలు పలికిరి. యాచకుడు స్వభావము ననుసరించియే యాచించును. దాత తన స్వభావము ననుసరించియే అను గ్రహించునని భావము.

సురుల సుభాషితము నాలకించి దధీచి సంతుష్టచిత్తు డాయెను. "దేవతలారా! మీ ద్వారా ధర్మవాక్యముల నాలకించ నిష్టపడిన వాడనై మిమ్ములను విమర్శించితిని. మీ ధర్మ వచనములు నా హృదయమును ఆనందముతో నింపినవి. మీరు కోరిన విధముగా నా దేహమును మీకు సమర్పింతును.

"సురశ్రేష్ఠులారా! ఈ దేహము నెంతగా ప్రేమించినను ఒకనాడు త్యజింప వలసిన దియే. కుక్కలకు, నక్కలకు ఆహారముగా సమర్పించ వలసినదియే. ధనదేహాదులు క్షణిక ములు. బుద్బుద ప్రాయములు. అట్టి దేహాదులతో పరుల కుపకరించు కార్యమును చేయనిచో అట్టివాని బ్రతుకు వ్యర్థమే కాగలదు.

"సహచరులైన ప్రాణులపై దయలేని వాడు మానవుడగునా? కాఠిన్య హృదయులకు, కఠిన శిలలకు తేడా ఏమున్నది? అనిత్యమైన దేహము ద్వారా మానవుడు ధర్మమును

సాధించాలి. కీర్తిని సంపాదించాలి. భగవత్కృపకు పాత్రుడు కావాలి. లేనిచో వృక్షముల కంటెను జడుడై మిగులును. మీరు ఆశించినట్లు నా దేహమును స్వీకరింపుడు. ఈ కార్యము నాకెంతో ఆనంద దాయకముగ యున్నది" యని పలికి, చిత్తమును నిరోధించి పరమాత్మయందు విలీనము చేసెను. దేహమును త్యజించెను.

మహాత్యాగి దధీచికీ జై

దేవతలు వృత్రాసురునిపై దండెత్తుట

దధీచి దేహమును త్యజించెను. ఆ మహాత్ముని అస్థికలచే విశ్వకర్మ వజ్రాయుధ మును తయారు చేసెను. దివ్యాత్ముడైన దధీచి దేహము దివ్యమై గన్పట్టెను. శుభకర్మల నాచరించుట కుపయోగపడిన దేహము అంత్యకాలమున శుభముగ గన్పట్టును. కొందరు మహాత్ములు మరణించిన పిదప దేహములు నశింపకుండా చాలా రోజులవరకు యుండుటను మనము గూడా గాంచియే యున్నాము. అరవిందయోగి, పరమహంస యోగానందుల దేహములను కొన్ని రోజులు ఉంచినను అవి తేజమును గోల్పోక యుండెను.

పవిత్రమైన భగవద్భజనలో చరించు దేహములు చైతన్యము నుండి వేరైనపుడు గూడా పవిత్రములుగనే యుండును. భక్తితో రామకోటిని పూర్తి చేసినచో, దాని కుపకరించిన కలము గూడా దివ్యత్వమును కలిగియుండును. మహాభక్తుల విశిష్టారాధనలే విగ్రహములో చేతనత్వమును కల్పించును. పూర్ణ భక్తియుతులై జపము చేసినచో, వారు పయోగించు జపమాల గూడా చైతన్యవంతమగును. సూర్యుడు ప్రకాశించుచుండినను అంధునకు లేనివాడే యగును. చేతనత్వమును కలిగి యున్నవాడే వస్తువులో దాగియున్న చైతన్యమును గాంచగలుగును.

నేను ఒక వింత విషయమును గాంచి యున్నాను. శరీరమును మర్దనము చేయు వ్యక్తి ఒకసారి ఒక మహాత్ముని సమీపించెను. ఆ మహాత్ముని దేహమునకు తైలమర్దనము చేయు భాగ్యమును ప్రసాదింపుమని కోరెను. బాలుని మనస్తత్వముగల ఆ మహాత్ము డతని విన్నపమును మన్నించెను. అతడు ప్రతిరోజు తైలముతో మర్దన చేయుచుండెను. ఒకనాడు సాధువుగారి తలపై మృదంగ తాళము వేయసాగెను. ఆ మరునాడు వీపుపై నగారా మోతలు వేయుచుండెను. కొన్ని సమయాలలో ఆ దెబ్బలు దీపావళిని గుర్తుచేయు చుండెను. సున్నితమైన ఆ సాధువుగారి దేహము ఈ మల్లయోధుని దెబ్బలను వాస్తవానికి ఓర్చుకోలేక పోయెను. అయినను సాధువు భరించెను. భరించ లేనపుడు కీర్తన నాలపించు చుండెను.

"ఈ స్వాములవారి పాదములకు ఎందరో భక్తులు మ్రొక్కుచుందురు. అట్టి మహాత్ముని బాదే అవకాశము మాకే గలదు" అని ఆ మర్దన విద్వాంసుడు పలికెను. ఈ బాధలను, మోతలను గాంచి బాధపడిన భక్తులు ఒకనాడు, "స్వామీ! ఈ మర్దన కార్య

క్రమమును ఆపండి. అతడు మిమ్ములను బాదుతుంటే మేము చూడలేక పోతున్నాము యనిరి. దానికి ప్రత్యుత్తరముగా ఆ సాధువు "బాదనీ! గత జన్మలో ఈ దేహము అతనిని ఇలాగే బాదియుంటుంది. ఇప్పుడు బాధించుకొంటున్నది" యనెను.

పవిత్రమైన దేహములను పవిత్రముగనే చూసుకోవాలి. జపమున కుపయోగించు జపమాలను పవిత్రముగా యుంచుకోవాలి. రామకోటి వ్రాయు కలముతో దస్తావేజులు వ్రాయడము, సంతకాలు పెట్టడము చేయకూడదు. పవిత్రమైన ఆ కలమును మరొక కార్యమునకు వినియోగించ కూడదు. ధ్యానమున కుపయోగించు ఆసనముపై కూర్చుని ప్రాపంచిక విషయములను ముచ్చటించకూడదు. పూజాగదిలో ఆసనముగా ఉపయోగించు పీటపై కూర్చొని భుజించకూడదు. పూజాసుమముల నుంచే బుట్టలో కూరగాయల నుంచరాదు. ఇవీ అవీ అననేల? భగవద్పూజనలో ఉపకరించు వస్తువుల నన్నిటినీ పవిత్రముగ దర్శింపవలెను. సాధన పెరుగుతున్న కొలది అవి యన్నియు పవిత్ర రూపములగును. చేతనములై భాసించును.

దధీచి అస్థికలచే విశ్వకర్మ వజ్రాయుధమును తయారుచేసెను. దానిని ధరించిన ఇంద్రుడు మహాశక్తిమంతుడై భాసించు చుండెను. సర్వదేవతలచే గూడినవాడై, వజ్రాయుధము ధరించి ఐరావతము నధిరోహించెను. మహాకోపముతో వృత్రాసురుని వైపు వేగముగ జనెను. నర్మదానది తీరమున దేవ దానవులకు భయంకరమైన యుద్ధము జరిగెను. దైత్యులు దేవతలతో ధైర్యముగా పోరాడిరి. దేవతాశ్రేష్ఠులను పీడింపసాగిరి. ఆకాశమున మేఘములు దట్టముగ వ్యాపించినపుడు తారకలు తెలియనట్లు, అసంఖ్యాకములైన శరములను దానవులు ప్రయోగింపగ దేవతలు కనుపించరైరి. దేవతలలో కొందరు గగనమున నిలబడి అసురులు ప్రయోగించెడి బాణములు దేవతలను చేరకుండగ వాటిని ధ్వంసము చేయుచుండిరి. ప్రయోగింపబడిన శరములు విఫలములగుట గాంచిన దానవులు దేవతలపై పర్వతములను, వృక్షములను, పాషాణములను గురిపించిరి. వాటిని గూడా దేవతలు ధ్వంసమొనర్చిరి. ఈ స్థితిని గాంచి దానవులు భీతిచెందిరి. దానవులకు హరిభక్తి లేదు: దేవతలు హరిని భజించి రణరంగమున అడుగుపెట్టిరి. భక్తి ముందు బలము బలహీన మగును. దేవతలచే తిరస్కరింపబడిన దానవులు భీతిచెందిన వారై పలాయనమునకు సిద్ధపడిరి. అంతరంగులైన ప్రసిద్ధవీరులు గూడ వృత్రాసురుని త్యజించి ప్రాణభీతితో పారిపోవు చుండిరి.

పారిపోవుచున్న అసురులను జూచి నవ్వుచు వృత్రాసురుడిలా పలికెను: "అసుర శ్రేష్ఠులారా! పుట్టిన వారికి మరణము అనివార్యము. మృత్యువు నెవ్వరూ జయింపలేరు. కాలములో కదలినవన్నియు కాలములోనే కనుమరుగవును. మృత్యువు సర్వులకూ ప్రాప్తించును. అట్టి మృత్యువు స్వర్గమును ప్రసాదించి, సత్కీర్తి నందించునపుడు దాని నెవ్వడైనను తిరస్కరించునా? అట్టి మృత్యువును మంగళకరముగ భావించి సర్వులు వరింతురు.

"దానవ వీరులారా! రెండు విధములైన మరణములు శుభప్రదములని నా అభిప్రాయము. ఆలోచింపుడు. ఇంద్రియ ప్రాణములను విగ్రహించి, మనోబుద్ధులను

నిరోధించి, భగవంతుని యందు ధ్యాన మగ్నులై దేహమును త్యజించుట ఒక మరణము. అలా గానిచో రణరంగమున నిలచి శత్రువు నెదుర్కొనుచు మరణించుట రెండవ మరణము. ఈ రెండును శుభకర మరణములని శాస్త్రనిర్ణయము. ఇవి అందరికి లభించునవి గావు. పుణ్యము వరించిన వారికి మొదటి మరణము లభించును. పుణ్యము నన్వేషించు వారికి రెండవ మరణము లభించును. మనము ఈ మహదవకాశమును జారవిడుచుకోగూడదు. యుద్ధము నుండి పిరికివాని వలె భీతిచెంది పారిపోవుట వీరుల లక్షణము గాదు. ఈ విధమైన చర్య కీర్తిని ప్రసాదించక పోగా, అపకీర్తిని అందించును. స్వర్గమును నిరోధించును" అని పలికెను. వృత్రాసురుని ధర్మసందేశము దానవులపై ప్రభావమును జూపలేక పోయినది. జ్వరపీడితునకు మధుర పదార్థములు రుచించని విధముగా, వృత్రాసురుని సందేశము చంచలచిత్తులు, పలాయన రతులు, భీతులైన దానవులకు సంతోషము నందించలేకపోయెను.

పారిపోవుచున్న అసురులను దేవతలు చుట్టుముట్టి బాధింపసాగిరి. వారిపై దారుణ శరపరంపరలను ప్రయోగింపసాగిరి. దానవులు దిక్కులు తెలియని రీతిన పరుగులిడుచుండిరి. అది గాంచి వృత్రాసురుడు బాధపడెను. అసురుల దీనావస్థను గాంచి ఆవేదన చెందినవాడై , సురులతో ఇలా పలికెను:

"క్షుద్రులైన దేవతలారా! యుద్ధము నుండి పారిపోవుచున్న ఈ అసురులు మాతృగర్భమున జనించిన పురుగుల వంటివారు. నీచులు. లుబ్ధులు. వ్యర్థజీవులు. నిరర్థకమైనవారు. అట్టివారిని వధించిన మీకు లభించునదేమున్నది? ధీరులైనవారు భీరులను వధింతురా? సురులారా! మీకు ధైర్యమున్నచో నన్ను ఎదిరింపుడు. యుద్ధమునందు శ్రద్ధయున్నచో వీరుడనైన నన్ను పరాభవింపుడు. వృత్రాసురుడు తన భయంకరమైన శరీరముతో సురుల ముందు నిలిచెను. ఆ దేహమును గాంచి కొందరు దేవతలు మూర్ఛితులైరి. వృత్రాసురుడు శూలధారియై రణరంగమున చిందులు వేయుచుండగా భూమి చలింపసాగెను. అతనిని చూడ నశక్తులైన సురులు చేతులతో నేత్రములను మూసికొనిరి. మదించిన ఏనుగు పద్మవనమును పాదములతో త్రొక్కివేయులాగున, సురులను బలమైన తనపాదములతో హింసించి సంహరించెను.

ఇంద్రుడు ఈ భయానక సన్నివేశమును గాంచి క్రుద్ధుడై వృత్రాసురునిపైకి గదను విసిరెను. వృత్రాసురుడు .అనాయాసముగ ఆ గదను వామహస్తముతో పట్టుకొనెను. కుపితుడైన వృత్రాసురుడు ఆ గదతోనే ఇంద్రుని ఐరావతము తలపై కొట్టెను. ఆ దెబ్బకు ఐరావతము ముఖము భిన్నమాయెను. దుర్భర దుఃఖము ననుభవించుచు, రక్తమును గక్కుకొనుచు, ఘీంకారము చేయుచు వెనుకకు అడుగులు వేయుచుండెను. ఇక కదలలేక కూలబడెను.

ఐరావతము మూర్ఛిల్లెను. ఇంద్రుడు దుఃఖితు డయ్యెను. వెంటనే తన కరస్పర్శచేత ఐరావతమును పునః ఆరోగ్యవంతముగ జేసెను. ఆ సమయమున వృత్రాసురుడు ఇంద్రునిపై గదను ప్రయోగించు అవకాశముండెను. కానీ ధర్మము నవలంబించ దలచినవాడై ఇంద్రునిపై గదను ప్రయోగించలేదు. మరల ఐరావతము నెక్కి ఎదురుగ వచ్చుచున్న ఇంద్రుని గాంచి వృత్రాసురుడిట్లు పలికెను:

"ఓరీ ఇంద్రుడా! పాపీ! నీవు బ్రహ్మహత్యను గావించిన పాతకుడవు. గురువును వధించిన దుర్మార్గుడవు. నా సోదరుని చంపిన హంతకుడవు. నేడు నాకు శత్రువువై నా ఎదుట నిలుచుట నీ అదృష్టముగ భావించుచున్నాను. నీ కఠిన హృదయమును నా శూలముతో చీల్చివేయుదును. ఈ కార్యము వలన నేను సోదరుని విషయంలో ఋణ విముక్తుడ నగుదును. నీ దేహమును అగ్నిగూడ దహింపదు. గ్రద్దలే దానిని భక్షించును. ఓరీ సురాధమా! ఒకవేళ ఈ పోరాటములో నేను మరణించినచో నా దేహము భూతము లకు ఆహారమగును. నేను ఉత్తమగతిని పొందుదును" యనెను. త్వష్టప్రజాపతి యజ్ఞ కుండము నుండి ఆవిర్భవించిన వృత్రాసురుడు రాక్షసుడైనను పుణ్యాత్ముడే. విశ్వములో విశ్వనాథుని దర్శించిన విశ్వరూపుని సోదరుడగు వృత్రాసురుడు హరిభక్తుడు. అందుచేత చక్కని ధర్మోపదేశమును గావించెను.

వృత్రాసురుడు శూలమును త్రిప్పుచు ఇంద్రుని సమీపించెను. కుపితుడై ఆ శూల మును ఇంద్రునిపై ప్రయోగించి "ఓరీ! పాపాత్ముడా! నీవు నా చేతిలో హతమైతివి" యనెను. ఇంద్రుడు నిర్భయుడై నిలచెను. తోకచుక్కవలె పరిభ్రమించుచు వచ్చుచున్న శూలమును తన వజ్రాయుధముచే ఖండించెను. వెంటనే వజ్రాయుధమును చేబూని వృత్రాసురుని పైకి దుమికెను.

వృత్రాసురుడు వజ్రాయుధమును గాంచెను. దధీచి మహాముని అస్థికలతో తయారైన ఆ వజ్రాయుధము నందు వృత్రునకు నారాయణుడు గోచరించెను. ఇంద్రునికి వజ్రాయుధముగనే తెలియచుండెను. కానీ వృత్రాసురునికి వాసుదేవుడు గన్పట్టుచుండెను.

భక్తుడైన వృత్రాసురుడు చేతులు జోడించి వజ్రాయుధము నుండి దర్శన మిచ్చు చున్న నారాయణునకు నమస్కరించెను. "మహేంద్రా! ఎందుకు ఆలస్యము చేయుచుంటివి. వెంటనే వజ్రాయుధమును నాపై ప్రయోగింపుము. నీకు జయము కలుగును. నీ వజ్రా యుధము నందు నా హరి యున్నాడు. దధీచి తప ప్రభావ మున్నది. పవిత్రమైన ఆ వజ్రాయుధము నా మస్తకమును భిన్న మొనర్చినచో నా వంటి భాగ్యశాలి మరియొక డుండడు. భగవానుని కృప ఎవరిపై నుండునో వారే జయమును బొందెదరు.

"ఇంద్రా! వజ్రాయుధమును ప్రయోగింపుము. దాని వలన నేను సంసారబంధముల నుండి విముక్తి నొందెదను. శాశ్వతముగ శ్రీహరి పాదపద్మములను పొందెదను. సురాధిపా! శ్రీహరి కరుణామయుడు. తన భక్తులైన వారికి భోగముల నందించడు. ధర్మార్థ కామ ములను ప్రసాదించడు. పైగా విరోధించును. అందుచేత ఈ రణరంగమున విజయలక్ష్మి నిన్ను వరించును. మోక్షలక్ష్మి నన్ను వరించును" యనెను.

లౌకిక సుఖముల కొరకు పరమాత్మను ఆశ్రయించ కూడదు. లౌకిక సుఖములు లభించనిచో భక్తుడు తృప్తి చెందును. అలౌకికానందమును ప్రసాదించుటకే లౌకిక సుఖ ములను తమకు ప్రసాదించలేదని భక్తులు తృప్తిచెందుదురు. భక్తులైన వారికి పరమాత్మ లౌకిక సుఖముల ననుగ్రహించడు. అభక్తులకే అవి అందును.

ఇంద్రుడు జయమును పొంది స్వర్గము నాక్రమించును. వృత్రాసురుడు మరణించి మోక్షమును బొందును. తన జన్మయే సార్థకమైనదని వృత్రాసురుడు భావించెను. ఇంద్రుని కన్నను తన మీదనే శ్రీహరి యనుగ్రహము మెండుగా యున్నదని వృత్రాసురుడు భావించెను. విషమ పరిస్థితులలో గూడ భక్తులైన వారు భగవానుని విశిష్ట అదృశ్యహస్త మునే దర్శింతురు. ఈ సందర్భమున మహాత్ముల కోవలోనికి ప్రవేశించుచున్న వృత్రా సురుడు శ్రీహరిని నాలుగు శ్లోకములలో అతి రమణీయముగా స్తుతించెను. ప్రతిభక్తుడు పఠించదగిన దివ్యమైన ఆ శ్లోకములను భావానువాదముతో అందించుచున్నాను. లౌకిక సంపదలు గాకుండా మోక్షమునే గోరు ముముక్షువులకు ఈ శ్లోకములు ధ్యానయోగ్యములని నా అభిప్రాయము. ఒకవేళ లౌకిక సుఖముల యందు ఆసక్తి గలవారైనను నిత్యము ఈ శ్లోక చతుష్టయమును ప్రాతఃకాలముననే భక్తియుతంగా, భావయుతంగా పఠించినచో మోక్షాసక్తులై, సాధకులై సాధ్యరూపమైన మోక్షమును బొంది తరించగలరు.

అహం హరే తవ పాదైక మూల దాసాను దాసో భవితాస్మి భూయః
మనః స్మరేతా సుపతే ర్గుణాంస్తే గృణీత వాక్కర్మ కరో తు కాయః

"హరీ! భగవంతా! నీ పాదముల నాశ్రయించిన దాసులకు నేను దాసుడను కాగలనా! నా మనస్సు సదా నీ కళ్యాణ గుణములనే స్మరించుగాక! నా వాక్కులు నిన్నే కీర్తించుగాక! నా దేహము నీ సేవలో రమించుగాక!"

" O Hari ! My Lord! May I be born as again a servant of those devotees who have solely taken refuge at your lotus-feet. Let my mind ponder and tongue celebrate the excellences of the Lord of my life and let my body do your service alone.

న నాకపృష్ఠం న చ పారమేష్ఠ్యం న సార్వభౌమం న రసాధిపత్యమ్
న యోగసిద్ధీ రపునర్భవం వా సమంజస త్వా విరహయ్య కాంక్షే ॥

"హే భగవాన్ ! నేను నిన్ను మరచి ధృవలోకము నాశింపను. బ్రహ్మలోకము నభి లషింపను. సార్వభౌమాధిపత్యమును గోరను. అణిమాది సిద్ధులను వాంఛింపను. దేవా! మోక్షమును గూడా కామించను."

"O Bhagawan! O store-house of all blessedness and grace! Without you I crave neither the place of Dhruva nor even the abode of Brahma nor the sovereignty of the entire globe nor the Lordship of the subterranean regions nor the yogic powers nor even liberation.

అజాత పక్షా ఇవ మాతరం ఖగాః స్తన్యం యథా వత్సతరాః క్షుధార్తాః
ప్రియం ప్రియేవ వ్యుషితం విషణ్ణా మనోరవిన్దాక్ష దిదృక్షతే త్వామ్

"హే కమలలోచనా! రెక్కలు రాని పక్షిపిల్లలు తల్లి పక్షికై నిరీక్షించునట్లు, త్రాటిచే బంధింపబడిన దూడలు ఆకలిచే బాధపడుచు పాలు త్రాగుటకు ఆతురతను

ప్రదర్శించునట్లు, దేశాంతర మేగిన భర్తను గాంచుటకు విరహిణి యగు భార్య వ్యథ జెందునట్లు, నా మనస్సు నీ దర్శనమునకు ఆతురత జెందుచున్నది."

"O Hari! O Lotus-eyed one! Even as unfledged birds are eager to see the mother bird, young calves tormented with hunger seek the milk, and a beloved wife depressed in spirits longs to see her beloved husband absent from home, my mind is keen to behold thee!

మమోత్తమ శ్లోక జనేషు సఖ్యం సంసార చక్రే భ్రమతః స్వకర్మభిః

త్వన్మాయయాఽఽత్మాత్మజ దారగేహే ష్వాసక్త చిత్తస్య న నాథ భూయాత్॥

"నాథా! కర్మవలయమున చిక్కిన వాడనై సంసార సుడిగుండమున బడి పరిభ్రమించుచున్న వాడను. కనుక పుణ్యశ్లోకులగు నీ భక్తులతో నాకు సాంగత్యము లభించుగాక! నీ మాయచే ఎవరి చిత్తము దేహ పుత్ర కళత్ర గృహాదుల యందు ఆసక్తమై యున్నదో అట్టివారితో నాకు చెలిమి యుండకుండుగాక!"

"O Lord! Let there be my friendship with the devotees of the Lord of Excellent renown, revolving as I do in the whirligig of transmigration due to my own deeds. And let him whose mind is attached through Maya to his body, off spring, wife and home have no friendship with me.

వృత్రాసురుడు అమోఘమైన స్తోత్రమును చేసెను. ఆ స్తోత్రమునకు విశ్వమే కంపించిపోయెను. ఈ మహాత్ము డసురుడగునా? అసురజన్మ మెత్తినను పరమోత్కృష్టమైన మోక్షమును భక్తి ద్వారా సాధింప వచ్చుననెడి ఆదర్శమును నెలకొల్పుట కరు దెంచిన మహితాత్ముడు. భక్తాగ్రగణ్యుడు.

మొదటి శ్లోకములో వృత్రాసురుని శరణాగతి ప్రస్ఫుటమగుచున్నది. భక్తినే అతడు వాంఛించుచున్నాడు. మనస్సులో అన్యరాగ విస్మారణము జరుగవలె నని ప్రభువును హృత్పూర్వకంగా ప్రార్థించుచున్నాడు. నోరార హరికీర్తిని నుడువుటకు తపించుచున్నాడు. హరిసేవలో దేహము పనిముట్టు గావలెనని పరితపించు చున్నాడు. భక్తి హోమములో ఇంద్రియాలను హోమద్రవ్యములుగ సమర్పించిన అర్చన సోమయాజిగా భాషిస్తున్నాడు వృత్రాసురుడు. **"తస్మిన్ తజ్జనే భేదాభావాత్"** భగవంతునికి భగవద్భక్తులకు భేదములేదని గుర్తెరిగినవాడై, భక్తుల పాదధూళిని శిరమున ధరించుటకు వృత్రాసురుడు ఉత్సాహవంతుడై గన్పట్టుచున్నాడు. సాధుసాంగత్యము సర్వసుఖ ప్రదాయకము.

లవమాత్ర సాధు సంగే సర్వసిద్ధి హమ్

"సాధు సాంగత్యము కొద్దిగా లభించినను సర్వసిద్ధులు గలుగును" యని చైతన్య మహాప్రభువు తెలిపెను.

దేహేంద్రియ మనోబుద్ధులను శ్రీహరి పాదపద్మముల యందే సమర్పించి వృత్రాసురుడు శరణాగతు డయ్యాడు. వృత్రాసురుని భక్తికి శ్రీహరి స్పందించినాడు. అచ్యుతుడు ఆర్తిని గాంచునే గాని ఆడంబరములను గాంచడు. పరమాత్మను అలంకరించే మనస్సు మంచిదే గాని అర్చించే హృదయమును కలిగియుండుట ఇంకా ఉత్తమము. భక్తితో గుణానుకీర్తనము చేయుట పరమోత్కృష్టము. ఈ లక్షణములు శరణాగతిని ప్రతిఫలింప జేయును. ఈ సత్యమును సంత్ తుకారాం మహరాజ్ ఒక అభంగములో గానం చేస్తాడు.

నామపుష్ప శుద్ధ గళాఁ ఘాలా హార్ వివేక సారాసార్ తురా లావూ,

గా ఇలియా గుణ సంతోషే తయాతే కరితాఁ కీర్తన్ ఆల్హాదేఁ తో॥

"నామ మనెడి నిర్మల పుష్పహారముతో విఠలుని కంఠము నలంకరించండి. నిత్యానిత్య వివేకమనెడి తురాయిని ధరింప జేయండి.

"గుణగానము గోవిందునికి తృప్తినిచ్చును. కీర్తనలు కృష్ణుని సంతోషపెట్టును" యని తుకారాం మహారాజ్ తెలిపెను. అలాగే భగవద్గుణ కీర్తనాదుల యందు మనస్సును లగ్నమొనర్ప వలెనని వృత్రాసురుడు ఆతురత జెందుచున్నాడు.

రెండవ శ్లోకములో మహానుభావుడైన వృత్రాసురుని వైరాగ్యము వ్యక్తమగుచున్నది. వైరాగ్యము రానిదే భక్తినిలువదు. భక్తి బీజమునకు వైరాగ్యము ఎరువువంటిది. నశించే వస్తు సముదాయముపై అనురక్తి యున్నంతవరకు భగవంతునిపై ఆసక్తి పెరగదు. భోగానుభవము రోగములకు దారితీయునే గాని యోగమును ప్రసాదించలేవు. దేహమునకు అలసటయే గాని దేహికి అశాంతి తొలగదు. ఈ విషయమును మనస్సునకు ఎలా పట్టించవలెనో త్యాగరాజస్వామి ఒక కీర్తనలో అద్భుతంగా రచించినాడు.

మోసపోకు వినవే, సత్సహవాసము విడువకవే ॥మోస॥

దాస జనార్తి హరుని శ్రీరాముని వాసవ హృదయ నివాసుని దెలియక ॥మోస॥

ధన తరుణుల కాసించు టెల్ల వెనుక తనువు కలసటె గాని

మనసు చేత సేవ్యుని దలచితే సుమనసత్వము నొసగునే మనసా ॥మోస॥

మూడవ శ్లోకములో తీవ్రమైన భక్తియుత ఆర్తి కన్పించుచున్నది. కేవలము వైరాగ్యము కూడా పూర్ణఫలితము నొసగలేదు. మనస్సులో వైరాగ్యము నిండియుండగా హృదయములో ప్రేమ ప్రవహించు చుండవలెను. ప్రేమలేని వైరాగ్యము రస విహీనమగు చెఱకుగడ లాంటిది. రెక్కలురాని పక్షిపిల్లలవలె వృత్రాసురుడు భగవానుని ఆశ్రయ స్థానమును వాంఛించు చున్నాడు. ఆకలిచే బంధింపబడిన దూడలు అలమటించునట్లు, ఆర్తితో సంసార బంధముల నుండి విముక్తి నొందవలెనని తపించుచున్నాడు. శీఘ్రదర్శనమును వాంఛించి పరితపించు చున్నాడు. పతియెడల సతిజూపు విరహబాధవలె వృత్రాసురుడు వాసుదేవునికై వ్యథ చెందుచున్నాడు. ఇచ్చట వృత్రాసురుని భక్తి మహోన్నత స్థాయిని చేరినది. వృత్రాసురుడు స్తుతించిన దివ్యమైన ఈ శ్లోక చతుష్టయములో మూడవ శ్లోకమును మహోత్కృష్టముగ భక్తులు భావించుట జరిగినది. ఇచ్చట పూర్ణరూప భక్తి వ్యక్తమగుటయే దానికి కారణము. ఇచ్చట భక్తుని వ్యక్తిత్వము భగవానుని అనంత చైతన్య

ములో కలసిపోవుచున్నది. ఈ సత్యమును సంత్ ఏక్‌నాథ్ మహరాజ్ ఒక అభంగములో చక్కగా కీర్తిస్తారు.

దుర్బళా చీ కన్య సమర్థానేఁ కేలీ అవదసా నిఘాలీ దరిద్రా చీ
పాజళలీ జ్యోతీ కాపురా చీ వాతీ ఓఁ వాళితాఁ ఆరతీ భేద్ నూరే ॥

దుర్బలుడైన పేదవాని పుత్రికను సంపన్నుడైనవాడు చేపట్టినాడు. ఏం జరిగింది? ఆ క్షణానే దరిద్రమంతయు అదృశ్యమైనది. అలాగే భక్తుడు భగవంతునితో చేరగనే దుఃఖములన్నీ అదృశ్యమౌతాయి. కర్పూరహారతి నివ్వగనే ఏమి మిగలకుండా కర్పూరము ఆహుతి యైనట్లు, భగవదారాధనలో భక్తుడు ఐక్యమై తరించిపోతాడు.

నాల్గవ శ్లోకములో వృత్రాసురుడు సత్పురుష సాంగత్యమును అభిలషించుచున్నాడు. మొదట భక్తుడు భగవంతునికి శరణాగతుడు కావాలి. శరణాగతుడైన పిదప అన్యరాగ విస్మారణము జరుగుటకు వైరాగ్యము తోడ్పడుతుంది. వైరాగ్యము కల్గిన పిదప భగవానుని పై ప్రేమను అతిశయింప జేయవలెను. అప్పుడే సాధన తీవ్రతరమగును. ఈ దశలో భక్తుడు పతనము గాకూడదు. పతనము గాకుండా రక్షించునది సత్సంగ మొక్కటియే. తల్లి పాలిచ్చి బిడ్డను పెంచునట్లు, సత్సంగము జ్ఞాన క్షీరము నిచ్చి భక్తుని తరింపజేయును.

త్రిజగతి సజ్జన సంగతి రేకా భవతి భవార్ణవ తరణే నౌకా

"త్రిలోకముల యందును భవసాగరమును దాటింప శక్తిగల దివ్యనౌక సజ్జన సాంగత్యమే"నని శ్రీశంకరాచార్యుల వారు భజగోవింద శ్లోకాలలో తెలిపియున్నారు. మహాత్ముడైన వృత్రాసురుని దివ్యస్తోత్రమును సంత్ శిరోమణి నామదేవ్ అభంగముతో సమన్వయించుకొని దివ్యానందమును పొందెదము గాక!

సర్వాఁభూతీఁ భజ నమన కరీఁ సంతాఁ నిత్యా త్యా అచ్యుతా స్మరణ కరీ
ఐసేఁ భజన్ ఐసట్ సాఁపడే వాట్ రామకృష్ణ నీట్ వైకుంఠ చి ॥

"సర్వులను సేవించు. సాధువులకు నమస్కరించు. అచ్యుతుని అనుస్మరించు. ఈ విధమైన సేవలు నీకు చక్కని మార్గమును జూపును. వైకుంఠమును జేర్చును. రామకృష్ణ దర్శనము నొసగును."

పుస్తకాలవల్ల మనిషికి జ్ఞానము వచ్చును. కానీ భక్తి గ్రంథాలవల్ల రాదు. గురువుల వలన రాదు. అది కేవలము ఈశ్వరానుగ్రహము వలననే ప్రాప్తించును. అట్టి పూర్ణభక్తి వృత్రాసురుని కేర్పడెను. ఆ మహాత్ముని మదిలో నిడుకొని మనమూ భక్తిచేసి తరించెదము గాక!

"పరీక్షిన్మహారాజా! యుద్ధమున విజయమును సాధించుట కంటె వజ్రాయుధముచే మరణించుటయే శ్రేష్ఠమని భావించిన వృత్రాసురుడు శూలమును చేబూని ఇంద్రునిపై కురికెను" యని శుకబ్రహ్మ తెల్పుచున్నాడు.

వృత్రాసుర సంహారము

వృత్రాసురుని శూలమును ఇంద్రుడు భగ్న మొనర్చెను. దానితో పాటు వృత్రాసురుని ఒక భుజమును కూడా ఖండించెను. వృత్రాసురుడు కుపితుడయ్యెను. శూలాయుధముతో ఇంద్రుని భయంకరముగ కొట్టెను. ఐరావతమును గూడ గొట్టెను. వృత్రాసురుని ఘాతమునకు ఇంద్రుని చేతిలోని వజ్రాయుధము క్రిందపడినది. వృత్రాసురుని ఈ అద్భుతకార్యమును గాంచి సురులు గూడ ప్రశంసించిరి. కానీ దేవేంద్రుని ఆపదను గాంచి దుఃఖించిరి.

క్రిందపడిన వజ్రాయుధమును ఇంద్రుడు తిరిగి గ్రహించలేదు. శత్రువు ఎదుట ముండగ క్రింద పడిన వజ్రాయుధమును మరల గైకొనుటకు సిగ్గుపడెను. అపుడు వృత్రాసురుడు ఇంద్రునితో ఉదార వచనములను పలికెను.

"ఇంద్రా! బాధపడకుము. వజ్రాయుధమును గ్రహింపుము. నీ శత్రువు నైన నన్ను సంహరింపుము. భగవానుడొక్కడే స్వతంత్రుడు. మనమంతా పరతంత్రులమే. సమరశీలురైన వారికి జయమే కలుగుతుందని చెప్పలేము. అపజయము కూడా కలుగవచ్చును. వలలో చిక్కిన పక్షుల వలె జీవులు పరమాత్మ యధీనములో నున్నారు. ఈ సత్యము నెరుగని మూఢులు జయాపజయములకు తామే కారణమని భావించుచుందురు. ఇంద్రా! జూదములో జయమెవరిదో, అపజయమెవరిదో చెప్పగలమా? యుద్ధముగూడ ద్యూతక్రీడ వంటిదియే.

ప్రాణగ్లహోఽయం సమర ఇష్వక్షో వాహనాసనః
అత్ర న జ్ఞాయతేఽముష్య జయోఽముష్య పరాజయః

"సురరాజా! యుద్ధమును ద్యూత క్రీడవలె భావింపవలెను. దీని యందు ప్రాణమే పణము. శరములే పాచికలు. వాహనాదులే చదరంగపు పటము. ఇచ్చట కూడా ద్యూతమునందు వలె జయాపజయాలు అనూహ్యములు" అని పలికెను.

నిష్కపటి యగు వృత్రాసురుని ఋజువచనముల నాలకించి ఇంద్రుడు ఆశ్చర్యపడెను. వృత్రాసురుని ప్రశంసింపక ఉండలేకపోయెను. ఇంద్రుడు వృత్రాసురునితో ఇట్లు పలికెను:

"దానవా! నీవు ఆపదలో యుంటివి. అయినను ధైర్యమును వదలకుంటివి. వివేకమును త్యజించ కుంటివి. భక్తిని విస్మరింప కుంటివి. అలౌకికమైన మనస్సును కలిగియుంటివి. నీవు ధన్యుడవు. పరమాత్మను అనన్యభక్తితో సేవించుచున్నావు.

"అసురశ్రేష్ఠా! దుస్తరమైన మాయను నీవు దాటితివి. అసురభావమును అంతమొందించితివి. జ్ఞాన వైరాగ్యములను స్థిరముగ మనమున ధరించితివి. రాక్షసుడవైనను నీకు శ్రీహరి యందు దృఢభక్తి కలిగినది. ఇది చాలా అద్భుతమైన విషయముగ తెలియుచున్నది. హరిభక్తి యుతుడు అమృత సాగరమున ఈదుచుండును. అట్టివానికి స్వర్గసుఖ

ములనెడి కూపజలము యొక్క ప్రయోజనమేముండును? దానవా! నీకు శ్రీహరి పాదపద్మముల యందు మనస్సు లగ్నమై యుండుట చేత స్వర్గాభిలాషకూడా నశించినది. నీ జన్మ చరితార్థమైనది" యనెను.

ఇంద్రుని చేతినుండి వజ్రాయుధము జారిక్రిందపడినపుడు ఇంద్రుడు దానిని సిగ్గుచే తిరిగి గ్రహించలేదు. దానిని గ్రహించుమని వృత్రాసురుడు తెలిపెను. వజ్రాయుధము భగవానుని ఐశ్వర్యము. భక్తి యొక్క పూర్ణ స్వరూపము. ఇంద్రుడు వజ్రాయుధమును పడవేసినట్లు మనము గూడ భక్తిని వివత్కర పరిస్థితుల యందు పారవేసుకొను చుందుము. వ్యాపారములో నష్టమొచ్చిన దనియు, లాభము రాలేదనియు, కుమార్తెకు వివాహము కాలేదనియు, కుమారునకు ఉద్యోగము రాలేదనియు, ఆరోగ్యము సరిగలేద నియు అనేక విధములైన బాధలకు గురియైనపుడు భక్తిని వదలిపెట్టు చుందుము. అది చాలా పొరపాటు. క్రిందపడిన వజ్రాయుధమును గ్రహించుటకు ఇంద్రుడు సంశయించెను. దూరమైన భక్తిని తిరిగి జనులు పొందజాలరు. వృత్రాసురుడు ఇంద్రునికి నచ్చజెప్పి, వజ్రాయుధమును హస్తమున ధరించునట్లు చేసెను. అలాగే దూరమైన భక్తిని గురువులు తమ జ్ఞానబోధ ద్వారా మరల మన హృదయములలో నింపుదురు.

సమర రంగమున పోరుటకు సిద్ధమైన శత్రువులు పరస్పరము ఈ విధముగా విజ్ఞాన దాయకములైన విషయములను ముచ్చటించుట చరిత్రలోనే ఒక నూతనాధ్యాయముగా పరిగణింపవచ్చును. ఇంద్ర వృత్రాసురులు అలా భాషించి సమరమున కుద్యుక్తులైరి.

వృత్రాసురుడు లోహమయమగు శూలాయుధమును ఇంద్రునిపైకి విసిరెను. ఇంద్రుడు వజ్రాయుధముచే దానిని ఖండించెను. దానితో పాటు వృత్రాసురుని ఎడమ చేతిని కూడా ఖండించెను. ఇంద్రుడు వృత్రాసురుని రెండు చేతులను ఖండించగా, అతడు ఆకాశమునుండి క్రిందపడి రెక్కలు తెగిన పర్వతమువలె శోభించుచుండెను.

క్రిందపడిన వృత్రాసురుడు భయంకరముగా నోరు తెరిచెను. అతని పై దవుడ స్వర్గమును చేరియుండగ క్రిందిదవుడ భూమిపై నుండెను. నాలుక భయంకర సర్పము వలె గన్పట్టు చుండెను. గొప్ప దేహముగల దానవుడు పర్వతములను కదలించెను. పాదములను గట్టిగ భూమిపై కొట్టుటచేత భూమి పొడియగుచుండెను. నడచివచ్చు పర్వతమువలె కదలి ఇంద్రుని సమీపించి కొండచిలువ ఏనుగును మ్రింగునట్లు ఐరావతముతో గూడిన మహేంద్రుని మ్రింగెను. ఆ దృశ్యమును గాంచి దేవతలందరు దుఃఖముతో విలపించిరి.

వృత్రాసురుని ఉదరములో ప్రవేశించినను, నారాయణ కవచమును పారాయణము చేయుచుండుటచేత ఇంద్రుడు మరణింపకుండెను. వెంటనే వజ్రాయుధమును చేబూని వృత్రాసురుని ఉదరమును చీల్చివేసి ఇంద్రుడు బహిర్గతమయ్యెను. ఇక ఆలస్యము చేయకూడదని భావించి వృత్రాసురుని శిరస్సును ఖండించెను. వజ్రాయుధము గొప్ప శక్తివంతమైన ఆయుధమైనను వృత్రాసురుని శిరస్సును ఛేదించుటకు ఒక సంవత్సర కాలము పట్టెను. వృత్రాసురుడు మరణించెను. వృత్రాసురుని జీవాత్మ విష్ణుదూత దేహమును ధరించి అతీతుడు, అప్రమేయుడు నైన సంకర్షణ భగవానుని సన్నిధిచేరెను.

వృత్రాసురుడు నిహతుడయ్యెను. ఇంద్రుడు తప్ప వృత్రాసురుని మరణమునకు సర్వులు సంతోషించిరి. దేవతలందరు ఇంద్రునితో మాటలాడకుండ వెడలిరి. ఇంద్రుడు సంతాపచిత్తు డయ్యెను.

ప్రారంభమున ఋషులు, దేవతలు ఇంద్రుని సమీపించి వృత్రాసురుని వధించమని కోరిరి. ఇంద్రుడు అందులకు సమ్మతించలేదు. బ్రహ్మహత్యా పాతకము పైబడునని భయపడెను. విశ్వరూపుని వధించుట వలన కలిగిన పాపమును భూమి, చెట్లు, నీరు, స్త్రీలు పంచుకొనుట జరిగినది. మరల బ్రహ్మహత్యాపాతకము సంక్రమించినచో దాని నెవ్వరికి ఇవ్వవలెను? అని ఇంద్రు డాలోచించెను.

ఋషులు దేవేంద్రునికి శుభము పలికిరి. బ్రహ్మహత్యాపాతకము సంక్రమించినచో ఇంద్రునిచే అశ్వమేధ యాగము చేయించి పాప పరిహారమును కలిగించునట్లు చెప్పిరి. అశ్వమేధ యాగ ఫలమును విశేషముగ వర్ణించిరి. ఈ విధముగ ఋషులచే ప్రేరేపింపబడి ఇంద్రుడు వృత్రాసురుని వధించెను. వృత్రాసురుని వధ దేవతలకు, ఋషులకు, లోకపాలురకు సంతృప్తిని కల్గించినది. కానీ ఆ కార్యము ఇంద్రునకు మాత్రమే సంతాపమును కలిగించినది. జయము లభించినను అపజయము యొక్క అనుభవమునే అందించినది. ఎప్పుడూ లజ్జపడు కార్యమును చేయరాదు.

హ్రీమన్తం వాచ్యతాం ప్రాప్తం సుఖ యన్త్యపి నో గుణాః

"హేయమైన కార్యము నొనరించిన లజ్జాశీలుడు ఆ కార్యము వలన లబ్ధిని పొందినను సుఖపడలేడు" అని శ్రీశుకులవారు ఈ సందర్భమున పరీక్షిత్తునకు తెలుపుచున్నారు.

పరుల బుద్ధిచే నడుపబడువాడు ఎన్నడూ సుఖించలేడు. ఋషుల మాటల నాలకించి ఇంద్రుడు బ్రహ్మహత్యా పాపమును బొందెను. వృత్రాసురుని మరణానంతరము ఎన్నికలలో అపజయము పాలైన అభ్యర్థిని కార్యకర్తలు వదలి వెళ్ళునట్లు ఋషులు ఇంద్రునితో మాట్లాడకుండా వెళ్ళిరి. అందరూ ఆనందముగా యున్నారు. ఇంద్రుడొక్కడే సంతాప హృదయుడై యున్నాడు.

ఇంద్రునికి ఒక వికారస్వరూపము గోచరించెను. క్షయరోగముతో బాధపడుచున్న ఒక ముదుసలి యగు చండాల స్త్రీ రక్తసిక్తమైన వస్త్రములను ధరించి, తెల్లని కేశములను విరబోసికొని, చేపవాసనగల శ్వాసలను వదలుచు, "ఆగు-ఆగు" యంటూ ఇంద్రుని అనుసరించెను. అదియే బ్రహ్మహత్యా పాపము.

ఇంద్రుడు ఆకాశమున కేగెను. అక్కడగూడ ఆ స్త్రీ గోచరించెను. సర్వదిక్కులకు పరుగులిడెను. అయినను ఆమె అనుసరించుచునే యుండెను. పాపము మనిషిని విడువదు. వైనాకి వెళ్ళినా చేయిని పట్టుకొనియే యుండును. ఇంద్రునికి ఏమిచేయను తోచక మానస సరోవరమున ప్రవేశించెను.

పాపము నాచరించినవారు ఆంతరంగిక పరిశోధన గావించుకొని శుద్ధిపడాలి. అదియే మానస సరోవరములో ప్రవేశించుటలోని అంతర్భావము. ఇంద్రుడు అచ్చట వేయి సంవత్సరము లుండెను. జీవులు పాపము నొక్క క్షణములో నాచరింపగలరు. కానీ పరిహారము అంత శీఘ్రముగ జరుగదు. దీర్ఘకాల తపస్సుచే పాపమును పోగొట్టుకొనవలెను.

యజ్ఞ యాగాదుల యందు సమర్పింప బడిన యజ్ఞభాగమును అగ్నిదేవుడు ఇంద్రునకు సమర్పించుటకు తెచ్చుచుండెను. కానీ ఇంద్రుడు జలమునందు యున్నందున అగ్ని ప్రవేశింపలేకుండెను. ఈ విధముగా ఇంద్రుడు భోగ శూన్యుడుగా కూడా జీవించవలసి వచ్చెను. పాపప్రక్షాళనము కొరకు అంతర్మథనము జరుగునపుడు జీవులు భోగ శూన్యులుగనే యుండవలెను. ఉపవాసాది వ్రతముల నాచరింపవలెను. భోగాసక్తియే పాపమునకు కారణమగును. భోగశూన్యత ప్రాయశ్చిత్తమున కుపకరించును.

ఆ తరువాత ఇంద్రుడు సత్యరూపుడగు శ్రీహరి నారాధించి పాపవిముక్తు డయ్యెను. భగవన్నామము సర్వపాపములను హరించును. కల్మషములను కరిగించును. ఇంద్రుడు మరవురమునకు విచ్చేయగా దేవతలందరు ఆయనను ఆహ్వానించిరి. ఋషులు అతనిచే అశ్వమేధ యాగమును చేయించిరి. సూర్యుని తాపమునకు మంచుగడ్డ కరుగునట్లు యాగ ఫలితముగా ఇంద్రుని యందు శేషించియున్న కల్మషములు గూడ హరింపబడెను.

వృత్రాసురుని పూర్వ వృత్తాంతము

అసంఖ్యాకములైన జీవరాసులలో మానవుల సంఖ్య అల్పమైనది. మానవజన్మ దుర్లభమైనది. పశుపక్ష్యాదులు సహజాతములతో వర్తించుచుండును. మానవుడు బుద్ధితో ప్రవర్తించు చుండును. బుద్ధిగల మానవుడు విచక్షణ గలిగినవాడై ధర్మాధర్మముల తారతమ్యమును గ్రహించు చుండును. మానవులందరికీ బుద్ధి యున్నది. కానీ దాని నుపయోగించువారు బహు అరుదుగా తెలియు చుందురు. ఉపయోగించని పరికరము త్రుప్పు పట్టులాగున వినియోగించని బుద్ధి నిరుపయోగ మగును.

బుద్ధి నుపయోగించువారే ధర్మము నెరుగగలరు. ధర్మము నెరిగిన వారిలో ధర్మము నాచరించు వారు బహు అరుదుగా తెలియు చుందురు. ధర్మము నెరిగినను స్వభావము నతిక్రమించలేక చాలామంది ధర్మచ్యుతు లగుచుందురు.

ధర్మము నాచరించువారిలో గూడా మోక్షము నపేక్షించు ముముక్షువులు చాలా తక్కువగా యుందురు. ధర్మాచరణములో లౌకికమైన భోగానుభవము ప్రత్యక్ష రూపమున గోచరించు చుండును. అలౌకికమైన మోక్షమును గోరువారే ముముక్షువు లగుదురు.

ముముక్షువు లైన వారిలో గూడ గృహ సంబంధమైన బంధములను త్రెంచుకొని, నిస్సంగులైన వారు మాత్రమే కృష్ణగత చిత్తులై, ధ్యానమగ్నులై తరించుచుందురు. ఇట్టి వారు ఏ లక్షకో, కోటికో ఒక్కరుగా తెలియుచుందురు.

మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే
యతతా మపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వతః ॥

"వేలమంది మనుజులలో ఏ ఒక్కడో సిద్ధికొరకు యత్నించును. అలా యత్నించెడి వేలమందిలో ఎవడో ఒకడు నన్ను వాస్తవముగ తెలిసికొనును" అని శ్రీకృష్ణుడు గీతలో తెలిపెను.

భక్తి సులభముగా అలవడదు. అనేకజన్మల వాసనాప్రభావముచే కలుషితమైన అంతఃకరణము స్థిరముగా నారాయణుని యందు నిలువదు. దీర్ఘకాల వాసనలు నశింపవలెనన్నచో దీర్ఘకాల సాధనల నాచరింపక తప్పదు. జన్మాంతర వాసనలు, జన్మాంతర సాధనల వలననే నశించును. వాసనలు ఎవరికి నశించునో అట్టివారికే వాసుదేవుని యందు భక్తి కుదురును. భక్తి కుదిరిన వారికే ముక్తి లభించును. అట్టి మహాత్ములైన ముక్తాత్ములు సుదుర్లభులు.

బహూనాం జన్మనామన్తే జ్ఞానవాన్మాం ప్రపద్యతే
వాసుదేవ స్సర్వమితి స మహాత్మా సుదుర్లభః ॥

"అనేక జన్మ పరంపరల యందు జ్ఞానమును సంపాదించిన ఆత్మజ్ఞాని సర్వమును వాసుదేవుడే యని గ్రహించి నన్ను సేవించుచున్నాడు. అట్టి మహాత్ముడు మిక్కిలి అరుదుగ నుండును" యని శ్రీకృష్ణపరమాత్మ గీత యందు తెలిపెను.

రాక్షసుడైన వృత్రాసురునకు అట్టి సుదుర్లభమైన భక్తి ఎలా కలిగినది? ఇంద్రుని గూడ స్పందింప జేసిన నిర్మలభక్తి మహాపాపియైన వానికెలా లభ్యమైనది? సత్త్వగుణ ప్రధానులైన భక్తులకే నారాయణుని యందు భక్తి స్థిరముగ నిలువదు. మహాపాపియైన వృత్రాసురునకు త్యాగమయమైన ఈ భక్తి ఎలా అలవడినది? ఈ ప్రశ్నలే పరీక్షిత్తునియందు ఉత్పన్నమయ్యెను. ఈ విషయముల నెరుగ గోరి పరీక్షిత్తుడు శ్రీశుకుని ప్రశ్నించుచున్నాడు.

దేవానాం శుద్ధ సత్త్వానా మృషీణాం చామలాత్మనామ్
భక్తి ర్ముకున్ద చరణే న ప్రాయేణోప జాయతే ॥

"శుద్ధసత్త్వులైన దేవతలకు, నిర్మలాత్ములైన ఋషులకే సాధారణముగ ముకుందుని పాదపద్మముల యందు భక్తి స్థిరముగ కలుగదు. మహాత్మా! మహాపాపియగు వృత్రాసురునకు ఇట్టి పవిత్రమైన భక్తి ఏల అలవడినది?" యని పరీక్షిత్తుడు శ్రీశుకుని అడిగెను.

శ్రద్ధాయుతుడగు పరీక్షిత్తుడిలా ప్రశ్నింపగా మహాత్ముడగు శుకబ్రహ్మ పలుకుచున్నాడని నైమిశారణ్యములో సూతుడు శౌనకాది మునులకు తెలుపుచున్నాడు.

పూర్వము చిత్రకేతుడను పేరుగల రాజుండెను. ఆయన పాలనలో ప్రజలు ఆనందముగ జీవించుచుండిరి. ధర్మము చతుష్పాదములతో చరించుచుండెను. చిత్రకేతునకు అనేకమంది భార్యలు గలరు. అయినను అతడు సంతానహీను డయ్యెను.

చిత్రకేతువు రూపవంతుడు. యౌవనవంతుడు. విద్యావంతుడు. ధనవంతుడు. సౌందర్యవంతుడు. వీటన్నింటిలోపాటు దుఃఖప్రదుడు గూడా నయ్యెను. సర్వమున్నను సంతానము లేదని దుఃఖించుచుండెను. వెలుగు లెన్నున్నను దానిని ఆర్పే నెలితి కూడా యుండెను.

చిత్ర విచిత్రములైన ఆలోచనలను చేయు మనస్సే చిత్రకేతువు. మనస్సులో సదా విచిత్రములైన చిత్రములు కదలుచుండును. అందమైన ఉద్యానవనములో కూర్చొనిన వ్యక్తి తన ఆంతర్యములోని వికృతములైన ఆలోచనా రూపములను దర్శించుచుండును. తన నులివ వాతావరణములో నిలచియున్నవాని మనస్సు మనోహరములైన దృశ్యములను తన

ఊహలో దర్శించుచుండును. ఇదియే మనస్సు యొక్క వైచిత్ర్యము. చిత్రకేతువునకు అన్ని సంపదలతో పాటు దుఃఖము కూడా యుండెను. మనస్సు సమస్త సుఖములను కలిగియున్నను అసంతృప్తిని కూడా కలిగియుండును.

ఒకనాడు మహాత్ముడైన అంగిరస మహర్షి చిత్రకేతుని గృహమునకు వచ్చెను. అంగిరముని చిత్రకేతువు సత్కరించెను. భోజనానంతరము సుఖాసీనుడైయున్న మహర్షిని సమీపించెను. నమస్కరించి సమీపమున భూమిపై గూర్చొనెను. రాజును గాంచి అంగిరసు డిలా పలికెను:

"రాజా! నీవు ఆరోగ్యముగా యుంటివా? నీ భార్యలు, ప్రజలు, మంత్రులు, సేవకులు క్షేమమా? చిత్తము స్వస్థతను బొందినచో జీవితము సుస్థిరముగ యుండును. నీకు మానసిక ప్రశాంతత యున్నట్లు గోచరించుట లేదు. విఫల మనోరథునివలె తెలియుచున్నావు. నీ ముఖములో ఏదియో వెలితి గోచరించుచున్నది. నీ మనోభావాలకు నీ ముఖము ప్రతిబింబముగా యున్నదని నేను భావించుచున్నాను" యనెను.

అంగిరముని మాటల నాలకించిన చిత్రకేతువు ఇలా పలికెను: "మహాత్మా! మీరు తపో ధనులు. జ్ఞాన సంపన్నులు. మీకు అగ్రాహ్య మనునది యుండదు. మీ యాజ్ఞ ననుసరించి నా మానసిక వేదనను మీ ముందుంచు తున్నాను. తండ్రీ! నాకు సర్వసంపదలున్నవి. కానీ సంతానము లేదు. గతిని తెలుపు పుత్రుడు లేడాయెను. ఇదియే నా మహావేదనకు కారణమై యున్నది. ఆకలిలో యున్న వానికి చందన తాంబూలాదులు సుఖమును ప్రసాదించనట్లు, సంతానములేని మాకు రాజ్య సుఖములు ఆనందమును పంచలేకున్నవి. మహాత్మా! ఏమి చేయుట వలన నాకు పుత్రుడు జన్మించునో దయచేసి తెలుపుడు" యని ప్రార్థించెను.

మితిమీరిన ఆశలు, అతిచేష్టలు, బ్రతుకులో దుఃఖాన్ని నింపుతాయి. సంతానము లేకపోవుట దుఃఖముకాదు. సంతానము లేదనెడి భావనయే దుఃఖము. చాలామంది సంతానము లేదని దుఃఖించుచుందురు. ఈ వెలితియే ధ్యానములో ప్రవేశించి బాధించుచున్నదని నాతో కొందరు చెప్పియున్నారు. అధిక సంతానము గలవారు సంతానహీనులను గాంచి, వారిలాగా యుండినచో చక్కగా ధ్యానము చేసుకుంటూ, గ్రంథములను అధ్యయనము చేసి యుండెడివారము. ఇప్పుడు సంతానమును పోషించుటకే సమయము సరిపోవుట లేదు యని కొందరు బాధపడుటను గూడ నేను జూచియున్నాను.

పుత్రుని అందరూ కనలేరు. జ్ఞానపుత్రుని సర్వులూ యత్నించి పొందవచ్చును. సంతానము లేనివారు సంతాపపడ నవసరములేదు. ఎక్కువ కాలము సాధన చేసుకునే భాగ్యమును భగవానుడు ప్రసాదించినాడని తృప్తిచెందాలి. సంతోష జీవనమునకు సంతానమే కారణమని భావించుట భ్రమలాంటిది. సంతానము వాస్తవానికి దుఃఖమునే అందించును.

బిడ్డ జన్మించిన నాటినుండి తల్లి దండ్రుల చిత్తములు బిడ్డని గూర్చియే ఆలోచించుచుండును. బిడ్డ ఆరోగ్యము చెడునేమోయని క్షణక్షణము జాగ్రత్త పడుచుందురు. బిడ్డ ప్రయోజకుడగునో కాడో యని ఆందోళన చెందుచుందురు. బిడ్డ విద్యాహీనుడైనచో

సమాజములో అగౌరవము ప్రాప్తించవచ్చును. విద్యావంతుడైనచో తమనే న్యూనత పరచునేమో యనెడి భయము అంతర్యములో కదలుచుండును. చదివించుటలో శ్రమపడవలసి యుండును. పెంచుటలో కష్టపడవలసి యుండును. శ్రమపడి వివాహమును జరిపించవలెను. తదనంతరము తమను తరిమి గొట్టినను చేయగలిగినదేమీ లేదు.

బిడ్డలు కలిగితే భారమని భావించ నవసరములేదు. కలుగనిచో కలత చెందవలసిన అగత్యమసలే లేదు. ఉండేది పోదు. లేనిది రాదు. ఉన్నది ఉన్నట్లే ఉండనీ. లేనిది లేనట్లే లేకపోనీ. ఈ విధమైన భావసౌందర్యము గలవారు సంతానవంతు లైనను, సంతానహీనులైనను సంతాపమునకు మాత్రము గురికారు.

చిత్రకేతువు విన్నపము నాలకించిన అంగిరసుడు దయాళువై పుత్రకామేష్టి యాగమును చేయించెను. యజ్ఞశేషమును, చిత్రకేతువు యొక్క రాణులలో యగ్రమహిషి ఉత్తమురాలు యైన కృతద్యుతి కిచ్చెను. ఆమెను ఆశీర్వదించెను. ఆమెకు పుత్రుడు కలుగుననియు, అతని వలన సుఖదుఃఖములు అనుభవింపవలె ననియు పలికి ఆ మహాత్ముడు వెడలెను.

సంతానము సుఖప్రదముగా భావింతురు. కానీ యది సుఖదుఃఖ మిశ్రితమని అంగిరసుడు చెప్పుచున్నాడు. బిడ్డలు హర్షశోకాదులను సమానముగా పంచెద రనెడి సత్యమును కొందరే గ్రహింపగలరు. పుట్టుకచే హర్షము నందించిన బిడ్డడు మరణముచే శోకము నందించును.

కృతద్యుతి గర్భమును ధరించెను. నవమాసములు నిండెను. ఒక శుభదినమున పుత్రుని గనెను. చిత్రకేతువు పరమానందము నొందెను. కృతస్నానుండైన చిత్రకేతువు కుమారునకు జాత కర్మాదులను నిర్వర్తించెను. అపరిమితముగ దానము లొసరించెను. మేఘము వర్షించి సర్వజీవులను శాంతపరచినట్లు, చిత్రకేతువు విశేషమైన దానాదులచే సర్వులను సంతృప్తి పరచెను.

బిడ్డడు దినదిన ప్రవర్ధమాను డగుచుండెను. తల్లిదండ్రులను మిక్కిలి సంతోషపెట్టుచుండెను. బిడ్డనుగాంచి కృతద్యుతి హర్షాతిశయముతో పరవశించు చుండెను. తన జన్మ ధన్యమైనట్లు చిత్రకేతువు భావించెను. బిడ్డను పెంచుటలో విశేషమైన శ్రద్ధను చూపసాగెను.

కృచ్ఛ్ర లబ్ధేఽథ రాజర్షే స్తనయేఽను దినం పితుః
యథా నిస్వస్య కృచ్ఛ్రాప్తే ధనే స్నేహోఽన్వ వర్ధత ॥

"కష్టపడి ఆర్జించిన ధనముపై దరిద్రునకు ప్రతిదినము ప్రేమ పెరుగునట్లు, బహుకాలము తరువాత గలిగిన బిడ్డపై చిత్రకేతువునకు ప్రేమ పెరుగుచుండెను."

సుతుని ప్రసాదించి, తన సుఖమును వృద్ధిచేసిన పట్టపురాణి కృతద్యుతిపై చిత్ర కేతువునకు ప్రేమ అధికమాయెను. రాణులందరిపై ఉదాసీనమును వహించి కృతద్యుతినే అమితముగ ప్రేమించుచు రాజు సంతోషపెట్టు చుండెను. రాణులందరికి ఈర్ష్య జనించి ది. కృతద్యుతికి తమకు అలభ్యమైన సంతాన సంపత్తి లభించినందులకు రాణుల

గుండెలు మండుచుండెను. దానికి తోడుగ రాజు వారి విషయములో ఉదాసీనతను ప్రదర్శించుచుండెను. రాజుగారి ఈ విధమైన ప్రవర్తన వారి ఈర్ష్యాజ్వాలలకు చిదుగులు పేర్చినట్లాయెను. వారిలో ద్వేషాగ్ని మండుకొనెను. దుష్టసంకల్పము యనెడి ధూమము కదలి మహాగగనము నంతటిని వ్యాపించెను. పెరిగిన ద్వేషము బుద్ధిని సంకుచిత మొనరించెను. రాజుయొక్క అనాదరమును సహింపలేని రాణులు పూపవయస్కుడైన బిడ్డకు విషము పెట్టిరి.

బిడ్డడు ఊయలలో నిద్రించు చుండెను. సమయ మధికమైనను బిడ్డడు లేవలేదు. బిడ్డడీనాడు గాఢనిద్ర బోవుచున్నాడని కృతద్యుతి భావించెనేగాని అది శాశ్వతనిద్ర యని గ్రహింప దాయెను. దాసిని బిలచి సుతుని ఊయల నుండి తీసికొని రమ్మని చెప్పినది. దాసి వెడలినది. బిడ్డని జూచినది. అతని కళ్ళు పైకి ఉబికి యుండెను. వికృతాకారముతో యున్న బాలుని గాంచి తీవ్రముగా రోదించుచు దాసి భూమిపై బడినది. గుండెను బాదు కొనుచు దుఃఖింప సాగినది. దాసి ఆక్రందనము నాలకించి కృతద్యుతి పరుగిడి బిడ్డను గాంచగా అతడు మరణించి యుండెను. దుర్భర దుఃఖముతో మూర్ఛిల్లెను. అంతఃపుర వాసులెల్లరు గుమిగూడి ఏడ్వసాగిరి. దుఃఖము రాకపోయినను సవతులైన రాణులు గూడ విలపించసాగిరి.

పుత్రుని హఠాన్మరణ వార్తను విని చిత్రకేతువు తీవ్ర దుఃఖాగ్నికి గురియయ్యెను. లేచి తూలుతూ నడువసాగెను. శక్తిహీనుడై, దృష్టిహీనుడై మధ్యమధ్యలో పడుతూ, లేచుచూ కుమారుని కళేబరమును సమీపించి తీవ్రముగా రోదించుచూ బిడ్డదేహముపై బడెను. దారుణమగు శోకముతో బిడ్డ పాదాల వద్ద బడి విలపించుచున్న భర్తను గాంచి కృతద్యుతి తల్లడిల్లి పోయెను.

"హే విధాతా! ఎంత ఘోరము చేసితివి? ఏమిటి నీ సృష్టి వైపరీత్యము? తండ్రి జీవించి యుండగా పుత్రుడు మరణించుట నిజానికి సృష్టికే కళంకము నాపాదించు విషయమై యున్నది. బిడ్డలవలన తల్లిదండ్రులు ఇంతటి దుఃఖము ననుభవింప వలసి యున్నచో ఇక మీదట ఏ తల్లిదండ్రులు బిడ్డలను ప్రేమింతురు?

"కుమారా! నన్ను విడచి వెళ్ళితివా! నన్ను దిక్కులేని దానిని చేసితివా! చిక్కితినని ఆనందముతో పొంగిపోతినే గాని చిక్కుముడివేసి వెళ్ళెదవని ఊహించనైతిని. వత్సా! నీ తల్లిని దీనురాలను చేయుట నీకు తగునా? కుమారా! నీ తండ్రిని చూడుము. నీ పాదముల కడ పడి దారుణముగ విలపించుచున్న పితృదేవుని గాంచుము. తండ్రీ! కరుణామయుడైన నీ తండ్రిని వదలి కర్కశుడైన యమునితో వెళ్ళకుము.

"పుత్రా! లెమ్ము! నాయనా! ఇంతసేపు నిద్రించుట ఆరోగ్యానికి మంచిది కాదు. నీతో ఆడుకొనుటకు నీ స్నేహితులు వచ్చియున్నారు. నిన్ను పిలుస్తున్నారు. అయ్యో! పాలు త్రాగి ఎంత సేపైనది. నీకు ఆకలిలేదా! నీవు స్తన్యపానము చేయనిచో నా స్తనములలో క్షీరమెందుకున్నట్లు?" ఈ విధముగా రోదించుచు, పిచ్చిదానివలె పలవరించుచున్న రాణిని గాంచి చిత్రకేతువు అధిక దుఃఖముతో అచేతను డాయెను.

ఉ॥ కుంకుమరాగరమ్యకుచకుంభములం గడుఁ గజ్జలంబుతోఁ
బంకిలమైన బాష్పములపాల్పడ మజ్జన మాచరించుచుం
గంకణపాణి పల్లవయుగంబున వక్షము మోదికొంచు నా
పంకరుహాక్షి యేడ్చె బరిభావితపంచమసుస్వరంబునన్.

అని కృతద్యుతి యొక్క దీనావస్థను పోతనామాత్యుడు ఆంధ్రభాగవతములో వర్ణించినాడు.

జ్ఞానోపదేశము

బిడ్డ శవముమీద పడి రోదించుచున్న ఆ దంపతులను ఓదార్చే ధైర్యము, శక్తి ఆ క్షణాన ఎవ్వరికీ లేకపోయెను. ఇంతలో ఇరువురు వ్యక్తులు అక్కడికి వచ్చిరి. చిత్రకేతువును ఇలా ప్రశ్నించిరి:

"రాజా! నీవు ఎవరి కొరకు విలపించుచున్నావు? ఆ చచ్చిన బాలుడెవరు? అతడు నీ కేమగును? అతనికి నీకు బంధుత్వ మేమిటి? నీ జన్మ మెపుడు? అతడెప్పుడు జన్మించెను? మీ బంధము ఆదినుండి యున్నదా? ఇప్పుడున్నదా? ఇక మీదట యుండునా?

"రాజేంద్రా! జలప్రవాహ వేగమునకు ఇసుకరేణువులు ఒక్కొక్కసారి కలియుచుండును. ఒకొక్కసారి విడిపోవుచుండును. కాల ప్రవాహములో ఎన్ని కలయికలో? ఎన్ని విడిపోకలో? ఎవరిని గురించి ఎవరు దుఃఖించాలి? వెళ్ళిన వారిని గూర్చి దుఃఖించుటకు ఉన్నవారు వెళ్ళకుందురా? విష్ణుమాయ నెరుగలేక జీవులు మమతాను బద్ధులగుచున్నారు.

సీ॥ నీకు నీ డెవ్వడు నీ వెవ్వనికి శోక సంతాప మందెదు సార్వభౌమ!
పుత్రమిత్రాదులు పూర్వజన్మంబున నెవ్వనివారలో యెఱుగగలవె?
మొదల నదీవేగమున నాడ కాడకు సికతంబు గూడుచు జెదరుచుండు
నా రీతి బ్రాణుల కతికాలగతిచేత బుట్టుట చచ్చుట పాసగుచుండు
ఆ॥ గాన భూతములకు గలుగు భూతంబులు మమతతోడ విష్ణుమాయజేసి
దీని కడలనేల ధృతి దూలగా నేల? బుద్ధి దలపవలదె భూతసృష్టి?

"బీజము వలన బీజము జనించునట్లు తల్లిదండ్రుల వలన బిడ్డలు జనింతురు. ఇవి అనిత్యబంధములే గాని సత్యము గానేరవు. గతములో ఈ బంధములు మనకు లేవు. భవిష్యత్తులో ఉండబోవు. అలాంటివి ఇప్పుడున్నను లేనివే యని గ్రహింపుము. ఈ సృష్టిలో మనము అముఖ్యులము. పరతంత్రులము. జగదీశ్వరుడు పితృరూపముతో జీవులను సృష్టించును. రాజ రూపముతో పోషించును. సర్పాదుల రూపముతో నాశమొనర్చును. కర్తృత్వములేని జీవులు కర్తృత్వాభిమానముతో దుఃఖార్తు లగుచున్నారు" అని పలికిరి.

చిత్రకేతువు వారి మాటల నాలకించి, కన్నీటిని తుడుచుకొని ఇలా పలికెను: "మహాత్ములారా! మీరెవరు? మీ మాటల నాలకింపగా మీరు గొప్ప వైభవము గలవారని తెలియుచున్నది. జ్ఞానసంపన్నులని విదితమగుచున్నది. మీ వేషములను జూచిన పిచ్చివారి వలె గన్పట్టుచున్నారు. పరమహంసలైన మహాత్ములు మాలాంటి అజ్ఞానుల మోహములను తొలగించుటకు అవధూతలవలె సంచరించు చుందురని గతంలో వినియున్నాను. మీరు ఆ కోవకు చెందిన వారని భావించుచున్నాను. మహాత్ములారా! నేను అజ్ఞానిని. మోహాంధ కారములోబడి దుఃఖించుచున్నాను. నాకు మార్గమును దెలిపి రక్షింపుడు"యని ప్రార్థించెను.

క॥ పొందుగ గ్రామ్యపశుత్వము బొంది మహాశోకతమముబొందిన నాకున్
ముందఱ దివ్యజ్ఞానము జెందించినవారి మిమ్ము జెప్పుడు తెలియన్.

చిత్రకేతుని మాటల నాలకించిన ఆ నూతన వ్యక్తులలో ఒక వ్యక్తి బదులు పలికెను. "రాజా! నేను అంగిరసుడను. పుత్రుని కొరకు పరితపించిన నిన్ను అనుగ్రహించిన వాడను. ఈయన బ్రహ్మ కుమారుడు, పరమ భాగవతోత్తముడు, పూజ్యుడైన నారదమహర్షి. రాజా! భక్తుడనైన నీవు దుఃఖించుటను గాంచి, విచారించినవారమై నీ వద్ద కరుదెంచితిమి. నీపై కృప జూపుట కరుదెంచితిమి. నీవు శోకించుట తగదు.

"రాజా! నేను గతంలో నీ గృహంబున కరుదెంచినపుడు నీకు జ్ఞానోపదేశమును చేసితిని. కానీ నీకు పుత్రుని యందు ఆసక్తి యుండుటచేత పుత్రకామేష్టి యజ్ఞమును నిర్వహించి, నిన్ను సంతానవంతుని జేసితిని.

"చిత్రకేతుడా! సంతానజనిత శోకమును ఇప్పుడు అనుభవము ద్వారా తెలిసికొంటివి. భార్యాపుత్రులు, బంధుమిత్రాదులు, రాజ్యైశ్వర్యములు క్షణికములు. బాధా తప్తములు. రాజా! చక్కగా విచారింపుము. బాంధవ్యాలు, బంధాలు తొలగిపోతున్నవని చింతింపకు. ఈ బంధాల నేర్పరచుకొని బాధపడే నీ వెవరివో ఆలోచింపుము" యని అంగిరసుడు ఉపదేశించెను.

రాజుయొక్క దీనావస్థను గాంచి దయామయుడైన నారదమహర్షి హృదయము ద్రవించెను. చిత్రకేతువుతో నారదు డిలా పలికెను: "నీవు నిగ్రహమును బొందినచో నేను నీకు మంత్రము నుపదేశించెదను. అది నిన్ను తప్పక రక్షించును. మహేశ్వరాది దేవతలు ద్వైతభ్రాంతిని విడచుటకు ఏ దివ్యాత్ముని పాదపద్మముల నాశ్రయించిరో అట్టి సంకర్షణ భగవాను దివ్యదర్శనము మంత్రశక్తి ద్వారా నీవు వారం రోజులలో పొందగలవు," యని పలికి నారదుడు మృతి చెందిన రాకుమారుని సమీపించెను.

"ఓ జీవుడా! నీకు శుభము గలుగుగాక! లెమ్ము! నీ దుఃఖముచే నీ తల్లిదండ్రులు దారుణమైన బాధ ననుభవించుచున్నారు. ఆప్తులు శోకించుచున్నారు. బంధువులు విషాద ముతో యున్నారు. లెమ్ము! వారిని దర్శింపుము! వారితో భాషింపుము! వారి మనస్సులను శాంతింప జేయుము. మరల ఈ దేహములో ప్రవేశింపుము. అపమృత్యువు వలన మరణించిన నీవు తిరిగి జీవింపుము. తండ్రి యొసగు రాజ్యము ననుభవింపుము" యని నారదుడు పలికెను.

నిష్క్రమించిన జీవుడు తిరిగి బాలుని దేహములో ప్రవేశించెను. వెంటనే చచ్చిపడి యున్న బాలుని దేహము చేతనత్వము నొందెను. చిత్రకేతువు హర్షాతిశయముతో పరవశించెను. కృతద్యుతి ఆనందము అవధిలేని దాయెను. బంధువులు, భృత్యులు ఎంతగానో సంతసించిరి. ఇంతలో ఆ జీవుడు మాట్లాడుట కుపక్రమించెను.

"నేను కర్మవశుడను. ఇప్పటికి కొన్ని లక్షల జన్మలెత్తితిని. కొన్ని లక్షల యోనుల నుండి బయల్వెడలితిని. ఏ తల్లిదండ్రులను నేను స్మృతి యందుంచు కొందును? వీరు నాకు ఏ జన్మలో బంధువులు? విక్రయింపగా ఆభరణములు ఒకరి చేతినుండి మరియొ కరి చేతికి జేరునట్లు, ఈ జన్మాంతర ప్రవాహములో జీవులు పరిణామ బాంధవ్యములను క్షణికములుగ గలిగి యుందురు.

తే॥ కర్మవశమున నెందు సుఖంబు లేక దేవతిర్యఙ్నృయోనుల దిరుగు నాకు
వెలయ నేజన్మమందునో వీరు తల్లి దండ్రులయినారు చెప్పవే తాపసేంద్ర!

"అంతియే గాదు. ఈ జన్మలో గూడ వ్యక్తుల మధ్య శాశ్వత బాంధవ్యములు లేవు. మమతలతో పెనవేసుకొనియున్న బాంధవ్యములు, మమతలు మారగనే తరలి పోవుచున్నవి. తల్లిదండ్రులను వదలి బిడ్డలు దూరమగుచున్నారు. భర్తలను త్యజించి భార్యలు మరలి పోవుచున్నారు. స్నేహాలు భగ్నమౌతున్నాయి. చుట్టరికాలు చెడిపోతున్నాయి. ఎవరి కెవరు?

"తపస్వీ! మహర్షీ! మీరు నాకై దుఃఖించుట హాస్యాస్పదము. దేహాదుల వలన ఏర్పడు సంబంధాలు దేహాదులు అంతరించుటతో అదృశ్యమగును. ఈ విషయమున దుఃఖము అర్థరహితము. నిత్యుడైన భగవానుని దివ్యవైభవము గ్రహింపనిచో జీవులకు ఈ దుఃఖ ములు ఇలాగే కొనసాగును. పరమాత్మ అజుడు. నిత్యుడు. ప్రకాశైక స్వరూపుడు. సుఖ దుఃఖముల కతీతుడు.

సీ॥ ఒక్కడై నిత్యుడై యెక్కడ గడలేక సొరిది జన్మాదుల శూన్యుడగుచు
సర్వంబునందుండి సర్వంబు దనయందు నుండంగ సర్వాశ్రయుండనంగ
సూక్ష్మమై స్థూలమై సూక్ష్మాధికములకు సామ్యమై స్వప్రకాశమున వెలిగి
యఖిలంబు జూచుచు నఖిల ప్రభావుడై యఖిలంబు దనయందు నడచికొనుచు

తే॥ నాత్మమాయాగుణంబుల నాత్మమయము గాగ విశ్వంబు దనసృష్టి ఘనత జెంద
జేయుచుండును సర్వసంజీవనుండు రమణ విశ్వాత్ము డయిన నారాయణుండు.

"మహాత్మా! నిత్యుడైన జీవునకు ఎవ్వరితోను సంబంధములేదు. అతడు నిత్యుడు. జన్మించిన దేహాదులు మరణించుచున్నవి. జన్మనెరుగని జీవుడు మరణము నెరుగడు. కర్మబద్ధుడైన జీవుడు ఎంత కాలము ఏ తల్లిదండ్రులతో కలసి యుండునో అంతకాలము ఆ జీవునిపై తల్లిదండ్రు లకు వాత్సల్యముండును. మరణించగనే వాత్సల్యములన్నీ వల్లకాటిలో విశ్రమించును. అభిమానము లతనికి లేవు. అహంకారము నతడెరుగడు.

ఇట్టి నిరర్థక ప్రేమలకై వగచుట నిష్ప్రయోజనము. దేవర్షీ! సుతు లెవ్వరు? పతు లెవ్వరు? సతు లెవ్వరు? సంగతు లెవరివి? హేతులయ్యే వరకే ఈ బంధాలు. ప్రియాప్రియములు యథార్థానికి కల్పితములు. ఆత్మకు సుఖదుఃఖములు లేవు. శీతోష్ణములు తెలియవు. ఈ సత్యము నెరిగినవారు ఉదాసీనులై యుందురు" అని పలికి జీవాత్మ వెడలిపోయెను. చిత్రకేతుడు, రాణులు, బంధువులు విస్మిత చిత్తులైరి. దుఃఖమునకు దూరులైరి. మోహ మును త్యజించిరి. యమునా తటమున ఆ బాలునకు ఉత్తరక్రియలు నిర్వర్తించిరి.

విషప్రయోగము చేసిన సవతులు తమ తప్పిదమునకు దుఃఖించిరి. బిడ్డలవలన కలుగునది దుఃఖమేయని అంగిరసుని బోధవలన గ్రహించిరి. లజ్జావదనులై యమునా తటమునకు వెళ్ళి ప్రాయశ్చిత్తము చేసికొనిరి. పుత్రవాంఛను త్యజించిరి. అంగిరస నారదుల వలన ప్రభావితుడైన చిత్రకేతువు గృహ శృంఖలములను ఛేదింప గలిగెను. యమునలో స్నానమాచరించి, సంయముడైన రాజు మహర్షులకు ప్రణామ మొనరించెను. పుణ్యశీలుడు, నిర్మలహృదయుడు నైన చిత్రకేతువునకు నారదమహర్షి ఉపదేశము నొసగెను. భగవంతుని ప్రార్థించు విధమును తెలుపుతూ ఎనిమిది శ్లోకములను కూడా తెలిపెను.

ఓం నమస్తుభ్యం భగవతే వాసుదేవాయ ధీమహి
ప్రద్యుమ్నా యా నిరుద్ధాయ నమః సంకర్షణాయ చ

యని మొదలిడి ఎనిమిది శ్లోకములను తెలిపెను. తదనంతరము అంగిరస నారదులు బ్రహ్మ లోకమునకు వెడలిరి.

మహర్షి ఉపదేశమును హృదయమున నిలుపుకొని ఏడు రోజులు జలమును మాత్రమే పానము చేయుచు చిత్రకేతువు ధ్యానమగ్నుడయ్యెను. ఆ తరువాత ధ్యాన ప్రభావముచే అతనికి సత్యమెరుకపడెను. రాజ్యములు కూడా అముఖ్యములే యని గుర్తించెను. ధ్యానతీవ్రత వృద్ధి చెందెను. సప్త రాత్రాంతమున సంకర్షణ భగవానుని దర్శన మును బొందెను. ఆనంద బాష్పనేత్రు డయ్యెను. నోట మాటరాక చేతులు జోడించి నిలుచుండెను.

ఆ॥ కన్నమాత్ర నతడు కల్మషంబుల బాపి విమలచిత్తుడగుచు విశదభక్తి
నిట్టిరోమములకు బట్టగు చానంద బాష్పనేత్రు డగుచు బ్రణుతిసేసె.

"హే భగవాన్! ఆదిదేవా! అన్యులు జయింపలేని నిన్ను ఆర్తులైన భక్తులు జయింతురు. అన్యుల కజితుడనైన నీవు భక్తులచే విజితుడ వయ్యావు. నీవు ఆది మధ్యాంత రహితుడవు. అనంతుడవు. నిన్ను సేవించిన వారలకు జన్మాదులుండవు. అందుచేత సమదర్శు లగువారు మాత్రమే ఈ భాగవత ధర్మము నుపాసింతురు. దేవా! నీ దర్శనము సర్వపాపహరము. నీ నామము భవ భయహరము. నేను ధన్యుడనైతిని. నీ దర్శన భాగ్యముచే పాపములు, వాని కార్యములైన రాగద్వేషాదుల నుండి విడివడితిని. నీకు శతకోటి ప్రణామములు" యని చిత్రకేతువు ప్రార్థించెను.

అనంతుని అమరసందేశము

"రాజా! అంగిరస నారదుల ఉపదేశము చేతను, నా దర్శనము చేతను నీవు కృత కృత్యుడనైతివి. మహాత్ముల ఉపదేశములు భగవత్సందర్శనమును కలిగించు ననుటకు నీ జీవితము నిదర్శనమైనది. ఆదర్శమైనది. నేను సర్వాత్మకుడను. సర్వవ్యాపిని. నేను పర బ్రహ్మముగను, శబ్దబ్రహ్మముగను యుందును" అంటూ భగవద్వైభవమును తెలిపెను.

జీవుడు అవస్థాత్రయమునకు సాక్షియై యున్నాడు. పరమాత్మ ద్రష్టయేగాని దృశ్యము గాదు. దృశ్యము అన్నియు ఆభాసలే. ద్రష్టయైన చైతన్యములో లయించి పోయే వియే. ఆత్మ జ్ఞానమయము. సమస్త జ్ఞానములను పొందుటకు ఆధారమగు ఆత్మ ప్రజ్ఞాన రూపమై యున్నది.

తే నైవ బ్రహ్మ భావేన పరమానంద మశ్నుతే

"బ్రహ్మ భావము చేతనే ముముక్షువు పరమానందమును బొందును" యని నాద బిన్దూపనిషత్తు ప్రవచించినది.

పరమాత్మను అంతర్యంలోనే దర్శించాలి. దర్శించాలి యనెడి భావన కదలేచోటనే యతడున్నందున సంకల్పాలను ఆపి మరీ దర్శించాలి. ఈ దర్శనమే అమృతమయము. బ్రహ్మము కన్నను అన్యమైనదంతయు విషమే. బ్రహ్మమే అమృతము.

అమృతమయమైన బ్రహ్మమును విస్మరించిన జీవుడు దేహముతో తాదాత్మ్యము చెంది తాను జీవుడనని భ్రమించుచున్నాడు. ఇదియే భేద దర్శనము. దీనివలననే దుఃఖ రూపమగు సంసారము కలుగుచున్నది. నేను - నాది యనెడి అహంకార మమకారములు తయారగుచున్నవి.

మానవజన్మము దుర్లభమైనది. శాస్త్ర జ్ఞానమును, అనుభవ జ్ఞానమును పొందుటకు మానవ దేహమే తగియున్నది. అట్టి మానవ దేహమును బొందియు ఆత్మస్వరూపము నెరుగని వాని జన్మము వ్యర్థము. కామ్యకర్మలు నిరవధిక సుఖమును ప్రసాదించలేవు. నిష్కామ కర్మలే అభయస్థితిని ప్రసాదించును. ఈ సత్యము నెరిగిన మానవుడు సంకల్ప ముల నుండి విడివడవలెను.

సీ॥ అరయంగ నెవ్వని కలివిగానట్టి యీ సలలిత మానుషజాతిబుట్టి
యాత్మతత్త్వజ్ఞాన హేతుడైనవానికి గలుగునె యెందు సుఖం బొకింత
వెలయ బ్రవృత్తినివృత్తిమార్గంబుల సుఖదుఃఖచయముల సొరిది దెలిపి
పనిచెడిసంకల్ప ఫలమూలమున బాఱు కడుసుఖదుఃఖమోక్షములకొరకు
ఆ॥ దంపతి క్రియామతంబు వర్తింతురు దానమోక్ష మేల దక్కియుండు
నఖిలదుఃఖహేతు వయిన యీ కర్మంబు నెఱిగి నన్ను దలప రిచ్చలోన.

బురద నీటియందలి బురదను తొలగించగనే నీరు స్వచ్ఛముగ తెలియును. అలాగే జగద్భావనను హృదయము నుండి తీసివేసినచో బ్రహ్మానుభవము కలుగును. సత్యాసత్య వివేకజ్ఞాన ముదయించి నపుడే బ్రహ్మజ్ఞాన ముదయించును. ఫలములను భుజించి మనము సంతృప్తి చెందుతూ ఉంటాము. అలాగని త్వగ్బీజాదులను భుజించము. వాటిని దూరంచేసి ఫలరసాదులనే గ్రోలుచుందుము. జలక్షీరన్యాయము ననుసరించి హంస క్షీరమును గ్రహించునట్లు, సాధకుడు సత్యాసత్య మిళితమై యున్న జీవితములో వివేకవంతుడై సత్యమును గ్రహించి, అసత్యమును త్యజింపవలెను. ద్వైత జగత్తును పరిత్యజించి అద్వైత జ్ఞాన సాగరములో ఓలలాడవలెను.

"రాజా! నీవు శ్రద్ధాభక్తులతో నా ఈ వాక్కులను ధ్యానము చేసినచో నన్నే బొంద గలవు" అని పలికి చిత్రకేతువు గాంచుచుండగనే భగవానుడు అంతర్హితుడయ్యెను.

పార్వతి చిత్రకేతువును శపించుట

చిత్రకేతువు మహాయోగియై, సిద్ధ చారణ గంధర్వులచే స్తుతింపబడుచు తద్వారా బలయుతుడై కొన్ని లక్షల సంవత్సరములు సంచరించెను. సర్వులచే హరినామమును కీర్తింపజేయుచు ఆనందయాత్ర సాగించుచుండెను.

ఒకనాడు నారాయణదత్తమైన దివ్య విమానమునందు చరించుచుండగా మునుల సభలో మహాదేవుడు పార్వతీదేవిని యొడి యందిడుకొని, కౌగలించుకొని యుండుటను గాంచెను. పెద్దగా నవ్వుచు చిత్రకేతు విట్లనెను:

"ఆహా! ఏమి ఈ వింత! ఈ మహేశ్వ రుడు లోకగురుడు. శ్రేష్ఠుడైనవాడు. ధర్మమును పలుకువాడు. మహర్షుల సభలో భార్యతోగూడి యున్నాడు. సన్యాసి వేషధారియై, సిగ్గువిడచి స్త్రీని ఆలింగనము చేసికొని యున్నాడు. సామాన్య మానవులు గూడ సాధారణముగ భార్యలను రహస్యముగా ధరించియుందురు. ఈ మహేశ్వ రుడు తపస్వియై యుండికూడా మునుల సభలో భార్యను తొడపై కూర్చుండబెట్టుకొని యున్నాడు" అని నిందించినాడు. ఈశ్వరనింద మహాపాప మాయెను.

చిత్రకేతువు మనస్సు ఇచ్చట విచిత్రముగా ప్రవర్తించెను. "కేతుః" యనగా గుఱుతు లేక ఉనికి యని అర్థము. చిత్ర విచిత్రములకు నిలయమైన మనస్సే చిత్రకేతువు. మనస్సులో వాసనల గుఱుతులే మిగిలియుండును. మనస్సు తనలో యున్న విషయమునే బయట గాంచును. విషయ దర్శనము వలన వాసన యుత్పన్నమగును. పరమాత్మ దర్శనము వాసనను విరోధించును. భక్తి విరోధరూప మైనందున వాసనలను కదల నివ్వదని నారదమహర్షి భక్తి సూత్రాలలో తెలిపి యున్నాడు.

స్త్రీ పురుషులలో ఆధారమైయున్న ఆత్మను సాధకుడు దర్శించాలి. జీవులలో ఈశ్వరుని దర్శింప వలసిన చిత్రకేతువు ఈశ్వరునిలో జీవుని దర్శించెను. తద్వారా వాసన కదలెను. మనస్సు మలినమయ్యెను. వాక్కు భ్రష్ట మయ్యెను.

మనస్సులో వికారము నుంచుకొనిన ధ్యానమునకు విఘ్నము కలుగును. జగత్తులో గోచరించెడి వికారములు వాస్తవానికి మనోవికారములే యని తెలియవలెను. నిర్వికారులైన పార్వతీ పరమేశ్వరులలో చిత్రకేతువు వికారమును జూచెను.

సాధారణముగా జనులు ఇలాగుననే సాగుచుందురు. దైవమును విమర్శించుచుందురు. గురువులను దూషించుచుందురు. ఒక సాధువు చెట్టుక్రింద కూర్చుని యుండెను. ఒక అందమైన అమ్మాయి ఆ దారిన పోవుచుండెను. సాధువు ఆ యువతిని రెప్పవేయకుండా చూచుచుండెను. సాధువు దృష్టిని మరియొక యువకుడు కనిపెట్టెను. అతడు సాధువును సమీపించి "స్వామీ! తమరు దేనిని దర్శించుచున్నారు?" వ్యంగ్యముగా ప్రశ్నించాడు.

"అందరూ సౌందర్యమని భావించే రూపము నందలి వికారమును గాంచుచున్నాను" అని ఆ సాధువు సమాధాన మొసగెను.

ఆ సమాధానము యువకునకు అర్థంగాలేదు. అందమైన అమ్మాయిని తదేకముగా చూస్తూ వికారమును గాంచుచున్నానని చెప్పుట అసందర్భముగా అతని కనిపించెను. "మీరు చెప్పుచున్నది నాకు అర్థమగుట లేదు" అని ఆ యువకుడనగా, పరమపవిత్రుడైన సాధువు ఇలా సమాధాన మొసంగెను.

స్త్రీ మవాచ్య దేశస్య క్లిన్న నాడీ వ్రణస్య చ
అభేదేఽపి మనో భేదా జ్జనః ప్రాయేణ వంచ్యతే ॥

"ఆహా! మానవులు ఎంతగా వంచింప బడుచున్నారు? స్త్రీల యొక్క గుహ్య ప్రదేశములకు, తడిసిన నాడులతో గూడిన కురుపులకు భేదము లేకపోయినను, మనోభేదముచే జనులు మోసపోవుచున్నారు.

చర్మఖండం ద్విధా భిన్న మపానో ద్గార దూషితమ్
యే రమన్తి నమస్తే భ్యః సాహసం కిమతః పరమ్ ॥

"రెండుగా చీలినదియు అపాన వాయువుచే దూషిత మైనదియునగు చర్మఖండమునందు రమించువానికి నమస్కారము! ఇంతకు మించిన సాహసము మరియొకటుండునా?

"నాయనా! అందమైన ఆ యువతిలో నే నివియే గాంచుచున్నాను" అని ఒకనాడు తుస్సుమనే తోలుతిత్తిలోని అందమును ఆ సాధువు వివరించెను. సాధువు పలికిన వైరాగ్య వచనముల నాలకించిన ఆ యువకుడు సాధువు పాదములపైబడి క్షమాభిక్ష కోరెను.

వికారము దృశ్యములో లేదు. దృష్టిలో ఉంది. అలాగే సౌందర్యము కూడా. మనస్సు సంస్కరింపబడని వానికి ప్రపంచములో దోషములే తలెత్తుతుంటాయి. అయోగ్యులైనవారు ఆప్తకాములను గూడా నిందిస్తుంటారు. నిందలకు, నిజాలకు సంబంధములేదు. నిర్వికారులను నిందలు తాకలేవు. చిత్రకేతువు శివుని నిందించెను. శివునికి ఆ మాటలు వినిపించెను. అయినా పరమశివుడు చలింపలేదు. జ్ఞానగంగను శిరమున ధరించినవాడు అజ్ఞాని మాటలకు ఉలిక్కిపడునా? ఎవరేమనినారు? ఎవరేమని దూషించినారు? యని జ్ఞాని ఆలోచించడు. ఆ లక్షణాలు తన యందున్నవా? లేవా? యని విచారించుకొనును.

మహర్షుల కొలువులో పరమేశ్వరుడు మిథున రూపమును ప్రదర్శించునా? మన్మథుని బుగ్గిచేసిన మాయాధీశుని మన్మే ఏ ధైర్యముతో కాముడు సమీపించును? చిత్రకేతువు అంధుడై పలవరించెను. పరమేశ్వరుడు నవ్వి ఊరుకొనెను. భవాని ఆలకించి కుపిత యయ్యెను.

భవాని ఇలా పలికెను: "ఆహా! ఎంత దారుణము? ఈ క్షత్రియాధముడు నీలకంఠుని యందు వికృష్ట భావమును గాంచి పరిహసించుటయా? గంగాధరుని లజ్జాహీనుడని నిందించుటయా? మహర్షులచే పరివేష్టితుడైయున్న పరమేశ్వరునిలోని దోషమును వారు గ్రహింపకుండిరా? ఈ మహోన్నతుడు మదాంధుడై శివుని దోషమును గాంచెనా? త్రిశూలధారిని హింసించు దండపాణి ఇతడేనా? వీడు క్షమార్హుడు గాడు. ఓరీ దుష్టుడా! నీ వొనరించిన పాపమునకు ప్రతిఫలముగా రాక్షసకులమున జన్మింపుము. సాధు దూషణము సద్గతిని హరించునని గుర్తింపుము" యని శాపము బెట్టెను.

సీ॥ ఎవ్వనిపదపద్మ మింద్రాదివిబుధుల చూడాగ్రపంక్తుల నీడ జూచు
వెవ్వనితత్త్వం బదెవయంగ బ్రహ్మాది యోగిమానసపంక్తి నోలలాడు
వెవ్వనిరూపంబు వేర్పాటు గానక వేదంబు లందంద వాద మడచు
వెవ్వనికారుణ్య మీలోకముల నెల్ల దనిపి యెంతయు ధన్యతముల జేయు
తే॥ నట్టిసర్వేశు బాపసంహారు ధీరు శాశ్వతైశ్వర్యు నాత్మసంసారు నీశు
నెగ్గు వల్కిన పాపాత్ము డెల్లభంగి దండనార్హుండుగా కెట్లు దలగగలడు.

భవానిచే శపింపబడిన చిత్రకేతువు విమానము నుండి దిగివచ్చి, దేవికి దండ ప్రణామము లాచరించి, అంజలి బద్ధుడై ఇలా పలికెను:

"జగన్మాతా! నేను నీ శాపమును గ్రహించుచున్నాను. జీవులకు సుఖదుఃఖములు సామాన్య విషయములే. జీవుల పూర్వజన్మ కర్మల ననుసరించి ఆయాజీవులకు సుఖ దుఃఖములను దేవతలు కలుగ జేయుచుందురు. ఇచ్చట బాధపడవలసినది నాకు గోచరించుటలేదు.

గుణ ప్రవాహ ఏతస్మిన్ కః శాపః కో న్వనుగ్రహః
కః స్వర్గో నరకః కో వా కిం సుఖం దుఃఖ మేవవా

"ఈ త్రిగుణ మిళిత మాయా ప్రవాహంలో శాప మెయ్యది? అనుగ్రహ మెయ్యది? ఏది స్వర్గము? ఏది నరకము? ఏది సుఖము? ఏది దుఃఖము? ఇవి యన్నియు వాస్తవానికి కల్పితములే."

"భగవానుడు సర్వభూత ప్రియుడు. సముడు. విషమత్వ మెరుగడు. నిస్సంగుడు. అందుచేత రోష మెరుగడు. అమ్మా! దోషములేని నాలో, నా మాటలలో నీవు దోషమును గాంచి శాపము నిచ్చితివి. దానిని నేను శాపముగా గ్రహించుటలేదు. ప్రసాదముగ స్వీకరించుచున్నాను. నన్ను క్షమించు" యని పలికి చిత్రకేతువు విమానము నెక్కి వెడలి పోయెను.

చిత్రకేతుని అపహాస్యము అసంగతము కాదా? ఇక్కడ సూక్ష్మంగా విచారించాలి. నిజానికి చిత్రకేతువు శివుని పరిహసించలేదు. అందుచేతనే మహేశ్వరుడు క్రుద్ధుడు గాకుండెను. చిత్రకేతువు మనోభావము నెరిగి నవ్వి ఊరకుండెను.

శివుడు మునులసభలో భార్యను కౌగలించుకొని యున్నాడు. ఇలా ఎవరు ప్రవర్తించగలరు? ఈ ప్రవర్తన ఎవరికి సాధ్యము? నిస్సంగుడు, మహాదేవుడు గనుక పరమేశ్వరునికి సాధ్యమయ్యెను. తపస్వి గనుక ఇంద్రియ చాపల్యము లేనివాడై భార్యను తొడపై కూర్చుండ బెట్టుకొని యున్నాడు యని చిత్రకేతువు వ్యాఖ్యానించెను. కాని ఆదిదేవికి మరోలా అర్థమయ్యెను.

దీనిని బట్టి మనము రెండు విషయములను గ్రహింపవచ్చును. ఎంతటి వారికైనను ఆవేశము అనర్థదాయకమే. అదియును గాక క్షణికావేశములో తీసికొనే నిర్ణయాలు సత్యములు గాకపోవచ్చును. ఈ విషయమును పార్వతీదేవి పాత్రద్వారా వ్యాసభగవానుడు మనకు తెలుపుచున్నాడు.

ఇక రెండవ విషయము. మనోభావము శుద్ధిపడి యుండుటయే గాదు. భావమును వ్యక్తపరచు పద్ధతి గూడ సక్రమముగా యుండవలెను. లేనిచో ఇతరుల అపార్థములను, తద్వారా అనర్థముల ననుభవించవలసి యుండును. ఈ విషయమును చిత్రకేతువు మాటలద్వారా మనకు తెలుపును. కనుక సంకల్పము నందును, సంభాషణము నందును సర్వదా సంయమనమును పాటించువారు సంతాపమునకు గురికారు. ఈ విషయమును మహాభారతము ఎంత చక్కగా ప్రవచించినదో చూడుడు.

వాక్యంయమో హి నృపతే సుదుష్కర తమో మతః
అర్థవచ్చ విచిత్రం చ న శక్యం బహు భాషితుమ్

"రాజా! వాక్కును చక్కగా వినియోగించుట సులభసాధ్యము గానేరదు. అర్థవంతముగ, చమత్కృతితో ఎక్కువ భాషించుట సాధ్యముగాదు" యని విదురుడు ధృతరాష్ట్రునితో పలికెను. కనుక అధిక ప్రసంగము అనర్థమునే తెచ్చిపెట్టును. లఘు భాషణము, అతి చమత్కృతి లేకుండుట, వ్యంగ్య ప్రసంగ విరమణము సదా సర్వులు అనుసరింపదగినవియై యున్నవి.

చిత్రకేతువు విమానమెక్కి వెడలిపోయెను. శాపము నాలకించియు నిర్భయుడై వెడలిన చిత్రకేతువును గాంచి ఉమాదేవి విస్మితచిత్త యాయెను. ఋషులు కూడా పరమాశ్చర్యమును వ్యక్తమొనర్చిరి. పిమ్మట రుద్రదేవుడు భవానితో ఇట్లనెను:

"రుద్రాణీ! గాంచితివా? శ్రీహరి దివ్యవైభవమును దర్శించితివా? ఆయన దాసులైన నారదాదులకు దాసుడైన చిత్రకేతువు విషయభోగములయందు ఎలా నిస్పృహుడై యుండెనో చూచితివి గదా! హరిభక్తులు అజేయులు.

నారాయణ పరాః సర్వే న కుతశ్చన బిభ్యతి
స్వర్గాపవర్గ నరకేష్వపి తుల్యార్థ దర్శినః

"హరిభక్తులై, విస్పృహులైన భాగవతులకు స్వర్గము, మోక్షము, నరకము యనెడి భేదమే లేదు. వారు అంతటా ఏకత్వమునే దర్శింతురు.

"పార్వతీ! మాయవలననే జీవులకు దు:ఖములు కలుగుచున్నవి. పూలమాల యందు సర్పము గోచరించునట్లు మాయాలోలురకు బ్రహ్మమునందు జగత్తు తెలియు చున్నది. వాసుదేవునియందు జ్ఞాన వైరాగ్యములను కలిగిన వారిని మాయ అంటలేదు. అట్టివారు ఈ ప్రపంచమున ఆశింపదగిన దిమమంతైనను లేదు.

"రుద్రాణీ! సర్వభూతప్రియుడగు శ్రీహరికి చిత్రకేతువు ప్రియసేవకుడు. నేను గూడ శ్రీహరి సేవకుడనే. కనుక మాధవగత చిత్తులగు మహాత్ముల కార్యములను గాంచి ఆశ్చర్యపడ నవసరము లేదు."

కా॥ కావున భగవద్భక్తుల భావమునకు విస్మయంబు పనిలేదు మహా
ధీవిభవశాంతచిత్తులు పావనపరతత్త్వనిపుణభవ్యులు వారల్.

యని పరమశివుడు పలుకగా పార్వతీదేవి శాంతచిత్త యయ్యెను.

శ్రీశుకుడు చెప్పుచున్నాడు: "పరీక్షిన్మహారాజా! పార్వతిచే శపింపబడిన చిత్రకేతువు తిరిగి పార్వతిని శపించుటకు శక్తిగలవాడైనను, సంయమనమును పాటించి శాపమును శాంతముగా స్వీకరించెను. మహాత్ముల మహిమ వర్ణనాతీతము! పార్వతి ఇచ్చిన శాప కారణముగ ఈ చిత్రకేతువు త్వష్టప్రజాపతి నిర్వహించిన యజ్ఞకుండము నుండి అసురుడై ఆవిర్భవించెను. రాజా! ఈ చిత్రకేతువు చరిత్ర పావనమైనది. పఠించువారలను పవిత్రమొనర్చునది. మంగళకరమైన ఈ దివ్య చరితమును ప్రాత:కాలమున పఠించువారు పవిత్రులై, పరమాత్మ రూపులగుచున్నారు" యనెను.

పుంసవన వ్రతము

హిరణ్యాక్ష హిరణ్యకశిపులను శ్రీమహావిష్ణువు సంహరించెను. ఇంద్రుని సుఖపెట్టుటకు విష్ణువు వారిని వధించెను. అట్టి కఠినాత్ముడైన ఇంద్రుని మరణమును గాంచవలెనని రాక్షసుల తల్లియగు దితి ఆలోచించెను. ఈ కార్యమును సాధించు ప్రయత్నములో చక్కని సేవల నందించుచు భర్తయైన కశ్యపుని మనస్సును వశపరచుకొనెను.

కా॥ ఏతల పెటుగక నిలిచెడు భూతంబుల జూచి యాత్మ పురుషుల మనముల్
భీతి గొలుపంగ యువతి వ్రాతంబు సృజించె బతులు వారల కరుదే!

ఈ విధముగా భార్యచేత ముసలాలితుడైన కశ్యపుడు ప్రీతి చెందినవాడై వరము గోరిన ఇచ్చెదనని పలికెను. తన బిడ్డల వధకు కారణమైన ఇంద్రుని సంహరించు పుత్రుని అనుగ్రహింపుమని దితి కోరెను. దితి కోర్కె నాలకించిన కశ్యపుడు దిగ్భ్రాంతి చెందెను.

కా॥ ఉట్టిపడునట్టి వరమీ కట్టిడి పన్నెట్టు వేడె గటకట యనుచున్
బిట్టిపడి యతడు మదిలో బుట్టినతల్లడముతోడ బొక్కుచు నుండెన్.

కశ్యపుడిలా ఆలోచించెను. "ఎంత ఘోరము జరిగిపోయినది! ఇంద్ర హత్యాపాపము నా కెదురగుచున్నది. దితి రూపమున నన్ను వంచించిన భగవన్మాయను గ్రహింపనైతిని. స్త్రీ తన నైజగుణము ననుసరించి వర్తించును. పురుషుడనైన నేను మూర్ఖుడనై ఆమెకు వశమైతిని. మోస మెరుగని నేను మోసపోయితిని. స్త్రీల మనోభావముల నెవరెరుగ గలరు?

శరత్పద్మోత్సవం వక్త్రం వచశ్చ శ్రవణామృతమ్
హృదయం క్షురధారాభం స్త్రీణాం కోవేద చేష్టితమ్

"స్త్రీల ముఖము శరత్కాల పద్మమువలె యుండును. వాక్కులు చెవులకు అమృత మయముగ నుండును. హృదయము ఖడ్గధారవలె తీక్ష్ణముగ యుండును. స్త్రీల చేష్టల నెవరెరుగ గలరు?

ఈ విధముగా ఆలోచించిన కశ్యపుడు పుంసవన వ్రతము నాచరించినచో ఇంద్ర హంతకుడగు పుత్రుడు జన్మించు ననియు, వ్రతభంగము జరిగినచో ఇంద్రహితుడగు వాడు ఉద్భవించు ననియు పలికెను. దితి కోర్కెపై పుంసవన వ్రత విధిని తెలిపెను.

మనస్సును పరమాత్మపై స్థిరముగా నిలుపుట కుపకరించునదియే వ్రతము. ఈ వ్రత నియమముల నెరింగించు నపుడు కశ్యపు డొసగిన సూచనలను పరిశీలించినచో వ్రతముకూడా చక్కని తపస్సేయని తెలియును. కశ్యపుడిలా పలికెను:

న హింస్యాద్భూత జాతాని న శపేన్నానృతం వదేత్

"ఈ వ్రతము నాచరించునపుడు హింసచేయరాదు. ఎవ్వరిని శపించరాదు. అసత్య మును పలుకరాదు." ఈ విధముగా కశ్యపుడు అనేక విధులను తెలిపెను. దితి ఆయా విధులను నిర్వర్తించుటకు అంగీకరించెను. గర్భమును ధరించెను.

ఈ విషయమును ఇంద్రుడు గ్రహించెను. మృగములను వేటాడువాడు మృగరూప మును ధరించి వానిని మోసగించునట్లు, ఇంద్రుడు సాధుభావముతో తల్లికి సేవచేయు చుండెను. పుష్ప, ఫల, పత్ర, కుశాదులను సంగ్రహించి దితికి సమర్పించు చుండెను.

ఒకనాడు దితికి వ్రతభంగమాయెను. ఈ కారణముగా ఇంద్రహితులగు మరుద్గణ ములు నలుబది తొమ్మండుగురు ఉద్భవించిరి. దితి సత్యమును గ్రహించెను. తప్పిదము నంగీకరించెను.

సాధన పరమ పవిత్రమైనది. చెడు భావముతో ప్రారంభించినను సాధన చేయు కొలది బుద్ధియందలి చెడు లంతరించును. కనుక సాధకులైనవారు సాధనను త్యజించి జీవించుట యనునది శ్వాసింపకుండా జీవించుటకు చేయు ప్రయత్నము వంటిది.

ఈ విధముగా మరుత్తుల జన్మవృత్తాంతముతో షష్ఠ స్కంధము సమాప్తమైనది.

షష్ఠ స్కంధము సమాప్తము
.... ఓం ......



నావన్నీ నీవి కావాలి

అహం హరే తవ పాదైకమూల
దాసానుదాసో భవితాస్మి భూయః
మనః స్మరేతాసుపతే ర్గుణాంస్తే
గృణీత వాక్కర్మ కరోతు కాయః

హరీ! నీ చరణముల నాశ్రయించిన దాసులకు నేను దాసుడను కాగ[illegible] ప్రాణనాథుడ వైన నీ గుణములను నామనసు స్మరించుగాక. నా నోరు సదా [illegible] కీర్తించుగాక! నా దేహము నీ సేవ నాచరించు గాక!

May I, O Hari, be born again as a servant of th[illegible] devotees who have solely taken refuge in your holy feet[illegible] my mind ponder and tongue celebrate the excellences of [illegible] Lord of my life and let my body do your service.



ఉపోద్ఘాతము

ఇది సప్తమ స్కంధము.

సప్తమ స్కంధము భగవానుని యొక్క హృదయము. అందుచేత వాసనా కంటకములను తొలగించే ప్రయత్నములో హృదయమును తన్మయ మొనర్చే రీతిలో హరినామ సంకీర్తనము జేసి తరించిన ప్రహ్లాద కుమారుని చరిత్ర ఇందు వర్ణింపబడినది.

సద్వాసనకు, అసద్వాసనకు సంఘర్షణయే ఈ సప్తమ స్కంధము. అసద్వాసనకు ప్రతిరూపము హిరణ్యకశిపుడు. సద్వాసనకు ప్రతిఫలము ప్రహ్లాదుడు.

మనుజుడు వంద సంవత్సరముల ఆయువును పొంది యుండును. అందు సగభాగము నిద్రయందు గడచును. పది సంవత్సరములు బాల్య చేష్టలలో కారిపోవును. పది సంవత్సరములు ఆటలలో సాగిపోవును. ముసలితనములో ఇరువది సంవత్సరములు వృథాయగును. మిగిలిన కొద్ది కాలమును విషయ సుఖానుభవములో గడుపుచున్నాడు. ప్రశస్తమైన మానవజన్మను వ్యర్థము చేయుచున్నాడు. ఈ విధమైన దోష జీవితమును నిరసిస్తూ బ్రతుకును ఆనందముగా గడుపు కొనుటకు నామ సంకీర్తనమును సాగింపుమని ప్రహ్లాదుడు తెలుపును.

భక్తి నిరోధ స్వభావము. అందుచేత కోరికలను కదల నివ్వదు. భక్తిలో నిష్కామ భావనయే యుండును.

రాక్షసుడై పుడితే తప్పులేదు. రాక్షసుడుగా జీవించడము దోషము యని ప్రహ్లాదుని చరిత్ర మనలను హెచ్చరించును. పరమాత్మ దివ్యధామమును చేరి తరించుటకు ప్రహ్లాదుడు నవవిధ భక్తి స్వరూపములను కూడా తెలిపెను.

భాగవత మనెడి పేరును వినగానే ప్రహ్లాదుడు మన స్మృతిపథంలో మెదలును. ఈ స్కంధము మహాభక్తుడైన ప్రహ్లాదుని చరిత్రతో నిండియున్నందున ఇది పరమోత్కృష్టమైనది. నిత్యము దీనిని శ్రవణము చేసి, ఆచరించు వారు తప్పక హరికృపకు పాత్రులయ్యెదరు.

చైతన్య భాగవతము

సప్తమ స్కంధము

అవతార వైశిష్ట్యము

పరమాత్మ సమస్త ప్రాణికోటికి ప్రభువు. సర్వులపై అతని కృపావృష్టి సమానముగా వర్తించును. అతడు సత్యమూర్తి. నిత్యదీప్తి. అతడు నిన్ను సదా వెన్నంటియే యున్నాడు. అతడు నిన్ను ఆశీర్వదించగనే ప్రపంచమంతా నీ ముందు మోకరిల్లును. ఊడిగము చేయును. అట్టి పరమాత్మ చరణకమలములను ధ్యానించుటయే జీవికి ఏకైక శరణ్యము. పాంచభౌతికమైన ఈ దేహము మృత్యుముఖంలో ప్రవేశింపక మునుపే శ్రీహరిని ధ్యానించి తరించు భక్తులు ధన్యులు.

భక్తి తెలిసిన వానికి భారము తెలియదు. బోధ గ్రహించిన వాడు బాధను గ్రహించడు. భగవంతుని బండిలో ఎక్కి పయనించువాడు ప్రత్యేకంగా తన వస్తువులను తాను మోయ నవసరం లేదు. ఏ హాని జరుగునో యనే తలంపే మనస్సున స్ఫురించదు. శుభకరుడైన శ్రీహరిని నమ్మి జీవించువారలకు అశుభము లెలా కలుగును? వచ్చిన నష్టాలు రాబోయే లాభాలకు సోపానములని భక్తు డొక్కనికే తెలును.

ఒకనాడు ధనం దగా చేస్తుంది. దుహితలు దూరమౌతారు. బంధువులు బరువౌతారు. మేడలు కూలిపోతాయి. మమతలు మాసి పోతాయి. కుమారులు కనుమరు గవుతారు. అర్ధాంగి ఆదుకోలేదు. పదవులు పారిపోతాయి. కీర్తి ఆరిపోతుంది. బ్రతుకు రాలిపోతుంది. ఇందుకేనా మానవ జీవితం?

మారిపోయే మనుజులను ప్రేమించి సాధించే దేముంటుంది? కారిపోయే ఆయువును ఎంతకాలం పట్టి బంధించగలం? ముట్టదగింది పట్టదగింది భగవచ్చరణారవిందమే. బ్రతుకుకు పరమార్థమే అర్థము. జీవికి దేవుడే గమ్యము. ప్రభువును తెలియని రాజు బికారియే. ప్రభువు నెరిగిన బిచ్చగాడు చక్రవర్తియే. స్వప్నగత సుఖాలు నీకు ఆనందాన్నివ్వవు. నిజవెలుగే నిత్యవెలుగు.

ఉన్నది ఉండనీ. నాదన్నది ఉండనీకు. తనదన్నది ఉండనీ. నేనన్నది మండనీ. అహంకారము తియ్యని విషము. విడదీయలేని కల్మషము. వినయము చల్లని అమృతము. చెడిపోని మాధుర్యము. అసద్వాసనలు అంతరించాలి. మిశ్రమ వాసనలు మిగిలిపోవాలి. సద్వాసనలు సంపదలై నిలవాలి. భక్తిని పండించాలి. బ్రతుకును ఆనందంతో నిండించాలి. అసద్వాసనాపరులు రాక్షసులు. మిశ్రమవాసనాపరులు మానవులు. సద్వాసనాపరులు భక్తులు.

సద్వాసనకు, అసద్వాసనకు సంఘర్షణయే ఈ సప్తమ స్కంధము. అసద్వాసనకు ప్రతిరూపము హిరణ్యకశిపుడు. సద్వాసనకు ప్రతిఫలము ప్రహ్లాదుడు.

గురుదేవుడైన శుకబ్రహ్మకు వందన మాచరించి పరీక్షిత్తుడు ప్రశ్నించుచున్నాడు. "మహాత్మా! పరమాత్మ జ్ఞానస్వరూపుడు. సమదర్శనము గల దివ్యాత్ముడు. ఆయన సర్వులకు ప్రియుడే గదా! అట్టి భగవంతుడు దేవతల కొఱకు దైత్యులను సంహరించుట ఏమిటి? ఈ పక్షపాత మెలా ఏర్పడెను? ప్రేమమయుడైన భగవానునకు అసురులపై ద్వేషమెలా కలుగును? ఈ విషయముల యందు నా మనస్సు సంశయగ్రస్తమై యున్నది. నా సందేహములను దయఉంచి నివృత్తి చేయుడు" అని పరీక్షిత్తు ప్రార్థించెను.

దేహమున్నంత వరకు సందేహము కూడా కలసియే యుండును. సందేహము వ్యక్తిని సన్మార్గము నుండి మఱలించును. గుంటలో నిలిచిన నీరు గుంటను మురికి చేయునట్లు మనస్సులో తిష్ఠవేసిన సంశయము మనస్సునే పాడుచేయును. "నీ హృదయంలో తుపాకి గుండునైనా పెట్టుకోగాని సందేహాన్ని మాత్రం ఉంచుకోకు" అంటారు స్వామి రామతీర్థ.

దేహము మాంసమయము. మనస్సు మీమాంసమయము. సందేహము మనస్సులో జనించవచ్చు. కానీ జీవించకూడదు. సందేహము రాగానే గురువుల నాశ్రయించి నివృత్తి చేసుకోవాలి. గురువు లభింపనిచో పరమాత్మకే నివేదించాలి. అంతరంగమందు నిలచిన సందేహాన్ని అంతర్యామి తొలగించగలడు.

సందేహమును దీర్పవయ్య సాకేత నిలయ రామయ్య

అని త్యాగయ్య తన సందేహమును రామయ్య ముందుంచినాడు.

"రాజా! మంచి ప్రశ్న నడిగితివి. నీ సంశయము సముచితమైనదియే. విష్ణుకథలు విస్మయ స్వరూపములు. విచారణచే లభ్యములు. అవి పవిత్రములు. నారదాది మునులు ఈ గాథలను సదా పరవశించి గాన మొనరించు చుందురు. అవి త్రైలోక్య పావనములు. మునులనెడి అరణ్యములకు చైత్రమాసములు."

క॥ చిత్రంబులు త్రైలోక్యప విత్రంబులు భవలతాలవిత్రంబులు స
న్మిత్రంబులు మునిజనవన చైత్రంబులు విష్ణుదేవు చారిత్రంబుల్.

యని పలికి, వ్యాస భగవానునికి నమస్కరించి చెప్పుట కుపక్రమించెను.

పరమేశ్వరుడు నిర్గుణుడు. అజుడు. నిత్యుడు. శాశ్వతుడు. దేహేంద్రియ మనో బుద్ధుల కతీతుడైనను బాధ్యభావక భావమును స్వీకరించి యున్నాడు. త్రిగుణములు మాయకు సంబంధించినవియే గాని మాధవునకు సంబంధించినవి గావు. గుణములు స్థిరములు గావు. స్థిరుడైన పరమాత్మ అస్థిరమైన గుణములు వృద్ధినొందు సమయాన సృష్టి నొనరించెను. సత్త్వగుణ వృద్ధిలో దేవతలను, ఋషులను, రజో గుణ వృద్ధిలో అసురులను, తమోగుణ వృద్ధిలో యక్ష, రాక్షసాదులను విభజించెను.

ఈ భిన్నత్వము నందు పరమాత్మ ఏకమై యున్నాడు. కట్టెలు అనేకము లైనా అగ్ని యొక్కటే. పాత్రలువేరైనా జలములో మార్పులేదు. గదులు వేరైనా గగనములో మార్పు ఉండదు. సురాసురుల యందు, సర్వప్రాణుల యందు పరమాత్మ సమంగా వ్యాపించి యున్నాడు. వివేకులు అంతరాత్మను దర్శించి ఆనందించుచుందురు. అందరూ ఆత్మను దర్శించలేరు.

ఏష సర్వేషు భూతేషు గూఢోఽత్మా న ప్రకాశతే
దృశ్యతే త్వగ్ర్యయా బుద్ధ్యా సూక్ష్మయా సూక్ష్మ దర్శిభిః

"సర్వభూతము లందును ఆత్మ నిగూఢమై యున్నందున సర్వులు దానిని గాంచలేక యున్నారు. కాని సూక్ష్మబుద్ధి గలవారు సూక్ష్మాతి సూక్ష్మమైన ఆత్మను దర్శింప గలుగుచున్నారు" అని కఠోపనిషత్తు సందేశము.

ఈశ్వరుడు సముడు. ఆ దివ్యాత్ముని యందు సమత్వమే గాని విషమత్వ ముండదు. విషమత్వము, భేదరూపము మాయ యొక్క స్వభావము. అలలు కదలు చుండగా చంద్రుడు కదలినట్లు మనకు గోచరించును. అలాగే పరమాత్మయందు భేదము ఆరోపింప బడినది.

"రాజా! పూర్వము రాజసూయ యజ్ఞ సమయమున ఈనాడు నీవు నన్నడిగిన ప్రశ్ననే మీ పితామహుడగు ధర్మరాజు నారదమహర్షిని అడిగెను. ఆ విషయమును చెప్పెదను వినుము" అని శుకబ్రహ్మ చెప్పుట కుపక్రమించెను.

శిశుపాలుడు కృష్ణద్వేషి. రాజసూయ యాగమున శ్రీకృష్ణుని పూజించుటకు విముఖతను చూపెను. భగవంతుని అనేక విధములుగ నిందించెను. దూషించెను. శ్రీకృష్ణుడు చివరగ సుదర్శన చక్రముతో శిశుపాలుని శిరమును ఖండించెను. అతని దేహము నుండి కదలి వచ్చిన జ్యోతి శ్రీకృష్ణునిలో లీనమయ్యెను. ఈ విధంగా శిశుపాలునకు సద్గతి కల్గుటను గాంచి విస్మయ చిత్తుడైన ధర్మరాజు నారదమహర్షిని ప్రశ్నించెను.

"మునివర్యా! శిశుపాలుడు పరమాత్మద్వేషి. శ్రీకృష్ణునితో శత్రుత్వమును పెంచుకొని నాడు. అట్టివానికి ముక్తి ఎలా లభించినది? అతడు నరకమునకు ఎందులకు పోలేదు?

దంతవక్త్రుడు కూడా శ్రీకృష్ణ ద్వేషియే. వారిరువురి నాలుకలు పరమాత్మ నిందనే చేయుచుండినవి. వారికి ఘోర నరకమేల లభించలేదు? సర్వులు వీక్షించు చుండగా వారు వాసుదేవుని యందు విలీనమైనారు. ఇది నా కవగతమగుట లేదు. వాయువుచే దీపజ్వాల అస్థిరమైనట్లు నా బుద్ధికూడా చలించుచున్నది. నీవు సర్వజ్ఞుడవు. దయచేసి నా సంశయమును తొలగింపుము" అనెను. ధర్మరాజుతో నారదమహర్షి నవ్వుతూ ఇలా చెప్పెను:

"ధర్మరాజా! నిందాస్తుతులను, సత్కార తిరస్కారములను అనుభవించుటకే ఈ దేహము ప్రాప్తించినది. దేహాభిమానము వలన జీవులకు "నేను - నాది" యనెడి భావములు కలుగుచున్నవి. పరమాత్మకు దేహాభిమాన ముండునా? అందుచేత ఆయనలో ద్వంద్వాలకు స్థానములేదు. ఆయనకు ద్వేషము తెలియదు. ద్వేషి తెలియడు. ఏ భావము చేతనైనను పరమాత్మను పొందవచ్చును.

ఆ॥ అలుక నైన జెలిమి నైన గామంబున నైన బాంధవమున నైన భీతి
నైన దగిలి తలప నఖిలాత్ము డగు హరి జేరవచ్చు వేఱు సేయ డతడు.

"మానవుడు శత్రుత్వము ద్వారా భగవంతుని పొందినంత సులభముగా భక్తిద్వారా పొందలేడని నా అభిప్రాయము" అని పలికి నారదుడు వివరముగా చెప్పసాగెను.

శత్రుభావముతో పరమాత్మని సదా చింతించుట వలన శత్రుభక్తుడై విష్ణుసాయుజ్యమును పొందుచున్నాడు. భక్తితో కొందరు శ్రీకృష్ణుని పొందినట్లు, కొందరు కామముద్వారాను, కొందరు ద్వేషమువలనను, కొందరు భయముచేతను, మరి కొందరు స్నేహమువలనను పరమాత్మనుబొంది తరించియున్నారు.

గోప్యః కామాద్భయాత్కంసో ద్వేషాచ్చైద్యాదయో నృపాః
సంబన్ధాద్వృష్ణయః స్నేహా ద్యూయం భక్త్యా వయం విభో ॥

"గోపికలు కామమువలన, కంసుడు భయమువలన, శిశుపాలాది రాజులు వైరము వలన, యాదవులు స్నేహమువలన, మేము భక్తివలన శ్రీకృష్ణుని పొందుట జరిగినది" యనెను.

ఈ ఐదు విధములైన సంబంధముల ద్వారా శ్రీకృష్ణుని పొందవచ్చును. కానీ ఈ ఐదింటిలో ఏ ఒక్కటీ లేని నాస్తికుడగు వేనరాజునకు సద్గతి లభింపలేదు. కనుక ఏ విధముగా నైన పరమాత్మ యందు చిత్తమును నిలుపుటయే ప్రధానము.

తస్మాత్కేనా ప్యుపాయేన మనః కృష్ణే నివేశయేత్

"ఏ విధమైన ఉపాయము చేతనైనను శ్రీకృష్ణుని యందే మనస్సు నుంచవలెను" అని నారదుడనెను.

కొందరు గోపికలు తెలియక శ్రీకృష్ణుని అందమును జూచి ప్రేమించిరి. కాలక్రమమున అజ్ఞాన మేఘములు తొలగించబడి కృష్ణగత చిత్తులైరి. భగవంతుని యందు కలిగిన కామము కాలగతిలో నిష్కామమగును. కంసుడు సదా భయముచే శ్రీకృష్ణుని

స్మరించుచుండెను. తద్వారా సద్గతిని పొందెను. మనస్సులో ఏ భావము కదలినను అది శ్రీకృష్ణునిదై యుండాలి. ఇదియే సర్వోత్తమమైన యోగము.

తదర్పితాఖిలాచారః సన్ కామక్రోధాభి మానాదికం తస్మిన్నేవ కరణీయమ్

"సమస్త వ్యవహారములను భగవంతుని యందు సమర్పించి, కామ, క్రోధ, అభిమానాదులను గూడా భగవంతుని యందే చూపవలెను" అని నారదుడే భక్తి సూత్రముల యందు కూడా తెలిపి యున్నాడు.

"ధర్మరాజా! మీ పినతల్లి కుమారులగు శిశుపాల దంతవక్త్రులు పూర్వము వైకుంఠ ద్వారము వద్ద పార్షదులై యుండిరి. బ్రాహ్మణుల శాపకారణముగ వారు భూలోకమున జన్మించిరి" యని నారదుడనెను.

"మహర్షీ! ఇది మరీ వింతగా యున్నది. శ్రీహరి ఏకాంతభక్తులకు ఈ పతనావస్థ ఏమిటి? పుణ్యాత్ములైన విష్ణుపార్షదులకు ఇట్టి జన్మమేల సంప్రాప్త మయ్యెను? వారికి శాపము నిచ్చిన బ్రాహ్మణులెవరు? ఎందులకు శపించిరి? ఆ విషయములను సవిస్తరముగా వివరింపుడు" యని ధర్మరాజు అడుగగా నారదమహర్షి జరిగిన కథ నంతటిని చెప్పెను.

ఒకప్పుడు బ్రహ్మమానస పుత్రులగు సనక సనందనాది మహర్షులు విష్ణులోకమునకు వచ్చినారు. వారు దిగంబరులు. ఆరు సంవత్సరముల బాలురవలె కన్పింతురు. వారు వైకుంఠద్వారము వద్దకు రాగానే విష్ణుదేవుని పార్షదులగు జయవిజయులను ఇరువురు వారిని బాలురని భావించి లోనికి అనుమతించలేదు. మహర్షులు క్రుద్ధులై వారిని శపించిరి.

క॥ వారించిన తమకంబున, వా రించుక నిలువలేక వడి దిట్టిరి దౌ
వారికుల నసురయోని న వారితులై పుట్టు డనుచు వసుధాధీశా!

"ధర్మరాజా! క్రుద్ధులైన సనకాది ఋషులు వారిని రాక్షస జన్మమెత్తు" డని శపించిరి అని నారదుడనెను.

శాపగ్రస్తులైన జయవిజయులను గాంచి కృపామయులైన ఋషులు "మూడు జన్మల పిదప మీరు తిరిగి వైకుంఠమును చేరెదరు" అని పలికిరి.

మునుల శాపఫలంగా ఆ జయవిజయులే దితికి హిరణ్యకశిప, హిరణ్యాక్షులుగా జన్మించిరి. శ్రీహరి నరసింహరూపము ద్వారా హిరణ్యకశిపుని, వరాహరూపము ద్వారా హిరణ్యాక్షుని వధించెను. విముక్తిని ప్రసాదించెను.

హిరణ్యకశిపుని కుమారుడు ప్రహ్లాదుడు. విష్ణుభక్తుడు. అతనిని వధించుటకు తండ్రియగు హిరణ్యకశిపుడు అనేక విధముల యత్నించెను. అయినను ఆ బాలుని సంహరించ లేకపోయెను.

ఆ జయవిజయులే తరువాత జన్మలో రావణ కుంభకర్ణులుగ జన్మించిరి. వారు లోకకంటకులైరి. శ్రీహరి శ్రీరాముడై అవతరించి వారిని సంహరించెను. వారే తమ మూడవ జన్మలో మీ పినతల్లి కొడుకులైన శిశుపాలదంతవక్త్రులుగా జన్మించిరి. శ్రీకృష్ణుడు సుదర్శనచక్రము ద్వారా వారిని వధించి ముక్తి నొసంగెను.

నారదుని ద్వారా ఈ వృత్తాంతముల నెరిగిన ధర్మరాజు హిరణ్యకశిపునికి తన బిడ్డడైన ప్రహ్లాదుని యందు వైరభావ మేర్పడుటకు గల కారణమును తెలుపమని అడుగగా నారదుడు ప్రహ్లాదుని దివ్యచరితమును వినిపించసాగెను.

హిరణ్యకశిపుడు

దితికి హిరణ్యకశిప, హిరణ్యాక్షులను ఇరువురు కుమారులు గలరు. దితి యనగా భేదబుద్ధి. భేదబుద్ధికి మమకార అహంకారములే బిడ్డలు. హిరణ్యకశిపుడు అహంకారము కాగా, హిరణ్యాక్షుడు మమకారమునకు ప్రతీకమాయెను. అహంకారమును నశింప చేయుట బహుకష్టము. ముందు మమకారమును నశింప చేయగల్గినచో, అటు పిమ్మట అహంకారమును నశింప జేయవచ్చును. భోక్తృత్వభావము ముందు నశిస్తే, తరువాత కర్తృత్వభావము నశిస్తుంది. దీనినే యోగమని, సన్యాసమని భగవద్గీత తెలిపింది.

శ్రీహరి వరాహ రూపమును ధరించి హిరణ్యాక్షుని వధించెను. హిరణ్యకశిపుడు కోపోద్రిక్తుడాయెను. "బలాన్వితుడగు నా సోదరుని శ్రీహరి సంహరించెను. నేను శూల ధారినై శ్రీహరి కంఠమును త్రుంచెదను. ఆ రక్తముతో రక్తప్రియుడగు నా సోదరునకు తర్పణము విడిచెదను. అప్పటికి గాని నా ఆవేదనా జ్వాల ఆరదు.

తస్మిన్ కూటేఽహితే నష్టే కృత్తమూలే వనస్పతౌ
విటపా ఇవ శుష్యన్తి విష్ణు ప్రాణా దివౌకసః

"చెట్టు యొక్క మూలము ఖండించబడగానే శాఖలు మున్నగునవి తమకు తాముగా ఎండిపోవునట్లు, నాకు శత్రువుయైన శ్రీహరి నశించుటచే విష్ణుపార్షదులగు దేవతలు కూడా నశింతురు" యని హిరణ్యకశిపుడు సచివులతో పలికెను.

ఈ లోగా తపస్సులను, యజ్ఞములను, వ్రతములను ధ్వంసము చేయుమని ఆజ్ఞాపించెను. దానవులు విజృంభించిరి. గోవులను వధించిరి. బ్రాహ్మణులను హింసించిరి. నగరములను కొల్లగొట్టిరి. గృహములను దగ్ధమొనర్చిరి. దానవ దౌర్జన్యము ఒకవైపు కొన సాగుచుండ, దానవరాజగు హిరణ్యకశిపుడు తల్లియగు దితి వద్దకు వచ్చెను. సోదరుని భార్య భానువు కూడా అక్కడే యుండెను. హిరణ్యకశిపుడు చక్కని తాత్త్విక విషయము లను బోధించి వారిని ఊరడించెను.

"మాతా! భ్రాతృజాయా! వీరుడు, నాకు సోదరుడు నైన హిరణ్యాక్షుని గూర్చి మీరు చింతింపవలదు. అతడు వీరమరణము నొందెను. ఇది స్తుతింప దగినదియే గాని విలపింప దగినది కాదు" అని చెప్పసాగెను.

బాటసారులు చలివేంద్రలో కలసి తమ తమ గ్రామములకు వెళ్ళుచుందురు. ఈ ప్రపంచ చలివేంద్రలో జీవులందరూ బాటసారులే. కలియుట విడిపోవుట సహజములే.

శా॥ నీరాగారనివిష్టపాంథులక్రియన్ విక్కంబు సంసారసం
చారుల్ వత్తురు గూడి విత్తురు సదా; సంగంబు లే దొక్కచో
శూరుల్ వోయెడి త్రోవ బోయెను భవత్పూమండు దల్లీ! మహా
శూరుం డాతఁడు తద్వియోగమునకున్ శోకింప నీ కేటికిన్.

ఇక్కడ తల్లెవరు? కుమారు లెవ్వరు? అంతా భ్రాంతియే. ఈ బంధాలు వీడిపోయే వియే. వాడిపోయేవియే.

ఆత్మ అమరము. నిత్యము. నిర్మలము. సర్వగతము. అందుచేత దుఃఖింప నవసరము లేదని హిరణ్యకశిపుడు చెప్పుచున్నాడు.

"అమ్మా! ఈ విషయమున పురాతనమైన ఒక కథ గలదు. మరణించిన వాని బంధువులతో యమధర్మరాజు పలికిన వాక్యముల నాలకింపుడు" అని చెప్పుట కుప క్రమించెను.

ఉశీనర దేశమున సుయజ్ఞుడను రాజుండెను. అతడు యుద్ధమున మరణించెను. వాని బంధువులు, రాణులు చుట్టూచేరి విలపించు చుండిరి. రాణుల దుఃఖము తీవ్ర మాయెను. వారి ఆక్రందన శబ్దము యమపురికి వినిపించెను. యముడు బాలుని రూపము ధరించివచ్చి వారితో భాషించెను.

యముడు వారిని గాంచి విస్మితుడయ్యెను. మరణము అనివార్యమని తెలిసి కూడా వీరు తాము స్థిరమైనట్లు దుఃఖించుచున్నారని భావించెను. వీరికన్నా శిశువులే నయమని చింతించెను.

ఉ॥ మచ్చిక వీరికెల్ల బహుమాత్రముఁ జోద్యము దేహి పుట్టుచుం
జచ్చుచు నుంట జూచెదరు చావక మానెడువారిభంగి నీ
చచ్చినవాని కేడ్చెదరు చావున కొల్లక డాఁగవచ్చునే?
యెచ్చట బుట్టె నచ్చటికి నేగుట నైజము ప్రాణికోటికిన్.

బాలుని రూపములో యున్న యముడు రాణులతో ఇలా చెప్పెను: "ఈ ప్రపంచ మంతయు పరమేశ్వరుని ఆజ్ఞచే నడచుచున్నది. ఇది ఆయనకు ఆటవస్తువు. ఈశ్వరుని అనుగ్రహ మున్నచో అరణ్యమున యున్నను రక్షింపబడుదురు. ఆయన దృష్టికి దూరమై నచో మనోహరమైన మేడలలో వసించినను రక్షింపబడలేరు" యనెను.

"అబలలారా! ఇంతవరకు ఎవరికొఱకు మీరు దుఃఖించు చుంటిరో అతడు ఇక్కడ నరుండియే యున్నాడు గదా! ఈ శవము మీతో మాటలాడునా? మాటలాడని దేహము ఇక్కడ పడియున్నది. దానికై ఏల దుఃఖించెదరు? మాట్లాడెడివాడు వినెడివాడు ఎవ్వడ యితే ఇప్పుడు తెలియుటలేదో అతడు ఎప్పుడూ అగోచరుడే కదా! ఇక దేనికి ఈ విలాపము? గోచరములన్నియు ఒకనాటికి అగోచరములే. కనుపించినవి ఏవియైనను కనుమరుగయ్యేవియే" యనెను.

ఈ విధమైన వైరాగ్య భావములను హిరణ్యకశిపుడు దితికి చెప్పెను. హిరణ్యాక్షుని మరణానికి చింతించి ప్రయోజనము లేదని పలికెను. జ్ఞానపూరితమైన హిరణ్యకశిపుని వాక్కులను దిత్యాదులు అవధానముతో ఆలకించసాగిరి.

కం॥ పరులెవ్వరు? దా మెవ్వరు?, పరికింపగ నేక మగుట భావింపరు త
త్పరమజ్ఞానము లేమిని, బరులును మే మనుచు దోచు బ్రాణుల కెల్లన్

యని హిరణ్యకశిపు డనెను. అతని మాటలు దితికి, కోడళ్ళకు ఊరట నందించెను.

ఇదియే విచిత్రము! ఇదియే మాయ! ఒకవైపు జ్ఞానము నుపదేశించి, వారిలో వైరాగ్యము నుదయింప జేయుచుండెను. మరొకవైపు శ్రీహరి నెలా సంహరింపవలెను? అని ఆలోచించు చుండెను. ఇదియే హిరణ్యకశిపుని ద్వంద్వ మనస్తత్వము. ఇతరులకు చేయు బోధలు తనకు ఉపకరించుట లేదు. తా నాచరింపక ఇతరులకు బోధించువా రెవరైనను అసురులే. హిరణ్యకశిపులే. ఇట్టివారికి సద్గతియుండదు. వారికొక నీతి, ఇతరులకొక నీతిగా విభజించుకొని పాలించుచుందురు. వారు చెప్పిందే నీతి. వారు నడిచిందే నిజాయితి. వాస్తవానికి వీరే అవినీతిపరులు. అధర్మ పరాయణులు.

Lawless are they that make their wills their law

"తమ భావాలనే చట్టముగా మలచువారే వాస్తవానికి చట్టవ్యతిరేకులు" యని షేక్స్పియర్ కూడా అభిప్రాయ పడినాడు.

హిరణ్యకశిపుని ఉగ్రతపస్సు

మందరాచల పర్వతముపై హిరణ్యకశిపుడు భయంకరమైన తపస్సును ప్రారంభించెను. ముల్లోకముల యందు తనకు సాటివచ్చువారు ఉండకూడదని అభిప్రాయపడెను. అజేయుడై, జరామృత్యువులు లేనివాడుగ నుండవలెనని సంకల్పించెను. కాలి బొటన వ్రేలిపై నిలబడెను. దృష్టిని గగనముపై సారించెను. అతని ఉగ్రతపస్సును గాంచి సురులు భీతిచెందిరి.

వాని తపోమహిమచే అంతరిక్షము అగ్నిమయము కాజొచ్చెను. నదులు, సాగరములు కలత చెందెను. పర్వతములు కదలసాగెను. దిక్కులంతట ధూమము వ్యాపించెను. దేవతలు బ్రహ్మదేవుని సమీపించి మొరపెట్టుకొనిరి. దైత్యుని తపోగ్నిజ్వాలకు దివిలో చరించుట కష్టతర మగుచున్నదని తెలిపిరి. ఈ ఉపద్రవమును తొలగించమని ప్రార్థించిరి.

బ్రహ్మ మందరాచలమున కేతెంచెను. హిరణ్యకశిపుని చుట్టూ పుట్టలు లేచియుండెను. గడ్డి మొలచియుండెను. వెదురు ప్రాకియుండెను. చర్మము, మాంసము చీమలు మున్నగు కీటకముల చేత భక్షింపబడి యుండెను.

"దితికుమారా! కాశ్యపా! లెమ్ము. శుభమస్తు. నీవు తపస్సిద్ధిని బొందితివి. అభీష్టము తెలుపుము. తీర్చెదను. ఋషులకుకూడా సాధ్యముగాని తపము నాచరించితివి.

నన్ను వశపరచుకొంటివి. వరముల నడుగుము" అని విరించి పలికెను. తన కమండలములోని పవిత్రోదకమును దైత్యునిపై విధాత సంప్రోక్షించెను. వెంటనే హిరణ్యకశిపుడు బల తేజోసంపన్నుడు, వజ్రతుల్యుడునై పుట్టనుండి బయల్వెడలెను. బ్రహ్మదేవునకు వందన మాచరించెను.

అసురేంద్రుని నయనములు అశ్రువులను స్రవించెను. ఆహ్లాదము వృద్ధినొంద కంఠము గద్గద మాయెను. రోమహర్షణుడై తలవంచి ప్రణామము లర్పించెను.

యది దాస్యస్యభిమతాన్ వరాన్మే వరదోత్తమ
భూతేభ్యస్త్వద్వి సృష్టేభ్యో మృత్యుర్మా భూన్మమ ప్రభో

"వరముల నొసగువారలలో ఉత్తముడవగు ఓ దేవా! నీవు నాకు వరము లీయదలచినచో నీచే సృజింపబడిన ప్రాణులవలన నాకు మరణము కలుగకుండునట్లు ఆశీర్వదింపుము.

"అంతర్బాహ్యములందు, రాత్రింబవళ్ళయందు, వస్తువులవలన, అస్త్రములవలన, పృథ్వియందు, గగనమందు, మనుజులవలన, మృగాది పశువులవలన నాకు మరణము లేకుండు నట్లు వరములిమ్ము" అనెను.

శా॥ గాలిం గుంభిని నగ్ని నంబువుల నాకాశస్థలిన్ దిక్కులన్
రేలన్ ఘస్రములం దమఃప్రబల భూరిగ్రాహరక్షోమృగ
వ్యాళాదిత్యనరాదిజంతుకలహవ్యాప్తిన్ సమస్తాస్త్రశ
స్త్రాళిన్ మృత్యువులేని జీవనము లోకాధీశ! యిప్పింపవే.

సంకల్పశుద్ధి లేనివాని సాధనలు పతన హేతువులే యగును. దైత్యుని తపస్సు వెనుక శుద్ధిలేదు. అందుచేత అతడు విచిత్రమైన వరము కోరెను. శుద్ధిలేని బుద్ధి ఎన్నటికీ సిద్ధిని బొందలేదు.

"కాశ్యపా! నీవడిగిన వరములు ఎవ్వరికీ లభింపవు. ఇంతవరకు ఇలాంటి వరములను ఇతరులు కోరనూలేదు. మేము అనుగ్రహించినదియూ లేదు. నిన్ను కరుణించి ఇవన్నియు నొసంగితిని. బుద్ధిశాలివై మెలగుము" అని పలికి బ్రహ్మదేవుడు అంతర్హితుడయ్యెను.

దైత్యుని దురంతములు

హిరణ్యకశిపుడు వరములను బొందెను. క్రొవ్వి గర్వితుడయ్యెను. తన సోదరుని మరణమునకు కారణమైన శ్రీహరిపై పగబూనెను. వాని దురంతములకు అవధులు లేకుండెను. ఈనాడు గంధర్వులను చావబాదును. రేపు సురులను గొట్టును. మరునాడు నాగులను హింసించును. ఇంకొకనాడు నవగ్రహములను బంధించును. వేరొకనాడు

విహరించు పక్షులను చేతులతోపట్టి నలిపి పడవేయును. సిద్ధులను బాధించును. బుద్ధిమంతులను పరాభవించును. ముల్లోకములను కంపింపజేసెను. "ఈవేళ ఏమి జరిగింది, ఈనాటి వార్త లెలా ఉన్నాయి" అని ప్రతిరోజు దేవతలు ముచ్చటించుకొని మాతని విషయములను తెలిసికొను చుండిరి.

నారదుడు ధర్మజునితో చెప్పుచున్నాడు: "రాజా! వాని సేవకులు దేవతలకు యజమానులయ్యారు. మా రాజు కర్పూర వాసనగల తియ్యని కల్లు త్రాగి నిద్రించుచున్నాడు. దేవతలారా! మెల్లగా సంచరింపుడు. మునులారా! దూరముగా నిలబడి స్వస్తి పలుకుడు. నాగులారా! పొరపాటున పడగలెత్తెదరేమో! జాగ్రత్త. దిక్పాలకులారా! తలవంచి చనుడు. గంధర్వులారా! మీలో నిపుణు లెవరో వారే గానము చేయండి. కావు కావు మన్నచో చావు తప్పదు. ధర్మరాజా! నిజము చెప్పక తప్పదు. వాడు కల్లుత్రాగి మత్తెక్కి పడియుండగా నేను, తుంబురుడు మెల్లగా రాగము లాలపించెడి వారము" అని చెప్పసాగెను.

ఋత్విక్కులు చేయు యజ్ఞముల యందు దేవతలకిచ్చు హవిస్సులను వాడే గ్రహించును. దేవ, మానవ, ఋష్యాదులు దిక్కుతోచని వారైరి. సర్వులు విష్ణుమూర్తిని శరణుజొచ్చిరి.

ఉ॥ ఎక్కడ నున్నవాడు జగదీశ్వరు డాత్మమయుండు మాధవుం
డెక్కడి కేగె శాంతులు మునీశులు భిక్షులు రారు క్రమ్మఱం
దిక్కుల నెల్ల వెక్కుడు తుదిం జొర దిక్కగు నట్టి దిక్కుకై
మ్రొక్కెద మేము హస్తయుగముల్ ముకుళించి మదీయరక్షకున్.

యని శ్రీమహావిష్ణువును ప్రార్థించిరి.

"విబుధులారా! భయపడకుడు. దైత్యుడగు హిరణ్యకశిపుని దురంతములను నేను ఎఱిగియే యున్నాను. కాలము సమస్తమును శాంతింపజేయును. దేవతలను, గోవులను, వేదములను, భక్తులను, నన్ను ద్వేషించువాడు త్వరితగతిని పతనమొందును. అతడు నా భక్తుడగు ప్రహ్లాదుని హింసింప మొదలిడగనే, బ్రహ్మనుండి వరములను బొందియున్నను నేను అతనిని తప్పక వధింతును", అని విష్ణుదేవుడు పలికెను.

దేవతలు సంతసించిరి. దైత్యుడు మరణించినట్లేయని భావించిరి. బాధలు తీరినట్లేనని తలచిరి. శ్రీనాథుని మాటలు వృథాగావని వారికి తెలియును.

హిరణ్యకశిపునకు ప్రహ్లాదుడను పుత్రుడుదయించెను. అతడు సర్వులకు హ్లాదమును గూర్చువాడై ప్రహ్లాదుడాయెను. ప్రహ్లాదుడు అసురుడైనను సురులను ప్రేమించువాడై యుండెను. అతడు జితేంద్రియుడు. హరిభక్తి కలవాడు. ప్రశాంత చిత్తుడు. అహంకారము తెలియనివాడు. పెద్దల విషయములో దాసునివలె ప్రవర్తించును. దీనులపై పుత్రవాత్సల్యము జూపును. చెలికాండ్రపై సోదరభావమును ప్రకటించును. ఆచార్యులపై పూజ్యభావమును ప్రదర్శించును.

సీ॥ తనయందు నఖిలభూతములందు నొకభంగి సమహితత్వంబున జరగువాడు
పెద్దల బొడగన్న భృత్యునికైవడి జేరి నమస్కృతుల్ సేయువాడు
కన్నుదోయికి నన్యకాంత లడ్డం బైన మాతృభావము సేసి మరలువాడు
తల్లిదండ్రులభంగి ధర్మవత్సలతను దీనుల గావ జింతించువాడు
తే॥ సఖులయెడ సోదరస్థితి జరుపువాడు దైవతము లంచు గురువుల దలచువాడు
లీలలందును బొంకులు లేనివాడు, లలితమర్యాదు డైన ప్రహ్లాదు డధిప.

భక్త ప్రహ్లాదుడు

ప్రహ్లాదుని చిత్తము పరమేశ్వరుని యందే లయించి యుండును. సౌందర్యముంది, కానీ గర్వము లేదు. ధనముంది, అభిమానములేదు. భోగ్య వస్తువులున్నవి, వానియందు స్పృహలేదు. శౌర్యముంది, క్రౌర్యములేదు. వస్తువులున్నాయి, కానీ వాంఛలులేవు. సుగుణము లన్నియు ఒక్కటై, సర్వనదులు సాగరమును జేరునట్లు, ప్రహ్లాదునిలో చోటు చేసుకున్నవి. శ్రీహరిని కల్యాణగుణము లెట్లు వీడవో ప్రహ్లాదుని కూడా అలావీడకున్నవి. ఇంద్రాది దేవతలు కూడా ప్రహ్లాదుని సుగుణములను గీతములద్వారా ఆలపించసాగిరి.

క॥ గుణనిధి యగు ప్రహ్లాదుని గుణము లనేకములు గలవు గురుకాలమునన్
గణుతింప నశక్యంబులు ఫణిపతికి బృహస్పతికిని భాషాపతికిన్.

ప్రహ్లాదుని గుణములను ఆదిశేషుడు, బృహస్పతి, బ్రహ్మలకు కూడా వర్ణింప శక్యము గాకుండెను.

ప్రహ్లాదుని మనస్సు సదా శ్రీహరి పాదపద్మముల యందే రమించుచుండును. విష్ణు చింతనముచే జడునివలె ఒక్కొక్కసారి పడియుండును. ప్రపంచమంతయు శ్రీనాథుని కన్నను అన్యముగాదని యనిపించు చుండెను. వెన్నలాంటి ప్రహ్లాదుని హృదయము సదా వెన్నుని అనుసరించియే యుండును. అతడు ప్రేమమయుడు. ప్రేమ ప్రేమకొఱకే యనెడి భావము గలవాడు. బేరము లెరుగడు. భారములు తెలియడు. వెనుదిరగని విశ్వాసముతో విష్ణువును వెదికెను. అతని భక్తి పర్వతములను సైతము చలింపజేసినది. అతడు ఆడును. ఆడించువాడు గోచరింపగనే ఆటకట్టును జూచును. ఆలోచనలు కదలించును. ఆలోచింప జేయువాడు అగుపించగనే ఆలోచనలను మఱలించును. మాటలాడును. మాటలాడించు వానిని గాంచి మూగయగును. కళ్ళుండి ఒక్కొక్కసారి అంధుడగును. బధిరుడగును. భక్తిలో సర్వమూ తానై నిలుచును.

సీ॥ శ్రీవల్లభుడు దన్ను జేరినయట్లైన జెలికాండ్ర నెవ్వరి జేరమఱచు
నసురారి దనమ్రోల నాడినయట్లైన నమరబాలురతోడ నాడ మఱచు
భక్తవత్సలుడు సంభాషించినట్లైన బరభాషలకు మాఱుపలుక మఱచు
సురవంద్యు దనలోన జూచినయట్లైన జొక్కి సమస్తంబు జూడ మఱచు

తే॥ హరిపదాంభోజయుగచింతనామృతమున నంతరంగంబు నిండినట్టైన నతడు
నిత్యపరిపూర్ణు డగుచు నన్నియును మఱచి జడత లేకయు నుండును జడునిభంగి

యని ప్రహ్లాదుని ఆంతరంగిక భక్తి వైభవమును పోతనామాత్యుడు వివరించెను.

ప్రహ్లాదుడు వైరాగ్యవంతుడు. భక్తి తత్పరుడు. ఎప్పుడు చూచినను అతని చిత్తము శ్రీహరి చరణకమలముల చెంతనే నిమగ్నమై యుండును. తన సంకల్పములు సత్య రూపుని పైననే యుండును. వాక్కులు వాసుదేవుని గూర్చియే వచించును. జీవితము సర్వదా జనార్దనునిదై యుండును. సదా ధ్యానమగ్నుడై యుండును. నిరంతరము దివ్య పారవశ్యమున దేలుచుండును. కూర్చుంటూ కృష్ణుని జూచును. నిలుచుంటూ నిరంజనుని ధ్యానించును. నడచుచూ నారాయణుని స్మరించును. పరుండునపుడు పద్మనాభుని వలకరించును. మాట్లాడునపుడు మాధవుడు ముందుండును. ఆలోచించగనే అనంతుడు అంత:కరణలో అగుపించును. ముందు ముకుందుడుండును. వెనుక వెన్నుడుండును. దైనిక కృత్యములలో దైవమే గోచరించుచుండెను.

శా॥ పానీయంబులు ద్రావుచుం గుడుచుచున్ భాషించుచున్ హాసలీ
లానిద్రాదులు సేయుచుం దిరుగుచున్ లక్షించుచున్ సంతత
శ్రీనారాయణపాదపద్మయుగళీ చింతామృతాస్వాదసం
ధామండై మఱచెన్ సురారిసుతుడే తద్విశ్వమున్ భూవరా!

మురారిని మరువలేని భక్తితో ఒకప్పుడు విలపించును. కొంతసేపు నినదించును. నవ్వును. పాడును. ఆడును. మాట్లాడును. మాట మానును. మ్రానువలె నిలబడును. ఎగురును. ఎలుగెత్తి పిలుచును. కదలిపోవు చుండును. కన్నీటితో ఊగిపోవుచుండును. స్నేహితులు గుర్తురారు. ఆకలి తెలిసిరాదు. పానీయము లక్ష్యముగావు. నిద్రేమిటో ఊహకందదు. అంతా మరిచాడు. తనదంతా మైమరచినాడు. వింతగా తెలిసాడు. సదా విష్ణుచింతలో తేలాడు. మూర్ఖుడా? కాదు, భక్తిలో మునిగినవాడు. జడుడా? కాదు, శ్రీహరి పాదపద్మ సరోవరంలో జలకమాడిన వాడు. ఉన్మత్తుడా? కాదు, ఉత్కృష్ట పదవి నలంకరించినవాడు. సదా ప్రపంచమును మరచినవాడు. సర్వదా పరమాత్మనే దర్శించువాడు. పూర్ణభక్తుడు. పుణ్యశ్లోకుడు.

సీ॥ వైకుంఠచింతావివర్జితచేష్టుఁడై యొక్కడు నేడుచు నొక్కచోట
నశ్రాంతహరిభావనారూఢచిత్తుడై యుద్ధతుడై పాడు నొక్కచోట
విష్ణుఁ డింతియకాని వేఱొండు లేదని యొత్తిలి నగుచుండు నొక్కచోట
నలినాక్షు డను నిధానము గంటి నే నని యుబ్బి గంతులు వైచు నొక్కచోట

ఆ॥ బలుకు నొక్కచోట బరమేశుఁ గేశవు బ్రణయహర్ష జనితబాష్పసలిల
మిళితపులకుడై నిమీలితనేత్రుడై యొక్కచోట నిలిచి యూరకుండు.

ముకుంద చరణారవింద సేవచే ప్రహ్లాదుడు సదా తన్మయుడై యుండును. కొఱత లేని ఆనందము ననుభవించు చుండును. ప్రాపంచిక విషయ సంపర్గమును క్షణమైనను భరించలేడు. అచ్యుతుని విషయమున అప్రమత్తుడై యుండును. పరమ భాగవత శ్రేష్ఠుడైన ప్రహ్లాదుడు కర్మబంధము లనెడి తీగలకు కొడవలి వంటివాడై యుండెను. ఆదిదేవుని నామము నుచ్చరింపగనే ఆనంద బాష్పము లను స్రవింపజేయు ప్రహ్లాదుని నడవడి సర్వులకు అవగతము గాకుండెను.

ప్రహ్లాదుని దివ్యపారవశ్య జనిత భక్తి ప్రాభవమును నారదునిద్వారా ఆలకించిన అజాత శత్రువునకు అపరిష్కృత సమస్యలు తలయెత్తెను. సందేహములు చుట్టుముట్టెను. సంశయములు చిత్తమును కలతపెట్టెను. ఇట్టి పరమ భాగవతోత్తముడైన ప్రహ్లాదుని, తండ్రియగు హిరణ్యకశిపు డెందులకు హింసించెనో అవగతము గాకుండెను. బిడ్డలు తప్పు చేసినను కాపాడుట పెద్దల విధి. తనయులు తెలియక తప్పుచేసినను తల్లిదండ్రులు సర్దుకొని జీవింతురు గదా! లేదా సరిజేయుదురు గదా! బిడ్డలపై తండ్రులు ప్రేమను జూపుదురే గాని, క్రౌర్యమును, శత్రుత్వమును ప్రదర్శించరు.

ప్రహ్లాదుడు పిల్లవాడు. పైగా సరళస్వభావుడు. సాధువులు సైతము కీర్తించు ఈ బిడ్డను బాధించుటకు అతనికి మనస్సెలా అంగీకరించెను? పైగా కరుణకు పాత్రుడైన బిడ్డను మరణమునకు గురిజేయుమని ఆజ్ఞాపించుటయా? ఎంత ఆలోచించినను అర్థం గాని ఈ విషయమును వివరముగా తెలుపుమని ధర్మరాజు నారదమహర్షిని ప్రశ్నించు చున్నాడని శుకబ్రహ్మ పరీక్షిన్మహారాజుకు చెప్పుచున్నాడు.

ఉ॥ బాలు ప్రభావిశాలు హరిపాదపయోరుహచింతనక్రియా
లోలు గృపాలు సాధుగురులోకపదానతఫాలు నిర్మల
శ్రీలు సమస్త సభ్యమతశీలు విఖండితమోహవల్లికా
జాలు న దేల తండ్రి వడి జంపగ బంపె మునీంద్ర! చెప్పవే.

యని ధర్మరాజు నారదుని ప్రశ్నించెను. నారదమహర్షి చెప్పుచున్నాడు.

హిరణ్యకశిపుడు ప్రహ్లాదుని హింసించుట

ప్రహ్లాదుని జూచి హిరణ్యకశిపుని మది కలతచెందెను. బిడ్డడు జడునివలె గన్పట్టు చున్నాడు. బుద్ధిమాంద్య మున్నట్లు తెలియుచున్నది. ఇతనిని చదివించుటయే ఉత్తమమని భావించెను. ఒకనాడు ముద్దులొలుకు ప్రహ్లాదుని చేరబిలిచి, "వత్సా! విద్యారానివాడు దేనికిని కొఱగాడు. విద్య విచక్షణ నిచ్చును. వెలుగు నిచ్చును. విద్య సర్వులకు వాంఛ నీయమే. నిన్ను ఉత్తములగు ఉపాధ్యాయుల వద్దకు పంపెదను. శ్రద్ధగా చదువుకొనుము. బుద్ధిగా మసలుకొనుము" అని పలికిన హిరణ్యకశిపుడు శుక్రాచార్యుని పుత్రులగు చండుడు, మర్కుడు అను వారలను గురువులుగా పిలిపించెను.

చండ మర్కులు అరుదెంచిరి. దైత్యరాజు వారితో ఇట్లనెను: "అయ్యా! ఈ పిల్ల వాడు నా కుమారుడు. పేరు ప్రహ్లాదుడు. ఇతడొక విచిత్రమైన వాడు. అంధునివలె యున్నాడు. మాతో మాటలాడడు. నా పరాక్రమ సౌరభము ఇసుమంతైనను ఇతనికి అబ్బ లేదు. మీరు మాకు మాన్యులు. ఆంతరంగికులు. పెద్దలు. దయామయులు. నా యందు కరుణ వహించి నా తనయునికి విద్య నేర్పి, విశిష్టునిగా జేయుడు" యనెను.

గురువులు ప్రహ్లాదుని వెంట బెట్టుకొని వెళ్ళిరి. సమవయస్కులైన. రాక్షస బాలురను అతనికి తోడుచేసిరి. చెప్పవలసిన విద్యలన్నియు చెప్పిరి. వారు చెప్పిన విద్యల నన్నిటిని ప్రహ్లాదుడు చక్కగా నేర్చును. కానీ విష్ణుభక్తిని మాత్రము వదలకుండెను. గురువులు చెప్పిన దాని నాలకించునే గాని తిరిగి ప్రశ్నించి ఎరుగడు. శ్రీహరి తప్ప అన్యము లన్నియు అసత్యములే యని గుర్తించి యున్నందున, ఏది గురువులు చెప్పినను మారు పలుకక నేర్చుకొను చుండెను.

బాలుడు ఎలా చదువుచున్నాడో తెలిసికొనవలెనని కొన్నాళ్ళకు హిరణ్యకశిపున కనిపించెను. గురువులకు కబురుచేసెను. బాలుని తీసికొని రమ్మని చెప్పెను. గురువులు ప్రహ్లాదుని తీసికొని వచ్చిరి. తండ్రి బాలుని చూసి అపరిమితానందముతో ఊగిపోయెను. "నాయనా! కుమారా! రా! రమ్ము!" యని చేరబిలిచి తొడపై కూర్చుండ బెట్టుకొనెను.

"కుమారా! విద్యాభ్యాసము చక్కగా చేసితివా? శాస్త్రములు చదివితివా? ఏమేమి తెలిసికొంటివి? గురువులు నీకేమి బోధించిరి? తనయుల సంభాషణములను ఎన్నిసార్లు విన్నను తండ్రులకు తనివితీరదు. నిరంతరము ఆనందమునే కల్గించు చుండును. బిడ్డల మాటలు తండ్రులకు బాధలను తొలగించును. బడలికను పోగొట్టును. చిన్నారుల పలుకులే పెద్దల చెవులకు అలంకారములు. చిట్టితండ్రీ! నీవు గురువుల వద్ద నేర్చిన వానిలో నీకు నచ్చిన విషయమును వినిపింపుము" యనెను.

ప్రహ్లాదుడు చేతులు జోడించి తండ్రికి నమస్కరించుచు, "తండ్రీ! నేను గురువుల వద్ద ఎన్నో వింటిని. కానీ నా మనస్సుకు మాత్రము ఒక్క విషయము శ్రేష్ఠమని తెలియు చున్నది" యనగానే "వత్సా! చెప్పుము. ఆలసింపకుము. శ్రేష్ఠమేదియో తెలుపుము" యని హిరణ్యకశిపు డనెను. ప్రహ్లాదుడు నిమీలిత నేత్రుడై పలుకుచున్నాడు.

ఉ॥ ఎల్లశరీరధారులకు నిల్లను చీకటినూతిలోపలం
ద్రెళ్ళక మీరు నే మను మతిభ్రమణంబున భిన్నులై ప్రవ
ర్తిల్లక సర్వము న్నతని దివ్యకళామయ మంచు విష్ణునం
దుల్లము జేర్చి తా రడవి నుండుటమేలు నిశాచరాగ్రణీ!

"తండ్రీ! సర్వులు గృహమనెడి చీకటి గోతిలో పడియున్నారు. "వీరు, వారు, మేము" యనెడి భేద భావములతో ప్రవర్తిల్లుచున్నారు. ఈ ద్వైత భ్రాంతిని వదలి సమస్తము విష్ణు దేవుడే యని తెలిసికొని, ఆతనినే స్మరించుచూ అడవులలో చరించుట శ్రేష్ఠమని నా అభిప్రాయము" యనెను.

ప్రహ్లాదుని మాటల నాలకించిన హిరణ్యకశిపునకు ఆశ్చర్యమాయెను. "కుమారా! ఇది ఏమి చోద్యము? పిల్లలు ఎవరు ఏమి చెప్పినను, ఏది చెప్పినను, దానినే సత్యమని విశ్వసింతురు. ఎవరు నేర్పిరో గాని శత్రువుల కనుకూలమైన విద్యలను నేర్పినారు. నాయనా! ప్రహ్లాదా! ఈ జ్ఞానము నీకు స్వయంగా కలిగినదా? లేక నీకు మరెవ్వరైనను బోధించిరా? ఎలా వచ్చినను ఇది నేర్వదగినది కాదు. విష్ణువు రాక్షసద్రోహి. అతని పేరుమ తలచుట సముచితము కానేరదు. పిచ్చివానివలె హరి గిరి యనకు. ఆ మాటలను దరి జేరనీయకు" యని హిరణ్యకశిపు డనెను.

తండ్రి మాటల నాలకించిన తనయుడు గురువుల వంక జూచెను. వారు భయముతో వణకసాగిరి. ప్రహ్లాదుడు గురువులతో ఇట్లనెను:

"గురువర్యులారా! కొందరు మాయచే తామని, పరులని భావించి భేదబుద్ధిని తయారు చేసికొందురు. అట్టివారు జ్ఞానమయుడైన పరమాత్మను వర్ణింపజాలరు. అసలు బ్రహ్మాది దేవతలే శ్రీహరి వైభవమ్మును వర్ణింపలేక పోయిరి. ఇక సామాన్యుల విషయమేల? గురుదేవా! అది ఏమి చిత్రమో గాని నా మనస్సు మాత్రము శ్రీహరిని వదలి మనలేదు. సూదంటురాతిని ఇనుపముక్క తగుల్కొనినట్లు నా చిత్తము విష్ణుమూర్తి యందు దృఢమై యున్నది.

తే॥ ఇను మయస్కాంతసన్నిధి నెట్లు భ్రాంత మగు హృషీకేశు సన్నిధి నా విధమున
గరగుచున్నది దైవయోగమున జేసి బ్రాహ్మణోత్తమ! చిత్తంబు భ్రాంతమగుచు.

"నేను విష్ణుమూర్తిని వదలి జీవించలేను" యనెను.

ప్రహ్లాదకుమారుని మాటల నాలకించిన ఆచార్యులు మ్రింగుడు పడనివారై, "కుమారా! మేము చెప్పని ఈ విషయాలు నీకు చెప్పిందెవరు? నీ చిత్తమును విష్ణుని వైపునకు త్రిప్పినదెవరు? తప్పు నాయనా! విష్ణువును మరచిపొమ్ము! దైత్యరాజును పరమాత్మగా స్వీకరింపుము" యనిరి. విష్ణుదేవుని మరచుట తన కసాధ్యమని ప్రహ్లాదుడు బదులుపలికెను.

సీ॥ మందారమకరంద మాధుర్యమున దేలు మధుపంబు వోవునే మదనములకు
నిర్మల మందాకినీవీచికల దూగు రాయంచ సనునె తరంగిణులకు
లలిత రసాలపల్లవఖాదియై చొక్కు కోయిల సేరునే కుటజములకు
బూర్ణేందుచంద్రికా స్ఫురితచకోరక మరుగునే సాంద్రనీహారములకు
తే॥ నంబుజోదరదివ్యపాదారవింద చింతనామృతపానవిశేషమత్త
చిత్త మేరీతి నితరంబు జేరనేర్చు వినుతగుణశీల! మాటలు వేయునేల?

"గురుదేవా! కల్పవృక్షములలో పూదేనెలను త్రాగు భ్రమరము ముంగచెట్ల వద్ద కరు దెంచునా? గంగాజలపుటలలలో జలకమాడు రాజహంస సామాన్య నదులనైపు నడక సాగించునా? తియ్యని మామిడి చిగుళ్ళను తినెడి కోయిలమ్మ కొడిసె చెట్లపైకి చేరునా? పున్నమినాటి చంద్రుని వెన్నెలను జుఱ్ఱుకొని మత్తెక్కిన చకోరము మంచుగడ్డల మీదికి

చేరునా? విష్ణుదేవుని దివ్య పాదారవింద ధ్యానమనెడి అమృతమును పానము చేసి మత్తెక్కిన మనస్సు ఇతర విషయముల పైకి ఎలా వెళ్ళగలదో చెప్పండి" యనెను.

ప్రహ్లాదుని మాటల నాలకించిన గురువు క్రుద్ధుడయ్యెను. ప్రహ్లాదుని జూచి, "ఓరీ బాలకా! వైరి విభూషణా! వంశ దూషణా! నీవు ఐదేండ్ల బాలుడవు. ఇంతలేవు. కానీ అంత మాటలు, వింత మాటలు మాట్లాడుచున్నావు. వక్రములన్నీ వచించుచున్నావు. తర్కములన్నీ వలుకుచున్నావు. మేము శ్రమించి బోధించినవి ఒక్కటియైనా చెప్పవు. ప్రభువు ఎదుట మాకు తలవంపులు తెచ్చితివి. నీవు దానవరాజునకు పుత్రుడివా? శత్రువువా?

దైతేయ చందనవనే జాతోऽయం కంటకద్రుమః
యన్మూలో న్మూల పరశో ర్విష్ణో ర్నాలాయితోऽర్భకః

"రాక్షసవంశ మనెడి చందనవనము నందు ఈ ప్రహ్లాదుడు కంటక వృక్షమువలె జన్మించినాడు. రాక్షస వంశమును నాశము చేయు విష్ణువనెడి గొడ్డలికి వీడు కఱ్ఱయై మిగిలాడు.

"రాజా! ఇతనిని దండించిన గాని దారిలోపడడు. ఈసారి నేర్పుగా చదివించగలము. నీ పాదముల సాక్షిగా చెప్పుచున్నాము. ఇతనిపై మేము కోపింతుము. ఈ సారికి మమ్ము లను కోపపడవలదు" యని పలికి ప్రహ్లాదుని తీసికొని వెళ్ళిరి.

భార్గవ నందనులగు చండ మర్కులు తమ చాతుర్యము కొలది బోధించిరి. ధర్మార్థ కామములను తెలిపిరి. సామ దాన భేద దండోపాయాలన్నీ బోధించిరి. నీతిజ్ఞుడైనట్లు భావించిరి. కొంతకాలము గడిచింది. తాము నేర్పిన విద్యలన్నీ బాలు డభ్యసించాడు. వాటిని రాజుగారి ముందు ప్రదర్శింప జేయాలని గురువులు భావించారు. ప్రహ్లాదుని పిలిచారు. "నాయనా! మీ తండ్రిగారి వద్ద కేగుచుంటిమి. ఈ సారి మా పరువును దక్కించుము. మేము చెప్పిన వర్గత్రయమును మరువకుము. మన శత్రువగు విష్ణుని గూర్చి ముచ్చటింపకుము."

ఉ॥ **త్రిప్పకు మన్న మా మతము, దీర్ఘములైన త్రివర్గపాఠముల్**
దప్పకు మన్న, వేడు మన దైత్యవరేణ్యుని మ్రోల వేము మున్
చెప్పినరీతి గాని మఱి పెప్పకు మన్న విరోధిశాస్త్రముల్,
విప్పకు మన్న దుష్టమగు విష్ణుచరిత్రకథార్థజాలముల్.

యని పలికి గురువులు ప్రహ్లాదుని దైత్యరాజు సన్నిధికి తోడ్కొని వచ్చిరి.

సదా మాధవ నామామృత మాధుర్యమును గ్రోలుచు ప్రహ్లాదుడు దేహమును మరచుచుండెను. బ్రహ్మాదుల కైనను సాధ్యపడని విష్ణుభక్తిచే పరవశించు చుండెను. నిఖిల లోకముల యందలి సకల మానవుల దైన్య జీవితములను పరిశీలించి, విష్ణువు కన్నను అన్యమైనది అవాంఛనీయ మైనదియేనని భావించి, బాగుగ నిర్ణయించి, విష్ణు ధ్యానములో ప్రవర్తిల్లు ప్రహ్లాదకుమారుని తోడ్కొని వచ్చి, మైమరచి నిలబడియున్న బాలకుని ముందుకు త్రోసి తండ్రికి నమస్కరింపుమని గురువు లనిరి.

క॥ **శిక్షించితి మవ్యము లగు పక్షంబులు మాని నీతిపారగు డయ్యెన్**
రక్షోవంశాధీశ్వర! వీక్షింపుము నీకుమారు విద్యాబలమున్.

అని చండ మర్కులు హిరణ్యకశిపునితో విన్నవించుకొనిరి.

హిరణ్యకశిపుడు ప్రహ్లాదుని చూసెను. దండప్రణామము చేసిన బిడ్డను దీవించెను. చేతులను చాచి చేరదీసికొనెను. గాఢముగా కౌగలించుకొనెను. తొడపై కూర్చుండ బెట్టు కొనెను. జులపాలను చేతితో దువ్వెను. గడ్డమును పట్టుకొని ముద్దాడెను. తలను మూర్కొనెను. ఆనందాతిశయముచే బాష్పములు నేత్రముల యందు నిలిచియుండ మెల్లని, తియ్యని మాటలతో ఇలా పలికెను:

"వత్సా! నిన్ను చూసి ఎంతోకాల మైనట్లున్నది. నీ సహాధ్యాయులు చక్కగా చదివి బుద్ధిమంతులై యున్నారు. నిన్ను విద్యావంతునిగ చూడవలె ననెడి నా కోర్కె నేడు నెర వేరినది. కుమారా! నీ విద్యల సారమును తెలియగోరు చున్నాను. నీవు చదివిన శాస్త్రము లలో ఒక్క శ్లోకమును వల్లించి, దాని భావమును పలికించి, తాత్పర్యమును ముందుం చుము" అనెను.

"నాన్నా! గురువులు నాకు చక్కగా బోధించినారు. చాలా శాస్త్రములను వారి వద్ద నేను అధ్యయనము చేసితిని. ఒక్క మాటలో చెప్పవలె నవిన చదువుల సారమంతటివి గ్రహించితిని."

క॥ **చదివించిరి నను గురువులు చదివితి ధర్మార్థముఖ్యశాస్త్రంబులు నే**
జదివినవి గలవు పెక్కులు చదువులలో మర్మమెల్ల జదివితి దండ్రీ!

యని ప్రహ్లాదుడు పలుకగా గురువులు సంతుష్టచిత్తులైరి. తండ్రియైన హిరణ్య కశిపుని ఆనందము అనిర్వచనీయ మాయెను.

"కుమారా! లెస్స! మాకు చాలా ఆనందముగా యున్నది. తులసివనములో గంజాయి మొలచునా? నా కడుపున జడుడు జన్మించునా! దైత్యవంశ వర్ధనుడవుగా నీవు నాకు గన్పించు చున్నావు. భళి భళి! నిన్ను ఈ స్థాయికి తెచ్చిన గురువుల శ్రమ ప్రశంస నీయమైనది. వారి ఋణము తీర్చలేనిది. వత్సా! ఏదీ శ్లోకమును చెప్పి, నా హృదయ మును ఆనంద డోలికలలో ఊగునట్లు చేయుము" యని హిరణ్యకశిపు డనెను. ప్రహ్లాదుడు శ్లోకమును చెప్పుచున్నాడు.

శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాద సేవనమ్
అర్చనం వన్దనం దాస్యం సఖ్య మాత్మ నివేదనమ్
ఇతి పుంసార్పితా విష్ణౌ భక్తి శ్చేన్నవ లక్షణా
క్రియతే భగవత్యద్ధా తన్మన్యేऽధీత ముత్తమమ్ ॥

"1. భగవంతుని నామ, లీల, గుణాదులను వినుట, 2. కీర్తించుట, 3. స్మరించుట, 4. పాదపద్మములను సేవించుట, 5. అర్చించుట, 6. నమస్కరించుట, 7. దాస్యము చేయుట, 8. స్నేహభావము, 9. ఆత్మ నివేదనము గావించుట అను ఈ తొమ్మిదియు

భక్తి లక్షణములు. ఈ తొమ్మిది విధములైన భక్తి సాధనలను విష్ణువందు ఎవడు ఆచరించునో అతడే చక్కగా చదివినవాడని నా అభిప్రాయము" అని ప్రహ్లాదుడనెను.

దీనినే నవవిధ భక్తి యందురు. ఇందులో తొమ్మిది విధములైన భక్తి సాధనలున్నవి. నావ నెక్కినవాడు తీరమును చేరునట్లు ఈ భక్తి విధముల నెరిగినవాడు తప్పక తరించును.

నవవిధ భక్తి స్వరూపములు

1. శ్రవణము :- శ్రవణము జ్ఞానము నందించును. ఆత్మానాత్మ వివేక జ్ఞానము నందించును. శ్రవణము వలన సద్భావములు పెంపొందును. సదాచార మలవడును. సన్మార్గము తెలిసివచ్చును. సద్గతి లభించును.

హరి కథలు వినెడి వారికి మరణాగత మోహ సంభ్రమము లే దనఘా

యని భాగవతము నందే కలదు. భగవంతుని దివ్య చరిత్రమును, అనంతకళ్యాణ గుణములను ఆలకించుట శ్రవణ మనబడును.

శ్రవణము చేయుట వలన శౌనకాది ఋషులు నైమిశారణ్యమున జ్ఞానులైరి. శ్రవణము వలననే జనకచక్రవర్తికి జ్ఞానము కలిగెను. శ్రవణము వలననే పరీక్షిత్తుడు ముక్తిని బొందెను. ప్రబోధసమయముననే అర్హతగల ముముక్షువునకు జ్ఞానము లభించునని శంకరాచార్యులు తెలిపియున్నారు.

కథా త్రివేణీ సంగమ దేవభక్త్ ఆణి నామ తేథేంచె ఉత్తమ చరణ రజ వందితాం
జళతీ దోషాంచె డోంగర శుద్ధ హోతీ నారీనర గాతీ ఏకతీ సాదర జె పవిత్ర హరి కథా!

"కథా శ్రవణము త్రివేణీ సంగమమువలె పవిత్రమైనది. దేవుడు, భక్తుడు, భగవన్నామములు ఒక్కచోట చేరుచున్నవి. భగవత్కథను, లీలలను వర్ణించుట కుపకరించు ఆ స్థలము పవిత్రమగుచున్నది. కారణము ఆ ప్రదేశము మహాత్ముల పాదధూళికి నోచుకొను చున్నది. కథా శ్రవణము పాప పర్వతములను దహించివేయును. జనులందరిని పరిశుద్ధ మొనర్చును. వక్తను, శ్రోతను పవిత్రము చేయును" అని సంత్ తుకారాం గానం చేశాడు.

2. కీర్తనము :- కీర్తన మనగా భగవంతుని వైభవమును గానము చేయుటయని భావము. కలియుగములో భగవన్నామ సంకీర్తనమే తరించుటకు ఏకైక తరుణోపాయమని శాస్త్రములు ఘోషిస్తున్నవి. మహాత్ములు ప్రవచిస్తున్నారు **"కలౌ సంకీర్త్య కేశవమ్"** అని విష్ణు పురాణము ప్రవచించినది.

గీత్వాతు మమ నామాని విచరే న్మమ సన్నిధౌ
ఇతి బ్రవీమితే సత్యం - క్రీతోహం తస్య చార్జున !

"అర్జునా! ఎవరయితే నా నామమును గానము చేయుచు, నా సన్నిధానము నందే యుందురో అట్టివారికి నేను ఋణపడి యున్నాను. ఇది సత్యము" అని భగవానుడు ఆదిపురాణము నందు చెప్పి యున్నాడు.

భజన పరులకేల దండపాణి భయము, మనసా
అజరుద్ర సురేశుల కాయాస్థాన మొసగు రామ ॥భజన॥

యని త్యాగరాజస్వామి మృత్యుంజయులై కీర్తించారు.

ఈ నవవిధ భక్తులలో మొదటిదైన శ్రవణమును విషయగ్రహణముగను, రెండవదియగు కీర్తనమును ఆచరణముగను గ్రహించిన ఇంకా సులభగ్రాహ్యమై భాసించును.

భగవద్గుణ శ్రవణ కీర్తనాత్ ॥

"భగవద్గుణ శ్రవణ కీర్తనాదుల వలన పరమాత్మను పొందవచ్చు" నని నారదమహర్షి భక్తి సూత్రములలో కూడా తెలిపియున్నారు.

3. స్మరణము :- శ్రవణములో భగవల్లీలలు తెలియును. వైభవము అర్థమగును. ఆ తరువాత కీర్తనములో గుణలీలలను గానముచేయుట, సాధన లాచరించుట జరుగును. కానీ భగవంతుని సదా మనస్సునందు నిలుపు కొనుటను స్మరణమందురు. నిరంతరము పరమాత్మను స్మరించే అలవాటును మనస్సునకు కల్పించాలి. పరమాత్మను స్మరించు మనస్సు పరమాత్మ యందే స్థిరపడి యుండును.

మా మనుస్మరత చిత్తం మయ్యేవ ప్రవిలీయతే

"నన్ను స్మరించు మనస్సు నా యందే విలీనమై యుండును" అని పరమాత్మ భాగవతము నందు తెలిపెను.

స్మర వారం వారం చేతః స్మర నందకుమారమ్

"చిత్తమా! మఱల మఱల నందకుమారుని స్మరింపుము" అని సదాశివ బ్రహ్మేంద్రస్వాముల వారు కీర్తించి యున్నారు.

4. పాద సేవనము :- భగవంతుని పాదపద్మములను సేవించుట నాల్గవ భక్తి క్రమము. గుహుని తరింపజేసినది, భరతునికి ముక్తినొసగినది, భగవానుని పాదపద్మములే కదా! అవియే అహల్యకు బ్రతుకునిచ్చిన చరణములు.

నీ పద పంకజములను నే నెర నమ్మినాను ॥నీ పద॥
కోపముతో ముని తాపసి ఇచ్చిన
శాపమున అహల్య అనుదినము
చాపరాయి తను తాప మోర్వలే
నామెను గని పరితాపము దీర్చిన ॥నీ పద॥

యని ప్రార్థించిన త్యాగరాజస్వామి రామసాయుజ్యము పొంది తరించాడు. అదియును గాక ఈ విశ్వము పరమాత్మ యొక్క పాదముగా పురుష సూక్తములో వర్ణించబడినది. కనుక జగత్తును జగదీశ్వర స్వరూపముగా ఎంచి సేవచేయువారు కూడా ఈ పాదసేవన భక్తి క్రిందికి వస్తారు.